# మొదటి సినిమా

## - కిరణ్ ప్రభ

### Part - 3



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 61

ఇందులోని ఇంటర్వ్యూలన్నీ ( చివరిలోని కొద్ది కథనాలు తప్ప) కౌముది ప్రత్యేకంగా ఆయా ప్రముఖులతో ముఖాముఖి మాట్లాడినవే

*ముందుపేజీల్లో..*


| | | |
|---|---|---|
| 1 | బోయపాటి శీను | 1 |
| 2 | వై.నాగేశ్వరరావు | 4 |
| 3 | కె.విశ్వనాథ్ | 11 |
| 4 | ఎస్వీ కృష్ణారెడ్డి | 16 |
| 5 | వెంకట్ కూచిపూడి | 19 |
| 6 | ఎ.కోదండరామి రెడ్డి | 28 |
| 7 | బి.జయ | 34 |
| 8 | సింగీతం శ్రీనివాసరావు | 40 |
| 9 | ముప్పలనేని శివ | 46 |
| 10 | లక్ష్మీకాంత్ చెన్నా | 51 |
| 11 | యోగి / యోగేష్ | 60 |
| 12 | సావిత్రి | 67 |
| 13 | నరసింహ నంది | 70 |
| 14 | శరత్ | 76 |
| 15 | సతీష్ కాశెట్టి | 80 |
| 16 | శ్రీవాస్ | 85 |
| 17 | తాతినేని రామారావు | 95 |
| 18 | తాతినేని సత్య | 99 |
| 19 | ప్రవీణ్ శ్రీ | 105 |
| 20 | సుధా కె.ప్రసాద్ | 111 |

| | | |
|---|---|---|
| 21 | వంశీ పైడిపల్లి | 119 |
| 22 | బోయిన సుబ్బారావు | 126 |
| 23 | సంపత్ నంది | 132 |
| 24 | రమణ సాళ్వ | 143 |
| 25 | పి.లక్ష్మీనారాయణ(దీప్తి) | 151 |
| 26 | కె.బాపయ్య | 157 |
| 27 | విజయనిర్మల | 162 |
| 28 | దాసరి నారయణరావు | 167 |
| 29 | కె.రాఘవేంద్రరావు | 171 |
| 30 | కె.బాలచందర్ | 175 |
| 31 | కె.వి.రెడ్డి | 179 |
| 32 | కమలాకర కామేశ్వరరావు | 183 |

# మొదటి సినిమా

# బోయపాటి శీను

మొదటి సినిమా 'భద్ర' తోనే సూపర్ హిట్ దర్శకుడిగా పేరుతెచ్చుకుని, రెండో సినిమా 'తులసి' ని కూడా విజయవంతమైన చిత్రంగా రూపొందించిన నవ, యువ దర్శకుడు శ్రీ బోయపాటి శీను మొదటి సినిమా జ్ఞాపకాలు ఈ నెల మీ కోసం..



మా స్వగ్రామం గుంటూరుకి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదకాకాని. ఈ ఊరు సిటీకీ, పల్లెటూరికీ మధ్య రకంగా ఉంటుంది. గుంటూరు నుంచీ వచ్చే మెయిన్ రోడ్, హైవే 7 పరంగా చూస్తే టౌన్ అనిపిస్తుంది. కాస్త లోపలికి వెళితే అన్నీ పచ్చటిపొలాలూ, కృష్ణానది నుంచీ వచ్చే ఒక నదీ పాయ.. ఎటుచూసినా పక్కా పల్లెటూరి వాతావరణం కనిపిస్తుంది. ఇంత అందమైన ఊళ్ళో నేను 1971, ఏప్రిల్ 25న పుట్టాను. నాన్న గారి పేరు లింగయ్య, అమ్మ పేరు సీతారావమ్మ. నాన్న వాళ్ళు నలుగురు అన్నదమ్ములు. ఒక్కొక్కరికీ ఐదుగురు సంతానం. మా కుటుంబంలో నేను మధ్య వాడిని. నా పైన అక్కయ్య, అన్నయ్య, నాకు ఇద్దరు చెల్లెళ్ళు. నాన్న వ్యవసాయమే చేస్తుండేవాళ్ళు. అన్నయ్య మాత్రం ఫోటో స్టూడియో నడుపుతుండేవాళ్ళు.

ఎలిమెంటరీ స్కూలు నుంచీ హైస్కూలు వరకూ నా చదువంతా పెదకాకానిలోనే జరిగింది. చిన్నప్పుడు తోటి పిల్లలతో కలిసి బాగా అల్లరి చేస్తుండేవాడిని. మా అల్లరి గాంగ్ అంటే ఊళ్ళో అందరికీ హడల్‌గా ఉంటుండేది. హైస్కూలు అయ్యాక గుంటూరు జె.కె.సి కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరాను. అక్కడే డిగ్రీ వరకూ చదువుకున్నాను. కాలేజీ దగ్గరలోనే శ్రీనివాస నగర్‌లో ఒక రూముకి అద్దెకి తీసుకున్నా , ఎక్కువగా ఇంటివద్దనుంచే కాలేజీకి వెళ్తుండేవాడిని. ఎప్పుడన్నా మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోడానికో, సాయంకాలం ఆలశ్యమైతే పడుకోడానికో మాత్రమే అద్దె రూము వాడుకునే వాడిని. చిన్నప్పటినుంచీ చదువులో పెద్ద చురుకైన వాడినేమీ కాదు. ఎలానో హై సెకండ్ క్లాసు, ఫస్టుక్లాసు బోర్డర్ లో లాగిస్తూ ఉండేవాడిని. డిగ్రీకి రాగానే అన్నయ్య (బ్రహ్మానందరావు) ఫోటో స్టూడియోలో ఎక్కువకాలం గడిపుతూ అన్నయ్యకి చేదోడు వాదోడుగా ఉండేవాడిని. అప్పుడే 'ఈనాడు' స్టాఫ్ రిపోర్టర్‌గా కూడా పనిచేసే వాడిని. డిగ్రీ తరువాత నాగార్జునా యూనివర్సిటీలో ఎమ్మే హిస్టరీ కూడా పూర్తి చేశాను. ఒక వైపు స్టూడియో, మరో వైపు 'ఈనాడు'కి వార్తలు పంపడమూ, ఇంకోవైపు కాలేజీ చదువూ.. ఎప్పుడూ బిజీగానే ఉండేవాడిని. మీరు నమ్మి తీరాల్సిన ఒక విషయం, ఆ రోజుల్లో సినిమాలంటే అస్సలు ఆసక్తి ఉండేది కాదు. ముఖ్యంగా సినిమా



చూసేంత తీరిక సమయం ఉండేది కాదు. పుస్తకాలు మాత్రం బాగా చదివేవాడిని. న్యూస్ పేపర్లయితే ఒక్క కాలం వదలకుండా ఆసాంతం పఠించేవాడిని. సినిమాలకి నాకూ మాత్రం చుక్కెదురే..!

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అవగానే 1994లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్.ఐ. పోస్టుకి వ్రాత పరీక్ష, మిగతా టెస్టులూ అన్నీ పూర్తయి ఫైనల్ సెలక్షన్ కూడా వచ్చింది. కానీ కారణాంతరాల వల్ల అందులో చేరలేక పోయాను. ఇలా సమయం బిజీగా గడుస్తున్నప్పుడే మా వూరి వాడు, మా కజిన్, అప్పటికే సినిమాల్లో పేరు తెచ్చుకున్న పోసాని కృష్ణమురళి హైదరాబాదు నుంచీ మా వూరు వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చాడు. మాటల మధ్యలో, కావాలంటే సినిమా రంగంలో ఏదైనా అవకాశం కల్పిస్తాను, తనతో హైదరాబాదు రమ్మని చెప్పాడు. మా ఇంట్లో ఏ విషయమైనా అన్నయ్య సలహా తీసుకోవాల్సిందే అందరం కలిసి అన్నయ్యతో సంప్రదించాం. 'ఎలానూ అందరం ఎప్పుడూ సొంత ఊర్లోనే ఉండి వ్యసాయమో, వ్యాపారమో చేసుకుంటున్నాం. ఒక సారి లైను మార్చి వేరే ఊరు, వేరే ఫీల్డు ప్రయత్నిస్తే నష్టమేముందీ.. ఒకవేళ అక్కడేమన్నా ఇబ్బంది ఎదిరైనా ఇంటికి వచ్చేస్తే వ్యవసాయమూ, బిజినెస్సూ ఉండనే ఉన్నాయి' - అని ఆలోచించి నన్ను, కృష్ణ మురళి సలహా మీద, హైదరాబాదు పంపించడానికే నిర్ణయించుకున్నారు., నేను సరే అన్నాను. అన్నయ్యే స్వయంగా వచ్చి హైదరాబాదులో దించి వెళ్ళారు 1997లో. కృష్ణ మురళి నన్ను ముత్యాల సుబ్బయ్య గారి వద్ద అసిస్టెంట్ గా కుదిర్చారు.

అక్కడినుంచీ కొత్త ప్రపంచంలో, కొత్త జీవితం మొదలైంది. నేను చేరే సరికి సుబ్బయ్యగారి సినిమా 'పవిత్రబంధం' చివరిలో ఉంది. తరువాత వరుసగా ఆయన వద్దనే 'పెళ్ళిచేసుకుందాం', 'అన్నయ్య', 'గోకులంలో సీత', 'స్నేహితులు' ..ఇలా వరుసగా దాదాపు ఆరేళ్ళు 11 సినిమాలకి పనిచేశాను. మధ్యమధ్యలో సుబ్బయ్య గారికి ఖాళీ వచ్చి వేరే ఎక్కడైనా పనిచెయ్యమని చెప్పినా ఆయన్ని వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంక ఈ ఫీల్డ్‌కి వచ్చాక తిండీ, నిద్రా, గాలీ, ఊపిరీ అన్నీ సినిమాలే అయ్యాయి. హైదరాబాదులో మిత్రులతో కలిసి రూములో ఉంటూ షూటింగ్‌లకి వెళ్ళడం, షూటింగ్ లేనప్పుడు కేసెట్లు చూడ్డం..వందలాది అనేకంటే అతిశయోక్తి కాదనుకుంటే వేలాది సినిమాలు చూసేశాను ఆరేళ్ళలో.

2003 ప్రాంతాల్లో ఇంక సొంతంగా దర్శకత్వ ప్రయత్నాలు మొదలు పెట్టాలనుకుని కథలు సిద్ధం చేసుకోవడం ప్రారంభించాను. ఒక కథ ఫైనలైజ్ చేసుకుని ఒక మాస్ హీరోగారికి వినిపించాను. వెంటనే ఒప్పుకున్నారు కానీ ఎన్ని నెలలు గడిచినా ప్రోజెక్ట్ ఫైనలైజ్ కావడం లేదు. అలా దాదాపు సంవత్సరం గడిచిపోయింది. ఆ సమయంలోనే 'అన్నయ్య', 'గోకులంలో సీత' సినిమాల నుంచీ బాగా పరిచయం ఉన్న అల్లు అరవింద్ గారిని కలిసాను. అప్పుడే 'గంగోత్రి' విజయ పథంలో నడుస్తోంది.

'సార్ ..నావద్ద ఒక మంచి కథ ఉంది. కానీ మీరేమో కొత్త వాళ్ళని ప్రోత్సహించడం లేదు' అన్నాను.

చనువుగా మందలిస్తూ "శీనూ..నావద్ద నీకు మొహమాటమెందుకయ్యా. ఎప్పుడైనా వచ్చి అడగొచ్చు కదా.. ఏదీ కథ చెప్పు.." అన్నారు.

బన్నీ, అరవింద్ గారు, కుటుంబసభ్యులు అందరూ కూర్చుని కథ విన్నారు. అందరికీ విపరీతంగా నచ్చేసింది. కానీ అర్జున్ ఇంకా అప్పుడే సినీరంగ ప్రవేశం చేసి ఉన్నాడు. ' మొదట్లోనే ఇంత హెవీ కథని తీసుకుంటే మళ్ళీ తరువాత లవర్ బాయ్ పాత్రల్లో ప్రేక్షకులు చూడలేరు. ఎవరైనా పేరున్న మాస్ హీరో ఐతేనే ఈ కథకి న్యాయం జరుగుతుంది. ..నీ కథలో మంచి పవర్ ఉంది. తప్పని సరిగా ఇది

సూపర్ హిట్ సినిమా ఔతుంది. నువ్వు మంచి దర్శకుడిగా నిలదొక్కుకుంటావు.. పద నిన్ను దిల్‌రాజు గారికి పరిచయం చేస్తాను ..`అని అల్లు అరవింద్ గారే నన్ను వెంటబెట్టుకుని దిల్ రాజు గారి వద్దకి తీసుకెళ్ళారు. బన్నీ కూడా మాతో వచ్చారు.

ఆయన ఆర్య షూటింగ్ లో ఉన్నారప్పుడు. ఆయన గురించి వినడమే కానీ చూడ్డం అదే మొదటి సారి. మొదటి సిటింగ్ లోనే రెండున్నర గంటలపాటు కథ వినిపించాను. కథ వినడం పూర్తవగానే వెంటనే జేబులోంచి చెక్ బుక్ తీసి చెక్కు రాసిచ్చి `తరువాత సినిమా ఇదే, నువ్వే దర్శకుడివి` అన్నారు దిల్ రాజు గారు..! వరుసగా రెండు హిట్ల తరువాత ఆయనకిది మూడో సినిమా కాబోతోంది. అలా మొదలైంది నా మొదటి సినిమా భద్ర..!

కథకి తగిన హీరో ఎవరా అని వెదికితే రెండు మూడు ఆప్షన్స్ వచ్చాయి కానీ వాళ్ళెవరికీ డేట్స్ ఖాళీలు లేవు. రాజు గారే రవితేజ పేరు సజెస్ట్ చేశారు. ఐతే రవితేజ అప్పటికి సీరియస్ పాత్రలు చేస్తున్నా కాస్త లైటర్ వెయిన్‌లో హాస్యం కూడా ఉంటోంది ఆయన పాత్రల్లో. రవితేజ గారిని కలిసి కథ వినిపించి ఆయన ట్రెండ్‌కి తగినట్లుగా కాస్త హ్యూమర్ జతచేసి `భద్ర` ఫైనలైజ్ చేశాము.. ఎన్నాళ్ళనుంచీ నా రూమ్‌మేట్స్‌గా వుంటున్న నివాస్, రవి, సాయి నాకు రచయితలుగా సహకారమందించారు.



2004 నవంబర్ 17న షూటింగ్ మొదలైంది. సెంటిమెంటల్‌గా మొదటి షాట్‌ని వనదేవత పార్కులో చిత్రీకరించి, తరువాత రెగ్యులర్ షూటింగ్‌ని అన్నపూర్ణలో కొనసాగించాము. మొత్తం సినిమాలో 6 హెవీ సీన్లు ఉన్నాయి. ప్రారంభించిన మొదటి వారమే ఆరు హెవీ సీన్స్‌నీ పిక్చరైజ్ చేశాను. ఆరో రోజు షూటింగ్‌కి పాకప్ చెప్పాక ఎడిటింగ్ రూముకి వెళ్ళాను. ఎవరినీ లోపలికి రావొద్దని చెప్పాను. మొత్తం సీన్లన్నీ ఎడిట్ చేసాక, నిర్మాతగారినీ, హీరో గారినీ పిల్చి రషెస్ చూపించాను.. అందరికీ బాగా నచ్చింది. రవితేజ గారైతే `ఇంక సినిమా పూర్తయే వరకూ మోనిటర్ లో చూడల్సిన అవసరంలేదు..`అని డిక్లేర్ చేశారు. ఏది కావాలంటే అది క్షణాల్లో సమకూర్చే దిల్‌రాజు గారు నిర్మాతగా నా మొదటి సినిమా భద్ర 120 రోజుల్లో షూటింగ్ పూర్తయింది. 2005 మే 12న రిలీజైంది. సినిమా పబ్లిక్ రిలీజ్‌కి ముందు రోజు రాత్రి ఇండస్ట్రీలో పెద్దవారందరినీ పిలిచి ప్రి-వ్యూ షో వేశారు. ప్రివ్యూ ఐ బయటికి రాగానే ముందుగా అల్లు అరవింద్‌గారు శుభాకాంక్షలు చెప్పారు. రెండో ఫోన్ ఎమ్మెస్ రాజు గారి వద్దనుంచీ. రిలీజయ్యాక ఫీలింగ్స్ అంటే ఏమి చెప్పమంటారు..గాల్లో తేలుతున్న అనుభవం..!

`భద్ర` విజయాన్ని మా కుటుంబసభ్యులు కూడా బాగా ఎంజాయ్ చేశారు. అందులో పాత్రలూ , చాలా సంఘటనలూ..వాళ్ళకి ఎప్పటినుంచో తెలిసినవే.. ఎందుకంటే అవన్నీ మా వూరు, నాకు తెలిసిన మనుషుల మధ్యనుంచీ వచ్చినవే కాబట్టి..!

నా మొదటి సినిమాని ఆదరించిన ప్రేక్షకులు రెండో సినిమా `తులసి`ని కూడా విజయవంతం చేశారు. నాకు వరుస విజయాలు అందించిన తెలుగు ప్రేక్షకులకీ, ప్రవాసాంధ్రులకీ నేను ఎంతైనా ఋణపడి ఉంటాను. `కౌముది` ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి పరిచయం కావడం నాకు చాలా సంతోషంగా ఉంది.

***

# వై.నాగేశ్వరరావు

**దర్శకత్వం వహించిన ఏ సినిమాకైనా ఒక ప్రయోజనం ఉండాలనే నిబద్ధతతో కుటుంబగాధా చిత్రాలు, సామాజిక సమస్యలని కూలంకషంగా చర్చించే చిత్రాలను రూపొందించిన ఒకనాటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు శ్రీవై.నాగేశ్వర రావు. రామానాయుడు గారు నిర్మించిన 'రాము' చిత్రానికి మొదటి సారి దర్శకత్వం వహించి తరువాత 'మొండి మొగుడు - పెంకి పెళ్ళాం', 'దోషి-నిర్దోషి', 'డాక్టర్ భవాని' 'పేకాట పాపారావు' లాంటి 15కి పైగా విజయవంతమైన చిత్రాలను రూపొందించిన శ్రీ వై.నాగేశ్వరరావు గారి మొదటి సినిమా జ్ఞాపకాలు ఈ నెల 'కౌముది' లో మీకోసం!**



మా నాన్న, తాతగార్లది అలనాటి ఒంగోలు జిల్లా, ఉప్పుగుండూరుకి దగ్గరలోని ఒక పల్లెటూరు. తరువాత జీవనోపాధి కోసమని నాన్నగారు చీరాలకి వచ్చేసారు. నేను పుట్టింది , చిన్నతనాన్ని గడిపింది అమ్మమ్మగారి వూళ్ళో. అది మేదరమెట్ల దగ్గరలో గుండ్లకమ్మ నదికి అవతల ఉన్న గార్లపాడు అనే పల్లెటూరు. ఐతే తరువాత గుండ్లకమ్మ నదిమీద డామ్ నిర్మించడంతో, ప్రస్తుతం ఆ వూరు అవశేషాలు కూడా లేకపోయినా నా జ్ఞాపకాల్లో మాత్రం వూరి విశేషాలు ఇంకా తాజాగా గుర్తున్నాయి. నేను అమ్మమ్మ గారింటి వద్దనే ఐదారు సంవత్సరాలు వచ్చే వరకూ ఉన్నాను. అప్పట్లో అదంతా మెట్టభూమి. చక్కటి పల్లెజీవనం. ఐదారెకరాలు భూమి ఉంటే కుటుంబావసరాలకు కావల్సిన పంటలు జొన్నలు, కందులు, మొక్కజొన్నలు లాంటివాటిని కొంచెం కొంచెంగా వేసి అందరూ స్వయంపోషకంగా ఉండేవారు. సంక్రాంతి రోజులు అప్పటి పల్లెటూరి ప్రజలకి పెద్ద పండుగ రోజులు. ఆ రోజుల్లో హరికథలు, బుర్ర కథలు, ఒగ్గు



కథలు..వగైరా చెప్పే కళాకారులు సంక్రాంతికి నెలరోజుల ముందరే వచ్చేసి మా వూళ్ళో బసచేసి తమ కళల్ని ప్రదర్శిస్తూ ఉండేవారు. మా తాతగారు ఇలాంటి కళాకారుల్ని పిలిచి బాగా ప్రోత్సహిస్తూ ఉండేవారు. నాకింకా ఆ రోజులన్నీ నిన్నా మొన్నటిలా గుర్తున్నాయి. అలా చిన్నతనంలో తాతగారి పక్కనే తిరుగుతూ అలాంటికళాకారుల కార్యక్రమాలని దగ్గరగా చూడడం వల్లనేమో అప్పుడే రంగస్థల కళలంటే ఆసక్తి కలిగింది.

ఆ వూళ్ళో మా ఇంటి పక్కనే దేమునికొండ సుబ్బారావు గారనే కరణంగారు ఒకరుండేవారు. - ఆయన చుట్టుపక్కల ఐదారు గ్రామాలకి కరణం. ఆయనకి మారిస్ మైనరో, స్టాండర్డో ఒక నల్లరంగు కారు కూడా ఉండేది. ఐదూళ్ళు చూసుకుంటూ మా ఊరులో కొన్ని వారాలపాటు ఉండేవారు. అప్పటికే ఆయనకి ఆకాశవాణిలో గాత్రసంగీత విద్వాంసుడిగా పెద్ద పేరు ఉంది. ఆయన భార్య వరలక్ష్మమ్మ గారు

వయొలిన్ వాయిస్తుండేవారు. ఆయన బావమరిది చంద్రశేఖర్ తబలా కళకారుడు. ఇలా ఒకే ఇంట్లో అందరూ కళాకారులే అవడం వల్ల సాయంకాలం అవగానే వాళ్ళ ఇంటి వరండా సంగీత కచేరీకి వేదిక అయ్యేది. నేను ఐదారేళ్ళ వయసులో ఎర్రగా, బుర్రగా ఉండేవాడినేమో వాళ్ళు 'నాగు..' , ' నాగు..' అంటూ దగ్గరకి చేరదీసి ఆడిస్తుండేవాళ్ళు. రోజూ వాళ్ళ సంగీత కచేరీని గమనించడం వల్ల కూడా ఆ చిన్న వయసులోనే సంగీతమంటే కూడా మక్కువ ఏర్పడింది. వరలక్ష్మమ్మ గారు కూడా పొద్దున్నే నన్ను పిలిచి కృష్ణశతకంలోని పద్యాలు నేర్పే వారు. ఆవిడ చెప్పిన పద్యాన్ని ఐదారు సార్లు నెమరేసుకుని సరిగ్గా అప్పచెబితే ఒక అరటిపండు ఇచ్చేవారు. లేకుంటే ఈత బెత్తంతో చిన్నగా కొట్టేవారు. అరటిపండు మహాత్మ్యమేమో కానీ ఆ చిన్న వయసులోనే కృష్ణశతకమంతా కంఠతా వచ్చేసింది. అలా అందమైన అనుభవాలతో బాల్యమంతా ఆ పల్లెటూళ్ళో గడిచింది.



తరువాత నాన్నగారి వద్దకి చీరాల వచ్చేసాను. అక్కడే స్కూలు చదువూ, కాలేజీలో చేరడం జరిగింది. చీరాల డిగ్రీ కాలేజీలోనే బి.ఎస్సీ కోర్సులో చేరాను. పాటలకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటుండే వాడిని. మిత్రులతో కలిసి సింగింగ్ ట్రూప్‌గా ఏర్పడి ఇంటర్ కాలేజ్ పోటీల్లో కూడ బహుమతులు గెలుచుకునే వాళ్ళం. అప్పట్లో మా సీనియర్ రాజాచంద్ర (ఆ తరువాత మంచి దర్శకుడయ్యాడు. అకస్మాత్తుగా చిన్నవయసులోనే చనిపోయాడు). అతడు అప్పట్లో నాటకాల్లో వయసు మళ్ళిన వేషాలు వేస్తూ మంచి పేరు తెచ్చుకునేవాడు. అతనిలా నాటకాలు వెయ్యాలని ఉండేది. ఒకసారి ఎలాగైతే కాలేజీ యానివర్సిరీకి వెయ్యాలని, కష్టపడి ఒక నాటకం తయారు చేసుకున్నాం. దురదృష్టవశాత్తూ అ సంవత్సరమే కాలేజీ ఫంక్షన్ రద్దయింది. ఆ విధంగా కాలేజీలో నాటకం వెయ్యాలన్నది తీరని కోరికగానే మిగిలిపోయింది.

డిగ్రీ చివరలో ఉండగా 1971 ప్రాంతాల్లో నాన్నగారు తీవ్రమైన అనారోగ్యం పాలయ్యారు. ఆయన్ని వైద్యం కోసం మద్రాసు తీసుకెళ్ళడం, అటూ ఇటూ తిరగడం, కుటుంబ ఇబ్బందులవల్లా నా చదువు కుంటుపడింది. నాన్నగారు పోవడంతో మా ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. ఇంక చదువుకొనసాగించే మార్గం కనిపించలేదు. ఉద్యోగం చూసుకుందామంటే చీరాల లాంటి ఊళ్ళో ఆరోజుల్లో ( ఈ రోజుల్లో కూడా నేమో) గవర్నమెంట్ ఉద్యోగాలనేవి కల్ల. ప్రైవేట్ ఉద్యోగాలంటే ఐ.టి.సి ఒక్కటే ఉండేది. అదికూడా ఆర్నెల్లు సీజనల్ ఉద్యోగాలే ఉండేవి. అంచేత బయటి వూళ్ళకెళ్ళి వుద్యోగం చూసుకోవడమొక్కటే మార్గమనిపించింది.

మా వూరికి దగ్గరలోనే ఉన్న కారంచేడుకి చెందిన బోయిన సుబ్బారావుగారు అప్పటికే మద్రాసులో ఉంటూ రామానాయుడి గారి ప్రొడక్షన్‌లో దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నారు. ఆయన మా వూరు వచ్చినప్పుడల్లా వెళ్ళి కలుస్తుండే వాడిని. అలానే మద్రాసుకి దగ్గరలో ఉన్న తిరువత్తూరు లో మా మేనమామలు వ్యాపారం చేస్తుండేవారు.

వీళ్ళల్లో ఎవరో ఒకరి వల్ల మద్రాసులో ఏదో ఒక ఉద్యోగం సంపాయించుకోవచ్చునన్న ధీమాతో ఒక రోజు ఇంట్లో చెప్పకుండా మద్రాసు రైలు ఎక్కేసాను. ఇది జరిగింది 1972 ప్రాంతాల్లో. సినిమాల్లో చేరే తీరాలని, ఏదో సాధిద్దామని పెద్ద పెద్ద ఆశయాలేమీ ఉండేవి కాదు. ఐతే చిన్నప్పటినుంచీ మామూలు గుమాస్తా ఉద్యోగాలు కాకుండా ఏదైనా విభిన్నంగా ఉండే వృత్తిలోకి వెళ్ళాలని ఉండేది.

అలా రైలెక్కి వెళ్ళిన వాడ్ని అర్ధరాత్రి 11.30 ప్రాంతాల్లో మద్రాసు సెంట్రల్‌లో దిగాను. బోయిన సుబ్బారావు గారుండే సురేష్ ప్రొడక్షన్ ఆఫీసుకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. బయటికి వచ్చి ఎవరినో అడిగాను. వాళ్ళు పార్క్ స్టేషన్‌కి వెళ్ళి, లోకల్ రైలు పట్టుకుని మాంబళం స్టేషన్ లో దిగి రిక్షాలో టి.నగర్ వెళ్ళమని చెప్పారు. ఆసూచనలు పాటించి టి.నగర్ బోగ్‌రోడ్‌కి వెళ్ళేసరికి అర్ధరాత్రి ఒంటిగంట దాటింది. ఎలానో సురేష్ ప్రొడక్షన్స్ ఆఫీసు కనుక్కోగలిగాను. సెకండ్ ఫ్లోర్ లో వాళ్ళ ఆఫీసు. కింద అంతస్తులో సూర్యరాజ్ పిక్చర్స్ అనే ఆఫీసు ఉంది. పైకి వెళితే తలుపులన్నీ మూసేసి ఉన్నాయి. 'సుబ్బారావు గారూ..సుబ్బారావు గారూ..' అని ఎన్ని సార్లు

పిలిచినా సమాధానం రాలేదు. ఏం చెయ్యాలో తెలీక కిందికి వచ్చేసాను. అక్కడే వరండాలో కొంతమంది పడుకుని ఉంటే వాళ్ళకి కాస్త దూరంగా సూట్‌కేస్ తలకింద పెట్టుకుని పడుకున్నాను.

తెల్లవారు ఝామునే లేచి పైకి వెళ్ళి బోయిన సుబ్బారావు గారిని పిలిచాను. ఈ సారి అదృష్టవశాత్తూ ఆయన బయటికి వచ్చారు. నన్ను చూసి ఆశ్చర్యపోయారు. చెప్పాపెట్టకుండా వచ్చేసినందుకు కాస్త కంగారు పడ్డారు కూడా. నేను 'ఉండడానికి ఇంకో ఫ్రెండ్ రూమ్ కి వెళతాను, ఎక్కడైనా సినిమా కంపెనీలో ఏదైనా ఉద్యోగం చూడమ'ని అడిగాను.. ఆయన వద్ద మాట తీసుకుని, తెల్లవారాక మరో మిత్రుడు పెద్దిశెట్టి వెంకటేశ్వర్లు రూముకి వెళ్ళాను. ఉండడానికి మంచి వసతే దొరికింది.

బోయిన సుబ్బారావు గారు అప్పట్లో ప్రముఖ దర్శకుడు కె.బాపయ్య గారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం మద్రాసులో దిగిన మూడో రోజునే నన్ను బాపయ్యగారి వద్దకి తీసుకెళ్ళి నిర్మాణంలో ఉన్న 'మేమూ మనుషులమే' అనే సినిమా కి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో నన్ను అప్రెంటిస్ గా చేర్చారు. ఈ విధంగా నా సినిమా రంగ ప్రయాణం 'మేమూ మనుష్యులమే' తో మొదలైంది. అప్పట్లో బాపయ్య గారి వద్ద బోయిన సుబ్బారావు గారితో పాటుగా, పి.ఎన్.రామచంద్ర రావు, కె. మురళీ మోహన రావు, బి.గోపాల్ గార్లు కూడ పనిచేస్తుండే వారు. ఆరోజుల్లోనే అభ్యుదయ భావాలతో నిర్మించబడిన సినిమా 'మేమూ మనుషులమే'. అన్ని రంగాలని దగ్గరగా గమనించే అవకాశం వచ్చింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఆత్రేయ గార్ల లాంటి ప్రసిద్ధ కళాకారులతో పనిచేసే అవకాశం కూడా అక్కడే దొరికింది. ఆ సినిమా నిర్మాణాన్ని పరిశీలించిన నాకు సినిమా అంటూ తీస్తే ఇలా ఏదో ఒక సాంఘిక ప్రయోజనం ఉన్న సినిమానే తియ్యాలని మనసులో ముద్రపడిపోయింది. ఆ సినిమా పూర్తయే వరకూ నాకు దేనికీ ఇబ్బంది లేకపోయింది. ఆ సినిమా పూర్తయాక గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో మళ్ళీ ఎక్కడన్నా అవకాశం వెదుక్కోవాల్సిన అవసరం వచ్చింది.



1973 సంవత్సరం అది. అప్పటికే నాకు కె.విశ్వనాథ్ గారి సినిమాలంటే నాకు బాగా ఇష్టంగా వుండేది. ఆయన వద్ద ఎలాగైనా అసిస్టెంట్‌గా అవకాశం సంపాదించాలని అనుకున్నాను. ఐతే నన్నాయనకి పరిచయం చేసేవాళ్ళెవరూ దొరకలేదు. నేనే రోజూ ఆయన ఇంటికి వెళ్ళి బయట వెయిట్ చేసే వాడిని. ఆయన బయటికి వెళ్ళేప్పుడు నమస్కారం పెట్టేవాడిని. ఒకటి రెండుసార్లు చూసాక విషయం ఏమిటని అడిగారు. చెప్పాను. 'ఇప్పుడు నా వద్ద చాలామంది ఉన్నారయ్యా.. రెండు మూడు వారాలాగి కనపడు' అన్నారు. ఆఅయన అన్నట్లే వెళ్ళి అలానే వరుసగా అయన ఇంటిముందు నిలుచునే వాడిని. ఆయనకీ వీలుకాకపోవడం వల్ల నాకేమీ సహాయం చెయ్యలేకపోయారు.

ఇదిలా ఉండగానే తిరవత్తూరులో బిజినెస్ చేస్తున్న మా మేనమామల వద్దకి వెళ్ళి విషయం చెప్పాను. అక్కడొక అదృష్టం కలిసి వచ్చింది. మా మేనమామగారింటికి దగ్గరలోనే అప్పటి ప్రముఖ సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్ గారి బంధువులు ఉండేవారు. వారి ద్వారా మహదేవన్ గారికి మా వాళ్ళు రికమండేషన్ చేయించారు.

కె.వి.మహదేవన్ గారు తన సంగీతమేమో తనలోకమేమో తప్ప మిగతావిషయాలు పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు. ఐనా రికమండేషన్ చేసింది ఆయనకి బాగా దగ్గర బంధువులు కాబట్టి నా విషయాన్ని కాస్త సీరియస్‌గానే తీసుకున్నారు. అప్పట్లో ఐదారు సినిమాలు వరుస హిట్స్ తో దూసుకుపోతున్న పి.సి.రెడ్డి గారికి నన్ను అప్పగించారు. అది 'పెద్దలు మారాలి' సినిమా. అక్కడ నేను రెండో అసిస్టెంట్‌గా చేరాను. దాని నిర్మాత 'దేవదాసు' లాంటి కళాఖండాలని నిర్మించిన డి.ఎల్. నారాయణ గారు. ఆ సినిమా నిర్మాణంలో ఒకసారి నన్ను ఏవో సీన్లు ఫెయిర్ కాపీ చెయ్యమని స్క్రిప్టు ఇచ్చారు. సెట్లో చాలా యాక్టివ్‌గా వుండే వాడిని కానీ నా

చేతిరాత అస్సలు బావుండదు. నేను వ్రాసిన ఫెయిర్ కాపీ చూసిన పి.సి.రెడ్డి గారు ‘ బాబూ.. నువ్వు ఇలా స్క్రిప్టు ఫెయిర్ చెయ్యడానికి అస్సలు పనికిరావు, అందుకని నిన్ను ఫస్ట్ అసిస్టెంట్‌గా ప్రమోట్ చేస్తున్నాను, ఎప్పుడూ సెట్లోనే ఉండు..‘ అని చెప్పి నాకు 150 రూపాయల జీతం కూడా నిర్ణయించారు. అలా రెండో సినిమా ‘ పెద్దలు మారాలి ‘ తో సినిమా దర్శకత్వంలోని మరికొన్ని మెళకువలు నేర్చుకున్నాను.

‘పెద్దలు మారాలి‘ సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిన ఒక సంఘటన మీతో పంచుకోవాలి.



దర్శకుడు పి.సి రెడ్డిగారు భేషజం లేని మనిషి. సెట్లో, పనే దైవం అన్నట్లు ఉండేవాళ్ళు. ఒకరోజు నిర్మాత డి.ఎల్. నారాయణగారు సెట్‌కి వచ్చి ట్రాలీ మీద కూర్చుని డైరెక్షన్ చేస్తున్న పి.సి.రెడ్డిగారిని గమనించారు. వెంటనే నన్ను పిలిచి, కారులో ఎక్కించుకుని నుంగంబాకం తీసుకెళ్ళి, ఒక కుర్చీ కొని "ఇదిగో... ఇది డైరెక్టర్‌గారు కూర్చోవాల్సిన ఛైర్. ఇకనుంచీ పి.సి.రెడ్డిగారు సెట్‌లో ఉండగా ఈ కుర్చీలో కూర్చునేలా చూసే బాధ్యత నీది." అని నాకు బాధ్యత అప్పగించారు. దర్శకుడంటే నిర్మాతకి అంత గౌరవం ఉండేది ఆ రోజుల్లో..!

పెద్దలు మారాలి(1974) విడుదల అయ్యాక. హైదరాబాదుకి చెందిన కొంతమంది కొత్తగా సినిమా తియ్యడానికి పి.సి.రెడ్డిగారి వద్దకి వచ్చారు. కథా చర్చల వద్దనుంచే వాళ్ళతో ఉండమని నన్ను పంపించారు. మోదుకూరి జాన్సన్ గారితో కలిసి కథ, మాటలు అన్నిటిలోనూ పాల్గొనేవాడిని. ఆ సినిమా ‘సౌభాగ్యవతి‘ (1975). ఈ సినిమాకి కో-డైరెక్టర్‌గా పనిచేసిన పోలవరపు బ్రహ్మానందరావు అనే ఆయనకి నా పనితీరు బాగా నచ్చింది. ఈయన తర్వాత రోజుల్లో ప్రఖ్యాత దర్శకులైన పి. శరత్‌గారి బ్రదర్. బ్రహ్మానందరావు గారు, పి.సి.రెడ్డిగారు ఇద్దరూ వి.మధుసూధనరావ్ గారి వద్ద కలిసి పని చేసారు. ఆయనే పి.సి.రెడ్డి గారి వద్దకెళ్ళి " నాకు సొంతంగా సినిమా చేసే అవకాశం వచ్చింది. నాగేశ్వర రావుని నాతో తీసుకెళుతున్నాను..." అని చెప్పారు. అలా పి.సి.రెడ్డి గారి వద్దనుంచీ బ్రహ్మానందరావుగారి వద్దకు వెళ్ళి ‘చిట్టెమ్మా - చిలకమ్మ‘ (1975) సినిమాకి అసిస్టెంటుగా పని చేశాను.



అక్కడ్నుంచి కట్టా సుబ్బారావు, బోయిన సుబ్బారావు గార్ల వద్ద చాలా సినిమాలకి అసిస్టెంటు గాను, అసోసియేట్‌గాను పని చేశాను. నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ మురళీ మోహన్ రావుగారు నా మొదటి గురువు బాపయ్యగారి వద్దకి తీసుకెళ్ళారు. బాపయ్యగారు అప్పుడు రామానాయుడుగారి సినిమా చేస్తున్నారు. అక్కడ రెండువారాలు పని చేసాను. అప్పుడు వాళ్ళిస్తానన్న జీతం నాకు సరిపోదనిపించింది. అప్పుడే నాకు పెళ్ళయింది, ఒక పాప. నా కుటుంబాన్ని చూసుకోవాలంటే మరి కొంచెం వెసులు బాటున్న సంపాదన కావాలి. ఇదే మాట బాపయ్యగారితో చెప్పాను. ఆయన నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు. "నాగేశ్వర్రావ్. నీ ఇబ్బందులు నాకు తెలుసు. ఐతే ఈ ఫీల్డ్‌లో పైకి రావాలంటే ఇలాంటి ఇబ్బందులు చాలా ఎదుర్కోవాలి. నేనూ ఇలాంటి వెన్నో ఫేస్ చేసాను. కాస్త సహనం వహిస్తే మంచి రోజులు వస్తాయి" అన్నారు. అదే టైములో బాపయ్యగారి వద్ద పని చేస్తున్న నా ఇంకో కొలీగ్ బీరం మస్తాన్ రావ్‌గారికి సొంతంగా దర్శకత్వం వహించే ఛాన్స్ వచ్చింది. తనతో వస్తే 600 జీతం ఇస్తానన్నారు. అటు చూస్తే సురేష్ బేనర్ మంచి పేరున్న కంపెనీ. ఇటు చూస్తే ఫేమిలీని సవ్యంగా చూసుకోడానికి సరిపడే జీతం. చివరికి మస్తాన్ రావుగారితో వెళ్ళడానికే నిర్ణయించుకున్నాను.

ఆ విధంగా నా ప్రయాణం బీరం మస్తాన్ రావుగారితో బుర్రిపాలెం బుల్లోడు (1979) నుంచి ప్రేమ సింహాసనం (1981) వరకూ సాగింది. ఆయనవద్ద చిత్ర దర్శకత్వంలో పాఠాలు మరిన్ని నేర్చుకున్నాను.

తరువాత బోయిన సుబ్బారావు గారి వద్ద ప్రతిజ్ఞ, సవాల్, ధర్మ పోరాటం మూడు సినిమాలకి పనిచేసాను. ఇవన్నీ మూడు నాలుగు నెలల్లో ఫాస్ట్‌గా అయిపోయాయి.

ఆ సమయంలోనే నా పాత మిత్రుడు మురళీమోహన్ రావుకి సురేష్ ప్రొడక్షన్‌లో 'సంఘర్షణ'అనే సినిమాకి మొదటిసారి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. తన వద్దకి అసోసియేట్‌గా రమ్మని అడిగారు.



ఆయనకి ఆ సమయంలో చాలామంది దొరికేవారే కానీ నా మీదవున్న అభిమానంతో, నమ్మకంతో నాకు అవకాశమిచ్చారు. ఆయనే నన్ను రామానాయుడుగారికి పరిచయం చేసారు. ఆయన నన్ను గుర్తుపట్టి..... "ఏమయ్యా నువ్వే కదా లోగడ ఒకసారి మా కంపెనీలో జీతం సరిపోలేదని వెళ్ళిపోయావు..." అని అన్నారు. మురళీమోహనరావుగారే నా గురించీ, నా టాలెంట్ గురించీ నాయుడుగారికి నచ్చ చెప్పి తీసుకున్నారు.

ఆ విధంగా నా సినీ ప్రయాణం ఒక అర్థవంతమైన మలుపు తిరిగింది. ఇది నా సినీ ప్రస్తానంలో ఒక మైలు రాయి అవుతుందని అప్పుడనుకోలేదు.

'సంఘర్షణ' సమయంలోనే చిరంజీవిగారితో పరిచయమయ్యింది(1983). ఆ సినిమా ఏవరేజ్‌గా ఆడింది. ఐతే రామానాయుడుగారి వద్ద ఒక మంచి సంప్రదాయం ఉంది. మొదటిసారి దర్శకత్వం చేసిన వాళ్ళు సక్సెస్ ఐనా, ఫెయిల్ అయినా తప్పని సరిగా రెండో అవకాశం ఇస్తారు. అలానే మురళీ మోహన్ రావుగారికి వెంటనే మరో అవకాశం ఇచ్చారు. బాలకృష్ణ, విజయశాంతిగారి కాంబినేషన్‌లో 'కథానాయకుడు' (1984) దానికీ నేను అసోసియేట్‌గా చేసాను. ఇది సూపర్ హిట్ సినిమా. రామానాయుడుగారు యూనిట్‌లో పని చేసే ప్రతివారినీ నిశితంగా పరిశీలిస్తుంటారు. ఏ మాత్రం స్పార్క్ ఉందని అనిపించినా బాగా ప్రోత్సహించి అవకాశం ఇస్తారు. 'సంఘర్షణ' సమయంలోనే ఆయనకి నా మీద మంచి అభిప్రాయం ఏర్పడింది.

అందుకే, వరుసగా 'కథానాయకుడు' హిందీ వెర్షన్ 'దిల్ వాలా' కీ, బి.గోపాల్ గారి మొదటి సినిమా 'ప్రతిధ్వని'కీ దాని హిందీ వెర్షన్ 'ఇన్సాఫ్ కీ ఆవాజ్' కీ కూడా పని చేసాను.

బోయిన సుబ్బారావుగరి దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్ వాళ్ళు నిర్మించిన 'గురుబ్రహ్మ'కి పని చేస్తుండగా అసలు మలుపు మొదలైంది.

అప్పటికే సురేష్ ప్రొడక్షన్‌తో నాకు ఒక స్పెషల్ రికగ్నిషన్ వచ్చింది. నూతన్ ప్రసాద్ గారిలాంటి ఆర్టిస్టులందరూ 'నాయుడు గారు అందరికీ అవకాశం ఇస్తున్నారు. నీకూ త్వరలో అవకాశం వస్తుంది' అనేవారు. 'గురుబ్రహ్మ' షూటింగ్ మూడొంతులు పూర్తవుతుండగా రామానాయుడుగారు ఓ రోజు పిలిచి బాలకృష్ణగారితో తర్వాత తను తీద్దామనుకుంటున్న సినిమాకి నేనే డైరెక్టర్‌నని ప్రకటించారు. సహజంగానే నా సంతోషానికి అవధులు లేవు. మరో రెండేళ్ళు గడిచాక కానీ ఆ అవకాశం రాదేమో అనుకున్నాను. ఐనా రామానాయుడుగారికి నా మీద అభిమానం, నా ప్రతిభమీదున్న నమ్మకం నాకీ అవకాశం ఇచ్చిందనుకున్నాను. వెంటనే కథ సిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను...

జంధ్యాలగారు రచయిత. రామారావుగారి పాత సినిమా ఆత్మబంధువుని స్ఫూర్తిగా తీసుకుని 'రాము' సినిమాకి కథ రూపొందించుకున్నాము. బాలకృష్ణ, రజని, శారద, జగ్గయ్య గార్లు ప్రధాన తారగణం. అప్పట్లో బాలకృష్ణగారు జగ్గయ్య గారినీ, శారద గారినీ సైకిల్ మీద ఎక్కించుకుని వెళ్ళే పోస్టర్ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంది. ఆ సినిమా నిర్మాణం మొదలైనప్పుడే రామానాయుడి గారి కొత్త ఇల్లు పూర్తయింది. సినిమా అంతా అందులోనే తీద్దామని నిశ్చయించుకున్నాము. జంధ్యాలగారు మొదట్లో 75సీన్లు అదే ఇంట్లో ఎలా తియ్యగలమా అని కొంత సంశయించారు కానీ, అవకాశాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకుని ఆ ఫోర్ బెడ్ రూమ్ హౌజ్ లోనే 70 శాతం షూటింగ్ విజయవంతంగా పూర్తిచేసాను.

మొదట్లో రెండు మూడు రోజులు మాత్రమే రామానాయుడు గారు 'రాము' షూటింగ్ కి వచ్చారు. ఏమీ కల్పించుకోకుండా పక్కనే ఉండి పరిశీలించే వారంతే. నా టేకింగ్ చూసి 'నాగేశ్వరావ్..అన్ని రియాక్షన్స్‌నీ కాప్చర్ చెయ్యాలనుకుని ఎక్కువ షాట్స్ తీస్తున్నట్లున్నావు. అవసరమైనన్ని షాట్లు మాత్రమే తీసుకుంటే ఎడిటింగ్ లో నీకు తేలిగ్గా ఉంటుంది' అని సలహా ఇచ్చారు. తర్వాత సినిమా పూర్తయ్యే వరకూ మళ్ళీ ఎప్పుడూ ఆయన నన్ను పట్టించుకోలేదు. వారికి నామీద ఉన్న నమ్మకం అలాంటిది. మీతో మాట్లాడుతున్నప్పుడు ఆయన ఫోటో నా టేబిల్ మీద ఉంది. నాలాంటి ఎంతో మంది బంగారు భవిష్యత్తుకి బాటలు వేసిన మహానుభావుడాయన. ఆయన ఫోటో చూడనిదే ఇంట్లో నుంచీ బయటికి వెళ్ళను. అప్పటికే 19 సినిమాలకి అసిస్టెంట్‌గా చేసి ఉండడం వల్ల సొంత దర్శకత్వంలోని నా మొదటి సినిమా 'రాము' నిర్మాణం నాకేమీ కొత్తగా అనిపించలేదు. చాలా తేలికగా పూర్తయింది. సినిమా ఎబౌవ్ యావరేజ్‌గా ఆడింది.



'రాము' నిర్మాణంలో ఉండగానే రామానాయుడు గారి మేనల్లుడు అశోక్ కుమార్ గారు 'నాగేశ్వరావ్ గారూ.. మీ మొదటి సినిమా హిట్ ఐనా కాకపోయినా మీతో రెండో సినిమా మాత్రం నేనే చేస్తాను' అని మాట ఇచ్చారు. అప్పటికి ఆయన ఇ.వి.వి.సత్యనారాయణ గారితో 'చెవిలో పువ్వు' తీస్తున్నారు. 'రాము' విడుదలయ్యాక ఇంతకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అశోక్ కుమార్ గారు నాతో సినిమా చెయ్యడానికి ముందుకి వచ్చారు. ఆయన వద్ద అప్పటికే రాజశేఖర్ గారి డేట్స్ ఉన్నాయి. రాజశేఖర్ గారి యాంగ్రీ యంగ్ మాన్ కథలు బాగా హిట్ అవుతున్న రోజులవి. ఆయన కుండే నెగిటివ్ షేడ్స్ పాత్రలని దృష్టిలో పెట్టుకుని పరుచూరి బ్రదర్స్‌తో కూర్చుని కథ సిద్ధం చేసుకున్నాము. అయితే రాజశేఖర్‌గారి డేట్స్ వాయిదా పడుతూ వచ్చాయి.అదే సమయంలో రామానాయుడు గారు పిలిచి విషయమేమిటి అని అడిగి తెలుసుకున్నారు. కథ విని 'ఐతే ఈ కథని నేనే వెంకటేశ్ తో చేస్తాను. రెండు నెలలు ఆగండి..' అన్నారు. అలా నా రెండో సినిమా వెంకటేశ్ గారితో నిర్మాణమైంది. అదే 'ధ్రువనక్షత్రం'. అది మంచి హిట్ అయింది. దాని తర్వాత బొంబాయి నుంచీ నాకు ఒక అఫర్ వచ్చింది. లోగడ నేను 'దిల్‌వాలా', కి 'ఇన్సాఫ్ కి ఆవాజ్' కి అసిస్టెంటుగా చేసినప్పుడు కాదర్ ఖాన్ గారి అసిస్టెంటు పర్వీజ్ బాగా పరిచయమయ్యారు. ఆయన అమీర్‌ఖాన్, మాధురి దీక్షిత్ లతో నా డైరెక్షన్‌లో హిందీ సినిమా మొదలు పెట్టారు. అది నా మూడో సినిమా 'ముఝ్ సె దివానా నహీం..' సినిమా పేరు. అది అమీర్ ఖాన్ కి ఐదో సినిమానో, ఆరో సినిమానో. మాధురి దీక్షిత్ కి అప్పటికి 6 సినిమాలు వరుస ఫ్లాప్‌లు. కథ ఆ రోజులలో చాలా వెరైటీ లవ్ స్టోరీ. తాను ప్రేమించిన అమ్మాయి వేరే అతన్ని ప్రేమిస్తోందని తెలిసినా రివర్స్ లో ఎప్రోచ్ ఐ, ఆమెని కన్విన్స్ చేసి ఆమె ప్రేమని పొందిన ( 'ఆర్య' సినిమా గుర్తుకు వస్తోందా?) కథ అది. ఊటీలో పాటలతో మొదలైంది. నిజానికి యాక్షన్ పార్ట్ అంతా హైదరాబాదులో తీద్దామని మొదటి ప్లాన్. ఐతే సినిమా రెండో షెడ్యూల్ అయ్యే సరికి మాధురీదీక్షిత్ 'తేజాబ్' విడుదలై దేశం మొత్తం ఒక వూపు వూపేసింది. మాధురికి ఓవర్‌నైట్ డిమాండ్ పెరిగి పోయింది. మూడో షెడ్యూల్ నుంచీ ఆమె డేట్స్ దొరకడమే కష్టమై పోయి, అంతా బొంబాయిలోనే

కంటిన్యూ చేసాము. ఆమె ఎప్పుడు టైమ్ ఇస్తే అప్పుడు , ఉదయం రెండు గంటలు, సాయంకాలం రెండు గంటలు..అలా చేసాము. అమీర్‌ఖాన్ గారు మాత్రం చాలా సిన్సియర్‌గా సెట్స్ కివచ్చే వారు. షూటింగ్ ఐతే ఎలాగోలా పూర్తిచెయ్యగలిగాము కానీ ప్రొడక్షన్ కంపెనీతోనే అనుకోని ఇబ్బందులు వచ్చాయి. చివర్లో నాకూ ఆ సినిమా మీద ఇంట్రెస్టు తగ్గిపోయింది. నిర్మాతలే నా అనుమతి లేకుండ ఏవో మ్యూజిక్ ట్రాక్స్ వేసుకుని రిలీజ్ చేసుకున్నారు. నేను తర్వాత ఎప్పుడో వీడియోలో చూసానంతే. ఆ విధంగా నా మొదటి హిందీ సినిమా అంత ప్లెజంట్ ఎక్స్‌పీరియెన్స్‌ని ఇవ్వలేదు.

నాలుగో సినిమా 'డాక్టర్ భవాని'. కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరిగే అన్యాయాలని ఎక్స్‌పోజ్ చేస్తూ తీసాము. ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. ఆ సినిమా విజయంతో వెంటనే అదే యూనిట్‌తో 'ప్రయత్నం' అనే సినిమాకి దర్శకత్వం వహించాను. ఇది క్రిమినల్ చట్టంలోని లోపాలని ఎత్తి చూపించే సినిమా. అదీ బాగానే ఆడింది. ఇలా వరుస విజయాలతో సాగుతూ డి.వి.ఎస్ రాజు గారికి 'దోషి-నిర్దోషి' చేసాను. అది శోభన్ బాబు గారు కెరీర్ లో చాలా మంచి సినిమాగా నిలిచిపోయింది. పాటలు కూడా బాగా హిట్ అయ్యాయి.




ఈ సినిమా అయ్యాక నా చీరాల మిత్రుడు క్లాస్ మేట్ కూడా ఐన వడ్డేబాలాజీ, 'విజయశాంతి గారి డేట్స్ ఉన్నాయి, సినిమా చేసి పెట్టు' అని నావద్దకి వచ్చాడు. అప్పటికి విజయశాంతి గారు కర్తవ్యం సూపర్ సక్సెస్‌తో ఉన్నారు. అంతటి పవర్‌ఫుల్ పాత్ర ఉంటేనే విజయశాంతి గారితో మరో సినిమా హిట్ అవుతుంది. బాగా ఆలోచించిన మీదట మెరుపులా ఒక పాత్ర తట్టింది. తెలంగాణా నేపథ్యంలో పల్లెటూరి నుంచీ ఒక అమాయకమైన అమ్మాయి తనమీద, చుట్టుపక్కలా జరుగే అన్యాయాలని ఎలా ఎదుర్కొంటుంది అనే అంశం చుట్టు కథ అల్లుకున్నాం. పల్లెటూరి పాత్రలో ఉన్నప్పుడు విజయశాంతి గారి మీద మంచి కామెడీ వర్కవుట్ అయింది. ఇంక అన్యాయాలని ఎదిరించే షేడ్‌లో ఐతే చెప్పనవసరంలేదు. నాకూ, విజయశాంతి గారికీ కూడ తెలంగాణా యాస కొత్తే. తనికెళ్ళ భరణి గారు, నా మిత్రుడే ఐనా కొమ్మనాపల్లి గణపతి రావు గార్ల సహకారంతో సినిమా మొత్తంలో తెలంగాణా జీవన విధానాన్ని చక్కగా చిత్రించగలిగాము.




దోషి - నిర్దోషి సమయంలో పరిచయమైన సుమన్ గారు హీరో. విజయశాంతి-సుమన్ గార్ల మధ్య స్క్రీన్ కెమిస్ట్రీ చక్కగా వుంటుంది. అలా తయారైన 'మొండి మొగుడు - పెంకి పెళ్ళాం' సూపర్ డూపర్ హిట్ అయింది.

దాని తరువాత చాలా సినిమాలే చేసాను. కొన్ని బాగానే ఆడాయి. కొన్ని ఒక మాదిరిగా పోయాయి. మళ్ళీ విజయశాంతి - సుమన్ గార్ల కాంబినేషన్‌లోనే 'శ్రీవారంటే మావారు' తీసాను. రాజేంద్రప్రసాద్ గారి తో 'పేకాట పాపారావు' హాస్య చిత్రమూ తీసాను. అప్పుడే చిత్రసీమ హైదరాబాదు రావడమూ, చిత్రరంగం అంతా కొత్త రక్తంతో నిండిపోవడం మొదలైంది. నా చివరి సినిమా సురేష్ హీరో గా వచ్చిన 'రాఘవ'. తర్వాత సొంతంగా దర్శకత్వం చెయ్యలేదు. చాలా అవకాశాలు వచ్చినా మారిన పరిస్థితుల్లో, అందరి సలహాలకి తలఒగ్గి దర్శకత్వం చెయ్యడం నాకు సరిపడదని అనుకున్నాను. ఎవరైనా పిలిచి ఆనరరీగా సహాయం చెయ్యమంటే చేసిపెడుతున్నానంతే.. అయితే సినిమా రంగానికి దూరం కాకుండా సినిమా రంగంలోని విశేషాలన్నింటినీ తెలుసుకుంటూనే ఉంటున్నాను. సినీ కెమేరాలకి అవసరమయ్యే విడి భాగాలు అమ్మే స్టోర్

ఒకటి నిర్వహిస్తూ కాలక్షేపం చేస్తున్నాను. పిల్లలిద్దరూ జీవితంలో బాగా సెటిల్ అయ్యారు. అల్లుడూ, అమ్మాయీ యిద్దరూ ఉద్యోగస్తులే. అబ్బాయి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నాడు.

ఇన్నేళ్ళ తర్వాత నాతో ఇన్ని కబుర్లు చెప్పించిన మీ 'కౌముది' కి థాంక్స్ చెప్పుకోవాలి. ఇంకా నన్ను గుర్తు పెట్టుకున్న తెలుగు ప్రేక్షకులకి అభివందనాలు.

(మే 2009 సంచికలో ప్రచురితం)

# కళాతపస్వి కె.విశ్వనాథ్

**కళాతపస్వి** కె.విశ్వనాథ్ గారి గురించి తెలుగువారికి వేరుగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 'శంకరాభరణం' తో తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక శాశ్వతమైన అధ్యాయాన్ని రచించిన నేటితరం ఉత్తమ దర్శకుడు శ్రీ విశ్వనాథ్ గారి మొదటి సినిమా కబుర్లు ఈ నెల 'కౌముది' లో మీకోసం ప్రత్యేకం. సహజంగా ఇంటర్వ్యూలకి దూరంగా ఉండే విశ్వనాథ్ గారు 'కౌముది' గురించి గొల్లపూడి మారుతి రావుగారి ద్వారా తెలుసుకుని, మేము ఫోన్ చెయ్యగానే ఇంటర్వ్యూకి అంగీకరించారు. ఎన్నో అనూహ్యమైన రికార్డుల్ని సృష్టించిన విశ్వనాథ్‌గారు చాలా సాధారణంగా "నా జీవితం చాలా సాదా సీదాగా గడించింది. ఏవో ఉత్కంఠభరితమైన సన్నివేశాలూ, ఆసక్తికరమైన సంఘటనలూ ఉంటాయని ఆశిస్తే మీరు నిరాశకి గురి కావలసి వస్తుంది. ఐనా 'కౌముది' చేస్తున్న సాహితీ సేవ గురించి విన్నాక మీతో నా మొదటి సినిమా వరకూ జరిగిన జీవనప్రయాణాన్ని పంచుకోవడానికి ఆనందిస్తున్నాను.." అన్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..



నా పూర్తి పేరు కాశీనాథుని విశ్వనాథ్. నాన్నగారు కాశీనాథుని సుబ్రహ్మణ్యంగారు, అమ్మగారు కాశీనాథుని సరస్వతీ దేవిగారు. మేము ముగ్గురం సంతానం. నేను పెద్దవాడిని . నాకు ఇద్దరు చెల్లెళ్ళు.. శ్యామలాదేవి, గిరిజాదేవి. మా స్వగ్రామం గుంటూరు జిల్లా , రేపల్లె తాలూకాలోని 'పెదపులివర్రు' అనే గ్రామం. మా తాతగారు పరమ నిష్ఠాగరిష్టుడు. మనదేశానికింకా స్వాతంత్ర్యం రాక ముందు జరిగిన సంఘటన..తాతగారు కాంగ్రెస్ వాలంటీర్లకి భోజనం పెట్టారనే నెపంతో బ్రిటిష్ వాళ్ళు ఆయన్ని అరెస్టు చేసి జైలులోపెట్టారు. అందుకు నిరసనగా జైలులో ఉన్నంతకాలం భోజనం ముట్టకుండా కేవలం కొబ్బరినీళ్ళతోనే బ్రతికిన అభ్యుదయవాది. అలాంటి తాతగారికి మనవడిగా పుట్టినందుకు నేను చాలా

గర్విస్తున్నాను. వారి సద్గుణాలు అంతగా నాకు అబ్బకపోయినా ఇలాంటి సమయంలో వారిని గుర్తుచేసుకోవడం చాల ముఖ్యమైన విషయం..

నా బాల్యం, ప్రాథమిక విద్య పెదపులివర్రులోనే గడిచినా ఆ వూర్లో ఎక్కువరోజులు నివసించలేదు. అక్కడి నుంచి మా నివాసం విజయవాడకి మారింది. అది ఎలా జరిగిందంటే - మావూరికే చెందిన సముద్రాల రాఘవాచార్యులుగారు (సీనియర్ సముద్రాల) అప్పటికే మద్రాసులో వాహినీ ప్రొడక్షన్స్‌లో ఆస్థాన రచయితగా పనిచేస్తున్నారు. వారు నిర్మించిన దేవత, సుమంగళి, పోతన మొదలైన చిత్రాలకి అప్పటికే రచన చేసి వున్నారు. వారి మూలంగా మా నాన్నగారికి విజయవాడలో వాహినీ ప్రొడక్షన్స్‌కి రీజినల్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. అందువల్ల మా కుటుంబం అంతా విజయవాడకి షిఫ్ట్ అయింది. నా హైస్కూలు విద్య అంతా విజయవాడలోనూ. కాలేజీ గుంటూరు హిందూకాలేజీ, ఎ.సి.కాలేజీల్లోనూ జరిగింది. నేను బి.ఎస్సీ డిగ్రీ చేసాను. అప్పటికే మద్రాసులో బి.ఎన్.రెడ్డి గారు వాహినీ స్టూడియో నిర్మిస్తున్నారు కొత్తగా. సౌత్ ఈస్ట్ ఆసియాలో అధునాతన సౌకర్యాలతో తయారౌతున్న ఆ స్టూడియో ఎప్పుడూ వార్తల్లో విశేషంగా ఉండేది. డిగ్రీ అయ్యాక నేను ఎక్కడో ఒక చోట ఉద్యోగం చెయ్యాలి. మా మేనమామ గారి సలహాపై నాన్నగారు నన్ను మద్రాసు వాహినీ స్టూడియోలో సౌండ్ విభాగంలో రికార్డిస్ట్‌గా చేర్పించారు. ఆ విధంగా జీవనోపాధికోసమే చిత్రరంగ ప్రవేశం చేశానే తప్ప చిన్నప్పటినుంచీ నాకేదో కళాదృష్టి వుందనీ, పెద్ద దర్శకుడ్నయిపోవాలని కలలు కనే వాడ్ననీ చెప్పలేను. మా అంకుల్ ప్రోత్సాహం వల్లనే ఒక టెక్నీషియన్‌గా నా సినీ జీవితం మొదలైంది.



బి.ఎన్.రెడ్డి గారి శిక్షణ ప్రకారం, స్టూడియోలో చేరిన ప్రతి టెక్నీషియనూ కెమేరా, ప్రొజెక్షన్ ఆపరేషన్, లేబొరేటరీ..ఇలా ప్రతి విభాగంలోనూ కనీసం ఆర్నెల్లయినా పనిచేయాలి. అప్పట్లో వాహినీ స్టూడియోలో ఎలా ఉండేదంటే నిర్మాతలు మిగతా విభాగాల టెక్నీషియన్లని ఎక్కడ నుంచీ తెచ్చుకున్నా, ఆడియో విభాగం మాత్రం స్టూడియోకి సంబంధించినదే వాడుకునే వాళ్ళు. ఇందువల్ల వాహినిలో నిర్మాణమైన అనేక చిత్రాలకి సౌండ్ రికార్డిస్ట్‌గా పనిచేసే అవకాశం లభించింది. బి.ఎస్.రామకృష్ణారావు గారు, కె.వి.రెడ్డి గారు, బి.ఎన్. రెడ్డి గారు, తాతినేని ప్రకాశరావు గారు, ఆదుర్తి సుబ్బారావు గారు లాంటి ప్రముఖ దర్శకుల సినిమాలకి పనిచేసే అవకాశం వచ్చింది. అలానే తెలుగు. తమిళ సినిమాలకి రెండింటికీ కూడా పనిచేసే వాడిని. ఈ క్రమంలో ఆదుర్తి సుబ్బారావు గారితో నాకు కాస్త ఎక్కువ అనుబంధం ఏర్పడింది.




సౌండ్ రికార్డిస్ట్‌గా ఉంటున్నప్పటికీ సినిమాల్లోని మిగతా విభాగాల గురించీ, ముఖ్యంగా దర్శకత్వ శాఖలో నాకున్న ఆసక్తినీ, నా క్రియేటివిటీని గమనించిన ఆదుర్తి సుబ్బారావు గారు తన సినిమాలకి స్క్రిప్టు అసిస్టెంటు గానూ, అసోసియేట్ గానూ కూడా పనిచేసే అవకాశాన్ని ఇచ్చారు. మూగమనసులు, తేనె మనసులు లాంటి అనేక సినిమాలకి సుబ్బారావు గారి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసాను కొన్ని సినిమాలకి రెండో యూనిట్ దర్శకుడిగా కూడా పనిచేశాను. అప్పుడే నన్ను గమనించిన అక్కినేని నాగేశ్వరరావుగారు 'మీరు మా అన్నపూర్ణా సంస్థలోకి వచ్చేసెయ్యండి. ఒకటి రెండు సంవత్సరాలు దర్శకత్వశాఖలో పనిచెయ్యండి. తొందరలోనే సొంతంగా దర్శకత్వం చేసే అవకాశం ఇస్తాము..' అని నన్ను ఆహ్వానించారు. ఆ విధంగా వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్

వృత్తినుంచీ అన్నపూర్ణా పిక్చర్స్‌లో దర్శకత్వ శాఖకి మారడానికి అక్కినేనిగారే ప్రధాన కారణం. అక్కడినుంచీ వారు నిర్మించిన చదువుకున్న అమ్మాయిలు, వెలుగు నీడలు, ఇద్దరు మిత్రులు, డాక్టర్ చక్రవర్తి మొదలైన సినిమాలకి అసోసియేట్‌గా పనిచేశాను.

అన్నమాట ప్రకారమే వారు నిర్మించే 'ఆత్మగౌరవం' సినిమాకి నాకు సొంతంగా దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చారు. యద్దనపూడి సులోచనా రాణిగారు, గొల్లపూడి మారుతిరావు గారు కథనందించగా గొల్లపూడి మారుతి రావుగారు, భమిడిపాటి రాధాకృష్ణ గారు కలిసి సంభాషణలని అందించారు. అది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచీ నంది బహుమతిని అందుకుంది...

ఇదండీ మొదటి సినిమా వరకూ జరిగిన నా అతి సాధారణ సినిమా ప్రయాణం..

***ప్రముఖ సినీ జర్నలిస్ట్ 'ప్రభు' గారు వ్రాసిన 'స్వర్ణయుగంలో అన్నపూర్ణ' అనే పుస్తకంలో, కె.విశ్వనాథ్ గారి మొదటి సినిమా 'ఆత్మగౌరవం' గురించి పొందు పరచిన కొన్ని విశేషాలని క్రింద పునర్ముద్రిస్తున్నాం. దుక్కిపాటి మధుసూదనరావుగారు స్వయంగా ఆటోగ్రాఫ్ చేసిన ఈ పుస్తకాన్ని 'కౌముది'కి ఆత్మీయంగా అందించిన శ్రీమతి లక్ష్మి తుమ్మల (దుక్కిపాటి గారి కుమార్తె) గారికి మా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.***



'ఆత్మగౌరవం 'చిత్రం ద్వారా - అన్నపూర్ణా సంస్థ మరో ప్రతిభావంతుడైన దర్శకుడ్ని పరిచయం చేసింది. ఆయనే కె.విశ్వనాథ్.

అన్నపూర్ణ సంస్థలో పని చేసిన మూడవ దర్శకుడు ఆయన... వరసగా మూడు చిత్రాలకు అసోసియేట్‌గా ఆదుర్తి దగ్గర పనిచేసాక, నాలుగవ చిత్రానికి డైరక్టరుగా 'డాక్టర్ చక్రవర్తి'కి సారధ్యం వహించవలసిన విశ్వనాధ్ - అప్పట్లో తన అధైర్యాన్ని వ్యక్తం చేయటం వల్ల - దాన్ని కూడా ఆదుర్తే డైరెక్ట్ చేయటం జరిగింది.

అన్నమాటను తప్పని అన్నపూర్ణా అధినేతలు - ఆత్మగౌరవాన్ని డైరెక్ట్ చేయమని మళ్ళీ విశ్వనాథ్‌ని కోరారు. ఆ బాధ్యతను ఆయన సంతోషంగా స్వీకరించారు.

"ఇక ఎలాంటి కథ చేయాలి?" - అనే విషయం చర్చనీయాంశమైంది.

"ఇంతవరకూ ఫామ్లీ డ్రామాతో కూడిన సెంటిమెంటల్ సినిమాల్నీ - సీరియస్ చిత్రాల్నీ తీశాం కనుక - కొత్తదనం కోసం, ఇప్పుడు కాలేజీ స్టూడెంట్స్‌తో ఫుల్ లెంగ్త్ రొమాంటిక్ కామెడీ తీస్తే బావుంటుంది!" - అన్నారు మధుసూధనరావు.

ఆ ఆలోచన విశ్వనాథ్‌కీ నచ్చింది.

వెంటనే యద్దనపూడి సులోచనారాణితో కథ చర్చలు ప్రారంభమయ్యాయి. అనుకున్న దానికంటే బాగా వచ్చింది. కథలోని పాత్రలన్నీ కామెడీకి ఒదిగిపోయే విధంగా - సన్నివేశాలు సమకూడాయి.

హాస్య భరితమైన నాటకాలు రాయటంలో ఆరితేరిన గొల్లపూడి మారుతీరావుకి సంభాషణలు రాసే బాధ్యతను అప్పగించారు. అప్పట్లో మారుతీరావు హైదరాబాదు రేడియో స్టేషన్లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవారు. సాధారణంగా సినిమా సంభాషణలు ప్రశాంతమైన గెస్ట్‌హౌసుల్లోనో, ఫైవ్ స్టార్ హోటల్ గదుల్లోనో రూపు దిద్దుకుంటుంటాయి. కానీ ఆత్మగౌరవం చిత్రానికి సంభాషణలు

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని చెట్ల నీడన, పచ్చిక బయళ్ళపై మొలకలెత్తాయని చెప్పాలి!

నాటకాలలో పాత్రోచితమైన సంభాషణలు రాయడంలో సిద్ధహస్తుడైన మారుతీరావు, సినీ మీడియాని సులువుగానే అవగాహన చేసుకుని ఆత్మగౌరవం చిత్రానికి సంభాషణలు చక్కగా రాశారు.

కథలో 'ఇమోషనల్ కాన్‌ఫ్లిక్ట్' తక్కువై బిగువు సడలి పోతుందేమోనన్న అనుమానంతో - మళ్ళీ కథ గురించి సమాలోచనలు ప్రారంభమయ్యాయి. కథలో ఇమిడిపోయే విధంగా, గుమ్మడి భార్యగా ఓ పిచ్చి అమ్మాయి పాత్రను సృష్టించారు మారుతీరావు. ఎలాంటి 'ఇమేజ్' లేని ఓ కొత్త అమ్మాయిని ఆ పాత్రకు తీసుకోవాలని - అప్పుడప్పుడే గుర్తింపు తెచ్చుకుంటున్న వాసంతికి ఆ వేషం ఇచ్చారు.

"ఆ పాత్రకు గొల్లపూడి రాసిన డైలాగ్స్ చాలా బావున్నాయి" అంటారు మధుసూధనరావు.

అల్లురామలింగయ్యకు - అన్నపూర్ణా సంస్థ చిత్రాలన్నింటిలోకీ ప్రాముఖ్యత కలిగిన హాస్య పాత్ర - ఈ చిత్రంలో లభించింది. తన వేషాన్ని ఆద్యంతం అద్భుతంగా రక్తికట్టించి, మంచి పేరు తెచ్చుకోవటమే కాకుండా - చిత్ర విజయంలో కూడా భాగస్వాములయ్యారు

కాలేజి స్టూడెంట్‌గా అక్కినేని, ఎంతో సహజంగా, మరెంతో హుషారుగా నటించి - 'రొమాంటిక్ హీరో'గా తనకు తానే సాటి అనిపించుకున్నారు......

తమ్ముడి మీద పెట్టుకున్న ఆశలూ, నమ్మకాలు వమ్ముకాగా మానసికంగా కృంగిపోయే అన్నగానూ - తాను ఎంతగానో ప్రేమించిన భార్య మరణిస్తే పరిస్థితులకు తలవంచి ఓ'పిచ్చి పిల్ల'ను రెండో భార్యగా చేసుకుని అనుక్షణం ఆవేదనకు గురయ్యే భర్తగా గుమ్మడి - రసవత్తరంగా పాత్రపోషణ చేసి - ప్రేక్షకుల హృదయాల్ని ఆకట్టుకున్నారు...........

కాలేజీ అమ్మాయిలుగా - కాంచన, రాజశ్రీలు పోటాపోటీలుగా నటించి యువతరం మనసుల్ని దోచుకున్నారు. అలాగే - రేలంగి, రమణారెడ్డి - హేలూ, బాజాలు పాత్రల్లో ఆహ్లాదకరమైన హాస్యాన్ని అందించారు.



ఇక చిత్రనిర్మాణ విషయానికొస్తే - తొలిసారిగా దర్శకత్వపు బాధ్యతల్ని చేపట్టిన విశ్వనాథ్‌కి - నటీనటులనుంచి చాలినన్ని కాల్ షీట్స్ తీసుకునే విషయంలోనూ - ఫిలిం నెగిటివ్ విషయంలోనూ పూర్తి స్వేచ్ఛ నిచ్చి సహకరించారు మధుసూధనరావు..... అంతకుముందు అన్నపూర్ణా సంస్థలో అసోసియేట్‌గా నాలుగు చిత్రాలకు పనిచేసిన విశ్వనాథ్ - ఎంతో సృజనాత్మకతను సంపాదించుకున్నారనీ - ఆదుర్తి వద్ద శిష్యరికం చేయుటం వల్ల 'టెక్నికల్'గా చిత్రాన్ని బాగా తీయగలరనీ - మధుసూధనరావ్ విశ్వాసం!

ఈ చిత్రానికి 'పాటల కంపోజింగ్' మదరాసులో పెట్టుకుంటే - రచయితలూ, మ్యూజిక్ డైరెక్టరూ ఇతరత్రా బిజీగా ఉండి - కాన్‌సన్‌ట్రేషన్ ఉండదన్న అనుమానంతో - వారిని హైదరాబాద్ రప్పించి మ్యూజిక్ సిట్టింగ్స్ ఏర్పాటు చేశారు. ప్రముఖ కవులు - ఆరుద్ర దాశరథి, సి.నారాయణ రెడ్డి పాటలు రాయగా, అన్నపూర్ణావారికి ఆస్థాన సంగీత దర్శకుడిగా మారిన ఎస్. రాజేశ్వరరావ్ సంగీత సారధ్యం వహించి శ్రావ్యమైన 'ట్యూన్స్' కంపోజ్ చేశారు.

స్వతహాగా సౌండ్ ఇంజనీర్ కావటం వల్ల - దర్శకులు విశ్వనాథ్ స్వయంగా దగ్గరుండి - పాటల్ని చక్కగా రికార్డ్ చేయించారు. పాటలన్నీ 'పాప్యులర్' అయి ఈ చిత్రం మ్యూజికల్‌గా కూడా హిట్టయింది!

ఆత్మగౌరవం చిత్రం ద్వారా హైదరాబాదుకి చెందిన 'సుమతీ కౌశల్'ను నృత్యదర్శకురాలిగా పరిచయం చేశారు......... 'నృత్యశిఖర్' అనే డాన్స్ స్కూలు నిర్వహిస్తున్న ఈమె - తన స్టూడెంట్స్‌తో - రవీంద్రభారతిలో ఇచ్చిన ఒక కార్యక్రమాన్ని చూసి ఆమెకు ఈ అవకాశాన్ని కల్పించారు మధుసూధరరావు..



44 సంవత్సరాల క్రితం మొదటి నంది అవార్డుల ప్రదానోత్సవంలో ఎడమ నుంచి గొల్లపూడి, దర్శకులు కె.విశ్వనాథ్, గవర్నరు పట్టం థానూ పిళ్ళై, నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు, ముఖ్యమంత్రి సతీమణి, గవర్నరు సతీమణి, హీరోయిన్ కాంచన, ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, నటుడు రేలంగి, రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి

సహజ వాతావరణాన్ని కన్నులకి కట్టేలా చూపించాలన్న లక్ష్యంతో - ఈ చిత్రం ఔట్‌డోర్ దృశ్యాల్ని మొత్తం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ, రామప్ప సరస్సు, దేవాలయం దగ్గరా, డిండీ ప్రాజెక్ట్ ప్రాంతంలోనూ చిత్రీకరించారు. స్థానికంగా ఉన్న నటీనటులకూ, సాంకేతిక నిపుణులకూ ఈ చితంలో అవకాశాలిచ్చి ప్రోత్సహించారు.

1966 మార్చి 18న విడుదలైన ఆత్మగౌరవం శతదినోత్సవ చిత్రం కావటమే కాకుండా - రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుల్లో తృతీయ ఉత్తమ చిత్రంగానూ, ఉత్తమ కథా చిత్రంగానూ, అవార్డులను అందుకోవటం విశేషం!

మొట్టమొదటి చిత్రంతోనే కె. విశ్వనాథ్‌కి దర్శకునిగా మంచి పేరు వచ్చింది. పోను పోను కమర్షియల్ సినిమాని దృశ్యకావ్యంగా మలచుకుంటూ కళాతపస్విగా నీరాజనాలందుకున్నారాయన!!

(జూన్ 2009 సంచికలో ప్రచురితం)

# ఎస్వీకృష్ణారెడ్డి

**అలనాటి** విజయా పిక్చర్స్, అన్నపూర్ణా పిక్చర్స్ లాగా తనకంటూ ఒక ఒరవడి సృష్టించుకుని, కుటుంబసభ్యులంతా కలిసి చూసి ఆనందించగల చిత్రాలను అందించిన మనీషా ఫిల్మ్స్ కూడ తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక స్వచ్ఛమైన అధ్యాయంగా మిగిలిపోతుంది. ఆ సంస్థ నిర్మించిన చిత్రాల ఘన విజయం వెనుక దర్శకుడు ఎస్వీ. కృష్ణారెడ్డి గారి ప్రతిభ, కృషి అనన్యం అన్న విషయం అందరూ అంగీకరిస్తారు. 'రాజేంద్రుడు-గజేంద్రుడు' తో మొదలుపెట్టి ఇటీవల విడుదలైన 'మస్త్' వరకూ కృష్ణారెడ్డిగారి దర్శకత్వంలో విడుదలైన చిత్రాలలో 'మాయలోడు' , 'యమలీల',' నెంబర్ 1', ' ఎగిరే పావురమా',' శుభలగ్నం', 'పెళ్ళాం ఊరెళితే'..లాంటి అనేక విశేష ప్రజాదరణ పొందిన చిత్రాలు ఉన్నాయి. ప్రభుత్వ అవార్డులు పొందిన చిత్రాలు కూడా ఇందులో ఉండడం గమనార్హం. ఈ చిత్రాల విజయ సారథి శ్రీ ఎస్వీ.కృష్ణారెడ్డి గారి మొదటి సినిమా విశేషాలు ఈ నెల 'కౌముది'లో మీకోసం ప్రత్యేకం.



**నా పూర్తి పేరు సత్తి వెంకట కృష్ణారెడ్డి.** నేను పుట్టిందీ, ఊహ వచ్చే వరకూ పెరిగిందీ తూర్పుగోదావరి జిల్లా , బిక్కవోలు మండలంలో అనపర్తి దగ్గరనున్న ఒక పల్లెటూరు. నాన్నగారు వెంకటరెడ్డి, అమ్మగారు సుబ్బాయమ్మ. నాన్నగారు ఆ వూళ్ళో వ్యవసాయంతో బాటుగా చిన్న చిన్న వ్యాపారాలు కూడ చేస్తుండేవారు. నేను హైస్కూలు రోజులకి వచ్చేసరికి మా ఫేమిలీ అంతా తణుకు దగ్గరలో నున్న ఆరవల్లి అనే వూరికి వెళ్ళిపోయాము. నాన్నగారు అక్కడ స్వీట్ షాప్ ఒకటి మొదలుపెట్టారు. నా హైస్కూలు విద్యాభ్యాసం అంతా ఆ వూళ్ళోనే జరిగింది.

అక్కడి నుంచీ పి.యు.సి., బి.కామ్, ఎమ్.కామ్ అన్నీ భీమవరంలోని డి.ఎన్.ఆర్ కాలేజీలో పూర్తి చేశాను. నాది పి.యు.సి చివరి బాచ్. ఆ కాలేజీలో ఎమ్.కామ్ మొట్టమొదటి బాచ్ కూడా మాదే. హైస్కూలు రోజులనుంచీ కూడా సినిమాలు చూడ్డం, వాటి గురించే ఆలోచించడం.. ఇదే ప్రపంచంగా వుండేది. నా చదువంతా సినిమాలే పెద బాలశిక్ష అన్నట్లు సాగింది. ఎప్పటికైనా సినిమా హీరో కావాలనే ఒకే ఒక్క ధ్యేయంతో నా విద్యార్థి లైఫంతా గడించింది. రిలీజైన సినిమా ప్రతిదీ చూడడం, ఎవరు కనిపిస్తే వాళ్ళతో ఆ సినిమాలోని బాగోగుల గురించి చర్చించడం..ఇదే కాలక్షేపంగా పెరిగాను. కాలేజీలో ఉండగా నాటకాలు చూసేవాడిని కానీ ఎప్పుడు వాటిల్లో పాల్గొనలేదు. ఏ నాటకం చూసినా 'ఫలానా సినిమా లెవెల్లో లేదే' అనుకుంటూ ఉండేవాడిని. ఎప్పటికో అంత లెవెల్ ఉన్న నాటక సమాజాలని చూడడం సంభవించినపుడు వాళ్ళు నాకు వేషం ఇచ్చే స్థితిలో ఉండేవారు కాదు. ఆ విధంగా కాలేజీ జీవితం అయ్యేసరికి కేవలం సినిమాలు చూసిన నాలెడ్జే తప్ప రంగస్థల అనుభవం ఏమీ సంపాదించుకోలేదు.

ఇంక డిగ్రీ ఐపోగానే ఎప్పటినుంచో ప్లాన్ చేసుకున్నట్లే సినిమా అవకాశాల కోసమని మద్రాసు వెళ్ళిపోయాను.

సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నించి, ప్రయత్నించి..అవకాశాలు రాక మన కోసం మనమే ఒక సినిమా నిర్మించుకుంటే

బావుటుంది కదా అన్న ఆలోచన వచ్చింది. మా అన్నయ్య మిత్రులు కొంతమందిమి కల్సి అందరూ కొత్త నటీనటులు, కొత్త సాంకేతిక నిపుణులతో 'పగడాల పడవ' అనే సినిమా నిర్మించాము. అందులో నాది ప్రధాన పాత్ర అని వేరే చెప్పనవసరం లేదు కదా. ఆ సినిమా నిర్మాణం పూర్తి అయి, విడుదలకోసం సర్వ ప్రయత్నాలూ చేసి విఫలమైనప్పుడు తెలిసింది - చిత్రసీమలో నేర్చుకోవాల్సింది చాలా ఉంది... మేమింకా చాలా ప్రాథమిక దశలోనే ఉన్నాము అని.



మద్రాసులోనే ఉండి విఫల యత్నాలు చెయ్యడం కంటే కొన్ని రోజులు శిక్షణపొంది మళ్ళీ ఫీల్డ్‌లోకి రావడం మంచిదనిపించి హైదరాబాదు వచ్చేసాను. అప్పుడే చిన్నప్పటినుంచీ ఆరవల్లిలో నా మిత్రుడైన అచ్చిరెడ్డి కూడ నాతో కలిసాడు. మిగతా ప్రయత్నాలు చేస్తూనే జీవనం గడవడానికి ఏదైనా చెయ్యాలి కాబట్టి, నాన్నవద్ద పరిశీలించిన స్వీట్స్ బిజినెస్ చేద్దామని ప్రణాళిక వేసుకున్నాం. అందులోకూడా ముందుగా కొంత శిక్షణ తీసుకుని హైదరాబాదులోనే స్వీట్స్ బిజినెస్ మొదలు పెట్టాం. 'ఇరానీ హోటల్స్ లో ఆంధ్రా స్వీట్స్' అనేది మేము మొదలు పెట్టిన సరికొత్త కాన్సెప్ట్. బాగా క్లిక్ అయింది. తర్వాత టీ-పొడి, చిన్నపిల్లలు తినే గోల్డ్ ఫింగర్స్ తయారీ..అన్నీ బాగా కలిసొచ్చాయి. ఆదాయం పెరిగింది కానీ మా సినిమా ప్రోజెక్టుకి తగినంత కాదు.

ఇది ఒక పక్కన నడుస్తుండగా నటరాజ రామకృష్ణ గారి వద్ద ఉదయం రెండు గంటలూ, సాయంకాలం రెండు గంటలూ డాన్సు క్లాసులకి వెళ్ళేవాడిని. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. డాన్సులో కూడా అనుభవం రావడంతో నటనలో నాకే ఈజ్ కనిపించింది. మళ్ళీ మద్రాసు వెళ్ళాను. సరికొత్త ప్రయత్నాలు ప్రారంభించాను. ఏ నిర్మాణ సంస్థ ఆఫీసుకి వెళ్ళినా 'ఇదిగో చూద్దాం..','అదిగో చూద్దాం..' అనే వాళ్ళే తప్ప సానుకూలంగా ఎవరూ స్పందించలేదు. ఒకటీ అరా సినిమాల్లో ఏమాత్రం ప్రాధాన్యత లేని అవకాశాలు వచ్చాయి. ఎవరైనా కానీ అడగగానే ఎందుకు అవకాశం ఇచ్చేవారు కాదో , నేను దర్శకుడిని అయ్యాక తెలిసి వచ్చింది. వాళ్ళు తీసే సినిమాలో మనకి సరిపోయే పాత్ర ఉండాలి. సరిపోయే పాత్ర ఉన్నా మనతో పోటీ పడేవాళ్ళని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ఇవేమీ లేకుండా 'అవకాశం కావాలి..కావాలి' అంటే ఎవరైనా ఎలా ఇస్తారు? ఈ వాస్తవం అప్పట్లో తెలీదు కదా.



అలా ప్రయత్నాలు చేస్తూనే హైదరాబాదులో ఉన్న అచ్చిరెడ్డి తో మాట్లాడుతుండే వాడిని. ఇద్దరం కలిసి డబ్బింగ్ సినిమాలు చేస్తే ఎలా ఉంటుందీ అన్న ఆలోచన వచ్చింది. చాలా సంవత్సరాల క్రిందట విడుదలైన 'సర్వర్ సుందరం' సినిమాకి డబ్బింగ్ హక్కులు కొన్నాం. నిజానికి అది డబ్బింగ్ సినిమాగా అంతకు చాలా సంవత్సరాల క్రిందట రిలీజైంది కానీ ఆడియో పూర్తిగా చెడిపోయింది. ఆ ఆడియో రిపేర్ చేసి 'సర్వర్ సుందరం' సినిమాని విడుదల చేసాం. బాగానే పోయింది. అదే వూపులో 'సూర్య ది గ్రేట్', 'దర్యాప్తు' అనే సినిమాలని కూడా డబ్బింగ్ చేసి రిలీజ్ చేసాం. మాకు మనీషా వీడియో కిషోర్ రాఠీ గారు భాగస్వామి గానే కాక పెద్ద అండగా వుండేవారు. ఆయనకి కోఠీలో మనీషా వీడియో బిజినెస్ కూడా ఉండేది. ఆ కార్యక్రమాల్లో కూడా నేనూ, అచ్చిరెడ్డి పాలుపంచుకుంటుండేవాళ్ళం.

ఆ రోజుల్లోనే వి.సి.ఆర్‌లు, వీడియో కేసెట్‌లు వాడకం పెరిగింది. కిషోర్ రాఠీ గారితో కలిసి సినిమా వీడియో హక్కులు తీసుకోవడం, వాటిని కేసెట్లుగా మార్కెట్లోకి విడుదల చెయ్యడం చేసేవాళ్ళం. అలానే టి.వి.ల్లో ప్రసారమయ్యే చలనచిత్ర కార్యక్రమాలకి నిర్మాతలకీ, దూరదర్శన్ వాళ్ళకీ మధ్య వర్తులుగా కూడా వ్యవహరించేవాళ్ళం.

అప్పటికి ఇంకా చిత్రపరిశ్రమ అంతా మద్రాసులోనే ఉండేది. అందుకే నేను ఎక్కువకాలం మద్రాసులోనే ఉండేవాడిని. ఈ

సినిమాలూ, వీడియోల అనుభవంతో మేమే సొంతంగా సినిమా నిర్మిస్తే ఎలా ఉంటుందీ అనే ఆలోచనవచ్చింది. దాని ప్రతిరూపమే 'కొబ్బరి బొండాం'. నేను ఆ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం సమకూర్చాను. క్రమబద్ధమైన ప్రణాళిక, నిజాయితీ గల నిర్మాణం, ఏమాత్రం అశ్లీలం జోలికి పోకుండా కేవలం వినోదాన్నే నమ్ముకోవడం..అన్నీ కలిసి వచ్చి సినిమా హిట్ అయింది. అది చిత్రపరిశ్రమలో మాకు పెద్ద పునాది రాయి అయింది.

ఆ సినిమాకి నేను చాలా చేసినా అంతా తెరవెనుకాలే. అయితే సినిమా హీరోని కావాలన్న కోరిక మాత్రం అలానే ఉండిపోయింది. అందుకనే 'కొబ్బరి బొండాం' పూర్తవగానే నేనూ, మరొక తమిళ కుర్రాడు హీరోలుగా ఒక కథ తయారు చేసుకున్నాను. నా సంగీత దర్శకత్వంలో పాటలు కూడా రికార్డు చేసుకున్నాం. అప్పుడు దర్శకుడికోసం వెదకడం మొదలు పెట్టాము. మేము కొత్తవాళ్ళం కాబట్టి ఎవరైనా అనుభవం ఉన్న దర్శకులైతే బావుంటుందని ప్రయత్నాలు చేసాం. ఎవరో ఒకర్ని కలవడం.. వాళ్ళు కథలో మార్పులు చేర్పులు సూచించడం..మరొకర్నికలిస్తే మరికొన్ని మార్పులు చెయ్యమనడం..మేమేమో అప్పటికే పాటలు కూడా రికార్డింగ్ చేసుకుని ఉండడం..అంతా గందరగోళంగా అనిపించింది. నేను హీరో వేషాలే అని పట్టుకు కూర్చుంటే కెరీర్ ముందుకి సాగేట్లు లేదు కాబట్టి సినిమా నిర్మాణాన్ని ముందుకి తీసుకెళ్దామని అచ్చిరెడ్డి, నేనూ నిర్ణయించుకున్నాం.




అప్పుడు అచ్చిరెడ్డే అన్నారు " కొబ్బరి బొండాం సినిమాకి కథ నువ్వే చేశావు.. స్క్రీన్ ప్లే వ్రాసేప్పుడు ఇతరులకి చెప్పేటప్పుడు చాలా క్లారిటీ ఉంది నీలో, నువ్వే దర్శకత్వం వైపు ఎందుకు రాకూడదూ?" అని. ఆలోచించిన మీదట దర్శకత్వం వైపు కెరీర్ మళ్ళించడమే మంచిదనిపించింది నాకు కూడా. అప్పుడు తయారు చేసుకున్నదే 'రాజేంద్రుడు-గజేంద్రుడు' కథ. అప్పట్లో కేవలం చిన్నప్ప దేవర్ గారు తప్ప ఏనుగు లాంటి భారీ జంతువులతో సినిమాలు ఎవరూ నిర్మించడం లేదు. ఐనా కథ మీద ఉన్న నమ్మకంతో ఏనుగు కూడా ఒక ముఖ్యపాత్రగా ముందుకి వెళ్ళాం. మిగతా జంతువులలాగా ఏనుగు అన్ని పనులూ చెయ్యలేదు. మేము వెళ్ళి ఏనుగుకి కథ చెప్పి ఒప్పించే పరిస్థితి లేదు కాబట్టి ఏనుగు చెయ్యగల పనులకి అనుగుణంగా కొన్ని దృశ్యాలని అల్లుకోవడం జరిగింది. ఈ అనుభవం తరువాత తరువాత చాలా ఉపయోగపడింది. నటీనటులకి తగినట్లుగా స్క్రిప్టులో మార్పులు చేసి చాలా సార్లు మంచి ఫలితాలని రాబట్టుకున్నాం.

'కొబ్బరి బొండాం' సినిమా నిర్మాణ విషయంలో ఉన్న అనుభవం కారణంగా 'రాజేంద్రుడు-గజేంద్రుడు' విషయంలో ఏమాత్రం కన్‌ఫ్యూజన్ రాలేదు. మొట్టమొదటి షాట్ రాజేంద్రప్రసాద్ గారు, ఏనుగుల మీద తీసిన వద్దనుంచీ సినిమా నిర్మాణం పూర్తయే వరకూ అనుకున్న విధంగా పూర్తిచేసాము. విడుదలైన మొదటి రోజు , మొదటి ఆట అవగానే సినిమా విజయం ఖాయమైపోయింది. ప్రేక్షకులు కూడా ఎవరీ కొత్త దర్శకుడు అని ఆసక్తి చూపించారు. ఆ అసక్తే మీ అందరి ఆదరాభిమానాలు, ఆశీస్సులుగా మారి ఆంధ్రప్రేక్షకుల్లో నాకొక ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. అందుకు మీకు సర్వదా కృతజ్ఞుడ్ని.

(జూలై 2009 సంచికలో ప్రచురితం)

# వెంకట్ కూచిపూడి

**చిన్నప్పటి నుంచీ** రహదారులే తప్ప అడ్డుగోడలు చూడని మనస్తత్వం, అనుకున్నది సాధించే పట్టుదల, సొంత వ్యక్తిత్వం.. - ఈ లక్షణాలే ఆయన్ని తన మొదటి సినిమాకి, అంతకు ముందెక్కడా దర్శకత్వ శాఖలో పనిచేయకుండానే, సొంతంగా దర్శకత్వం వహించే ధైర్యాన్నీ, శక్తినీ ఇచ్చాయి. ఆసక్తికరంగా ఆయన మొదటి సినిమా పేరు కూడా 'మొదటిసినిమా'నే. అదీ, తరువాత ఆయన దర్శకత్వంలో రూపొందిన జాన్ అప్పారావు - రెండూ ప్రేక్షకాదరణకు అంతగా నోచుకోలేకపోయినా అధైర్యపడకుండా ఉత్సాహంతో ముందడుగు వేస్తున్న యువదర్శకుడు కూచిపూడి వెంకట్ గారి అనుభవాలూ, జ్ఞాపకాలూ ఈ నెల మీకోసం ప్రత్యేకం..



మా స్వగ్రామం రాజమండ్రికి దగ్గరలోని రఘుదేవపురం. నాన్నగారు కూచిపూడి కేశవరావు గారు, అమ్మ లక్ష్మీకాంతమ్మ. నా ఊహ తెలిసినప్పటి నుంచి మాది ఉన్నత తరగతి కుటుంబమే. నాన్నగారు వ్యసాయం, ఫైనాన్స్ వ్యాపారాల్లో ఉండేవారు. ప్రవృత్తి రాజకీయాలు. ఇప్పుడు నేను సినిమానే సర్వస్వం అన్నట్లు ఎలా ఉంటున్నానో, నాన్నగారు బ్రతికినంత కాలం రాజకీయాలే జీవితం అన్నట్లుగా గడిపారు. మా వూరికి దాదాపు 30 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేసారు. ఎప్పటికైనా ఎమ్.ఎల్.ఎ కావాలనేది నాన్నగారి జీవితాశయం. నేను మా కుటుంబంలో ఆఖరి వాడిని. అన్నయ్య, అక్క ఉన్నారు. అక్క నాకంటే ఒక సంవత్సరం మాత్రమే పెద్దది. అన్నయ్య ప్రస్తుతం న్యూయార్క్ లో సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతున్నారు. అక్క కూడా రాజకీయాల్లోనే ఉంది. 2004 ఎన్నికల్లో నాన్నగారు, అక్కయ్య ఇద్దరూ మా నియోజకవర్గం ఎం.ఎల్.ఎ సీటుకోసం ప్రయత్నించారు. అక్కయ్యకి సీటు వచ్చింది కానీ ఎన్నికల్లో 1400 ఓట్ల తేడాతో ఓడిపోయింది. (ప్రస్తుతం మా బావగారు అక్కడే, రాజానగరం నియోజకవర్గం, తెలుగుదేశం ఎం.ఎల్.ఎ గా గెలిచారు). ఈ సంఘటన తర్వాత, రెండేళ్ళ క్రిందట, మా వూరి సర్పంచ్‌గా కూడా కేవలం 50 ఓట్ల తేడాతో నాన్నగారు ఓడిపోయారు. 30 యేళ్ళ రాజకీయ జీవితంలో అదే ఆయన మొదటి ఓటమి. దానితో ఆయనకి గుండెపోటు వచ్చి, ఓటమి పాలైన వారానికే ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు. (నా 'మొదటి సినిమా' మొదటిసారిగా టి.వి.ఛానెల్‌లో ప్రసారం మొదలైన అరగంటకి నాన్నగారు హాస్పిటల్లో తుదిశ్వాస విడిచారు).

నా బాల్యం నుంచీ కూడా దొరబాబులానే పెరిగాను. దేనికీ ఇబ్బంది లేదు, ఏదీ వెదుక్కోవాల్సిన అవసరం లేదు. నాన్నగారు వ్యసాయం, వ్యాపారం, రాజకీయాల్లో బిజీగా ఉండడం, మాది పల్లెటూరు అవడంతో తాతగారు మా ముగ్గురినీ చదువులకోసం బోర్డింగ్ స్కూళ్ళకే పంపించారు. అక్క ఏలూరు సెయింట్ థెరిసాలో చేరితే, అన్నయ్యనీ నన్నూ గుంటూరు దగ్గరలోని లయోలా పబ్లిక్ స్కూల్లో చేర్పించారు. నా నాలుగో పుట్టిన రోజుని పబ్లిక్ స్కూల్లోనే జరుపుకున్నాను. నాలుగో సంవత్సరం వయసునుంచీ 15 సంవత్సరం

వచ్చేవరకూ ఎల్.పి.ఎస్ లోనే ఉన్నాను. అంత చిన్న వయసునుంచే ఒక్కడినే బయట ఉండడం, స్కూల్లోని సంఘటనలూ, దృఢమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడంలో చాలా ఉపయోగపడ్డాయి. అందువల్లనే ఏ విషయంలోనూ ఊగిసలాట లేకపోవడం, సాహసాలకు వెనుకంజవేయకపోవడం..లాంటి గుణాలన్నీ అలవడ్డాయి.

స్కూల్లో పెద్ద తెలివైన స్టూడెంట్ నేమీ కాదు. చదువుల్లోనూ, ఆటల్లోనూ కూడా చురుకుగా ఉండేవాడిని కాదు. ఎలాగోలా పై తరగతికి చేరుకునేవాడిని. చాలా వరకూ నావి కండిషనల్ ప్రమోషన్సే. క్రమశిక్షణకి మారుపేరైన ఆ బోర్డింగ్ స్కూల్లో పెరిగినా, చాలా చిన్న వయసునుంచే సినిమాలంటే ఎక్కడలేని ఇంట్రెస్టూ మొదలైంది. మా మేనమామగారు సత్యచిత్ర నిర్మాతల్లో ఒకరైన నెక్కంటి సత్యనారాయణ. ఆయన తీసిన రెండో సినిమా 'ప్రేమబంధం' కె.విశ్వనాథ్ గారి దర్శకత్వంలో 1975లో షూటింగ్ జరుగుతుంటే మొదటిసారి వెళ్ళాను. నాకప్పటికి 5 సంవత్సరాల వయసు. అదే నేను చూసిన మొదటి సినిమా షూటింగ్. ఏమీ తెలియని అప్పుడే సినిమాలంటే ఒక విధమైన ఎట్రాక్షన్ మొదలైంది. నాకు 7 సంవత్సరాల వయసులో మామయ్య 'అడవిరాముడు' సినిమా తీశారు. శెలవల్లో ఇంటికి వచ్చినప్పుడల్లా మావయ్యతో కలిసి మద్రాసు కూడా వెళ్ళేవాడిని. అలా వెళ్ళినప్పుడే ఒక సారి 'మహాన్' (తెలుగులో కుమార రాజా) షూటింగ్‌లో అమితాబ్ బచ్చన్ గారిని కలుసుకున్నాను. అదో మరువలేని జ్ఞాపకం. చిన్నపిల్లవాడినని అందరూ నన్ను ఏడిపిస్తుంటే ఆయన దగ్గరకు తీసుకుని ఓదార్చేవారు. ఈ సంఘటన అలా మనసులో ముద్రించుకుని పోయింది.

మా స్కూల్లో దాదాపు ఒక వందమంది డే-స్కాలర్స్ ఉండేవాళ్ళు. వాళ్ళలో కొంతమందికి లంచం ఇచ్చి బయటినుంచీ జ్యోతిచిత్ర, సితార లాంటి సినిమాపత్రికలు దొంగతనంగా తెప్పించుకునే వాడిని. ఎప్పుడైనా పట్టుబడి ఉంటే పరిణామం తీవ్రంగా ఉండి ఉండేది. కానీ ఎప్పుడు దొరక్కుండా మేనేజ్ చేసే వాడిని. మిగతా పిల్లలుకూడా నా రూముకి వచ్చి దొంగతనంగా ఈ పత్రికలన్ని చదివేవాళ్ళు. పది-పదకొండేళ్ళ వయసుకే తెలుగు సినిమా విశేషాలన్నింటినీ ఔపోసన పట్టేశాను. అర్థరాత్రి నిద్రలేపి అడిగినా ఏ సినిమాలో ఎవరున్నారు, సాంకేతిక నిపుణులు ఎవరు, ఎక్కడ ఎప్పుడు ఏ షూటింగ్ జరుతుందీ...లాంటి వివరాలన్నింటినీ చెప్పగలిగే కెపాసిటీ ఉండేది.

శెలవులకి ఇంటికి వదిలినప్పుడు అన్నయ్యా, నేనూ ఇద్దరమే కలిసి వెళ్ళేవాళ్ళం. మమ్మల్ని తీసుకెళ్ళేందుకు ఇంటివద్దనుంచీ ఎవరూ వచ్చేవాళ్ళు కాదు. మధ్యాహ్నం స్కూలు నుంచీ వదిలితే మేమిద్దరం కలిసి గుంటూరు సెంట్రల్ కేఫ్ హోటల్‌కి వెళ్ళిపోయి, పెట్టెలు అక్కడ పెట్టేసి మాట్నీ, మొదటి ఆట , రెండో ఆట చూసి హోటల్లో పడుకుని, పొద్దున్నే లేచి బస్సెక్కి ఇంటికి వెళ్ళేవాళ్ళం. ఆ రోజే శెలవులిచ్చారని ఇంట్లో చెప్పి నమ్మించేవాళ్ళం. అన్నయ్యకి సినిమాలంటే పెద్ద ఆసక్తి లేకపోయినా నాకోసం వచ్చేవాడు. అప్పుడు చిరంజీవే మాకు సర్వస్వం. ఆయన సినిమాలన్నీ ఏదీ వదలకుండా చూసేవాళ్ళం .

1979-80 ప్రాంతాల్లో మావూళ్ళో 'శంకరాభరణం' షూటింగ్ జరిగింది. అందులో శంకరశాస్త్రిని ఎగతాళి చేస్తూ జిత్ మోహన్ మిత్రా వాళ్ళు అరుపులు కేకలతో ఇంగ్లీషు పాట పాడతారే. ఆ ఇల్లు మాదే! మామయ్య అప్పటికే పెద్ద నిర్మాత అవడంవల్ల, ఆయన బావమరిది కాబట్టి నాన్నగారికి కూడా సినిమా వాళ్ళతో పరిచయాలు బాగానే ఉండేవి.. ఆ విధంగా 'శంకరాభరణం' షూటింగ్ మరింత క్లోజ్‌గా పరిశీలించే అవకాశం వచ్చింది. అప్పటికే సినిమా పత్రికా మధనం వల్ల వచ్చిన పరిజ్ఞానంతో, యూనిట్‌లో వాళ్ళందరినీ ఇట్టే గుర్తుపట్టగలిగాను. ఖాకీ దుస్తుల్లో ఉన్న విశ్వనాథ్ గారు, బకెట్ కేప్‌తో ఉన్న కెమేరా మేన్ బాలు మహేంద్రగారు, అసిస్టెంట్ డైరెక్టర్ వంశీ గారు..అందర్నీ చూస్తుంటే వాళ్ళంతా సినిమా పత్రికల్లో నుంచీ డైరెక్టుగా మా ఇంటికి నడిచొచ్చినట్లు అనిపించేది..! ఆ షూటింగ్ చూసిన

వద్దనుంచే, పెద్దయ్యాక సొంతంగా డబ్బులు సంపాదించి సినిమాలు తియ్యాలని ఉండేది. దర్శకత్వం అనుకునేవాడ్ని కాదు. నిర్మాతగా ఫ్యూచర్ చూసుకోవాలనిపించేది.



సినిమా ఆకర్షణ ఇలా వుంటే - మరో వైపు నా స్కూలు జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు నన్ను ఎలా మార్చాయో చెప్పాలిక్కడ.

చిన్నప్పటినుంచీ వెనుక బెంచీలోనే ఉండేవాడిని. అన్నయ్య మాత్రం స్పోర్ట్స్‌లో ముందు ఉండేవాడు. స్కూలు హౌజ్ కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. మంచి మంచి ఫేషన్ షర్టులు, లేటెస్ట్ హెయిర్ స్టైయిల్స్‌తో ఎవర్ గ్రీన్ అన్నట్లుండేవాడు.. నా షాబీ అవతారం చూసి నన్ను దగ్గరకి చేరనిచ్చేవాడు కాదు. స్కూల్లో చివరి సంవత్సరాల్లో యాజమాన్యానికి వ్యతిరేకంగా జరిగిన కొన్ని సంఘటనల్లో అన్నయ్య అచ్యుత్ ప్రముఖ పాత్ర పోషించాడు. మేనేజ్మెంట్‌కి ఇబ్బంది కలిగించే పని ఏమైనా జరిగిందంటే అచ్యుత్ దాని వెనకాల ఉండేవాడు. అలా తన చదువు 1982లో పూర్తి చేసుకుని స్కూలు నుంచీ బయటికి వెళ్ళాడు అన్నయ్య. అప్పుడు మొదలైంది అసలు కథ. తను వెళ్ళిపోయాక కూడా ఎక్కడ ఏ గొడవ జరిగినా నన్ను ఇరికించేవాళ్ళు. నాకు సంబంధం లేదని చెప్పినా వినేవాళ్ళు కాదు..'అచ్యుత్ తమ్ముడు..వీడికి ఇందులో పార్టు ఉండి ఉంటుంది' అనే వాళ్ళు. కొన్ని రోజులకి అనిపించింది 'ఏమీ చెయ్యకపోయినా పనిష్ చేస్తున్నారు. సరే..నేనూ గ్రూప్‌ని కూడగడితే తప్పేముంది అని. అంతే.. అక్కడినుంచీ బేక్ బెంచీ జీవితం చిన్న స్టూడెంట్ ప్రైవేట్ లీడర్ కేడర్‌కి వచ్చింది. అన్నీ యాంటీ మేనెజ్‌మెంట్ పనులే. ఎక్కడైనా అడ్డుగోడ ఎదురైందా, దాన్ని ఎలా అధిగమించాలో నేర్చుకుని దాటుకుని వెళ్ళడమే. ఇదే మెంటాలిటీ ఇప్పటివరకూ నాతో వస్తోంది. నాతో ఎన్ని ప్రయోగాలైనా చేయిస్తోంది.

ఎనిమిదో తరగతి ఫెయిల్ చేసేశారు. అప్పుడు మొదటిసారిగా నాన్న స్కూలుకి వచ్చి కోప్పడ్డారు. ఫ్రెండ్స్ అంతా తొమ్మిదో క్లాసుకి వెళితే నేను 8లోనే ఉండి పోయాను. నెక్స్ట్ ఇయర్.. మళ్ళీ తప్పించారు. రెండేళ్ళు 8వ తరగతి చదివినా ముందుకి వెళ్ళలేదన్న మాట. ఇంక అక్కడ చదవడం అసాధ్యమనుకుని నాన్న ఇంటికి తీసుకెళ్ళిపోయారు. ఏం చెయ్యాలి? నా క్లాస్ మేట్స్ అంతా టెన్త్‌క్లాసులో ఉన్నారు. నాకు మిగిలింది మెట్రిక్‌లో చేరి వాళ్ళని అందుకోవడమే. అప్పటికే మా పెదనాన్నగారు వీర్రాజు, విదేశాల నుంచీ తిరిగివచ్చి రాజమండ్రిలో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తుండేవారు. కొన్ని సినిమా హాళ్ళకి ఓనర్ కూడా. అక్కడైతే మెట్రిక్ కోచింగ్ వుంటుందని నన్ను రాజమండ్రిలో పెదనాన్న గారింటికి పంపించారు. అక్కడా మెట్రిక్ కోచింగ్ సెంటర్‌లో చేరిన మొదటి రోజునుంచే ఆ ప్రిన్సిపాల్‌తో గొడవలు.. మెట్రిక్ కోచింగ్ సరిగా సాగలేదు. గాంగ్ లీడర్‌లా ఉండేవాడిని. టీచర్లని ఏడిపించడం, నేను చెబితేనే క్లాసులు జరగడం..ఇలా సాగడంతో మెట్రిక్ కెమిస్ట్రీలో తప్పాను...సో.. ఏమి చెయ్యాలి? అప్పటికే అన్నయ్య విశాఖపట్నంలో చదువుకుంటున్నాడు. సరే తన దగ్గర ఉండి ఆ సబ్జెక్టు ఒక్కటీ పూర్తి చేస్తానని నాన్నని ఒప్పించి విశాఖపట్నం వెళ్ళాను. అక్కడ మిత్రులు బాగా పెరిగారు. అపరిమితమైన స్వేచ్ఛ. షరా మామూలే అన్నట్లు అక్టోబర్ పరీక్షలో కూడా పాస్ కాలేదు. కానీ అలాగని ఇంట్లో చెప్పలేను. ఎలానూ మరుసటి సంవత్సరం కాలేజీలు తెరిచేదాకా ఈ విషయం బయటపడదు కాబట్టి అన్నీ పాసైపోయానని ఇంట్లో చెప్పేసాను.

మరి వాళ్ళ దృష్టిలో మెట్రిక్ ఐపోయింది.. మార్చి వరకూ కాలేజీలు తెరవరు కాబట్టి, అప్పటి వరకూ ఏం చెయ్యాలి? అప్పటికే విశాఖపట్నంలో ఒక మిత్రుడిని క్లోజ్ గా పరిశీలించాను. తనపేరు రామ్‌దేవ్. (ప్రస్తుతం యునిక్ ఇన్‌ఫ్లేటబుల్స్ యజమాని) విభిన్న తరహా వ్యాపారాలు చేస్తుండేవాడు. ఆ ఇన్స్పిరేషన్‌తో నేను కూడా ఏదైనా బిజినెస్ చేసి, డబ్బులు సంపాదించి, సొంతంగా సినిమా తియ్యాలని ఉండేది. రోజూ పొద్దున్నే లేచి పోకెట్ మనీ 200రూపాయలు తీసుకుని రాజమండ్రి వెళ్ళేవాడిని. పెదనాన్న గారి సినిమా హాళ్ళలో టిక్కెట్లు అమ్మే విధానం, డైలీ కలెక్షన్ రిపోర్టులు వ్రాయడం, సర్వీసు పుస్తకాలు మెయింటెయిన్ చెయ్యడం ఇవన్నీ క్షుణ్ణంగా పరిశీలించేవాడిని. అనుకున్నట్లు బాగా డబ్బులొచ్చే వ్యాపారాలేవీ ఎదురుపడలేదు, ఆ వయసులో!

అలా మార్చి వరకూ గడిపి ఏదో వంక పెట్టుకుని మార్చిలో వైజాగ్ వెళ్ళి మిగిలిన పరీక్ష ఒకటీ వ్రాశాను. ఎలాగైతే ఈ సారి పాసయ్యాను. మెట్రిక్ గట్టెక్కింది. అప్పటికే ఇంట్లో నేనే టర్న్ డిక్టేట్ చేసే స్థాయికి వచ్చాను. నా అత్తెసరు మెట్రిక్‌కి ఆంధ్రాలో ఏ కాలేజీలోనూ సీటు రాదు. పైగా మద్రాసు అంటే సినిమా గ్లామరూ..ఎట్రాక్షనూ! మద్రాసు వెళ్ళి హయ్యర్ సెకండరీ చదువుతానని ఇంట్లో అనుమతి తీసుకున్నాను.

టి.నగర్, గిరి రోడ్‌లో వెంకట సుబ్బారావు హయ్యర్ సెకండరీ అనే స్కూల్లో ఎలానో సీటు సంపాదించి అక్కడ చేరిపోయాను. అక్కడా సేమ్ ట్రెండ్ కొనసాగింది. 15 మందితో హాస్టల్ నడిచేది. గోడ దూకి సినిమాలకి వెళ్ళేవాళ్ళం. దొరికినప్పుడు ఎదిరించే వాళ్ళం. నాతో వచ్చే తలనొప్పుల్ని భరించడం మేనేజ్‌మెంట్‌కి పెద్ద ఛాలెంజ్‌గా ఉండేది. హాస్టల్లో ఉన్న 15 మందినీ బయటికి తీసుకెళ్ళిపోయాను. దాంతో వాళ్ళ హాస్టల్ మూతబడింది. సహజంగానే మొదటి సంవత్సరం నన్ను ప్రమోట్ చెయ్యలేదు. ప్రిన్సిపాల్ భార్య, హాస్టల్ వార్డెన్ అంది 'బాబూ.. మొదటి రోజు నిన్ను చూసినప్పుడే నాకు ఏమాత్రం మంచి అభిప్రాయం కలగలేదు. అది నిజమని ఇప్పుడు నిరూపించావు' అని.! ఇంక రెండో సంవత్సరం కాలేజీకి రానివ్వలేదు. సరే..ఇంటిదగ్గర చెప్పకూడదు. బయట రూమ్‌లో ఉంటూ, లైఫ్ ఎంజాయ్ చేసేవాడిని. పొద్దున్నే పేపర్లు చదవడం, మెస్‌లో భోజనం, సినిమాలు, బాస్కెట్ బాల్..ఇలా సంవత్సరం గడిచింది. చివర్లో సరాసరి బోర్డుకి అప్లై చేసి, ప్రైవేట్ కాండిడేట్‌గా పరీక్షకి సిద్ధమయ్యాను. ఒక వారం రోజులు పాత సంవత్సరాల పరీక్ష పేపర్లన్నీ బట్టీ కొట్టి రాశాను. 75శాతం మార్కులతో పాసయ్యాను. అదో పెద్ద పాఠం..నెవర్ వర్క్ హార్డ్..వర్క్ స్మార్ట్ అని మనసులో ముద్రపడిపోయింది. రెండు సంవత్సరాలు ఎంజాయ్ చేసి, వారం చదువుతో 75 పర్సెంట్ తెచ్చుకున్నానలా..!!

ఇంక చదువు ఆపేసి పూనా ఫిల్మ్ కాలేజీకి వెళ్తానని ఇంట్లో చెప్పాను. "ఒక్క డిగ్రీ పూర్తి చెయ్యి చాలు..తర్వాత నువ్వు ఏమి చేసినా అడగను..' అని నాన్న కండిషన్ పెట్టారు. సరే అని డిగ్రీ కోసం హైదరాబాదు వచ్చాను. వివేకవర్ధని కాలేజీలో డిగ్రీలో చేరాను. మా అంకుల్ ఇంట్లో ఉండేవాడిని. ఆయన లికర్ బిజినెస్‌లో ఉండేవారు. కొత్త వూరు..కొత్త స్నేహితులు..కొత్త గాంగ్‌లు. మళ్ళీ పార్టీ టైమ్ మొదలు. కాలేజీలో మామూలే, నా అవకతవక ప్రశ్నలతో టీచర్లని ఆట పట్టించేవాడిని, క్లాసులు జరగనిచ్చేవాడిని కాదు. నేను క్లాసుకి రాని రోజు టీచర్లకి సెలబ్రేషన్ డే ..!

డిగ్రీ రెండో సంవత్సరంలోకి వచ్చే సరికి ఇండివిద్యుయాలిటీ మరింత పెరిగింది. మా అంకుల్ వాళ్ళ ఇంట్లోంచి బయటికి వచ్చేసి ఫ్రెండ్స్‌తో ఒక రూమ్ తీసుకున్నాను. చిన్నప్పుడెప్పుడో ఒక సారి మా వూళ్ళో క్రికెట్ పోటీలు జరిగినప్పుడు పక్క వూరు మిర్తిపాడు నుంచీ వచ్చిన టీమ్‌ని ఓడించాము. అందులో ఒకడే సమీర్ రెడ్డి (ప్రస్తుతం టాప్ రేటెడ్ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ). మళ్ళీ

పెద్దవాళ్ళమయ్యాక హైదరాబాదులో కలుసుకున్నాం. అప్పుడు తను తేజ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తనద్వారా కృష్ణవంశి పరిచయం. మా ముగ్గురితోపాటు రాము అనే ఇంకో స్నేహితుడు, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదువుతుండేవాడు. మేము నలుగురం కలిసి సారథి స్టూడియో వెనకాల వున్న కీర్తి ఎపార్ట్‌మెంట్స్‌లో ఒక రూము తీసుకున్నాం. ఇదంతా 1989-90 రోజుల్లో. హైదరాబాదు నిండా కజిన్స్, చుట్టాలూ, ఫ్రెండ్స్.. డిగ్రీ చివరి రెండు సంవత్సరాలూ ఎవర్ పార్టీయింగ్ అన్నట్లుగా గడిచిపోయాయి.



చిన్నప్పటినుంచీ సినిమాలు నిర్మించాలని ఉండేదని చెప్పాను కదా.. అయితే ఈ డిగ్రీ రోజుల్లోనే దృక్పథం మారింది. గీతాంజలి , శివ వగైరా సినిమాలు చూశాక , నిర్మాణం కాదు- దర్శకత్వం చెయ్యాలి ఎప్పటికైనా అని నిశ్చయించుకున్నాను.అప్పట్లోనే ఒక స్క్రిప్టు రాసుకున్నాను. దాని పేరు 'శతదినోత్సవం' ఇప్పటికీ అది బెస్ట్ స్క్రిప్ట్ అని గట్టి నమ్మకం ..(నేను సినిమా రంగం నుంచీ రిటైరైపోదామనుకున్నప్పుడు చివరి సినిమాగా దీన్ని తీస్తాను..). అప్పట్లో రామ్ గోపాల్ వర్మ గారంటే కొత్తగా దర్శకులు కావాలనుకునే వారికి గొప్ప ఆదర్శం. ఓరోజు రామ్ గోపాల్ వర్మ గారిని పరిచయం చెయ్యమని కృష్ణవంశిని అడిగాను. 'ఆయన వద్ద చేరాలంటే రికమండేషన్ అవసరం లేదు. సరాసరి వెళ్ళి అడగొచ్చు' అన్నాడుతను. సరే..ఒక సుముహూర్తాన డైరెక్ట్‌గా వెళ్ళి కలిశాను..'డైరెక్షన్ చెయ్యాలని ఉందా? కథ ఉందా నీ దగ్గర?' అని అడిగారు వర్మగారు. ఉందని చెప్పాను. 'ఐతే వెళ్ళిపోయి సినిమా మొదలు పెట్టుకో అన్నారు..'ఎందుకలా అన్నారో ఒక్క క్షణం తెలీలేదు. హేళనగా అన్నారా, సీరియస్‌గా అన్నారా అని కూడా ఆలోచించలేదు. 'అదేంటండీ.. ఎక్కడా నేర్చుకోకుండా డైరెక్షన్ ఎలా చేస్తాను..?' అన్నాను. ' సినిమా మొదలుపెడితే మిగతా విషయాలన్నీ అవే తెలుస్తాయి' అన్నారు. అంతే... ఎప్పటికైనా సొంతంగా నేనే దర్శకత్వం చెయ్యాలి. ఎక్కడా అసిస్టెంట్‌గా చెయ్యాల్సిన పనిలేదు అని, సీరియస్‌గానే తీసుకున్నాను..!

ఐతే సొంతంగా తియ్యాలంటే డబ్బులు సంపాదించాలి కాబట్టి ఏవైనా బిజినెస్‌లు చెయ్యాలి. ఇంటివద్ద నుంచీ డబ్బులు తీసుకోవడం ముందునుంచీ ఇష్టం లేదు. అప్పటి నుంచీ 2005లో నా 'మొదటి సినిమా' దర్శకత్వం వరకూ ఎన్నో రకాల వ్యాపారాలు చేసాను. మా అన్నయ్య క్లాస్‌మేట్స్, చిన్నప్పటినుంచీ స్నేహితులు.. లాంకో శ్రీధర్, మధు. మధు సలహా మీద, తను చూపించిన పరిచయాలతోటి విదేశాలకి తెలుగు సినిమాలు ఎగుమతి చేసే బిజినెస్‌లో దిగాను. అందులో బాగానే లాభాలు చూశాను. 95లో మిత్రులతో కలిసి New Sense అనే వీడియో ఆల్బమ్ విడుదల చెయ్యాలని ప్లాన్ చేశాను. నేనో రెండు పాటలు వ్రాసాను. సిరివెన్నెల గారితో కొన్ని పాటలు వ్రాయించాను. బ్రహ్మానందంగారితో ఒక పాట పాడించాను. అప్పుడు మొదలైన సిరివెన్నెల గారితో పరిచయం ఇప్పటికీ పచ్చగా వర్ధిల్లుతోంది. మొదటి పరిచయంతోనే నేనంటే ఆయనకి ఒక ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. నిజంగా అది నా అదృష్టం. ఆ వీడియోకి మార్కెట్లో చాలా మంచి ఆదరణ లభించింది. తద్వారా లభించిన ప్రోత్సాహంతో మిత్రులతో కలిసి ఎమ్మిఆడియో పేరుతో ఒక ఆడియో కంపెనీ పెట్టాను. అప్పటిలోని హిట్ సినిమాల ఆడియో హక్కులన్నీ మేమే కొనే వాళ్ళం. సినిమా వాళ్ళతో పరిచయాలు బాగా ఉండేవి, కొనసాగేవి.. ఐతే అందరికీ 'వెంకట్ బాగా వున్నవాడు. ఎప్పటికైనా సొంతంగా తనే సినిమా తీసేస్తాడు.

ఇతనికి ఎవరి దగ్గరా అసిస్టెంట్ చెయ్యాల్సిన అవసరం లేదు' అని అనుకుంటుండే వాళ్ళు.

అలాంటి స్వయం ప్రయత్నాల్లో భాగం గానే 'మేరేజ్ మార్కెట్'అని ఒక స్క్రిప్టు రాసి బాపు, రమణ గార్లని కలిశాను. నేను కలుసుకున్న మొదటి సినిమా రచయిత రమణ గారే. ఎందుకనో ఆ ప్రయత్నం ఫలించలేదు. 1997 ప్రాంతాల్లోనే చంద్రసిద్ధార్థ బ్రదర్ కృష్ణమోహన్ మంచి మిత్రుడయ్యాడు. అప్పుడతను టి.వి. ఎపిసోడ్స్ తీస్తున్నాడు. దానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ రచయిత, సునీల్ అందులో పాత్రధారి.. త్రివిక్రమ్‌తో పరిచయం ఏర్పడ్డాక సినిమా చేద్దామని స్క్రిప్టు వర్క్ మొదలుపెట్టాము. త్రివిక్రమే మొత్తం స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో సహా బౌండ్ స్క్రిప్టు సిద్ధం చేశాడు. జగపతి బాబుగారిని కలిశాము. వివిధ కారణాల వల్ల ఇదీ ముందుకి సాగలేదు. అదే సమయంలో లాంకో శ్రీధర్ సినిమా రంగంలోకి ప్రవేశిద్దామని నన్ను సంప్రదించాడు. అప్పటికే జయంత్ దగ్గర అసిస్టెంట్‌గా చేస్తున్న వి.ఎన్.ఆదిత్యని సునీల్, శ్రీధర్ కి పరిచయం చేశాడు. Steve Martin's Father of the Bride స్ఫూర్తితో మళ్ళీ కొత్త స్క్రిప్టుకి త్రివిక్రమ్‌తో సిటింగ్స్. బాగా వచ్చింది. సుమంత్ కోసమని ప్రయత్నించాం. ఐతే అప్పటికే సుమంత్, కరుణాకర్‌తో ఒక సినిమా చేస్తుండడంతో మా ప్రోజెక్టు ముందుకి సాగలేదు.

ఇలా రోజులు గడుస్తుండగా ఒక రోజు ఆంధ్రజ్యోతి నుంచీ మా ఆడియో కంపెనీకి వచ్చిన ఒక మార్కెటింగ్ ఆఫీసర్, మాటల మధ్యలో ఇంటర్నెట్ అనే కొత్త ప్రపంచం వచ్చేసిందనీ, దాని వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయనీ, సమాచారం ఎప్పటికప్పుడు దొరుకుతుందని చూపించాడు. ఒకసారి చూశాక ఇంటర్నెట్‌తో బిజినెస్ అవకాశాలు బావుంటాయని అనిపించింది. నా కస్సలు అప్పటికి కంప్యూటర్ పరిజ్ఞానం బొత్తిగా లేదు. ఐనా ఒక విజన్ తట్టింది. తెలుగు సినిమా విశేషాలు, పాటలూ అన్ని కలిపి సమగ్రమైన సైట్ పెట్టి దానికి ఇ-కామర్స్ కూడా జతచేస్తే బావుంటుందని అనుకున్నాను. నాకు అదంతా చేసే నాలెడ్జి లేదు కాబట్టి, కోడ్‌నెట్ అనే కంపెనీ మిత్రుల్ని సంప్రదించి, వాళ్ళ సహకారంతో టాలీవుడ్ మ్యూజిక్ డాట్ కామ్ అనే సైట్‌ని డెవలప్ చేయించాను. అందులో కృష్ణవంశి, త్రివిక్రమ్ లతో ఇంటర్వ్యూలు కూడా పెట్టాము. త్రివిక్రమ్ అప్పటికి కృష్ణవంశి వద్ద 'సముద్రం' సినిమా కి అసిస్టెంట్‌గా చేస్తున్నాడు. పెట్టుబడి నాదే ఐతే పెట్టుబడి అనే సరికి ఒక విషయం చెప్పాలి. నేను వివిధ వ్యాపారాల్లో సంపాదించేది నా లైఫ్ స్టైల్‌కి సరిపోయేదే కానీ వెనకాలేమీ నిలవచేసుకోలేదు. ఇంటి వద్ద నుంచీ తెచ్చుకోవడం ఇష్టం లేదని ముందులోనే చెప్పాను కదా.. 1999 నవంబర్ 1న సైట్ మొదలుపెట్టాలి, 30,000 రూపాయలతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన కూడా ఇచ్చాము. అక్టోబర్ 10వ తేదీకి నా పరిస్థితి ఎలా ఐందంటే కారు వుంది కానీ బయటికి తియ్యడానికి పెట్రోల్ ఖర్చు ల్లేవు. సెల్ ఫోనుందికానీ వాడితే బిల్లు కట్టడానికి చేతిలో చిల్లి గవ్వలేదు..! ఎలానో ఇరవైరోజులూ గడిపి నవంబర్ 1న సైట్ మొదలుపెట్టాం.. మొదటిరోజునే 300 డాలర్ల వ్యాపారం జరిగింది.! నాకు చాలా ఆనందం కలిగింది.!

అలా లాంచ్ ఐన టాలీవుడ్ మ్యూజిక్ డాట్ కామ్ ఒక్క నెలలోనే నా మార్గాన్ని మరో వైపు మళ్ళించింది. ఎలాగంటే - ఇంటెలిగ్రూప్ స్థాపకుడు రాజ్ కోనేరు ఇండియా ఇన్ఫో డాట్ కామ్ అనే పోర్టల్ ప్రారంభించారు. దానికి అనుబంధంగా మరికొన్ని చిన్న చిన్న కంపెనీలని కూడా ఎక్వైర్ చెయ్యడం మొదలుపెట్టారు. అన్నింటిని కలిపి ఒక పెద్ద కంపెనీగా చేసి పబ్లిక్‌కి వెళ్ళాలనేది వాళ్ళ ప్రణాళిక. ఆ వ్యూహంలో భాగంగానే వాళ్ళు కోడ్ నెట్‌ని కొన్నప్పుడు నా పోర్టల్‌ని కూడా చూశారు. నా కంపెనీని 25 లక్షలకి కొనేసి మ్యూజిక్ రాక్స్ అనే పేరుతో ఇండియా ఇన్ఫోలో ఎంటర్-టెయిన్‌మెంట్ విభాగంగా చేశారు. నేను దానికి కంట్రీ హెడ్‌ని. కంపెనీని

దినదినాభివృద్ధి చెయ్యడం నా బాధ్యత. కార్పొరేట్ కల్చర్ కొత్త నాకు, కంప్యూటర్ ఆపరేట్ చెయ్యడం, ఇ-మెయిల్ ఇవ్వడం అన్నీ కొత్తే. ఐనా దేనికీ భయపడని మనస్తత్వం మొదటినుంచీ అలవాటే కాబట్టి అన్నింటికీ తొందరలోనే అలవాటు పడిపోయాను. చిన్నప్పటినుంచీ ఇంతే..సూటిగా దూసుకు పోతుండడం..ఏదైనా అడ్డుగోడ వచ్చిందా..ఓకె..ఇప్పుడెలా అని ఆలోచించడం, కొత్త ప్లాను రూపొందించుకోవడం..మళ్ళీ బండిని టాప్ గేర్‌లో నడిపించడం. అప్పట్లో నా కింద డెవలపర్స్, కటెంట్ ప్రొవైడర్స్, మార్కెటింగ్ స్టాఫ్..చాలా మంది పనిచేస్తుండేవాళ్ళు. ఇండియా మొత్తం మీద వున్న టాప్ స్థాయి జర్నలిస్టులందరినీ కలుసుకునే అవకాశం కలిగింది..

అలా రోజులు బిజీ బిజీ గడుస్తుండేవి. రోజూ ఆఫీసుకి వెళ్ళగానే నిన్నటి బిజినెస్ ఎంత? ఈ రోజు మరింత ఎక్కువ ఎలా చెయ్యాలి..నంబర్స్..నంబర్స్.. నంబర్ గేమ్‌లో పరుగుపందెం...నెలలు గడుస్తున్నాయి. రీడిఫ్ పబ్లిక్‌కి వెళ్ళింది..అనూహ్యమైన స్పందన వచ్చింది. ఇంకొక్క వారంలో మేమూ పబ్లిక్‌కి వెళ్తామనగా..బాంబ్ పేలింది. డాట్ కామ్ బర్స్ట్..!! ఒక్కసారిగా ఇంటర్నెట్ కంపెనీలన్నీ ఒక్క కుదుపుకి గురయ్యాయి. మేము బస్ మిస్ అయ్యాము. మా ప్లానులన్నీ తలకిందులయ్యాయి. పబ్లిక్‌కి వెళ్ళలేదు. తర్వాతా కొంతకాలం అలానే నడిపించాము కానీ ఇంక దానిలో ఛార్మ్ పోయింది. అప్పటికే నాకు 30 ఏళ్ళు వస్తున్నాయి. నా లైఫ్ యాంబిషన్ సినిమాకి దర్శకత్వం చెయ్యడం. ఇంకా ఆలశ్యం కాకముందే రంగంలోకి దిగాలి అని నిర్ణయించుకున్నాను.

ఇక్కడ మీకో వ్యక్తి గురించి చెప్పాలి. సుబ్బారావు గారనే ఆయన మొదటి నుంచీ నా జీవితంలో ఒక్కోసారి తారసపడడం, ఏదో ఒక విలువైన పరిచయానికి పునాది వేసి పక్కకి తప్పుకోవడం, ఆ పునాది నన్ను ఒక సరికొత్త ఛాలెంజింగ్ మార్గంలో నడిపి నన్ను ముందుకి తీసుకెళ్ళడం.. జరుగుతోంది. నేను 1991 లో విదేశాలకి సినిమాలు ఎగుమతి చేసేప్పుడు, ఒక కస్టమర్, రేవతి తీసిన తమిళ సినిమా కావాలని అడిగారు. దాని సందర్భంలో చెన్నైలోని ట్రేడ్‌గైడ్ ఆఫీసుకి ఫోన్ చేస్తే ఈ సుబ్బారావు గారు ఫోన్ తీశారు. మొదటి కొద్ది సంభాషణల్లోనే క్లోజ్ అయ్యాము ఆయనే నేనడిగిన తెలుగు సినిమా హక్కులు కోసం సంజయ్ అర్జున్ దాస్ అనే ఆయనకి ఫోన్ చెయ్యమని చెప్పారు. అదో మలుపు నా జీవితంలో. సంజయ్ ద్వారా ఆ తమిళ సినిమా ఒప్పందం కుదరడంతో బాటు, తనతో స్నేహమే నన్ను ఆడియో రంగలోకి దింపింది. అలా ఒక రకంగా సుబ్బారావు గారు ఈ మలుపుకి కారణమయ్యారు.

మళ్ళా ఇప్పుడు 2001 లో ఫుల్ టైమ్ సినిమాల్లోకి దిగుదామని నిర్ణయించుకుని కథ తయారు చేసుకుంటున్నప్పుడు మళ్ళీ హైదరాబాదులో సుబ్బారావుగారు తారసపడ్డారు. అప్పటికాయన 'వార్త'లో పనిచేస్తున్నారు. నా ప్రయత్నాల గురించి విని, బెల్లంకొండ సురేష్ అనే నిర్మాతని పరిచయం చేస్తానని చెప్పి తీసుకెళ్ళారు. మొదటి సిటింగ్ లోనే సినిమా తియ్యడానికి సురేష్ గారు ఒప్పుకున్నారు. నేను చేసే కథకి రాజు సుందరం, సురేష్ వర్మ(డైరెక్టర్) లని మెయిన్ కేరక్టర్స్‌గా పెడదామని నిర్ణయించుకున్నాం. సురేష్ గారి వద్దనే విజయకుమార్ అనే కో-డైరెక్టర్, వి.వి.నాయక్ అసిస్టెంట్ గానూ పరిచయమయ్యారు. కథ అంతా డెవలప్ చేసి సంభాషణల కోసం త్రివిక్రమ్‌కి ఎడ్వాన్స్ కూడా ఇచ్చాము. 'మురారి' షూటింగ్‌లో (దీని నిర్మాత మా కజిన్ రామలింగేశ్వరరావు) రాజు సుందరం రాజమండ్రిలో ఉంటే వెళ్ళి మాట్లాడాం. ఆయనా ఒప్పుకున్నారు. అంతా బాగానే ఉందనుకున్నాం కానీ కారణాంతరాల వల్ల మధ్యలోనే ఆగిపోయింది.

ఇంక నేనైనా సొంతంగా చేద్దామని అదే స్క్రిప్ట్ మీద నేనే డైలాగ్స్ వ్రాయడానికి కూర్చున్నాను. బెల్లంకొండ సురేష్ వద్ద పరిచయమైన విజయకుమార్ ద్వారా కృష్ణ భగవాన్ పరిచయమయ్యారు. ముగ్గురం కలిసి ఫుల్ టైమ్ స్క్రిప్ట్ మీద కూర్చున్నాం.

సాయంకాలం వరకూ మా చర్చలూ, సాయంకాలం సుబ్బారావు గారు, జర్నలిస్ట్ జలపతి వచ్చి మా వర్క్ అంతా డి.టి.పి. చేసేవారు. ఈ సారి ప్రధానపాత్రల్లో సునీల్, అనిల్ అనే బెంగుళూరు కుర్రాడు అనుకున్నాం. 'వంశీ అండ్ వర్మ' సినిమా పేరు. సరిగ్గా అప్పుడే మళ్ళీ సుబ్బారావు గారే కుందూరు రమణారెడ్డి గారిని పరిచయం చేశారు. అప్పటికాయన 'ముత్యం' సినిమా పూర్తి చేసి మరో ప్రోజెక్టుకి సిద్ధంగా వున్నారు. నేను చెప్పిన వివరాలు వినగానే వెంటనే ప్రొడ్యూస్ చెయ్యడానికి ఒప్పుకున్నారు నిర్మాత కూడా దొరికేసరికి మా పనులు ఊపందుకున్నాయి. ఇళయరాజాగారు సంగీతదర్శకుడు. ఆయనకి కథ వినిపించడం థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్. ఆయన్ని కలవడమనేది చిన్నప్పటి కల. టెక్నిషియన్స్ అందరినీ ఫైనలైజ్ చేశాము. షెడ్యూల్స్ వేశాము. ఇంకో నాలుగు రోజుల్లో సెట్స్ మీదికి వెళ్ళాలి. ఐతే రమణారెడ్డి గారు ..'వెంకట్..ఎందుకో చెప్పలేను కానీ నాకంత కంఫర్ట్‌గా లేదు. ఈ ప్రోజెక్టు ఆపేద్దాం..' అన్నారు...నేనొక్కడినే ముందుకి వెళ్ళే ఆర్థిక బలం లేదు... ఒకటి రెండు రోజులు నిరాశ, నిస్పృహ.. చేసేదేమీ లేక మళ్ళీ ప్రయత్నాల్లో పడ్డాను.. బ్యాక్ టు స్క్వేర్ ఒన్..!



అదే సమయంలో మళ్ళీ మిత్రుడు లాంకో శ్రీధర్ లైన్‌లోకి వచ్చారు. ఈ సారి ఇద్దరం కలిసి సినిమా నిర్మిద్దామని, కొత్త స్క్రిప్టు తయారు చేద్దామనుకున్నాం. నాకు బాగా గౌరవమున్న సీనియర్ రైటర్ డి.వి.నరసరాజు గారిని కథా చర్చలకోసం పిలిచాము. రోజూ లాంకో ఆఫీసులో కథా చర్చలు చేసే వాళ్ళం.. మూడు నెలల్లో కథ ఒక రూపానికి వచ్చింది. నరసరాజుగారి అనారోగ్య కారణాల వల్ల సంభాషణలు కూడా నేనే వ్రాయాల్సి వచ్చింది. అన్నీ సిద్ధమయ్యాయి. మళ్ళీ కుందూరు రమణా రెడ్డి గారిని కలిసాను. తను కూడా ఈ సినిమా నిర్మాణంలో ఉండడానికి ఒప్పుకున్నారు. నిర్మాణ ప్రయత్నాల్లో ఉండగా శ్రీధర్ కారణాంతరాల వల్ల ప్రొసీడ్ అవ్వలేనని చెప్పారు. మళ్ళీ రమణారెడ్డి గారు, నేనూ మిగిలాము. నేనుకూడా సహనిర్మాతగా చేరడానికి ఒప్పందం అయింది.



మొత్తానికి నా మొదటి సినిమాకి ముహూర్తం సమీపించింది. సినిమాని ఫ్రెష్ లవ్ స్టోరీగా తయారు చేశాం కాబట్టి కొత్త కుర్రాడిని హీరోగా తీసుకోవాలనుకున్నాం. మాకు కామన్‌గా పరిచయమున్న పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్ వెంకట్ ద్వారా నవదీప్‌ని కాంటాక్ట్ చేసి ఒప్పించాము. తేజ, సమీర్ రెడ్డి కూడా ఈ విషయంలో సహాయం చేశారు. అలానే మోడల్ కోఆర్డినేటర్స్ ద్వారా ప్రొఫైల్ చూసి పూనమ్‌ని హీరోయిన్‌గా నిర్ణయించాము. నేను ఏమి చేసినా రమణారెడ్డి గారు పూర్తి సపోర్ట్ ఇచ్చేవారు. కెమేరా మేన్‌గా నా చిరకాల స్నేహితుడు సమీర్ రెడ్డినే. అప్పటికి తను టాప్ రేటెడ్ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ, ఐనా నా స్నేహానికి విలువనిచ్చి నాకు అండగా నిలబడ్డాడు.

2005లో నా 'మొదటి సినిమా' షూటింగ్ మొదలైంది. ఎన్నాళ్ళో వేచిన ఉదయం..అన్నట్లుగా ఎక్కడా అసిస్టెంట్‌గా చెయ్యకుండా సొంతదర్శకత్వంలో 'మొదటి సినిమా' మొదలు పెట్టాం. ఈ సినిమాకి మొదట్లోనే బయ్యర్స్ వస్తారన్న ఆశ ఏమీ లేదు. కాబట్టి ప్రారంభోత్సవంలోనే పబ్లిసిటీ హడావిడి చేసే బదులు విడుదల ముందుగా అలాంటివి చేద్దామని అనుకున్నాం. సినిమా మొదటి కాపీ వరకూ మేమే సొంతంగా పూర్తిచెయ్యడానికి సిద్ధమయ్యాం. షూటింగ్ మొదటి రోజు నా జీవితంలోని ముఖ్యమైన మలుపులకి కారణమైన 'వార్త' సుబ్బారావు గారినీ, శ్రీధర్ ద్వారా పరిచయమైన బి.ఎ. రాజు గారిని మాత్రమే పిలిచాము, రమణారెడ్డి గారు కూడా వచ్చారు. సంఘి టెంపుల్‌లో మొదటి సీన్. అంతా సవ్యంగా జరిగిపోయింది. ఆ రోజే కాదు సినిమా అంతా కూడా చివరి వరకూ ఎక్కడా ఇబ్బంది, ఆటంకం లేకుండా మేము అనుకున్నది అనుకున్నట్లుగా జరిగింది. రమణారెడ్డి గారు నిర్మాణంలో ఎక్కువ పట్టించుకునే వాళ్ళు కాదు. మా మధ్యనున్న నమ్మకమే నాకు అంత స్వేచ్ఛనిచ్చింది. ఎప్పుడు ఏదైనా ఎలాగైనా జరిగే వీలున్న సినిమా పరిశ్రమలో 'మొదటి సినిమా'ని అంత స్మూత్ గా పూర్తిచేయడం నాకే ఆశ్చర్యం గానూ, ఆనందంగానూ అనిపించింది. 1995 లో పరిచయమైన సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు అద్భుతమైన సాహిత్యాన్ని పొదిగిన పాటల్ని అందించారు. ఆయన వాత్సల్యాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. మూడూ నెలల్లో మొత్తం సినిమాని, సిక్కిమ్‌లో పాటల షూటింగ్‌తో సహా, పూర్తిచేశాము. ఎప్పటినుంచో మిత్రుడైన శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. తనుకూడా నా మొదటి సినిమాకి పనిచేస్తానని ఎప్పటినుంచో అంటుండేవాడు.



2005 అక్టోబర్ చివరి వారంలో 35 ప్రింట్లతో విడుదలచేశాము. సూపర్ హిట్ టాక్ రాకపోయినా నా దర్శకత్వానికి మంచి మార్కులే వేశారు. సినిమా మొత్తం అనుకున్నది అనుకున్నట్లు తీసిన తృప్తి మిగిలింది. ఐతే టైటిల్ విషయంలో ప్రేక్షకుల అంచనాలను సరిగా అందుకోలేకపోయామనిపించింది..

ఇదండీ..చిన్నప్పటి నుంచీ 'మొదటిసినిమా' వరకు జరిగిన నా ప్రస్థానం.

రెండో సినిమా 'జాన్ అప్పారావు..' కూడా ప్రేక్షకులకి ఆసక్తి కలిగించింది కానీ మళ్ళీ అంచనాల విషయంలో ప్రేక్షకుల్ని అందుకోలేకపోయాము. ఐతే ఈ రెండో సినిమా అనుభవాలు మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనివి. వీటి గురించి పెద్ద పుస్తకం రాయొచ్చు. మళ్ళీ ఎప్పుడైనా అవకాశం వచ్చినప్పుడు ఆ విశేషాలు మీతో పంచుకుంటాను.

అతి త్వరలోనే నా మూడో సినిమా మొదలుపెట్టబోతున్నాను. ఈ సారి మాత్రం ప్రేక్షకులు హృదయపూర్వకంగా ఆదరించే సినిమాని అందిస్తానని మీకు మాట ఇస్తున్నాను. 'కౌముది' పాఠకులకి శుభాకాంక్షలు అందిస్తూ ప్రస్తుతానికి శెలవుతీసుకుంటాను.

( ఆగస్టు 2009 సంచికలో ప్రచురితం)

# ఎ.కోదండ రామిరెడ్డి

తెలుగు సినిమా ప్రేక్షకులకి కోదండరామి రెడ్డి గారి గురించి ప్రత్యేకంగా పరిచయవాక్యాలు వ్రాయనవసరంలేదు..!

ఆయనది ఇప్పటి వరకూ ౯౩ సినిమాల ప్రస్థానం.. చిరంజీవి తో ౨౫ సినిమాలు రూపొందిస్తే అందులో ౨౨ సూపర్ హిట్స్. బాలకృష్ణ తో ౧౪, కృష్ణ తో ౧౦, నాగార్జునతో 6, శోభన్ బాబుతో ౮, అక్కినేనితో 6 సినిమాలు దర్శకత్వం వహించారు. అతి త్వరలోనే ౧౦౦ సినిమాలకి దర్శకత్వం వహించిన అతి కొద్ది మంది తెలుగు సినిమా దర్శకుల జాబితాలో చోటు చేసుకోబోతున్నారు. మూడు దశాబ్దాలక్రిందటే 'ఖైదీ' సినిమాతో తెలుగు సినిమాని ఒక మలుపు తిప్పిన శ్రీ ఎ.కోదండరామి రెడ్డి గారి 'మొదటి సినిమా' అనుభవాలు , ఈ నెల కౌముది పాఠకులకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. ఫోన్ చేసిన వెంటనే మొదటి పరిచయం తోనే ఎంతో ఆత్మీయంగా పలకరించి, షూటింగ్ బిజీలో ఉన్నా, దాదాపు గంట సమయాన్ని మనకోసం కేటాయించి, మనసులోని భావాలని పంచుకున్న కోదండరామిరెడ్డి గారికి కౌముది కృతజ్ఞతలు తెలియచేస్తోంది.

నా పూర్తి పేరు ఆవుల కోదండరామి రెడ్డి. నాన్న గారి పేరు వెంకురెడ్డి, అమ్మగారి పేరు రమణమ్మ. నా సోదరి శైలజ. నేను పుట్టింది నెల్లూరు దగ్గరలోని మైపాడు. 1950 జూలై 1 నా పుట్టిన రోజు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ మాది మధ్యతరగతి ఉమ్మడి



కుటుంబం. నాన్నగారు, పెదనాన్నగారు అందరూ కల్సి ఒకటే మండువాలోగిలి ఇంట్లో ఉండేవాళ్ళం. మా తాతగారి పేరు సుబ్బారెడ్డి. ఆయనకి నేనంటే ప్రత్యేకమైన ప్రేమ. ఆయన నెల్లూరు వెళ్ళినప్పుడు నాకోసం ప్రత్యేకంగా చాక్లెట్లు, స్వీట్లు తెచ్చి ఎవరికీ తెలీకుండా తన బీరువాలో దాచేవారు. నా ఒక్కడినే తన రూములోకి పిలిచి అవన్నీ పెట్టేవారు. ఎప్పుడు నన్ను భుజాలమీద ఎక్కించుకునే తిప్పేవారు. అప్పట్లో మా జిల్లాలో, ముఖ్యంగా మైపాడు ప్రాంతంలో, పెద్ద భూస్వామి కోగంటి కోదండరామి రెడ్డి అనే ఆయన ఉండేవారు. ఆయనకి అప్పట్లోనే అంబాసిడర్ కారు ఉండేది. మా తాతగారికి ఆయన రోల్‌మోడల్ అన్నమాట. నేను కూడా ఆయనంత పెద్దవాడిని కావాలని నాకూ కోదండరామి రెడ్డి అని పేరు పెట్టారట..! నా ప్రాథమిక విద్యాభ్యాసం మైపాడులో మొదలైంది.

హైస్కూలుకి మాత్రం మా వూరికి 10-15 కిలోమీటర్ల దూరంలోని ఇందుకూరి పేటలో ఎమ్.కె.ఆర్.హైస్కూలులో చేరాను. రోజూ బస్సులో వెళ్ళి వచ్చేవాళ్ళం. తర్వాత కొద్ది రోజులకే మైపాడుకి ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా అమ్మగారి స్వగ్రామం గంగపట్నానికి మా ఫేమిలీ తరలి వెళ్ళింది. ఏడవతరగతికి వచ్చేసరికి గంగపట్నానికి దగ్గరలోని నర్సాపురంలోనే కొత్తగా హైస్కూలు వచ్చింది. అక్కడికి మారింది నా పాఠశాల విద్యాభ్యాసం. రోజూ నడుచుకుంటూ వెళ్ళి రావడమే.

చిన్నప్పటి నుంచే ఫేషన్ల పిచ్చి ఉండేది. మంచి మంచి డిజైన్ చొక్కాలు వేసుకోవడం, అంతా క్లాసుగా మెయిన్‌టెయిన్ చెయ్యడం ఉండేది. స్కూలుకి వెళ్ళేప్పుడు స్టీలు కారేజి కొనివ్వలేదని మధ్యాహ్నం అన్నం తీసుకెళ్ళడం కూడ మానేసాను. ఉదయం తిని వెళ్ళిన ఇడ్లీలతోనే సాయంకాలం వరకూ స్కూల్లో గడిపే వాడిని.

సినిమాలు చూడ్డం కూడా అప్పుడే బాగా అలవాటైంది. అమ్మ దగ్గర 5 రూపాయలు తీసుకునే వాడిని. మరో ఇద్దరు మిత్రులతో కలిసి అద్దె సైకిల్ తీసుకుని నెల్లూరు వెళ్ళేవాడిని. మేటినీ, ఫస్టు షో, సెకండ్ షో చూడ్డం, వచ్చేప్పుడు అమ్మ చెప్పిన సరుకులు మర్చిపోకుండా తీసుకురావడం(లేకపోతే మరో సారి సినిమాకి డబ్బులు రావు మరి!)..ఇలా జరిగేవి రోజులన్నీ.! అక్కినేని గారికి వీరాభిమానిని అంత చిన్నవయసులోనే. నా సినిమాల ఇంట్రెస్టు గమనించిన తోటి పిల్లలు ' నువ్వు అందంగా ఉంటావు. సినిమాల్లో హీరో వేషాలకోసం ఎందుకు ట్రై చెయ్యకూడదు..' అంటుండేవారు. ఏదో సినిమాలు చూడ్డం అంటే తేలికే గానీ, సినిమాల్లో వేషాలంటే మాటలా!? పైగా ఆ రంగంలో తెలిసిన వాళ్ళెవరూ లేరుకూడా అని సరిపెట్టుకునేవాడిని. ఐతే హైస్కూల్లో ఉండగా నాటకాల్లో వేషాలు మాత్రం జోరుగా వేస్తుండేవాడిని. చదువులో తప్పకుండా పాస్ మార్కులు తెచ్చుకుంటున్నా, క్లాసులో మాత్రం వెనక బెంచీ విద్యార్థినే! అలా ఎస్సెల్సీ ఐందనిపించి పి.యు.సి కి నెల్లూరు వి.ఆర్ కాలేజికి వెళ్ళాను . ఇది 1967-68 రోజుల్లో ..

అప్పట్లో మా బంధువు ఒకాయన మద్రాసులో ఏదో ఉద్యోగం చేస్తుండేవారు. ఓ సారి ఆయన నెల్లూరు వచ్చినప్పుడు సినిమాల ప్రస్తావన వచ్చింది. తనకి సినిమా వాళ్ళతో చాలా పరిచయాలు ఉన్నాయని చెప్పారాయన. నాకూ సినిమాల్లో అవకాశాలేమైనా చూడగలరా అని అడిగితే ఆయన సానుకూలంగా స్పందించారు. పి.యు.సి పూర్తి చెయ్యకుండానే ఆయనతో కలిసి మద్రాసు వెళ్ళి సినిమాల్లో హీరోగా

అదృష్టాన్ని పరీక్షించుకోడానికి నిర్ణయించుకున్నాను. అమ్మ, నాన్న కూడా నా నిర్ణయానికి పెద్దగా ఎదురు చెప్పలేదు. ఒక శుభమహూర్తాన మా బంధువుతో కల్సి మద్రాసు వెళ్ళి, వాళ్ళింట్లోనే మకాం వేశాను.

రోజులు, వారాలు, నెలలూ గడుస్తున్నాయి. ఇంట్లోంచి బయటికి వెళ్ళింది లేదు. మా బంధువు గారు నన్ను కనీసం సినిమా స్టూడియోల లోపలికి కూడా తీసుకెళ్ళలేకపోయారు. రెండు మూడు నెలలు చూసి, అది జరిగే పని కాదులే అని వెనక్కి మా వూరు వెళ్ళిపోయాను. మళ్ళీ చదువుమీద ధ్యాస పోలేదు. ఉద్యోగమా అంటే నా చదువుకి అదీ రాదు. ఏం చేద్దామా అనుకుంటుండగా మళ్ళీ మా బంధువు గారు మద్రాసు నుంచీ వచ్చారు "అంత తొందరగా నిరాశ పడితే ఎలాగా? టైము పడుతుంది. మళ్ళీ నాతో రా. ఎలాగైనా నిన్ను సినిమాల్లో హీరోని చేస్తాను.." అన్నారు. ఆశ కొయ్య గుర్రం కదా.. 'సరే' ననుకుని మళ్ళీ ఆయనతో మద్రాసు వెళ్ళాను. మొదటి సారిలా కాకుండా ఈ సారి ఆయన మిత్రుడు ఒకతనికి పరిచయం చేశారు. ఆ మిత్రుడు అప్పటికే సినిమాల్లో దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న పి.సి.రెడ్డి గారివద్దకి తీసుకెళ్ళారు.

"ఏమిటి బాబూ..ఏం చేద్దామనుకుంటున్నావు?" అని అడిగారు పి.సి.రెడ్డి గారు.

"సినిమాల్లో హీరో ఔదామనుకుంటున్నాను సార్.." అన్నాను.

"బాబూ..హీరో ఐపోవడం అనుకున్నంత సులభం కాదు. నేను దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నాను. కావాలంటే ఎక్కడో చోట అప్రెంటిస్‌గా చేర్చగలను.." అన్నారాయన.

సరే..ఎలాగోలా ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ముఖ్యం కదా అనుకుని ఒప్పుకున్నాను.

"జెమినీ స్టూడియోలో 'మనుషులు మారాలి' సినిమా జరుగుతోంది.. రేపు అక్కడికి రా.." అని చెప్పారు.

మరునాడు నేను ఉంటున్న మౌంట్ రోడ్ నుంచీ జెమినీ స్టూడియో వరకూ నడుచుకుంటూ వెళ్ళాను. అప్పటికి పేకప్ ఐపోయింది. శోభన్ బాబు గారు, శారద గారు, కాంచన గారు సెట్ నుంచీ వెళ్ళిపోతున్నారు. వాళ్ళని చూడ్డం చాలా గొప్ప అనుభవం ఆ రోజున. పి.సి రెడ్డి గారు చెప్పినట్లే నన్ను దర్శకుడు వి.మధుసూదన రావు గారికి పరిచయం చేస్తూ

"ఈ కుర్రాడు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో అప్రెంటిస్‌గా చేరదామనుకుంటున్నాడు.." అన్నారాయన.

"దస్తూరి బావుంటుందా?" అని అడిగారు మధుసూదన రావు గారు. అవునన్నట్లు తలూపాను.

"ఇతనితో రెండు సీన్లు కాపీ చేయించు" అన్నారాయన. నిజంగానే నా చేతివ్రాత బావుండేది. అలా మధుసూదన రావు పెట్టిన ఎంట్రెన్స్ టెస్ట్‌లో పాసై 'మనుషులు మారాలి' సినిమాకి ఎప్రెంటిస్ గా 'మొదటి సినిమా' జీవితాన్ని మొదలు పెట్టాను.

రోజూ సెట్‌కి వెళ్ళడం శోభన్ బాబు, శారద, కాంచన గార్లతో కలిసి పనిచేయడం చాలా థ్రిల్లింగ్‌గా ఉండేది. ఎక్కడో ఆకాశంలో తేలిపోతున్న ఫీలింగ్! చేరిన కొద్ది రోజులకే ఓ రోజు క్లాప్ కొట్టమన్నారు. క్లాప్ కొట్టి, పక్కకి జరగబోయి లైట్లమీద పడ్డాను. అది గమనించిన మధుసూదన రావు గారు తిట్ల దండకంతో గట్టిగా క్లాసు పీకారు నాకు. సినిమా మొదలైన రెండు మూడు నెలలకి పి.సి.రెడ్డి గారికి సొంతంగా దర్శకత్వం వహించే అవకాశం రావడంతో వెళ్ళిపోయారు. అప్పుడే రాఘవేంద్రరావు గారు కో-డైరెక్టర్‌గా వచ్చారు. చివరికి దర్శకత్వ శాఖలో మధుసూదనరావు గారికి సహాయకులుగా మేమిద్దరమే మిగిలాము. రోజూ పొద్దునే కారు నన్ను పికప్ చేసుకుని రాఘవేంద్రరావు గారింటికి వెళ్ళి ఆయన్ని ఎక్కించుకుని జెమిని కి వెళ్ళేవాళ్ళం. అక్కడ మాకో మంచి రూము ఉండేది. షూటింగ్ ఉంటే చూసుకోవడం, లేదంటే మరు రోజుకి ప్లానింగ్ చేసుకోవడం..ఇలా జరిగేది.



ఒక రోజు జరిగిన సంఘటన చెబుతాను..

'మనుషులు మారాలి' లో శారద, కాంచన క్లాసు మేట్స్. ఐతే శారద శోభన్ బాబుని పెళ్ళిచేసుకుని పేదరికాన్ని కోరుకుంటే, కాంచన ధనవంతురాలిగానే ఉంటుంది. భర్తని కోల్పోయిన మిత్రురాలిని చూసేందుకు ఒకరోజు, కాంచన, శారద ఉంటున్న పూరింటికి వస్తుంది. శారద పరిస్థితిని చూసి జాలిపడి డబ్బులు ఇవ్వబోతే శారద ఆ డబ్బుల్ని, తిరిగి, కాంచన ముఖాన కొడుతుంది. ఆదృశ్యంలో వాడడనికి మూడు వేల రూపాయల నోట్లు అవసరమయ్యాయి. నేనే వెళ్ళి ఎకౌంటెంట్ గారితో చెప్పి, సంతకం పెట్టి, ఆనోట్లు తెచ్చాను. సీన్ బ్రహ్మాండంగా వచ్చింది. కిందపడిన నోట్లన్నీ ఏరి, మళ్ళీ జాగ్రత్తగా ఎకౌంటెంట్ గారి వద్దకి తీసుకెళ్ళాను. మూడు వేలకి రెండు వందలు తగ్గాయి. షూటింగ్ సమయంలో ఎక్కడో జారిపోయాయి.

"ఏదైనా కానీ తీసుకెళ్ళింది నువ్వేకాబట్టి దీనికి నువ్వే బాధ్యుడివి. పోయిన రెండు వందలూ నీ జీతంలో కత్తిరిస్తాను.." అన్నారా ఎకౌంటెంట్.

అప్పట్లో నా జీతం నెలకి వంద రూపాయలు, రాఘవేంద్ర రావు గారికి 250 రూపాయలు. 'ఇదేమిట్రా బాబూ..ఐతే రెండు నెలలు జీతం ఉండదన్న మాట..' అనుకుంటుండగా ఈ విషయం తెల్సిన రాఘవేంద్రరావు గారు వచ్చి 'డిపార్ట్‌మెంట్ లో నేనూ కో-డైరెక్టర్ నే. ఆ డబ్బులు ఎలా మిస్సయినా అందులో నాకూ బాధ్యత ఉంది. నా జీతంలోంచి కూడా సగం కట్ చేసుకోండి..' అని చెప్పారు. మొదటి రోజుల్లోనే మా ఇద్దరి స్నేహం అంత గాఢంగా ఉండేది.

సినిమా పూర్తయింది.. ఐతే సినిమాలో చివరికి శారద పిల్లలకి విషం ఇచ్చి చంపడం అనే ట్రేజెడీ ముగింపుని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని అనుమానం వచ్చింది. సినిమా విడుదలకి ముందే మద్రాసులోని కొంతమంది తెలుగు వారికి ఈ సినిమా ప్రీవ్యూ చూపించి వాళ్ళ నుంచీ ఫీడ్ బాక్ తీసుకున్నాం. ఆ వివరాలని వాసన్ గారి అబ్బాయి బాలన్ గారికి చూపించాము. ఆయన వాటిని పరిశీలించాక ముగింపు ఏ మాత్రం మార్చకుండా రిలీజ్ చెయ్యడానికి అనుమతిచ్చారు..!

సినిమా రిలీజ్ ఐంది. మొదటి నుంచే సూపర్‌హిట్‌టాక్ తెచ్చుకుంది. నేను నెల్లూరులో ఆ సినిమా చూడ్డానికి వెళ్ళాను. సినిమాలో సహాయ దర్శకులు కె.రాఘవేంద్రరావు, ఎ.కోదండ రామిరెడ్డి అని ఒకే కార్డులో ఇద్దరి పేర్లూ వేశారు. సినిమా హాలు వాళ్ళకి నన్ను నేను పరిచయం చేసుకుని రోజూ వెళ్ళి నా పేరు చూసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నాను. అలా పది, పదిహేను రోజుల పాటు రోజూ వెళ్ళి తెరమీద నా పేరు వచ్చేవరకూ ఉండేవాడిని. (చాలా సంవత్సరాల తర్వాత మేమిద్దరం విజయవంతమైన దర్శకులిగా పేరు తెచ్చుకుంటున్న రోజుల్లో 'మనుషులు మారాలి' మళ్ళీ రిలీజైనప్పుడు 'నేటి ప్రఖ్యాత దర్శకులు కె.రాఘవేంద్రరావు. ఎ.కోదండ రామి రెడ్డి సహాయ దర్శకులుగా పనిచేసిన చిత్రం' అని వాల్ పోస్టర్స్ లో వేశారు. అదో తియ్యటి జ్ఞాపకం!)

సినిమా వందరోజుల పండుగకి మొత్తం రైలు బుక్ చేశారు. యూనిట్‌తో కలిసి విజయవాడ, హైదరాబాదు వెళ్ళాను. సినిమా సక్సెస్ ఐతే ఎంత ప్రభావం ఉంటుందో తెలిసింది.



తర్వాత అదే సినిమాని హిందీలో కూడా తీశారు. దానికి కూడా రాఘవేంద్రరావు గారు, నేనూ ఇద్దరమూ పనిచేశాము. హిందీ వెర్షన్ అయ్యాక కాస్త గాప్ వచ్చింది. నేను మా వూరు వెళ్ళిపోయాని. రెండు నెలలకి మధుసూదన రావు గారి వద్దనుంచీ ఒక ఉత్తరం వచ్చింది.'వీనస్ ప్రొడక్షన్ నిర్మాణంలో నాగేశ్వరరావు గారు హీరోగా పవిత్రబంధం సినిమా మొదలుపెడుతున్నాం. వచ్చి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ లో చేరు..' అని. చిన్నప్పటి నుంచీ నేను ఎవరి ఫేన్‌నో ఆ నాగేశ్వరరావు గారితో పనిచేసే అవకాశం వచ్చిందన్న

ఆనందం నన్ను నేల మీద నిలువనివ్వలేదు. వెంఠనే రైలెక్కి మద్రాసు వెళ్ళిపోయాను. కథా చర్చలూ అన్నీ పూర్తయి షూటింగ్ మొదటి రోజు నాగేశ్వరరావు గారు సెట్‌లో అడుగు పెట్టేసరికి నాకు నోట వెంబడి మాట రాలేదు. ఆయన్ని అలానే చూస్తుండి పోయాను. నా కళ్ళని నేనే నమ్మలేక పోయాను. నన్ను గమనించిన నాగేశ్వరరావు గారు..

"ఏంటి బాబూ అలా చూస్తున్నావ్?" అన్నారు. వెంఠనే నోరు పెగల్లేదు. కాస్సేపటికి తేరుకుని " సార్..చిన్నప్పటినుంచీ మీ ఫేన్ ని. మీ సినిమా ఒక్కటి కూడా వదలకుండా చూసేవాడ్ని. మీ చొక్కాలు చూసి, ఇంట్లో పోరి, అలాంటి షర్టులే కుట్టించుకునే వాడ్ని.." అని గడగడా చెప్పేశాను. ఆయన ఆత్మీయంగా నవ్వారు. (తరువాత ఆయన్ని దర్శకత్వం చేసే అవకాశం వస్తుందని అప్పుడు అనుకోలేదు..!)

ఆ విధంగా మూడో సినిమా కూడా మధుసూదన రావు గారి వద్ద పూర్తయింది. రెండు సినిమాలతోనే నామీద నమ్మకంతో నన్ను అసోసియేట్‌ని చేశారు. నావద్ద టి.ఎల్.వి ప్రసాద్, మురారి లు పనిచేస్తుండేవారు. 1975 లోనే రాఘవేంద్ర రావుగారు డైరెక్టరయ్యారు. నేను మధుసూదన రావు గారి వద్ద 'కళ్యాణ మండపం' మొదలైన అన్ని సినిమాలకీ పనిచేశాను. ఆయన వద్ద గాప్ వచ్చినప్పుడు రాఘవేంద్రరావు గారి వద్ద పనిచేసేవాడిని. అలా ఆయన మొదటిసినిమా 'బాబు', తర్వాత 'నిప్పులాంటి నిజం','సింహబలుడు' వగైరా సినిమాలకి సహాయదర్శకుడిగా పనిచేశాను.



రోజులు ఇలా గడుస్తున్నాయి. నాకు పెళ్ళై, ఇద్దరు మగ పిల్లలు కూడా పుట్టారు. సహదర్శకత్వ జీవితం సాఫీగానే గడిచింది. ఏ రోజూ డబ్బులకోసం ఇబ్బంది పడ లేదు. అలానే తొందరగా దర్శకుడ్నయి పోవాలని కూడా పెద్ద ఆలోచన ఉండేది కాదు. ఎప్పుడైనా అనిపించినా 'నాకెవరు అవకాశం ఇస్తారు? ఎందుకివ్వాలి?' అని నాలో నేనే ప్రశ్నలు వేసుకునేవాడిని.

ఆ సమయంలోనే మధుసూదన రావు గారి ద్వారా పరిచయమైన కె.ఎస్.రామారావు గారు క్రియేటివ్ కమ్మర్షియల్స్ సంస్థని మొదలుపెట్టి డబ్బింగ్ సినిమాలు తీస్తున్నారు. ఓ రోజు మాటల సందర్భంలో "సొంతంగా దర్శకత్వం చెయ్యొచ్చు కదా.." అన్నారు. "ఇచ్చేవాళ్ళుండాలి కదా.." అన్న నా మాటకి సమాధానంగా "నా మిత్రుడొకాయన ఉన్నారు. పరిచయం చేస్తాను." అంటూ హీరో కృష్ణ గారి బావమరిది సూర్యనారాయణ బాబు గారిని పరిచయం చేశారు. ఆయనతో కలిసి ఒక ప్రోజెక్టు అనుకున్నాం. కానీ కొంత దూరం వెళ్ళి ఆగిపోయింది. నిరాశ తప్పలేదు.

ఐతే మరో ఏడెనిమిది నెలల తర్వాత మళ్ళీ సూర్యనారాయణబాబు గారే ముందుకి వచ్చారు. ఈ సారి 'తపస్య' అనే హిందీ సినిమాని తెలుగులో తీద్దామని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. అప్పట్లో పంపిణీదారుల మాటమీదనే ఎక్కువ చిత్రాల నిర్మాణం జరిగేది. నేను పనిచేసిన సినిమాలు చాలా వాటికి లక్ష్మీ ఫిలిమ్స్ వారే పంపిణీ దారులు. నా కొత్త సినిమాకి కూడా వారే పంపిణీ దారులు అనుకుని మేము ముందుకి వెళుతున్నాం. సుజాతగారు ప్రధాన పాత్ర. ఏర్పాట్లన్నీ చురుగ్గా సాగుతున్నాయి. షూటింగ్ పదిరోజులుందనగా ' పంపిణీ దారులు వెనక్కి వెళ్ళిపోయారు.. కొత్త డైరెక్టర్ తో రిస్క్ అంటున్నారు ..' అని వార్త వచ్చింది. లక్ష్మీ ఫిలిమ్స్ పంపిణీ అంటేనే సినిమా హిట్ అనే రోజుల్లో వాళ్ళే విత్ డ్రా ఐపోయారంటే ఏం చెయ్యాలో తెలీలేదు. కె.ఎస్.రామారావు గారికి చెప్పాను. ఆయన 'ఏమీ కంగారు పడకండి. లింగమూర్తి గారు ఊళ్ళోనే ఉన్నట్లున్నారు. ఆయనని డైరెక్టుగా కలుద్దాం..పదండి..' అని నన్ను వెంటబెట్టుకుని వెళ్ళారు. నాకు కళ్ళనీళ్ళ పర్యంతమౌతోంది. 'ఏమిటి రెడ్డి గారు..ఏమైంది?' అని అడిగారాయన. ఇదీ విషయం అని చెప్పాను. 'అసలే మొదటి సినిమా.

మీరే కాదంటే నాకు బ్రేక్ రావడం కష్టం..' అని వివరించాను. 'మీ సినిమా వద్దని ఎవరి నిర్ణయించారో తెలీదు కానీ.. ఏం భయపడకండి. నేను నిర్ణయం తీసుకుంటాను. మీ సినిమాని మేమే పంపిణీ చేస్తాం..' అని సూర్యనారాయణ బాబు గారిని పిలిచి కన్ఫర్మ్ చేశారు,

ఆ విధంగా నా మొదటి సినిమా 'సంధ్య' 1980లో మొదలైంది. సుజాత, శ్రీధర్, చంద్రమోహన్, కాంతారావు గారు..తారాగణం. జంధ్యాల మాటలు, చక్రవర్తి సంగీతం, ఎస్.గోపాలరెడ్డి గారు కెమేరా. ఎన్ని సినిమాలకి సహాయకుడిగా పనిచేసినా మొదటి సినిమా అనే సరికి టెన్షన్‌గా ఉండేది. రాత్రీ పగలూ తర్వాత తీయబోయే షాట్స్ గురించే ఆలోచిస్తూ ఉండేవాడిని. 3,4 రీళ్ళ సినిమా పూర్తయింది. ఆ సమయంలో లింగమూర్తి గారు, వారి మిత్రులు మద్రాసులో ఎవరిదో వివాహానికి వచ్చారు. 'మన రెడ్డి గారి సినిమా ఎలా సాగుతోందో చూద్దాం..' అని నావద్దకి వచ్చారు. అంతవరకూ జరిగిన 3,4 రీళ్ళని వాళ్ళకి ప్రివ్యూ వేశాము. అది చూసి బయటికి వచ్చిన వెంటనే ఆయనతో పాటు వచ్చిన మిత్రులు దాదాపు అన్ని జిల్లాలకీ రైట్స్ కొనేశారు.. వేరే ఇబ్బందులేమీ లేకుండా సినిమా పూర్తయింది. విడుదల రోజు విజయవాడ అప్సర థియేటర్‌కి వెళ్ళాను. మొదటి షో నుంచే హిట్ టాక్ వచ్చింది. ఆ విజయంతోనే క్రాంతి కుమార్ గారి 'న్యాయం కావాలి' అవకాశం వచ్చింది. ఇంక దాని తర్వాత వెనక్కి తిరిగి చూసే అవసరం రాలేదు.

ఇవీ నా మొదటి సినిమా అనుభవాలు.

దాదాపు అందరు హీరోలతోనూ చేశాను కానీ ఎన్టీఆర్ గారితోనే చేసే అవకాశం రాలేదు. కెరీర్ మొదట్లో ఆయన వద్దనుంచీ ఆఫర్స్ వచ్చాయి కానీ మిగతా సినిమాల బిజీలో ఇద్దరికీ కుదరలేదు.అదొక తీరని కోరికగా ఉండిపోయింది.

ప్రస్తుతం మా రెండో అబ్బాయి 'వైభవ్'తో 'కాస్కో' సినిమా నిర్మాణంలో ఉంది. దసరాకి విడుదల చేద్దామనే ప్రయత్నాల్లో ఉన్నాము. నా సినిమాలని ఆదరించి నట్లే మా అబ్బాయిని కూడా హీరోగా అభిమానించి ఆదరిస్తారని ఆశిస్తున్నాను. 'కౌముది' పాఠకులని ఈ విధంగా కల్సుకునే అవకాశం కలిగినందుకు చాలా ఆనందంగా ఉంది.



(సెప్టెంబర్ 2009 సంచికలో ప్రచురితం)

# బి.జయ

తెలుగు చలనచిత్రసీమలో దర్శకత్వశాఖలో ప్రవేశించి, విజయంసాధించి, నిలదొక్కుకున్న మహిళలని వేళ్ళమీద లెక్కించవచ్చు. ఆ త్రోవలో పయనిస్తున్న నేటి మహిళాదర్శకురాలు బి.జయగారి మొదటి సినిమా జ్ఞాపకాలు ఈనెల కౌముదిలో మీకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. అతి చిన్న వయసులోనే కవయిత్రిగా తెలుగు సాహితీవనంలో ప్రవేశించి కథ రచయిత్రిగా, నవలా రచయిత్రిగా అందరి ప్రశంసలనూ పొంది, పాత్రికేయురాలిగా నిరంతర చైతన్యంతో పనిచేసి తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుని, తెలుగులో మొట్టమొదటిసారి ఫుల్ డెమ్మీ సినిమా పత్రికని మొదలుపెట్టి గత 16 సంవత్సరాలుగా దాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ, మొట్ట మొదటిచిత్రం ‘చంటిగాడు‘తో విజయవంతమైన దర్శకురాలిగా సినీ రంగంలో కాలుమోపిన శ్రీమతి బి.జయగారితో జరిపిన ఇంటర్వ్యూ నుంచీ సమగ్ర కథనం.



**మా తాతగారు, మంతెన సూర్యనారాయణ రాజు గారు, ఏలూరులో డాక్టరుగా ప్రాక్టీసు చేస్తుండేవారు.** ఐతే పశ్చిమ గోదావరిలోనే సిద్ధాంతం అనే వూరి పెద్దలు ఆయన్ని తమవూరికి వచ్చి చుట్టుపక్కల గ్రామాలకి సేవలందించాల్సిందని కోరగా, ఆ విన్నపాన్ని మన్నించి ఆయన సిద్ధాంతం వూరికి వలసవెళ్ళారు. మా నాన్నగారు మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగంలో పలు ప్రాంతలు పర్యటిస్తుండడం వల్ల, నా చదువుకోసం ఒక చోట స్థిరంగా ఉంచాలనుకుని చిన్నప్పుడే తాతగారింటికి పంపించారు. ఆ విధంగా నాకు ఊహ తెలిసేసరికి అందమైన గోదావరి తీరంలో బాల్య మొదలైంది.

ఆ వూళ్ళో తాతగారిదే రెండస్తుల పెద్ద మేడ. కాలినడక దూరంలో గోదావరి... శివాలయం, రామాలయం.. కార్తీక మాసంలో తెల్లవారు ఝామునే గోదావరిలో స్నానం చేసి శివాలయం చుట్టూ ప్రదిక్షణలూ, ప్రతి పండుగకీ ఏదో ఒక గుళ్ళో ఉత్సవాలు, తిరునాళ్ళు, అందులో నాటకాలు..బాల్యంలోని ప్రతి దృశ్యం ఒక ఫోటో ఫ్రేమ్‌లా మనసులో నిలిచిపోయింది. అమ్మమ్మ ఆ రోజుల్లో పెద్దగా చదువుకోక పోయినా సంతకం పెట్టడం నేర్చుకుని, పంచాయితీలో సభ్యురాలిగ చేరి మహిళామండలి స్థాపించింది. ఊళ్ళోని మహిళలకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నేర్పడంతో బాటు చక్కటి గ్రంధాలయాన్ని కూడా ఏర్పాటు చేసింది. అక్కడ మొదలైంది నాకు పుస్తకాలు చదివే అలవాటు. అమ్మమ్మ లైబ్రరీలో కనపడిన పుస్తకాలన్ని చదివేసేదాన్ని. చందమామ లాంటివి తేలిగ్గా అర్థమయ్యేవి. 8-9 సంవత్సరాల వయసులో మిగతా నవలలు వగైరా పెద్దగా అర్థమయ్యేవి కావు. అందమైన పరిసరాలు, నన్ను అత్యధికంగా ప్రభావితం చేసిన అమ్మమ్మ, ఎటు చూసినా పుస్తకాలు.. ఈ నేపథ్యంలో ఏమి వ్రాస్తున్నానో పెద్ద జ్ఞానం లేని వయసులోనే పాటలు, కవితలు వ్రాసేదాన్ని. వాటిని ఆ పేర్లతో పిలవొచ్చు అనికూడా తెలియని వయసు. అవి చదివిన తాతగారు

ఆశ్చర్యపోతుండేవారు. మా నాన్నగారి తరఫున, అమ్మ తరఫునా చాలామంది డాక్టర్లు, టీచర్లే కానీ ఇలా సాహిత్యం, కవిత్వం వగైరా రంగాలపట్ల ఆకర్షించబడ్డ వారు చాలా తక్కువ.

అలా చిన్నతనం అందమైన సీతాకోక చిలుక ప్రయాణంలా సాగిపోతుండగా, నాన్నగారికి విజయవాడ ట్రాన్సఫర్ ఐంది. అక్కడ చదివించేందుకు నన్ను తీసుకెళ్ళారు. మాంటిస్సోరిలో తొమ్మిదో తరగతిలో చేరాను. అమ్మకూడా మార్కెట్లో దొరికే పత్రికలన్నీ తెప్పించేది. నా పుస్తక పఠనాసక్తికి ఏమాత్రం ఆటంకం కలగలేదు. మా విజయవాడ నివాసం సాహితీ లోకంలో అడుగుపెట్టడానికి తొలిమెట్టు అని చెప్పవచ్చు.

మేము అద్దెకుండే ఇంట్లోనే పైన 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు ఉండేవారు. ఇంకో వైపు ప్రముఖ చిత్రకారులు బాలిగారు ఉండేవారు. పత్రికలన్ని విపరీతంగా చదివేస్తున్న నాకు, వీరిద్దరినీ ఇంటి పక్కనే చూడ్డం చాలా అదృష్టంగా అనిపించేది. పురాణంగారి పిల్లలు నాని, మల్లిక్ మంచి స్నేహితులు. అప్పటికే నా రాతలన్నింటినీ ఒక నోట్ బుక్‌లో భద్రపరస్తుండేదాన్ని. ఒకరోజు మల్లిక్ ఆ పుస్తకాన్ని తీసుకెళ్ళి వాళ్ళ నాన్న గారికి చూపించాడు. ఆయన వాటిని చదివి మెచ్చుకోవడం పదకొండేళ్ళ నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉండేది. నాకు చెప్పకుండానే అందులో నుంచి ఒక కవిత తీసుకుని 'ఆంధ్రజ్యోతి'లో బాలజ్యోతి శీర్షికలో ప్రచురించారు. క్రింద ***కలిదిండి జయ, మాంటిస్సోరి స్కూలు, లబ్బీపేట, విజయవాడ*** అని అడ్రెస్ కూడా ఇచ్చారు. అదే అచ్చులో మొదటి సారి నా పేరు చూసుకోవడం. ఆ వయసులో 'ఆంధ్రజ్యోతి'లో నా పేరు చూసుకోవడం గిన్నిస్ బుక్ ఎంట్రీ కంటే ఎక్కువ సంతోషాన్నిచ్చే విషయం. కోటేశ్వరమ్మ గారు స్కూలు అసెంబ్లీలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. పత్రిక ఆఫీసునుంచీ కాంప్లిమెంటరీ కాపీ రావడమే కాక పదిరూపాయలు పారితోషికం కూడా అందింది. తర్వాత తర్వాత జీవితంలో ఎన్ని లక్షలు సంపాదించినా ఆ మొట్టమొదటి పారితోషికం ఇచ్చిన ఆనందాన్ని ఎప్పటికీ మరచిపోలేను. అలానే పత్రికలో నా ఎడ్రెసు చూసి చాలా మంది ఉత్తరాలు వ్రాశారు కూడా. అప్పుడే తెలీకుండా నా మనసులో ఒక ముద్ర పడిపోయింది 'మనభావం ఎక్కువమందిని చేరి, వాళ్ళని ప్రభావితం చెయ్యాలంటే మన ఎక్స్‌ప్రెషన్ ప్రతిభావంతంగా ఉండాలి ' అని.

పురాణం గారు ఆప్యాయంగా పలకరిస్తుండేవారు. వారితో కల్సి 'ఆంధ్రజ్యోతి' ఆఫీసు చూడడానికి వెళ్ళినప్పుడు ఆ ప్రింటింగ్ మెషీన్లు, కంపోజింగ్ సెక్షనూ, రంగు రంగుల ఇంకులూ, ఆర్టిస్టులు చేసే లే ఔట్లూ.. అన్నీ చూసి..'ఇలాంటి చోట ఉద్యోగం చెయ్యడం కంటే అదృష్టమేముంటుందీ..!' అనుకునేదాన్ని. అలానే పురాణం గారింటికి తరచూ వచ్చే కాళీపట్నం గారు, రావిశాస్త్రి గారు, చెరబండరాజు గారు..వీళ్ళందరినీ చూడ్డం గొప్ప అనుభవం. సాహితీ రంగంలోని స్టార్స్ అందరితో పరిచయం కలగడం, అంత చిన్నవయసులో, అదీ నా అదృష్టం.

మరో వైపు బాలిగారి ఇంటికి వెళ్ళినప్పుడల్లా ఆయన బొమ్మలు వేసే విధానం, రంగులూ, కుంచెలూ.. ఇవికూడా నన్ను ప్రభావితం చేశాయి. ఆ ప్రభావమే తరువాతి రోజుల్లో నన్నొక కార్టూనిస్ట్‌ని కూడా చేశాయి. బాలి గారికి నేనంటే అంతో అభిమానం 'నిన్ను పెంచుకుంటాను..మా ఇంటికి వెచ్చెయ్యమ్మా..' అంటుండేవారు సరదాగా.

నాన్నగారికి మాత్రం నన్ను డాక్టర్‌ని చెయ్యాలని ఉండేది, ఎందుకంటే ఫేమిలీలో చాలామంది డాక్టర్లే కాబట్టి. అతిచిన్న వయసులోనే మంచి మార్కులతో 10 వతరగతి పాసయ్యాను. స్కాలర్షిప్ కూడా వచ్చింది. ఇంతలో నాన్నగారికి మద్రాసు బదిలీ ఐంది. నన్ను పెదనాన్నగారి వద్ద ఉండి చదువుకునేందుకని అమలాపురం పంపించారు. పెదనాన్న గారు అక్కడ హైస్కూల్లో హెడ్మాస్టారిగా పనిచేస్తుండేవారు. ఆ విధంగా ఇంటర్మీడియట్ బై.పిసి. గ్రూపుతో అమలాపురం కాలేజీలో మొదలైంది.

సబ్జెక్టులు చదవడంలో ఏమీ ఇబ్బంది లేదుకానీ ప్రాక్టికల్స్ తోనే ఇబ్బందిగా ఉండేది. ఎందుకంటే - ఆ వానపాములనీ, బొద్దింకలనీ, కప్పలనీ కొయ్యడం అస్సలు నచ్చేది కాదు. మేమంతా శాఖాహారులుగానే పెరగడం ఒక కారణం కావొచ్చు. ఆ క్లాసులు

వచ్చినప్పుడల్లా ఆ కీటకాల ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఉండేదాన్ని. మళ్ళీ బోటనీ అంటే చాలా ఇష్టంగా ఉండేది. పూలూ, ఆకులూ వాటిమధ్య తిరగడం చాలా అందంగా అనిపించేది. చదువు ఇలా ఉండగా అదే కాలేజీలో లెక్చరర్‌గా ఉన్న పైడిపాలగారు నాలోని కవితాభిలాషని బాగా ప్రోత్సహించేవారు. అప్పటికే కవితలు వ్రాయడం, కార్టూన్లు వెయ్యడం చేస్తుండేదాన్ని. ఇంటర్మీడియట్‌కి వచ్చే సరికి జరిగిన మరొక పరిణామం- నాలో వామపక్ష భావాలు పెంపొందడం. అప్పటికి రంగనాయకమ్మగారి పుస్తకాలు అర్థం చేసుకునే దశ వచ్చింది.



ఆ విధంగా ఇంటర్మీడియట్ ముగించుకుని నాన్నగారి వద్దకి మద్రాసు చేరుకున్నాను. బై.పిసి. పూర్తి చేశాను కాబట్టి అయిష్టంగానే మెడిసిన్ ఎంట్రెన్స్‌కి ప్రిపేరవడం మొదలుపెట్టాను. ఐతే నాన్న గారికి నా మనోభావాలు ఎలా తెలిశాయో కాని నాకు ఆ సబ్జెక్టులు ఇష్టం లేవని గ్రహించారు. ఎంట్రెన్సు వ్రాయలేదు. నాన్నగారే నన్ను మద్రాసులో బి.ఎ(ఇంగ్లీషు)లో చేర్పించారు. ఇంక పుస్తకాలు, కథలూ, కవిత్వం..జీవితం చాలా ఎక్సైటింగ్‌గా ఉండేది. రచనా వ్యాసంగం బాగా పెరిగింది. కవితలూ, కార్టూన్లతోపాటు కథా రచన కూడా మొదలు పెట్టాను. అవి 'చందమామ'లో కొడవటిగంటిగారు పనిచేసిన చివరి రోజులు. 'వనిత' పత్రికలో రావి కొండలరావుగారు ఉండేవారు. ఈ రెండు పత్రికలకీ కథలు పంపిస్తుండేదాన్ని. 'వనిత'లో నేను వ్రాసిన 'అభ్యుదయం' అనేకథకి బహుమతిగా 100రూ. వచ్చాయి. ఆ కథ చదివిన రావి కొండలరావు గారు 'ఇంతచక్కగా ఒక్క అక్షరం కానీ, భావం కానీ తప్పులేకుండా ఇంతబాగా వ్రాసినదెవరు..' అని నా వివరాలు తెలుసుకుని ఆఫీసుకి పిలిపించారు. ఇంకా నేను కాలేజీ స్టూడెంటునేనని తెల్సుకుని చాలా ఆశ్చర్యపోయారు. అదో మరపురాని అనుభవం. 'చందమామ' లో కూడా నేను వ్రాసిన కథలు చాలా అచ్చయ్యాయి. 'చందమామ'లో ఒక ఒక మంచి అనుభవం ఏమిటంటే - నేను వ్రాసిన 'రద్దులరాజు' అనే కథ అచ్చవడం. అప్పటి ముఖ్యమంత్రి గారి మీద వ్రాసిన సెటైర్ అది. ఐతే 'చందమామ'లో కథలకి కొన్ని మార్గదర్శక సూత్రాలుండేవి 'ఏ కథా 3 పేజీలు మించి ఉండకూడదు. పిల్లలకి రాజకీయలు బోధించే రచనలు ఉండకూడదు..' ఇలా. ఐతే నేను వ్రాసిన కథ 4 పేజీలు వచ్చినా, బావుండడం వల్ల అందరూ చర్చించుకుని ప్రచురణార్హమని నిర్ణయించారు. ఇదో గొప్ప అనుభవం. అప్పట్లోనే 'యువ'లో నేను వ్రాసిన ఒక కథకి చక్రపాణి పురస్కారం లభించింది. ఆ కథా రచన అంతా శ్రీకాకుళం యాసలో సాగుతుంది. కాళీపట్నం గారు ఆ కథ చదివి 'రచయిత పేరు తీసేస్తే ఇది ఖచ్చితంగా రావిశాస్త్రి గారి రచనే అనుకుంటారు' అని ప్రశంసించడం ఇప్పటికీ మరిచిపోలేను.

మద్రాసులోనే తమిళం కూడా నేర్చుకుని తమిళంలో కూడా కార్టూన్లు వేసేదాన్ని. 'ఈనాడు' ఆదివారం సంచికలో క్రిమినాలజీ, సైకాలజీ అంశాల మీద వ్యాసాలు వ్రాసేదాన్ని. 'మిర్రర్', 'బ్లిట్జ్' ఇంగ్లీషు పత్రికల్లో కూడా వ్యాసాలు వ్రాసే దాన్ని. 'చతుర' లో నవలలు వ్రాశాను. మరికొన్ని సీరియల్స్ కూడా వ్రాశాను. ఈ విధంగా సాహితీ వ్యాసంగంలో తలమునకలవుతూనే బి.ఎ, తర్వాత ఎం.ఎ (ఇంగ్లీషు) చేస్తూ ప్రైవేటుగా అన్నామలై యూనివర్సిటీ నుంచీ ఎం.ఎ (సైకాలజీ) కూడా పూర్తి చేశాను.

రెండు డిగ్రీలతో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే రెండు ఉద్యోగాలు వచ్చాయి. రెండూ నేను ప్రయత్నం చెయ్యకుండా రావడం ఒక విశేషం. ఒకటి భీమవరం కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్ ఉద్యోగం. అక్కడ మా చిన్నాన్నగారు లెక్చరర్‌గా ఉండేవారు. రెండోది విజయవాడ 'ఆంధ్రజ్యోతి' సంస్థలో సబ్-ఎడిటర్ ఉద్యోగం. అప్పటికే నేను అన్ని పత్రికల్లో వ్రాస్తున్న రచనలూ, ముఖ్యంగా 'వనితా జ్యోతి'కి నేను పంపించే రెగ్యులర్ ఫీడ్ బాక్ గమనించిన నండూరి రామ్మోహన రావుగారే ఉద్యోగంలో చేరమని స్వయంగా వ్రాసిన

ఉత్తరం.. - ఇవీ నాముందు ఉన్నాయి. నాన్న గారు చెప్పారు "జర్నలిస్ట్ ఉద్యోగం అంటే చాలా ఆటుపోట్లుంటాయి. అందుకే జర్నలిజంలో ఆడపిల్లలూ తక్కువగానే ఉంటారు. అదే కాలేజీ లెక్చరర్ ఐతే ఎంతో గౌరవంగా ఉంటుంది. మంచి జీతం. బోలెడన్ని శెలవలు ఉంటాయి. నీకు కథలూ గట్రా రాసుకోవడానికి బోలెడంత సమయం ఉంటుంది. నలుగురు పిల్లలకి ఇంగ్లీషు ట్యూషన్ చెప్పావంటే నిన్ను నెత్తిన పెట్టుకుని పూజిస్తారు. ఆలోచించుకోమరి..భీమవరానికి టికెట్టు కొనమంటావా? లేక విజయవాడకా?"

"విజయవాడకే.." అని స్థిరంగా చెప్పాను.



ఆ విధంగా 'ఆంధ్రజ్యోతి' ఆఫీసులో 'వనితా జ్యోతి' సబ్ ఎడిటర్‌గా నా వృత్తి ఉద్యోగ పర్వం మొదలైంది. అప్పట్లో సబ్-ఎడిటర్‌కి 500 రూ. మించి జీతం ఉండేది కాదు. ఐతే అప్పటికే విరివిగా రచనలు చేస్తున్నాను కాబట్టి పారితోషికాలు కూడా వస్తుండేవి. పైగా విజయవాడ ఉద్యోగం కోసం నాకు చాలా ఇష్టమైన మద్రాసు (ముఖ్యంగా లైబ్రరీల గురించి)ని వదిలి ఉండడం..- ఇవన్నీ వివరించిన మీదట నా ప్రారంభ జీతం 800రూ.గా ఆఫర్ చేశారు. అప్పటికే పనిచేస్తున్న చాలా మంది ఇది విని ఆశ్చర్య పోయినా , తర్వాత నేను పనిచేసే విధానం గమనించి అంతా నన్ను చాలా గౌరవంగా చూసుకునే వారు. పేరుకి 'వనితా జ్యోతి' సబ్-ఎడిటర్‌నే ఐనా ఆదివారం ఆంధ్రజ్యోతిలో కొన్ని శీర్షికలూ, కొన్నింటికి బొమ్మలూ 'లోకంతీరు' అనే స్ట్రిప్ కార్టూన్ వేస్తుండే దాన్ని. అలానే రోజూ ఉదయం ఆఫీసుకి 7.30 కి వెళితే రాత్రి 9.00 వరకూ అన్ని సెక్షన్లలోనూ ఎక్కడ అవసరమైతే అక్కడ సహాయం చేస్తుండేదాన్ని. అలా రోజులు గడుస్తున్నాయి. కొంతకాలానికి డైలీ సెక్షన్ కి మారాలనిపించింది.

ఇక్కడింకొక విషయం చెప్పాలి. ఏ పనైనా నేను కంటిన్యువస్‌గా చాలా కాలం చెయ్యలేను. నా స్వభావానికి విరుద్ధం అది. నేను బాగా కవితలు వ్రాస్తుండగానే కార్టూన్లకి షిఫ్ట్ అయ్యాను. అందులో విశాఖ షిప్ యార్డ్ ఎవార్డు, క్రోక్విల్ ఎవార్డు కూడా వచ్చాయి. అలా పేరు వస్తుండగానే కథలు మొదలు పెట్టాను..తర్వాత వ్యాసాలు, నవలలు, సీరియల్స్ వగైరా.. ఈ నాలోని ఈ స్వభావం వల్లనే, మంత్లీ మాగజైన్‌లో బోర్ కొట్టి డైలీ సెక్షన్ కి వెళ్ళాలనిపించింది. డైలీ అనే సరికి రౌండ్ ది క్లాక్ షిఫ్టులు చెయ్యాలి. నీకు కష్టమౌతుంది అని రామ్మోహన రావు గారు నన్ను నిరుత్సాహ పరిచారు. రామ్మోహనరావు గారు మా నాన్న గారి కంటే ఎక్కువగా చూసుకునే వారు. అప్పట్లో నేనుజర్నలిస్ట్‌గా రచయిత్రిగా పై మెట్లు ఎక్కడానికి పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు, నండూరి రామ్మోహనరావు గారు.

లోపలే ట్రాన్స్‌ఫర్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 'ఆంధ్రజ్యోతి' లో కొన్నేళ్ళు పనిచేశాక ఉద్యోగంలో మార్పు కావాలనిపించి మద్రాసు వెళ్ళాను.

అక్కడ 'విజయ' పత్రికలో విజయ బాపినీడు గారి వద్ద సబ్-ఎడిటర్‌గా చేరాను. 'బొమ్మరిల్లు'కి కథల ఎంపిక, 'విజయ' పత్రికకి ఆర్టికిల్స్ సెలెక్షన్ అన్నీ చూస్తుండేదాన్ని. ఏదైనా కథా చర్చలు వచ్చినప్పుడు విజయబాపినీడు గారు 'ఈ కథని సినిమా రూపంలోకి మార్చాలంటే ఏమి చెయ్యాలో చెప్పు' అనే వారు. నిజానికి సినిమాలంటే అస్సలు పడేది కాదు అప్పట్లో. వామపక్ష భావాల వైపు మొగ్గిన సమయంలోనే సినిమాలంటే బూర్జువా సంస్కృతికి ప్రతి రూపాలు అనే భావం మనసులో పడిపోయింది. అస్సలు సినిమాలు చూసేదాన్ని కాదు. గౌతంఘోష్, సత్యజిత్ రే లాంటి దర్శకుల సినిమాలు మాత్రం అడపాదడపా చూస్తుండేదాన్ని. అదే విషయం చెబుతూ ' సినిమాలకీ నాకూ చుక్కెదురు సార్.. నన్ను వదిలెయ్యండి..' అంటుండేదాన్ని. అదే సమయంలో ఒక తమిళ సినిమాని రీమేక్ చేద్దామని

బాపినీడు గారు ప్లాన్ చేశారు. అది తమిళంలో బాగా ఆడింది. తెలుగులోకి డబ్ ఐ కూడా బాగా ఆడింది. ఐనా ప్రయోగాలకి వెనుకాడని బాపినీడు గారు అదే సినిమాని రీమేక్ చేద్దామని నిర్ణయించుకున్నారు. 'విజయ' పత్రికాఫీసుకి ఎదురుగా ఉన్న థియేటర్‌లో తమిళ సినిమా నడుస్తోంది. నన్ను వెళ్ళి ఒకసారి చూసి రమ్మన్నారు. థియేటర్‌కి వెళ్ళేసరికి మేనేజర్ ఎదురొచ్చి

'మీరేగా అసిస్టెంట్ డైరెక్టర్? విజయబాపినీడు గారు మీకోసం ఒక టిక్కెట్టు ఉంచమన్నారు. ఇదిగో..లోనికి వెళ్ళండి..' అన్నాడు. నాకేమీ అర్థం కాలేదు..నేనేమిటీ అసిస్టెంట్ డైరెక్టరేమిటీ? సరే..

సినిమా చూసి రాగానే బాపినీడు గారు 'ఈ సినిమాకి నువ్వు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తున్నావు' అన్నారు.

నేను షాక్ తిన్నాను . 'అదేమిటి సార్..నాకు సినిమాలంటే పడదని చెప్పాను కదా. ఐనా నేను వచ్చేస్తే మరి ఈ పత్రికలు ఎవరు చూసుకుంటారు?' అన్నాను.

'ఏమీ ఫరవాలేదు..పత్రికలకోసం రివ్యూచెయ్యాల్సిన వన్నీ నీతో బాటు తెచ్చుకో. మనం అమరావతిఔట్ డోర్‌కి వెళ్తున్నాం అన్నారు..'.

ఇది నిజంగా షాకే నాకు.!

అలా 'నాకూ పెళ్ళాం కావాలి' సినిమాతో మొట్టమొదటి సారిగా సినిమా నిర్మాణాన్ని పరిశీలించే అవకాశం దొరికింది. పేరుకి అసిస్టెంట్ డైరెక్టర్‌నే కానీ అన్ని విభాగాలనీ పరిశీలిస్తూ ఉండే దాన్ని. రాజేంద్రప్రసాద్ గారు, చంద్రమోహన్ గారు బాగా పరిచయమయ్యారు. ఏదైనా డైలాగ్ చెప్పాలంటే రాజేంద్రప్రసాద్ గారు 'ఆ అసిస్టెంట్ డైరెక్టర్ జయని పంపించండి. ఆమె చెప్పే విధానంలో చాలా క్లారిటీ ఉంటోంది...' అనే వారు. ఆ విధంగా ఒక వైపు షూటింగూ , మరో వైపు 'విజయ' , 'బొమ్మరిల్లు' ల కోసం రచనల సమీక్షా..21 రోజులు గుంటూరు దగ్గర అమరావతిలో గడిచాయి. వెనక్కి మద్రాసు వచ్చేశాము.

ఆ రోజుల్లోనే 'ఆంధ్రజ్యోతి' నుంచీ నాకు మళ్ళీ పిలుపు వచ్చింది 'మద్రాసు ఆఫీసులోనే చేస్తావా?" అని. లోగడ డైలీ లో చేస్తానని అడిగాను కాబట్టి ఒకవేళ మద్రాసు 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో అవకాశమనుకుని ఎగిరి గంతేశాను. కానీ వాళ్ళు అడిగింది వారపత్రిక 'జ్యోతిచిత్ర' కోసం!!

'జ్యోతిచిత్ర' సినిమా పత్రికని లక్ష కాపీల సర్క్యులేషన్‌కి తీసుకెళ్ళాలన్నది లక్ష్యం. దాన్నీ ఛాలెంజ్‌గా తీసుకుని 'జ్యోతిచిత్ర'కి వెళ్ళాను. అక్కడ కెరీర్ ఒక గొప్ప అనుభవం. చాలా డేరింగ్ ఆర్టికిల్స్ వ్రాశాను. యాజమాన్యం ఆశించినట్లే సర్క్యులేషన్ కూడా బాగా పెరిగింది. ఏ సినిమాలైతే అస్సలు ఇంట్రెస్టు లేదనుకున్నానో అదే సినిమా పరిశ్రమలో రోజంతా గడపాల్సి వచ్చేది. అన్ని విభాగాల టెక్నీషియన్స్‌నీ ఇంటర్వ్యూలు చేస్తుండే దాన్ని. అక్కడ ఉండగానే కృష్ణారెడ్డి గారికి 'సింధూరపువ్వు' సినిమా కొనడంలో సహాయం చేశాను. ఆ సినిమా డబ్బింగ్‌కే , తరువాత కూడా పి.ఆర్.వొగా పనిచేశాను. తరువాత తమ్మారెడ్డి భరద్వాజ గారు 'అలజడి' సినిమాకి దర్శకత్వం వహిస్తూ నన్ను పి.ఆర్.వొగా ఉండమన్నారు. నాకు అంత ఇష్టం లేకపోయినా ఆయన మాట కాదనలేక ఒప్పుకున్నాను. పేరుకి పి.ఆర్.వొనే ఐనా కథా, సంభాషణలూ, దర్శకత్వం..అన్నింటిలోనూ ఉండేదాన్ని. ఈ అనుభవాల వల్ల సినిమా నిర్మాణం అంటే ఒక అవగాహన వచ్చింది.

అంతకు ముందే బి.ఎ రాజు గారితో పరిచయం. ఇద్దరం 'జ్యోతిచిత్ర' నుంచీ బయటికి వచ్చి 'సూపర్ హిట్' మాగజైన్ మొదలుపెట్టాం. నిజానికి అప్పట్లో సైకాలజీ మీద ఎం.ఫిల్ చేద్దామనిపించి, అప్లికేషన్ కూడా పెట్టాను కానీ రాజు గారి ప్రోద్భలంతో 'సూపర్ హిట్'తో కంటిన్యూ అయ్యాము. తెలుగులో అదే మొట్టమొదటి ఫుల్ డెమ్మీ సినిమా పత్రిక. ఆ సైజులో 'స్క్రీన్'పత్రిక ఉండేది కానీ ఫుల్ కలర్ పేజీలతో గ్లాసీ పేపర్‌తో వచ్చింది మాదే మొదటి పత్రిక. చాలా మంది మాకు జాగ్రత్తలు చెప్పారు. 'ఇది చాలా రిస్కీ బిజినెస్. మీరు ఏమాత్రం దెబ్బతిన్నా మళ్ళీ ఏమి చెయ్యడానికి ఉండదు..'అని. అది నిజం కూడా. ఐనా

ధైర్యంతో ముందుకెళ్ళాం. ఒడుదుడుకులు వచ్చినా తట్టుకుని గత 16 సంవత్సరాలుగా దాన్ని విజయవంతంగా నడుపుతున్నాం.



చెప్పాను కదా.. ముందునుంచీ నా సహజ స్వభావరీత్యా ఏ వృత్తిలోనూ అలానే ఏళ్ళు తరబడి ఉండలేను. మొనాటనస్‌గా అనిపిస్తుంది. 'సూపర్ హిట్' ఒక గాడిలో పడ్డాక, సినీ నిర్మాణం వైపు వెళ్ళాలనిపించింది. సినిమాల్లో పెట్టిన పెట్టుబడి తిరిగి రావడమనేది కేవలం .0001 శాతం అని అందరికీ తెలిసిన విషయమే. ఐనా అన్ని సంవత్సరాలు సినిమా పరిశ్రమలో ఉన్న అనుభవంతో మంచి ప్రోజెక్టు చేద్దామనే ఉద్దేశంతో మా నిర్మాణంలో 'ప్రేమతో పావని కళ్యాణ్' సినిమా మొదలు పెట్టాం. అప్పటికి రచయితగా ఉంటూ 'మందారం' అనే సినిమాకి దర్శకత్వం వహించిన ఘటికాచలం గారిని దర్శకుడిగా పెట్టుకున్నాం. 2002లో మొదలుపెట్టి కొన్ని నెలల్లోనే విజయవంతంగా విడుదల చెయ్యగలిగాము. అన్ని సంవత్సరాలూ పరిశ్రమలోని విభాగాలన్నింటినీ దూరంగా పరిశీలించిన నాకు వాటిల్లో ప్రత్యక్షంగా పనిచేసే సదవకాశం మా మొదటి సినిమాతో లభించింది. పెద్ద హిట్ కాకపోయినా 'పాస్ మార్కులు' వచ్చాయి మొదటి సినిమాకే. పరిశ్రమలో వాళ్ళకి మామీద 'వీళ్ళు మంచి సినిమాలు చెయ్యగలరు' అని నమ్మకం కలిగింది.

ఆ ఉత్సాహ ప్రోత్సాహాలే 'చంటిగాడు'కి పునాది. 'చంటిగాడు' కథ అనుకున్నప్పుడు నేను దర్శకత్వం చెయ్యాలనుకోలేదు. ఇండస్ట్రీలో ఒక సీనియర్‌మోస్ట్ కో-డైరెక్టర్ ని 'చంటిగాడు' కి దర్శకత్వం చెయ్యమని అడిగాము. కథంతా విన్నాక 'జయగారూ.. నేనేదో ఇండస్ట్రీలో పదికాలాలు ఉండాలనుకుంటున్నాను. ఇలాంటి సినిమాకా నన్ను డైరెక్ట్ చెయ్యమంటున్నారు?. నా సిన్సియర్ సలహా ఏమంటే దీన్ని మీరు నిర్మించకండి.. పొరబాటున కూడా దర్శకత్వం చెయ్యకండి. ఈ కథ ప్రేక్షకులకి అస్సలు పనికిరాదూ..' అని చెప్పారాయన.

ఐతే 'చంటిగాడు' కథ నా మనసుకి దగ్గరగా ఉండే కథ. నేను ఎంతో ఇష్టపడి తయారు చేసుకున్న కథ. ఒక విధంగా హీరో కేరక్టర్‌లో నా బాల్యపు ఛాయలు కనిపిస్తాయి. సినిమా ఆపే ప్రసక్తే లేదు, కాబట్టి నేనే దర్శకత్వం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. సఖినేటిపల్లి (మూగ మనసులు సినిమా తీసింది ఇక్కడే) నుంచీ నర్సాపురం వెళ్ళి చదువుకోవాలంటే 'చంటిగాడు'లో చూపించినట్లు లాంచీలో వెళ్ళి రావలసిందే. అక్కడే మా మావయ్యలు కూడా ఉండేవారు. బాలాదిత్య, సుహాసినిల ఎంపిక కూడా సాహసమే. సుహాసినిని హీరోయిన్‌గా సెలెక్ట్ చేశాక మూడు నెలల పాటు భిక్షు గారి వద్ద నటనలో తర్ఫీదు ఇప్పించాము. సాధారణంగా మొదటి సారి సినిమా తీసేప్పుడు కొత్త తారాగణమైతే అనుభవమున్న టెక్నీషియన్స్‌ని, అనుభవమున్న నటీనటులుంటే కొత్త టెక్నీషియన్స్‌నీ పెట్టుకోవడం ఒక



అలవాటు. అలా ఐతే ఒక విధమైన బాలెన్స్ ఉంటుందని. నేను మాత్రం నటీనటులతో పాటు టెక్నీషియన్స్‌ని కూడా చాలా మందిని కొత్తవాళ్ళనే పెట్టుకున్నాను. మొత్తం షూటింగ్ అంతా సందడి సందడిగా జరిగింది. ఈ సినిమాలోనే ఆహుతి ప్రసాద్‌గారు గోదావరి మాండలీకంలో మాట్లాడ్డం మొదలు పెట్టారు. తర్వాత చాలా సినిమాల్లో అదే డైలాగ్ డెలివరీ సూపర్ హిట్ ఐంది ప్రసాద్ గారికి.

'చంటిగాడు' సినిమా 2003 చివరలో రిలీజైంది. 'ఎ' సెంటర్లలో ఒక మాదిరిగా నడిచినా 'బి','సి' సెంటర్లలో బాగా ఆడింది. దర్శకురాలిగా నాకు మంచి పేరు వచ్చింది. సినిమా యూనిట్‌తో కలిసి ఆంధ్రదేశమంతా పర్యటించినప్పుడు అఖండమైన స్పందన లభించింది. ఇండస్ట్రీలోని

ప్రముఖులంతా నన్ను వ్యక్తిగతంగా అభినందించారు. కొంతమంది 'బాపు' గారి ఛాయలు కనిపించాయనీ, మరికొంతమంది పాటల చిత్రీకరణలో రాఘవేంద్రరావు గారి షేడ్స్ ఉన్నాయని అన్నారు. అవి నాకు మరచిపోలేని కాంప్లిమెంట్స్. నా క్లోజ్ ఫ్రెండ్స్, ఫేమిలి మెంబర్స్ ఈ సినిమా చూసి 'నువ్వు మద్రాసులో పెరగడం..నీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు చూసి ఏదో అర్బన్ బ్యాక్ గ్రౌండ్ సినిమా తీస్తావనుకున్నాం. కానీ ఇలాంటి ఫక్తు పల్లెటూరి సినిమా తోసి హిట్ కొడతావనుకోలేదు..' అన్నారు. ఇదీ నాకు గొప్ప సర్టిఫికెట్. వివిధ సంస్థలు చాలా బహుమతులు ఇచ్చారు 'చంటిగాడు'కి.

మొట్టమొదటి సారి ఎనిమిదేళ్ళ వయసులో కవిత ప్రింట్ ఐ ఉత్తరాలు వచ్చినప్పుడు మనసులో అస్పష్టంగా మెదిలిన భావనే , ఇన్నేళ్ళ తర్వాత 'చంటిగాడు' విజయంతో ఋజువైంది..

' మనభావం ఎక్కువమందిని చేరి, వాళ్ళని ప్రభావితం చెయ్యాలంటే మన ఎక్స్‌ప్రెషన్ ప్రతిభావంతంగా ఉండాలి ' !!

(అక్టోబర్ 2009 సంచికలో ప్రచురితం)

# సింగీతం శ్రీనివాస రావు

**కె.వి.రెడ్డి గారి** బడి నుంచీ వచ్చిన దర్శకులు సింగీతం శ్రీనివాస రావుగారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 55 సినిమాలకి దర్శకత్వం వహించిన సింగీతం గారు, దక్షిణభారత చలనచిత్ర చరిత్రలో తనకంటూ అనేక మైలురాళ్ళు ఏర్పరచుకున్నారు. ప్రయోగాత్మక చిత్రాలలో వ్యాపారాత్మక విలువలని రంగరించి, హిట్ సినిమాలు తీసే దర్శకత్వపు మెలకువలు సింగీతం గారికి మాత్రమే తెలుసు. ఆయన అందుకున్న అవార్డులు, రివార్డులు లెక్కలేనన్ని ఉన్నాయి. అనేక సినిమాలకి తెలుగు, కన్నడ, తమిళ భాషలన్నింటిలోనూ ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు ఎవార్డులు అందుకున్నారు. అయన ప్రతిభ గురించి చెప్పాలంటే పుష్పక విమానం, ఆదిత్య 369, విచిత్ర సోదరులు, మేడమ్, తరం మారింది, భైరవద్వీపం, మయూరి, పంతులమ్మ, అమెరికా అమ్మాయి, మైకేల్ మదన కామరాజు.. ఇలా ఎన్నైనా ఉదహరించవచ్చు. కేవలం దర్శకుడిగానే కాక నటుడిగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా కూడా కొన్ని సినిమాల్లో కనిపించారు. 78 ఏళ్ళ వయసులో కూడా ఇంకా యువకుడిలా పనిచేస్తున్నారు. సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువ. ఆయన లేటెస్ట్ ప్రోజెక్టు, ఏడు భాషల్లో రూపొందిన 'ఘటోత్కచుడు' యానిమేషన్ సినిమా. దీనికి కైరో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక బహుమతి లభించింది. దానికోసం ఇటీవలే సతీ సమేతంగా ఈజిప్టు వెళ్ళివచ్చారు. త్వరలోనే 'ట్రాఫిక్ జామ్' అనే వినూత్న చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందించబోతున్నారు. మొదటి సినిమా వరకూ సాగిన ఆయన జీవన ప్రస్థానం గురించి ఈ నెల 'మొదటి సినిమా' శీర్షికలో చదవండి.



**సెప్టెంబర్ 21, 1931న నేను పుట్టింది నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిలో.** నాన్నగారు సింగీతం రామచంద్రరావు, అమ్మ పేరు శకుంతలాబాయి. నాకు ఊహ తెలిసే సరికి గూడూరు వచ్చేశాము. నాన్నగారు స్కూలు హెడ్మాస్టారుగా పనిచేసే వారు. నాన్న గారికి మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉండేది. అదే నాకు వచ్చింది. నామీద నేను జోక్స్ వేసుకోవడం నాకు ఇప్పటికీ సరదానే. అమ్మ మంచి వయొలినిస్ట్. నా చిన్నతనంలోనే తను వయొలిన్ మీద కర్ణాటక సంగీతం వాయిస్తుండేది. అమ్మగారి నాన్నగారు, అంటే మా తాతగారు, జిల్లా జడ్జిగా పనిచేసే వారు. అమ్మ వయొలిన్ వాయించడంతో బాటు పెయింటింగ్స్ కూడా వేస్తుండేది. నేను మాటలు నేర్చిన వయసునుంచే సంగీత సాధన పట్ల ఆకర్షణ మొదలైంది. ఇప్పుడైతే ఏమీ గుర్తు లేదుకానీ మూడో వయసులోనే శృతి చెబితే దానికి తగినట్లు పాడేవాడినట! అమ్మ నుంచీ నేర్చుకోవడం వల్లనే చిన్నప్పటినుంచే బొమ్మలు వేయడంలో కూడా ఆసక్తి పెరిగింది. చిన్నప్పుడే చాక్ పీస్ తీసుకుని నేలమీద ఇల్లంతా బొమ్మలు గీస్తుండేవాడిని. నాకు ఏడో వయసు ఉన్నప్పుడే భక్తధృవ నాటకంలో ధృవ వేషం వేసి స్టేజి మీద పద్యాలూ, పాటలూ పాడాను. హైస్కూలుకి వచ్చాక స్టేజి నాటకాలలో వేషాలు వెయ్యడం పెరిగింది. నటనకంటే పాటలు పాడే టాలెంట్ వల్ల నన్ను ఎక్కువగా నాటకాల్లోకి తీసుకుంటుండే వాళ్ళు. ఆరో ఫారమ్ లో ఉండగా అనుకుంటాను, కె.వి.రెడ్డి గారి 'భక్తపోతన' సినిమా చూశాను. అది నామీద గొప్పప్రభావాన్ని కలిగించింది. ఒక్కసారి చూస్తే సినిమా అంతా గుర్తుండి పోయేది. అసలు సినిమా అంటే ఏమీ తెలీని రోజుల్లో నాటకాలనే ఫోటోలు తీసేస్తే సినిమా ఐపోతుందని అనుకునేవాడిని.

అక్కడినుంచీ మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్సీ(ఫిజిక్స్)లో చేరాను. చదువు ఒక పక్కన సాగుతున్నా హైస్కూల్లో మొదలైన నాటకాల ఆకర్షణ పోలేదు. మద్రాసులోనే హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ (సరోజినీ నాయుడు గారి సోదరుడు) ఇంగ్లీషు నాటకాలు వేస్తుండేవారు. ఆయన నిర్వహించే రిపర్టరీలో చేరి, రంగస్థల నాటకాల రూపకల్పన, దర్శకత్వంలో మొదటి పాఠాలు నేర్చుకున్నాను. అవన్నీ ఇంగ్లీషు నాటకాలే.



సినిమాల విషయానికొస్తే అంతవరకూ కేవలం తెలుగు, తమిళం.. మహా ఐతే కొంచెం హిందీ సినిమాలకే పరిమితమైన మా జ్ఞానం చెన్నై వచ్చాక హాలీవుడ్ సినిమాలకి కూడా ఎదిగింది. ఆ సినిమాలతో పోలిస్తే మన సినిమాల్లో కృత్రిమత్వం పాలు ఎక్కువేమో అనిపించింది. హాలీవుడ్ సినిమాలే ఇలా ఉంటే ఇంకా ప్రపంచభాషల్లోని మిగతా సినిమాలు ఎలా వుంటాయోనన్న ఆసక్తి కలిగింది. ఆ ఆలోచనే మిత్రులతో కలిసి ఇంటర్నేషనల్ ఫిల్మ్‌క్లబ్ మొదలు పెట్టడానికి దారితీసింది. బ్రిటిష్ కౌన్సిల్ వాళ్ళు ఆ రోజుల్లో అనేక విదేశీ సినిమాలు తెప్పిస్తుండేవారు. అన్నీ 16 మి.మీ. సినిమాలే. ఈ సినిమాలు బయట థియేటర్స్‌లో ఆడేవి కావు. వాళ్ళ సహాయంతోనే మా ఫిల్మ్‌క్లబ్ నడిపేవాళ్ళం. ఆ రోజుల్లోనే సినీ సంగీతదర్శకులు ఎస్.రాజేశ్వరరావు గారికి విపరీతమైన అభిమానిని. ఆయన సంగీతమంటే చెవికోసుకునే వాడిని. (ఇటీవలే నేను స్వరపరిచిన పాటలతో రాజేశ్వరరావు గారికి నివాళిగా 'చల్లగాలిలో' అనే సి.డిని విడుదల చేశాను. యాభై సంవత్సరాల తర్వాత రాజేశ్వరరావు గారికి నా అభిమానాన్ని అంకితం చేసే అవకాశం లభించింది). కాలేజీలో చదివేప్పుడే

కాస్త రచనా వ్యాసంగంలో కూడా అడుగు పెట్టాను. అప్పట్లో 'తెలుగు స్వతంత్ర' పత్రికకి సంపాదకుడిగా వున్న ఖాసా సుబ్బారావు గారు మా పెదనాన్న గారికి మిత్రులు. ఆయన ప్రోత్సాహంతో 'తెలుగుస్వతంత్ర'లో చిన్న చిన్న కథలూ వగైరా వ్రాస్తుండేవాడిని.

సంగీతంలో ప్రవేశం, రచనావ్యాసంగంలో మొదటి అడుగులు, పెయింటింగ్‌లో కాస్త అనుభవం, సినిమాల పట్ల ఆకర్షణ, రంగస్థల శాఖలో శిక్షణ..ఇవన్నీ నాలో నేనే విశ్లేషించుకుంటే నాకు ఈ లైనులోనే భవిష్యత్తు చూసుకోవడం మంచిదనే నిర్ణయానికి వచ్చాను. అలా ఐతే మద్రాసులో ఉన్న నాకు కనిపించిన ఒకే ఒక అవకాశం తెలుగు సినిమా రంగం. అప్పటికీ కె.వి.రెడ్డి గారి భక్తపోతన కలిగించిన ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. చేస్తే ఆయన వద్దనే శిష్యరికం చెయ్యాలని నిర్ణయించుకున్నాను. ముందుగా కె.వి.రెడ్డి గారు ఎక్కడ ఉంటారో తెలుసుకోవడం ఒక ప్రోజెక్టు. కొద్ది రోజుల్లోనే అది విజయవంతంగా ముగిసింది. తరువాతి దశ ఆయన్ని కలుసుకోవడం..ఆఫీసు గుమ్మం వద్ద పడిగాపులు పడడం, స్టూడియో గేటుల వద్ద ఎదురుచూడడం..ఇవన్నీ అయ్యాక ఒకసారి చాలా కొద్ది సమయం ఆయన్ని కలుసుకునే అవకాశం కలిగింది. అప్పటికి నా బి.ఎస్సీ పూర్తయింది. కె.వి.రెడ్డి గారు నన్ను బాగా నిరుత్సాహ పరిచారు. 'బాబూ.నీ లాగ అన్ని ఇంట్రెస్టులూ ఉన్నవాళ్ళు బోలెడంత మంది రోజూ వస్తుంటారు. ఇది చాలా రిస్కీ ఫీల్డు. శుభ్రంగా ఏదైనా ఉద్యోగం చూసుకో. సినిమాల్లోకి రావాలనే ఆలోచన తుడిచిపెట్టెయ్..' అని బ్రెయిన్ వాష్ చేసి పంపించారు. నేను చెప్పేది ఇంకేమీ వినలేదు.

ఏమి చెయ్యాలప్పుడు..!? ఏమీ వ్యాపకం, ఉద్యోగం లేకుండా తిని కూర్చోవడానికి అమ్మానాన్నా నన్ను సపోర్ట్ చేసే పరిస్థితిలో లేరు. ఇంక తప్పని సరిగా మద్రాసు వదిలి ఇంటికి వెళ్ళాల్సిన పరిస్థితి. ఐతే సినిమా డైరెక్షన్‌లో అవకాశం రాకపోతే నేను చెయ్యదలచుకున్న పని టీచింగ్. అంటే ఏదో ఒక స్కూల్లో టీచర్‌గా పనిచెయ్యడం కాక సొంతంగా శాంతినికేతన్ లాంటి సరికొత్త విద్యావిధానాన్ని ప్రోత్సహించే ఒక వ్యవస్థని ఏర్పాటు చెయ్యాలని ఉండేది. అప్పటికి నాన్నగారు సూళ్ళూరుపేట హైస్కూల్లో హెడ్మాస్టారుగా ఉద్యోగం చేస్తున్నారు. ఆయన స్కూల్లోనే సైన్సు అసిస్టెంటు అవసరం ఉంది. నన్ను ఆ పోస్టులోకి తీసుకున్నారు. నేను చేరేటప్పటికి విద్యాసంవత్సరం ముగియడానికి మరొక్క ఆరునెలలు మాత్రమే ఉంది. అప్పుడు చేరి, మరుసటి సంవత్సరం చివరి వరకూ - అంటే మొత్తం సంవత్సరంన్నరపాటు అక్కడే పనిచేశాను. నాన్న హెడ్మాస్టారు, నేను సైన్సు టీచర్‌ని.



పిల్లలకి పాఠాలు చెప్పడంలో నేను అనుకున్నట్లే కొత్త పద్ధతులు ప్రవేశపెట్టాను. క్లాసు టెస్టుల్లో ఓపెన్ బుక్ ఎక్జామ్ మొదలుపెట్టాను. ముందు పిల్లలు ఆశ్చర్యపోయారు. 'మీరు పుస్తకాలు చూసి సమాధానాలు వ్రాయొచ్చు' అన్నాను. ఇంకేముందీ అందరూ శుభ్రంగా కాపీ చేశారు. ఎవరి పేపర్ వారినే దిద్దుకోమని చెప్పాను. అందరికీ నూటికి నూరు శాతం వచ్చాయి. మళ్ళీ నెలలో జరిగే క్లాసు టెస్టులో ఒక్కరుకూడా పుస్తకం చూస్తే ఒట్టు. పరీక్షలనేవి టీచర్‌ని ఇంప్రెస్ చెయ్యడానికి కాదు, తమ మంచికోసం అనే విషయాన్ని వాళ్ళు ప్రాక్టికల్‌గా నేర్చుకున్నారు. అలానే ఇంకోసారి మాథ్స్ పేపర్ సెట్ చేస్తూ అన్నింటికీ ఆన్సరు 50 వచ్చేలా ప్రశ్నలు ఇచ్చాను. రెండు మూడు చేసే సరికి వాళ్ళకి ప్రశ్నల గురించి డౌట్ వచ్చి ప్రతి దానికీ స్టెప్స్ అన్నీ వెయ్యడం మొదలుపెట్టారు. నాన్న గారికి నేను చేసే ఇలాంటి విచిత్రమైన పద్ధతులు నచ్చేవి కాదు. ఆయన హెడ్మాస్టారు ఐనా, ఆయన చెప్పినట్లు వినకపోయినా, నేను చేసే విధానాలే మంచివని నిరూపించేవాడిని.

నేనక్కడ ఉన్న సమయంలోనే పిల్లలతో నాటకాలు తయారు చేయించి ఇంటర్ కాలేజీ పోటీల్లో ప్రదర్శించాము. మాది హైస్కూలు కాబట్టి కాలేజీ పోటీల్లో మాకు అవకాశం ఉండదు. ఐతే మా ప్రొడక్షన్ చూపించి ప్రత్యేక అనుమతితో ఆ పోటీల్లో పాల్గొన్నాము. అంత పోటీలోనూ మేము తీసుకెళ్ళిన నాటికకే ఉత్తమ ప్రదర్శన, ఉత్తమనటుడు అవార్డులు వచ్చాయి. అందులో ఉత్తమ

నటుడు వేసినతను పేద విద్యార్థి. ఈబహుమతివల్ల అతనికి డిగ్రీ అయ్యేవరకూ చదువుకోడానికి స్కాలర్ షిప్‌వచ్చింది. (ఇప్పుడాయన వృద్ధాప్యంలో ఉన్నారు. ఆయన పిల్లలంతా అమెరికాలో ఉన్నారు. ఇప్పటికీ 'గురువుగారూ..అప్పటి మీ నాటకమే నా లైఫ్‌కి ఒక దారి చూపించింది' అంటుంటారు).

ఇలా ఉద్యోగం సాగుతున్నా నా మద్రాసు ప్రయత్నాలు మానలేదు. సుళ్ళూరుపేటనుంచీ మద్రాసు గంటన్నర ప్రయాణమే. అప్పుడప్పుడు వెళ్ళి కె.వి.రెడ్డి గారిని విసిగించడం మానలేదు. మొత్తానికి నాకు సినిమాలపట్ల ఆసక్తి అనేది చాలా ఇంటెన్సివ్ అని తెల్సింది. కొద్ది రోజులకి ఆయన ఆఫీసులో వరండాలో కొంచెం సేపు కూర్చోగల స్థాయికి వెళ్ళగలిగాను..! అవకాశం సంగతి తరువాత..కనీసం కె.వి.రెడ్డి గారి ఆఫీసులో కూర్చోగల అవకాశం వచ్చింది గదా అని మురిసిపోయేవాడిని.

కె.వి.రెడ్డి గారితో అప్పుడప్పుడూ కొద్ది నిమిషాలు మాట్లాడే అవకాశం దొరకడమే గొప్పగా భావించాను. ఆ సమయంలో పెదనాన్నగారు ఉమ్మడి దక్షిణాది రాష్ట్రాలకి పోస్ట్‌మాస్టర్ జెనరల్‌గా పనిచేసే వారు. ఆయనద్వారా మద్రాసులో నివసించగలిగే ఉద్యోగం ఏదైనా దొరుకుతుందేమోనని ప్రయత్నించాను. ఆయన నాకు పోస్టల్ ఆడిటింగ్‌లో ఉద్యోగం వేయించారు. సూళ్ళూరుపేటలో అమ్మా నాన్నలని ఒప్పించి మద్రాసు చేరుకున్నాను. దానితో కె.వి.రెడ్డి గారిని తరచూ కలిసే అవకాశం లభించింది. కొన్నిరోజుల తర్వాత 'నీలోని సినిమా ఆసక్తి జెన్యుయన్‌గానే అనిపిస్తోంది. అయితే నీకో పని అప్పగిస్తాను. దాన్ని ఎలా పూర్తిచేస్తావో, దాన్ని బట్టి నావద్ద అవకాశం ఇస్తాను. ఈ పనికి మాత్రం ఏమీ పారితోషికం ఉండదు. అలానే ఇదవ్వగానే నీకు గ్యారంటీగా అవకాశం వస్తుందని కూడా చెప్పలేను. ఇది నీకు పరీక్షమాత్రమే అనుకో..' అని కె.వి.రెడ్డి గారు నాకో ఆలివర్ గోల్డ్‌స్మిత్ నవల ఇచ్చారు. దాన్ని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగులో సినిమా స్క్రిప్ట్‌లా వ్రాయాలి. ఛాలెంజింగ్‌గా తీసుకున్నాను. అప్పటికి సినిమా స్క్రిప్టు ఎలా ఉంటుందీ. స్క్రీన్ ప్లే అంటే ఏమిటో ఏమీ తెలీదు. లైబ్రరీలకి వెళ్ళి విదేశీ పుస్తకాలని చదివి, మూడు నెలల్లో స్క్రిప్టు తయారు చేశాను. రెడ్డి గారి వద్దకి వెళ్ళాను. మొదటి పరీక్షలో నెగ్గాను.

"శ్రీనివాస రావు ..నిన్ను నాదగ్గర అప్రెంటిస్ గా తీసుకుంటానయ్యా..ఐతే ముందుగా నువ్వు అన్‌పెయిడ్‌గానే పనిచెయ్యాలి" అన్నారు. నా ఆనందానికి హద్దులు లేవు. జీతం సంగతి సరే అసలు రెడ్డి గారి వద్ద పనిచేసే అవకాశమే బంగారం కదా ..!




అప్పుడే 'మాయాబజార్' స్క్రిప్టు తయారైంది. దానికి నేను రెడ్డిగారి వద్ద అప్రెంటిస్‌గా చేరాల్సి ఉంది. ఐతే నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి గార్లకి ఆ స్క్రిప్టు నచ్చలేదు. సినిమా నిర్మాణానికి ధైర్యం చాలలేదు. అందువల్ల ముందుకి సాగలేదు. ఐతే ఎప్పటినుంచో కె.వి.రెడ్డి గారితోనే తమ మొదటి సినిమా తియ్యాలని వేచిచూస్తున్న అన్నపూర్ణా పిక్చర్స్ వాళ్ళకి, ఇది మంచి అవకాశమైంది. వాళ్ళకి 'దొంగరాముడు' తీసిపెట్టడానికి రెడ్డిగారు ఒప్పుకున్నారు. ఆ విధంగా నేను సినిమా రంగంలో ప్రవేశించింది 'దొంగరాముడు'కి అప్రెంటిస్ గా. చాలా ఉద్వేగభరితమైన రోజులు. తెలుగు చిత్రరంగంలో మహామహులు అనదగ్గ వారందరినీ దగ్గరగా పరిశీలించే అవకాశం లభించింది. 'దొంగరాముడు' అవగానే నాగిరెడ్డి-చక్రపాణి గార్లు 'మాయబజార్' తీద్దామని నిర్ణయించుకున్నారు. ఆ విధంగా దానికి కూడ నేను అన్-పెయిడ్ ట్రైనీగా పనిచేశాను. కె.వి.రెడ్డి గారి వద్దనుంచీ అద్భుతమైన క్రమశిక్షణ, ప్లానింగ్ మొదటి రెండు సినిమాల్లోనే చాలా నేర్చుకున్నాను. ఎన్ని సెకన్లు కెమేరా తిరిగితే ఎన్ని రీళ్ళు ఎక్స్‌పోజ్ ఔతాయో, మొత్తం సినిమా లెంగ్త్‌కి ఎన్ని రీళ్ళు ఎక్స్‌పోజ్ చెయ్యాలో ముందే లెక్కవేసుకునే వారు. ఖచ్చితంగా అన్నే రీళ్ళు తీసే వాళ్ళు. ఒక్క అడుగు ఎక్కువా

అయ్యేది కాదు, ఒక్క అడుగు తక్కువా అయ్యేది కాదు. (నా దర్శకత్వంలో కూడ ఇదే క్రమశిక్షణని పాటించేవాడిని. వీటన్నింటికీ గురువు గారు రెడ్డి గారే మార్గదర్శకులు).

సరే...రెండు సినిమాలు అయ్యాక "శ్రీనివాస రావ్..నిన్ను అఫిషియల్‌గ అసిస్టెంట్‌గా తీసుకుంటానయ్యా.." అన్నారు. అది 'పెళ్ళినాటి ప్రమాణాలు' చిత్రం..!

అప్పట్లో అసిస్టెంట్ డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్ అని రెండే దశలుండేవి. ఇప్పట్లోలాగ కో-డైరెక్టర్ అనే పోస్టు ఉండేది కాదు.

మొదటి రెండు సినిమాల్లో నా వర్క్ చూసి నన్ను సరాసరి అసోసియేట్ డైరెక్టర్‌గా రికమెండ్ చేశారు కె.వి.రెడ్డి గారు. ఆ సినిమాకి పేరుకి నిర్మాత, దర్శకుడు కె.వి.రెడ్డి గారే కానీ సమర్పణ పి.ఎస్.రెడ్డి, సహనిర్మాత తిక్కవరపు పట్టాభిరామి రెడ్డి ('పతాభి పన్‌చాంగం','ఫిడేలు రాగాలు' రచయిత). నిర్మాణ సంస్థ వాళ్ళు నాకు అప్పాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి, ఒక్కసారి కె.వి.రెడ్డి గారికి చూపించమని నన్ను పంపించారు. ఆయన ఆ లెటర్లో ఒక మార్పు చెయ్యమని చెప్పారు. నాకు 'అసోసియేట్ డైరెక్టర్' అని కాక 'అసొసియేట్ టు డైరెక్టర్ ' అని మార్పించురమ్మన్నారు. పేరు అదే ఐనా 'అసోసియేట్ డైరెక్టర్' అని అంటే ఆ సంస్థ సినిమాలన్నింటికీ, (ఏ డైరెక్టరైనా కానీ) నేనే అసోసియేట్ డైరెక్టర్ అనే అర్థం వస్తుంది. అలా కాక 'అసోసియేట్ టు డైరెక్టర్' అని ఉంటే నేను కె.వి.రెడ్డి గారికి మాత్రమే అసోసియేట్‌ని అనే అర్థం వస్తుంది..! అంత స్పష్టంగా ఉండేవారు కె.వి.రెడ్డి గారు..!

ఆ సినిమా నిర్మాణ సమయంలోనే పట్టాభి గారితో మంచి స్నేహం కుదిరింది. అలా అఫిషియల్‌గా మొదలైన నా ప్రయాణం 15 సంవత్సరాలు పైబడి, 'ఉమా చండి గౌరి శంకరుల కథ' వరకూ కె.వి.రెడ్డి గారితోనే నడిచింది. పింగళి నాగేంద్రరావు గారు నన్ను బాగా ప్రోత్సహిస్తూ ఉండేవారు. ఎప్పుడు ఏ సీన్ రాస్తున్నా నాకు టెస్ట్ పెట్టేవాళ్ళు. దాన్ని ఇంకోలా ఎలా వ్రాయొచ్చు అనీ, లేదా ఆ పాత్ర మరోలా ఉంటే ఎలా ఉంటుంది అనో సలహాలు తీసుకుంటుండే వారు. నాగిరెడ్డి - చక్రపాణి గార్లకి కూడ 'ఈ శ్రీనివాస రావు అన్న కుర్రాడికి మంచి భవిష్యత్తు ఉందండీ.. చాలా షార్ప్ 'అని చెబుతుండేవారు. 'ఉమాచండి గౌరి శంకరుల కథ' దారుణంగా ఫెయిలవ్వడం, నిర్మాతలకి, కె.వి.రెడ్డి గారికి విభేదాలు రావడంతో ఆయనకీ, పింగళి గారికీ కూడా అవకాశాలు మృగ్యమయ్యాయి. ఇంక నేనూ నిరుద్యోగినయ్యాను. నాకు ఇంకో దర్శకుడి వద్ద పనిచెయ్యడం చేతకాదు. 'ఏం చెయ్యాలి..' సొంతంగా దర్శకత్వం కోసం ప్రయత్నించడం ఒకటే మార్గం.. అలాంటి సమయంలో డబ్బులకోసమని ,కొన్ని రోజులు, గ్రీటింగ్ కార్డులు తయారు చేసి, హిగ్గిన్ బాదమ్స్‌లో అమ్మాను.

ఆ సమయంలోనే పట్టాభిరామి రెడ్డి గారు కన్నడలో 'సంస్కార' సినిమా తీస్తూ, నన్ను సహాయం చెయ్యమని పిలిచారు. అప్పటికే దర్శక , నిర్మాతగా పట్టాభిరామి రెడ్డి గారి పేరు రిజిస్టరై ఉంది. అది అనంతమూర్తిగారి నవల (అదే పేరు) ఆధారంగా తీస్తున్న సినిమా. గిరీష్ కర్నాడ్, అనంత మూర్తి గారు ఇద్దరూ కలిసి స్క్రిప్టు సిద్ధం చేశారు. ఐతే పట్టాభిరామి రెడ్డి గారికి దర్శకత్వంలో ఏమీ అనుభవం లేదు. అందుకే నన్ను పిలిచారు. నాకు 'ఎక్జిక్యూటివ్ డైరెక్టర్' అనే టైటిల్ ఇచ్చారు. అలాంటి టైటిల్ అప్పటికీ, ఇప్పటికీ ఎక్కడా మన సినిమా రంగంలో లేదు..! పేరు ఏదైనా మొత్తానికి సినిమా అంతా నా దర్శకత్వంలోనే నడిచింది. టెక్నికల్‌గా చెప్పాలంటే ఇదే నా మొదటి సినిమా అనుకోవచ్చు కానీ అఫిషియల్ డైరెక్టర్ అని మాత్రం పట్టాభిగారి పేరే ఉంది. కులవ్యవస్థకి వ్యతిరేకంగా ఉందని సెన్సార్ వాళ్ళు విడుదలకి అభ్యంతర పెట్టారు. ఎలాగో వాళ్ళని ఒప్పించాక విడుదలై (1971) రాష్ట్రపతి బంగారు పతకాన్ని కూడా గెలుచుకుంది. ..!

'సంస్కార' తరువాత, సూదిరెడ్డి శంకర రెడ్డి అనే మిత్రుడు (నాకు కె.వి.రెడ్డిగారి జయంతి పిక్చర్స్ నుంచీ నాకు వీరితో పరిచయం ఉంది. ఈయనా, 'లవకుశ' తీసిన ఎస్.శంకరరెడ్డిగారు ఒక్కరు కాదు) నా దర్శకత్వంలో తెలుగు సినిమా తీస్తానని ముందుకి వచ్చారు. కర్నూలు జిల్లాకి చెందిన లక్ష్మీకాంతరెడ్డి, సంజీవరెడ్డి అనే మిత్రులు ఆయనకి తోడుగా ఉన్నారు.

అలా మొదలైంది నా అఫీషియల్ మొదటి సినిమా 'నీతి-నిజాయితి'. ఇందులో హీరో మూగవాడు. తెలుగులో ఉన్న ఏ నటుడ్ని పెట్టినా ప్రేక్షకులకి తెలిసిపోతుంది. వాళ్ళు కథలో ఇన్వాల్వ్ కాలేరని నిశ్చయించుకున్నాం. ఆ పాత్రకి ఒక కొత్త నటుడు సతీశ్ అరోరాని తీసుకున్నాం. కాంచన హీరోయిన్. సీనియర్ నటుడు గుమ్మడిగారు ప్రధాన పాత్ర పోషించారు. అప్పటికి కె.వి.రెడ్డిగారు ఎన్టీఆర్‌తో 'శ్రీకృష్ణ సత్య' నిర్మాణంలో ఉండడం వల్ల వారి సహాయం తీసుకునేందుకు వీలుకాలేదు. పింగళి గారు చాలా వరకు స్క్రిప్టు వర్క్ చేశారు కానీ పూర్తికాక ముందే కాలం చేశారు. ఇంక సంగీతం అంటే గురువుగారు సాలూరి రాజేశ్వర రావు గారే.

సినిమా విడుదలయ్యాక ప్రెస్‌నుంచీ అద్భుతమైన రిపోర్టులు వచ్చాయి. స్నేహితులంతా ఫోన్ చేసి చాలా బాగా తీశానని అభినందించారు. ఐతే ప్రేక్షకులని ఆకట్టుకోలేకపోయింది. బాక్సాఫీసు వద్ద ఘోరంగా ఫెయిలయింది...! ఈ మధ్య నెవరికో ఈ సినిమా (నా మొదటి సినిమా అని చెప్పకుండా) కథ చెబితే 'అద్భుతంగా ఉంది. సినిమా తీద్దామా? ' అన్నారు..! తర్వాత చాలమంది చెప్పారు 'నువ్వు చాలా ఎడ్వాన్స్‌డ్ గా ఈ సినిమా తీసేశావు..'అని. తరువాత వచ్చిన 'పుష్పక విమానం',' ఆదిత్య 369' సినిమాల విషయంలో కూడా 'పదేళ్ళ తర్వాత రావలసిన సినిమాలు' అన్న ప్రశంసలు వచ్చాయి.

సరే..మొదటి సినిమా 'నీతి-నిజాయితి' ఫెయిలయింది. మీరు మొదటి సినిమా అన్నారు కాబట్టి నా ఇంటర్వ్యూని ఇక్కడితో ఆపెయ్యవచ్చు కానీ నన్ను దర్శకుడిగా నిలబెట్టిన రెండో సినిమా గురించి చెప్పకపోతే ఈ ఇంటర్వ్యూకి సమగ్రత రాదు. అలా మొదటి సినిమా ఫెయిలైన సమయంలో , ఒకాయన నా వద్దకి వచ్చారు. ఆయన నేనెప్పుడో 'తెలుగు స్వతంత్ర' లో వ్రాసిన రచనలు చదివి, నేను కె.వి.రెడ్డిగారి అసిస్టెంట్ నని తెలుసుకుని నన్ను కలుసుకున్నారు. 'నీతి-నిజాయితి' మొదలు కాక ముందే నాతో సినిమా తీస్తానని అనేవారు. ఈ సినిమా ఫెయిలయింది కాబట్టి ఇంక రారనుకున్నాను కానీ, నాకు చాలా ఆశ్చర్యం కలిగించేలా ఆయనే ముందుకి వచ్చారు. అయనే నవతా కృష్ణం రాజు గారు. నేను ముందే చెప్పాను 'ఇప్పటికి ఫెయిల్యూర్ డైరెక్టర్‌ని. మరి సినిమా మొదలుపెట్టాక పంపిణీదారులు రాకపోతే మీరు ఇబ్బందుల్లో పడతారు' అని. 'ఏదేమైనా సరే ఈ సినిమా మీతోనే తీస్తాను..'అని ధైర్యంగా ముందడుగు వేశారు. అనుకున్నట్లే కొన్ని రోజుల తర్వాత పంపిణీదారులు 'ఈయన ఫెయిల్యూర్ దర్శకుడు. ఈయన్ని మార్చండి' అన్నారు. కానీ కృష్ణమ్రాజుగారు 'నథింగ్ డూయింగ్. ఈ సినిమాకి శ్రీనివాసరావు గారే దర్శకులు. మీరు ఒప్పుకోకపోతే నేను వేరే డిస్ట్రిబ్యూటర్‌ని చూసుకుంటాను' అని వేరే పంపిణీదారుడ్ని చూశారు. అది అయనకీ మొదటి సినిమానే. పెద్ద పెద్ద నిర్మాతలైతే అంత ధైర్యం చేస్తారు కానీ కృష్ణంరాజుగారు అంత గట్టి నిర్ణయం తీసుకోవడం, నామీద అంత నమ్మకం ఉంచడం ఎప్పటికీ మరచిపోలేని విషయం..!

సొహరాబ్ మోడి నటించి, నిర్మించిన హిందీ సినిమా 'శీష్ మహల్' హక్కులుకొని, స్క్రిప్టు రెడీ చేసుకున్నాం. ఆ సినిమా 'జమిందారు గారి అమ్మాయి'. రంగనాథ్, శారద హీరో, హీరోయిన్లు. ఎస్.వి.రంగారావు గారిని మరో ప్రధాన పాత్రకి తీసుకున్నాం, కానీ ఆయన సినిమా నిర్మాణం మధ్యలోనే మరణించడం వల్ల గుమ్మడిగారితో అ సీన్లన్నీ రీషూట్ చేశాం. ఆ సినిమా సూపర్ హిట్ అవడంతో తర్వాత తర్వాత మీరంతా అభిమానించే ఎన్నో సినిమాలు తీసే అవకాశం నాకు లభించింది. ఇంత శ్రద్ధగా మీరు అమెరికా నుంచి తెలుగు పత్రిక నడుపుతూ, నాకోసం ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు. మీ పాఠకులకి అభినందనలు.

(నవంబర్ 2009 సంచికలో ప్రచురితం)

# ముప్పలనేని శివ

**ఆసక్తికరమైన కథ,** కథనాలతో ఎన్నో మంచి చిత్రాలని తెరకెక్కించి, మరో హిట్ కోసం ఎదురుచూస్తున్న ముప్పలనేని శివగారి మొదటి సినిమా ప్రస్థానం ఈ నెల కౌముది పాఠకులకి అందిస్తున్నాం. ముప్పలనేని శివగారి పేరు వినగానే ఆయన మొదటి హిట్ సినిమా 'తాజ్ మహల్', తర్వాత ఆయన దర్శకత్వం వహించిన 'రాజా','సంక్రాంతి','సందడే సందడి' లాంటి మంచి సినిమాలు ప్రేక్షకులకి గుర్తుకు వస్తాయి. నిజానికి ఆయన మొదటి సినిమా, కృష్ణ హీరోగా నటించిన, 'ఘరానా అల్లుడు' అని చాలా మందికి గుర్తు లేకపోవచ్చు. ఇటీవల తీసిన 'అల్లరే అల్లరి', 'లైఫ్ స్టైల్' అంతగా ఆడకపోయినా కథని అత్యంత ఆకర్షణీయంగా చెప్పగల నేర్పున్న అతి కొద్ది మంది దర్శకుల జాబితాలో శివగారి పేరు మాత్రం పదిలంగా వుంది.

చిత్రపరిశ్రమలో అత్యంత వివాద రహితుడిగా, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న ముప్పలనేని శివ నిర్మాత క్షేమాన్ని కోరే దర్శకుడు. చాలా సందర్భాల్లో నిర్మాత చిత్రం విడుదలకి కష్టాలు పడుతుంటే, నిర్మాత ఎప్పుడో తన కిచ్చిన చెక్కులు చించివేసి తన ఔదార్యాన్ని చాటుకున్న మంచి వ్యక్తి. కొత్త నిర్మాతలకి సినిమాలు తీశాక ఆ నిర్మాతలు మళ్ళీ మరికొన్ని సినిమాలు నిర్మించ గలిగిన పునాది ఇచ్చిన దర్శకుడు ముప్పలనేని శివ. మొత్తం 19 సినిమాలకి దర్శకత్వం వహించారు. వడ్డె నవీన్ (కోరుకున్న ప్రియుడు), శ్రీమాన్( ప్రియా..ఓ..ప్రియా) లాంటి నటీనటులని పరిశ్రమకి పరిచయం చేసి (శ్రీమాన్ అంతకు ముందు 'అబ్బాయిగారు' సినిమాలో నటించిన పేరు రాలేదు) వాళ్ళ నటజీవితాలకి పునాది వేశారీ దర్శకుడు. ఈ నాటి ప్రముఖ గీతరచయిత 'చంద్రబోస్' ఈయన సినిమా 'తాజ్ మహల్' ద్వారానే చిత్రరంగ ప్రవేశం చేసిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది.

కొత్త సంవత్సరంలో విజయవంతమైన చిత్రకథానాయకుడొకరు నటించే సినిమాకి దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రయత్నం వారి ఒకప్పటి సూపర్ హిట్ సినిమాల్లా విజయవంతం కావాలని ఆశిద్దాం.

**మా స్వగ్రామం గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకాలోని నరసాయపాలెం.** నాన్నగారి పేరు సుబ్బారావు గారు. అమ్మగారి పేరు లక్ష్మీ తులశమ్మ గారు. నేను పుట్టింది 1961, నవంబర్ 25న. మాది సాధారణ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. మేము ముగ్గురం అన్నదమ్ములం. మాకు ఒక చెల్లెలు. అందరిలోకీ నేనే పెద్దవాడిని. నా చదువు ఏడవతరగతి వరకూ అమ్మమ్మగారి వూళ్ళో, 'కొండపాటూరు' లో జరిగింది. తర్వాత హైస్కూలు చదువంతా నరసాయపాలెంలోనే. ఇంటర్మీడియట్, డిగ్రీ మాత్రం బాపట్లలో చేశాను. ఇంటర్మీడియట్ బై.పి.సి. గ్రూపు. అదవ్వగానే అగ్రికల్చరల్ బి.ఎస్సీ చేద్దామని అలహాబాద్ వెళ్ళాను. అక్కడి వాతావరణం నా ఆరోగ్యానికి సరిపడలేదు. అక్కడినించీ వెనక్కి వచ్చేశాను. ఈ ప్రయోగంలో ఒక సంవత్సరం వృధా అయ్యింది. వెనక్కి వచ్చేసి బాపట్లలో బి.ఏ లో చేరాను.



చిన్నప్పటి నుంచీ చిత్రలేఖనం అంటే చాలా ఇంట్రెస్టు ఉండడం మాత్రమే కాక అందులో బాగా ప్రాక్టీసు చేశాను. సైన్సు సబ్జెక్టు నుంచీ పక్కకి మళ్ళి బి.ఎలో చేరడానికి అది కూడా ఒక కారణం. మోడర్న్ ఆర్ట్‌లోనే మరింత స్పష్టత జోడించి నేను వేసిన చాలా పెయింటింగ్స్‌కి జిల్లాస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ కూడా అవార్డులు వచ్చాయి. చదువుకునే రోజుల్లో ఇలా పెయింటింగ్స్ వెయ్యడం ఒక హాబీ, సినిమాలు చూడడం మరో హాబీ. సినిమా చూసిన వాడిని వూరుకోకుండా ప్రతి సినిమా కథనీ మా ఫ్రెండ్స్ అందరికీ వివరంగా చెబుతుండే వాడిని. అయితే అందులో ఒక తమాషా చేసే వాడిని. ఆ సినిమాలో నాకు నచ్చని సీన్ ఏదైనా ఉంటే దాన్ని మార్చి ఎలా ఉంటే బావుండేదో ఊహించి చెప్పేవాడిని. నా మాటలు విని ఆ సినిమా చూసి వచ్చిన మా ఫ్రెండ్స్ నేను చెప్పిన సీన్లు లేకపోయే సరికి, నన్ను కోప్పడుతుండేవారు. ఒకరిద్దరు చెయ్యి చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి!! ఐతే నాలోని కళాదృష్టిని గమనించిన మిత్రులు 'పెయింటింగ్స్ బాగా వేస్తావు. సినిమా కథల మీద మంచి అవగాహన ఉంది. బాపు గారు చూడు..ఆర్టిస్ట్ ఐ ఎలా దర్శకుడిగా రాణిస్తున్నారో.. నువ్వూ ఎందుకు ప్రయత్నించకూడదు !?' అని ప్రోత్సహించే వాళ్ళు. అప్పట్లో తెలుగు సినిమా రంగంలో కొత్తదర్శకులకి స్వర్ణయుగం సాగుతోంది. దాసరి నారాయణరావు గారి లాంటి వాళ్ళు కొత్త కొత్త ప్రయోగాలతో ప్రేక్షకులకి హిట్ మీద హిట్ అందిస్తున్నారు.

అప్పటికే మా పెదనాన్న గారు ముప్పలనేని శేషగిరి రావుగారు మంచి, మంచి సినిమాలు తీసి ఉన్నారు. మొత్తానికి బి.ఎ అయ్యేసరికి నాలో సినిమాల మీద ఉన్న ఆసక్తి కార్యాచరణ స్థాయికి చేరుకుంది. అమ్మకూడా నన్ను ప్రోత్సహించింది. చిన్నప్పటినుంచీ నాకు సహాయం చేసే వాళ్ళంతా మిత్రులే. అలానే ఒక మిత్రుడు అంకినీడు ప్రసాద్ మద్రాసులో వై.ఎమ్.సి.ఎ.లో వుంటూ చార్టెడ్ అక్కౌంటింగ్ చదువుకుంటున్నాడు. అతని సహాయంతో మద్రాసు చేరుకుని అతని రూములోనే మకాం వేశాను. నా పెయింటింగ్సూ, సర్టిఫికెట్లూ అన్నీ చూపించి ఎవరి దగ్గరైనా అసిస్టెంట్‌గా చేరే మార్గం చూడమని అంకినీడు ప్రసాద్‌కి చెప్పాను. తన ఫ్రెండ్ ప్రసాదరావు అనే అతని దగ్గరకి తీసుకెళ్ళాడు. ప్రసాదరావు, చిరంజీవి గారు ఒకప్పుడు బాపట్లలో మిత్రులు, సహాధ్యాయులు కూడా. ఆ విధంగా ప్రసాదరావు ద్వారా చిరంజీవిగారిని కలవడం జరిగింది.

అప్పుడు చిరంజీవి గారు కట్టాసుబ్బారావు గారి దర్శకత్వంలో 'శ్రీరస్తు శుభమస్తు' సినిమాలోనూ, కోదండరామి రెడ్డిగారి దర్శకత్వంలో 'న్యాయం కావాలి' సినిమాలోనూ నటించడానికి సిద్ధంగా ఉన్నారు. నా గురించి అన్నీ వివరంగా తెలుసుకుని తన దర్శకులిద్దరికీ పరిచయం చేశారు. ఆ విధంగా కోదండరామి రెడ్డిగారి వద్ద 'న్యాయం కావాలి' సినిమాకి అప్రెంటిస్‌గా చేరే అవకాశం దొరికింది. ఇది జరిగింది 1980లో. అక్కడనుంచీ మరో 11 సంవత్సరాలు వెనక్కి తిరిగి చూడలేదు. దాదాపు 22 సినిమాలకి గురువు గారు కోదండరామి రెడ్డిగారి వద్దనే దర్శకత్వ శాఖలో వివిధ హోదాల్లో పనిచేశాను. 'న్యాయం కావాలి', 'ఖైదీ', 'కిరాయి కోటిగాడు', 'కంచుకాగడా', 'ఇల్లాలు ప్రియురాలు', 'ఒకరాధ ఇద్దరు కృష్ణులు', 'శ్రీరంగనీతులు' వగైరా సూపర్ డూపర్ చిత్రాలన్నింటికీ గురువు గారు కోదండరామి రెడ్డి గారి వద్ద పనిచేసే సదవకాశం దొరికింది.

కథని ఎలా మొదలుపెట్టాలి. ఏయే అంశాలు ప్రేక్షకులకి ఆకట్టుకునేలా కథనాన్ని ఎలా మలచుకోవాలి. పాటలు కథని ఎలివేట్ చేసేలా ఎప్పుడెప్పుడు రావాలి..వగైరా టెక్నిక్స్ అన్నీ కోదండరామి రెడ్డిగారి వద్దనే నేర్చుకున్నాను. టెక్నికల్ విషయాలే కాక అందరితో మంచిగా వుండడం, ఎంత సక్సెస్ వచ్చినా పొంగిపోకుండా వినయంగా వుండడం లాంటి వ్యక్తిగత వ్యవహార శైలి కూడా ఆయన వద్దనుంచే నేర్చుకున్నాను. కోదండరామి రెడ్డిగారి స్వర్ణయుగంలో అన్ని సినిమాలకీ ఆయనతో పనిచేసే అవకాశం , తెలుగు చిత్ర సీమలోని టాప్ హీరోలు, సాంకేతిక నిపుణులతో పనిచేసే అవకాశాన్ని కూడా కల్పించింది. అలానే నేను ఆయన యూనిట్లో చేరిన మొదటి సినిమా (‘న్యాయం కావాలి‘) సూపర్ హిట్ అవడంతో సెంటిమెంటల్‌గా కూడా కోదండరామి రెడ్డి గారు నన్ను చాలా ఆప్యాయంగా చూసుకునేవారు.

ఎంత మంచి డైరెక్టర్‌కైనా పీక్ పీరియడ్ తర్వాత మళ్ళీ డల్ సీజన్ మొదలౌతుంది కదా. అలానే ‘సర్దార్ కృష్ణమనాయుడు‘,‘భార్గవరాముడు‘ లాంటి రాజకీయం కథాంశాలుగా వచ్చిన సినిమాలు కోదండరామి రెడ్డి గారికి అంత పేరు తీసుకురాలేదు. ఆలాంటి సమయంలోనే పరుచూరి బ్రదర్స్ ఈతరం ఫిలిమ్స్ కి ‘ప్రజాస్వామ్యం‘ సినిమా తీస్తూ నన్ను కో-డైరెక్టర్‌గా తీసుకున్నారు. మా గురువు గారు కూడా వెళ్ళమని ప్రోత్సహించారు. దాని తర్వాత ‘అన్న‘, ‘ఎర్రమందారం‘ సినిమాలకి కూడా కో-డైరెక్టర్ గా ఈ తరం ఫిలిమ్స్ లో పనిచేశాను. ముత్యాల సుబ్బయ గారి వద్ద దర్శకత్వంలో మరికొన్ని మెలకువలు నేర్చుకున్నాను.

అప్పుడు పరుచూరి బ్రదర్స్ నన్ను రామానాయుడు గారికి పరిచయం చేసి ‘మంచి భవిష్యత్తు ఉన్న కుర్రాడు‘ అని చెప్పారు. ఆయన కూడా కొత్తవారిని ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు కాబట్టి వెంటనే తన యూనిట్‌లోకి తీసుకున్నారు. ఆ విధంగా సురేష్ ప్రొడక్షన్స్‌లో ‘పరువు-ప్రతిష్ట‘,‘ ప్రేమ విజేత‘ సినిమాలకి దర్శకత్వ శాఖలో పనిచేశాను. రామానాయుడు గారే ‘మంచి కథ ఉంటే తయారు చేసుకో..నీకు దర్శకత్వానికి అవకాశం ఇద్దామనుకుంటున్నాను‘ అని చెప్పారు. ఆయన కోరిక మీద కథ తయారు చేసుకుంటుండగానే కృష్ణ గారితో సినిమా చెయ్యడానికి అవకాశం వచ్చింది.




అప్పటికే కృష్ణ గారి దర్శకత్వంలో ‘నాగాస్త్రం‘ అనే హిట్ సినిమాని నిర్మించిన కెప్టెన్ అంకప్ప చౌదరి, అన్నారావు అనే నిర్మాతలు నా కథ ఒకటి విన్నారు. వెంటనే కృష్ణగారు హీరోగా నా దర్శకత్వంలో సినిమా నిర్మించడానికి ముందుకి వచ్చారు. అప్పటికే ‘కిరాయి కోటిగాడు‘ లాంటి సినిమాల సందర్భంలో కృష్ణగారితో పరిచయం ఉండడంతో ఈ కథ తీసుకుని వెళ్ళగానే ‘శివ నాకు ఎప్పటి నుంచో తెలుసు. తనతో సినిమా చెయ్యడానికి నాకేం అభ్యంతరం లేదు. తను చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు‘ అని కృష్ణ గారు కూడా వెంటనే ఒప్పుకున్నారు. ఆ విధంగా నేను ఫుల్ ఫ్లెడ్జ్‌డ్ డైరెక్టర్‌గా పనిచేసిన సినిమా కృష్ణ, మాలాశ్రీ కాంబినేషన్‌లో మొదలైంది. పేరు ‘ఘరానా అల్లుడు. సంగీతం కీరవాణి. అప్పటికే ఎన్నో సినిమాలకి పనిచేసి ఉండడం వల్ల ‘ఘరానా అల్లుడు‘ దర్శకత్వం నల్లేరు మీద నడకలా సాగిపోయింది. సినిమా రిలీజైంది 1994 ఏప్రిల్ 7 వ తేదీన. అదే నెలలో విడుదలైన ‘అన్న‘, ‘భైరవద్వీపం‘, ‘తోడికోడళ్ళు‘, ‘హలోబ్రదర్‘, ‘యమలీల‘ లాంటి సినిమాలన్నీ హిట్ చిత్రాలుగానే నిలిచాయి. వీటన్నింటి మధ్యా ‘ఘరనా అల్లుడు‘ రీజనబుల్ సక్సెస్ చిత్రంగా నిలిచింది. సెకండ్ హాఫ్‌లో కొంచెం స్పీడ్ తగ్గిందని విమర్శకులు తేల్చి చెప్పారు. ఏదేమైన నిర్మాతలకి మాత్రం నష్టం తెచ్చిపెట్టలేదు. అప్పటికే ‘నంబర్ 1‘ సినిమాతో హిట్ సీజన్‌లో ఉన్న కృష్ణగారి అభిమానులని సంతృప్తి పరిచింది. మ్యూజిక్ విషయంలో సూపర్ హిట్‌గా నిలిచింది. మొదటిసారి డైరెక్టర్‌గా

నాకు ఎబౌవ్ యేవరేజ్ మార్కులు వచ్చాయి. 50 రోజులు దాటి ఆడింది. ఇలా నా మొదటి సినిమా సూపర్ సక్సెస్ కాకపోయినా ఫెయిల్ ఐతే కాలేదు.

కారణమేమిటో తెలీదు కానీ మొదటి సినిమా ఐన ఆరు నెలల వరకూ ఖాళీగానే ఉన్నాను. అలాంటి రోజుల్లో ఒక రోజు జూబిలీ హిల్స్ రోడ్ మీద స్కూటర్ మీద వెళ్తుంటే పక్కన దూరంగా ఒక ఫారిన్ కారులోంచి ఎవరో పిలిచారు. నేను దగ్గరకి వెళ్ళాను. ఆయన రామానాయుడు గారు..!! "ఏం శివా..ఎప్పుడో కథ చెబుతానన్నావు..మరి రెడీగా ఉంటే గెస్ట్ హౌజ్‌కి వచ్చెయ్యి. నేను సారథీ స్టూడియోకి వెళ్ళివస్తాను. కథ వింటాను..' అని చెప్పారు. అది నా సినీ జీవితాన్ని మలుపు తిప్పిన క్షణం. నేనేదో స్కూటర్‌మీద వెళ్తుంటే రామానాయుడు గారు నాకోసం ఆగడం ఎంత విచిత్రమో అని ఇప్పటికీ అనిపిస్తుంటుంది. ఆయన ఆహ్వానం మేరకు నేను సురేష్ గెస్ట్ హౌస్‌కి వెళ్ళాను. ఆయన కోసమని ఎప్పుడో తయారు చేసుకున్న కథ 'తాజ్ మహల్'. నాకున్న పెయింటింగ్ అనుభవంతో ఒక చిన్న పోస్టర్ డిజైన్ కూడా చేసుకుని క్రింద రామానాయుడు గారి పేరు, నా పేరు వ్రాసుకుని ఉంచుకున్నాను చాలా నెలల క్రిందటే. అవన్నీ చూపించి రెండు గంటలపాటు కథ చెప్పాను. రామానాయుడు గారికి వెంటనే నచ్చింది. నాతో 'తాజ్ మహల్' తీస్తున్నానని అప్పుడే నిర్ధారణగా చెప్పారు. నాలో విపరీతమైన ఆనందం, మరో వైపు సురేష్ బానర్స్‌కి తగిన స్థాయిలో మంచి సినిమా అందించాలన్న టెన్షన్.




'తాజ్ మహల్ ' ప్లానింగ్ పనులు మొదలయ్యాయి. శ్రీకాంత్‌ని హీరోగా కావాలని నేనే అడిగాను. సంఘవి, మోనికా బేడిలను కూడా మొదటిసారి ఆ సినిమా ద్వారా నేనే పరిచయం చేశాను. సినిమా మొదటి నుంచీ నాకు అగ్నిపరీక్షలా సాగింది. సినిమా ముహూర్తం రోజు రామానాయుడు స్టూడియోస్‌లో సాయిబాబా విగ్రహం ముందు మొదటి షాట్ తీస్తున్నాను. హీరోయిన్ మోనికా బేడి దేవుడి ముంది కొబ్బరికాయ కొట్టే షాట్. కొబ్బరికాయ కొట్టిందామె. తీరా చూస్తే అది కుళ్ళిపోయి ఉంది. సెంటిమెంటల్‌గా అందరూ "ఏమయ్యా శివా..మొదటి షాట్ ఇలా ఐందేమిటి?" అన్నారు. ఐనా ధైర్యం కోల్పోకుండా ముందడుగు వేశాను. మధ్య మధ్యలో చాలా కామెంట్లు వచ్చాయి.."తాజ్ మహల్ అనేది ఒక సమాధి. సమాధి మీద కథతో సినిమా ఏమిటి? హిందీలో ఇలానే 'తాజ్ మహల్' టైటిల్‌తో సినిమా మొదలుపెట్టి కష్టలు పాలైన నిర్మాత సినిమా పేరే మార్చేశాడు. రామానాయుడు గారికి ఇప్పుడు ఒక హిట్ కావాలి. అలాంటి సమయంలో ఇలా సెంటిమెంటల్ గా అచ్చిరాని పేరుతో సినిమా తీస్తున్నాడు..శివ ఏం చేస్తాడో.." పది మంది పది రకాలుగా అనుకున్నారు. ఐనా కథమీద నమ్మకంతో ఏమీ పట్టించుకోకుండా నా పని నేను చేసుకుంటూ వెళుతున్నాను.

'తాజ్ మహల్' సినిమా ద్వారానే ఇప్పటి ప్రముఖ గీతరచయిత 'చంద్రబోస్'ని పరిచయం చేశాను. తను రాసిన మొదటి పాట 'మంచుకొండల్లో చంద్రమా..' చిత్రీకరణ కోసం కులు మనాలీ వెళ్ళాం. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది, ఇంకా మంచు కురవడం మొదలు కాలేదని. కొండలన్నీ ఎండిపోయి బోసిగా కనిపిస్తున్నాయి. పాటలోనే 'మంచు కొండల్లో చంద్రమా..' అని ఉంది. మంచు లేకుండా పాట చిత్రీకరణ అసాధ్యం. మమ్మల్ని తీసుకెళ్ళిన ఏజెంట్ మీద మండి పడ్డాం "మంచు లేదని ముందే చెప్పి ఉండాల్సింది.." అని. "మీరు ఇలా పాట వ్రాసుకొస్తారని మాకేం తెలుసు సార్.." అంటూ ఏజెంట్ మాకే పాఠం చెప్పడం మొదలుపెట్టాడు. మొత్తం యూనిట్‌కి రానూ పోనూ కూడా టిక్కెట్లు రిజర్వ్ ఐపోయి ఉన్నాయి. ఏం చెయ్యాలో తెలీలేదు. మధ్యలో మూడు రోజులే టైముంది. ఆలోచిస్తూ పడుకున్నాను. ఆ రోజు రాత్రే ఒక అద్భుతం జరిగింది..! తెల్లవారు ఝామునే మంచు తుఫాను వచ్చింది..!!! పొద్దున్నే

లేచేసరికి మొత్తం పరిసరాలన్నీ మంచుతో నిండిపోయాయి. ఇంకా మనిషి పాద ముద్రలు పడని మంచు ముద్దలు.. అది చాలా శుభసూచకంగా అనిపించింది. విజయవంతంగా పాట చిత్రీకరణ పూర్తి చేసుకున్నాం.

మొత్తానికి 'తాజ్ మహల్'ని అనుకున్నది అనుకున్నట్లు తియ్యగలిగాను. సినిమా విడుదలరోజు మాత్రం నా మొదటి సినిమాకి వెళ్ళినట్లే షిరిడి వెళ్ళిపోయి అక్కడే ఉండిపోయాను. రెండో రోజు ఉదయం హైదరాబాదు రాగానే సినిమా హిట్ టాక్ తెచ్చుకుంటోందని వార్తలు విన్నాను. అప్పుడు థియేటర్‌కి వెళ్ళి ఆడియన్స్ మధ్య కూర్చుని చూశాను.. ప్రేక్షకుల చప్పట్లు వినగానే తెలిసిపోయింది 'ఇది ఖచ్చితంగా హిట్టే' అని. టెక్నికల్‌గా నా మొదటి సినిమా 'ఘరానా అల్లుడు' ఐతే, నన్ను సక్సెస్ ఫుల్ దర్శకుడిగా మీ ముందు నిలబెట్టింది 'తాజ్ మహల్'. రామానాయుడు గారు నన్ను మెచ్చుకుంటూ ప్రెస్ మీట్‌లో చెప్పిన మాటలు ఇప్పటికీ మర్చిపోలేను. "ప్రేమ నగర్ సక్సెస్ కంటే ఎక్కువగా ఆనందిస్తున్నాను. ప్రేమ్ నగర్ రోజుల్లో అక్కినేని , వాణిశ్రీ ఎస్టాబ్లిష్డ్ పెయిర్. ఐతే ఈ 'తాజ్ మహల్' లో అప్ కమింగ్ హీరోని. కొత్త హీరోయిన్లని పెట్టి సక్సెస్ చేసిన శివని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.." అన్నారాయన. అప్పటినుంచీ రామానాయుడు గారు నన్నొక మిత్రుడిగా చూసే వారు...'ఎన్ని కామెంట్లు వచ్చినా నీపనేదో నువ్వు చేసుకుంటూ మొత్తానికి చిత్రాన్ని హిట్ చిత్రంగా తయారు చేశావు' అని మెచ్చుకున్నారు.

అదీ నా మొదటి హిట్ సినిమా వరకూ జరిగిన ప్రయాణం.




ఆ తర్వాత 'కోరుకున్న ప్రియుడు',' ప్రియా..ఓ ప్రియా..' లకి దర్శకత్వం వహించాను. 'తాజ్ మహల్' సమయంలోనే నా వర్కింగ్ విధానం నచ్చిన వెంకటేశ్ గారు 'రాజా'కి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చారు. అదెంత హిట్టో మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. తర్వాత కొన్ని సూపర్ హిట్లూ, కొన్ని ఫెయిల్యూర్సూ..లా కెరీర్ సాగుతోంది. కొన్ని సినిమాలు ఫెయిలవడానికి నా దర్శకత్వం కాక ఎన్నో బాహ్యకారణాలు ఉండేవి. కొన్ని తెలిసీ సరి చెయ్యలేని పరిస్థితులు. అందరు దర్శకులకీ ఇలాంటి పరిస్థితులు ఎప్పుడో ఒకసారి ఎదురవ్వక తప్పదు. ఐతే అన్నీ మంచి బేనర్లలో చేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తాను. సురేష్ ప్రొడక్షన్స్, సూపర్ గుడ్ ఫిలిమ్స్, లక్ష్మీ ఫిలిమ్స్, స్రవంతి పిక్చర్స్..ఇలా చాలా మంది ప్రముఖ నిర్మాతలతో పనిచేయడం నాకు దొరికిన సదవకాశం....పేరు, పారితోషికం, అనుభవాలు..అన్నింటికంటే నాకు ఎంతో సంతృప్తినీ గర్వాన్ని ఇచ్చేది ఒక విషయం ఉంది..

నేను ఇప్పటికీ మా వూరు వెళ్ళినప్పుడల్లా అమ్మ 'చిన్నప్పుడు నిన్ను తులశమ్మ గారి అబ్బాయి అనేవాళ్ళు. ఇప్పుడు నన్ను ముప్పలనేని శివ గారి అమ్మ అంటున్నారు. చాలా గర్వంగా ఉంది నాయనా..' అంటుంది. ఇది నాకు వెలకట్టలేని ప్రశంస!!***

(డిసెంబర్ 2009 సంచికలో ప్రచురితం)

# లక్ష్మీకాంత్ చెన్నా

'హైదరాబాద్ నవాబ్స్' సినిమా విజయవంతం కాగానే ఎవరీ కొత్త దర్శకుడు, హైదరాబాదు నేటివిటీని ఇంత స్పష్టంగా ఆకర్షణీయంగా తెరకెక్కించాడు..!? అనుకున్నారందరూ. 'చిన్నప్పటినుంచీ హైదరాబాదులోనే పుట్టి పెరిగి వుంటాడు. అందుకే అంత బాగా తీశాడు..' అనికూడా అనేసుకున్నారు. ఐతే ఆ యువదర్శకుడు పదహారణాల తెలుగువాడనీ, విజయవాడ వన్‌టౌన్ నుంచీ వచ్చాడని తెలుసుకుని ఆశ్చర్యపోయారు, మొదటి సినిమాతోనే తన సత్తా నిరూపించుకున్న అతని ప్రతిభకి అభినందించారు. అతనే లక్ష్మీకాంత్ చెన్నా. మొదటి సినిమా సూపర్ హిట్ అయ్యే సరికి సహజంగానే రెండో సినిమా మీద అంచనాలు ఎక్కువగా ఉంటాయి. దురదృష్టవశాత్తూ అతని రెండో సినిమా 'నిన్నా నేడు రేపు' ప్రేక్షకులని చేరడంలో విఫలమయ్యింది. కారణాలు అనేకం..! ఐతే దర్శకుడిగా, స్క్రీన్ ప్లే రైటర్‌గా మాత్రం మంచి మార్కులు తెచ్చుకుని భవిష్యత్తులో మంచి సినిమా తీయగల నిజాయితీ దర్శకుడన్న పేరుని నిలబెట్టుకున్నాడు. లక్ష్మీకాంత్ చెన్నా తన సినీ జీవిత ప్రస్థానాన్ని 'కౌముది' తో ఇలా పంచుకుంటున్నారు.




నేను పుట్టింది, పెరిగింది చదువుకున్నదీ అంతా విజయవాడ లోనే. నాన్న రైల్వే ఆసుపత్రిలో చిరుద్యోగి. పేరు నీలకంఠం. అమ్మ సాధారణ గృహిణి, పేరు నాగమణి. ఒక అన్నయ్యా,ఒక అక్కా..ముగ్గురిలోకీ చిన్నవాడిని నేనే. ఐదుగురు కుటుంబానికీ నాన్నకున్న చిన్న ఉద్యోగమే ఆధారం. దిగువ మధ్యతరగతి కుటుంబంలో పడాల్సిన కష్టాలన్నీ చిన్నతనం నుంచే ఎదుర్కొన్నాను. అలంటి పరిస్థితుల్లో సహజంగానే పెద్ద స్కూళ్ళలో చదువుకునే అవకాశం లేదు. నాన్న రైల్వే ఉద్యోగి అవడం వల్ల మేమూ రైల్వే స్కూల్లోనే చదువుకున్నాం. అదృష్టవశాత్తూ అక్కడకూడా చిన్నప్పటినుంచీ ఇంగ్లీషు మీడియమ్ అవడం మాకు భవిష్యత్తులో బాగా ఉపయోగపడింది.

విజయవాడ జీవితం అంటే సినిమాలప్రభావాన్ని తప్పించుకోవడం కష్టం. సినిమా పంపిణీ ఆఫీసులూ, షూటింగులూ, శతదినోత్సవాలు, కేవలం ఇంగ్లీషు సినిమాలు మాత్రమే ప్రదర్శించే థియేటర్లూ.. ఎటుచూసినా ఏదో రూపంలో 'సినిమా' పలకరిస్తూనే ఉండేది. ఒక విశేషమేమిటంటే నాకు చిన్నవయసునుంచే నాన్నతో కలిసి సినిమాలకి వెళ్ళేవాడిని. పైగా అవన్నీ ఇంగ్లీషు సినిమాలే. నవరంగ్ టాకీస్, లీలా మహల్, ఊర్వశి కాంప్లెక్స్..ఇవన్నీ దేవాలయాలకంటే ఎక్కువ ఆకర్షణీయంగా అనిపించేవి..! అన్నయ్య ఎక్కువగా మాతో వచ్చేవాడు కాదు. నాన్న మాత్రం నన్ను తీసుకుని మంచిది అని పేరు తెచ్చుకున్న ప్రతి ఇంగ్లీషు సినిమాకీ తీసుకెళ్ళేవాడు. అమ్మ కోప్పడుతుండేది కూడ ' పిల్లాడిని కూడా మీతో బాటు అలా సినిమాలకి తిప్పుతారు ఎందుకు?' అని. అలా నాన్నతో చూసిన సినిమాల్లో 'ఎంటర్ ది డ్రాగన్' నాకు బాగా నచ్చింది. అప్పటికి నాకు 6, 7 సంవత్సరాల వయసు

ఉంటుందేమో. అందులో ముఖ్యంగా చివరలో వచ్చే అద్దం ముందు ఫైటింగ్ తెగ నచ్చేసింది. అది చూస్తున్నంత సేపూ విపరీతమైన థ్రిల్లింగ్‌గా ఉండేది. నాన్నని బతిమాలి ఒకటికి రెండు సార్లు చూశానా సినిమా.

చదువులో అంతంత మాత్రంగానే ఉండేవాడిని. ఐతే ఆటలు, స్పోర్ట్స్‌లో మాత్రం ముందు ఉండేవాడిని. కొన్నేళ్ళు కృష్ణాజిల్లా హాకీ టీమ్ ప్లేయర్‌ని కూడా. చదువులో వెనకబడి ఉండడంతో ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం పెట్టించాల్సి వచ్చినప్పుడల్లా ఏదో పథకం వేస్తుండే వాడిని. చాలా సార్లు అన్నయ్యని బతిమాలి నాన్న సంతకాన్ని కాపీ చేయించేవాడిని. ఎప్పుడో నిజం బయట పడడం, నాన్న కోప్పడడం మామూలే..!

ఎనిమిదో తరగతిలో అనుకుంటాను, శారద అనే మేడమ్ నన్ను పిలిచి 'చూడు కాంత్..నాన్న చిన్న ఉద్యోగమైనా మీకు చదువులు చెప్పించి ప్రయోజకుల్ని చెయ్యాలని ఎంతో కష్టపడుతున్నారు. నువ్విలా చదువులో వెనకబడితే ఎలా? ఆయన కష్టం గుర్తించి ఐనా శ్రమ పడడం నేర్చుకో. చదువుమీద శ్రద్ధ పెట్టు' అని సిన్సియర్ గా చెబుతుండేవారు. ఏదో పూర్తిగా మారిపోయాను అని చెప్పలేను కానీ, మొత్తం మీద శారద టీచర్ చెప్పిన మాటలు పనిచేశాయి. పదో తరగతి వరకూ ఎలాగో కనీసం, ఫెయిల్ కాకుండా పాసయ్యానని అనిపించుకున్నాను.

అప్పటికే నాలో ఎప్పుడూ ఒక ఆలోచన తొలుస్తుండేది. భవిష్యత్తులో ఏమి చేసినా నాకంటూ ఒక గుర్తింపు ఉండాలి. అందరూ నా పేరు చెప్పుకోవాలి. అలా కావాలంటే ముందున్నవి మూడు ఆకర్షణీయమైన రంగాలు..సినిమాలు, క్రీడలు, రాజకీయాలు. రాజకీయాలకి సరిపోయే వయసు కాదు..క్రీడల్లో పేరు తెచ్చుకోవాలంటే డబ్బూ,పరపతీ ఉండాలి అని అప్పటికే ఎదురైన అనుభవాల ద్వారా తెలిసొచ్చింది. ఇంక మిగిలింది సినిమా రంగం. అలాంటి రోజుల్లో జరిగిన ఒక సంఘటన చెప్పాలి..

అప్పటికే మాకు వరుసకి మేనమామ అయ్యే శంకర్ గారు సినీ ఫీల్డ్‌లో పేరొందిన ఎడిటర్ గా పనిచేస్తున్నారు. శివ దగ్గరనుంచీ రంగీలా వరకూ రామ్‌గోపాల్ వర్మ గారి సినిమాలకి ఎడిటర్‌గా పనిచేశారు. తర్వాత గుణశేఖర్, కృష్ణవంశీ సినిమాలకీ చేస్తున్నారు. 'రక్షణ' సినిమాకి అనుకుంటా వంశీ-బర్కిలీ ఎవార్డు తీసుకోడానికి ఆయన విజయవాడ వచ్చినప్పుడు మా యింటికి వచ్చారు. నాకు ఆయన్ని చూడడమే చాలా థ్రిలింగ్‌గా ఉండేది. ఆయన ఉన్నప్పుడు పెందలకాడే ఇంటికి రావడం, ఆయన్ని ఎలా ఇంప్రెస్ చెయ్యాలా అని ప్రతి క్షణం తపన పడడం చేస్తుండే వాడిని. ఆయన లాగా సినిమాల్లోకి వెళ్ళాలి అనిపించేది. ఇంకా జూనియర్ కాలేజీకి కూడా వెళ్ళని వయసు. సినిమాల్లో ఏమి చెయ్యాలో తెలీదు, ఎన్ని విభాగాలు ఉంటాయో కూడా పూర్తి అవగాహన లేదు. ఐతే నా కంటే రెండేళ్ళు పెద్ద ఐన మా అన్నయ్య (లోకేష్) డిగ్రీ చదువుతుండగా మధ్యలో మానేసి, ఇంట్లో కూడా చెప్పకుండా హైదరాబాద్ శంకర్ మామయ్య వద్దకి వెళ్ళిపోయాడు. వెళ్ళగానే మామయ్య వద్ద ఎడిటింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని, తన గురించి కంగారు పడవద్దనీ ఉత్తరం వ్రాశాడు. అరే..నాకంటే ముందు తను వెళ్ళాడే, అసలు అన్నయ్యకి సినిమాలమీద ఆసక్తి ఉన్నట్లే ఎప్పుడూ చెప్పలేదు అనుకున్నాను. నాన్న బాగా అప్‌సెట్ అయ్యారు. ఆయనకి మా ఇద్దరినీ మంచిగా చదివించి మిలటరీ ఉద్యోగస్థులని చెయ్యాలని ఉండేది. లేదంటే కనీసం రైల్వేలోనైనా ఒక స్థిరమైన ఉద్యోగం ఉంటే బావుంటుందని ఎప్పుడూ అంటుండే వారు. సరిగ్గా ఇంటర్మీడియట్‌లో చేరగానే నాలోనూ అన్నయ్యకి వచ్చిన ఆలోచనే వచ్చింది..

ఐతే ఇంకో విషయం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. హైస్కూల్లో చదువుకున్నన్ని రోజులూ ఎప్పుడూ వేసవి శెలవలని ఎంజాయ్ చెయ్యలేదు. అందరు పిల్లలూ శెలవల్లో హాయిగా ఆడుకుంటుంటే, నేనూ అన్నయ్యా మాత్రం ఏ ఫర్నిచర్ షాపు లోనో, మోటార్ మెకానిక్ వద్దనో పని చేస్తుండే వాళ్ళం. ఐదొందలో, ఆరొందలో సంపాదిస్తే అవి తర్వాతి సంవత్సరం స్కూలు ఖర్చులకి వచ్చేవి. మరో వైపు నాన్న కూడా కష్టపడుతుండే వారు. ఇవన్నీ గమనించిన మీదట నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఇంత కష్టమూ హైదరాబాదు వెళ్ళి సినిమాల్లో ప్రయత్నిస్తే ఇంకా బాగా సంపాదించవచ్చునే అనిపించింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉండగానే నాన్నతో

ఒకరోజు 'నేనూ హైదరాబాదు మామయ్య వద్దకి వెళ్తాను. అన్నయ్య ఎలానూ అక్కడే ఉంటున్నాడు కాబట్టి ఇబ్బంది లేకుండా సెటిల్ అవడానికి ప్రయత్నిస్తాను' అని చెప్పాను. సహజంగానే నాన్న అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. 'నేను ఇంత కష్టపడి మిమ్మల్ని ఏదో మంచి ఉద్యోగస్థుల్ని చేద్దామనుకుంటే పెద్ద వాడు అలా వెళ్ళిపోయాడు. ఇప్పుడు నువ్వూ అలానే అంటున్నావు..' అంటూ కేకలేశారు. ఐనా నా నిర్ణయంలో మార్పు రాలేదు... హైదరాబాదు వచ్చేశాను. నాన్న అలా అనడంలో ఏ మాత్రం తప్పులేదని, బాధ్యత గల ఏ తండ్రి ఐనా అలానే అంటారని చాలా రోజులకి రియలైజ్ అయ్యాను.



హైదరాబాదు రాగానే మామయ్యని కలిశాను. ఆయనా నిరుత్సాహ పరిచారు. 'ఈ ఫీల్డ్ అంత సులువైన దేమీ కాదు. ఇప్పటికే మీ అన్నయ్య స్ట్రగుల్ అవుతున్నాడు చూస్తున్నావు కదా. నువ్వూ ఇక్కడ అనిశ్చితంగా ఉండి పోవడం మంచిది కాదు. రేపు మీ నాన్న, నా మూలాన మీరిద్దరూ చదువులు మానేసి వచ్చారని అనుకోకూడదు..' అని బోధ చేశారు. ఐనా నా ఆలోచనల్లో మార్పు రాలేదు. మా అన్నయ్యతో చెప్పాను "మామయ్య వద్దంటున్నారు, నువ్వైనా ఎక్కడన్నా నన్ను ఏదో డిపార్ట్‌మెంట్‌లో చేర్చు. ఈ రెండేళ్ళలో నీకూ చాలా మంది ఫ్రెండ్స్ ఉండే ఉంటారు కదా..' అని అడిగాను. అప్పటికి నాకింకా పదహారేళ్ళు కూడా లేవు. విషయం తెలుసుకున్న మామయ్య 'సరే ఐతే ఏదో ఒకటి నేనే చూస్తాలే..ఏం చేద్దామనుకుంటున్నావు..?' అన్నారు. అప్పటికి తెలుగు సినీ రంగమంతా రామ్ గోపాల్ వర్మ సినిమాల ప్రభావంలో ఉంది. మామయ్యకి రాము గారు బాగా పరిచయం. ప్రసాద్ లేబ్స్‌లో మామయ్యని కలవడానికివచ్చినప్పుడు , ఆయన్ని చూపించి'ఆయన వద్ద అసిస్టెంట్ గా చేరతాను..' అన్నాను. 'అయన వద్ద అసిస్టెంట్ అంటే డైరెక్షన్ అంటున్నావ్ కదా. డైరెక్షన్ కి వెళ్ళడానికి ముందు, నీకు ఎడిటింగ్, కెమేరా వగైరా విభాగాలన్నీ బాగా తెలియాలి..ముందు నా దగ్గరే అసిస్టెంట్‌గా చేసి ఎడిటింగ్‌లో అనుభవం తెచ్చుకో..తర్వాత డైరెక్షన్ గురించి ఆలోచిద్దాం' అన్నారు.

ఆ విధంగా 1996లో నా చలన చిత్రజీవితం మొదలైంది. 2000 సంవత్సరం వరకూ దాదాపు పాతిక, ముప్పై సినిమాలకి ఎడిటింగ్ విభాగంలో పనిచేశాను. ఇప్పట్లో లాగ ఆ రోజుల్లో ఎవిడ్ ఎడిటింగ్ లేదు. అంతా మాన్యువల్ గా చెయ్యడమే. అందులో శంకర్ గారికి చాలా గొప్ప పేరుంది. చాలా సార్లు నంది ఎవార్డులు కూడా గెలుచుకున్నారు. ఆయన వద్ద పనిచేసిన ప్రతి సినిమా ఒక అనుభవమే నాకు..

పేరొందిన డైరెక్టర్లు ఎలా షాట్స్ తీస్తారు, ఎన్ని యాంగిల్స్‌లో తీస్తారు, కథా పరంగా వున్న ఎమోషన్స్‌ని దృశ్యాల్లో ఎలా పండిస్తున్నారు..వగైరా అంశాలన్నింటినీ సున్నితంగా పరిశీలిస్తుండేవాడిని. దర్శకత్వ శాఖలో సహాయకుడిగా కంటే ఎడిటింగ్ విభాగంలో సహాయకుడిగా సినిమా పరిశ్రమలో నా కెరీర్ మొదలవడం నాకు చాలా ఉపయోగ పడింది. ఎలాగంటే, డైరెక్షన్ అంటే ఎవరో ఒక డైరెక్టర్ వర్కింగ్ శైలి మాత్రమే తెలుస్తుంది, అదే ఎడిటింగ్ లో ఉండడం వల్ల అనేకమంది దర్శకుల ఆలోచనా విధానాలు, కథ చెప్పే పద్ధతులూ, క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం కలిగింది. ఆ రోజుల్లోనే ఇతరభాషా చిత్రాలు చూసే అవకాశం కూడా దొరికింది. సారథీ స్టూడియోస్‌లో ప్రదర్శించే ప్రపంచ భాషా చిత్రాలన్నింటినీ వదిలిపెట్టకుండా చూస్తుండేవాడిని. కొరియన్, ఫ్రెంచ్, జెర్మనీ, హాలీవుడ్. అన్నింటిలోనూ కథని కొత్తగా ఎలా చెబుతున్నారు, దాన్ని గంటన్నర-రెండు గంటల సినిమాగా ఎలా డెవలప్ చేస్తున్నారు అన్న విషయాలు సూక్ష్మంగా పరిశీలిస్తుండేవాడిని. కెమేరా టెక్నిక్ గురించి పుస్తకాలు చదువుతుండేవాడిని. ఈ విధంగా ఫిల్మ్ టేకింగ్ మీద చాలా అవగాహన ఐతే వస్తోంది కానీ ఆర్థికంగా ఏమీ మెరుగుపడలేదు. అన్నయ్యే నన్ను సపోర్ట్ చేస్తుండేవాడు. 'అసలు హైదరాబాదు వచ్చిందే డబ్బులు

సంపాదించడానికి కదా..ఇంకా ఎక్కడేసిన గొంగళ్ళి అక్కడే‘ అన్నట్లున్నామే అనిపించేది చాలాసార్లు. సంగీత్ లో ఇంగ్లీషు సినిమా చూడాలంటే సిటీ బస్‌లో వేలాడుతూ వెళ్ళాల్సిందే అలాంటి రోజుల్లో నా సినిమా జీవితం ఒక మలుపు తిరిగింది.

శంకర్ గారు ఒకేసారి ఏడెనిమిది సినిమాలకి పనిచేసేంత బిజీగా వుండేవారు. అప్పుడే తేజ గారి ‘చిత్రం‘ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆయన ఏరోజు తీసిన షాట్స్‌ని ఆ రోజే ఎడిట్ చేసి చూపించే వాళ్ళు కావాలని అన్నప్పుడు శంకర్ గారు నన్ను పంపించారు. రోజూ సాయంకాలం కాగానే ఆ రోజు తీసిన ఫిల్మ్ వచ్చేసేది. రాత్రంతా కూర్చుని ఎడిట్ చేసేవాడిని. తేజ గారు సాయంకాలం వచ్చి చూసుకునే వారు. అంటే పగలు కొంచెం తీరిక దొరికేది. ఆ సమయంలో ఖాళీగా ఉండకుండా ‘చిత్రం‘ సెట్స్‌కి వెళ్ళేవాడిని. తేజ గారి వర్కింగ్ శైలి బాగా నచ్చింది. మళ్ళీ ఎప్పుడో వదిలేసిన ‘సినిమాలకి డైరెక్షన్‘ అనే ఆలోచన నిద్రలేచింది. ఒకరోజు



తేజ గారిని అడిగేశాను , ఆయన వద్ద దర్శకత్వంలో అసిస్టెంట్‌గా చెయ్యాలని ఉందని. ఆయన వెంటనే ఒప్పుకున్నారు. ఆ రోజునుంచీ తేజ గారికి దర్శకత్వం, ఎడిటింగ్ రెండు డిపార్ట్‌మెంట్స్ లోనూ సహాయకునిగా పనిచేశాను. ‘చిత్రం‘ తర్వాత, ‘నువ్వు-నేను‘,‘యే దిల్‘ చిత్రాలకి కూడా తేజ గారివద్ద పనిచేశాను. ఎడిటింగ్, డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లు రెంటిలోనూ ఆయనకి అసిస్టెంట్ గా వుండేవాడిని. ఆయనకూడా నన్ను ప్రత్యేక అభిమానంతో చూసుకునేవారు.

కథా పరంగా , స్క్రీన్ ప్లే పరంగా సినిమా టెక్నిక్స్ అన్నీ ఎడిటింగ్ రూమ్‌లో నేర్చుకుంటే, తేజ గారి వద్ద ‘సెట్‌లో ఎలా వుండాలి, అందరినీ ఎలా కంట్రోల్ చెయ్యాలి, నటీనటుల వద్దనుంచీ యాక్షన్ ఎలా రాబట్టుకోవాలి, షాట్స్‌ని స్పీడ్ గా ఎలా సెటప్ చేసుకోవాలి..‘ వగైరా విషయాలన్నీ నేర్చుకున్నాను. విధంగా తేజ గారే దర్శకత్వం పాఠాల్లో నాకు మొదటి గురువు గారు. ఆయన వద్ద పనిచెయ్యడం మొదలు పెట్టిన వద్దనుంచే రెగ్యులర్‌గా రెమ్యునరేషన్ కూడా వచ్చేది. అన్ని విధాలుగా నేను సినిమా పరిశ్రమలో ఒక్కో మెట్టే పైకెక్కు తున్నానని అనిపించింది.

ఆలా మూడు సినిమాల తర్వాత రసూల్ గారి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ లో ‘ఒకరికి ఒకరు‘ చిత్రానికి పనిచేశాను. ఈ సినిమాకి పనిచేస్తున్నప్పుడే సొంతంగా దర్శకత్వంకోసం ప్రయత్నాలు చెయ్యాలని అనుకుని కథలు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను. అప్పుడు మరో మంచి అవకాశం వర్మ కార్పొరేషన్ నుంచీ వచ్చింది. వాళ్ళు తీస్తున్న ‘మధ్యాహ్నం హత్య‘ సినిమాకి ఛీఫ్ అసోసియేట్‌గా పనిచెయ్యమన్నారు. వర్మ గారి కంపెనీకి పనిచేయడం నా జీవితకాలం కోరిక కాబట్టి సొంత ప్రయత్నాలు కాస్త పక్కనపెట్టి ఆ ప్రోజెక్టులోకి వెళ్ళాను. ఆ సినిమాకి ముందుగా ఒక దర్శకుడ్ని అనుకుని సినిమా అంతా పూర్తిచేశారు. ఐతే వర్మ గారికి అది నచ్చకపోవడంతో చక్రి గారిని మళ్ళీ రీషూట్ చెయ్యమన్నారు. ఉన్న టైమ్ 18 రోజులు ..దాదాపు 70 శాతం సినిమాని రీ-షూట్ చెయ్యాలి. పెద్ద ఛాలెంజ్. సీనియర్ అండ్ మోస్ట్ ఎఫిషియెంట్ కెమెరామేన్ ఛోటా కె. నాయుడుగారు డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ. ఛోటా కె.నాయుడు గారు వర్క్ హాలికుడు. చాలా స్పీడ్‌గా పనిచేస్తారు. ఆయన సెట్‌లో ఉంటే అందరూ ఉరుకులు పరుగులు తియ్యాల్సిందే సెట్స్ మీద వున్న వాళ్ళ నుంచీ మాక్సిమమ్ ఔట్‌పుట్ తీసుకుంటారు. ఆయన వర్కింగ్ విధానం నుంచి కూడా చాలా విలువైన విషయాలు నేర్చుకున్నాను. ఆయనతో పనిచెయ్యడం మొదలు పెట్టిన రెండు మూడు రోజులకి నేను ఆయన వెనక పడడం మొదలుపెట్టాను. ఆయనకి ఏది ఎలా కావాలో ముందుగానే తెలుసుకుని అన్నీ సెట్ మీద సిద్ధం చేసి ఉంచేవాడిని. ఆ సినిమా చివరి షూటింగ్ చివరి రోజు గుమ్మడికాయ కొట్టేటప్పుడు ఛోటా గారు చక్రిగారితో ‘చక్రీ ..కాంత్ చాలా ఎఫిషియెంట్ డైరెక్టర్ అవుతాడు. అందరినీ నేను డ్రైవ్ చేస్తుంటే తను నన్ను

డ్రైవ్ చేసేవాడు. ఇలాంటి వాడిని చూడ్డం ఇదే మొదటి సారి..కాంత్ భవిష్యత్తులో మంచి కథ తయారు చేసుకో. నువ్వు సొంతంగా ప్రోజెక్టు చేస్తున్నప్పుడు నీకు హెల్ప్ చేస్తాను..'అన్నారు. అంత సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ అలాంటి సర్టిఫికెట్ ఇవ్వడం నాకు చాలా ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ ఇచ్చింది.

ఆ సినిమా ప్రోజెక్టు అవగానే సొంతంగా దర్శకత్వం కోసమని సీరియస్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

అదొక సంధి కాలం. అందరికీ ఇలాంటి అనుభవాలే ఎదురౌతాయి కానీ ఎక్కువమంది బయటికి చెప్పుకోలేరేమో. మీరు 'మొదటి సినిమా వరకూ మీకెదురైన సాధక బాధకాలు' అన్నారు కాబట్టి ఈ జర్నీలో ఎదురైన కొన్ని సంఘటనలు మీకు చెబుతాను. అసిస్టెంట్‌గా , అసోసియేట్‌గా, కో-డైరెక్టర్ గా పనిచేసేప్పుడు 'ఫలానా అతను బాగా పని చేస్తాడు. అతన్ని మన దగ్గరా అసిస్టెంట్‌గా పెట్టుకుందాం' అని వెంట బడి పిలిచిన నిర్మాణ సంస్థలు కూడా 'నేను సొంతంగా దర్శకత్వం చెయ్యాలనుకుంటున్నాను..' అని చెప్పినపుడు వేరే విధమైన స్పందన ఎదురౌతుంది. ఎప్పుడూ లేని రకరకాల సందేహాలు ఎదురౌతాయి వాళ్ళకి. ఎలాగంటే బాలనటుడిగా ఉంటూ హీరో పాత్రలకి ప్రయత్నించడం లాంటిది.! నిర్మాత అంటే కోట్లు పెట్టుబడి పెడతాడు కాబట్టి తన కిష్టమైన దర్శకుడ్ని ఎన్నుకునే హక్కు ఆయనకి ఉంటుంది..కాదనలేం ..కానీ దర్శకునిగా ప్రయత్నించే వారికి లభించే ట్రీట్ మెంట్ మాత్రం బహు చిత్రంగా ఉంటుంది..

2003లో అనుకుంటాను. ఇదే ప్రయత్నంలో కథ తయారు చేసుకుని ఒక ప్రముఖ నిర్మాతని కలుసుకునే ప్రయత్నాలు చేశాను. ఆయన తీసిన సినిమాల్లో ఎక్కువశాతం సూపర్ హిట్సే. చాలా ప్రయత్నాలు చేసిన తర్వాత ఆయన భార్యకీ, కుమార్తెకి నేను తయారు చేసుకున్న కథ వినిపించే అవకాశం దొరికింది. వారిద్దరికీ నా కథ నచ్చింది. ఒక మధ్య తరగతి కుర్రాడి కలలు, ఆశలు వాటిని సాధించుకోడానికి అతని తపన..ఇలా నడుస్తుంది. లోబడ్జెట్ సినిమా కోసం వ్రాసుకున్న కథ. బడ్జెట్ విషయానికి వచ్చే సరికి '80 లక్షలు అవుతుంది' అని చెప్పాను. 'ఏం ఫరవాలేదు. ఇటీవల హిట్ ఐన మా సినిమాలో ఒక సాంగ్ సెట్ కే అంత ఖర్చుపెట్టాం. గో ఎహెడ్.' అన్నారు. మరునాడే ఆఫీసుకూడా తీసుకున్నారు. నాకు చాలా సంతోషం అనిపించింది. మొట్టమొదటి ప్రయత్నమే సక్సెస్ కాబోతోంది. పైగా నా మనసుకి ఎంతోనచ్చిన కథ.. ఐతే మెయిన్ ప్రొడ్యూసర్ గారికి కథ వినిపించలేదే అన్న శంక ఒక పక్క లాగుతూనే ఉంది. ఇదే మాట వాళ్ళమ్మాయితో అంటే 'ఏమీ ఫరవాలేదు. మేము ఒప్పుకుంటే నాన్నగారు ఒప్పుకున్నట్లే ' అన్నారు. ఒక నెల రోజులు గడిచాయి. ప్రి-ప్రొడక్షన్ పనులన్నీ చకచకా సాగాయి. మరో రెండు మూడు రోజుల్లో షూటింగ్‌కి వెళ్ళాలి. చాలా ఎక్సైటింగ్‌గా ఉంది నాకు. ఆ సమయంలో అసలు ప్రొడ్యూసర్ గారు వచ్చారు. అప్పుడే ఆయన తీసిన సినిమా 175 రోజుల విజయోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకుని వచ్చారు. కథ వినడం కోసమని నన్ను పిలిచారు. ఆయన ఆఫీసులో కూర్చున్నాం. కథ చెప్పడం మొదలుపెట్టాను. రెండు నిమిషాలు అవగానే ఆయన ఫోన్ తీసుకుని "ఆ..చూడూ.. ఆ'తొలిప్రేమ' కరుణాకర్.. ఎక్కడున్నాడు?" అని ఎవరినో అడుతున్నారు. నేను కథ చెప్పడం ఆపేశాను. అవతల వాళ్ళేమన్నారో మరి.. "ఒక సారి ఆ 'వాసు' సినిమా చూడమని చెప్పు.. " అని ఫోన్ పెట్టేశారు. నా వైపు చూశారు. మళ్ళీ కథ మొదలు పెట్టాను. మరో రెండు నిమిషాల్లో మరో ఫోన్ కాల్ చెయ్యడం మొదలుపెట్టారు. కథ ఆపాలో, కంటిన్యూ చెయ్యాలో కూడా తెలీదు. సరే.. ఆగాను. ఆ ఫోన్ అవగానే 'ఆ..ఏమన్నావమ్మా.. హీరో కష్టపడి వెయ్యి రూపాయలు సంపాయిస్తాడా? ఒక పనిచేస్తే ఎలా వుంటుందీ.. ఈ కథని పెద్ద బడ్జెట్‌తో ఫలానా పెద్ద హీరో తోతీద్దాం..ఐతే కథని ఏం చేస్తావంటే ఆ వెయ్యిరూపాయల్ని కోటి రూపాయలు ఎలా చేస్తాడూ..ఆ డబ్బుని పేద ప్రజలకి ఎలా ఉపయోగిస్తాడూ.. అలా..ఆ లైన్లో డెవలప్ చెయ్యి.. కావాలంటే నా రీసెంట్ హిట్ సినిమాకి కథ రాసిన అతన్ని కూడ పంపిస్తాను. అతనితో పనిచెయ్యి.." అన్నారు.

ఒక్కసారి నీరసం వచ్చేసింది..

'సార్..ఇంతవరకూ చేసిన ప్రిపరేషన్స్..అన్నీ?"

'చెబుతున్నాను కదా.. కథ అలా మార్చుకొచ్చాక ఆలోచిద్దాం.."

నాకు తెలుసు ఇది ముందుకి వెళ్ళే ప్రపోజల్ కాదని.

నన్ను దర్శకుడిగా సెలక్ట్‌చేసిన ఆయన భార్య గారికి చెప్పాను " మేడమ్..చాలా కృతజ్ఞతలు. సార్‌కి నా కథ నచ్చినట్లు లేదు. ఆయన చెప్పినట్లు మార్చేస్తే ఈ కథలో ఆత్మ మిస్సవుతుంది. ప్రోజెక్టు ముందుకి వెళ్ళకపోయినా ఫర్వాలేదు కానీ నన్ను మొదటి సారిగా దర్శకుడి స్థానంలో కూర్చో బెట్టిన మీకె నేనెప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను.." అని చెప్పి వచ్చేశాను.

అలా మొదటి సినిమా ప్రయత్నం సెట్స్ మీదికి వెళ్ళకుండానే ఆగిపోయింది.

కొత్త అనుభవం..ఇంతకు ముందు చూసిన మనుషులే ఐనా కొత్త ప్రవర్తనలు, కొత్త రియాక్షన్స్.!

మళ్ళీ నిర్మాతల వేటలో పడ్డాను.

నివాస్(రచయిత) అనే మరో మిత్రుడి ద్వారా అప్పుడప్పుడే పైకి వస్తున్న ఒక యువహీరోకి కథ చెప్పడానికి అప్పాయింట్‌మెంట్ దొరికింది. వెళ్ళాను..

అతని నాన్నగారు కూడా పేరొందిన హీరో అవడంతో ఈ యువహీరో కూడా అదే స్టైల్‌లో ఉన్నాడు. కథ చెప్పడం మొదలు పెట్టాను. కథ మొదలుపెట్టిన రెండు నిమిషాలకే తల వంచుకుని సెల్ ఫోన్ లో ఎస్.ఎమ్.ఎస్ లు ఇచ్చుకోవడం మొదలు పెట్టాడు. నా కథ వింటున్నాడో తెలీదు వినడం లేదో తెలీదు. నేను చాలా ఎమోషనల్ సీను చెబుతుంటే ఫోన్ కేసి చూసుకుంటూ నవ్వుకుంటున్నాడు.



"బాబూ.. మీరేదో బిజీగా వుంటున్నారు. నేను కూడా షూటింగ్ మధ్యలో వచ్చాను. మళ్ళీ ఎప్పుడైనా తీరికగా వస్తాను.." అన్నాను.

"అవునమ్మా..తమ్ముడ్ని ఎయిర్ పోర్ట్ నుంచీ పికప్ చేసుకోవాలి. ఒక పని చెయ్యి ఆదివారం పూర్తిగా ఖాళీనే. వచ్చెయ్యి.." అన్నాడు.

ఆ ఆదివారం ఎప్పటికీ రాదని నాకూ తెలుసు, అతనికీ తెలుసు..!

ఇంకోసారి జెమిని టి.వి.లో 24 ఫ్రేమ్స్ కార్యక్రమంలో ఒక ప్రసిద్ధ నిర్మాతతో ఇంటర్వ్యూ చూశాను. ఆయన కేవలం చిరంజీవి, ఎన్టీఆర్ గార్లతో మాత్రమే సినిమాలు నిర్మించిన అగ్ర నిర్మాత. ఏదో ప్రశ్నకి సమాధానం చెబుతూ "బెంగాలీ, మరాఠీ లాంటి ఇతర భాషల్లో ఉన్నట్లు మనకిలో బడ్జెట్ లో మంచి సినిమా కథలు రాసే రచయితలు, దర్శకులు లేరు. అలాంటి వేమైనా నా వద్దకివస్తే నేనూ అలాంటి చిన్న చిత్రాల నిర్మాణానికి ఓ.కె. " అని చెప్పారు. ఈయన నిజమైన నిజాయితీ గల నిర్మాత అనుకుని ఛోటా కె.నాయుడి గారి పరిచయంతో ఆ నిర్మాత వద్దకి వెళ్ళానొక రోజు. కథంతా విన్నాక "ఇందులో హీరోయిజం ఏముందీ?" అన్నారాయన.

"అదీ..చిన్న సినిమాలని ఎంకరేజ్ చేస్తానని టి.వి.లో చెప్పారు కదా.. అందుకే ఇది ఫీల్ ఉన్న యూత్ సబ్జెక్టు అని మీవద్దకి వచ్చాను. పెద్ద హీరోల సినిమా కాదండీ.." అన్నాను.

"ఇంటర్వ్యూల్లో ఎన్నో చెబుతామయ్యా. అవన్నీ పాటిస్తే మా బిజినెస్ ఏమౌతుందీ..!" అని నిజాయితీగా నిజం బయటపెట్టారు..

ఇలా ఎక్కే గుమ్మం..దిగే గుమ్మం అన్నట్లుగా ఎంతో మంది నిర్మాతలని కలవడం జరిగింది. రెండున్నర సంవత్సరాలు జరిగిపోయాయి..దాచుకున్న డబ్బులు కూడా ఐపోవస్తున్నాయి. ఇంకా ట్రయల్స్ కొనసాగించే ముందు కనీసం మళ్ళీ కొంతైనా డబ్బు సంపాదించాలి అనుకుంటుండగా 'ది అంగ్రేజ్' అనే సినిమాకి కోడైరెక్టర్‌గా చేసే అవకాశం దొరికింది. న్యూయార్క్ ఫిల్మ్ స్కూలు

నుంచీ వచ్చిన నిఖిల్‌తో పనిచేయడం అనే సరికి ఒప్పుకున్నాను. హైదరాబాదు నేపథ్యంలో తీసిన కొత్తరకం సినిమా అది. హిందీ - ఇంగ్లీషు - ఉరుదు అన్నీ కలిపి హైదరాబాద్ పాతబస్తీ జీవితాలకి అద్దం పట్టిన కథ. అతి తక్కువ బడ్జెట్‌తో కేవలం మూడు వారాల షూట్‌తో పూర్తిచేశాం ఆ సినిమాని. రిలీజ్ చెయ్యడానికి నిర్మాతలు ముందులో చాలా ఇబ్బందులు పడినా, విడుదలయ్యాక కొద్ది రోజుల్లోనే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. నాకు ఆర్థికంగా కొన్ని రోజులు గడపడానికి సహాయపడింది.

దాని తర్వాత దిల్ రాజు గారి కంపెనీలో 'బొమ్మరిల్లు' సినిమాకి కో-డైరెక్టర్ గా చేరాను. రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. ఆ సమయంలో ఒక రోజు రాత్రి పూట ఫోన్ వచ్చింది..

"కాంత్..బావున్నారా? నేను ఆర్.కె.ని"

ఆర్.కె. అంటే ది అంగ్రేజ్ సినిమాలో విలన్ గా నటించిన మిత్రుడు.

"బావున్నారా ఆర్.కె?"

"ఒకసారి మా ఆఫీసుకి రాగలరా రేపు?"

మర్నాడు షూటింగ్ లేకపోవడంతో ఆర్.కె ని వాళ్ళ ఆఫీసులో కలిశాను.

"కాంత్...ది అంగ్రేజ్ జెనర్ లోనే నేనొక సినిమా చేద్దామనుకుంటున్నాను. ఇదీ కథ.." ఆర్.కె పది పదిహేను సీన్లు చెప్పారు.

నాకు చాలా నచ్చింది. అదే చెప్పాను..

"నేనే నిర్మాతగా ఉందామనుకుంటున్నాను.."

"మంచిది. డైరెక్టర్ ని కూడా మంచి వాడిని పెట్టుకోండి. ప్రోడక్టు బాగా వస్తుంది.." అన్నాను.

"డైరెక్టర్ ఎవరో ఏమిటి..మీరే చెయ్యాలి.." అన్నారు ఆర్.కె.

ఒక్క క్షణం ఆలోచించాను. ఏదో 'ది అంగ్రేజ్' కి కో-డైరెక్టర్ గా చేశాను కానీ ఈ హైదరాబాదు భాషా, ఆచార వ్యవహారాలు అంతగా తెలీవు. తెలుగులో కొత్త కాన్సెప్టుతోనే కమ్మర్షియల్ సినిమా తీసి దర్శకుడిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. కానీ ఇలా అలవాటులేని కథా నేపథ్యాన్ని ఎలా తీయగలను.?

అదే చెప్పాను ఆర్.కెతో.



"లేదు.. నువ్వు తియ్యగలవు. నాకా నమ్మకం ఉంది. .."

"ఒక్క రెండు రోజులు టైమివ్వండి.." అన్నాను

ఒక వైపు దిల్ రాజుగారి ప్రొడక్షన్‌లో పనిచేస్తున్నాను. ఆయనతో అప్పటికే మంచి పరిచయం ఉంది. ఇంకా కొన్నాళ్ళు అక్కడే పని చేస్తే ఆ ప్రొడక్షన్‌లోనే సొంత సినిమా చేసే అవకాశం రావొచ్చు..ఇలా ఒక వైపు.. నామీద ఇంకో వ్యక్తికి అంత నమ్మకం ఉన్నప్పుడు నామీద నాకే ఎందుకు అనుమానం రావాలి..పైగా ఒక్కసారి ఈ అసిస్టెంట్, కో-డైరెక్టర్ అన్న ఇమేజ్ పోగొట్టుకోగలిగే చక్కటి అవకాశం..ఇలా ఇంకో వైపు ఆలోచించాను. చివర్కి ఆర్.కె. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలనుకున్నాను. దిల్ రాజు గారికి చెప్పాను " సరేలే.. డైరెక్టర్ అవకాశం అంటున్నావ్ కదా. నీకూ మంచిదేలే.." అని పెద్ద మనసుతో అర్థం చేసుకున్నారు.

అలా మొదలైంది 'హైదరాబాద్ నవాబ్స్'.!! ఒక్క సారి ప్రాజెక్టులో ఉందామనుకున్నాక కథమీద, దాన్ని తెరకెక్కించే ప్రాసెస్ మీద పూర్తి అవగాహన రావాలి అనుకుని రెండు మూడు నెలలపాటు కృషి చేశాను. రోజూ పాతబస్తీకి వెళ్ళి మదీనా పరిసరప్రాంతాల్లో యూత్ ఎలా వుంటుంది, ఎలా మాట్లాడుతారు, వాళ్ళ బాడీ లాంగ్వేజ్ ఎలా వుంటుంది అన్న విషయాల్ని క్షుణ్ణంగా పరిశీలించాను. ఆర్.కె చెప్పిన 10-15 సీన్లని 75 సీన్లుగా పెంచాను. ముందుగా తెలుగులో సీన్లు, సంభాషణలు అనుకుని అందులో నటించబోయే అజీజ్ అనే అతనికి వివరించి హింది-ఉరుదులో వ్రాయించాను. మళ్ళీ అన్నీ చదివించుకుని నేననుకున్న పంచ్ వస్తోందా , లేదా అని సరి చూసుకు నేవాడిని. సాంకేతిక వర్గంలో చాలా మంది కొత్త టెక్నీషియన్సే అవడంతో దర్శకత్వం తో పాటు మిగతా డిపార్ట్‌మెంట్లు కూడా చూసుకుంటే ఉండేవాడిని.




సినిమా నిర్మాణం మధ్యలో ఉండగా ఒక సంఘటన జరిగింది. అంతవరకూ జరిగిన చిత్రీకరణ రషెస్‌ని ఒకాయనకి చూపించడం జరిగింది. ఆయన ఒక ప్రముఖ ప్రొడక్షన్ సంస్థలో పనిచేస్తున్నాడు. రషెస్ చూసిన తర్వాత 'ఈ సినిమా సక్సెస్ సందేహమే. వచ్చినంత రేటుకి అమ్మేసి బయటపడండి' అని తీర్పు ఇచ్చాడు. ప్రొడ్యూసర్ కి నీరసం వచ్చేసింది. నాకైతే సినిమా సక్సెస్ మీద ఏమాత్రం సందేహం లేదు. వివరంగా చెప్పాను " ఆయనకి ఇలాంటి సినిమాల గురించి తెలికపోవచ్చు. ఇది మామూలు తెలుగు కమ్మర్షియల్ సినిమా కాదు. దీనికి ఉండే ప్రేక్షకులు వేరు. 'ది అంగ్రేజ్' నేర్పిన పాఠాల నుంచి చెబుతున్నాను ఈ సినిమా ఖచ్చితంగా సూపర్ హిట్ ఔతుంది' అని సర్ది చెప్పాను.

అందుకే సినిమా నిర్మాణం పూర్తయాక పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ చెన్నైలో పూర్తిచేశాను. ఫస్ట్ కాపీ చూడగానే 'ఇది ఖచ్చితంగా సక్సెస్ సినిమా' అని అందరికీ నమ్మకం కలిగింది.

సెప్టెంబర్ 1, 2006 న విడుదలయ్యింది. అదే రోజు లగే రహో మున్నాభాయ్ కూడా రిలీజయ్యింది. సిటీలో 'హైదరాబాద్ నవాబ్స్' విడుదలైన ప్రతి థియేటర్‌కి పక్కనే 'లగే రహో మున్నాభాయ్' విడుదలైంది. అయితే రెండు సినిమాలకి వచ్చే ప్రేక్షకులు వేర్వేరు అనీ, మా సినిమా కి వచ్చే ఆడియన్స్ కి ఢోకా ఉండదనీ మాకు గట్టినమ్మకం. మామూలు థియేటర్స్‌తో పాటు ప్రసాద్ ఐ మాక్స్‌లో కూడా నా మొదటి సినిమా ప్రదర్శించబడాలని నా చిరకాలకోరిక. రెగ్యులర్ రిలీజ్ కి ముందు రోజు రెండు షోస్ వేసే లాగ ఐమాక్స్ తో ఒప్పందం. దానికి కలెక్షన్స్ బాగా వస్తే మరునాడు ఉంటుంది, లేకుంటే ఇంతే సంగతులు. ఆ రెండు ఆటలకి ఒక్కోదానికి కేవలం 50 మంది మాత్రమే వచ్చారట. ఇంక రెగ్యులర్ షోస్ అక్కడ ఉండవులే అనుకుని మేము రిలీజ్ మొదటి రోజు సంతోష్ థియేటర్ కి వెళ్ళాం. మధ్యలో ఫ్రెండ్స్ ఫోన్ చేసి సినిమా టిక్కెట్లు కావాలన్నారు. 'ఐమాక్స్ లో ఫ్రీగా దొరుకుతాయి' అని చెప్పాను. 'లేదు రాబోయే నాలుగు రోజులకి ముందే బుక్ ఐపోయాయట' అన్నాడతను. అప్పటికే సంతోష్‌లో సినిమా మొదలైంది. సినిమాలో స్థానిక జీవనాన్ని ప్రతిబింబించే సంఘటనలకి, హాస్యానికి ప్రేక్షకులు విజిల్స్, కేకలు.. సినిమా సగం అయ్యే సరికే అది సూపర్ హిట్ అని తెలిసిపోయింది..! ఆ విధంగా నా మొదటి సినిమా 150 రోజులు మించి ఆడింది. దర్శకుడిగా నాకంటూ ఒక గుర్తింపూ, ప్లాట్‌ఫామ్ లభించాయి. నా ఎదుగుదలకి కారణమైన, మా మామయ్య శంకర్, దర్శకత్వంలో మొదటి గురువు తేజ గారు.. మొదలైన అందరూ నన్ను మనస్ఫూర్తిగా అభినందించారు. అలా 'హైదరాబాద్ నవాబ్స్' ఒక సెన్సేషన్ సృష్టించింది. ఇదీ నా మొదటి సినిమా ప్రస్థానం.

ఐతే మొదటి సినిమాని అంత హిట్ సినిమా చేసి రెండో సినిమాలో ఎందుకు ఫెయిలయ్యారని చాలా మంది అడుగుతున్న ప్రశ్న. నిజానికి నా రెండో సినిమా 'నిన్న రేడు రేపు'కి దర్శకుడిగా నాకు మంచి మార్కులే వచ్చాయి. పోకూరి బాబూరావుగారి లాంటి పెద్ద

నిర్మాతలు కూడా నన్ను ప్రత్యేకంగా అభినందించారు. రివ్యూలు కూడా బాగానే ఉన్నాయి. ఐతే ఆ సినిమా ప్రేక్షకులని చేరడంలో విఫలమయ్యింది. మొదలవటం బాగానే జరిగినా, 'కర్ణుడి చావుకి కారణాలు వెయ్యి' అన్నట్లు సాగింది ఆ సినిమా పరిస్థితి. ఆ సినిమాకి ముందుగా అనుకున్న పేరు 'జల్సా'. ఐతే నా ప్రమేయం లేకుండానే మా ప్రొడ్యూసర్ దాన్ని పవన్ కళ్యాణ్ సినిమాకి ఇచ్చేశారు. నాకు మాట మాత్రమైనా చెప్పలేదు. నా టైటిల్‌ని ఆయన వేరే వాళ్ళకి ఇచ్చెయ్యడం 'అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు' అయింది. అందుకే 'జల్సా' సినిమా టైటిల్స్‌లో ఆయనకి కృతజ్ఞతలు ఉంటాయి..నాకు కాదు!!




సినిమా ఫస్ట్ కాపీ అక్టోబర్ 2007 కి రెడీ ఐతే, ఆ తర్వాత సంవత్సరం పాటు విడుదల కాలేదు. ఐదారు సార్లు సినిమా రిలీజ్ ప్రకటించి వాయిదాలు వేశారు. దాంతో చాలా మందికి 'ఈ సినిమా అసలు వస్తుందా?'అని, మరికొంతమందికి 'ఇది ఎప్పుడో వచ్చేసిన సినిమా కదా' అని ఇంప్రెషన్ పడిపోయింది. అలాగే కథానుగుణంగా వచ్చే ఒక పాటలోని కొన్ని దృశ్యాలని హైలైట్ చేస్తూ చేసిన ప్రచారాలు కూడా ప్రేక్షకులని దూరం చేసింది.. ఏమైతేనేం నేను ఎంతో ఇష్టపడి చేసిన సినిమా ఫెయిలయింది. మంచి కథ, మంచి సాంకేతిక నిపుణులే కాదు, సినిమాని సరిగ్గా మార్కెట్ చేసి, విడుదల చేసి, ప్రమోట్ చేయగల నిర్మాత కూడ సినిమా విజయానికి చాలా ముఖ్యం...

అందుకే మూడో సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కొంచెం ఆలస్యమైనా మంచి ఆరోగ్యకరమైన కమ్మర్షియల్ హిట్‌తో మీ ముందుకి వస్తానని నమ్మకంగా చెప్పగలను.

ఈ ఇంటర్వ్యూ ముగించబోయే ముందు నేను నిత్యం, ప్రతి క్షణం గుర్తుచేసుకునే ఒక వ్యక్తి గురించి చెప్పాలి. ఆయనే మా నాన్న...

చిన్నప్పుడు స్నేహితుడిలా వేలుపట్టుకునీ, భుజం మీద చేతులేసీ నన్ను సినిమాలకి తీసుకెళ్ళిన నాన్న..

డ్యూటీ నుంచీ అర్థరాత్రి ఎప్పుడో తను ఇంటికి చేరినా నిద్రపోతున్న నన్ను లేపి మరీ నాకోసం ప్రత్యేకంగా తెచ్చిన స్వీట్స్ తినిపించిన నాన్న ..

అన్నా దమ్ములం ఇద్దరం ఫిల్మ్ ఫీల్డ్‌లో సెటిలవడానికి కష్టపడుతున్న రోజుల్లో హైదరాబాదు వచ్చి మమ్మల్ని చూసి 'ఎందుకురా ఈ కష్టాలు..శుభ్భంగా విజయవాడ వచ్చేసి ఆ డిగ్రీ ఏదో పూర్తి చేసి ఎక్కడో చోట ఉద్యోగం చూసుకోండి' అని మా శ్రమని చూసి తను బాధపడిన నాన్న..

నా మొదటి సినిమా ప్రీమియర్ షో కి నాపక్కనే కూర్చుని సినిమా అయ్యాక 'సాధించావురా అబ్బాయ్..' అని తడి కళ్ళతో అభినందించిన నాన్న

... నా విజయంలో మిగతా భాగాన్ని చూడకుండానే మమ్మల్ని వదిలివెళ్ళిపోయిన నాన్న..!!

నా భవిష్యత్తులో తీసే సినిమాలకి కూడ ప్రీమియర్ షోల్లో నా పక్క సీటు ఖాళీగా వుంచుకుంటాను. ఆ స్థానంలో తిరిగిరాని లోకాలకి వెళ్ళిన నాన్నని ఊహించుకుని తృప్తిపడుతుంటాను..!

***

(జనవరి 2010 సంచికలో ప్రచురితం)

# యోగి / యోగేష్

గత సంవత్సరం విడుదలై కమ్మర్షియల్‌గా విజయం సాధించిన 'చింతకాయల రవి' **దర్శకుడు యోగేష్,** మొదటి సినిమా ప్రస్థానం ఈ నెల కౌముది పాఠకులకోసం. మొదటి సినిమా 'ఒక రాజు ఒక రాణి' (ఆ సినిమాకి 'యోగి' అని అందరూ తనని పిలిచే పేరు పెట్టుకున్నారు) ప్రేక్షకాదరణకు నోచుకోకపోయినా రెండో సినిమాని వ్యాపారాత్మకంగా విజయవంతం చేశారు. సూపర్ హిట్ చిత్రాల రూపకల్పనకు అన్ని అర్హతలూ ఉన్న ఈ యువదర్శకుడు అతి త్వరలోనే అలాంటి చిత్రాన్ని అందించాలని ఆశిస్తూ ఆయన జ్ఞాపకాల దారుల్లోకి వెళదాం పదండి.



**నా పూర్తి పేరు మాగంటి యోగేష్ కృష్ణ చంద్ర.** నాన్నగారి పేరు హరికృష్ణ ప్రసాద్. అమ్మగారి పేరు కల్పనా చౌదరి. ముగ్గురు అక్కయ్యల తర్వాత నాలుగో సంతానం నేను. ఒక్కడే అబ్బాయిని. నేను పుట్టింది అదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లి లో. నాన్నగారు అక్కడ వ్యవసాయం, వ్యాపారం చేస్తుండేవారు. ఐతే నాకు ఊహ తెలిసే వయసు వచ్చేసరికి, అంటే ఐదారు సంవత్సరాల వయసుకి, నాన్నగారి సొంతవూరు ఐన చాటపర్రుకి వచ్చేశాము. ఏలూరు దగ్గరలో ఉంటుంది చాటపర్రు (గుత్తా రామినీడు, సమతా ఛటర్జీ, ముఖర్జీ, జయభేరి కిషోర్, విజయబాపినీడు, మురళీ మోహన్..మొదలైన సినీ ప్రముఖులు ఈ వూరు నుంచే వచ్చిన వాళ్ళే).

నా ప్రాథమిక విద్యాభ్యాసం మాత్రం గుడివాడలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో సాగింది.

చాటపర్రు నుంచీ ఏలూరు వెళ్ళడం కంటే గుడివాడలో పెద్దమ్మ గారింటి వద్ద ఉంచి చదివించడం మంచిదని నాన్నగారు ఆ నిర్ణయం తీసుకున్నారు. ఆరో తరగతి వరకూ అక్కడ చదివి, చాటపర్రు వచ్చేశాను. 7వ తరగతి నుంచీ పదో తరగతి వరకూ ఏలూరులో చదివాను. చిన్నప్పటి నుంచీ చదువులో యావరేజ్‌గానే ఉన్నా ఆటల్లో మాత్రం ముందుండే వాడిని. హైస్కూల్లో ఉండగానే క్రికెట్‌లో మంచి పేరు తెచ్చుకున్నాను. జిల్లా స్థాయి పోటీల్లోనూ, ఎమ్.ఆర్.ఎఫ్, సౌత్ సెంట్రల్ రైల్వే లాంటి ప్రతిష్టాత్మకమైన పోటీల్లోనూ అండర్ 19 టీములో చాలా గేమ్స్ ఆడాను.

నాన్నగారు నేను ఏ పని చేసినా ప్రోత్సహించే వారు. సినిమాలు చూసినా ఏమీ అనే వాళ్ళు కాదు. నిజానికి ఫేమిలీ అందరం కలిసే ఎక్కువ సినిమాలు చూశాము. హైస్కూల్లో ఉండగానే పుస్తకాలు చదవడం బాగా అలవాటైంది. ఎక్కువగా హిస్టరీ పుస్తకాలు, ప్రపంచ చరిత్రల గురించిన పుస్తకాలు బాగా ఆకర్షించేవి. టాల్ స్టాయ్ అనువాదాలు కూడా చదివాను.

హైస్కూలు అయ్యాక ప్లస్ టు చదవడానికి మద్రాసులో ఉన్న మామయ్య గారింటికి పంపించారు. అక్కడైతే స్టాండర్డ్స్ బావుంటాయని నాన్నగారి అభిప్రాయం. అది నిజమే కానీ మద్రాసులో ఉన్న రెండేళ్ళలో అసలు చదువుకంటే సినిమా పరిజ్ఞానంలో ఎక్కువ అనుభవం వచ్చింది!

మద్రాసులో మా స్కూలు పక్కనే సత్యం కాంప్లెక్స్, కొంచెం దూరంలో సఫైర్ కాంప్లెక్స్ ఉండేవి. సత్యంలో ఎక్కువగా మళయాళం సినిమాలు వచ్చేవి. ఫాజిల్, ప్రియదర్శన్‌ల దర్శకత్వంలో వచ్చిన అప్పటి మళయాళ చిత్రాలన్నీ ఔత్సాహికులకి ఎన్నో పాఠాలు చెప్పేవి. మా స్కూల్లో ఇంటర్నల్ పరీక్షల ఫలితాలు చెప్పినప్పుడు పెద్దవాళ్ళని తీసుకుని వెళ్ళాలి. మాలోని లోటుపాట్లన్నీ వాళ్ళకి చెప్పేవాళ్ళన్నమాట. సరిగ్గా అలాంటి రోజునే స్కూలు ఎగ్గొట్టి సఫైర్‌లో తలదాచుకుంటూ ఉండేవాడిని. తర్వాత ఏమౌతుందనే ఆలోచన ఉండేది కాదు. ఆ థియేటర్స్‌లో ఇంకో సౌకర్యం కూడా ఉండేది, ఒక టికెట్ కొంటే ఆ సినిమాని రోజంతా ఎన్ని సార్లైనా చూడొచ్చు. అది మహాద్భుతమైన వరంలా ఉండేది నాకు. అలా అలవాటైన సినిమాల ఆసక్తి కెమేరా పనితనం, దర్శకత్వ శాఖలని పరిశీలించడం మీదకి మళ్ళింది. పి.సి శ్రీరామ్ గారి ఫోటోగ్రఫీ అంటే విపరీతమైన అభిమానంగా ఉండేది. సినిమా ఎలాంటిదైనా పి.సి. శ్రీరాం కెమేరా అంటే వెళ్ళిపోయే వాడిని. అలాగే మణిరత్నం గారి 'గీతాంజలి', 'నాయకుడు', 'ఘర్షణ'..చూసిన ప్రతిసారీ కొత్త కోణాలని ప్రాజెక్ట్ చేస్తుండేవి. సినిమాలు చూడ్డం, అందులోని వివిధ విషయాల సాంకేతిక రంగాల గురించి, నటీ నటుల గురించి.. మిత్రులతో చర్చించడం..ఇవి నిత్యకృత్యాలే కానీ ..ఎందుకిన్ని సినిమాలు చూస్తున్నాం అనే దానికి ఇతమిత్థమైన సమాధానమేమీ లేదు. అప్పటికింకా అలోచనలేవీ ఒక రూపంలోకి రాలేదు.



ఆ రోజుల్లోనే ఆంధ్రజ్యోతిలో ఒక కొత్త సినిమా ప్రకటన వచ్చింది. బిగించిన పిడికిలి, దానిలోంచి వేలాడుతున్న సైకిల్ చైన్..'శివ'!!. సినిమా షూటింగ్ మొదలైన రోజు వచ్చిన రోజు ప్రకటన అందరిలానే నాకూ చాలా కొత్తగా అనిపించింది. దసరా శెలవలకి మద్రాసు నుంచీ మావూరు వచ్చాను. ఏలూరులో ఏ మిత్రుడ్ని పలకరించినా 'శివ', 'శివ' అంటున్నారు... ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ఆ సినిమాని పొగుడుతున్నారు. 'శివ' చూడని జన్మ వ్యర్థం అన్నట్లుగా ఊదర గొట్టేశారు. అంత బాగున్న సినిమా మణిరత్నం గారి నుంచీ కాక కొత్త దర్శకుడినుంచీ ఎలా వచ్చిందా అన్న ఆసక్తితో నేనూ వెళ్ళాను. సినిమా నడుస్తున్నంత సేపూ ఎక్కడున్నానో తెలీలేదు. సినిమా పూర్తయ్యే సరికి మరో ప్రపంచం నుంచీ ఈ లోకంలోకి వచ్చినట్లనిపించింది. నేను శెలవలకి ఏలూరులో ఉన్న పదిహేను రోజుల్లో ఎన్ని సార్లు 'శివ' చూశానో గుర్తులేదు. నామిత్రుడు చంటి రోజూ సినిమాకి టిక్కెట్లు సంపాయించడంలో సహాయం చేసేవాడు. మణి రత్నం, పి.సి. శ్రీరామ్ గార్ల సినిమాలు నన్ను ఆకర్షిస్తే 'శివ' సినిమా ఒక లక్ష్యాన్ని నిర్దేశించినట్లు అనిపించింది. ఆ సినిమా చూసి మద్రాసు వచ్చిన దగ్గరనుంచీ సినిమాని చూసే దృక్కోణమే మారిపోయింది. అలాంటప్పుడే అమెరికా ఎంబసీలోని లైబ్రరీకి వెళ్ళి ఫిల్మ్ మేకింగ్ గురించిన పుస్తకాలు చదవడం కూడా చేసే వాడిని. సినిమాల్లోకి వెళ్ళాలి. ఏదైనా చెయ్యాలి అని అప్పుడే మనసులో స్పష్టా స్పష్టమైన ఆలోచనలు ముసురుకుంటూ ఉండేవి.

ఎలాగొలా ట్వెల్త్ పూర్తిచేసాను. డిగ్రీకోసం నాన్నగారు మళ్ళీ నన్ను ఏలూరుకి తీసుకొచ్చేశారు. ఏలూరు సి.ఆర్.ఆర్. కాలేజీలో బి.ఎ లో చేరాను. సినిమాలు చూడ్డం అనే అలవాటు రోజు రోజుకీ పెరిగింది. ఆ రోజుల్లోనే 'శివరంజని' పత్రికలో వచ్చిన రామ్‌గోపాల్

వర్మగారి ఇంటర్వ్యూ నా మీద పెద్ద ప్రభావం చూపించింది. ఆరు వారాల పాటు సీరియల్‌గా వచ్చిన ఆయన ఇంటర్వ్యూని అక్షరం.. అక్షరం ఎన్ని సార్లు చదివానో గుర్తులేదు. అందులో ఆయన చెప్పిన విషయాలన్ని నరనరాలో జీర్ణించుకుపోయాయి. నిజంగా చెప్పాలంటే రామ్ గోపాల్ వర్మ గారి ఆ ఇంటర్వ్యూ అంశాలే సినిమా నిర్మాణం గురించి నాకు ప్రాథమిక పాఠాలు నేర్పాయని చెప్పగలను.

ఆ సమయంలోనే చూసిన మరో సినిమా నా ఆలోచనలకి ఒక ఖచ్చితమైన రూపాన్నిచ్చింది. అదే ఉప్పలపాటి నారాయణ రావు గారి 'జైత్రయాత్ర'. ఏలూరు బాలాజీ థియేటర్‌లో చూశాను. సినిమా చూశాక ఫ్రెండ్స్ అందరం కల్సి థియేటర్ క్యాంటీన్‌లో కూర్చుని మాట్లాడుకోవడం అలవాటు. కొంతమందికి ఆ సినిమా బాగా నచ్చితే కొంతమందికి అస్సలు నచ్చలేదు. ఎవరి కారణాలు వాళ్ళకి ఉన్నాయి. నాకు మాత్రం విపరీతంగా నచ్చేసింది. ఆ రోజు కాంటీన్ కబుర్లలోనే మా ఫ్రెండ్స్ దగ్గర డిక్లేర్ చేశాను.."నేను సినిమాల్లోకి వెళ్తాను. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేరతాను.." అని. "ఇదేమిట్రా..ఈ ఒక్క సినిమా చూసే అంత గట్టి డెసిషనా?" అని ఆశ్చర్యపోయారు. ఆ ఒక్క సినిమా అనే కాదు..అప్పటివరకూ నాలో నెమ్మది నెమ్మదిగా పేరుకున్న భావాలకి అదొక నిర్దిష్టమైన రూపం అంతే..!



ఈ సినిమాలకి సమాంతరంగా ఇంకో విధంగా కూడా నాలోని క్రియేటివ్ బ్రెయిన్‌కి పదును దొరికింది. అది ఆ రోజుల్లో వచ్చిన నవలా సాహిత్యం.

అప్పట్లో పత్రికల్లో వచ్చిన సీరియల్స్ అన్నీ బైండింగుల రూపంలో ఇంట్లో ఉండేవి. యండమూరి, మల్లాది, యద్దనపూడి, సూర్యదేవర.. వగైరా అందరి నవలలూ చదివే వాడిని. సీరియల్స్ చదివేప్పుడు ప్రతి వారం కథ చదివి, వచ్చే సంచికలో కథ ఎలా సాగుతుందో ఊహించడం, తర్వాత వచ్చిన కథతో నా ఊహల్ని పోల్చి చూసుకోవడం.. అదొక మంచి ఎక్సర్ సైజులా ఉండేది. యండమూరి గారి పాత్రలు, సన్నివేశాలు బాగా నచ్చేవి. ఆయా పాత్రల ఇంటిలిజెన్స్ కానీవండి, పాత్రల మధ్య పోటాపోటీగా సాగే సైకలాజికల్ గేమ్స్ కానీవండి.. నన్ను కట్టిపడేసేవి. యండమూరి గారి ఒక్కో నవలా సినిమాగా నిర్మిస్తే ఎలా ఉంటుందీ, కథా విస్తరణ ఎలా చెయ్యాలీ, దృశ్యాల రూపకల్పన ఎలా వుండాలీ అని నాలో నేనే విశ్లేషించుకుంటూ ఉండేవాడిని.

హీరో నాగార్జున గారంటే విపరీతమైన క్రేజ్‌గా ఉండేది. అలానే సినిమాల్లోకి వెళ్ళడమంటే ఇద్దరు దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా చేరాలి అని అనుకుంటూ ఉండేవాడిని. ఒకరు ఉప్పలపాటి నారాయణ రావుగారు, మరొకరు రామ్ గోపాల్ వర్మగారు. ఇలా ఆలోచించుకుంటూ డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగానే హైదరాబాదుకి ఒక షార్ట్ ట్రిప్ వేశాను. అది ఎలా జరిగిందంటే - ఒక సారి సితారలో ఒక పాఠకుడి ప్రశ్నకి సమాధానం చెబుతూ ఉప్పలపాటి నారాయణ రావుగారి ఇంటి ఎడ్రసు ఇచ్చారు. అది చూడగానే ఆయన్ని కలుసుకోవాలనే ఉద్దేశంతో హైదరాబాదు ప్రయాణం పెట్టుకున్నాను. ఐతే ఇంట్లో తెలీదు. హైదరాబాదులో మా బంధువుల ఇంటికి అని మాత్రమే చెప్పాను. అడ్రసు వెదుక్కుంటూ నారాయణ రావు గారి ఇంటికి వెళ్ళాను. పెద్ద ఇబ్బంది లేకుండానే లోనికి వెళ్ళగలిగాను. సరిగ్గా నా వయసప్పటికి 19 ఏళ్ళు. నారాయణ రావుగారు అప్పుడు 'రక్షణ' నిర్మాణం మధ్యలో ఉన్నారు. నన్ను చూసి కూర్చోమని చెప్పి వివరాలడిగారు. అప్పటి వరకూ మనసులో పేరుకుపోయిన ఐడియాలన్నింటినీ పూసగుచ్చినట్లు చెప్పాను. 'ఐతే ఏమి చేద్దామనుకుంటున్నావ్?' అన్నారు. అప్పటికి నాకు తెల్సిన పరిజ్ఞానం ప్రకారం సినిమాలో డైరెక్టర్ కావాలంటే అసిస్టెంట్‌గా చెయ్యాలని

తెలుసు. అసిస్టెంట్ డైరెక్టర్ డ్యూటీలేమిటో కూడా తెలీదప్పటికి. అది విన్న నారాయణ రావు గారు..'సరే బాబూ..ఇప్పుడు ఈ సినిమా మధ్యలో ఉన్నాను కదా. అవకాశం రాగానే చెబుతాను. అడ్రసు ఇచ్చి వెళ్ళు' అన్నారు. మేఘాల్లో తేలిపోతున్న అనుభూతి!!. ఇంటికి తిరిగొచ్చేసి ఫ్రెండ్స్ వద్ద జరిగిందంతా చెప్పాను. వాళ్ళూ చాలా ఎక్సైట్ అయ్యారు. అప్పుడే నేను డైరెక్టర్ ఐపోయినట్లు చూడ్డం మొదలెట్టారు. ఒకసారి అలా డిసైడయ్యాక ఇంక నవలలు చదవడం, కథల గురించి విశ్లేషించడం, విమర్శనాత్మకంగా సినిమాలు చూడ్డం ఎక్కువైంది.

మధుబాబు గారి షాడో నవలలు చదవడం ఇంకో అనుభవం..అప్పుడే  అమ్మ నాకు మాలతీ చందూర్ గారి అనువాదాలు చదవడం అలవాటు చేసింది. ఆ విధంగా ఎన్నో మంచి మంచి ఇంగ్లీషు నవలలని క్రిటికల్ థింకింగ్ విధానంలో చదవడానికి అవకాశం దొరికింది. అమ్మకి ఏదో చదువుకుంటున్నాననే తెలుసుకానీ నా హిడెన్ ఎజెండా తెలీదు. ఇన్ని అలవాట్ల మధ్య చదువు సరిగ్గా సాగలేదు. నారాయణ రావుగారి వద్ద నుంచీ పిలుపు వస్తుందని ఎదురు చూస్తుండగా ఆయన దర్శకత్వంలో రెండు మూడు కొత్త సినిమాల ప్రకటనలు వచ్చాయి. అవి చదివి 'అరే నన్ను పిలవకుండానే సినిమాలు మొదలు పెట్టేస్తున్నారే 'అని విపరీతంగా కంగారు పడడం మొదలెట్టాను. నాలాంటి వాళ్ళు అనేక మంది ప్రతి రోజూ నారాయణ రావు గారిని కలుసుకుంటూ ఉంటారని కూడా తెలీని వయసు. !!

ఒకరోజు ధైర్యం చేసి అమ్మకి చెప్పాను "నేను సినిమాల్లో డైరెక్టర్ కావాలని ఉంది. అసిస్టెంట్ గా చేరతాను" అని. నా అంచనాలకి భిన్నంగా అమ్మ అస్సలేమీ రియాక్ట్ కాలేదు.  మణిరత్నం సినిమాల్లో క్లోజప్‌లో కనిపించే అమ్మ పాత్రలా మౌనంగా ఉండిపోయింది. సరే ..నా రూములోకి వెళ్ళిపోయి ఏవో చదువుకోవడంలో మునిగిపోయాను. మర్నాడు అమ్మతో కౌన్సిలింగ్ సెషన్ మొదలైంది. "నీకు చదువుమీద శ్రద్ధలేదని రెండు మూడేళ్ళ నుంచి గమనిస్తున్నాను. ఐతే ఒకప్పుడు స్పోర్ట్స్ అనే వాడివి. తర్వాత కొన్ని రోజులు అమెరికా వెళ్ళి ఎం.బి.ఎ చదువుతాను అనే వాడివి (అదీ నిజమే లెండీ!). ఇప్పుడు సినిమాలంటున్నావు. జీవితం ఇలా మూవింగ్ టార్గెట్స్‌తో నడవదు. నీకు నిజంగా ఏం కావాలో తేల్చుకో. ఐతే ఏదైనా నాన్నగారి అనుమతి కావాల్సిందే" అని చెప్పింది అమ్మ. ఆ విధంగా ఆ రోజు షరతులతో కూడిన సలహాలతో గడిచింది. నాన్నగారితో మాట్లాడ్డానికి ముందు ఉప్పలపాటి గారితో మాట తీసుకుందామని హైదరాబాదుకి రెండో ట్రిప్ వేశాను. అప్పటికి నారాయణరావు గారు 'తీర్పు' సినిమా మొదలు పెడుతున్నారు. ఇంతకు ముందు మాటే 'చూద్దాం' అన్నారు. సరే ఇంటికి వచ్చాను.

నాన్నగారితో సెషన్ మొదలైంది. సహజంగానే అందరు పేరెంట్స్‌కి ఉన్నట్లే ఆయనకీ భయాలు ఉన్నాయి. ఐతే మరి ఆ వయసులో నా మాట నెగ్గడం లేదని ఉక్రోషం. ఏ పనికీ అడ్డుచెప్పని నాన్నగారు సినిమాల్లోకి వెళ్తానంటే ఎందుకు వద్దంటున్నారు? చూసింది కావాలనుకునే వయసే కానీ పెద్దవాళ్ళ భయాలని అర్థం చేసుకునేంత విచక్షణ లేదు.. అలగడం..అన్నం మానెయ్యడం...మౌన వ్రతాలూ..అన్నీ మొదలయ్యాయి నా వైపు నుంచీ. నాన్నగారు ఔననీ అనలేదు, కాదనీ అనలేదు..ఐతే ఇంక నేను ఏమి చెప్పినా విననని మాత్రం నిశ్చయించుకున్నారు. ఐతే రెండు సార్లు నా అంతట నేనుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది కాబట్టి మామయ్య జయభేరి కిషోర్‌గారితో రికమండేషన్ లెటర్ వ్రాయించుకుని మరీ ముచ్చటగా మూడోసారి ఉప్పలపాటి నారాయణ రావుగారిని కలుసుకున్నాను. అప్పటికి 'తీర్పు' షూటింగ్ ప్రోగ్రెస్‌లో ఉంది. దానికి అసిస్టెంట్‌గా అవకాశమిచ్చారు. అదీ సినిమా రంగంలో నాకు మొదటి అవకాశం.! ఇంక నా పరిస్థితి చెప్పాలంటే ప్రపంచాన్ని జయించిన ఫీలింగ్! సినిమాల్లోకి రావాలనేది ఒక కోరిక ఐతే నారాయణ రావుగారి వద్దనే మొదలు పెట్టాలనేది గాఢమైన కోరిక ..అది నెరవేరినందుకు నా ఆనందానికి హద్దుల్లేవు.

సినిమా షూటింగ్ మొదలై రెండు వారాలు గడిచాయి. నెమ్మదిగా దర్శకత్వ శాఖలో అసిస్టెంట్ డ్యూటీలకి అలవాటు పడుతున్నాను.. ఐతే కొత్త జీవితం, కొత్త పని సమయాలు, ఎప్పుడో భోజనం..ఎప్పుడో నిద్ర..వీటితో అనారోగ్యంగా అనిపించి డాక్టర్‌ని కలిశాను. ఆ రోజు మలానీ హౌజ్‌లో షూటింగ్ జరుగుతోంది. డాక్టర్ వద్ద నుంచీ రిపోర్టులు వచ్చాయి. జాండిస్ అని తేల్చారు. అంత

సీరియస్ కంప్లెయింట్‌తో హైదరాబాదులో కొనసాగడం మంచిది కాదని, చాటప్రరు వచ్చేశాను.! ఇంటివద్ద ఉంటూ, విశ్రాంతి తీసుకుంటూ జాండిస్‌కి మందులు వాడుతున్నాను. ఐతే రెండు మూడు వారాల షూటింగ్ వాతావరణం..ఇంకా నాకు కొత్తగా ఉండడమే కాక అదో కొత్త కిక్‌ని ఇచ్చింది. సమయమంతా పుస్తకాలు చదవడంలోనూ, కథలు వ్రాసుకోవడంలోనూ గడిపాను. ఆరోగ్యం కుదుట పడగానే హైదరాబాదు వచ్చేసి అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగాన్ని కొనసాగించాను. అక్కడనుంచీ మొదలు పెట్టి నారాయణ రావుగారి వద్దనే 4 సినిమాలకి అసిస్టెంట్‌గా పనిచేశాను. అవి 'తీర్పు', 'అల్లరిపోలీస్', 'పాతబస్తీ', 'ఊరికి మొనగాడు'. ఇష్టపడి ఎన్నుకున్న ప్రొఫెషన్ కాబట్టి ప్రతిక్షణం పూర్తి కాన్సన్‌ట్రేషన్‌తో పనిచేసి నారాయణ రావుగారికి ప్రియ శిష్యుడినయ్యాను.



అలా నా మొదటి కోరిక నెరవేరింది. ఇంక రెండో కోరిక రామ్ గోపాల్ వర్మ గారి వద్ద పనిచేయడం..!

నారాయణ రావుగారికి, రామ్ గోపాల వర్మగారికీ అప్పట్లో శంకర్‌గారే ఎడిటర్‌గా పనిచేసేవాళ్ళు. నేను పని చేసే సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉండగానే రామ్ గోపాల వర్మగారి సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతుండేవి. ఆ విధంగానే రాము గారి వద్ద పనిచేస్తున్న కృష్ణ వంశీ, జగన్, బి.వి.రమణ, నివాస్.. అందరూ క్లోజ్ అయ్యారు. వాళ్ళ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో కూడా అనఫిషియల్‌గా పాలుపంచుకుంటూ ఉండేవాడిని. అలా కొన్ని సంవత్సరాలు గడిచాక కృష్ణవంశీగారు డైరెక్టర్ అయ్యారు. బి.వి. రమణ కాబోతున్నారు. దాంతో రాము గారి వద్ద అసిస్టెంట్ పోస్టుకి ఖాళీ వచ్చింది. అప్పుడు బి.వి.రమణ, నన్ను రాముగారికి రికమెండ్ చేశారు. ఒక రోజు ప్రసాద్ లేబ్స్‌లో ఉండగా 'గులాబి' చిత్రం పని మీద రాముగారు కూడా అక్కడికి వచ్చారు. అక్కడే రమణ నన్ను రాము గారికి పరిచయం చేసి 'ఇతనే నేను చెప్పిన యోగి. మీ వద్ద అసిస్టెంట్‌గా చెయ్యడానికి రెడీగా ఉన్నాడు' అని చెప్పారు. రాము గారు ఒక ఐదునిమిషాలు నాతో మాట్లాడారు.. అదో గొప్ప థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్. ఆయన ఆ ఐదు నిమిషాల్లో ఏం మాట్లాడారో ఇప్పుడే కాదు అప్పుడూ గుర్తులేదు. అంత ఎక్సైట్‌మెంట్‌కి లోనయ్యానప్పుడు. ఎన్నో సంవత్సరాలుగా నేను ఆరాధిస్తున్నా దర్శకుడు నాతో మాట్లాడ్డం నన్ను నేనే నమ్మలేని నిజం!!

సాయంకాలం ఆఫీసుకి వచ్చి కలవమని చెప్పారు. వెళ్ళాను.. దాదాపు రెండు గంటల పాటు నన్ను ఇంటర్వ్యూ చేశారు.. లైఫ్‌లో మొట్టమొదటిసారి డిస్టింక్షన్ మార్కులు వచ్చిన పరీక్ష అది...! నన్ను సెలక్ట్ చేసుకున్నారు రాముగారు. అలా నా జీవితంలో రెండో కల నెరవేరింది. రాముగారి కంపెనీలో దర్శకత్వ శాఖలో నా ప్రయాణం అఫీషియల్‌గా మొదలైంది. 'రంగీలా' తెలుగు వెర్షన్ పోస్ట్ ప్రొడక్షన్, 'అనగనగా ఒక రోజు' షూటింగ్.. ఆ సమయంలో అక్కడ నా జాబ్ మొదలైంది. అలా మొదలైన నా ప్రయాణం రాముగారి కంపెనీలో ఏడెనిమిదేళ్ళు 2001 వరకూ విజయవంతంగా కొనసాగింది. 'జంగిల్', 'మస్త్', 'దెయ్యం', 'దౌడ్', 'ప్రేమకథ' మొదలైన సినిమాలకి అసిస్టెంట్‌గా పనిచేశాను. 'ప్రేమ కథ' నిర్మాణం సమయంలోనే ఇ.నివాస్‌కి 'శూల్' సినిమా డైరెక్షన్ అవకాశం వచ్చింది. ఆ సినిమాకీ, అతనితోనే 'లవ్ కె లియే కుఛ్ భీ కరేగా' సినిమాకి కో-డైరెక్టర్‌గా పనిచేశాను.

అప్పుడు సొంతంగా దర్శకత్వం చేసే ఆలోచన, అవకాశం వచ్చాయి. ఈ ప్రయాణంలోనే త్రివిక్రమ్ శ్రీనివాస్ మంచి మిత్రుడయ్యాడు. విజయ భాస్కర్‌గారు కూడా బాగా పరిచయం. వాళ్ళిద్దరూ 'నువ్వేకావాలి' హిందీ వెర్షన్ ప్లానింగ్ కోసం బొంబాయి వచ్చారు. వాళ్ళే ఉషాకిరణ్ మూవీస్‌లో ఎక్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎ.వి.రావు గారిని పరిచయం చేశారు. ఆయన ద్వారా ఉషాకిరణ్‌లో

దర్శకత్వం కోసం ప్రయత్నించమని వాళ్ళు సలహా ఇచ్చారు. అప్పట్లో 'చిత్రం' తర్వాత కొత్తవాళ్ళకి ఎక్కువ అవకాశాలు ఇస్తున్నారు ఉషాకిరణ్ వాళ్ళు. ఐతే అంతకు ముందే ఇంకో ప్రొడ్యూసర్ హైదరాబాదు నుంచీ వచ్చి నాతో సినిమా తియ్యడానికి సిద్ధమయ్యారు. అదే విషయం త్రివిక్రమ్‌తో చెప్పి హైదరాబాదు వచ్చాను. ఐతే ఏవో కారణాల వల్ల ఆ ప్రోజెక్ట్ ఫైనలైజ్ కాలేదు. సరే మళ్ళీ ఉషాకిరణ్ వాళ్ళ కాంటాక్ట్ పట్టుకున్నాను. అజయ్ శాంతి, ఎ.వి. రావు గార్లకి కథ చెప్పాను. వాళ్ళకి బాగా నచ్చింది. తరువాతి స్టేప్ ఛైర్మన్ రామోజీరావు గారికి కథ చెప్పడం..!

రామోజీరావు గారంటే ఒక ఐకాన్.. లివింగ్ లెజండ్.!! నాకు చిన్నప్పటినుంచీ స్వయంకృషితో పైకివచ్చి ఆయా రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన వ్యక్తులంటే పెద్ద ఫాసినేషన్! ధీరుబాయ్ అంబానీ, రామోజీ రావు గారు..వగైరా. వాళ్ళు పారిశ్రామికవేత్తలు కానీండి, సంఘ సంస్కర్తలు కానీవండి, శాస్త్రవేత్తలు కానీవండి...అలాంటి వాళ్ళంటే ఆరాధనా భావం ఉండేది. అలాంటి వాళ్ళలో ఒకరైన రామోజీరావు గారికి కథ చెప్పడమంటే అదొక అగ్నిపరీక్ష! ఇందులో ఫెయిలవడానికి వీల్లేదు..డూ ఆర్ డై సిట్యుయేషన్!

ఆయనకి కథ చెప్పడానికి అమీర్ పేట నుంచి అజయ్‌శాంతి, నేను, వేమూరి సత్యనారాయణగారు కారులో బయలుదేరాము. నేను టెన్షన్ భరించలేకపోతున్నాను. అదే ఇంటి దగ్గరలో ఉన్న ఆఫీసు ఐతే ప్రిపేరైన వెంటనే వెళ్ళి కథ చెప్పేసే వాడినేమో. ఇలా కారులో రెండు గంటల ప్రయాణం చేస్తుంటే రకరకాల ఆలోచనలతో రెండు సంవత్సరాలు ప్రయాణించినట్లనిపించింది. నా మానసిక స్థితి మీకు అర్థమౌతోందనుకుంటాను...

ముగ్గురం రామోజీ ఫిల్మ్ సిటీలో దిగాము. వేమూరి సత్యనారాయణగారు నా పరిస్థితి గమనించినట్లున్నారు..

"యోగీ.. బి కాన్ఫిడెంట్..ఈ సినిమా రామోజీరావు గారు తీస్తారు, దీన్ని నువ్వు డైరెక్ట్ చేస్తావు.. పూర్తి విశ్వాసంతో కథ నేరేట్ చెయ్యి.." అని ధైర్యం చెప్పారు.

అప్పుడు ఇంకో విషయం తెలిసింది.

సాధారణంగా రామోజీ రావుగారు శుక్రవారం రోజు కథలు వింటారు. కానీ నా కథ బాగా నచ్చడం వల్ల, బుధవారం రోజే వినడానికి టైమ్ ఇచ్చారు. ఐతే ఇది ఔటాఫ్ ది షెడ్యూల్ కాబట్టి కేవలం 45 నిమిషాలు మాత్రమే కేటాయించారని చెప్పారు. అప్పుడు మొదలైంది టెన్షన్..! రెండున్నర గంటల కథని 45 నిమిషాల్లో ఎలా చెప్పాలి? అక్కడా బిగి సడలకూడదు..అదొక పరీక్ష. ఎలాగైతే ఆ క్షణం రానే వచ్చింది. మామూలు గానే సిగ్గు బిడియం అవసరమైన శాతం కంటే ఎక్కువే నాకు. ఎవరైనా ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పగలను కానీ నా అంతట నేను గంటల తరబడి మాట్లాడలేను. ఆ క్షణం రానే వచ్చింది. రామోజీ రావుగారి ఆఫీసులో ఆయన ఎదురుగా కూర్చున్నాం. నాలుక తడారిపోయింది. ఆయనే సంభాషణ మొదలుపెట్టారు. ముందుగా నా చదువుగురించి, ఫేమిలీనేపథ్యం గురించి మామూలు ప్రశ్నలు అడిగారు. నా టెన్షన్ కాస్త తగ్గింది. కథ చెప్పడం మొదలు పెట్టాను. 45 నిమిషాలు అనుకున్న మీటింగ్ 3 గంటల పాటు సాగింది. కథ ఆసాంతం విన్నారాయన. మధ్యలో ప్రశ్నలు అడిగారు, సలహాలిచ్చారు. అజయ్ శాంతిగారు, ఎ.వి.రావు గారు కూడా తమ అభిప్రాయాలు చెప్పారు. మీటింగ్ చివరలో రామోజీరావు గారు షేక్ హాండ్ ఇచ్చి 'గుడ్ లక్..గో ఎహెడ్ విత్ ది ప్రోజెక్ట్ ' అన్నారు.

అలా మొదలైంది నా మొదటి సినిమా 'ఒక రాజు ఒక రాణి'. మొదటి నుంచి టైటిలే అందరిలో చాలా క్యూరియాసిటీ పెంచింది. అదే సమయంలో రవితేజ నటించిన 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' చూసాను. రవితేజ నాకు ఎప్పటినుంచీ పరిచయమే కానీ ఆ సినిమాలో పూరి జగన్నాథ్ రవితేజని చూపించిన విధానం చాలా కొత్తగా ఆకట్టుకుంది. ఆ కోణంలో అంతవరకూ ఎవరూ రవితేజని చూడలేదేమో అనిపించింది. 'ఒక రాజు ఒక రాణి' కి కూడా రవితేజనే సరైన హీరో అని ఫైనలైజ్ చేశాం. నమిత హీరోయిన్. షూటింగ్ అంతా స్మూత్‌గా సాగిపోయింది. ఉషాకిరణ్ యూనిట్ మొత్తం ఎంతో సహకరించారు. మామూలుగా వాళ్ళు తీసే సినిమాలకి ఉండే

చాలా పరిమితుల్ని సడలించారు. దాదాపు 95 శాతం సినిమా ఔట్‌డోర్‌లోనే షూట్ చెయ్యడం జరిగింది. చక్రి సంగీతం, మిత్రుడు త్రివిక్రమ్ పాటలు రాశాడు.

ఎన్నో అంచనాలతో విడుదలైన 'ఒకరాజు ఒక రాణి' బాక్సాఫీస్ వద్ద ఫెయిలయింది..!

తర్వాత విశ్లేషించుకుంటే రెండు కారణాలు కనిపించాయి నాకు -మొదటి సగ భాగంలో హీరో, హీరోయిన్ల మధ్య సాన్నిహిత్యం పెరిగే సంఘటనల్లో ఇంకాస్త పట్టు ఉండాలనిపించింది. అలాగే రెండో సగ భాగంలో ప్రేమ పెళ్ళిని పెద్దలు కుదిర్చిన పెళ్ళిగా చిత్రించే క్రమంలో అవసరమైన సస్పెన్స్ సరిగ్గా ఎస్టాబ్లిష్ కాలేదనిపించింది. ప్రేక్షకులు ఆ టెన్షన్‌ని ఫీల్ కాలేదు. మిస్ ఫైర్ అయింది. ఐతే రవితేజకి మాత్రం నా క్రియేటివిటీ మీద గట్టినమ్మకం ఉంది. ఎప్పటికైనా నాతో మంచి యాక్షన్ మూవీ చేస్తానని అంటుండే వాడు. అది ఖరారు కాలేదు కానీ ఇంతలో 'చింతకాయలరవి' అవకాశం వచ్చింది. ఈ సినిమా వ్యాపారాత్మకంగా బాగానే ఆడింది. ఐతే ఆ విడుదల

సమయంలోనే సినిమా టిక్కెట్ల రేట్లు తగ్గడం వల్ల కలెక్షన్స్ మొత్తాలు గణనీయంగా తగ్గాయి. దీనికి తోడు పైరసీ మరీ దెబ్బకొట్టింది. ఇన్ని కారణాల వల్ల 'చింతకాయల రవి' సూపర్ హిట్ స్థాయిని చేరలేకపోయింది.

ఇదండీ.. ఇంతవరకూ సాగిన నా సినీ జీవిత ప్రయాణం..

త్వరలోనే మంచి యాక్షన్ సినిమాతో మీ ముందుకి వస్తాను. ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక దశకి రాగానే వివరాలు ప్రకటిస్తాము.

ఈ విధంగా 'కౌముది' ద్వారా అంతర్జాతీయంగా ఉన్న తెలుగు సాహితీ ప్రియులని కలుసుకోవడం ఆనందంగా వుంది. మరిన్ని విశేషాలతో మరోసారి కలుసుకుందాం. మీ అందరికీ నా అభినందనలు..!

***




(ఫిబ్రవరి 2010 సంచికలో ప్రచురితం)

# సావిత్రి

### విజయచిత్ర ౧౯౬౮ సంవత్సరంలోని సంచికనుంచీ పునర్ముద్రితం

'వెండితెర పై వెన్నెల సంతకం' మహానటి సావిత్రి మొదటిసారిగా దర్శకత్వం వహించిన 'చిన్నారి మనసులు' సినిమా గురించి తన అనుభవాలని ఈ వ్యాసంలో వివరించారు. ఆ రోజుల్లో వచ్చిన ప్రముఖ సినిమా పత్రిక 'విజయచిత్ర' నుంచీ దీనిని పునర్ముద్రిస్తున్నాం

**కొన్ని సంవత్సరాల క్రిందటి** మాట... దుక్కిపాటి మధుసూధనరావుగారు నన్నో మాట అడిగారు. "డైరక్టర్ సుబ్బారావుగారు బిజీగా ఉన్నారు. నువ్వు మా నెక్స్ట్ పిక్చర్ డైరెక్ట్ చేస్తావా?" అని. ఆ మాట వినీ వినగానే, నేను నవ్వడం ఆరంభించాను. పకపకమని నవ్వుతూనే ఉన్నాను."ఎందుకలా నవ్వుతావు? నేను హాస్యానికి అడగడంలేదు. నిజంగానే అడుగుతున్నాను." అన్నారాయన.



అప్పటికీ నవ్వు ఆపుకోడం నావల్ల కాలేదు. కాకపోతే ఏమిటి? - అనేక ఉత్తమ చిత్రాలు నిర్మించిన అన్నపూర్ణా అధినేత - చిత్రం డైరెక్టు చెయ్యమని నన్ను అడగడం ఏమిటి? - అందుకే ఆ నవ్వు, ఆ నవ్వులో ఎన్నో అర్థాలు నాకే కనిపించాయి.

మధుసూధనరావుగారి ప్రశ్నకు వేరేగా నేను సమాధానం ఇవ్వలేదు. నా నవ్వే సమాధానమయిపోయింది. అంచేత ఆయన మళ్ళీ ఏమీ అనలేదు. ఊరుకున్నారు.

ఆ రాత్రి నేను ఓ విషయం బాగా ఆలోచించాను. ఎందుకు నన్ను మదుసూధనరావుగారు అలా అడిగారు? ఒకచిత్రంలో నటించడం అంటే అలవాటయిన పనిగాని, చిత్రాన్ని డైరక్టు చెయ్యడం అంటే మాటలా? మరి ఎందుకలా అడిగారు? నా దగ్గర అంత సామర్థ్యం ఉందా? - పైగా నాకేం అనుభవం ఉందని?... ఆ ప్రశ్నలకేమీ సమాధానాలు దొరకలేదు...

ఆ తర్వాత మళ్ళీ ఆ విషయమై నేనప్పుడూ ఆలోచించలేదు.

అయితే, ఒకటుంది. మేము చిత్రంలో నటించడానికి వెళ్ళేముందు - ఆనాటి దృశ్యాన్ని సంభాషణలతో సహా ముందుగా మాకు పంపుతారు - చదువుకోడానికి. అలా, ఆ సంభాషణలు చదువుతూ ఉంటే నాకేవో ఊహలు వచ్చేవి. 'ఇది ఈ షాట్‌లో తీస్తే' బావుంటుందేమో.

'ఇది ఫలానా యాంగిల్ లో తీస్తే ఎలా ఉంటుంది?'

'దృశ్యం అంతంలో ఇలా ఉంటే డ్రమెటిక్‌గా ఉంటుందేమో' అనే భావాలు కలిగేవి నాకు. అయితే, షూటింగ్‌లో పాల్గొనేటప్పుడు, ఆ డైరెక్టరుగారు వేరు విధంగా చిత్రీకరించేవారు. నేను అనుకున్నదానికీ వారు తీసినదానికీ తేడా ఎలా ఉందో

చూసుకునేదాన్ని. ఒక్కోసారి, నా ఊహ తప్పనిపించేది. ఇంకోసారి నా ఊహ అయితే, ఇంకా ఎఫెక్టివ్‌గా ఉండేదేమో అనిపించేది. ఏమైనా, చిత్రానికి డైరెక్టర్ అంటే, ఆయనదే అధికారం, ఒక్కొక్కరి అభిరుచులు ఒక్కోలా ఉంటాయి. ఎవరి ఊహ వాళ్ళది, ఎవరి భావాలు వాళ్ళవి. అంచేత నేనేమీ మాట్లాడేదాన్ని కాదు:

"నాకు ఈ సంభాషణ ఈ విధంగా కావాలి" అని డైరక్టరుగారంటే.. అలాగే చెప్పేదాన్ని. వెళ్ళేదాన్ని. కాని, మనసులో మాత్రం ఏదో ఊహ మెదిలేది. నా ఊహతో తీసి ఉంటే అది ఎలా ఉండేదో అని అంతే. అయితే, అందులో 'డైరక్టర్‌ని కావాలి' అనే కోరికలేదు! ఊరికే ఊహ. అలాంటి ఊహలు అందరికీ కలుగుతాయి. అందరికీ కలిగినట్టే, నాకూ కలిగాయి.

ఆ రోజు మధుసూధనరావుగారు "డైరక్టు చేస్తావా?" అని అడిగితే నాలో మరికొన్ని భావతరంగాలు లేచాయి. నిజంగా డైరక్టర్ నయితే, నేను అనుకున్న ఊహలన్నీ క్రియా రూపంలోకి వస్తాయి కదా అనుకున్నాను. కాని, ఆ వెంటనే భయం వేసింది. డైరక్టర్ అంటే ఎలాంటి బాధ్యతలు మొయ్యాలి? ఎలాంటి అనుభవాలు కలిగి ఉండాలి?...

**********

దర్శకులు వి.మధుసూదనరావుగారి సతీమణి, సరోజిని ఓ రోజు నాకోసం వచ్చారు.

"నేనోవార్త పట్టుకొచ్చాను. మీరు వినికాదనకూడదు" అన్నారామె. నాకేం అర్థం కాలేదు. చెప్పమన్నాను.

"ఆడవాళ్ళమంతా కలిసి, ఒక చిత్రనిర్మాణాన్ని తలపెడదామని ఉంది. ఆ చిత్రాన్ని మీరు డైరక్టు చెయ్యాలి" అని అన్నారు ఆవిడ. నాకేమిటోగా అనిపించింది. నాలో ఏం శక్తులున్నాయని మళ్ళీ ఇలాంటి అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చింది?...

ఓ నిమిషం నేను మాట్లాడలేదు - 'ఓ చిత్రం డైరక్టు చేసి చూస్తే?' అనిపించింది.

"ఒక్క నిమిషం ఉండండి వారిని అడిగి చెబుతాను" అని 'ఆయన'కు ఫోన్ చేశాను. "ఏమండీ విషయం ఇలా ఉంది. ఏం చెయ్యమంటారు?' అని అడిగాను. కొన్ని నిమిషాలవరకూ ఫోన్‌లో ఏమాటా వినిపించలేదు.

"ఏమండీ? ఏమంటారు?" అని మళ్ళీ అడిగాను.

ఓ క్షణం ఆగి, "ఒప్పుకో" అన్నారాయన.

నాకు వళ్ళు ఝల్లుమంది. ఆయన కూడా ఒప్పుకోమంటున్నారేమిటి?...

"అదికాదండీ... నాకూ.."

"నువ్వు చెప్పబోయేదేమిటో నాకు తెలుసు. నేనెలా డైరక్ట్ చేస్తాను? నాకు ఆ అనుభవం ఎక్కడిది? నాకేం చేతవుతుంది? అని అడగబోతున్నావు. నీ గురించి నీకు తెలీదు గాని, నాకు బాగా తెలుసు. ఒప్పుకో. నేను వచ్చాక వివరంగా అన్ని విషయాలూ మాట్లాడుకుందాం" అని ఫోన్ పెట్టేశారు.

నేను కూడా ఫోన్ పెట్టేలోపల, సరోజనిగారు - " కాయా? పండా?" అని అడిగారు.

"ఆయన పచ్చజెండా చూపించారు" అన్నాను.

"వెరీగుడ్, తక్కిన విషయాలన్నీ రేపొచ్చి మాట్లాడతాను డైరక్టరుగారూ!" అని చెప్పి వెళ్ళిపోరు ఆమె 'డైరక్టరుగారూ' అన్న మాటను వీలైనంత వరకూ అండర్ లైన్ చేస్తూ.

తర్వాత శ్రీమాతా ఫిలిమ్స్ వెలిసింది. 'చినారి మనసులు' చిత్ర నిర్మాణం ఆరంభమైంది. నేను డైరక్టరనయ్యాను. నిజానికి మాది మహిళామండలి. సంస్థను నడిపేవారూ, టెక్నీషియన్స్ కూడా మహిళలే. సరోజినే కథ రాశారు, పి.లీల సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. మోహన అనే అమ్మాయి కళాదర్శకత్వం వహిస్తోంది. రాజసులోచన నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. అసిస్టెంట్ డైరక్టర్‌గా కొప్పరపు సరోజిని పనిచేస్తున్నారు.

"ముఖానికి మేకప్ లేకుండా మీరు డైరక్టర్ హోదాలో షూటింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటే మీకు ఎలా ఉంది?" అన్న ప్రశ్నను చాలామంది అడిగారు.

నిజంగా చెప్పాలంటే - నాకేమీ కొత్త అనిపించలేదు. కంగారూ పడిపోలేదు. నేను ఎలా డైరక్టు చేస్తానో చూడాలని మా సెట్టుకు చాలా మంది తెలిసినవారు వస్తూవుంటారు. ఈ కొత్త పనిలో నన్ను చూడడంవల్ల - వారు కొత్త ఫీల్ అయి ఉంటారు.

ఇదివరకటినుంచీ, నాకు ఉన్న అలవాటేమిటంటే - ఏ డైరక్టర్ దగ్గర పనిచేస్తున్నా ఆయన టెక్నిక్ ఏమిటని గమనించేదాన్ని. కెమెరా ఎక్కడపెడుతున్నారు? ఎలా చిత్రీకరిస్తున్నారు? ఎందుకు కెమెరా అక్కడ పెట్టారు? - మొదలైన విషయాలన్నీ ఆలోచిస్తూ నాకు నేనే ఆ విజ్ఞానాన్ని గ్రహించేదాన్ని. అలాంటి ఆ కొద్ది అనుభవంతోనూ, మా వారి ప్రోత్సాహంతోనూ పెద్దల ఆశీర్వచనాలతోనూ నేను డైరక్టర్‌ను అయ్యాను.

డైరక్టర్‌గా మొదటిసారి నేను సెట్టులో అడుగుపెట్టిన రోజున. టి. ప్రకాశరావుగారు, ఆదుర్తి సుబ్బారావుగారు, వి.మధుసూధనరావుగారూ మొదలైన వారంతా వచ్చి నన్ను అభినందించారు. నేను ఎలా పనిచేస్తానో చూద్దాం అని వారంతా వచ్చి నన్ను అభినందించారు. నేను ఎలా పనిచేస్తానో చూద్దాం అనివారంతా సెట్లో చాలాసేపు కూచున్నారు.

కృష్ణుడి విగ్రహాన్ని పెట్టి మొదటి షాట్ తీశాను, రెండుబొమ్మలతో రెండో షాట్ తీశాను, మూడో షాట్‌లో రోజారమణి, శాంతికళ బొమ్మలతో ఆడుకుంటున్నట్టుగా చిత్రీకరించాను.

ఓసారి జానకిగారు నటిస్తున్న దృశ్యం షూట్ చేస్తున్నాను. ముందు కెమేరాను కొంతదూరంలో పెట్టి షాట్ ఏర్పాటు చేశాను. అయితే, జానకిగారు నటించడం ఆరంభించిన తర్వాత, ఆమె ముఖభావాలను కెమేరాలోంచి చూస్తే - కెమేరా ఇంకా ముందుకు పెట్టాలని భావించుకుని, ఆవిడకు దగ్గరగా కెమేరా పెట్టి చిత్రీకరించాను.

ఆరోజు రాత్రి జానకి నాకు ఫోన్ చేశారు.

నన్ను అభినందిస్తూ.. "నాకేమాత్రం కొత్త డైరక్టర్ దగ్గర పనిచేస్తున్నట్టు లేదు. అనుభవంగల డైరక్టర్ దగ్గర పనిచేస్తున్నట్టే ఉంది" అన్నారామె. అలాగే, జమున కూడా చాలాసార్లు అంది. నాకేమీటోలా అనిపించేది - వాళ్ళు అలా అంటున్నప్పుడు.

డైరక్ట్ చెయ్యడం నటించడం కన్న సులభమా?.. అని అనుకునేదాన్ని కొన్నాళ్ళు, తెలిసిరాదు.

ఏమైనా డైరక్టర్‌గా ఇది నా తొలి ప్రయత్నం. నేను అనుకున్న భావాలను తెరమీద ఎలా చెప్పగలిగానో, ఎలా డైరక్టు చేశానో చెప్పవలసింది రసజ్ఞులైన ప్రేక్షకులు. అయితే నేను తమిళ చిత్రాల్ని డైరక్ట్ చేస్తానా - ఇంకా తెలుగు చిత్రాలల్ని డైరక్ట్ చేస్తానా అన్న విషయాలు ఇప్పుడే ఏమీ చెప్పలేను.

అయితే, చిత్రాల్లో నటించడం మానుకోలేదు, మానను. నేను ఈ చిత్రంలో ఒక చిన్నపాత్ర ధరిస్తున్నాను. ఉత్సాహం కొద్దీ నాలోవున్న అభిరుచులకొద్దీ డైరక్టర్‌ను అయ్యాను. ఈ శాఖలో అనుభవం లేకపోయినా, ఈ పరిశ్రమలో ఉన్న అనుభంవల్ల - నేనీ శాఖను చేపట్టాను. డైరక్టరయితే నటించరాదనీ, నటించేవారు డైరక్టరు కాకూడదనీ ఎక్కడాలేదుగా!

*******

(మార్చి 2010 సంచికలో ప్రచురితం)

# నరసింహ నంది

***నరసింహ నంది..*** సినిమాలే ప్రాణంగా పెరిగి, చిన్నతనం నుంచీ సినిమా దర్శకుడు కావడమే ఆశయంగా పెట్టుకుని స్వయంకృషితో పైకి వచ్చిన విలక్షణ దర్శకుడు. తీసింది రెండే సినిమాలు కానీ సృష్టించిన సంచలనం మాత్రం అందరినీ ఆకర్షించింది. మొదటి సినిమా, '1940లో ఒక గ్రామం' కి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల గుర్తింపు లభిస్తే రెండో సినిమా 'హైస్కూలు' వివాదాస్పదమైంది. "అందరిలా ఆలోచించి సినిమాలు తియ్యను. కొత్తదారులు తొక్కడమే నా ధ్యేయం.." అనడమే కాదు, నిరూపించుకుంటూ ముందుకి సాగుతున్న యువదర్శకుడి సినీ జీవన ప్రస్థానం, ఈ నెల కౌముదిలో మీకోసం ప్రత్యేకం.



**మాది ఒంగోలు జిల్లా,** కనిగిరి తాలూకాలోని ఒక పల్లెటూరు. నాన్న పేరు నారయ్య, అమ్మ పేరు నాగమ్మ. అమ్మానాన్నలకి అన్నయ్య, నేనూ ఇద్దరమే సంతానం. మాది దిగువ మధ్యతరగతి వ్యవసాయక కుటుంబం. నాన్న పొలం పనులు చేస్తూనే రంగస్థల నాటకాలు వేస్తుండేవారు. తనతోపాటే నన్నూ నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేయిస్తుండేవారు. తొమ్మిదే ఏటనే స్టేజి ఎక్కి 'హరిశ్చంద్ర'లో లోహితాస్యుడు వేషం వేశాను. అంత చిన్నవయసులోనే రాగయుక్తంగా పద్యాలు పాడుతుంటే చూసిన వాళ్ళంతా ఆశ్చర్యపోతుండేవారు. అప్పటినుంచే మేకప్పూ, ఫోకస్ లైట్లూ, ప్రేక్షకుల చప్పట్లూ..అలవాటయ్యాయి. ఊళ్ళో ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగినా నేను పద్యాలు పాడడం అనేది ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది.

హైస్కూలు వరకూ మావూళ్ళోనే చదువుకున్నాను. చదువులో అంతంత మాత్రంగానే ఉండేవాడిని. ఐతే సినిమాలు మాత్రం విపరీతంగా చూసేవాడిని. అప్పట్లో మా వూళ్ళో వి.సి.ఆర్, టి.విలతో నడిచే వీడియో పార్లర్లు ఉండేవి. వాటిల్లోనే ఆటకి రూపాయో, రూపాయిన్నరో ఇచ్చి రోజుకి రెండు ఆటలు సినిమాలు చూసే వాడిని. చిరంజీవిగారి సినిమాలు, కృష్ణ గారి సినిమాలు చాలా ఫేంటసీగా ఉండేవి. మణిరత్నంగారు, దాసరిగారు, విశ్వనాథ్‌గారి సినిమాలు నా మీద ఎక్కువ ప్రభావాన్ని కలిగించాయి. మణిరత్నం గారి 'మౌనరాగం',' రోజా', విశ్వనాథ్ గారి సీతామాలక్ష్మి, సిరిసిరి మువ్వ.. ఇవన్నీ నాకి కొత్తలోకాలని చూపించేవి.

రోజా స్కూలుకి వెళ్ళేప్పుడూ, వచ్చేప్పుడు ఫ్రెండ్స్‌తో క్రిందటి రోజు చూసిన సినిమాల కబుర్లు చెబుతూ ఉండేవాడిని. సినిమా ఎంతసేపు ఉండేదో అంత సేపూ కథ చెప్పేవాడిని. వాళ్ళంతా సినిమాలు చూడలేదు కాబట్టి నాతో కథలు చెప్పించుకుని సినిమా చూసిన ఆనందాన్ని పొందేవారు. ఇంట్లో ఏమి చేసినా ఏమీ అనేవారు కాదు. చిన్నప్పటినుంచీ కూడా ఆ స్వేచ్ఛ ఇచ్చారు. చాలా సార్లుఅడిగీ, కొన్నిసార్లు నాన్న జేబులోంచి డబ్బులు తీసుకుని సినిమాలకి వెళ్ళిపోయేవాడిని. స్కూల్లో మాత్రం నిద్రపోతూ ఉంటే మాస్టార్లు వీపు విమానం మోగించేవాళ్ళు 'రాత్రంతా సినిమాలూ..క్లాసులో నిద్రపోవడమా..' అంటూ.

నేను కథలు చెప్పే విధానం చూసిన ఫ్రెండ్స్ అంతా 'అరే..నువ్వు సినిమాల్లోకి వెళ్తే బాగా రాణిస్తావు..'అనే వారు. సినిమా రంగం గురించి ఏమీ తెలిసే వయసుకాదు కానీ, సినిమాల్లోకి అంటూ వెళితే దర్శకత్వం లోకే వెళ్ళాలని అనిపించడానికి మాత్రం ఒకటి రెండు

కారణాలున్నాయి. నేను నాన్నతో కల్సి రంగస్థల నాటకాలు వేసినప్పుడు ఆ డ్రామా డైరెక్టర్‌గారు అందరినీ అజమాయిషీ చేయడం నన్ను ఆకర్షించింది. మేకప్పు వేసే వాళ్ళని, హార్మోనియమ్ వాయించే వాళ్ళని, ఆర్టిస్టుల్ని అందరినీ ఆయన కంట్రోల్ చెయ్యడం నాకు చాలా ఫేసినేషన్‌గా వుండేది. అలాగే హైస్కూల్లో ఉండగా నాటకాలు వేసేప్పుడు నేనూ ఒక పాత్రధారుడ్ని. ఐతే డైరెక్టర్‌గా వున్న మా క్లాస్‌మేటే నా మీద అధికారం చెలాయించడం నచ్చేది కాదు. అదేమంటే 'నేను డైరెక్టర్‌ని. నేను చెప్పినట్లు నువ్వు వినాల్సిందే.' అనేవాడు. అప్పటినుంచే అనిపించేది 'డైరెక్టర్ అంటే అందరినీ కంట్రోల్ చేసేవాడు. సినిమాల్లో ఐతే ఇంకా ఎంతో మంది మీద అధికారం చెలాయించవచ్చు..' అదీ అప్పుడు కలిగిన భావన..అంతే ఎప్పటికైనా సినిమాల్లో దర్శకుడ్ని కావాలని ఫిక్స్ ఐపోయాను.

ఇలా గడిచిన హైస్కూలు జీవితంలో టెంత్ క్లాసు పరీక్షలు అయ్యాయి.

సినిమాలు..సినిమాలు..సినిమాల్లోకి వెళ్ళాలి.. ఏం చెయ్యాలి? మద్రాసు వెళ్ళాలి..? ఎలా? ఇంట్లో చెబితే వెళ్ళనివ్వరు, ఇంట్లో అంతగా డబ్బులూ ఉండవు. తీవ్రంగా ఆలోచించిన మీదట మా వూళ్ళోనే ఉన్న ఒక ఫ్రెండు వద్దకెళ్ళాను. అతనికి ఒక కిరాణాకొట్టు ఉండేది. అతని వద్ద 15 రూపాయలు అప్పుగా తీసుకున్నాను. ఇంట్లో చెప్పకుండానే, కాస్త మసకపడ్డాక రెండు బస్సులు మారి నెల్లూరు వెళ్ళి అక్కడనుంచీ రైలు పట్టుకుని మద్రాసు వెళ్ళిపోయాను. పదిహేనేళ్ళ వయసులో మొదటిసారి మావూరు దాటి బయటి ప్రపంచం చూడ్డం అదే మొదటి సారి. రైలు ఎలా వుంటుందో చూడ్డం, రైలు టిక్కెట్టు కొనుక్కుని ఎలా ఎక్కాలో నేర్చుకోవడం అదే మొదటిసారి. సెంట్రల్ స్టేషన్‌లో దిగి ఎలాగో పాండీ బజార్ చేరుకుని ఒక లాడ్జిలో దిగాను. రోజుకి రూపాయో, రూపాయిన్నరో తీసుకుని మడతమంచం ఇచ్చారు. మొదటి రోజు భయం.. భయంగా గడిచింది. రెండో రోజు ధైర్యం చేసి బయటికి వచ్చాను. స్టూడియోల చుట్టూ తిరగడం, ఎవరైనా సినిమా వాళ్ళనిపిస్తే నా గురించి చెప్పుకుని అవకాశం అడగడం..ఇదీ దినచర్య. అంత చిన్నవయసులో నన్ను ఎవరైనా ఎందుకు పట్టించుకుంటారు? ఆ విషయం అర్థమవడానికి నెలన్నర పట్టింది. ఐతే నేను లాడ్జిలో దిగాక నాలుగైదురోజులకే నా వాలకం కనిపెట్టిన లాడ్జి ఓనర్‌కి నిజం చెప్పేశాను. నా మీద జాలి పడి, కొన్నాళ్ళు డబ్బులు ఇవ్వకపోయినా అక్కడే ఉండనిచ్చాడాయన. అలా నెల్లన్నర గడిపి ఇంటికి తిరుగు ముఖం పట్టాను. అన్నాళ్ళ తర్వాత తిరిగొచ్చిన నన్ను చూసి అమ్మా,నాన్నా ముందు బాధపడ్డారు. కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకున్నారు. కోప్పడ్డారు. నేను కనిపించకపోయే సరికి అన్నిచోట్లా వెదికారట. బంధువుల ఇళ్ళన్నింటికీ వెళ్ళివచ్చారట. ఆచూకీ ఏమాత్రం తెలియకపోయే సరికి దిగులు పడుతూ ఉన్నారట.

ఈ సంఘటన వల్ల నాకు ఏమైనా తెలిసి వచ్చిందా అన్నవిషయం గుర్తులేదు. ఎలాగో టెంత్ క్లాసు గట్టెక్కాను. ఇంటర్మీడియట్ చదవాలంటే నాన్నకి చదువు చెప్పించే ఓపికలేదు. అందుకని విజయవాడలో మా బావ ఒకాయన వద్దకి పంపించారు. విజయవాడలో ఐతే సినిమా రంగానికి చెందిన వాళ్ళెవరైనా పరిచయమౌతారేమోననే ఒక ఆలోచన కూడా ఉండేది. మా బావకి విజయవాడలో ఒక టీ స్టాల్ ఉండేది. "నరసింహా..ఉండడం ఐతే మా వద్దనే ఉండవచ్చుకానీ చదువుకోడానికి కావల్సిన డబ్బులు నువ్వు సంపాదించుకోవాల్సిందే" అన్నారాయన. ఆయనే తన టీ కొట్టుకి ఎదురుగా ఉన్నా నారాయణ స్వామి లాడ్జిలో రూమ్ బోయ్‌గా చేర్చారు. అక్కడ పనిచేసే రూమ్ బోయ్స్ అందరిలోకీ నేనే హైలీ క్వాలిఫైడ్! మిగతా వాళ్ళంతా ఒకటో తరగతీ, రెండో తరగతీ చదివిన వాళ్ళే.! అలా మొదలైంది విజయవాడలో నా ఇంటర్మీడియట్ జీవితం.

రాత్రిపూట లాడ్జిలో పనిచేయడం, పగలు కాలేజీకి వెళ్ళడం..మధ్యమధ్యలో సినిమాలు చూడడం..ఇలా ఉండడంతో రోజుకి రెండుగంటలు కూడా నిద్రపోవడానికి కుదిరేది కాదు. ఒక సారి రూమ్ బోయ్ డ్రెస్ లోనే ఫీజు కట్టడానికి వెళితే కాలేజీలో అందరూ నవ్వారు... అవమానంగా అనిపించినా చెయ్యగలిగిందేమీ లేని పరిస్థితి.




ఎప్పుడే పని చేస్తున్నా సినిమాల్లో చేరాలనే ఆలోచన మాత్రం వదల్లేదు. కాలేజీలో నాకో ఫ్రెండ్ దొరికాడు. వాళ్ళ నాన్నగారికి మేడికొండ మురళీ కృష్ణ గారు(`నరసింహ నాయుడు` సినిమా నిర్మాత) మంచి మిత్రులు. మురళీకృష్ణ గారు ఆసమయంలో `లాఠీ` సినిమా తీస్తున్నారు. ఆయన్ని కలుసుకుని ఎలాగైనా ఆ సినిమాలో డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో చేర్చమని అడిగాను. `ఏం చేస్తున్నావ`ని అడిగితే కాలేజీలో చదువుకుంటూ, లాడ్జిలో పనిచేస్తున్నానని చెప్పాను. హోటల్లో పనిచేసే వాడికి సినిమా డైరెక్షన్ గురించి ఎందుకు అన్నారాయన. అరే, ఆ విషయం చెప్పకుండా కేవలం చదువుకుంటున్నానని చెబితే సరిపోయేదేమో అనుకున్నాను. ఐనా పట్టుదల వదలకుండా సమయం దొరికినప్పుడల్లా ఆయన్ని కలిసి ఎలాగైనా సినిమాల్లో అవకాశం ఇప్పించమని పదే పదే విసిగిస్తూ ఉండేవాడిని.

`లాఠీ ` సినిమా దాదాపు ఐపోవచ్చింది. తర్వాత తీసే సినిమాల్లో ఏమైనా అవకాశాలుంటే చూస్తానని అన్నారాయన.

రెండేళ్ళు గడిచాయి కానీ, నా ప్రయత్నాలేమీ ఫలించలేదు.

అన్ని సినిమా పత్రికలూ వదిలిపెట్టకుండా చదివేవాడిని. వాటిల్లో సాంకేతిక వ్యాసాలు, సినీ వ్యక్తుల ఇంటర్వ్యూలు పాఠ్యగ్రంధాలకంటే ఎక్కువగా మనసులో ముద్రించుకుపోయేవి. సినిమా రంగం గురించి, చిత్ర నిర్మాణ, దర్శకత్వాల గురించి చిన్నప్పుడే ఒక అవగాహన నిచ్చినవి ఈ వ్యాసాలే.

ఇంటర్మీడియట్ అయ్యాక హైదరాబాదు వచ్చేశాను. ఆరోజుల్లోనే చిత్రపరిశ్రమ హైదరాబాదుకి తరలి వస్తోంది. అక్కడుంటే ఏమైనా అవకాశాలు దొరుకుతాయనే ఆలోచన కూడా ఉండింది. విజయవాడ లాడ్జిలో నేను పనిచేసినప్పుడు అక్కడ కేషియర్‌గా ఉన్న ఒకాయన రికమండేషన్ వల్లనే, కాచిగూడ రైల్వేస్టేషన్‌కి ఎదురుగా ఉన్న శివాస్ హోటల్లో రిసెప్షనిస్ట్‌గా చేరాను. ఆ హోటల్లోనే పైన ఒక గదిలో ఉండేవాడిని. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చదవడానికి కూడా రిజిస్టర్ చేసుకున్నాను. ఎన్ని చేస్తున్నా సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు మానలేదు.

హోటల్ ఉద్యోగంలో ఖాళీ దొరికినప్పుడల్లా స్టూడియోల చుట్టూ తిరిగే వాడిని. మురళీకృష్ణ గారిని కలవడం మానలేదు. ఆయన `లాఠీ` తర్వాత మరో సినిమా కూడా మొదలుపెట్టారు. ఎస్.వి.కృష్ణారెడ్డి గారిని కూడా కలుసుకునే వాడిని. చివరికి పారేపల్లి భరత్ గారు తానప్పుడు డైరెక్ట్ చేస్తున్న `తెలంగాణా` అన్న సినిమాకి దర్శకత్వశాఖలో అప్రెంటిస్ గా చేర్చుకోడానికి ఒప్పుకున్నారు. 1994 ప్రాంతాల్లో అనుకుంటా అది జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా నేను చేసిన ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చి ఇండస్ట్రీలో అడుపెట్టడానికి మొదటి అవకాశం లభించింది. ఆ సినిమా తర్వాత భరత్ గారి దర్శకత్వంలోనే వచ్చిన `ఫిలిమ్ నగర్` అనే సినిమాకి కూడా అసిస్టెంటుగా పనిచేశాను. ఇలా భరత్‌గారి దగ్గర పనిచేస్తున్నా మేడికొండ మురళీ కృష్ణ గారిని కలవడం మాత్రం మానలేదు.

`నరసింహ నాయుడు` సినిమా మొదలుపెట్టేప్పుడు `సరే..ఈ సినిమాకి నిన్ను బి.గోపాల్ గారి వద్ద చేరుస్తానులే..` అన్నారు మురళీకృష్ణ గారు. బి.గోపాల్ గారికి నన్ను పరిచయం చేసి "ఇతను చాలా సంవత్సరాలుగా నా చుట్టూ తిరుగుతున్నాడు. ఈ సినిమాలో అవకాశం ఇద్దాం..` అని చెప్పారు. ఆ విధంగా బి.గోపాల్ గారి వద్ద `నరసింహనాయుడు` కి పనిచేయడం మొదలుపెట్టాను. అంతకు ముందు రెండు సినిమాలకి పనిచేసి ఉన్నా ఇది పెద్ద ప్రొడక్షన్ అవడంతో మళ్ళీ అప్రెంటిస్ గానే మొదలుపెట్టాల్సి వచ్చింది. ఐతే సినిమా

మొదటి షెడ్యూల్ పూర్తయ్యే సరికే గోపాల్‌గారికి నా గురించి తెలిసిపోయింది. ఆయన అసిస్టెంటుల్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉంటారు. నా చురుకుదనమూ, సిన్సియారిటీ గమనించిన ఆయన త్వరలోనే అసిస్టెంటుగా ప్రమోట్ చేశారు.

ఆ సినిమా తర్వాత 'అల్లరి రాముడు,' అడవి రాముడు' మొదలైన సినిమాల వరకూ గోపాల్ గారి దగ్గరే కొనసాగాను. 'బ్రహ్మనాయుడు' మొదలౌతున్న సమయంలో చిన్న క్లాష్ వచ్చింది. మా మిత్రుడొకతను కొత్తగా సినిమా తీస్తూ నన్ను ఘోస్ట్ డైరెక్టర్‌గా పనిచెయ్యమని అడిగాడు. దాని పేరు 'ఆహుతి' చిన్నపిల్లల చుట్టూ తిరిగే కథ. దర్శకుడు, నిర్మాతగా అతడి పేరే ఉంటుంది. నేను వెనకాల నుంచీ సహాయం చెయ్యాలి. ఇక్కడ 'బ్రహ్మనాయుడు' సినిమాకి సహాయకుడిగా పనిచేస్తూనే ఖాళీ ఉన్నప్పుడల్లా అక్కడకి వెళ్ళి దర్శకత్వం చేస్తుండేవాడిని. గోపాల్ గారి వద్ద నటించే కొంతమంది నటులే ఆ సినిమాలో కూడా వేషాలు వెయ్యడంతో, నేను అక్కడ సొంతంగా డైరెక్ట్ చేస్తున్నానన్న విషయం గోపాల్‌గారి చెవిన బడింది. ఆయనకి చెప్పకుండా చేస్తున్నానన్న విషయం సహజంగానే ఆయనకి కోపం తెప్పించింది. కెమేరా మేన్ వి.ఎస్.ఆర్. స్వామిగారికి కూడా ఈ విషయం తెలిసిపోయింది. ఆ నోటా, ఈ నోటా అదొక పెద్ద ఇస్యూ ఐ నన్ను ఆ సినిమా దర్శకత్వ శాఖనుంచీ తప్పించారు. మళ్ళీ కొన్నాళ్ళ తర్వాత అందులోకే వెళ్ళి చేరాను. మొత్తానికి 'బ్రహ్మనాయుడు' సినిమా పూర్తయే వరకూ గోపాల్ గారి వద్దనే ఉన్నాను.

ఆ సినిమా అయ్యాక సొంతంగా దర్శకత్వం కోసమని ఒక కథ తయారు చేసుకున్నాను. తమిళంలో శంకర్‌గారి తీసే సినిమాల కోవలో భారీ బడ్జెట్ సినిమా కథ. చాలా మంది హీరోల వద్దకి వెళ్ళి కథ వినిపించే ప్రయత్నాలు చేశాను. అంతకు ముందు కాస్త పరిచయం ఉన్నా, వాళ్ళ ఇంటర్వ్యూలు కూడా దొరకలేదు. కొంతమంది నిర్మాతల వద్దకి కూడా వెళ్ళాను. వాళ్ళకి కథ వినిపించడానికే చాలా నెలలు పట్టేది. విన్న ఒకరిద్దరు కూడా 'మొదటి సారి డైరెక్టు చేస్తున్నావు. ఇంత బడ్జెట్‌తో రిస్క్ తీసుకోలేము అన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ప్రయత్నాలు ఫలించడం లేదు.

ఇంక మనమంటే ఏమిటో తెలియాలంటే ఒక సినిమా ఐనా చేసి చూపించాలి అనుకున్నాను.

నాలోని క్రియేటివిటీకి పదునుపెట్టాను. నేను చూసిన ఫిల్మ్ ఫెస్టివల్ సినిమాలు, ఆర్ట్ సినిమాల్లోని వాస్తవికత గురించి పదేపదే విశ్లేషించడం మొదలుపెట్టాను. మామూలు కమ్మర్షియల్ సినిమాలు ఎక్కువకాలం గుర్తుండకపోవడానికి, శ్యామ్ బెనగల్ 'అంకూర్', సత్యజిత్ రే 'పథేర్ పంచాలి', బాలు మహేంద్ర, మణిరత్నం సినిమాలు చరిత్రలో నిలిచిపోడానికీ వాటిల్లో చోటుచేసుకున్న నవ్యత్వం, దర్శకుడి విలక్షణ చిత్రీకరణే ప్రధాన కారణాలు. నాకంటూ ఒక గుర్తింపు ఉండాలంటే వైవిధ్య భరితమైన కథా వస్తువుని తీసుకోవాలి. వర్ణ వ్యవస్థ, కులమతాలు మనుషుల మధ్య కలిగిస్తున్న వ్యత్యాసాలు, స్త్రీ పురుషుసంబంధాల్లోని అసమానత..రకరకాల కోణాల్లో ఆలోచించడం మొదలుపెట్టాను. చిన్నప్పుడు విపరీతంగా చదివిన చలం పుస్తకాలు గుర్తొచ్చాయి. వాటిల్లోని 'నాయుడు పిల్ల' కథ మీద దృష్టి నిలిచింది. దాని చుట్టూ ఒక కథ అల్లుకుని మిత్రుడు రఘు (ఒకప్పుడు నాతో కలిసి దర్శకత్వ శాఖలో పనిచేసేవాడు)ని పిలిచాను. ఇద్దరం కలిసి దాదాపు ఒక సంవత్సరం పాటు '1940లో ఒక గ్రామం' సినిమా కథ గురించి కృషిచేశాం. ప్రతి సీనూ, సంభాషణలు, స్క్రీన్‌ప్లే..అన్నీ రకరకాల వర్షన్లు రాసుకున్నాం. రఘుకి ప్రాచీన సాహిత్యం మీద, వేదాలు, మనుచరిత్ర..లాంటి అంశాల మీదా చాలా పట్టుఉంది. సంవత్సరం తర్వాత మా స్క్రిప్టు మీద మాకు నమ్మకం కలిగింది.

సినిమాకి పెట్టుబడి ఎవరు పెడతారు? చాలా మందిని అడిగాము. పెడతామని ముందుకి వచ్చిన వాళ్ళు కూడా కొంతకాలానికి మొహం చాటేసేవారు. ఇంక నేనే రంగంలోకి దిగి బంధు మిత్రులవద్ద కొంత పెట్టుబడి, కొంత అప్పు, మా స్థలం అమ్మి కొంత సొమ్మూ కూడ బెట్టుకుని సినిమా నిర్మాణం, నా దర్శకత్వంలో మొదలుపెట్టాం. మొత్తం సినిమా పూర్తయ్యి ఫస్ట్ కాపీ రావడానికి మూడేళ్ళ



సమయం పట్టింది. కేవలం షూటింగే సంవత్సరం పాటు నడిచింది. డబ్బులు ఉన్నప్పుడు షెడ్యూల్ వేసుకునే వాళ్ళం. బాలాదిత్య అప్పట్లో రెండు మూడు సినిమాలు చేస్తున్నా అడిగినప్పుడల్లా కాదనకుండా డేట్స్ ఎడ్జస్ట్ చేసేవాడు. హీరోయిన్ కూడా కొత్త నటి కావడంతో డేట్స్ సమస్య ఎప్పుడూ రాలేదు. నిజానికి హీరోయిన్‌గా గత సంవత్సరం సూపర్ హిట్ ఇచ్చిన ఒక చిన్న సినిమా హీరోయిన్ (టి.వి. యాంకర్ కూడా) ముందుగా సంప్రదించాం. చాలా రోజులు చేస్తానని ఒప్పుకున్నా చివరలో మొహం చాటేసింది. అప్పుడు శ్రీ ని సెలక్ట్ చేసుకోవడం జరిగింది.

సంగీతం ఇచ్చిన సాకేత్ సాయిరామ్, కెమేరా మురళీ మోహన రెడ్డి, ఎడిటింగ్ బాలు, పబ్లిసిటీ కృష్ణప్రసాద్..అందరూ స్నేహితులే. అందరం కృష్ణానగర్‌లో తరచూ కలుసుకుంటూ ఉండే వాళ్ళమే. వీళ్ళంతా ఏ మాత్రం పారితోషికం తీసుకోకుండా ఒక మంచి చిత్రం చెయ్యాలనే తపనతో ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యారు.

సినిమా పూర్తయి 2008 మార్చి, ఏప్రిల్ ప్రాంతాల్లో ఫస్ట్ కాపీ వచ్చింది. అక్కడ నుంచీ విడుదల కోసం పడ్డ కష్టలు చెబితే అదో పెద్ద గ్రంథమౌతుంది. ఎన్నో షోలు వేసి బయర్స్‌కి చూపించాము. సినిమా పరిశ్రమలోని ముఖ్యులందరికీ కూడా చూపించాము. చూసిన వాళ్ళంతా మంచి ప్రయత్నం అని అభినందించారే కానీ విడుదలకోసం ఏ మాత్రం సహాయం అందలేదు. రోజులు గడుస్తున్నాయి. సినిమా ప్రేక్షకుల ముందుకి వచ్చే అవకాశం కనిపించలేదు. క్రిందటేడాది నంది అవార్డులకోసం పంపించాము. మూడు నంది అవార్డులు వచ్చాయి. ఐనా ఎవరికీ అంతగా పట్టలేదు. జాతీయస్థాయి బహుమతి వచ్చాక అందరి దృష్టికీ వచ్చింది..... అఫ్‌కోర్స్ ..కొంతమంది - ఈ చిన్న సినిమాకి ఎందుకు ఇచ్చారు, మేము భారీ ఎత్తున తీసిన ఈ సినిమాకి అందుకు ఇవ్వలేదు, ప్రజాదరణ పొందిన మా ఈ సినిమాకి ఎందుకు ఇవ్వలేదు .. - అంటూ చాలా చర్చలు జరిగాయి. ఐతే ఒక సారి విడుదలై అందరూ చూస్తే ఎందుకు దాన్ని జాతీయ స్థాయి బహుమతికి ఎంపిక చేశారో తెలుస్తుందని ఆశిస్తున్నాను. ఇటీవలే ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్‌గారు , ఈ సినిమాని ఆంధ్రదేశమంతా విడుదల చెయ్యడానికి ముందుకి వచ్చారు. మా ప్రయత్నాలు ఒక విజయవంతమై, అతి త్వరలో ఈ సినిమా మీ ముందుకి వస్తుందని ఆశిస్తున్నాము.

ఈ సినిమా విడుదల ప్రయత్నాల్లో ఉండగానే 'హైస్కూలు' సినిమా దర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. 1940లో ఒక గ్రామం లాంటి అవార్డు విన్నింగ్ సినిమా చేసినా ప్రేక్షకుల ముందుకి వెళ్ళలేకపోయానన్న కసిలో పుట్టిందే 'హైస్కూలు' ప్రాజెక్టు. టాలెంట్ ఉంటే ఎలాంటి సినిమా తీసైనా ప్రేక్షకుల్ని మెప్పించవచ్చునని నిరూపిద్దామని చేసిన ప్రయత్నమే 'హైస్కూలు'. సినిమా మొదలుపెట్టిన కొద్ది రోజులకే మొత్తం ఏరియాలన్నీ అమ్ముడు పోయాయి. అసలు సినిమా ఏమాత్రం చూపించకముందే బిజినెస్ చెయ్యగలిగాము. ఇటీవల ఈ చిత్రం గురించిన వివాదాల గురించి నేను చర్చించే కంటే ఎవరికి వారు ఈ సినిమా చూసి ఒక నిర్ణయానికి వస్తే బావుంటుంది. ..

ఇదండీ నా మొదటి సినిమా ప్రస్థానం. ఈ ప్రయాణంలో ఎప్పటికీ వెంటాడే విషాదాలూ ఉన్నాయి. నేను హైదరాబాదులో ఉన్న రోజుల్లో సరైన ఎడ్రసు లేకపోవడంతో మా అమ్మా, నాన్నలతో రెగ్యులర్ కాంటాక్ట్‌లో ఉండడానికి కుదిరేది కాదు. అలాంటి సమయంలోనే మా అమ్మ చనిపోయిన విషయం కూడా సకాలంలో నన్ను చేరలేదు. విషయం తెలుసుకుని ఇంటికి వెళ్ళేసరికి అన్నీ ఐపోయాయి. బంధువులంతా నన్ను అదోలా చూశారు. 'ఇదీ జీవితం' అనుకోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. ఆ తర్వాత కొంతకాలానికి నాన్న గారు కూడా మమ్మల్ని విడిచివెళ్ళిపోయారు. భవిష్యత్తులో తప్పని సరిగా అమ్మా, నాన్నల ఆత్మ గర్వించేలా మంచి పేరు తెచ్చుకోగలననే ఆత్మవిశ్వాసం ఉంది. ఎన్ని సాధించినా అమ్మా, నాన్నలని తిరిగి తెచ్చుకోలేననే బాధ వెంటాడుతూనే ఉంటుంది..!



(ఏప్రిల్ 2010 సంచికలో ప్రచురితం)

# శరత్

***చాలా మంది దర్శకులు,*** సినీ కళాకారులు చిన్నప్పటినుంచీ సినిమాల్లోకి వెళ్ళాలని కలలు కన్నామనీ, ఆ కలలు నిజం చేసుకునేందుకు కష్టాలు పడ్డామని చెబుతుంటారు. ఈ నెల మనం కలుసుకోబోయే విజయవంతమైన దర్శకుడు 'శరత్' సినిమాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. పదిహేను సంవత్సరాలు సహాయ దర్శకుడిగా పనిచేశాక గానీ సొంతంగా దర్శకత్వం చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత మరో పదిహేనేళ్ళు మినిమమ్ గ్యారంటీ దర్శకుడిగా కొనసాగి 35 పైగా మంచి కుటుంబగాథా చిత్రాలని తెలుగు ప్రేక్షకులకి అందించారు.

బాలకృష్ణతో 'పెద్దన్నయ్య' ,'వంశానికొక్కడు' లాంటి విజయవంతమైన సినిమాలు, అక్కినేని గారితో 'కాలేజీ బుల్లోడు',' అక్కినేని , శ్రీకాంత్‌లతో 'పండగ', కృష్ణ, కృష్ణంరాజు గార్లతో 'బావ - బావమరిది',' సుల్తాన్' ..మొదలైన చిత్రాలతో దర్శకుడుగా తనని తాను నిరూపించుకున్నారు, శరత్‌గా అందరికీ తెలిసిన పోలవరపు శరత్ బాబు..

ఈ తరం దర్శకుల్లో పరుచూరి మురళి, కాశీ విశ్వనాథ్, సముద్ర మొదలైన వారు శరత్ గారి గారి స్కూలు నుంచీ వచ్చిన వాళ్ళే.

2000 సంవత్సరంలో విడుదలైన 'రేపల్లెలో రాధ' ఆయన దర్శకత్వంలో వచ్చిన చివరి సినిమా. ఆ తరువాతి నుంచీ దాదాపు విశ్రాంతి జీవితాన్ని గడుపుతున్న శరత్‌గారు ఇటీవలే కొన్ని చిత్రాల్లో నటుడిగా మారారు. 'అనసూయ','అమరావతి','నచ్చావులే',' రెచ్చిపో', 'కుర్రాడు' మొదలైన చిత్రాల్లో విభిన్నమైన పాత్రలని ధరించారు. 'కౌముది' కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మొదటి సినిమా విశేషాలు తెలుసుకోండి.



**మా స్వగ్రామం** గుడివాడ దగ్గరలో ఉన్న డోకిపర్రు. నాన్నగారు పోలవరపు సూర్యప్రకాశ రావు, అమ్మ గారు భాషామణి. ఇద్దరు అక్కయ్యలు, ఒక అన్నయ్య తర్వాత చివరి సంతానాన్ని నేను. నాన్నగారికి సొంత ఊర్లో వ్యవసాయంతో బాటు గుడివాడలో ఖద్దరు కొట్టు కూడా ఉండేది. ఇదే కాక ఆయనకి రంగస్థల నాటకాలంటే చాలా ఆసక్తి. చుట్టు పక్కల ఎక్కడ నాటకాల పోటీలు జరుగుతున్నా న్యాయనిర్ణేతగా వెళుతుండే వారు. ఆ రోజుల్లో విజయవాడలో పేరుపొందిన నాటక సంస్థ 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు'కి పోటీ నాటకాల ఎంపికలో స్క్రూటినీ జడ్జిగా కూడా పని చేసేవారు. అక్కడే అక్కినేని నాగేశ్వరరావు గారు, దుక్కిపాటి మధుసూదన రావు గార్లతో మంచి పరిచయాలు ఉండేవి. ఐతే మాలో ఎవరికీ ఆయనకున్న కళాభిమానం వారసత్వంగా రాలేదు. మాకెవ్వరికీ నాటకాలంటే ఏమీ ఆసక్తి ఉండేది కాదు. నా ప్రాథమిక విద్యాభ్యాసం డోకిపర్రులో మొదలైంది. ఐతే నా చిన్నప్పుడు నాన్నగారు

తణుకులో ఒక సినిమా థియేటర్ అద్దెకి తీసుకుని నడిపించడం వల్ల మేమంతా కొంతకాలం తణుకులో నివసించాము. నా చదువు అక్కడా కొనసాగింది. అక్కడ రెండు మూడేళ్ళు ఉన్నాక నాన్నగారు ఫేమిలీని మద్రాసుకి మార్చారు. అక్కడ కొంతమంది మిత్రులతో కలిసి డబ్బింగ్ సినిమాలు తీశారు. ఆ పేర్లు కూడా ఇప్పుడు గుర్తు లేవు. ఆ విధంగా నా హైస్కూలు చదువంతా మద్రాసులో కొనసాగింది.

చిన్నప్పటినుంచీ సినిమాలు అందరిలా చూడ్డమే తప్ప వాటి గురించి విపరీతంగా ఆలోచించడం కానీ, ఆ రంగంలోకి వెళ్ళాలన్న ఆలోచన కానీ ఎప్పుడు ఉండేది కాదు. అసలు ఫైన్ ఆర్ట్స్ వైపే ఎప్పుడూ వెళ్ళలేదు. నాన్నగారికి డబ్బింగ్ సినిమాల్లో పెద్దగా కలిసి రాలేదు. తిరిగి స్వగ్రామం వచ్చేశారు. నేను మెట్రిక్ చదవడానికి విజయవాడలో కె.ఎల్.ఎన్.ప్రసాద్ గారింట్లో ఉండేవాడిని. (ఆయనే అప్పట్లో ఆంధ్రాబ్యాంకు ఛైర్మన్, ఆంధ్రజ్యోతి స్థాపకులు కూడా). మెట్రిక్ అయ్యాక చదువు మీద శ్రద్ధ పోయింది. పై చదువులు చదవాలనిపించలేదు. ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలి కాబట్టి మద్రాసు వెళ్ళాను. అక్కడే మా కజిన్ ఒకతను వ్యాపారం చేస్తుండే వాడు. అతనికి సినిమా వాళ్ళతో పరిచయాలు బాగానే ఉండేవి. అతనే, నాకో వ్యాపకం చూపించాలని, సినిమాల్లో ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో అప్రెంటిస్‌గా చేర్పించారు. నా కదో ఉద్యోగం..అంతే!. ఐతే కొద్ది రోజుల్లోనే దానిమీద నాకు ఇంట్రెస్టు లేదని తెలిసిపోయింది. మళ్ళీ మా కజిన్ వద్దకెళ్ళి ఎక్కడైనా దర్శకత్వ శాఖలో చేర్పించమని అడిగాను. ఆయనకున్న పరిచయాలతో అప్పుడే చిత్రనిర్మాణం మొదలు పెట్టిన పద్మాలయా కంపెనీలో నన్ను అప్రెంటిస్‌గా చేర్చారు.

ఆ విధంగా పద్మాలయా కంపెనీలో నా సినీజీవితం మొదలైంది. వాళ్ళు నిర్మించిన మొదటి సినిమా 'మోసగాళ్ళకు మోసగాడు' నాకూ అసిస్టెంటుగా మొదటి సినిమా. అదే కంపెనీలో ఏడేళ్ళ పాటు వాళ్ళు నిర్మించిన అన్ని సినిమాలకీ అసిస్టెంటు నుంచీ అసోసియేట్‌గా పనిచేశాను. కృష్ణగారు, వారి సోదరులూ అందరూ నన్ను సొంత కుటుంబసభ్యుడిగా చూసుకునే వారు. మొదట్లో నా నివాసం కూడా వాళ్ళ ఆఫీసే. కె.ఎస్.ఆర్.దాసు గారు, వి.రామచంద్రరావు గారు, పిసి.రెడ్డి గార్ల వద్ద 'అల్లూరి సీతారామ రాజు',' దేవుడు చేసిన మనుషులు','పాడి పంటలు'..మొదలైన సినిమాలతో చక్కటి అనుభవం వచ్చింది.

అల్లూరి సీతారామరాజు చిత్రానికి చింతపల్లి అడవుల్లో నెలరోజులపాటు మకాం చేయడం మరచిపోలేని అనుభవం. అలాగే 'దేవుడు చేసిన మనుషులు' సినిమా కోసం బందరు, ఔట్‌డోర్ షూటింగ్‌కి, వెళ్ళాం. 1973లో మండు వేసవిలో బందరు రోడ్లమీద, ప్రజల మధ్యన షూటింగ్. ఎన్టీఆర్, కృష్ణ లాంటి హేమాహేమీలు ప్రజల మధ్యకి వెళ్ళడం అదే మొదటి సారేమో. ప్రతి రోజూ ప్రజలని అదుపుచేయడమే పెద్ద పనిగా ఉండేది మాకు. ఇలా పద్మాలయాలో ప్రతి సినిమా ఒక కొత్త అనుభవం. 1978-79 సమయానికి వాళ్ళ సినిమా నిర్మాణం వేగం తగ్గే సరికి, నేను ఇతర దర్శకుల వద్దకూడా పనిచేశాను. పి.సాంబశివరావు, పి.సి.రెడ్డి, కోదండ రామిరెడ్డి గార్ల వద్ద మరో ఏడెనిమిదేళ్ళు కో-డైరెక్టర్ స్థాయి వరకూ పనిచేశాను.

మిద్దె రామారావు గారి రాజ్యలక్ష్మీ కంబైన్స్‌లో 'రామరాజ్యంలో భీమరాజు','గుండా' సినిమాలకి కోదండ రామిరెడ్డి గారి వద్ద కో-డైరెక్టర్‌గా పనిచేశాను. అప్పట్లో కోదండ రామిరెడ్డిగారు బాగా బిజీగా ఉండేవారు. ఒకే సమయంలో రెండు, మూడు సినిమాలు డైరెక్టు చేస్తుండేవారు. అలాంటప్పుడు కొన్ని పాటలూ, సీన్లూ నాకే అప్ప చెబుతుండేవారు. అలా నా పని తనాన్ని గమనించిన మిద్దె రామారావు గారు సొంతంగా దర్శకత్వం చేయమని అడిగారు. అప్పటికే 15 సంవత్సరాలుగా కెమేరా వెనుక అన్ని శాఖల్లోనూ అనుభవం ఉంది కాబట్టి ఆయన అడిగినప్పుడు 'సరే' అన్నాను. కో-డైరెక్టర్ గా 'ఒక రాధ - ఇద్దరు కృష్ణులు' నా చివరి సినిమా.




అప్పట్లో 'మోడల్' నవలతో సంచలనం సృష్టించిన సూర్యదేవర రామ్మోహన్ రావు గారు కథ ఇచ్చారు. ఆయన చెప్పిన కథ ఇంకా నవలగా రాలేదు. ముందు ముందు వ్రాద్దామనుకున్న నవలని కథగా చెప్పారు. నాకు బాగా నచ్చింది. వెంటనే రామారావు గారికీ, మాటల రచయిత సత్యానంద్ గారికి కూడా ఆయనతోనే కథ చెప్పించాను. వాళ్ళకీ నచ్చింది. ఆ విధంగా దర్శకుడిగా నా మొదటి సినిమా 'ఛాదస్తపు మొగుడు' మొదలైంది. హీరోగా సుమన్‌ని తీసుకోవాలనుకున్నాం. ఐతే అప్పటికి సుమన్ కోర్టు కేసులో బెయిల్ మీద చెంగల్పట్‌లో ఉన్నారు. మద్రాసు పరిసరాల్లో అడుగు పెట్టకూడదని ఆంక్షలున్నాయి. నిర్మాతల విజ్ఞప్తి మేరకు ఏ.వి.ఎమ్ స్టూడియోకి మాత్రం సుమన్ రావడానికి అనుమతిచ్చారు. అదే కండిషన్ మీదా 'ఛాదస్తపు మొగుడు' షూటింగ్ ఏ.వి.ఎమ్ లోనే మొదలైంది. భానుప్రియ హీరోయిన్. కోట శ్రీనివాస రావు, వీరభద్రరావు, వేలు, శ్రీలక్ష్మి, తులసి, శుభలేఖ సుధాకర్..మిగతా తారాగణం. అప్పటికి 15 సంవత్సరాలుగా ఎన్నో సినిమాలకి దర్శకత్వ శాఖలో పనిచేసిన అనుభవం ఉండడం వల్ల మొదటి సినిమా అన్న భావమే రాలేదు. టెక్నీషియన్స్ అందరూ పరిచయమున్నవాళ్ళే అవడం వల్లా, మొదటి సినిమా కూడా మిగతా సినిమాల్లాగానే స్మూత్ గా జరిగిపోయింది. సుమన్ కాల్ షీట్ల వల్ల కొంచెం ఆలస్యమైనా, మొత్తం షూటింగ్ సమయం 40 రోజుల్లో ఐపోయింది. మొదటి సినిమా 'సూపర్, డూపర్' కాకపోయినా హిట్ చిత్రంగా పదివారాలు ఆడింది. మొదటి సినిమా తోనే ఫేమిలీ కథలు బాగా ట్రీట్ చెయ్యగలనన్న పేరు వచ్చింది .

ఆ తరువాత జాతీయ సమైక్యత అంశం మీద తీసిన 'కులాల కురుక్షేత్రం' మరో చక్కటి అనుభవం. తర్వాత 'బంధువులొస్తున్నారు జాగ్రత్త', ఉషా కిరణ్ వారి 'మామాజీ'.. అన్నీ బాగానే ఆడాయి. ఇంక ఒకదాని వెంట ఒకటి పదిహేనేళ్ళ పాటు దర్శకుడిగా మీ అందరి అభిమానాన్ని సంపాదించుకోగలిగాను.

నేను చేసిన సినిమాలని గమనిస్తే ఎక్కువగా ఫేమిలీ సెంటిమెంటుకే పెద్ద పీట వేశాను. అసిస్టెంటుగా వున్నప్పుడు యాక్షన్ సినిమాలకి పనిచేసినా, వ్యక్తిగతంగా యాక్షన్ సినిమాలంటే అంత ఆసక్తిలేదు. అందుకే ఎక్కువగా ఫేమిలీ సినిమాలకే పరిమితమై పోయాను. 2000 తర్వాత యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాలు ఎక్కువ అవడం వల్లనో, మరి ఈ తరం స్పీడ్ అందుకోలేక పోవడం వల్లనో ఇతమిత్థంగా చెప్పలేను కానీ దర్శకత్వానికి దూరంగా ఉండిపోయాను.

గత కొద్ది సంవత్సరాలుగానే దర్శకుడు రవిబాబు అడిగితే తను తీసిన సినిమాల్లో కేరక్టర్స్ చేయడం మొదలుపెట్టాను. ఈ రంగంలో రెండో ఇన్నింగ్స్ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉంది.

'మొదటి సినిమా' శీర్షిక ఔత్సాహిక దర్శకులకి ఇన్స్పిరేషన్ గా ఉపయోగపడుతోందని మీరన్నారు కాబట్టి మరికొన్ని విశేషాలు కూడా చెబుతాను. బహుశా మీ పాఠకులకి ఆసక్తిగా ఉండొచ్చు.

మద్రాసులో పనిచేసినన్ని రోజులూ, 70, 80 దశకాల్లో చిత్రపరిశ్రమలో అందరం అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండేవాళ్ళం. ఏ యూనిట్ ఐనా అందరూ ఒక కుటుంబంలా పనిచేసేవారు. నిర్మాతకి 'మళ్ళీ ఇదే యూనిట్ తో పనిచేయాలి' అనేలా యూనిట్ వాళ్ళు, 'మళ్ళీ ఈ నిర్మాతకే తరువాతి సినిమా కూడా చెయ్యాలి' అనిపించేలా నిర్మాత పనిచేసేవారు. నిర్మాతని కుటుంబ పెద్దలా గౌరవించేవాళ్ళం. కుటుంబ పెద్ద మనకో పని అప్పచెబితే ఎంత శ్రద్ధాసక్తులతో పనిచేస్తామో, సినిమా నిర్మాణంలో అన్ని శాఖల వాళ్ళు అలా కల్సి పని చేసేవాళ్ళం. మద్రాసులో తెలుగు వాళ్ళు, తమిళియన్సూ, టెక్నీషియన్సులో అందరూ ఉండేవాళ్ళు. ఒకరికి సమస్య వస్తే మరొకరం సహాయం చేసి పరిష్కరించుకుంటూ ఉండేవాళ్ళం. ఒక సినిమా షూటింగ్ ఐపోతోందంటే ఏదో సొంత వూరు ఒదిలి

వెళ్ళిపోయిన ఫీలింగ్ ఉండేది.



నేను ఎక్కువ సంవత్సరాలు, ఎంతో మంది వద్ద అసిస్టెంట్‌గా పనిచేయడం కూడా దర్శకుడయ్యాక చాలా ఉపయోగపడింది. నేను సహాయకుడిగా ఉన్న రోజుల్లో చక్రవర్తిగారు బిజియెస్ట్ సంగీతదర్శకులు. ఆయన వద్ద అప్పట్లో కోటి గిటార్ వాయిస్తుండేవారు. కీరవాణి గారు హార్మోనియం మీద ఉండేవారు. మనో పాటలు పాడుతుండేవారు. వీళ్ళందరితో తరచూ కలిసి పనిచేసే అవకాశం వచ్చేది. నేను దర్శకుడయ్యాక కూడా ముందు చక్రవర్తిగారు, తర్వాత కోటి నా సినిమాలకి ఎక్కువగా మ్యూజిక్ సమకూర్చారు. కీరవాణి, కె.వి.మహదేవన్ గార్లు కూడా కొన్ని సినిమాలకి సంగీతం ఇచ్చారు. అందరితో ఇంతకు ముందే పరిచయం ఉండడం వల్ల నా అభిరుచులేమిటో వాళ్ళకీ ముందే తెలిసి ఉండడం వల్ల కూడా మా వర్కింగ్ శైలి స్మూత్‌గా ఉండేది. అలానే చాలా సినిమాలకి రచయిత సత్యానంద్ గారే. ఇద్దరం కథా చర్చల దశలోనే అన్ని డిటెయిల్స్ వర్కవుట్ చేసేవాళ్ళం. స్క్రీన్ ప్లే సమయంలోనే షాట్ డివిజన్, కెమేరా యాంగిల్స్ అన్నీ వ్రాసుకునే వాళ్ళం. అత్యవసరమైతే సెట్లో ఏవైనా చిన్న చిన్న మార్పులే తప్ప ముందుగా అనుకున్న స్క్రిప్టుని అనుకున్నది అనుకున్నట్లుగా తెరకి ఎక్కించేవాళ్ళం. చాలా మంది దర్శకుల వద్ద పనిచేయడం వల్ల వివిధ వర్కింగ్ స్టైల్స్ అలవాటయ్యాయి. ఒక్కోరి వద్ద నుంచీ ఒక్కో సక్సెస్ ఫార్ములాని నేర్చుకోగలిగాను. ముఖ్యంగా కోదండరామి రెడ్డిగారి వద్దనుంచీ ఒక గుణం నాకు వచ్చింది. ఉదయం సెట్లోకి వెళ్ళబోయే ముందు ఆ రోజు తియ్యాల్సిన సీన్ చూస్తే మళ్ళీ స్క్రిప్టు చూసేవాళ్ళు కాదాయన. సీన్, యాక్షన్ అంతా మనసులో ప్రింట్ ఐ ఉండేది. ఇదే అలవాటు నాకూ వచ్చింది. అందుకనే షూటింగ్ సమయంలో కన్ఫ్యూజన్ ఉండేది కాదు.

కాలచక్రం తిరిగీ తిరిగీ వసంతం మళ్ళీ మళ్ళీ వచ్చినట్లుగా చిత్రరంగంలో కూడా మళ్ళీ అలాంటి క్రమశిక్షణ, అనుబంధాలు..వస్తాయని ఆశిద్దాం. నా మనసులోని మాటలు మీతో పంచుకునే అవకాశం కల్పించిన ‘కౌముది‘కి కృతజ్ఞతలు.

శ్రీ శరత్ తండ్రి గారు పోలవరపు సూర్యప్రకాశరావు గారు నాకు తెలుసు. నా కంటె పెద్దవారు. వారి అబ్బాయిగా శరత్ నాకు పరిచయమైనాడు. విశేషం ఏమిటంటే - అతను పుట్టకముందునుంచే నేను స్టార్‌ని! అంచేత శరత్ నాకంటే చాలా చిన్నవాడు. అలా అలా పెద్దవాడై దర్శకత్వశాఖలో పనిచేసి, కొన్ని చిత్రాలు డైరెక్టు చేశాడు. "కాలేజీ బుల్లోడు","పండుగ" చిత్రాల్లో శరత్ దర్శకత్వంలో నేను నటించాను. "కాలేజీ బుల్లోడు" నాకు చాలా ఇష్టమైన కథ, బాగుంది, సరదాగా నడించింది. ఆపాత్ర నాకు సరిగా సరిపోయింది. సెట్లో కూడా ధైర్యంగా వచ్చి సన్నివేశం, పాత్రతీరూ చెప్పేవాడు. ఆ కథని కూడా బాగా నడిపించాడు. మంచి అవగాహన, తీరు గల దర్శకుడు అనిపించింది. మంచి కథాంశం గల సినిమా ‘పండగ‘. బాగా నడించింది. దర్శకుడికి కావలసిన డ్రమెటైజేషన్, సెంటిమెంటు దృశ్యాలకు కావలసిన మోతాదు తెల్సిన వాడు శరత్.

పెద్ద నటుల దగ్గర, కొత్తదర్శకులకి లేదా కొత్తగా డైరెక్టు చేసే దర్శకులకి ఒక విధమైన ‘జంకు‘ ఉంటుంది, ‘చెబితే ఏమనుకుంటారో‘ అని. కాకపోయినా తమ అనుభవంతో దర్శకుడు చెప్పిన దానిని కాదంటారేమోనని! నేను మాత్రం ఎన్నడూ ఆధిక్యత చూపలేదు. సెట్లోకి వెళ్ళినపుడు ‘నేను పెద్ద నటుణ్ని' అని ఎన్నడూ అనుకోలేదు. చిన్నవాళ్ళూ అనుకోకూడదు. డైరెక్టర్ అంటే చిత్రం నడిపేవాడు. నడిపేవాడే భయపడుతూ నడిపితే ఎలా?ఒకవేళ అలాంటి భయం వుంటే, ఆ భయాన్ని పోగొట్టవలసిన బాధ్యత నటులమీద ఉంటుంది. "శరత్ నాకంటే వయసులో చాలా చిన్నవాడు, ఇతను నాకు చెప్పేదేమిటి?" అన్న భావం నాలో కలిగితే అతను ఆ చిత్రాలు అంతబాగా డైరెక్టు చేసే వాడా?

**నేనూ- నా దర్శకులు పుస్తకంలో అక్కినేని నాగేశ్వరరావు**

(మే 2010 సంచికలో ప్రచురితం)

# సతీష్ కాశెట్టి

**తెలుగు సినిమా రంగం చాలా విచిత్రమైంది.** ఎప్పటి కప్పుడు కొత్త నీరు వొచ్చి పాతనీరుని పక్కకి నెట్టేస్తుంది. సినిమాల్లో, అందునా ముఖ్యంగా దర్శకత్వ శాఖలోకి ప్రవేశించాలంటే, చాలా చిన్న వయసునుంచే ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. లేకపోతే సినిమా దర్శకత్వం అసాధ్యం - ఇవన్నీ అందరూ అనుకునే మాటలు. చాలా వరకూ వాస్తవం కూడా. ఐతే చేసే పనిలో ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే ఎప్పుడైనా ఏదైనా సాధించవచ్చు అని నమ్మి ఆచరించే సతీష్‌గారు తన సినిమా దర్శకత్వ ప్రయాణాన్ని విభిన్నంగా మొదలుపెట్టారు. ఏళ్ళ తరబడి అసిస్టెంటుగా, అసోసియేట్‌గా పనిచెయ్యకుండానే నేరుగా తన 49వ యేట మొట్టమొదటి సినిమాకి దర్శకత్వం వహించారు. అంతే కాదు మొదటి సినిమాకే జాతీయస్థాయి బహుమతిని (ప్రాంతీయ చిత్రంగా కాదు. సరాసరి జాతీయస్థాయిలోనే) అందుకున్నారు. రెండో సినిమా కె.విశ్వనాథ్ గారి శైలిని గుర్తుకు తెచ్చిందని విమర్శకులందరితో మంచి ప్రశంసలు అందుకున్నారు. 'హోప్',' కలవరమాయే మదిలో' చిత్రలతో తెలుగు సినిమా రంగంలో తనకంటూ ఒక గుర్తింపుని తెచ్చుకున్న **సతీష్ కాశెట్టి**గా అందరికీ తెలిసిన కె.సత్యనారాయణ గారి మొదటి సినిమా అనుభవాలు ఈ నెల 'మొదటి సినిమా' లో మీకోసం ప్రత్యేకంగా..



**నేను పుట్టిందీ, పెరిగిందీ,** చదువుకున్నదీ, వ్యాపారాలు చేసిందీ, సినిమా రంగ ప్రవేశం చేసిందీ..అంతా హైదరాబాదులోనే. మా నాన్న రామయ్య గారిది హైదరాబాదు. అమ్మ ఆగమ్మ గారిది వరంగల్. నలుగురు అన్నదమ్ములలో నేను రెండో వాడిని. చిన్నప్పటి నుంచీ ఉండేది బేగం పేటలోనే. నాన్నగారు చాలా చిరుద్యోగిగా కుటుంబ భారాన్ని మోయడం మొదలుపెట్టారు. ఓ ఎలెక్ట్రికల్ కంపెనీలో చిన్న హెల్పర్‌గా ఉద్యోగాన్ని మొదలుపెట్టి అదే కంపెనీకి జనరల్ మేనేజర్ స్థాయి వరకూ ఎదిగారు. జనరల్ మేనేజర్‌గా ఉండగానే ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి సొంతంగా వ్యాపారం మొదలుపెట్టారు.. వాటర్ మేనేజ్మెంట్ ప్రోజెక్టులో స్పెషలైజ్ చేసి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌లో గ్రేడ్ 1 కాంట్రాక్టర్‌గా చాలా పెద్ద పెద్ద ప్రోజెక్టులు చేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా కాంట్రాక్టులు చేసేవారు. ఆయన బిజినెస్‌లో ఒక్కో మెట్టే ఎదుగుతుంటే మా జీవన శైలిలో కూడా కొంచెం కొంచెం సౌకర్యాలు చోటు చేసుకోవడం మొదలుపెట్టాయి.

చిన్నప్పుడు ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా నన్ను తెలుగుమీడియం వీధి బడికి పంపించారు. నాన్న

గారికి కొంచెం స్థోమత వచ్చాక నన్ను కాన్వెంటుకి పంపారు. ఐతే ఇంగ్లీషు రాదని చెప్పి ఆ స్కూల్లో రెండు క్లాసులు తక్కువచేసి తీసుకున్నారు..! మెథడిస్ట్ స్కూల్లో పదో తరగతి వరకూ, తర్వాత న్యూ సైన్స్‌కాలేజీలో బి.కామ్ పూర్తి చేశాను.

హైస్కూల్లో ఉండగా పెయింటింగ్స్ బాగా వేసేవాడిని. తొమ్మిదో తరగతి వరకూ పెయింటింగ్ పోటీల్లో చాలా బహుమతులు కూడా గెలుచుకున్నాను. ఇంటర్మీడియట్, కాలేజీ స్థాయిలో ఫోటోగ్రఫీ అంటే ఎక్కువ ఇంట్రెస్టు ఉండేది. కెమేరాతో చాలా ప్రయోగాలు చేసాను. చిన్నతనంలో సినిమాలు చూడ్డం చాలా తక్కువ. ఇంటర్మీడియట్‌కి వచ్చే దాకా నాలుగైదు సినిమాలకంటే ఎక్కువ చూసి ఉండను. కాలేజీకి వచ్చాక బాగానే సినిమాలు చూసేవాడిని. అప్పుడే అనిపించేది సినిమాల్లోకి వెళ్ళాలనీ, దర్శకత్వం వైపు ప్రయత్నించాలనీ. ఐతే దానికి అవసరమైన నేపథ్యం ఏమీ లేదు. మా కుటుంబంలో కూడా ఎవరికీ ఈ రంగం గురించి అవగాహన లేకపోవడంతో, ఈ అంశం గురించి వాళ్ళతో చర్చించడానికి కూడా నేను ప్రయత్నం చెయ్యలేదు.



డిగ్రీ ఐపోయాక నాన్నగారి పనుల్లోనే నేనూ యాక్టివ్‌గా ఉండేవాడిని. చాలా సంవత్సరాలు అలాగే మెట్రో వాటర్ వర్క్స్ కాంట్రాక్టులతో గడిచాయి. 1990 ప్రాంతాలకి బిజినెస్ తగ్గుముఖం పట్టింది. హైదరాబాదు మున్సిపాలిటీ పరిపాలనా విధానంలో వచ్చిన మార్పుల వల్ల ఆ బిజినెస్ దెబ్బతినబోతోందని ముందుగానే ఊహించాను. 1993-94 ప్రాంతాల్లో అందులోంచి బయటికి వచ్చి బ్లేజ్ ఎడ్వర్టైజ్‌మెంట్ సంస్థలో మేనేజర్‌గా చేరాను. కస్టమర్స్‌ని కలిసి వాళ్ళ ప్రకటన అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రకటనలు చేయించడం, పెద్ద ఎక్జిబిషన్స్‌లో స్టాల్స్ డిజైన్ చేయడం.. ఇలాంటివన్నీ చేసేవాడిని. చిన్నప్పుడు అలవాటు ఉండిన పెయింటింగ్, శిల్పకళా అనుభవాలు అప్పుడు ఉపయోగ పడ్డాయి. కొన్నాళ్ళ తర్వాత బిజినెస్ లైన్ మారాలనిపించింది.

ఏ పని చేస్తున్నా సినిమాల్లోకి వెళ్ళాలన్న ఆలోచన ఒకవైపు నాలో కొనసాగుతూనే ఉంది. కానీ ఆ వయసులో మళ్ళీ ఎవరి వద్దకన్నా వెళ్ళి అసిస్టెంట్‌గా చెయ్యడం అంటే కష్టం. అందుకే సినిమా రంగానికి కాస్త దగ్గర చేసే బిజినెస్ కమ్ హాబీ ఐతే బావుంటుందని ఫేషన్ ఫోటోగ్రఫీని ఎంచుకున్నాను. బంజారా హిల్స్‌లో ఒక షాపు తీసుకుని కెమేరాలు కొన్నాను. రెండు నెలలపాటు వాటి సాంకేతిక వివరాలనీ అందులోని ట్రిక్స్‌నీ పూర్తిగా నేర్చుకున్నాను. చాలా పుస్తకాలు చదివాను. ఇంక సహజంగా ఆర్టిస్టిక్ ఐ ఎలానూ ఉంది. ఆ ధైర్యంతో ఫేషన్ ఫోటోగ్రఫీలో ముందడుగు వేశాను. మంచి పేరు వచ్చింది. నేను ప్రొఫైల్స్ చేసిన వారందరూ తొందరలోనే పెద్దపెద్ద స్థాయికి చేరుకున్నారు. వాళ్ళల్లో మిస్. ఇండియాగా ఎన్నికైన దియామిర్జా కూడా ఒకరు. ఈ ప్రొఫెషన్‌లో సినిమా వాళ్ళు చాలా మంది పరిచయమయ్యారు. గౌరవప్రదమైన వృత్తిగా దాన్ని కొనసాగించాను. అలా కొన్నేళ్ళు సాగింది..

అప్పటికే జెమిని టి.వి.లో కార్యక్రమాలు చేసే జి.కె.మోహన్ గారు మంచి మిత్రులు. నేను ఫేషన్ ఫోటోగ్రఫీనుంచీ బయటికి వస్తున్నానని చెప్పగానే "ఐతే నాతో కలిసి ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యవహారాలు చూడరాదూ..?" అని ఆహ్వానించారు. నాకు అది బాగా నచ్చింది. సినిమా రంగానికి దగ్గరవడంలో మరో అడుగు ముందుకి చేసినట్లుందని 'సరే' అన్నాను. జెమిని కిరణ్‌గారు 20 ఏళ్ళుగా నాకు పరిచయం. అది కూడా నేను కొత్త ప్రొఫెషన్ లోకి ప్రవేశించడానికి దోహదం చేసింది. అలా జెమిని టి.వి. కోసం మొదటిసారిగా నేను చేసిన ఈవెంట్ 'ఇంద్ర' ఆడియో ఫంక్షన్. అతి పెద్ద ఈవెంట్, విశాఖపట్నంలో ఆర్. పి.పట్నాయక్ గారి సంగీత విభావరి. 4 లక్షలమంది హాజరైన ఆ ఈవెంట్‌ని ఎక్కడ ఏ ఇబ్బందీ రాకుండా ఏర్పాట్లు చెయ్యడంతో నాకు మంచి పేరు వచ్చింది. 2002-2004 రెండేళ్ళలో జెమిని టి.వి. కోసం చాలా ఈవెంట్స్ చేశాను. నిమ్మకూరులో జరిగిన 'ఆంధ్రావాలా' ఆడియో రిలీజ్ దాకా దాదాపు 70-90 షోస్‌కి

ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేశాను. 'ఆంధ్రా వాలా' ఫంక్షన్ కోసం హెలికాప్టర్, 70 బస్సులు, మూడు రైళ్ళలో అంతా నిమ్మకూరు తరలి వెళ్ళడంలో మా ప్లానింగ్ చాలా ఉపయోగపడింది. ఆ ప్రొఫెషన్‌లో నేను చివరిసారిగా చేసిన ఫంక్షన్ 'అంజి' సినిమా హెక్సా ప్లాటినమ్ డిస్క్ ఫంక్షన్..

మధ్యలో ఒకసారి 'కలిసుందాం..రా' సినిమాకి ప్రి-ప్రొడక్షన్ యాక్టివిటీస్‌లో కూడా పాల్గొన్నాను. ఈ ఈవెంట్ మేనేజ్‌మెంట్ పనుల్లో చాలా మంది సినిమా పరిశ్రమకి చెందిన వాళ్ళతో స్నేహం ఏర్పడింది. మధ్యలో జెమిని జి.కె.మోహన్ గారి ద్వారా అమెరికాలో నిర్మించబడిన 'ప్రేమాయ నమః' చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసే అవకాశమొచ్చింది.

ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కి స్వస్తి చెప్పి 2004 ప్రాంతాల్లో ఇంక సొంతంగా సినిమా దర్శకత్వంకోసం ప్రయత్నాలు మొదలుపెట్టాలనిపించింది. ఈ విషయాన్ని జెమిని టివి. కిరణ్ గారికి, మోహన్ గారికి చెప్పినప్పుడు వాళ్ళు ప్రోత్సహించడమే కాక పబ్లిసిటీ వగైరా అంశాల్లో తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

ఆ రోజుల్లోనే మా అమ్మాయిని ఒక కార్పొరేట్ రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించడానికి తీసుకెళ్ళాను. అక్కడ చేర్పించిన మొదటి వారంలోనే ఒక వార్త చెప్పింది. తన సీనియర్ అమ్మాయి ఒకామె ఆత్మహత్య చేసుకుందట. కారణం చదువుల ఒత్తిడి..!! ఆ విషయం నన్ను తీవ్రంగా కదిలించింది. అదే అంశం మీద ఒక కథ తయారు చేసుకుని సినిమా స్క్రిప్టు కూడా సిద్ధం చేసుకున్నాను. అంతవరకూ సినిమా వాళ్ళతో స్నేహం, సినిమా నిర్మాణం గురించి తెలుసుకోవడమే తప్ప ఇలా స్క్రిప్టు వ్రాయడం అనేది అస్సలు తెలీదు. నేను ముందునుంచీ అడుపెట్టిన ప్రతిరంగం లాగానే స్క్రిప్టు రైటింగ్ కూడా సొంతంగా నేర్చుకున్నదే అది వ్రాయడానికి ముందుగా చాలా పుస్తకాలు చదివాను. వాటిల్లోని ముఖ్యమైన అంశాలన్నింటినీ ఒక చోట వ్రాసుకున్నాను. వాటి ఆధారంగా సినిమా స్క్రిప్టు రెడీ చేసుకున్నాను.

తర్వాతి దశ నిర్మాతని చూడ్డం లేదా హీరోని పట్టుకోవడం. అప్పుడప్పుడే పైకి వస్తున్న ఒక వర్ధమాన నటుడ్ని ఎప్రోచ్ అయ్యాను. తను ఒప్పుకున్నాడు. నిర్మాతని వెదికే ప్రయత్నాల్లో ఉండగా అతని సినిమా మరొకటి రిలీజ్ ఐ సూపర్ హిట్ ఐంది. దాంతో తన రెమ్యునరేషన్ పెంచేశాడు. ఆ బడ్జెట్‌తో నా స్క్రిప్టు వర్క్ కాదనిపించింది. అంత డబ్బు పెడితే పెద్ద హీరోనే చూడొచ్చు కదా అని ఆ కోణంలో ప్రయత్నించడం మొదలుపెట్టాను. కథ అదే, నెరేషన్ మాత్రం పెద్ద హీరోకి నప్పేలా మార్చి వ్రాసుకున్నాను. ఆ ప్రయత్నాలూ ఫలించలేదు. ఒకరిదగ్గర చేతులు కట్టుకుని నిల్చోవడం కానీ ఎప్పాయింట్ మెంట్ కోసం పడిగాపులు పడడం కానీ ఇష్టం లేదు. నాకున్న పరిచయాల మూలంగా అలాంటి పనులు చెయ్యలేను. ఎవర్ని కలవాలన్నా సమాన హోదా, గౌరవంతో కలవాలనుకునే వాడిని. సో..పెద్ద హీరోలకోసం చేసిన ప్రయత్నాలూ కుదరలేదు. నేననుకున్న సబ్జెక్టుకి దీన్ని కమ్మర్షియల్ సినిమా కంటే ఎక్స్‌పెరిమెంటల్ సినిమాగా తీస్తే బావుంటుందనిపించింది. మళ్ళీ స్క్రిప్టుని తిరగరాశాను.



అలా తయారైందే 'హోప్' చిత్ర కథా, కథనం. చిన్న సినిమా ఐనా ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. కీలకమైన పాత్రకి తెలుగువారందరూ గుర్తుపట్టగలిగి, అంతవరకూ వెండితెరమీద కనిపించని ప్రముఖుడ్ని తీసుకుంటే బావుంటుందనిపించింది. అలా నా ఆలోచనల్లోకి వచ్చిన వారే శ్రీ రామానాయుడు గారు. అంతవరకూ ఆయన ఫుల్ లెంగ్త్ సినిమాల్లో చెయ్యలేదు. ఆయన్ని అడగడానికి ముందుగా నిర్మాత పొలిచెర్ల హరనాథ్ గారిని కలుసుకున్నాను. ఆయన నాకు 'ప్రేమాయ నమః' రోజుల్నుంచీ

పరిచయం. ఆ సినిమాకి ఆయనే నిర్మాత. అమెరికా నుంచీ ఆయన తిరుపతి వచ్చిన సమయంలో నేను అక్కడికి వెళ్ళి కలుసుకున్నాను.

డా.హరనాథ్ గారికి మూడు ఫైళ్ళు ఇచ్చాను. మొదటిది పూర్తి స్క్రిప్టు, రెండోది బడ్జెట్ అంచనాలు. మూడోది ఈ సినిమా ద్వారా నేను ఖచ్చితంగా సాధిస్తానన్న హామీ. ఈ హామీ లోనే నేషనల్ అవార్డు, రామానాయుడు ప్రధాన పాత్రధారి అన్న విషయాలు కూడ చేర్చాను. 'రామానాయుడు గారిని తారగణంలోకి చేర్చగలిగితే గ్యారంటీగా నేనే నిర్మాతని 'అని హామీ ఇచ్చారు.

అప్పటికే సురేష్ బాబు గారితో నాకు పరిచయం ఉంది. రామానాయుడు గారిని అప్పుడప్పుడూ దూరంగా చూడడమే కానీ ఎప్పుడూ ప్రత్యక్షంగా కలుసుకుని మాట్లాడిన సందర్భాలు లేవు. 'హోప్' సినిమా కోసమని అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాను. చేతిలో స్క్రిప్టుతో నన్ను చూడగానే సినిమా నిర్మాణం ప్రపోజల్ కోసం వచ్చాననుకున్నారాయాన. ఆయన్ని నటుడిగా అడగడానికి వచ్చానని చెప్పగానే నన్ను డిస్కరేజ్ చేశారు. ' ఇంతవరకూ ఏవో చిన్న చిన్న వేషాలు వేశాను కానీ మీరేమో ఫుల్ లెంగ్త్ పాత్ర అంటున్నారు. వేరే ఎవరినైనా చూసుకుంటే మంచిది ' అన్నారు. ఐనా 'ఒక్కసారి కథ వినండి' అని ఒప్పించాను. కథ చెప్పాను. అరగంట అనుకున్నది రెండు గంటలపాటు నెరేట్ చేశాను. కథ చెప్పడం పూర్తయ్యాక రామానాయుడు గారు కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. "సతీష్ ఈ సినిమా నేను చేస్తున్నాను.." అన్నారు!!.

అలా మొదలైంది నా మొదటి సినిమా 'హోప్'. 2005 అక్టోబర్ ప్రాంతాల్లో షూటింగ్ మొదలుపెట్టాం. మొదటి కొద్ది రోజులూ కొంచెం కొత్తగా అనిపించినా త్వరలోనే సర్దుకున్నాను. మొట్టమొదటి రోజు షూటింగ్ అయ్యేసరికి ఇండస్ట్రీలో అందరికీ తెలిసిపోయింది 'రామనాయుడు గారు ఫుల్ లెంగ్త్ రోల్ చేస్తున్నారు' అని. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు గారు స్టూడియోకి వచ్చారు నన్నాయన చనువుగా 'సత్యం' అని పిలుస్తారు. 'సత్యం.. రామానాయుడు గారితో ఫుల్ లెంగ్త్ మూవీ అంటున్నావ్.. జాగ్రత్తగా చెయ్యి..ఆల్ ది బెస్ట్' అన్నారు.

మొత్తం 18 రోజుల్లో షూటింగ్ పూర్తిచేసేశాను. 18,000 అడుగుల ఫిల్మ్ మాత్రమే ఎక్స్‌పోజ్ చేశాము. 105 నిమిషాల సినిమా ఫైనల్ ప్రొడక్టు 10,000 అడుగులు వచ్చింది. మొదటి సినిమానే ఐనా అంత ఎఫిషియెంట్‌గా షూట్ చెయ్యగలిగాము.



ఈ సినిమాకి ఇళయరాజాగారి రీ-రికార్డింగ్ హైలైటే కాక ఆయనతో పనిచేయడం మరపురాని అనుభవం. ఆయనొక నడిచే సంగీత సరస్వతి. ఆయన పనిచేసే విధానం, క్రమ శిక్షణ నుంచీ నేర్చుకోవాల్సింది చాల ఉంది. తర్వాత ఎన్ని సినిమాలు తీసినా ఇళయరాజా గారితో పనిచేసిన అనుభవం మాత్రం ప్రత్యేకంగా మిగిలిపోతుంది.

'హోప్' మొదటి కాపీ రాగానే ప్రి-వ్యూ వేశాము. రామానాయుడు గారు, నేను, మిత్రుడు కెమేరామేన్ శరత్, జెమిని కిరణ్ గారు, జి.కె.మోహన్ గారు మేము ఐదుగురమే వున్నాం. సినిమా అయ్యాక చాలా సేపు రామానాయుడుగారు మాట్లాడలేక పోయారు. రాత్రి 10.30కి ఫోన్ చేశారు. ఏమంటారో అనుకున్నాను. "సతీష్. సినిమా చాలా బాగా తీశావు. చూసిన వాళ్ళందరినీ ఆలోచింపచేస్తుంది. రేపు పొద్దున్నే ఇంకో షో వేస్తావా, మా కుటుంబ సభ్యులంతా చూస్తామంటున్నారు?"అన్నారు. మర్నాడు సురేష్‌గారు, వెంకటేష్ గారు, మిగతా కుటుంబ సభ్యులంతా కలిసి చూశారు. వాళ్ళ అభినందనలు నాకు తొలివిజయం.

సినిమాని 2006 అగస్టు, సెప్టెంబర్ ప్రాంతాల్లో చాలా ప్రి-వ్యూలు వేసి అన్ని రకాల ప్రేక్షకులకి చూపించాము. థియేటర్ రిలీజ్ కూడ జరిగింది కానీ అదే సమయంలో 'బాస్', 'స్టాలిన్' లాంటి పెద్ద సినిమాలు కూడా విడుదల అవడంతో వారం మించి థియేటర్లలో ఉండలేదు. ఐనా విమర్శకుల ప్రసంశలు చాలా వచ్చాయి. 'హోప్ 'కి 2007 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో సాంఘిక సమస్యల మీద తీసిన ఉత్తమ చిత్రంగా కేంద్ర ప్రభుత్వంనుంచీ బహుమతి నందుకుంది. ఆవిధంగా, సినిమా మొదలుపెట్టడానికి ముందే, నిర్మాతగారికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోగలిగాను.

ఇదీ నా మొదటి సినిమా అనుభవం..జ్ఞాపకాలు..!

తర్వాత వచ్చిన 'కలవరమయే మదిలో' చిత్రాన్ని అభిమానించిన ప్రేక్షకులందరికీ నా ధన్యవాదాలు. త్వరలోనే మరో మంచి సినిమాతో మీ ముందుకి వస్తాను..




(జూన్ 2010 సంచికలో ప్రచురితం)

# శ్రీవాస్

**అనుకున్న 'లక్ష్యం' సాధించాలంటే ఒక ప్రణాళిక ఉండాలి.** దాన్ని అమలుపరిచే విధానాన్ని నిర్ణయించుకోవాలి. ఆ తరువాత ప్రయాణంలో ఎదురయ్యే కష్టనష్టాలకి తట్టుకునే ఓర్పు ఉండాలి. వాటికి తోడుగా పట్టుదల, కృషి, కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉంటే ఎప్పటికైనా 'లక్ష్యం' సిద్ధిస్తుంది. ఇది శ్రీవాస్ గా అందరికీ తెలిసిన యువదర్శకుడు ఓలేటి శ్రీనివాసు నేర్చుకున్న పాఠం, తద్వారా సాధించిన 'లక్ష్యం'. సినిమా షూటింగ్‌లకు కెమెరాలు వగైరా సరఫరా చేసే ఔట్‌డోర్ యూనిట్‌లో చిట్టచివరి అసిస్టెంట్‌గా సినీ జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా అనుకున్న లక్ష్యం వైపు అడుగులువేస్తూ, మొదటి సినిమా 'లక్ష్యం'తో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకుని, రివార్డులతో పాటు అవార్డు(నంది బహుమతులు)లూ గెలుచుకున్న సక్సెస్ స్టోరీ శ్రీవాస్ గారిది. ఐతే ఏ విజయమూ అంత తేలిగ్గా ఒళ్ళో వొచ్చి వాలదు అనడానికి కూడా శ్రీవాస్‌గారి సినీ జీవిత ప్రయాణం ఒక ఉదాహరణ..అదేమిటో ఆయన మాటల్లోనే చదువుదాం.

***అమ్మా..నాన్నా..మేమూ..!***



**మా నాన్నగారి పేరు** ఓలేటి గాంధి. అమ్మ పేరు అమ్మాజీ. మా స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం అనే పల్లెటూరు. అమ్మా, నాన్నలకి ముగ్గురు సంతానంలో నేను మధ్యవాడిని. నాకొక అన్నయ్య, చెల్లాయి ఉన్నారు. నాకు ఊహ తెలిసేటప్పటికే నాన్నగారికి సీతానగరంలో ఒక సినిమా థియేటర్ ఉంది. దాని పేరు శ్రీరామదుర్గా పిక్చర్ ప్యాలెస్. నాన్నగారు ఫిల్మ్ బిజినెస్‌లో ఉండడం వల్ల మా ఇంట్లో సినిమాల గురించి, వాటి జయాపజయాల గురించిన కబుర్లు తరచూ దొర్లుతుండేవి. ఆ రోజుల్లోనే ఆయనకి కేవలం సినిమా ప్రదర్శనే కాకుండా సినిమా రంగంలోని అన్ని విభాగాల గురించి మంచి అవగాహన, నాలెడ్జి ఉండేది. నాన్నగారు హీరో, హీరోయిన్ల గురించే కాకుండా ఇతర సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుతుంటే, చాలా ఆసక్తిగా వినేవాళ్ళమని నాన్నగారి స్నేహితులు చెబుతుండేవారు. నాన్నగారు ఎన్టీఆర్.గారికి వీరాభిమాని కూడా. ఎన్టీఆర్.గారి ఏ సినిమా గురించి అడిగినా ప్రతిదృశ్యాన్ని విశ్లేషిస్తూ మాట్లాడగలరు..

ఈ నేపథ్యంలో నా బాల్యం మొదలైంది. చిన్నతనంలో చదువు చాలా ఊళ్ళలో సాగింది.

***ఎల్.కె.జి నుంచి డిగ్రీ వరకూ..***

అక్షరాభ్యాసం మా వూళ్ళోనే మొదలైనా రెండు మూడు తరగతులు మా పెద్దత్త గారింటి వద్ద ఉండి, పోచవరం అనే వూళ్ళో, చదువుకున్నాను. అక్కడ మొదలై.. మళ్ళీ మావూరు, పోలవరం, వంగలపూడి, రాజమండ్రి ఈ విధంగా ప్రతి రెండు మూడేళ్ళకీ ఒక స్కూలు మారుతూ ఇంటర్మీడియట్‌కి సీతానగరం జూనియర్ కాలేజీకి చేరుకున్నాను.. మా థియేటర్ కూడా సీతానగరంలో ఉండడం

వల్ల ఇంటర్మీడియట్ చదివేప్పుడు ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు థియేటర్‌కి వెళ్ళి అలా మెట్లమీదే నించుని ఇష్టమైన సీన్లు మళ్ళీ మళ్ళీ చూస్తుండేవాడిని. ఇంటర్మీడియట్ అయ్యాక నెల్లూరు వెళ్ళి నారాయణ కోచింగ్ సెంటర్‌లో ఎమ్‌సెట్ కి కోచింగ్ తీసుకున్నాను. ఇంజినీరింగ్ సీటు ఐతే రాలేదు కానీ అక్కడికి వెళ్ళడం వల్ల వివిధ రకాల కోర్సుల గురించిన నాలెడ్జి పెరిగింది. బి.ఎస్సీ కంప్యూటర్స్ చదవాలని నిర్ణయించుకున్నాను. రామచంద్రాపురం వి.ఎస్.ఎమ్ డిగ్రీ కాలేజీలో ఆ కోర్సు పూర్తిచేశాను.. అదయ్యాక విశాఖపట్నం వెళ్ళి ఎమ్.సి.ఎ, ఎమ్.బి.ఎ ఎంట్రెన్స్ పరీక్షలకోసం ప్రిపేర్ అవడం మొదలు పెట్టాను.

***సినిమా రంగం గురించి తొలి పాఠాలు.***

అప్పటి వరకూ సినిమాల మీద ఆసక్తి, రకరకాల సినిమాలు ఒకటికి రెండు సార్లు చూడ్డమే తప్ప సినిమా రంగంలోకి వెళ్ళి ఏదైనా చెయ్యాలన్న ఆలోచన అస్సలు లేదు. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. మా చిన్న మేనత్తగారి అబ్బాయి కాశీవిశ్వనాథ్ ('నువ్వులేక నేను లేను','తొలిచూపులోనే..' చిత్రాల దర్శకుడు) అప్పటికే సినిమా రంగంలో, దర్శకత్వశాఖలో సహాయకుడిగా, మద్రాసులో ఉన్నాడు. తను ఇంటికి వచ్చినప్పుడల్లా సినీరంగ విశేషాలు ఆసక్తిగా అడిగి తెలుసుకుంటుండేవాళ్ళం. ఆ విధంగా సినిమా రంగంలోని వివిధ శాఖల గురించి, నిర్మాణం దర్శకత్వంలో ఉన్న సాధకబాధకాల గురించి కాశీవిశ్వనాథ్ ద్వారా ఫస్ట్‌హేండ్ ఇన్ఫర్మేషన్ తెలుస్తుండేది. ఇటు నాన్నగారి థియేటర్ వల్ల సినిమాలు ఎందుకు ఆడతాయో, ఎందుకు ఆడవో కాస్త అవగాహన వచ్చింది. బి.ఎస్సీ అయ్యే సరికి ఇదీ నేపథ్యం.

***దిశ మారిన లక్ష్యం.***

పిజి ఎంట్రెన్స్ కోచింగ్‌లో ఉండగా మొదటిసారి అనిపించింది "ఈ ఎం.బి.ఎ కోర్సు చదవడానికి రెండేళ్ళు పడుతుంది. రెండేళ్ళయ్యాక కూడా ఏదైనా ఉద్యోగం చూసుకోవల్సిందే. నైన్ టు ఫైవ్ ఉద్యోగం.! ఎంత కష్టపడినా వచ్చేది ఆ నెల జీతం మాత్రమే.. దీని బదులు ఇంకేదైనా ఆసక్తికరమైన ఫీల్డ్‌లో సమయాన్ని వెచ్చిస్తే బావుండును" అని.

అప్పటినుంచి కూడా నా ఆలోచనలు చాలా ప్రాక్టికల్ ఉండేవి. ఎప్పుడైనా రెండు మూడు అంశాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలంటే అన్నికోణాల్లోనూ లాభ, నష్టాలని బేరీజు వేసుకుంటూ ఉండేవాడిని. శ్రమని బట్టి ఫలితం వచ్చే రంగంలో స్థిరపడాలన్న ఆలోచన వచ్చినప్పుడు కనిపించిన ఆల్టర్నేటివ్ సినిమా రంగం! ఎందుకంటే అప్పటికే కాశీవిశ్వనాథ్ మద్రాసులో ఉండడం, నాన్నగారు కూడా అదే బిజినెస్‌లో ఉండడం బలమైన కారణాలు. అక్కడ కూడా నా విశ్లేషణ ప్రకారం నేనూ దర్శకత్వంలోకే వెళ్ళాలని అనుకోలేదు. మద్రాసు వెళ్ళి సినిమాకి సంబంధించిన డి.ఎఫ్.టి లాంటి కోర్సు ఏదైనా చేసి, కెమేరా శాఖలో చేరాలని అనుకున్నాను. కాశీవిశ్వనాథ్ డైరెక్షన్‌లో ఉన్నాడు కాబట్టి నేను కెమేరా వైపు వెళితే కాంబినేషన్ బావుంటుంది.. ఇలా సాగాయి నా ఆలోచనలు. ఐతే ఇంట్లో ఏమీ చెప్పకుండా ముందుగా బావ కాశీవిశ్వనాథ్‌కి నా మనసులోని మాట వివరంగా చెబుతూ ఉత్తరం రాశాను. నేను ఈ రోజిలా సినిమారంగంలో కొనసాగడానికి కారణం.. ఒకటి - నా లెటర్ చదివిన కాశీవిశ్వనాథ్ సానుకూలంగా స్పందిస్తూ సమాధానమివ్వడం, రెండోది- ఈ విషయం ఇంట్లో చెప్పగానే నాన్నగారు కూడా 'సరే' ననడం..!

***చిత్రపరిశ్రమలో తొలి అడుగులు.***




ఈ విధంగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ వైపుగా నా మొదటి అడుగు మొదలైంది. కాశీవిశ్వనాథ్, నా డి.ఎఫ్.టి. నిర్ణయం గురించి విన్నాక 'మరీ అంత ఫార్మల్ కోర్సులు చెయ్యాల్సిన అవసరం లేదు. నిజానికి ఇండస్ట్రీలో ఉన్న వాళ్ళెవరూ అలా కోర్సులు చేసిన వచ్చిన వాళ్ళు కాదు. అసలైన అనుభవం ప్రాక్టికల్‌గా వస్తుంది. అందువల్ల ఎక్కడైనా కెమేరా డిపార్ట్‌మెంట్లో చేరి వర్క్ నేర్చుకో' అని సలహా ఇచ్చారు. నాకది బాగా నచ్చింది. ఎక్కడైనా తెలిసిన వాళ్ళ వద్ద చేరితే నన్ను అభిమానంగా చూసుకోవడం వల్ల వర్క్ బాగా నేర్చుకోలేనేమోననీ, నిజంగా నాకు శ్రద్ధ ఉంటే ఎలాంటి ఇబ్బందులనైనా తట్టుకునే ఓపిక ఉండాలనేది, బావ కాశీ ఆలోచన. తనే నన్ను హైదరాబాదులోని ఆనంద్ సినీ సర్వీసెస్ ఔట్ డోర్ యూనిట్‌లో అప్రెంటిస్‌గా జాయిన్ చేశాడు.

ఈ విధంగా సినీ రంగంలో నా మొట్టమొదటి ప్రవేశం హైదరాబాదులో మొదలైంది. ఆనంద్ సినీ సర్వీసెస్ నుంచి రోజూ కెమేరాలు వివిధ సినిమాల షూటింగ్‌లకి వెళుతుండేవి. ఒక్కో కెమేరాతో బాటు ఫస్ట్ అసిస్టెంట్, సెకండ్ అసిస్టెంట్, చివరగా ఒక అప్రెంటిస్ ఉండేవాళ్ళు. నా మొదటి జాబ్ అప్రెంటిస్‌గా మొదలైంది. ఇలా నేను పనిచేసిన మొదటి సినిమా, కృష్ణగారు హీరోగా నటించిన 'డియర్ బ్రదర్'. హైదరాబాదు చుట్టుపక్కలే షూటింగ్ జరిగేది. రోజూ పొద్దున్నే 4.30 కల్లా ఆనంద్ సినీ సర్వీసెస్ ఆఫీసుకి వెళ్ళాలి. బయట గేటు దగ్గర వెయిట్ చేస్తే, కెమేరా వెళ్ళేప్పుడు దానితో బాటు వెళ్ళి, కెమేరామేన్ సూచనల మేరకు కెమేరా పొజిషన్ సెట్ చెయ్యడం, లెన్స్‌లు శుభ్రం చేసి ఇవ్వడం..మొదలైన పనులు చెయ్యాలి. ఒక్కోసారి అంత పొద్దున్నే వెళ్ళినా 'ఇప్పుడు షూటింగ్ లేదు..మళ్ళీ సాయంకాలం రండి చూద్దాం' అనేవాళ్ళు. వెనక్కి వచ్చేసి మళ్ళీ బస్సు పట్టుకుని సాయంకాలం వెళ్ళేవాడ్ని. అప్పుడు కూడా ఒక్కోసారి పని ఉండేది, లేకుంటే లేదు.

ఇదంతా కొత్త జీవితం నాకు. అంత పొద్దున్నే లేవడం ఎప్పుడూ అలవాటు లేదు. చదువుకునేప్పుడు కూడ లేటుగా చదివి పడుకునే వాళ్ళమే కానీ పొద్దున్నే లేవడం అస్సలు అలవాటు లేదు. హైదరాబాదులో మా మేనమామగారింట్లో ఉండేవాడిని. మా దగ్గర బంధువులందరిలో ఉన్నత చదువులు చదువుకున్నది ఆయనే. ఆయన నా అవస్థలు గమనించి 'ఎందుకొచ్చిన యాతనలివన్నీ!? శుభ్రంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఉద్యోగ చేసుకోవచ్చు కదా' అనే వాళ్ళు. ఇష్టపడి వచ్చిన ఫీల్డ్ కాబట్టి ఎలాంటి కష్టాలైనా తట్టుకోవాలనే పట్టుదల అప్పుడే మొదలైంది.

ఆనంద్ సినీ సర్వీసెస్‌లో కెమేరా అసిస్టెంట్‌లుగా పనిచేసే వాళ్ళలో చాలా మంది పెద్దగా చదువుకోని వాళ్ళే. నేను వాళ్ళకి కొత్తగా కనిపించేవాడిని. షూటింగ్‌కి వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు ఎక్కడైనా టీ తాగడం కోసం అందరం ఆగినప్పుడు ఖర్చు పెట్టడానికి నేనే ముందుకి వచ్చేవాడిని.. నాన్నగారిచ్చిన పోకెట్ మనీ నాకా వెసులుబాటునిచ్చేది. అప్రెంటిస్‌గా వుంటూనే అందరికీ ఖర్చుపెట్టే నా వ్యవహారం చూసి అందరికీ తెలిసింది.. నేను మంచి ఫేమిలీ నేపథ్యంనుంచీ వచ్చానని. అందువల్ల అందరూ నన్ను గౌరవంగా చూసేవాళ్ళు. మొదటి ఒకటి రెండు వారాల్లోనే కెమేరా గురించిన టెక్నికల్ విషయాలు బాగా వంటబట్టాయి. రకరకాల లెన్సులూ, వాటి ఫోకల్ లెంగ్త్‌లూ, వేటిని ఎప్పుడు వాడతారు..వగైరా విషయాలన్నీ కూలంకషంగా తెలుసుకున్నాను. ఇంతలో ఇంకో సంఘటన జరిగింది.

***ఒక్కో అడుగూ ముందుకి.***



శరత్ గారి దర్శకత్వంలో జగపతి వారి 'భలే బుల్లోడు' షూటింగ్ కోసం ఆ యూనిట్ అంతా మద్రాసునుంచీ హైదరాబాదు వచ్చింది. ఆ యూనిట్‌లో కో-డైరెక్టర్‌గా మా బావ కాశీ కూడా వచ్చాడు. వాళ్ళకి మద్రాసు ఆనంద్ సినీ సర్వీసెస్ వాళ్ళు ఒక కెమేరా పంపిస్తూ, ఇక్కడ నుంచీ నన్ను ఆ కెమేరాకి అసిస్టెంట్‌గా వెళ్ళమని పురమాయించారు. ఆ విధంగా రోజూ నేను ఆనంద్ సినీ సర్వీసెస్ తరఫునా, కాశీ ప్రొడక్షన్ యూనిట్ తరఫునా ఆ షూటింగ్‌లో కలుసుకునే వాళ్ళం.

ఇంకో విశేషమేమిటంటే డైరెక్టర్ శరత్ గారికి మా నాన్నగారితో చాలా క్లోజ్ పరిచయం ఉంది. నేను లెన్స్ బాక్స్‌లవీ మొయ్యడం చూసి 'వాడలా మొండి పనులు చేస్తుంటే చూడలేకపోతున్నాను. ఎందుకంత కష్టం..? ఎక్కడైనా ఉద్యోగంలో పెట్టొచ్చు గదా అనే వారు' ఐతే కాశీ 'ఏం ఫరవాలేదు...మనమంతా కష్టపడి పైకి రాలేదా..!?' అని సర్ది చెప్పేవాడు. నాకూ అలా పనిచెయ్యడం నామోషీ అనిపించేది కాదు. మెట్టు మెట్టుగా పైకి ఎదగాలనేది రోజూ నాకు గుర్తుండేది. ఆ సినిమా షూటింగ్ హైదరాబాదులో పూర్తయ్యాక, అదే కెమేరాతో బాటు నేనూ మద్రాసు వెళ్ళి, అక్కడ ఆనంద్ సినీ సర్వీసెస్‌లో కొన్నాళ్ళు పనిచేసి తర్వాత ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ యూనిట్‌లో కెమేరా అసిస్టెంట్‌గా చేరాను.

ఈ ప్రాసెస్‌లో కెమేరాతో బాటు వివిధ భాషల సినిమాల షూటింగ్‌లకి వెళ్ళడంతో చాలా మంది కెమేరా మేన్‌లతో పరిచయాలు ఏర్పడ్డాయి. వాళ్ళ వర్కింగ్ స్టైల్స్ గమనించే అవకాశం కూడ లభించింది. నేనూ జస్ట్ కెమేరా కోసమే వచ్చినట్లు కాకుండా, కెమేరా మేన్‌లకి కావల్సిన ఇతర ఏర్పాట్లు కూడా చూస్తుండే వాడిని. దీంతో అందరూ నన్ను అభిమానంగా చూసుకుంటుండేవాళ్ళు. ఈ క్రమంలోనే ప్రముఖ ఛాయాగ్రాహకుడు జయనన్ విన్సెంట్ గారితో చనువు ఏర్పడింది. అప్పటికే ఫీల్డ్‌కి వచ్చి ఏడెనిమిది నెలలైంది. మా బావ కూడా, ఒక రోజు 'ఏరా వచ్చి చాలా రోజులైంది. కెమేరా యూనిట్‌లో ఇన్స్ అండ్ ఔట్స్ తెలిశాయి కదా. మరింక డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ ఎవరి వద్దనైనా అసిస్టెంట్‌గా చేర్పిస్తాను' అని తనకి తెలిసిన కొందరిని సజెస్ట్ చేశారు. చేస్తే, సంతోష్ శివన్, పిసి శ్రీరామ్ గారి లాంటి పెద్ద కెమేరా మెన్‌ల వద్దనే పనిచెయ్యాలని నేను అనుకుంటూ ఉండేవాడిని. అలా అనుకుంటున్న రోజుల్లోనే జయనన్ విన్సెంట్ గారికి నాగార్జున గారి ప్రిస్టేజియస్ ప్రోజెక్టు 'రక్షకుడు'కి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచేసే అవకాశం వచ్చింది. ఆ విషయం తెలుసుకున్న నేను ఆయన వద్దకెళ్ళి అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశమివ్వని అడిగాను. అప్పటికే అయనతో మంచి పరిచయం ఉండడంతో, అడగ్గానే ఒప్పుకున్నారు.

***కెమేరా వెనుక నుంచి కెమేరా పక్కకి.***

అలా కెమేరా మోసే పని నుంచీ కెమేరాతో పనిచేసే స్థాయికి ఒక మెట్టు ముందుకెళ్ళాను. ఇక్కడో చిన్న సంఘటన జరిగింది, 'రక్షకుడు' సినిమా షూటింగ్ మొదలైన మూడు నాలుగు రోజులకే జయనన్ గారు క్రేన్ మీద నుంచీ పడడంతో కాలు ఫ్రాక్చర్ ఐ హాస్పిటల్‌లో చేరారు. అందువల్ల ఆయన బదులుగా ఆయన తమ్ముడు అజయ్ విన్సెంట్‌గారు కెమేరా మేన్‌గా కంటిన్యూ అయ్యారు. మొదటి షెడ్యూల్ పూర్తయింది. ఓ రోజు జయనన్ గారు పిలిచారు. వాళ్ళ నాన్నగారు విన్సెంట్ గారికి ఒక తెలుగు సినిమా ఆఫర్ వచ్చిందనీ, ఆయన తెలుగు తెలిసిన అసిస్టెంట్ కావాలంటున్నారనీ, నన్ను రమ్మనీ అడిగారు.

అది 'అన్నమయ్య' సినిమా.! రాఘవేంద్రరావుగారి డైరెక్షన్, విన్సెంట్‌గారు కెమెరా, నాగార్జునగారే హీరో. వెంటనే ఒప్పేసుకున్నాను. అలా 'రక్షకుడు' మొదటి షెడ్యూల్ తర్వాత విన్సెంట్‌గారి అసిస్టెంట్‌గా 'అన్నమయ్య' యూనిట్‌కి వెళ్ళాను. ఐతే 'అన్నమయ్య', 'రక్షకుడు' పేరలల్‌గా షూటింగ్‌లు జరుగుంతుండేవి. 'అన్నమయ్య'లో గేప్ వస్తే 'రక్షకుడు' కి వెళ్తుండేవాడిని. రెండు యూనిట్లలోనూ తెలిసిన వాళ్ళు, ఒకే హీరో అవడంతో రెండు చోట్లా నేర్చుకునే అవకాశం లభించింది. విన్సెంట్‌గారు నన్ను బాగా ఆదరించారు. నేనూ ఎత్తుగా ఉండడంతో ఎప్పుడైనా నాగార్జున గారికి పొజిషన్ చూసుకోవాల్సి వచ్చినప్పుడు నన్ను నిల్చోమని చెప్పి కెమెరా పొజిషన్ సెట్ చేసుకునేవాళ్ళు. ఆయనతో పనిచేయడం నాకు లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్..! ఆయన కేవలం పేరున్న డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ మాత్రమే కాదు, నడిచే గ్రంధాలయం. షూటింగ్ మధ్యలో గాప్ వస్తే ఎన్నో విషయాలు చెబుతుండేవారు. ఆయనతో పనిచేసిన ప్రతి నిమిషం పెద్ద ఎడ్యుకేషన్..! ఫలానా పని చెయ్యి అని చెప్పడమే కాక ఆపని ఎందుకు చెయ్యాలో, దాని ప్రభావం ఎక్కడెక్కడ ఎలా ఉంటుందో వివరంగా చెప్పేవాళ్ళు. రాఘవేంద్ర రావుగారి దర్శకత్వ శైలి పరిశీలించే అవకాశం లభించడం చాలా అదృష్టం. కెరీర్ మొదట్లోనే అటువంటి గ్రేట్ టెక్నీషియన్స్‌తో పనిచేయడం నాకెంతో ఉపయోగమైంది. 'అన్నమయ్య'కి పనిచేయడం వల్ల పది సినిమాలకి పనిచేసినంత అనుభవం వచ్చింది.

### *కృష్ణవంశీ గారి స్కూల్లో..!*



'అన్నమయ్య' పూర్తయ్యాక మళ్ళీ అజయ్ విన్సెంట్‌గారి దగ్గర 'ఆవిడా మా ఆవిడ', 'చంద్రలేఖ' సినిమాలకి పనిచేశాను. 'చంద్రలేఖ' సినిమాకి పనిచేసేప్పుడు కృష్ణవంశీ గారితో పరిచయం నా కెరీర్‌లో మరో మలుపుకి దారి తీసింది. నాకున్న అలవాటు వల్ల.. నేను పనిచేసేది కెమేరా విభాగంలోనే ఐనా లైటింగ్, పొజిషన్ అన్నీ సెట్ చేశాక డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో ఏం జరుగుతోందో, ఎవరేం చేస్తున్నారో ఆసక్తిగా పరిశీలించేవాడిని. అందరితో కలుపుగోలుగా ఉండే మనస్తత్వం అవడం వల్ల అన్ని డిపార్ట్‌మెంట్‌ల స్టాఫూ నాతో ఫ్రెండ్లీగా ఉండేవాళ్ళు. కృష్ణవంశీ గారి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ అంతా బాగా పరిచయమయ్యారు. 'చంద్రలేఖ' తర్వాత కృష్ణవంశీ గారి 'అంతఃపురం' మొదలుపెట్టారు. దానికి కెమేరా భూపతి గారు. కృష్ణవంశీ గారి యూనిట్ వాళ్ళంతా నన్ను తమ వద్దకి రమ్మని పిలవడంతో అజయ్ గారిని పర్మిషన్ అడిగాను. 'ఫరవాలేదు. భూపతి కూడా మంచి ఫ్రెండే అక్కడ పని చేసినా నాకేం అభ్యంతరం లేదు' అన్నారు. ఆ విధంగా 'అంతఃపురం' చిత్రానికి రెండో ఆపరేటివ్ కెమేరామేన్‌గా భూపతి గారి వద్ద చేరాను. కృష్ణవంశీగారి దర్శకత్వం టెక్నిక్స్ పరిశీలించడం పెద్ద ఎడ్యుకేషన్.

'అంతఃపురం' షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటన నా కెరీర్‌లో ఇంకో మలుపుకి కారణమయ్యింది.

దేవరయాంజాల్ పోలీస్ స్టేషన్‌లో సౌందర్యగారితో కొన్ని షాట్లు తీస్తున్నారు. ఎందుకోగాని ఆ రోజు షూటింగ్ చాలా టెన్షన్‌తో సాగుతోంది. చిత్రీకరించాల్సిన షాట్స్ ఎక్కువ ఉన్నాయి, సమయం చాలా తక్కువగా ఉంది. అంతా హడావిడిగా ఉంది. కృష్ణవంశీ గారి స్పీడ్‌కి తగినట్లుగా, భూపతి గారి సూచనల మేరకు, కెమేరా పొజిషన్స్ మార్చడం, లైటింగ్ అంతా సరిగ్గా చూసుకోవడం..అంతా చకచకా

సాగిపోతోంది. కృష్ణవంశీగారు లోపల కొన్ని షాట్లు తీస్తూ, తర్వాతి షాట్స్ కోసం బయట ఏర్పాట్లు నాకు పురమాయించారు. క్రేన్‌ని ఒక పర్టిక్యులర్ పొజిషన్‌లో ఫిక్స్ చేయించి ఉంచమని నాకు చెప్పారు. ఆయన చెప్పిన పొజిషన్ చూశాను. దాని తర్వాత ఇంకా నాలుగైదు షాట్లు మిగిలి ఉన్నాయి. ఉన్న కొద్ది సమయంలో అన్ని షాట్లూ పూర్తిచెయ్యాలంటే క్రేన్ పొజిషన్ మారిస్తే తప్ప పూర్తిచెయ్యలేం. నేనే నిర్ణయం తీసుకుని క్రేన్ వేరే పొజిషన్‌లో పెట్టి, నేను ఇంకో పనిలోకి వెళ్ళిపోయాను. ఆయన రావడంతోనే తను చెప్పినట్లు కాక వేరే పొజిషన్‌లో క్రేన్ ఉండడం గమనించి చాలా అప్‌సెట్ అయ్యారు. ఎందుకలా చేశానని గట్టిగా అడిగారు. సెట్లో అందరూ నా వైపే చూస్తున్నారు. ఆయన్ని పక్కకి పిల్చి, నేనెందుకలా చేశానో చెప్పాను. ఆయన కన్విన్స్ అవడమే కాక నా ముందు చూపుకి అభినందించారు.



అద్దైపోయాక అందరం ఎవరిపనిలో వాళ్ళం ఉండగా, కొంతసేపటికి హఠాత్తుగా అందరూ ఆశ్చర్యపోయేట్లుగా, ఆయన మైక్‌లో 'వాసూ.. నీ వర్కింగ్ స్టైల్‌కీ, ఆలోచనా విధానానికీ నువ్వు డైరెక్షన్‌లో బాగా రాణించేట్లున్నావు. నా డిపార్ట్‌మెంట్ లోకి వచ్చెయ్యి' అన్నారు. అనుకోని ఆహ్వానం, ఎంతో మంది కొన్ని సంవత్సరాలు వెయిట్ చేసినా దొరకని అవకాశం..!! ఆయనే స్వయంగా ఆఫర్ చేస్తున్నారు. ఆ రోజుల్లో కృష్ణవంశి గారి వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో చేరడం అంటే చాలా గొప్ప. ఎంతో మంది ఆ అవకాశం కోసం వెయిట్ లిస్ట్‌లో ఉండేవాళ్ళు! అంత సదవకాశాన్ని ఎలా వదులుకుంటాను..!? అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని అదే సినిమాకి కృష్ణవంశీగారికి అసోసియేట్‌గా కూడ పనిచేయడం మొదలుపెట్టాను. 'అంతఃపురం' పూర్తయ్యేవరకూ కెమేరా, డైరెక్షన్ రెండు డిపార్ట్‌మెంట్‌లలోనూ కొనసాగాను. ఒక వైపు కెమేరా ఎరేంజ్‌మెంట్స్ చూడ్డం, అదవగానే డైరెక్షన్‌లో కావాల్సిన సహాయం అందించడం .. అలా సాగింది. పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో కూడా చాలా యాక్టివ్ పార్ట్ తీసుకున్నాను.

దాని తర్వాత కృష్ణవంశీ గారి 'సముద్రం' సినిమాకి అసోసియేట్‌గా కంటిన్యూ అయ్యాను. దానిక్కూడా భూపతి గారే కెమేరా చెయ్యడంతో అఫీషియల్‌గా కాకపోయినా అవసరమైనప్పుడల్లా ఆయనక్కూడా సహాయం చేస్తుండేవాడిని. తర్వాత మొదలైన 'మురారి' సినిమాకు పూర్తిస్థాయి అసోసియేట్‌గా నా ఎనర్జీ అంతా కేంద్రీకరించి పనిచేశాను. ఆ సినిమా షూటింగ్ చాలా వరకూ మా వూరి చుట్టుపక్కలే జరగడంతో, లోకేషన్లు ఎంపిక చేయడానికి కూడా నన్నే పంపించారు.

'మురారి' షూటింగ్ చివరలో ఉండగానే కృష్ణవంశీగారికి "అంతఃపురం" హిందీలో చెయ్యడానికి అవకాశం వచ్చింది. ఒక వైపు 'మురారి' పోస్ట్‌ప్రొడక్షన్ పనులు, ఇంకో వైపు హిందీ 'అంతఃపురం' ప్రి-ప్రొడక్షన్ పనులూ ఒకేసారి జరిగేవి. అప్పుడు కూడా కృష్ణవంశీగారు లొకేషన్ల సెలెక్షన్ కోసం నన్నే పంపించారు. రాజస్థాన్, జోధ్‌పూర్ ప్రాంతాల్లో విపరీతంగా ప్రయాణించి ఉత్తరాది వాతావరణాన్ని ప్రతిబింబించే లొకేషన్లని సెలెక్ట్ చేసాం. హిందీ సినిమాకి పనిచేయడం ఒక కొత్త అనుభవం.

ఆ తర్వాత మా బావ కాశీకి రామానాయుడు గారి వద్ద 'నువ్వు లేక నేను లేను' సినిమాకి దర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. కాశీకి సహాయకుడుగా ఆ ప్రాజెక్టులోకి వెళ్ళాను.

సురేష్ ప్రొడక్షన్స్‌లో చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. ముఖ్యంగా కథ, కథనం వాటికి ఎందుకు ఎక్కువ సమయం ఖర్చుపెడతారో అక్కడ ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. ఆ చిత్ర నిర్మాణ సమయంలో సురేష్‌బాబు గారితో బాగా సాన్నిహిత్యం పెరిగింది. ఎప్పుడు ఖాళీ దొరికినా ఇండస్ట్రీగురించి చాలా విలువైన విషయాలు చెప్పేవారు. ఆ సినిమా నిర్మాణంలో ఉండగానే సొంతంగా సినిమా చేయడానికి కథలు రెడీ చేసుకోవడం మొదలుపెట్టాను. కొంతమంది బయటి నిర్మాతలు అడగడం కూడా జరిగింది. ఇంతలో కాశీ సినిమా విడుదలై సంచలన విజయం సాధించింది. నేనూ సొంతంగా డైరెక్షన్ ప్రయత్నాలు చేస్తున్నానని తెల్సిన నాన్నగారు " ఇప్పుడే బావకి హిట్ ఒచ్చింది కదా. తను సెటిల్ అవడానికి ఇంకో సినిమా అవసరం ఉంటుంది. అప్పటి వరకూ నువ్వు ఆగితే మన కుటుంబంలో ఒకళ్ళు స్థిరంగా ఉన్నట్లుంటుంది. అప్పుడు నువ్వు నీ ప్రయత్నాలు చేసుకోవచ్చు" అని చెప్పారు. నాకూ సమంజసంగానే అనిపించింది. కాశీ రెండో సినిమా 'తొలిచూపులోనే..' ఉషాకిరణ్ వాళ్ళది. దానికి నేను అసోసియేట్‌గా చేశాను. రామోజీగారి సంస్థలో పనిచేయడం మరో గొప్ప అనుభవం. ఇంతకు ముందే చెప్పినట్లు, నేను ఎక్కడ పనిచేసినా కేవలం నా విభాగానికి పరిమితమైపోకుండా మిగతా డిపార్ట్‌మెంట్‌లు కూడా ఎలా పనిచేస్తున్నాయో పరిశీలిస్తూ ఉండేవాడిని. ఉషాకిరణ్ ప్రొడక్షన్‌లో నిర్మాణ విభాగం గురించి చాలా విలువైన విషయాలు నేర్చుకున్నాను.

ఆ సినిమా జరుగుతున్న సమయంలోనే కళ్యాణరామ్‌తో పరిచయం అయింది. పరిచయం స్నేహంగా మారింది. నా వర్కింగ్ స్టైల్ చూసి 'వాసూ..కథ ఉంటే రెడీ చేసుకో .. నీ డైరెక్షన్‌లో సినిమా చేస్తాను' అనే వాడాయన.

### *దీర్ఘకాల ప్రయత్నాలు.. ఎత్తుపల్లాలు..!*

'తొలిచూపులోనే..' సినిమా పూర్తవగానే, కళ్యాణ్ రామ్ గారిచ్చిన మాట ప్రకారం ఆయనతో సినిమా చెయ్యడానికని కథలు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను. తనకి తెలిసిన నిర్మాతల వద్దకి కథలు చెప్పడానికి పంపించేవాడాయన. ఐతే 'తొలిచూపులోనే..', తర్వాత వచ్చిన 'అభిమన్యు' సినిమా పెద్దగా ప్రేక్షకాదరణకి నోచుకోకపోవడంతో నా ప్రయత్నాలు అంత చురుగ్గా ముందుకి వెళ్ళలేదు..

అలా మొదలైంది నా మొదటి సినిమా (డైరెక్షన్ కోసం) ప్రయత్నం..! దాదాపు రెండున్నర సంవత్సరాలు..ఎన్నో ప్రయత్నాలు, ఇంకెన్నో వైఫల్యాలు!! అప్పటికి పదేళ్ళు పైగా ఇండస్ట్రీలో ఉన్నా అందరూ తెలిసిన వాళ్ళే ఐనా ప్రోజెక్టు ఫైనలైజ్ అవడానికి చాలా కాలం పట్టింది. ఆ వివరాలు చెబుతాను... !

మా నాన్న గారూ, వి.వి.వినాయక్ గారి నాన్నగారూ చాలా దగ్గర స్నేహితులు. ఆ విధంగా వినయ్ నేనూ కూడా మంచి మిత్రులమయ్యాం. వినయ్ ఒకసారి కలిసినప్పుడు ఏం చేస్తున్నావని అడిగితే సొంత చిత్రం ప్రయత్నాల్లో ఉన్నానని చెప్పాను. ఆయన అప్పుడే 'సాంబ' చిత్ర నిర్మాణంలో ఉన్నారు. నిర్మాత కొడాలి నాని, కొత్తదర్శకుడితో సినిమా తీద్దామనుకుంటున్నారని, ఆయన్ని పరిచయం చేశారు. ప్రభాస్‌కి గానీ, ఎన్టీఆర్.కి గానీ సరిపోయే కథ చెప్పమన్నారు. కథ తయారు చేసుకుని చెప్పాను. కాలం గడిచింది కానీ ఏవీ ఫైనలైజ్ కాలేదు.

ఇంతలో కొత్త నిర్మాతలు కొంతమంది నన్ను ఎప్రోచ్ అయ్యి, సినిమా చేద్దామని అన్నారు. అల్లు అర్జున్ కోసం కథ తయారు చెయ్యమని నిర్మాతలు అడగడంతో, మూడు, నాలుగు నెలలు ఆ ప్రోజెక్టు మీద పనిచేసి కథ సిద్ధం చేశాను. అల్లు అర్జున్‌కి కథ నచ్చింది కానీ ఏవో కారణాలవల్ల ఆ ప్రయత్నాలు ముందుకి వెళ్ళలేదు.. ఇప్పుడేం చెయ్యాలి..!? నిర్మాతలు రెడీగా వున్నారు. మంచి కథ సిద్ధంగా ఉంది. ప్రోజెక్టుని ముందుకి ఎలా తీసుకెళ్ళాలి, ఏ హీరోని కాంటాక్ట్‌చెయ్యాలి అని ఆలోచిస్తున్న సమయంలోనే కళ్యాణ్ రామ్ నటించిన 'అతనొక్కడే.' సూపర్ హిట్ ఐంది. నాకున్న పరిచయంతో కళ్యాణ్ రామ్ దగ్గరకి వెళ్ళి కథ చెప్పడం, ఆయనకి కథ బాగానచ్చడంతో

కొత్త నిర్మాతలని తనకి పరిచయం చెయ్యడం, అంతా సరేననుకోవడం, నిర్మాతలు ఆఫీసు ప్రారంభించి పూజ చేయడం..అన్నీ చకచకా జరిగిపోయాయి. సాంకేతిక వర్గాన్ని ఎంపిక చేయడం కూడా మొదలుపెట్టాం. నా దర్శకత్వంలో మొదటి సినిమా మొదలౌతోంది..! మా ఫ్రెండ్స్‌కీ, బంధువులకీ అందరికీ తెల్సింది. అందరూ ఎంతో ఆనందించారు. ఎంతో కాలం నుంచి చేస్తున్న హార్డ్‌వర్క్‌కి ఫలితం లభించబోతోంది..! దురదృష్టవశాత్తూ ఈ ఆనందం కూడా ఎన్నో రోజులు నిలవలేదు. ప్రోజెక్టు ముందుకి వెళుతోంది అనుకుంటున్న సమయంలోనే మళ్ళీ బ్రేక్! షరా మామూలే. ఆఫీసు కూడ ఓపెన్ చేసిన నిర్మాతలు ఏవో సమస్యల వల్ల వెనుకంజ వేశారు. మళ్ళీ నిరాశ.!! ఊరునుంచి అందరూ ఫోన్ చేసి 'ఏమిటి..సినిమా ఎప్పుడు మొదలుపెడుతున్నావ్?' అంటే ఏం చెప్పాలో తెలిసేది కాదు.

మళ్ళీ ప్రయత్నాలు మొదలయ్యాయి! ఒకరోజు డైరెక్టర్స్ యూనియన్ ఎలక్షన్స్‌కి వెళ్ళినప్పుడు వినయ్ (వి.వి.వినాయక్) కనిపించి 'ఏం చేస్తున్నావ్ వాసూ.. ఒకసారి రూమ్ కి రా..మాట్లాడాలి..' అన్నాడు. నేను, వినయ్ రూములో ఉండగా వినయ్ నన్ను రాజుగారికి పరిచయం చేశారు. 'వాసు నాకు తెలీకపోవడమేమిటి..!' అని ఆయన చనువుగా పలకరించారు. 'మనవాడి వద్ద అల్లు అర్జున్ కోసం వ్రాసుకున్న కథ ఉంది..ఓ సారి వినకూడదూ..' అన్నాడు వినయ్, రాజు గారితో. 'తప్పని సరిగా వింటాను..ఒక వారం రోజుల్లో నన్ను కలువు' అని చెప్పారు. అప్పుడు 'బొమ్మరిల్లు' షూటింగ్ జరుగుతోంది. అక్కడికే వెళ్ళి రాజు గారికి కథ చెప్పాను. ఆయనకి నచ్చింది. కొన్ని మార్పులు సజెస్ట్ చేశారు. వాటిమీద పనిచేస్తూ రకరకాల వెర్షన్స్ వ్రాయడంలో మరో మూడు, నాలుగు నెలలు గడిచిపోయాయి. దిల్ రాజు గారు 'మున్నా'తో ఇంకా బిజీ ఐపోయారు. నా ప్రోజెక్టు గురించి నిర్ణయం తీసుకునే సమయం దొరకలేదు.

నెలలకి నెలలు జరిగిపోతున్నాయి. ఆదాయం వచ్చే పనేమీ చెయ్యడం లేదు. టైమంతా ఈ ట్రయల్స్‌లోనే గడుస్తోంది. అన్నీ ఓకె ఐతే గానీ ఎవరూ ఎడ్వాన్స్ కూడా ఇవ్వరు. ఆర్థికంగా కూడా అంతవరకూ వెనకేసిందేమీ లేదు.. ఐనా నాతో ఉంటున్న అసిస్టెంట్‌లకి జీతాలు, నాకూ జరగడానికి ఖర్చులు కావాలి. విపరీతమైన పరీక్షా సమయమది. రోజువారీ గడవడం కోసం చాలా అప్పులు చెయ్యాల్సి వచ్చింది. ఆ సమయంలో మా అన్నయ్య, మరికొంతమంది మిత్రులు ఇచ్చిన సహకారం మరిచిపోలేను. ఇలాంటి సందిగ్ధ సంధ్యా సమయంలో కాలంతో రాజీ పడి, మసక చీకట్లో మిగిలిపోయి, మళ్ళీ కో-డైరెక్టర్‌గా వెనక్కి వెళ్ళి అక్కడే ఆగిపోయిన వాళ్ళ జీవితాలు చాలా చూశాను. నేనూ అలా మిగిలిపోడానికి మనస్కరించలేదు. ఒకవైపు పట్టుదల, మరో వైపు ఆర్థిక ఇబ్బందులూ... ఎలాగైనా అనుకున్నది సాధించాలి. ఇలా సాగేవి నా ఆలోచనలు.!

### *'లక్ష్యం' సిద్ధించిన సమయం..!*

అలా..అలా..జరిగి చివరికి నా సుదీర్ఘ ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చే శుభఘడియలు వచ్చాయి.!

ఒక సినిమా ప్రారంభోత్సవంలో నల్లమలుపు బుజ్జి గారు కలిసినప్పుడు 'నా వద్ద గోపిచంద్ డేట్స్ ఉన్నాయి. ఎన్ని కథలు విన్నా నచ్చడం లేదు.. నీవద్ద సరిపోయే కథ ఏమైనా ఉంటే చెప్పు' అన్నారు. అంతకు ముందు దిల్‌రాజు గారు అడిగినప్పుడు వ్రాసుకున్న కథ గోపిచంద్ గారిక్కూడా సరిపోతుంది. కానీ దిల్ రాజు గారికి చెప్పకుండా అదే కథని బుజ్జిగారికి చెప్పడం నాకంత సమంజసం అనిపించలేదు. ఈ ఆలోచన వచ్చాక 'కాస్త సమయం ఇవ్వండి..రేపు చెబుతాను' అన్నాను.

దిల్‌రాజు గారు ఆ సమయంలో విదేశాల్లో ఉన్నారు. ఆ రోజు సాయంత్రం వినయ్‌ని కలిసి విషయం చెప్పాను. 'ఏం ఫరవాలేదు. ఇద్దరూ తెల్సిన వాళ్ళే కదా.. బుజ్జికి కథ చెప్పు. ఆయనకి నచ్చి తీసుకుంటానంటే దిల్‌రాజు గారితో నేను మాట్లాడుతానులే....'అని ధైర్యమిచ్చారు. మర్నాడు బుజ్జి గారికి 'లక్ష్యం' కథ చెప్పాను. ఆయనకి నచ్చి, వెంటనే గోపీచంద్‌కి చెప్పమన్నారు. గోపీచంద్‌కి కథ చెప్పడమంటే ఆయన బోడీ లాంగ్వేజ్‌కి తగినట్లు కొన్ని సీన్లు మార్చాలి. అందుకని రెండు మూడు రోజుల సమయం తీసుకుని కథకి మార్పులు, చేర్పులు చేసి గోపిచంద్‌కి వినిపించాను. ఆయన విన్నారు కానీ ఏ విషయం వెంటనే చెప్పలేదు. నాకేమో టెన్షన్.. ఇది కూడా

వర్క్ఔట్ అవుతుందా లేదా అనే సంశయంతో ఇంటికి వెళ్ళాను. ఏ ఫోన్ వచ్చినా అది గోపీచంద్ లేదా బుజ్జి గారి నుంచేమో నని టెన్షన్‌తో ఎదురుచూశాను. బాగా పొద్దుపోయాక బుజ్జిగారు ఫోన్ చేసి 'మొట్టమొదటి సెషన్‌తోనే హీరో గారిని పడగొట్టేశావ్ వాసూ..!' అన్నారు. అప్పటికి అమ్మయ్య అనిపించింది కానీ లోపలెక్కడో ఏదో సంశయం! బహుశా అంతవరకూ జరిగిన అనుభవాల ఫలితమేమో.!? కొన్ని సార్లు కలలు నిజమైనా ఈ నిజం భ్రమేమో ననిపిస్తుంది. అదో చిత్రమైన మనఃస్థితి, పరిస్థితి..!. సినిమాల్లో అవకాశాలు వచ్చినట్లే ఉంటాయి కానీ అన్నీ కుదరడానికి ఎన్నో కాంబినేషన్లు కలవాలి!!



గోపీచంద్ గారికి కథ నచ్చిందని తెలిశాక, బుజ్జిగారు, సురేష్ బాబు గారికి కూడా ఒక సారి కథ వినిపించమన్నారు. మళ్ళీ అగ్నిపరీక్ష..! అందరికీ కథ చెప్పడం ఒక ఎత్తు ఐతే సురేష్‌బాబు గారికి కథ చెప్పడం ఒక ఎత్తు. కథలోని ప్రతి అంశాన్నీ ఆయన సూక్ష్మంగా పరిశీలిస్తారు. లోటుపాట్లని ఇట్టేపట్టెయ్యగలరు. లోగడ సురేష్‌బాబుగారు కథలు వినేప్పుడు అయనతో కల్సి ఉన్న సందర్భాలు గుర్తున్నాయి. కథవినేప్పుడు ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో తెలుసు. అందుకని మళ్ళీ ఒక నెలరోజులు టైమ్ తీసుకుని కథమీద డిటెయిల్డ్‌గా పనిచేశాను. అప్పుడు సురేష్‌బాబు గారి వద్దకెళ్ళాను. ఇంటర్వెల్ సీన్ వరకూ వినగానే ఆయన ఎక్స్‌ట్రార్డనరీగా వుందని సర్టిఫికెట్ ఇచ్చారు. తమ వద్ద పనిచేసిన నేను, ఇంతమంచి కథ చెప్పే సరికి ఆయన హృదయపూర్వకంగా అభినందించి ఆశీర్వదించారు.

అందరి ఆశీస్సులతో 'లక్ష్యం' సినిమా ముహూర్తం 2006 అక్టోబర్ 25న జరిగింది. రెగ్యులర్ షూటింగ్ 2007 జనవరి 8 నుంచీ మొదలైంది.

మొట్టమొదటి షాట్ సికింద్రాబాదులోని కాలేజీలో తీశాము. తర్వాత తెలిసింది ..'శివ' సినిమా షూటింగ్ కూడా అక్కడే జరిగిందట. సినిమా షూటింగ్ సమయంలో ఎక్కడా కొత్తగా అనిపించలేదు. కెమేరా, డైరెక్షన్ అన్నీ అనుభవం ఉన్న డిపార్ట్‌మెంట్‌లే, కథమీద పూర్తి గ్రిప్ ఉంది. అన్ని విధాలా సహకరించే మంచి టెక్నీషియన్స్, ఆర్టిస్టులూ దొరకడం పెద్ద ఎస్సెట్! సినిమా తృప్తిగా వచ్చింది.

రిలీజ్ 2007 జూలై 5న. రిలీజ్ రోజు ఉదయం నేనూ, నా డైరెక్షన్ టీమ్ అందరంకలిసి, ఫిల్మ్ రీళ్ళు తీసుకుని చిలుకూరి బాలాజీ టెంపుల్‌కి వెళ్ళాం. నాకైతే అంత టెన్షన్ లేదు కానీ నా టీమ్ సినిమా విజయం కోసం నాకంటే ఎక్కువగా కోరుకున్నారు. హైదరాబాదు కంటే ముందుగానే ఏలూరులో షో వేశారు. మేము థియేటర్ సమీపిస్తుండగానే ఏలూరు నుంచి మిత్రుడొకరు ఫోన్ చేసి 'సినిమాని ఆడియన్స్ విపరీతంగా రిసీవ్ చేసుకుంటున్నారు..' అని చెప్పాడు.. సక్సెస్ వార్తని ముందుగానే అందుకుని థియేటర్‌లోకి వెళ్ళాం. ఇంటర్వెల్ సమయానికే హిట్ టాక్ వచ్చింది. దిల్ రాజుగారు ముందుగా ఫోన్ చేసి అభినందనలు చెప్పారు. ఇండస్ట్రీలో చాలా మంది ప్రశంసలందించారు. టివిలో ప్రమోషన్స్ చూసిన పాత మిత్రులు, బంధువులు ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు చేశారు. మా వూరునుంచీ అమ్మా, నాన్నా, చెల్లీ, అన్నయ్యా ఫోన్ చేసి అభినందించడం మరపురాని మధురానుభూతి!!

ఆ విధంగా నా మొదటి సినిమా 'లక్ష్యం'తో ప్రేక్షకులని మెప్పించగలిగాను. రిలీజ్ రోజున 10 వారాల సినిమా అన్నారు కానీ

శతదినోత్సవాలు చేసుకుని రివార్డుల సినిమాగా, నందీ బహుమతులు (తృతీయ ఉత్తమ చిత్రం, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్, ఉత్తమ సహాయనటుడుగా జగపతిబాబు గారు) అందుకుని అవార్డుల సినిమాగా, నా మొదటి సినిమా, మంచి అనుభూతిని మిగిల్చింది. మొదటి సినిమా ఇచ్చిన ఆనందం శాశ్వతంగా తీయని జ్ఞాపకంగా మిగిలిపోతుంది..!!

ప్రొఫెషన్ లైఫ్‌లో ఇలా నా లక్ష్యాన్ని అందుకోగలిగాను. వ్యక్తిగత జీవితంలో సాధించిన లక్ష్యాన్ని కూడ మీతో పంచుకోవాలి. ఇంట్లో వాళ్ళు ఎప్పటి నుంచో పెళ్ళి చేసుకోమని అడుగుతున్నా, సొంతంగా సినిమాకి దర్శకత్వం చేసేవరకూ పెళ్ళి చేసుకోనని చెప్పాను. అన్నమాట ప్రకారమే ‘లక్ష్యం‘ విజయం తర్వాత అమ్మా, నాన్నలు కుదిర్చిన సంబంధానికే ఒప్పుకున్నాను. మా వూరికి దగ్గరలోనే ఉన్న వంగలపూడికి చెందిన గద్దె గంగరాజు గారి అమ్మాయి లక్ష్మి, నా లక్ష్యానికి గుర్తుగా, జీవన సహచరిగా నా జీవితంలోకి ప్రవేశించింది.

అదండీ నా మొదటి సినిమా ప్రస్థానం.. ఈ విధంగా మనసులోని మాటలని మీతో పంచుకునే ఈ అవకాశాన్నిచ్చిన ‘కౌముది‘కి అభినందనలు..!



(జూలై 2010 సంచికలో ప్రచురితం)

# తాతినేని రామారావు

**'యమగోల', 'జీవనతరంగాలు, 'ఆలుమగలు','దేవుడు చేసిన పెళ్ళి'** ..తెలుగులో సూపర్ హిట్ చిత్రాలైతే 'అంధా కానూన్',' ముఝె ఇన్సాఫ్ చాహియే..' హిందీలో విజయఢంకా మ్రోగించిన చిత్రాలు. ఈ చిత్రాలను రూపొందించిన నిన్నటి తరం సీనియర్ దర్శకుడు శ్రీ తాతినేని రామారావు గారు. ఆ తరం మిగతాదర్శకులతో పోలిస్తే అతి చిన్న వయసులోనే, 27 ఏళ్ళకే, అలనాటి అగ్రహీరో అక్కినేని హీరోగా తొలిసినిమా రూపొంచిందిన ప్రత్యేకత రామారావు గారిది. తన గురువుగార్లు తాతినేని ప్రకాశరావు గారు, ప్రత్యగాత్మగారిలా, హిందీలో తెలుగువారి విజయకేతనాన్ని ఎగరేసిన ప్రత్యేకత కూడా రామారావు గారిది. తెలుగు హిందీ భాషల్లోకలిపి దాదాపు 70 చిత్రాలకి దర్శకత్వం వహించారు తాతినేని రామారావు గారు. సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ నటించిన అత్యధిక హిందీ సినిమాలకి దర్శకత్వం వహించిన దక్షిణ భారత దర్శకుడు రామారావు గారే. దర్శకుడిగా సినిమాలు తగ్గించుకున్నా తమిళంలో తన కుమారుడు నిర్మించే చిత్రాలకి సమర్పకుడిగా వ్యవహరిస్తూ,72 సంవత్సరాల వయసులో కూడా, చిత్రరంగంలో యాక్టివ్‌గా వుంటున్న ఆయనతో 'కౌముది' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు.

**మా సొంతవూరు** కృష్ణాజిల్లాలోని కపిలేశ్వరపురం అనే ఒక మాదిరి పల్లెటూరు. అమ్మా,నాన్నలు రాఘువయ్య,రాఘువమ్మ. నాన్నగారు 15 ఎకరాల భూస్వామి. వ్యవసాయమే ప్రధానవృత్తి. ఆ రోజుల్లో మధ్యతరగతి కుటుంబం కిందే లెక్క. మా అమ్మా, నాన్నల ముగ్గురు సంతానంలో నేనే పెద్దవాడిని. నా తర్వాత ఒక తమ్ముడు, ఒక చెల్లి. నేను 1938 లో పుట్టాను. బాల్యం, ప్రాథమిక విద్య అంతా కపిలేశ్వరపురంలోనే గడిచింది. నేను స్కూలుకి వెళ్ళడం మొదలుపెట్టిన కొత్తలో ఎనిమిదో తరగతి వరకూ ఉన్న మిడిల్ స్కూలు మాత్రమే ఉండేది మావూళ్ళో. తర్వాత అది హైస్కూలు స్థాయికి ఎదిగింది. అందువల్ల నా హైస్కూలు చదువుకూడా మా వూళ్ళోనే పూర్తయింది. స్కూలు రోజుల్లో ఏవో ఒకటి రెండు నాటకాలు వేశాను కానీ ఎక్కువగా ఆటల్లోనే ముందుండేవాడిని. ఆ నాటకాల్లో ఒకటి నార్ల వెంకటేశ్వరరావుగారు వ్రాసిన 'కొత్తగడ్డ'. ఎలా అలవాటైందో కానీ నాటికలో వేషం వేసేప్పుడు ఎక్స్‌టెంపోర్‌గా సంభాషణలు చెబుతూ, ఎప్పటికప్పుడు హావభావాలని నా అంతటనేను ఇంప్రూవ్ చేసుకుంటూ చేసేవాడిని. ఆరోజుల్లో నేనేదో పెద్దకళాకారుడ్ని అని చెప్పను కాని చిన్నతనం నుంచీ అలవాటైన ఎక్స్‌టెంపోర్‌నెస్ తర్వాత తర్వాత దర్శకత్వం చేసే సమయంలో ఉపయోగపడిందేమో అనుకుంటాను.



అక్కడ హైస్కూలు అయ్యాక ఇంటర్మీడియట్‌కి ఏలూరు సి.ఆర్.ఆర్. కాలేజీకి వెళ్ళాను. ఇంటర్ రెండో సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో తప్పడంతో మళ్ళీ సెప్టెంబర్‌లో వ్రాసి ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. ఆ సంవత్సరం ఇంక కాలేజీ సమయం అయిపోవడంతో మరుసటి సంవత్సరం కర్ణాటకలో ఇంజినీరింగ్ చదువుదామని వెళ్ళాను. అక్కడా 3-4 నెలలు ఉండి ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశానికి ప్రయత్నాలు చేశాను కానీ రాష్ట్రేతరుణ్ణి కావడం వల్ల అక్కడా సీటు రాలేదు. ఇంటికి తిరిగి వచ్చేసరికి కాలేజీలో డిగ్రీలో చేరే సమయంకూడా మించి పోయింది. మరో సంవత్సరం వృధా ఔతుందేమో అనుకుంటున్నప్పుడు మద్రాసులో ఉంటున్న మా కజిన్ బ్రదర్ తాతినేని ప్రకాశరావు వద్దనుంచీ కబురు వచ్చింది. ఇది 1956-57 ప్రాంతాల్లో జరిగింది.

అప్పటికే అన్నయ్య తాతినేని ప్రకాశరావు గారు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సక్సెస్‌ఫుల్ దర్శకుడిగా ఎస్టాబ్లిష్ ఐ వున్నారు. తనవద్ద దర్శకత్వ శాఖలో చేరడానికి రమ్మనమని పిలిచారు. ఇంట్లోవాళ్ళు కూడా సరే అనడంతో నేను మద్రాసు చేరుకున్నాను.

అప్పటికి అన్నయ్య దర్శకత్వంలో 'ఇల్లరికం' చిత్రం కోసం కథా చర్చలు జరుగుతున్నాయి. అన్నయ్య నన్ను ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ ఎ.వి.సుబ్బారావు గారికి పరిచయం చేశారు. ఆయనవద్దనే మూడో అసిస్టెంటుగా నా సినీ జీవితం మొదలైంది. సీనియర్ అసిస్టెంట్లు కె.ప్రత్యగాత్మ, కోగంటి గోపాలకృష్ణ గారు. 'ఇల్లరికం' కథ చర్చలకోసం నేనుకూడా రెగ్యులర్‌గా సదాశివబ్రహ్మం గారితో కూర్చుండేవాడిని.

ప్రకాశరావు గారు హిందీ చిత్రాలతో బొంబాయిలో బిజీగా ఉండేవారు. ఆయన మద్రాసులో లేని రోజుల్లో కొత్త సినిమాకి కావల్సిన ప్రి-ప్రొడక్షన్ పనులన్నింటినీ ప్రత్యగాత్మగారు దగ్గరుండి చూసుకునే వారు. ప్రత్యగాత్మగారి సోదరుడుకి, ప్రకాశరావుగారి సోదరిని ఇచ్చి ఉండడంతో వారి బంధుత్వం వల్ల నాకూ ప్రత్యగాత్మగారు బంధువే అయ్యారు. ఇందువల్లకూడా మొదటి సినిమాకే అన్ని విభాగాల్లోనూ ఇన్‌వాల్వ్ ఐ అనుభవం సంపాదించుకోడానికి మంచి అవకాశం లభించింది. కథని వెండితెరకి అనుగుణంగా ఎలా మార్చుకోవాలి, దృశ్య విభజన ఎలా ఉండాలి, స్క్రీన్ ప్లే అంటే ఏమిటి, షాట్ డివిజన్.. ఇలా అన్ని విషయాలనీ కూలంకషంగా నేర్చుకునే అవకాశం మొదటి సినిమాలోనే లభించింది. యూనిట్ వాళ్ళందరూ ప్రతి సీన్‌లోనూ క్రియేటివిటీ గురించి ఆలోచించేవారు.

సాధారణంగా చివరి అసిస్టెంట్ అంటే ఏమీ ప్రాధాన్యత లేని పనులు అప్పచెబుతారు. నా విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. నిర్మాత సుబ్బారావుగారు కూడా బాగా పరిచయం అవడం వల్ల ఆయన కారులోనే షూటింగ్‌కి వెళ్ళిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయన నన్ను ఎంతో అభిమానంగా చూసుకునే వారు. ఆ సంస్థలో చేరిన కొన్ని రోజులతర్వాత నెలకి 100 రూపాయలు జీతం ఇవ్వడం మొదలెట్టారు.

'ఇల్లరికం' చిత్రనిర్మాణం మధ్యలో నాగేశ్వరరావుగారి కాలికి దెబ్బతగలడం వల్ల నాలుగు నెలలు ఆలశ్యం అయింది. అలా ..అలా.. సినిమా షెడ్యూలు సంవత్సరంన్నర సాగింది. రిలీజయ్యాక'ఇల్లరికం' హిట్ అయి చాలా కేంద్రాల్లో శతదినోత్సవాలు చేసుకుంది.

దాని తర్వాత ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నిర్మించిన చిత్రం 'భార్యాభర్తలు'. అంతకు ముందు వరకూ దర్శకత్వ శాఖలో సహాయకుడిగా ఉన్న ప్రత్యగాత్మగారిని 'భార్యాభర్తలు' సినిమాతో దర్శకుడిగా ప్రమోట్ చేశారు. ఆ రోజుల్లో 'భార్యాభర్తలు' ఆఫ్ బీట్ సబ్జెక్టుతో నిర్మించబడింది. హీరోని ఆడపిల్లల చుట్టూ తిరిగే జల్సా కుర్రాడిగా చూపించడాన్ని ప్రేక్షకులు ఎలా తీసుకుంటారో అని అనుమానం వచ్చింది కానీ సినిమా విడుదలై ఘనవిజయం సాధించింది. కేంద్రప్రభుత్వం నుంచీ ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఎవార్డుని కూడా అందుకుంది. ఈ సినిమాకి నేను ఫస్ట్ అసోసియేట్‌గా చేశాను. తర్వాత 'కులగోత్రాలు','పునర్జన్మ','మనుషులు-మమతలు' చిత్రాలకి కూడా ప్రసాద్ అర్ట్ పిక్చర్ లోనే దర్శకత్వశాఖలో కొనసాగాను.

నాసినిమా కెరీర్ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో మొదలవడం నా అదృష్టమని చెప్పుకోవాలి. అలాంటి సంస్థలు ఎన్నో ఉత్తమమైన విలువలని పాటించేవి. నిర్మాణ యూనిట్‌లోని సభ్యులమందరమూ కుటుంబసభ్యుల్లా ఉండేవాళ్ళం. అందరికీ ఉన్న ధ్యేయం ఒక్కటే - సంస్థ తీసిన సినిమా ఏదైనా సరే విజయవంతం కావాలి. అది ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నట్లు కలిసి మెలిసి పనిచేసేవాళ్ళం.

ప్రకాశరావుగారి తర్వాత ప్రత్యగాత్మగారిని దర్శకుడిగా ప్రమోట్ చేసినట్లే, 'మనుషులు-మమతలు' తర్వాత నన్ను దర్శకుడిగా ప్రమోట్ చెయ్యడానికి ఎ.వి.సుబ్బారావుగారు నిర్ణయం తీసుకున్నారు. ఆ విధంగా 1965లో అంటే నా 27వ సంవత్సరంలోనే దర్శకుడ్నయ్యే అదృష్టం లభించింది. ఆ సినిమా 'నవరాత్రి'.

ఈ సినిమాకి మాతృక సావిత్రి, శివాజీ గణేశన్ నటించిన ఒక తమిళ సినిమా. దాని రీమేక్ హక్కులు సావిత్రిగారి వద్దనే ఉన్నాయి. ఆ సినిమా చూసిన మా ఎడిటర్ కృష్ణస్వామిగారి సలహా మీద కాస్త తెలుగుతనాన్ని జోడించి, నాగేశ్వరరావుగారికి సరిపోయేలా ట్రీట్‌మెంట్ తయారు చేశాం. కథ, కథనం నాగేశ్వరరావుగారికి, సుబ్బారావుగారికీ కూడా నచ్చింది. ముళ్ళపూడి వెంకట రమణగారు మాటలు, టి.చలపతి రావుగారు సంగీతం, అక్కినేనిగారు, సావిత్రి, జగ్గయ్య, రేలంగి, గుమ్మడి లాంటి సీనియర్ నటీనటులు...ఐనా నాకేమీ కొత్తగా అనిపించలేదు. ఎందుకంటే అప్పటివరకు నేను అసిస్టెంటుగా చేసిన సినిమాలన్నీ నాగేశ్వరరావు గారితోనే, పైగా చిత్రనిర్మాణ సంస్థా మాతృసంస్థే. సుబ్బారావు గారూ మమ్మల్ని అలానే చూసే వారు, మేమూ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ అంటే మా సంస్థే అనుకుంటూ అంకితభావంతో పనిచేసే వాళ్ళం. 'నవరాత్రి' నిర్మాణం స్మూత్‌గా సాగిపోయింది.

1966 ఏప్రిల్ 22న విడుదలైంది. ఆ రోజుల్లో సినిమా విడుదల అంటే పంపిణీదారుల ఆఫీసులో పెద్ద పండుగలా ఉండేది. నవయుగ పంపిణీ దారులు 'నవరాత్రి'ని విడుదల చేశారు. అన్ని సినిమాల్లానే మేమూ మా సినిమా చూడడానికి విజయవాడ వెళ్ళాం. అక్కడ నుంచీ బందరు, ఏలూరు సెంటర్లకి కూడా వెళ్ళి ప్రేక్షకుల స్పందన పరిశీలించాము. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని సెంటర్లనుంచి నవయుగ ఆఫీసుకి కలెక్షన్ల ఫీడ్ బ్యాక్ తెలియచేస్తూ ఫోన్లు వచ్చేవి. ఆంధ్రా ఏరియాలో 25 సెంటర్ల వరకూ ఉండేవి. సీడెడ్ లో మరో ఐదారు సెంటర్లుండేవి.

సినిమా పెద్ద హిట్ అని చెప్పను కానీ, అప్పటి ట్రెండ్‌కి భిన్నంగా సాగిన చిత్రంగా ప్రేక్షకులు గుర్తించుకున్నారు. మొదటి సినిమా దర్శకుడిగా నాకు మంచి మార్కులే వేశారు. రెండో సినిమా కూడా నాగేశ్వరరావు గారితోనే చేశాను. అక్కినేని, జయలలిత జంటగా నటించిన 'బ్రహ్మచారి' సినిమా అది. బాగా విజయవంతమైంది. అదే సంవత్సరంలో మరో రెండు సినిమాలు 'నడమంత్రపు సిరి',' చల్లని నీడ' కూడా విడుదలయ్యాయి. అవి ఒక మాదిరిగా ఆడాయి. మళ్ళీ నాగేశ్వరరావు గారితో 'సుపుత్రుడు','రైతు

కుటుంబం',' మరపురాని మనిషి','భలేరంగడు','ఆలుమగలు'.. మొదలైన సినిమాలతో సక్సెస్‌ఫుల్ దర్శకుడిగా నిలదొక్కుకున్నాను.

మాతృసంస్థ పి.ఎ.పి లో నేనూ, ప్రత్యగాత్మగారూ ఒకరి తర్వాత ఒకరుగా సినిమాలు చేస్తుండేవాళ్ళం. పి.ఎ.పి కే 10-11 సినిమాలవరకూ చేశాను. హిందీలో కూడా పి.ఎ.పి కి నాలుగు సినిమాలు చేశాను. ఎన్టీఆర్‌గారితో చేసిన మొదటి సినిమా 'యమగోల' ఘనవిజయం గురించి వేరే చెప్పనవసరం లేదుకదా. అదే సంవత్సరం అక్కినేని గారికి 'ఆలుమగలు' హిట్ చిత్రం. ఒకే సంవత్సరంలో అక్కినేని, ఎన్టీఆర్ ఇద్దరికీ సూపర్ హిట్ చిత్రాలందించడం ఒక మరపురాని అనుభవం. నా దర్శకత్వంలో వచ్చిన 'రైతుకుటుంబం' చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరించిన అట్లూరి పూర్ణచంద్రరావు గారూ , నేనూ కలిసి మూడు సినిమాలు నిర్మించాము. వాటిల్లో 'దేవుడు చేసిన పెళ్ళి' పెద్ద హిట్ ఐంది.

హిందీ చిత్రరంగంలోని విజయాలని కూడా ఈ సందర్భంలో గుర్తుచేసుకోవాలి. 'యమగోల'కి హిందీ వెర్షన్ 'లోక్ - పర్ లోక్' సరిగా ఆడలేదుకానీ 'ఆలుమగలు'కి హిందీ వెర్షన్ 'జుదాయి' సిల్వర్ జూబిలీ ఐంది. అదే వరుసలో 'కార్తీక దీపం', మరో తమిళ చిత్రం హక్కులు తీసుకుని హిందీలో దర్శకత్వం చేశాను. అవీ సిల్వర్ జూబిలీ సినిమాలయ్యాయి. ఇంక 1983లో వచ్చిన 'అంధాకానూన్' విజయం హిందీ చిత్రరంగంలో నన్ను ఊహించని స్థాయికి తీసుకెళ్ళింది. ఆ పరిస్థితుల్లో అటో కాలూ, ఇటూ కాలూ వెయ్యలేక హిందీలోనే ఎక్కువ సినిమాలకి దర్శకత్వం వహించాను. మధ్య, మధ్యలో పి.ఎ.పి కి ఒకటి రెండు సినిమాలు చేశాను.

తెలుగు, హిందీ సినిమా రంగాల్లో చాలామందికి దొరకని అరుదైన అవకాశాలు దొరికాయి నాకు. అందుకు చాలా అదృష్టవంతుడ్ననుకుంటూ ఉంటాను. ఎన్టీఆర్ - బాలకృష్ణ , దర్మేంద్ర - సన్నీ, సునీల్ దత్ - సంజయ్ దత్.. ఇలా రెండు తరాల వారినీ డైరెక్ట్ చేసే అవకాశం వచ్చింది. అలానే హిందీలో అరుదైన మల్టీ స్టారర్ సినిమాలు చేసే అవకాశం కూడా వచ్చింది

2000 సంవత్సరంలో విడుదలైన 'బులంది' హిందీ చిత్రం తర్వాత దర్శకత్వానికి దూరంగా ఉన్నాను. కాలం మారింది, ప్రేక్షకుల అభిరుచులూ, చిత్ర నిర్మాణంలోని అలవాట్లూ కూడ బాగా మారిపోయాయి. ప్రస్తుతం మద్రాసులోనే ఉంటున్నాను. మా అబ్బాయి అజయ్ నిర్మిస్తున్న తమిళ సినిమాలకి సమర్పకుడిగా వ్యవహరిస్తూ బిజీగా ఉంటున్నాను.

50 సంవత్సరల క్రిందటి విశేషాలని మళ్ళీ ఒకసారి నెమరువేసుకునే అవకాశాన్ని కలిగించిన 'కౌముది'కి అభినందనలు తెలియచేస్తున్నాను.

(ఆగస్టు 2010 సంచికలో ప్రచురితం)

# తాతినేని సత్య

**ఇటీవలే విడుదలై** మంచి ఫీల్ ఉన్న సినిమాగా పేరు తెచ్చుకున్న చిత్రం 'భీమిలి కబడ్డీ జట్టు'. తమిళ మాతృకకి పునర్నిర్మాణమే ఐనా, ఆ కథని తెలుగు వారి జీవనశైలికి దగ్గరగా తీసుకురావడంలో దర్శకుడు ప్రదర్శించిన ప్రతిభను అందరూ మెచ్చుకున్నారు. సెన్సిటివ్ చిత్రాలు రూపొందించే సత్తా ఉన్న యువదర్శకుడు తెలుగు చిత్రరంగంలో విజయవంతంగా తొలి అడుగు వేశాడని పలువురు ప్రశంసించారు. ఈ యువదర్శకుడు తాతినేని సత్య (తాతినేని సత్యప్రకాష్)తో 'కౌముది' ప్రత్యేక ఇంటర్వ్యూ . చెప్పుకోవాలంటే సత్యగారి తాత, తండ్రి ఇద్దరూ విజయవంతమైన బహుభాషాదర్శకులే. బలమైన చిత్రనేపథ్యం ఉన్నప్పటికీ, దాన్ని ఊతకర్రగా చేసుకోకుండా, సత్య గారు 'మొదటి సినిమా' దర్శకత్వానికి సొంతకాళ్ళమీదే ప్రయాణించారు. ఆసక్తికరమైన అ విశేషాలు సత్యగారి మాటల్లోనే తెలుసుకుందాం. ఫేస్‌బుక్‌లో మెసేజ్ పంపించగానే ఇంటర్వ్యూకోసం సమయం కేటాయించిన సత్య గారికి 'కౌముది' కృతజ్ఞతలు తెలియచేస్తోంది.



**నా పూర్తి పేరు తాతినేని సత్యప్రకాష్.** నాన్న గారు తాతినేని లక్ష్మీవర ప్రసాద్, అమ్మ స్వరూప. అక్క నాగలక్ష్మి చరిత నాకంటే మూడేళ్ళు పెద్ద. (అక్క, బావ గార్లు ,ప్రస్తుతం, అట్లాంటాలో డాక్టర్లుగా పనిచేస్తున్నారు..)

నా బాల్యం గురించి చెప్పడానికి ముందు, నా కుటుంబ నేపథ్యం గురించి కొంత చెప్పుకోవాలి. మా తాతగారు తాతినేని ప్రకాశరావు గారు. మూడు దశాబ్దాల పైగా తెలుగు, హిందీ, తమిళ చిత్రరంగాల్లో అనేకమైన విజయవంతమైన చిత్రాలకి దర్శకత్వం వహించారు. మూడు భాషల్లోనూ అగ్రస్థాయి తారలందరితో 50 పైగా చిత్రాలని రూపొందించి తనకంటూ ఒక ప్రత్యేకతని సొంతం చేసుకున్నారు. తర్వాత మా నాన్నగారు తాతినేని లక్ష్మీవరప్రసాద్‌గారు (టి.ఎల్.వి. ప్రసాద్). ఆయన శైలిలో నాన్నగారూ బహుభాషా చిత్రాల దర్శకుడిగా పేరుతెచ్చుకున్నారు. అతి తక్కువసమయంలో అంటే ఏడేళ్ళ (1995-2002)లో ఒకే హీరో మిథున్ చక్రవర్తితో 26 హిందీ సినిమాలకి దర్శకత్వం వహించినందుకుగాను నాన్నగారికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు కూడా లభించింది. ఐతే ఈ విజయాల వెనుక పేరు ప్రఖ్యాతుల వెనుకా కృషీ, పట్టుదలా.. ఎత్తుపల్లాలు కూడా ఉన్నాయి.

నాకు మూడేళ్ళ వయసున్నప్పుడే బాలనటుడిగా తాతగారు నిర్మించిన 'ఆశాజ్యోతి' చిత్రంలో నటించాను. మురళీమోహన్‌గారు హీరో. పేరు గుర్తులేదుగానీ దాని తర్వాత మరో సినిమాలో కూడా బాలనటుడిగా చేశాను. చిన్నప్పటినుంచీ చదువుమీద అంతగా ఆసక్తి ఉండేది కాదు. తాతగారు, నాన్నగారు ఇద్దరూ దర్శకులవడంతో నాకు ఊహ తెలిసేప్పటికే చుట్టూ సినిమా వాతావరణం ఉండేది. అందువల్లనేమో నాకు చిన్నప్పటినుంచే సినిమాలంటే ఇంట్రెస్టు ఎక్కువగా ఉండేది. చిన్నప్పుడు మార్కులు సరిగా రావడం లేదని

అమ్మవాళ్ళూ మందలిస్తున్నా తాతగారు మాత్రం 'ఏం ఫరవాలేదు. వీడు పెద్దవాడయ్యాక గొప్ప డైరెక్టరై నా పేరు నిలబెడతాడు..' అంటుండే వారు.

నేను ఎలిమెంటరీ స్కూలు స్థాయిలో ఉన్నప్పటికే, నాన్నగారు తెలుగులో దాదాపు 26 సినిమాలకి దర్శకత్వం చేశారు. ఎన్టీఆర్, ఎ.ఎన్నార్, బాలకృష్ణ, చిరంజీవి.. మొదలైన అగ్రస్థాయి హీరోలందరితో సినిమాలు తీశారు. నాకు పది పన్నేండేడ్ల వయసున్నప్పుడు తాతగారు ప్రకాశరావు గారు కన్నుమూశారు. మొదటిసారిగా కన్నీరు, విషాదం..ఎలా వుంటాయో అప్పుడే తెలిసింది. నేను సినిమాల్లోకి రావడానికి నాన్నగారికి ఇష్టంగానే ఉండేది కానీ, అమ్మగారికీ, బంధువులెవ్వరికీ నేను సినిమారంగం వైపు వెళ్ళడం అస్సలు ఇష్టంలేదు. నన్ను ఇంజినీరింగ్ వైపు మళ్ళించాలని పట్టుబట్టి అమ్మ నన్ను ఎం.పి.సిలో చేర్పించారు. టెంత్‌లో ఏ సెకండ్ క్లాసో వచ్చి ఉంటే బి.కామ్ లాంటి కోర్సుకి వెళ్ళేవాడిని కదా అని ఫీలౌతుండే వాడిని.. ఇది గమనించిన నాన్నగారు నా కిష్టమైన కోర్సు వైపే వెళ్ళమన్నారు.

మద్రాసు లయోలా కాలేజీలో బి.ఎస్సీ. విజువల్ కమ్యునికేషన్స్ డిగ్రీలో చేరాను. చిత్రరంగం వైపు రావడానికి నాకా కోర్సే మొదటి పునాది. ఆ కోర్సులో సీటు రావడం చాలా కష్టంగా ఉండేది ఆ రోజుల్లో. ఇంట్లో వున్న హాండీ కామ్‌తో షార్ట్‌ఫిల్మ్స్ తీసి పోర్ట్‌ఫోలియో సమకూర్చుకోవడంతో మెరిట్ మీద సీటు తెచ్చుకోగలిగాను. ఆ కోర్సులో పత్రికలకి వెళ్ళేలనుకునేవాళ్ళు, టి.వి.లకి వెళ్ళాలనుకునేవాళ్ళు, సినిమాల్లోకి వెళ్ళాలనుకునేవాళ్ళు.. ఇలా అన్ని రకాల మీడియా వాళ్ళు ఉండేవాళ్ళు. మూడేళ్ళు ఆ కోర్సుపూర్తిచేశాక, ఢిల్లీలోని మార్వా



ఇన్స్‌టిట్యూట్‌లో ఫిల్మ్ డైరెక్షన్‌లో షార్ట్ టర్మ్ కోర్సులో చేరాను. అది ఆరునెలల కోర్సు. అది కూడా విజయవంతంగా పూర్తిచేశాను. అది 2001 సంవత్సరం..ఇంక సినీరంగంలో ప్రవేశం సంపాదించి దర్శకత్వశాఖలో ఎదగాలి. అదీ లక్ష్యం..!

అప్పటికి నాన్నగారు బొంబాయిలో మంచి డిమాండ్ ఉన్న డైరెక్టర్‌గా వున్నారు. చాలాసార్లు ఆయనతో షూటింగ్‌లకి వెళ్ళడం కూడా చిన్నతనం నుంచే అలవాటు. నాన్నగారి దర్శకత్వ శైలినుంచీ ఎక్కువగా ప్లానింగ్, ఎక్జిక్యూషన్‌లో ఎలా జాగ్రత్తగా ఉండాలో మంచి అవగాహన వచ్చింది. సొంతంగా కెరీర్ మొదలు పెడదామనుకుంటున్నప్పుడు వేరే దర్శకుడి దగ్గర పనిచేస్తే మరింత ఎక్స్‌పోజ్ ఉంటుందని అనుకున్నాను. బొంబాయి వెళ్ళి నాన్నగారితో ఇదే విషయం చెప్పాను. "ఎవరి వద్ద చేరాలనుకుంటున్నావో చెప్పు. నేనే మాట్లాడి పంపిస్తాను.." అన్నారు. ఐతే రెండు డిగ్రీలు చదివాను కదా..ఆ మాత్రం అవకాశాలు వస్తాయిలే అని ఒక్కింత ఎక్కువగానే ఆత్మవిశ్వాసం ఉండడంతో " నేను సొంతంగా ట్రై చేస్తానులే.." అని చెప్పి నా ప్రయత్నాలు మొదలు పెట్టాను.

నాన్నగారు షూటింగ్‌కోసం ఊటీ వెళ్ళిపోయారు. నేనొక్కడినే బొంబాయిలో ఉండి అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. దిగితే గానీ లోతు తెలీదన్నట్లుగా, వాస్తవం ఎంత క్లిష్టంగా ఉంటుందో అప్పుడు తెల్సింది. నాకు చాలా ఇష్టమైన బాలీవుడ్ దర్శకుడు అబ్బాస్ మస్తాన్. ఆయన దర్శకత్వంలో వచ్చిన బాజీగర్ లాంటి సస్పెన్స్ సినిమాలకి అప్పటికే నేను పెద్ద ఫాన్‌ని. తాతగారు, నాన్నగారు పేరు చెప్పకోకుండా బ్రేక్ తెచ్చుకోవాలని పట్టుదల. రెండు నెలలపాటు అబ్బాస్ మస్తాన్ గారి చుట్టు

తిరిగాను. అప్పటికే ఆయన వద్ద చాలా మంది సహాయకులు ఉన్నారు. నేను ఏమాత్రం రికమండేషన్ లేని వాడిని, పైగా సౌత్ ఇండియన్‌ని. ..రకరకాల అంశాలు, వాటి పరిమితులు అప్పుడు అర్థమయ్యాయి. రెండు నెలలు గడిచినా ఫలితం లేదు.

నాన్నగారు షూటింగ్ నుంచీ తిరిగొచ్చారు. నా నిస్సహాయతని వెలిబుచ్చాను. నాన్నగారికి పరిస్థితి అర్థమైంది. తనకి బాగా పరిచయం ఉన్న డేవిడ్ ధావన్‌గారి వద్దకి పంపించారు. ఆయన బాగానే రిసీవ్ చేసుకున్నారు. ఐతే అప్పటికే అయన వద్ద చాలా మంది అసిస్టెంట్లు ఉండడంతో కొంతకాలం ఆగాలని చెప్పారు. ఐనా రోజూ వెళ్ళి కలుస్తుండే వాడిని. ఆయనకి సౌత్ ఇండియన్ సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగు, తమిళ సినిమాల కేసెట్లు చూసి ఆయనకి కథలు వివరంగా చెప్పడం.. అదీ అప్పటి నా వ్యాపకం. అలా మూడు నెలలు గడిచాక డేవిడ్ ధావన్, నాకు జీతంలేని అప్రెంటిస్‌గా అవకాశం ఇచ్చారు. అప్పటికే నిర్మాణంలో ఉన్న 'తుమ్ కి ఝూట్ నై బోల్తా' సుస్మితాసేన్, గోవిందాల సినిమా. చిత్రరంగంలో అఫీషియల్ గా నేను పనిచేయడం మొదలుపెట్టిన మొదటి సినిమా అదీ. ఆ సినిమా నిర్మాణం చివరి దశలో ఉండగా నన్ను ఆయన చివరి అసిస్టెంటుగా ప్రమోట్ చేశారు. అదే సంజయ్ దత్, గోవిందాల 'జోడి నంబర్ 1'. డేవిడ్ ధావన్ అప్పట్లో ఎంత బిజీగా ఉండేవారంటే ఒకేసారి రెండు మూడు సినిమాలకి దర్శకత్వం చేస్తుండేవాళ్ళు. జోడీ నంబర్ 1కి చివరి అసిస్టెంట్ డైరెక్టర్ పనిచేయడం మొదలుపెట్టినప్పుడే మొట్టమొదటి రెమ్యునరేషన్ అందుకున్నాను.

నాకింకా గుర్తుంది.. గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద జోడీ నంబర్ 1 షూటింగ్ జరుగుతుండగా 300 రూపాయలు ఇచ్చారు. నాకది చాలా అపురూపంగా అనిపించింది. మొట్టమొదటి సంపాదన వెంటనే ఖర్చు పెట్టదలుచుకోలేదు. ఆ షూటింగ్ స్పాట్ నుంచీ నేనుంటున్న మల్లాడ్ 70 కిలో మీటర్లు ఉంటుంది. టేక్సీలో వెళితే నాకొచ్చిన 300 ఐపోతాయి. అందుకని అక్కడినుంచి కెమేరా వేన్‌లో జుహూ వరకూ వెళ్ళాను. అక్కడ ఒక స్కూటర్ అతన్ని లిఫ్ట్ అడిగి గురేగాంవ్ లో దిగాను. అక్కడనుంచీ దాదాపు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ రూముకి చేరుకున్నాను. 2002 ఫిబ్రవరిలో జరిగిన ఈ సంఘటన నాకింకా నిన్నా మొన్నటి సంఘటనలా గుర్తుండి పోయింది.



అలా డేవిడ్ జీ వద్ద మొదలైన సినీ జీవితం ఐదేళ్ళు కొనసాగింది. అంచలంచెలుగా ఎదుగుతూ 2006లో ఛీఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నాను. ఆయన కామెడీ సీన్లు పండించే టెక్నిక్ చాలా కొత్తగా ఉంటుంది. ప్రాథమికంగా ఎడిటర్ కావడంతో డేవిడ్ జీ వద్దనే ఎడిటింగ్ గురించి కూడా క్షుణ్ణంగా నేర్చుకున్నాను. ఆర్టిస్టుకున్న బలాబలాలను బట్టి సీను ఎలా రక్తికట్టించాలో కూడా అర్థమయింది. సీన్ పేపర్లో ఏది వున్నా ఆర్టిస్ట్ మేనరిజమ్స్ బట్టి సీను మారుతుండేది. ఈ విధంగావిజయవంతమైన సినిమా ఫార్ములాలు చాలా నేర్పారు డేవిడ్ జీ. ఐదేళ్ళలో ఎనిమిది సినిమాలకి అక్కడ పనిచేశాను.

చివరి సినిమా ముఝ్ సె షాదీ కరోగీ, హైదరాబాదులోని ఫిల్మ్‌సిటీలో జరిగింది. ఆ షూటింగ్ చివరిరోజే డేవిడ్ జీతో చెప్పాను.. మద్రాసు వెళ్ళి సొంతంగా డైరెక్ట్ చెయ్యడం కోసం ప్రయత్నాలు చెయ్యాలని ఉందని. నా నిర్ణయాన్ని మొదటిసారే వింటున్నా ఆయన సంతోషంగా ఒప్పుకున్నారు. ఇది జరిగింది ఒక రెస్టారెంట్‌లో. అయన శిష్యరికానికి గుర్తుగా అక్కడే ఒన్న ఒక క్లాత్ మీద అయన సంతకం తీసుకున్నాను. ఇప్పటికీ క్లాత్‌ని మా ఇంట్లో భద్రంగా ఉంచుకున్నాను. అలా నా దర్శకత్వ ప్రవృత్తికి బలమైన పునాది వేసింది డేవిడ్ ధావన్ గారే. ఆయనతో కలిసి పనిచేసిన రోజులు తలచుకుంటే నా కెంతో గర్వంగా ఉంటుంది. ఇప్పటికీ అప్పుడప్పుడూ ఫోన్ చేసి క్షేమ సమాచారాలు కనుక్కుంటూ ఉంటారు. ఇది నాకు ఎంతో ఆనందాన్నిచ్చే విషయం.

అలా డేవిడ్ జీకి చెప్పాక మద్రాసు ఇంటికి వచ్చేసి నాన్నగారితో కూడా నా నిర్ణయం చెప్పాను. 2006 డిసెంబర్ ప్రాంతాల్లో జరిగిందిది.

అప్పటినుంచీ స్క్రిప్టులు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను. అప్పటికి డాడీ లండన్‌లో లో బడ్జెట్ హిందీ సినిమాలు చేస్తున్నారు. సబ్సిడీ స్కీములో నిర్మించబడే సినిమాలవి. షూటింగ్ అంతా 25 రోజుల్లో ఐపోవాలి. నా సొంత ప్రయత్నాలు కొనసాగుతుండగానే ఖాళీగా ఉండకుండా తన వద్ద పనిచేయమని డాడీ అడిగారు. బడ్జెట్ కంట్రోల్, స్పీడ్‌గా షూటింగ్ చెయ్యడం లాంటి ప్రొడక్షన్ కాస్ట్ సేవింగ్ టెక్నిక్స్ అన్నీ నాన్న గారి వద్దనే నేర్చుకోవాలి. అలా ఆయన వద్ద 3 సినిమాలకి పనిచేశాను. డేవిడ్ గారి స్కూలుకి నాన్న గారి స్కూలుకి చాల దగ్గర పోలికలున్నాయి. తేడా ఏమిటంటే డేవిడ్ గారికి పెద్ద స్టార్స్ తో చేసే అవకాశం వచ్చింది. నాన్నగారి కది రాలేదంతే.

లండన్ షూటింగ్స్ అయ్యాక నాన్నగారిని అడిగాను..

"డాడీ..వేరే ప్రొడ్యూసర్ వద్దకి వెళ్ళేకంటే, మీరే ప్రొడ్యూస్ చెయ్యండి నా మొదటి సినిమాని.."

"సత్యా..తండ్రిగా నీ కోరిక అర్థం చేసుకోగలను. కానీ నిర్మాతగా నేనేదో బలవంతంగా నిన్ను నిలబెట్టినట్లుండకూడదు. వేరే నిర్మాతల వద్ద సామర్థ్యాన్ని నిరూపించుకుంటేనే నీ విలువ ఏమిటో నీకూ, ప్రపంచానికీ కూడా తెలుస్తుంది...." అని చెప్పారు. ఆయన చెప్పిన పాయింట్ కూడా సబబే అనిపించింది.

నిర్మాతలని కలవాలంటే కథలుండాలి కాబట్టి స్క్రిప్టుల మీద పనిచేయడం మొదలుపెట్టాను.

అదే సమయంలో నాకు హైదరాబాదుకి చెందిన రత్నతో వివాహం జరిగింది. ఇది నా జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. కొత్త బాధ్యతలు ..29- 30 సంవత్సరాలు వచ్చాక కూడా అమ్మానాన్నల మీద ఆధారపడడం కంటే ఎంత త్వరగా సెటిల్ ఔదామా అన్న తపన మొదలైంది. నా ప్రయత్నాలు కొనసాగుతుండగానే 2008 సెప్టెంబర్‌లో నేను తండ్రిని కాబోతున్నానని తెలిసింది. మరిన్ని అదనపు బాధ్యతలు నా కర్తవ్యాన్ని గుర్తు చేశాయి. అప్పుడే మనసులో అనుకున్నాను.. మేమిద్దరం ముగ్గురం కావడానికి తొమ్మిది నెలలు టైముంది. ఎలాగైనా సరే పాపో, బాబో పుట్టేసరికల్లా నేను డైరెక్టర్‌గా సైనప్ చేసితీరాలి. ఆ దిశగా తీవ్రంగా ప్రయత్నాలు మొదలెట్టాను. ఆ సమయంలో నా భార్య రత్న నాకిచ్చిన ప్రోత్సాహం, తోడ్పాటు మరచిపోలేనిది. నామీద నాకంటే రత్నకే ఎక్కువ నమ్మకం ఉండేది!

నేను తయారు చేసుకున్న స్క్రిప్టుతో ఆర్.బి.చౌదరి గారిని కలవడానికి ప్రయత్నాలు చేశాను. ఆయన సమయం కుదిరి నా స్క్రిప్టు వినడానికి నెలరోజులు పట్టింది. స్క్రిప్టు వినేంతవరకూ నేను టి.ఎల్.వి.ప్రసాద్‌గారి అబ్బాయినని తెలీదు. ఆ విషయం తెలిశాక నన్ను మరింత శ్రద్ధగా చూడడం మొదలుపెట్టారు. నాన్నగారు పేరుకున్న పవర్ అప్పటి వరకూ గమనించలేకపోయాననుకుంటాను. చౌదరిగారు ఏ విషయం చెప్పలేదు. రెండు మూడు నెలలు గడిచాయి. నా అంతట నేను పెట్టుకున్న గడువు తొమ్మిది నెలల్లో దాదాపు 3 నెలలు గడిచిపోయాయి.

అప్పుడే తమిళంలో వెన్నెల కబడ్డీ సినిమా విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. చౌదరిగారు ఆ సినిమా గురించి నా అభిప్రాయం అడిగారు. తెలుగులో ఎడాప్ట్ చేసుకోడానికి బావుంటుందని చెప్పాను. ఐతే అప్పటికే నా సొంత స్క్రిప్టు అయన వద్ద ఉంది కాబట్టి, ఈ తమిళ రీమేక్‌కి వేరే డైరెక్టర్‌ని పెట్టుకుంటార్లే అనుకుని 'నాకు మీ ప్రొడక్షన్ లో ఈ సినిమాకి అసోసియేట్‌గా చేసే అవకాశం ఇవ్వండి. నా వర్కింగ్ స్టైల్ చూశాక నాకు డైరెక్టర్‌గా అవకాశం ఇద్దురు గాని' అన్నభావం వ్యక్తపరిచాను. ఐతే 'నువ్వే దీనికి డైరెక్టర్‌వి' అన్నప్పుడు ఆశ్చర్యానందాలు కలిగాయి. నా మొదటి సినిమా రీమేక్ ఔతుందని ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఇప్పుడు ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్ళీ ఎన్ని రోజులు పడుతుందో తెలీదు అనుకుని వెంటనే ఒప్పుకున్నాను. అది మెగాసూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్

మీద తీసేది కాబట్టి మిగతా నిర్మాతలిద్దరినీ కూడా ఒప్పించాలి. వాళ్ళు సరే అంటే ప్రాజెక్టు మొదలుపెడదాం అన్నారు చౌదరి గారు. ఆ విధంగా 2009 మార్చిలో హైదరాబాదు వచ్చాను. ఎన్.వి.ప్రసాద్ గారిని, పారస్ జైన్ గారిని కలిశాను.



ఇక్కడ నా గురించిన ఒక నిజం ఒప్పుకోవాలి. సహజంగా మాటకారిని కాదు. పని విషయంలో, క్రియేటివిటీ విషయంలో నన్ను నేను చాలా సార్లు నిరూపించుకోగలను కానీ కాస్త షై ఫీలింగ్ ఉంటుంది.. సరే శాంపిల్ వర్క్‌తోనైనా నన్ను నేను నిరూపించుకోవాలి కాబట్టి, నేనే ముందుకి వెళ్ళి, కబడ్డీ జట్టు సభ్యులకోసం కొంతమందిని ఆడిషన్ చేశాను. వాళ్ళతో కొన్ని ఫోటో షూట్‌లు చేశాను. అప్పటికింకా హీరోని ఎవర్నీ ఫైనలైజ్ చెయ్యలేదు. నా ఫోటోనే హీరో ప్లేసులో పెట్టి. మిగతావాళ్ళతో కలిసి కొన్ని పోస్టర్ డిజైన్స్ చేసి ప్రసాద్ గారికి, పారస్ జైన్ గారికి చూపించాను. నా ఎప్రోచ్ ఏమిటో తెలియచేసే ప్రయత్నం అది. పారస్ జైన్ గారికీ, ఆర్.బి.చౌదరి గారికి నా మీద నమ్మకం కుదిరింది కానీ, ప్రసాద్ గారిని ఇంకా కన్విన్స్ చెయ్యలేకపోయాను. అప్పుడు ప్రసాద్ గారిని ఇంప్రెస్ చేసే ప్రయత్నంలో, మరో అడుగు ముందుకేశాను. హేండీకామ్‌తో కొంతమంది తాత్కాలిక నటీ నటులని పెట్టుకుని నాలుగైదు సీన్లు, కొన్ని పాటల్లో బిట్లూ షూట్ చేసి, ట్రైలర్స్ కట్ చేసి ప్రసాద్ గారి వద్దకెళ్ళాను. అప్పటికి ఆయనకి నా మీద గురి కుదిరింది. ఇదంతా జరిగే సరికి జూన్ వచ్చేసింది. జూన్ 12 న మాకు పాప శ్రీహిత పుట్టింది. జూన్ 14 న 'భీమిలి కబడ్డి జట్టు'కి సైన్ చేసి ఎడ్వాన్స్ అందుకున్నాను. తొమ్మిది నెలల క్రిందట మా కూటుంబంలోకి మూడో మనిషి రాబోయే లోగా సొంత సినిమాకి సైన్ చెయ్యాలని అనుకున్నలక్ష్యం రెండు రోజులు ఆలశ్యంగా నెరవేరింది. !

ఇదండీ నా మొదటి సినిమా మొదలైన కథా విధానం..!

మొదటి రోజు షూటింగ్ హైదరాబాదులోకి దగ్గరలోని పోచంపల్లిలో మొదలుపెట్టాం. లోకేషన్స్, కాస్ట్యూమ్స్ ..మొదలైన అన్ని విషయాల్లోనూ సహజత్వానికి పెద్ద పీటవేశాం. ఈ విషయంలో మా హీరో నాని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సాధారణంగా నాచురాలిటీ కోసం నేనెప్పుడు రాజీ పడేవాడిని కాదు. ఒక్కోసారి షెడ్యూలు అవ్వాలన్న తొందరలో నేను ఒప్పుకున్నా తను మాత్రం అనుకున్న ఎఫెక్టు వచ్చేంతవరకూ చేశేవాడు. సినిమా చివరలో తనమీద మట్టి వేసే దృశ్యం ఒకటి ఉంటుంది. సహజత్వంకోసమని దాన్ని అరడజను సార్లు పైగా తీశాము. నానినే అనే వాడు 'పదేళ్ళ తర్వాత మన సినిమా చూసుకున్నా మనం గర్వంగా ఫీలవ్వాలి' అని. అలానే ఒకసారి తను వేసుకున్న చొక్కా కొంచెం కొత్తగా కనిపిస్తోంది. తన పాత్రకి పాతచొక్కానే కావాలి. షూటింగ్‌కి వచ్చిన వాళ్ళలో ఒకతని చొక్కాబాగా నలిగిపోయి, పాతగా ఉంది. అది చూసిన నాని, అతనికి తన చొక్కా ఇచ్చేసి, అతని పాతచొక్కా తను వేసుకున్నాడు!! నాని లాంటి హీరో దొరకడం కూడా మా సినిమా విజయానికి ముఖ్యకారణం అనిచెప్పుకోవాలి.




సినిమా విడుదలైన రోజు యూనిట్ అందరం కలిసి హైదరాబాదులోని సంధ్యా థియేటర్‌లో చూశాము. చాలా నెర్వస్‌గా అనిపించిన సమయమది. మొదటి రెండు రోజులు డివైడెడ్ టాక్ వచ్చినా, సోమవారం నుంచి హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో నడిచి చాలా సెంటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకుంది. మేము విజయ యాత్రకి వెళ్ళినప్పుడు అందరూ ఎంతో అభిమానంతో రిసీవ్ చేసుకున్నారు.

ఇంకా నా మొదటి సినిమాతో ముడిపడిన కొన్ని జ్ఞాపకాలని చెప్పుకోవాలంటే..ఈ సినిమా విడుదలయ్యే వరకూ మా పాప శ్రీహితని సరిగా చూసుకునే అవకాశమే దొరకలేదు. ఇప్పుడు చూస్తుంటే ఇల్లంతా పరుగెత్తుతోంది. ఇదో మధురమైన అనుభూతి. అలానే 1989లో నాన్నగారు తెలుగులో తన చివరి సినిమా తీశారు. మళ్ళీ 21 సంవత్సరాల తర్వాత మా కుటుంబం నుంచీ తెలుగు సినిమా వచ్చింది. ఇంకో యాదృచ్ఛికం ఏమిటంటే - మా తాత ప్రకాశరావు గారు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'పల్లెటూరు'. నాన్నగారి మొదటి సినిమా 'కుడి ఎడమైతే' కూడా పల్లెటూరు నేపథ్యం ఉన్న సినిమానే. నా మొదటి సినిమా కూడా విలేజ్ బ్యాక్ డ్రాప్ లో కుదరడం.. జస్ట్ కోయిన్సిడెన్స్ కావొచ్చు కానీ..ఎప్పటికైనా తాతగారు తీసినంత మంచి సినిమాలు తీస్తానన్న నమ్మకానికి ఇది పునాది ఏమో అనిపించింది.

నా మీద నమ్మకంతో మొదటి సినిమాకి అవకాశమిచ్చిన నిర్మాతలకీ, మంచి ప్రోడక్టు రావడానికి సహకరించిన యూనిట్ సభ్యులందరకీ, ముఖ్యంగా ఆదరించిన మీకూ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

నా మనసులోని మాటలని మీతో పంచుకోడానికి ఇలా అవకాశం కలిగించిన 'కౌముది'కి అభినందనలు.

త్వరలో మరో మంచి సినిమాతో మీ ముందుకి వస్తాను.

(సెప్టెంబర్ 2010 సంచికలో ప్రచురితం)

# ప్రవీణ్ శ్రీ

**తెలుగు చలనచిత్ర సీమలో** ఒక సినిమా విజయవంతమవడమే గగనమౌతున్న ఈ రోజుల్లో మొదటి సినిమాతోనే ప్రేక్షకుల్లోకి దూసుకెళ్ళడం అనేది ఆ దర్శకుడి ప్రతిభకి నిజమైన నిదర్శనం. మొట్టమొదటి సారిగా దర్శకత్వం అనే సరికి - ఎలాంటి తరహా సినిమా చెయ్యాలి, ఎలాంటి సినిమాతో కెరీర్ మొదలుపెడితే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి, భవిష్యత్తుకి ఎలాంటి బాటలు వేసుకోవచ్చు - ఇలా అనేక కోణాల్లో యువదర్శకులు విశ్లేషించడం సహజం. పదిహేడేళ్ళ క్రిందట వచ్చిన ఒక సూపర్ హిట్ చిత్రానికి, కొనసాగింపుగా తన మొదటి చిత్రాన్ని ఎన్నుకోవడం అంటే, అందునా సామాజిక సమస్యలు ఇతివృత్తంగా, ఆ దర్శకుడికి ఎంతో ఆత్మవిశ్వాసం ఉండాలి. అలాంటి ప్రయోగాన్ని చేసి విజయం సాధించిన **'గాయం-2'** సినిమా దర్శకుడి ప్రవీణ్ శ్రీ గారితో ఇంటర్వ్యూ ఈ నెల కౌముదికి ప్రత్యేకం. సినిమా విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న సమయంలో రెండో రోజునే ఫోన్ చేసినా, సినిమా ప్రమోషన్ హడావిడిలో ఉన్నా, 'కౌముది'గురించి చెప్పగానే సమయాన్ని కేటాయించి వివరంగా తన మనసులోని మాటలు పంచుకున్న ప్రవీణ్ శ్రీ గారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ..విశేషాల్లోకి వెళ్దాం.



### *చిన్నతనం, చదువు సంధ్యలు*

**మా స్వగ్రామం** మహబూబ్ నగర్ జిల్లాలోని కడ్తాల్ అనే గ్రామం. నాన్నగారు లింగారెడ్డి , వ్యవసాయదారుడు. అమ్మపేరు ప్రేమలత గృహిణి. నాకో తమ్ముడు. పుట్టింది పల్లెటూరే కానీ, ఊహ తెలిసిన వద్దనుంచి హైదరాబాదులో పెద్దమ్మ గారింటి వద్దనే పెరిగాను. చదువు సంధ్యలూ, సినిమా అంటే ఆసక్తీ అంతా హైదరాబాదులోనే.! శుభోదయా హైస్కూలు, ఎ.వి.కాలేజీల్లో నా చదువు సాగింది. చదువులో మామూలుగానే ఉండేవాడిని. పెద్ద బ్రైట్ అని చెప్పుకోను. హైస్కూలు రోజుల్లోనే సినిమాలు చూడడం బాగా అలవాటయ్యింది. పెద్దమ్మగారి అబ్బాయి అనిల్, నేనూ కలిసి సినిమాలు తెగ చూసేవాళ్ళం. ఇంట్లో తెలీకుండా మా జాగ్రత్తలో మేము ఉండేవాళ్ళం. సినిమా టిక్కెట్టు ఆ రోజుల్లో ఐదు రూపాయలు. నాన్న నన్ను చూడడానికి వచ్చినప్పుడల్లా ఇచ్చే పోకెట్ మనీ ఉండడంతో సినిమాలు చూడడానికి ఇబ్బందేమీ ఉండేది కాదు. మొదట్లో చిరంజీవి సినిమాలంటే పిచ్చి. తర్వాత నాగార్జున గారి సినిమాలంటే ఇష్టం ఏర్పడింది. సరిగ్గా చెప్పాలంటే 'శివ' సినిమాతో ఎలాగైనా, ఎప్పటికైనా సినిమా రంగంలోకి వెళ్ళి, దర్శకుడిగా పేరుతెచ్చుకోవాలనే భావం బలంగా మనసులో నాటుకుపోయింది.

ఇంటర్మీడియట్ అయ్యాక నన్ను ఇంజినీరింగ్ చదివించాలని నాన్న గారి ఉద్దేశం. బి.కామ్ లాంటి కోర్సులో చేరితే అంత చదువు వొత్తిడి ఉండదు కదా, సినిమాల్లోకి వెళ్ళే ప్రయత్నాలు చేసుకోవచ్చని నా ప్లాన్. చివరికి నేననుకున్న ప్రకారమే ఎ.వి.కాలేజీలో బి.కామ్ లోనే చేరాను. ఏవో మనసులోకి వచ్చిన ఆలోచనలతో చిన్నచిన్న స్క్రిప్టుల్లాంటివి వ్రాసుకుంటుండేవాడిని. కాలేజీకి దగ్గరలోనే ఉన్న స్కైలైన్, స్టెర్లింగ్ థియేటర్‌లలో వచ్చిన ఇంగ్లీషు సినిమాలన్నీ వదిలిపెట్టకుండా చూస్తుండేవాడిని. అప్పటినుంచే సినిమారంగంలోకి ఎలా వెళ్ళాలా అనే ప్రయత్నాలు మొదలయ్యాయి. సినిమా నిర్మాణం జరిగేది స్టూడియోల్లో కాబట్టి నా మొదటి ప్రయాణం అన్నపూర్ణా స్టూడియో చుట్టూ తిరగడంతో మొదలైంది. మా ఇంటివద్దనుంచి 127 జె. బస్సు ఎక్కి తరచూ అన్నపూర్ణా స్టూడియోకి వెళ్ళి, గంటలతరబడి గేటువద్ద నిలబడేవాడిని. లోపలికి వెళ్ళడం సాధ్యం కాదని తెలుసు. ఐనా వెళుతూనే ఉండేవాడిని. ఎప్పటికైనా ఇదే స్టూడియోలో షూటింగ్ చెయ్యాలి అనుకుంటుండే వాడిని. ఆ రోజుల్లో నాకు తెలిసింది 127 జె బస్సు ఒక్కటే!

తర్వాతి స్టెప్ ఔట్‌డోర్ షూటింగ్‌లకి వెళ్ళడం. చిన్నప్పటినుంచి ఇన్‌స్పైర్ చేసిన 'శివ' దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గారి షూటింగ్ ఎక్కడ ఉన్నా క్రమం తప్పకుండా వెళ్ళి, రోజంతా జనాల్లో నుంచుని పరిశీలిస్తూ ఉండేవాడిని. రాముగారంటే అప్పుడే మనసులో విపరీతమైన ఆరాధనాభావం ఏర్పడిపోయింది. పొద్దున్నే ఇంట్లో టిఫిన్ చేసి, సరాసరి ఔట్‌డోర్‌లోని షూటింగ్ స్పాట్‌కి వెళ్ళడం, సాయంకాలం ఎప్పుడో ఇంటికి చేరడం, ఇంట్లో అడిగితే కాలేజీలో స్పెషల్ క్లాసులు ఉన్నాయని చెప్పడం..ఇలా గడిచింది డిగ్రీ అంతా.

ఎలాగో డిగ్రీ ఐందనిపించాను..

## మెట్టు మెట్టుగా సినిమాల్లోకి.

ఇంక సీరియస్‌గా సినిమా ప్రయత్నాలు చెయ్యాలని డిసైడ్ ఐ పోయాను. సహజంగానే ఇంట్లోవాళ్ళు ఒప్పుకోలేదు. నేను మాత్రం నా ప్రయత్నాలు మానలేదు. అందులో భాగంగానే వర్మ గారి బంధువు మధు మంతెనగారు నడుపుతున్న 'వర్మ ఆడియో' కంపెనీలో ఉద్యోగానికి చేరాను. నెలకి 1200 రూ. జీతం. ఆడియో కంపెనీ అనేది కూడా సినిమా రంగంలో భాగం అనే ఒక చిన్న ఫీలింగ్ ఉండేది. అక్కడనుంచీ ఐనా ఫీల్డ్‌లోకి ఎంట్రీ దొరుకుంతుందేమోనని ఏదో చిన్న ఆశ.

అక్కడ సుమారుగా ఆర్నెల్లపాటు పనిచేశాను. ఎలాగైనా సరే సినిమారంగంలోకి అడుగుపెట్టాలని శాయశక్తులా ప్రయత్నించడం మొదలుపెట్టాను. ఇంట్లోవాళ్ళకి నా వాలకం నచ్చలేదు. ఫ్రెండ్స్ రూమ్‌లో ఉంటూ నా ప్రయత్నాలు కొనసాగించాను. అప్పటి నా రూమ్మేట్ రాజేంద్ర రెడ్డి. తర్వాత కొన్నేళ్ళు 'ఓయ్' దర్శకుడు ఆనంద రంగ కూడా నా రూమ్మేట్. కొన్ని నెలల నిరంతర ప్రయత్నాల ఫలితంగా మిత్రుడు నివాస్ (షూల్ సినిమా దర్శకుడు) ద్వారా అన్నపూర్ణాస్టూడియోలో ఎడిటర్ శంకర్ గారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. ఫీల్డ్‌లోకి ఎంట్రీ ముఖ్యం కాబట్టి వెంటనే అక్కడ చేరిపోయాను. నేను ఎడిటింగ్ అసిస్టెంట్‌గా పనిచేసిన మొట్టమొదటి సినిమా తమిళంలో అంతఃపురం. అక్కడ మొదలుపెట్టి దాదాపు రెండు సంవత్సరాలు శంకర్‌గారి వద్దనే చాలా సినిమాలకి ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశాను.

అక్కడనుంచి దర్శకత్వ శాఖలోకి మారే అవకాశాన్ని 'అల్లరి' రవిబాబుగారు కలిపించారు. ఆయన వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో 'అమ్మాయిలు-అబ్బాయిలు', 'సోగ్గాడు', 'అనసూయ' చిత్రాలకి పనిచేశాను. దర్శకత్వంలో చాలా మెళకువలు తెలుసుకున్నాను. తర్వాత సురేష్ ప్రొడక్షన్స్‌లో ఒక సంవత్సరం పనిచేశాను. కృష్ణవంశి గారి కో-డైరెక్టర్ మల్లి దర్శకత్వం వహించిన 'ప్రాణం' అనే సినిమాకి పనిచేశాను. అన్ని సినిమాల తర్వాత అదే పని రొటీన్ అనిపించింది.

### *12 గంటల్లో ఆరు నిమిషాల సినిమా..*

ఇంక సొంతంగా దర్శకత్వం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. అందులో భాగంగానే 'సోల్స్' అనే అతి చిన్న సినిమాని షూట్ చేశాను. ఆ సినిమా మొత్తం నిడివి 6 నిమిషాల 46 సెకండ్లు మాత్రమే. ఒక రోజు మధ్యాహ్నం 12 కి మొదలుపెట్టి అర్థరాత్రి 12 కి పూర్తి చేశాను. ముందుగా ఆర్టిస్ట్స్ తోనే తీద్దామనుకున్నాను కానీ వాళ్ళకి రెమ్యునరేషన్ చెల్లించే స్థోమతలో లేను. అందుకని తారాగణం ఎవరూ లేకుండానే మొత్తం షూటింగ్ పూర్తిచేశాను. హెచ్.డి. కెమెరా వాడాను. దానికోసం నేను పెట్టిన ఖర్చు 23 వేల రూపాయలు. ఐతే పోస్ట్‌ప్రొడక్షన్ మాత్రం నెలరోజులపాటు చేశాను, డి.టి.ఎస్ మిక్సింగ్ కూడా చేయించాను. ఇదంతా మిత్రుల సహకారంతో పూర్తి చేశాను. కథ విషయానికి వస్తే రెండు ఆత్మల మధ్య జరిగే సంఘర్షణ. అనుమాన పిశాచానికి లోనైన ఒక భర్త, భార్య కూతుర్లను చంపేస్తాడు. వాళ్ళిద్దరి ఆత్మల మధ్య జరిగే ఆసక్తికరమైన సన్నివేశాలు ఆ ఆరు నిమిషాల్లో తీశాను. అందులోనే సెంటిమెంట్ కూడా జతచేశాను. ప్రతిరోజూ అలవాటైన పాట పాడుతూ కూతురు కోసం తల్లి ఆత్మ అన్వేషిస్తు ఉంటుంది. అది విన్న కూతురు ఆత్మ తల్లి దగ్గరకి వస్తుంది. ఐతే తల్లి తనని గుర్తు పట్టలేదు, ఎందుకంటే కూతురు కంటే తల్లే ముందుగా చనిపోయింది...ఇలా సాగుతుంది కథ.!




### *రాముగారి పరిచయం.. ప్రయాణం..*

పోస్ట్‌ప్రొడక్షన్ పనులు అయ్యాక ఇంగ్లీషు డి.వి.డిల స్థాయిలో 'సోల్స్' డి.వి.డి. తయారు చేసి ఇండస్ట్రీలో చాలా మందికి చూపించాను. ఎంతమంది చూసినా రామ్ గోపాల వర్మగారికి చూపించాలనేది నా చిరకాల వాంఛ. రాముగారి సినిమాల డిజైనింగ్ అంతా చూసే అనిల్, భానుల ద్వారా ఒక సినిమా షూటింగ్‌లో రాము గారిని బొంబాయిలో కలుసుకున్నాను. షాట్ గాప్ మధ్యలో నేనొచ్చిన పనిచెప్పి డి.వి.డి చూపించాను.

'ఏమిటిది..ఇంగ్లీషు సినిమాల స్థాయిలో ఉంది?' అన్నారు. చెప్పాను.

డివిడి కేసు వెనకాల వ్రాసి వున్న సినాప్సిస్ చదివారు. ' ఇప్పుడు బిజీగా వున్నాను. రేప్పొద్దున నాకు మెసేజ్ పెట్టు ఎక్కడికిరావా లో చెబుతాను' అన్నారు రాము గారు.

మర్నాడు మళ్ళీ షూటింగ్ స్పాట్‌లోనే కలుసుకున్నాం. డి.వి.డి చూశారు. ఆయన రియాక్షన్ ఎలా ఉంటుందో నని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాను. ఒక వైపు షూటింగ్ పోస్ట్‌పోన్ చేసి మరీ నాతో మాట్లాడుతున్నారు.

ఆయన నోటినుంచీ వచ్చిన ఒక్క మాట నాకు కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇన్స్టెంట్‌గా ఇచ్చింది.

అప్పుడాయన్నన మాట 'మైండ్ బ్లోయింగ్..!'

'ఈ కాన్సెప్ట్ ఎలా అనుకున్నావు? ఎలా ఇన్‌స్పైర్ అయ్యావు? ఫలానా షాట్ ఎందుకు తీశావు..?' ఇలా వివరంగా అడిగారు.

నేను చెప్పిన సమాధానాలకి ఆయన చాలా ఇంప్రెస్ అయ్యారు.

'మరైతే తర్వాత ఏమిటి?' అన్నారు.

'సినిమా చేద్దామనుకుంటున్నాను' అన్నాను.

'కథ వుందా?' అన్నారు.

వెంటనే సినాప్సిస్ పేపర్ తీసి చూపించాను.

చదివాక 'బావుంది ఐతే కొన్ని మార్పులు చెయ్యాలి..' అన్నారు. అదొక హిందీ సినిమాకోసమని వ్రాసుకున్న కథ..

అలా రాముగారితో నా ప్రయాణం మొదలైంది. అదే నా సినిమా జీవితానికో పెద్దమలుపు. ఆయన ఎప్పుడు హైదరాబాదు వచ్చినా షూటింగ్‌లో వెంట ఉండేవాడిని.

ఓ సారి అడిగాను 'మీవద్ద కొన్ని రోజులు అసిస్టెంట్ గా చేస్తాను' అని.

'ఇంకా ఏమి నేర్చుకోవాలనుకుంటున్నావ్?' అన్నారు.

'లేదు సార్..మీ వద్ద ఇంకా చాలా నేర్చుకోవాలి..'అన్నాను.

'అది నిజమే నేర్చుకోడానికి ఎప్పుడూ ఏదో ఒకటి ఉంటూనే ఉంటుంది. ఐతే ఎక్కడో ఒక చోట మొదలుపెట్టి నేర్చుకున్నదానితో ప్రొజెక్టులు చెయ్యాలి. ఇంకా..ఇంకా..తెలుసుకోవాలన్న విషయాలు స్టె బై స్టెప్ ఎప్పుడైనా నేర్చుకుంటూ ముందుకి వెళ్ళొచ్చు' అని సలహా ఇచ్చారు.



***గాయం-2***

ఒక ఆర్నెల్ల పాటు కూర్చుని గాయం-2 స్క్రిప్టు తయారు చేసుకుని రాము గారికి చూపించాను. చాలా బావుందని ముందుకి వెళ్ళమని ప్రోత్సహించారు. అప్పటినుంచీ ప్రొడ్యూసర్‌కోసం అన్వేషణ మొదలైంది. సంవత్సరంన్నర పాటు దాదాపు 30 మందికి స్క్రిప్టు వినిపించాను. విన్నవాళ్ళంతా 'బావుంది..చూద్దాం..' అన్నారు. మరికొంతమంది హీరోగా ఈ తరం హీరోలని సజెస్ట్ చేశారు. పాత సినిమాకి కొనసాగింపు కాబట్టి అప్పటి గాయం హీరోనే దీనికీ ఉండాలని నా పట్టుదల. చివరికి దుబాయ్‌నుంచి ధర్మకర్తగారు ముందుకి రావడంతో గాయం-2 కి ఒక రూపం వచ్చింది.

మొదటి షెడ్యూల్ 19 రోజులు బాంకాక్‌లో జరిగింది. దాదాపు యాభై శాతం అక్కడే పూర్తిచేశాను. మొట్టమొదటి రోజు ఉదయం 7.00 కి అనుకున్నది 6.45 కల్లా మొట్టమొదటి షాట్ జగపతి బాబుగారి మీద తీశాను. ఆయన కిటికీ కర్టెన్ తెరవగానే సముద్రం కనిపించే షాటు నా దర్శకత్వ జీవితంలో మొట్టమొదటి షాట్..

అంతా పక్కా ప్లానింగ్‌తో వెళ్ళడం వల్ల షూటింగ్ చకచకా సాగిపోయేది. మొదటి హాఫ్‌లో జగపతి బాబు, విమలారామన్‌లు ఉండే ఇల్లు సెట్టింగేమోనని చాలామంది అనుకున్నారు. అది బేంకాక్ లోని ఒరిజినల్ హౌసే. గాయం ఒరిజినల్ సినిమాలో రొమాన్స్ ట్రాక్ అంతా బీచ్ నేపథ్యంలో సాగుతుంది. అందుకే ఇందులో కూడా సముద్రం ఎదురుగా ఉన్న ఇల్లు బ్యాక్ డ్రాప్

ఉంటే ఔచిత్యం ఉంటుందని వెదికి వెదికి ఆ ఇల్లు పట్టుకున్నాం. అలానే హీరో హైదరాబాదునుంచీ వెళ్ళిపోయి దూరంగా ఎవరికీ కనిపించని చోట ఉంటున్నాడు అని చూపించడానికి కూడా సముద్రం దగ్గర ఐతే బావుంటుందని కూడా అలాంటి లొకేషన్ ఎన్నుకోవడం జరిగింది. సినిమా అంతా నేచురల్ లొకేషన్‌లోనే తీశాము. ఒక చోట సముద్రంలోకి బ్రిడ్జి ఉంటుంది. అదొక్కటే సెట్ వేశాము.




రెండో షెడ్యూల్ హైదరాబాదులో జరిగింది. సినిమాలో ప్రతి కేరక్టర్‌నీ ఎంజాయ్ చేస్తూ తీశాము. కోట శ్రీనివాసరావు గారు సెట్లోకి వస్తుంటే మా అందరికీ ఎక్కడలేని ఎనర్జీ వచ్చేసేది. ప్రతి సీన్ తీసేప్పుడూ అప్పటి గాయం సినిమాలోని డైలాగ్స్ అన్ని గుర్తు చేస్తుండేవారు. అలానే భరణి గారు. జీవాగారు, ..ఇంక కోట ప్రసాద్ ఐతే నాకు మంచి మిత్రుడు. తన నాన్న గారితో కలిసి నటించేప్పుడు ఎంతో కసిగా చేస్తుండేవాడు. ముందు రోజే సీన్ పేపర్లన్నీ తీసుకుని బాగా ప్రిపేరై మరీ సెట్‌కి వచ్చేవాడు ప్రసాద్. మొదట్లో కోట ప్రసాద్ పాత్రకి వేరే ఎవర్నైనా పెట్టుకోమని సలహాలు వచ్చాయి ఐతే సర్కార్ సినిమాలో అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌ల పాత్రలని చూసినప్పుడు వాళ్ళ మధ్యన ఒక నాచురల్ లైవ్ ఫీలింగ్ కనిపించింది. అదే స్ఫూర్తితో ఈ సినిమాలో కూడా కోట శ్రీనివాస రావు గారు, ప్రసాద్ చేస్తే ఆ పాత్రల మధ్య డ్రామా బాగాపండుతుందని నా నమ్మకం. నా నమ్మకం తప్పుకాదని ప్రేక్షకులు నిరూపించారు. ఈ రోజు థియేటర్లలో వాళ్ళ కేరక్టర్లు తెరమీద కనిపించగానే ప్రేక్షకులు విజిల్స్ వేస్తున్నారు. విమలారామన్ కూడా ఏ సీన్ చెప్పినా క్షణంలో పర్ఫెక్ట్ రియాక్షన్స్ ఇచ్చేది.

ఈ నా మొదటి సినిమాకి మరో పెద్ద ఎస్సెట్ ఇళయరాజా గారి సంగీతం. 'శివ', 'దళపతి, 'నాయకుడు' ఛాయల్లో సాగే ఈ సినిమాకి ఇళయరాజాగారే పూర్తి న్యాయం చేకూర్చగలరని ముందునుంచి అనుకుంటూ ఉండేవాడిని. ఆయనతో పనిచేసే అవకాశం నాకు లైఫ్ టైమ్ గిఫ్ట్ లాంటిది. ఉదయం ఆరు గంటలకి ఆయనకి కథ చెప్పగానే, కథ ఫ్రెష్‌గా ఉందని మెచ్చుకున్నారు. వెంటనే నిశ్శబ్దంగా లోపలకి వెళ్ళారు. నేనూ ఆయనని అనుసరించాను. మధ్యాహ్నానికల్లా మూడు ట్యూన్స్ ఇచ్చారు. నిజానికి ఆయన వద్దకి వెళ్ళడానికి ముందు ఆయన సంగీత దర్శకత్వంలో వచ్చిన కొన్ని పాతపాటలు వ్రాసి పెట్టుకున్నాను, వాటిని మళ్ళీ వాడుకుందామని. ఐతే ఇళయరాజా గారే 'వద్దు ప్రవీణ్..మొదటి సినిమా చేస్తూ పాత ట్యూన్స్ ఎందుకు? అవి బాగానే ఉన్నా, పాతపాటలు వాడాడు అన్న అనవసరమైన విమర్శ వస్తుంది. నీకు ఎన్ని ట్యూన్స్ కావాలో చెప్పు అన్నీ ఇస్తాను అన్నారు.' అన్నమాట నిలబెట్టుకున్నారు. ఇళయరాజా గారు సంగీత బ్రహ్మ, ఆయనతో పనిచేయడం గొప్ప అనుభవం..!

సినిమాలో ప్రతి ఒక్కరూ నూటికి నూట యభై శాతం పెర్ఫార్మెన్స్ ఇవ్వబట్టే ఈ రోజు మీరందరూ సినిమాని అంతగా ఆదరిస్తున్నారు.

మొదటి సినిమా ఐనా 80,000 అడుగుల ఫిలిమ్ నిడివిలో యాక్షన్ సినిమాని నిర్మాతకి ప్రోమిస్ చేసిన బడ్జెట్‌కి మించకుండా పూర్తిచెయ్యగలిగాను. ఈ చిత్ర విజయానికి యూనిట్ సభ్యులు అందించిన సహకారం ఎప్పటికీ మర్చిపోలేను.

డాలీ, ఆనంద్ రంగా, రాజేంద్రరెడ్డి ..ఇంకా మరికొంతమందిమి కల్సి సుదర్శన్ థియేటర్‌లో సినిమా విడుదలైన

రోజు మోర్నింగ్ షో చూశాము. మొదటి సినిమాలోనే రాము గారు పేరు, ఇళయరాజా గారి పేర్లతో కలిసి నా పేరు వెండితెరమీద కనిపించడం ఎప్పటికీ మరచిపోలేని అనుభవం..! అలానే రాము గారి నుంచి నేను పొందిన ఇన్స్పిరేషన్ అంతా ఇంతా కాదు.. ఆయనతో పది నిమిషాలు మాట్లాడితే చాలు ఎంత అసాధ్యాన్నైనా సాధించవచ్చునన్న ఆత్మవిశ్వాసం వచ్చేస్తుంది. ఎవరిలోనైనా టాలెంట్ ఉందని గ్రహిస్తే ఆయనే ప్రమోట్ చేస్తారు. పదిమందికీ మనగురించి మంచిగా చెబుతారు. హి ఈజ్ సచ్ ఎ గ్రేట్ పర్సన్!!

ఈ సందర్భంగా నేను కృతజ్ఞతలు చెప్పుకోవాల్సింది నా కుటుంబసభ్యులకి కూడా. గత తొమ్మిది పదేళ్ళుగా నేను పడుతున్న స్ట్రగుల్‌కి వాళ్ళు ప్రత్యక్ష సాక్షులు. నా కష్టాలు ఎక్కువగా ఇంట్లో చెప్పుకోకపోయినా, వాళ్ళు ఊహించగలిగే వారు. నా వయసువాళ్ళు డాక్టర్లో, ఇంజినీర్లో అవుతుండడం, విదేశాలకి వెళుతుండడం గమనించిన అమ్మా. నాన్నా నా గురించి దిగులు పడుతుండేవారు. తల్లి దండ్రులుగా వాళ్ళ ఫీలింగ్ నేను అర్థం చేసుకోగలిగాను. ఇబ్బందికరమైన సన్నివేశాలని తప్పించుకోడానికని ఇన్నేళ్ళూ ఎక్కువగా ఫేమిలీ ఫంక్షన్స్‌కి కూడా వెళ్ళే వాడ్ని కాదు. మరీమూడు నాలుగేళ్ళ క్రిందటి నుంచీ ఐతే 'ఎన్నాళ్ళీ పోరాటం..ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కదా..' అనేవారు. ఐతే నేను గెలుపో, ఓటమో ఇక్కడే తేల్చుకోవాలని డిసైడై పోయాను. 'నన్ను వదిలెయ్యండి.. ఏదో రోజు నన్ను నేను నిరూపించుకుంటాను..'అని చెప్పాను. క్రిందటి సంవత్సరమే నాకు వివాహమైంది. తన పేరు స్వాతి. పెళ్ళైన మూడు నెలలకి గాయం-2 ప్రోజెక్టు వచ్చింది. స్వాతి ఉద్యోగం చేస్తూ నాకు ఎంతో సపోర్టింగ్‌గా నిలిచి, ఎంతో మానసిక బలాన్నిచ్చింది. సినిమా శుక్రవారం విడుదలైతే తరువాతి సోమవారమే మాకు పాప పుట్టింది. మూడు రోజుల తేడాతోనే నాకు దర్శకుడుగా, తండ్రిగా ప్రమోషన్ వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా విజయానికి తోడ్పడిన మిత్రులకి, శ్రేయోభిలాషులకి మీకూ అందరికీ 'కౌముది' ద్వారా మనసారా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

(ప్రవీణ్ గారి ఇ-మెయిల్: **sri_karunalayam@yahoo.com** ఫోన్ నంబర్: **98854 24172** )

(అక్టోబర్ 2010 సంచికలో ప్రచురితం)

# సుధా.కె.ప్రసాద్

**భారతీయ చలనచిత్ర రంగంలో** దర్శకత్వశాఖలో ప్రవేశించి, తమదైన ముద్రవేసి, పేరు తెచ్చుకున్న మహిళలని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చునేమో. క్రిందటి నెలలోనే, తెలుగింటి ఆడపడుచు తమిళ చలన చిత్ర రంగంలో తన మొట్టమొదటి చిత్రాన్ని రూపొందించి, ప్రేక్షకాదరణని పొందారు. ఆరున్నర సంవత్సరాల పాటు ప్రముఖ దర్శకులు మణిరత్నం గారి వద్ద దర్శకత్వ శాఖలో సహాయకురాలిగా పనిచేసిన ఆమె మొదటి సినిమాని తన గురువుగారి పంథాలోనే బలమైన ఎమోషనల్ కథతో రూపొందించి తమిళ ప్రేక్షకులని ఆకట్టుకున్నారు. ఆ సినిమా నిర్మాత కూడా తెలుగింటి ఆడపడుచే కావడం ఇంకో విశేషం..! ఎల్వీ. ప్రసాద్ గారి మనుమరాలు మనో అక్కినేని నిర్మించిన 'ద్రోహి'(సెప్టెంబర్ , 2010న ఈ సినిమా విడుదలైంది) అనే తమిళ చిత్రానికి దర్శకత్వం వహించిన **సుధా.కె.ప్రసాద్** గారితో ప్రత్యేక ఇంటర్వ్యూ ఈనెల కౌముది పాఠకులకి ప్రత్యేకం.



***చిన్నతనంలో..***

మా నాన్న రాధాకృష్ణగారి స్వగ్రామం విజయవాడ దగ్గరలోని మందడం. అమ్మ పాండురంగాబాయ్‌గారిది గుడ్లవల్లేరుకి పక్కనున్న అంగలూరు. నాకు ఊహ తెలిసే సరికే అమ్మా, నాన్నా ఇద్దరూ మద్రాసులో స్థిరపడ్డారు. ఇద్దరూ డాక్టర్లే. నేను ఇంట్లో పెద్దమ్మాయిని. నా తర్వాత ఓ తమ్ముడు, ఓ చెల్లి. నా స్కూలు చదువు అడయారులోని శిష్యా స్కూల్లో జరిగింది. అదొక ప్రత్యేకమైన పద్ధతిలో నడిచే స్కూలు. జనవరి నుంచీ మళ్ళీ జనవరి వరకూ ఒక విద్యా సంవత్సరం. యేడాదిలో రెండు సార్లు దీర్ఘకాలిక శెలవులు ఉండేవి. ఆ సమయంలో తాతయ్య గార్ల ఊళ్ళు వెళ్ళడం ఎంతో సరదాగా ఉండేది. తరచూ ఆంధ్రా వెళ్ళే అవకాశం ఉండడం వల్ల మద్రాసులో స్థిరపడినప్పటికీ తెలుగు భాషా, సంప్రదాయాల పట్ల మమకారం, తెలుగు దనం ఎప్పుడూ మాతోనే ఉంది. శిష్యాలో చదువుకునే రోజుల్లో అడయారులో మట్టిరోడ్లే ఉండేవి. ఆ రోడ్ల వెంబడి హీరో సైకిల్ తొక్కుకుంటూ స్కూలుకి వెళ్ళడం మరచిపోలేని జ్ఞాపకం.

***సినిమాలంటే ఆసక్తి..***

ఎందుకోగానీ చిన్నప్పటినుంచే సినిమాలంటే విపరీతమైన ఆకర్షణ ఉండేది. ఆరోజుల్లో ఇంకా టివి చానెల్స్ ఇన్ని రాలేదు. కేవలం డి.డి.మాత్రమే ఉండేది. అందులో వచ్చే సినిమాలన్నీ భాషాబేధం లేకుండా చూసేదాన్ని. ఆదివారాల్లో వచ్చే ప్రాంతీయ సినిమాల్లో ఒరియా, బెంగాలీ, పంజాబీ.. అన్ని భాషల సినిమాలనీ సీరియస్‌గా చూస్తుండే దానిని. అమ్మ, నాన్నలకి నన్ను డాక్టర్‌ని చెయ్యాలని ఉండేది. చదువుమీద ఎక్కువ శ్రద్ధ పెట్టమని అంటుండేవారు. స్కూల్లో తోటి పిల్లలు భరతనాట్యం, వీణ లాంటివి నేర్చుకుంటున్నా నేను మాత్రం స్కూలు అవగానే ఇంటికి వచ్చేసి చదువుకోవడం, మహా ఐతే కొంచెంసేపు ఆడుకోవడం..ఇలా గడిచేది.

బహుశా ఏడో తరగతిలోనో, ఎనిమిదో తరగతిలోనో ఉండగా ఒక సినిమా చూడడం తటస్థించింది. ఒక విధంగా చెప్పాలంటే ఆ సినిమానే నాకు 'ఎప్పటికైనా సినిమాలకి దర్శకత్వం చెయ్యాలన్న' భావం కలిగించింది. అది మణిరత్నం గారి 'పగల్ నిలవు' (పగటి చంద్రుడు). నన్ను అమితంగా ఆకట్టుకున్నది అందులో మణిరత్నం గారి కథ చెప్పిన విధానం. అది మణిరత్నం గారి మూడో సినిమా. మార్కెట్ పరంగా ఫ్లాప్ సిన్మా. నిజానికి అది మణిరత్నంగారికి వరుసగా మూడో ఫ్లాప్ సినిమా. చాలామంది 'ఇదేం సినిమా' అనుకున్నారు కానీ నాకు మాత్రం మనసుకి హత్తుకుపోయింది ఆ సినిమా. అక్కడ్నుంచీ మణిరత్నం గారి సినిమాలతో పాటు పెరిగానని చెప్పుకోవచ్చు. ఆయన సినిమాలతో పాటు తమిళంలో వచ్చే మంచి సినిమాలన్ని నాకు గొప్ప ఆకర్షణగా నిలిచాయి.

భారతదేశం మొత్తం మీద పోల్చుకుంటే తమిళనాడులోనే ప్రత్యేకమైన సినిమాలు ఎక్కువగా నిర్మాణమయ్యేవని అనిపిస్తుంది నాకు. విడిగా సమాంతర సినిమా అని కాకపోయినా, మెయిన్ సినిమాల్లోనే 'ఆఫ్‌బీట్', 'ఇండిపెండింట్','ఎక్స్‌పెరిమెంటల్' అనదగిన సినిమాలు ఎక్కువగా వచ్చాయి. ఒక మహేంద్రన్, ఒక భారతీరాజా, ఒక బాలు మహేంద్ర, ఒక బాలచందర్, ఒక మణిరత్నం.. తమిళ చలన చిత్ర రంగాన్ని తమ కళాత్మక చిత్రాలతో సుసంపన్నం చేశారు. ఆ సినిమాలన్నీ ఎక్కువగా చూడడం వల్ల కూడా హైస్కూలు చివరి రోజులకి వచ్చేసరికి, ఎప్పటికైనా సినిమాల్లోనే నా ప్రొఫెషన్ చూసుకోవాలనిపించింది. కెమేరా వెనుకే ఉండాలి కానీ ఏ రంగంలో నేను రాణించగలను, ఎలా ముందుకి వెళ్ళాలి అనే అంశాల మీద అంతగా అవగాహనలేని వయసది.

నా ఆలోచనలు అలా సాగుతుండగా 11వ తరగతి అవగానే నాన్నగారు కొంతకాలం విశాఖపట్నానికి ఫేమిలీని షిఫ్ట్ చేశారు. అక్కడ టింపనీ స్కూల్లో 12వ తరగతి పూర్తిచేశాను. 1990 దశకం మొదట్లో, ఇంటర్మీడియట్ అయ్యాక అందరూ చదవాలనుకునేది ఇంజినీరింగో, డాక్టరో. మహ ఐతే డిగ్రీ తర్వాత ఎం.బి.ఎ చదవడాన్ని కూడా గొప్పగానే అనుకునే వాళ్ళు. నాన్నగారికి నన్ను పబ్లిక్ సర్వీస్ ప్రొఫెషన్‌లో చూడాలని ఉండేది. అందుకనే డాక్టర్ చదవమని ప్రోత్సహించారు. నాకేమో మనసంతా సినిమాలవైపుకే లాగుతుండేది. ఇంట్లో ధైర్యంగా చెప్పలేను.

***డిగ్రీ చదువు..వివాహం..పిల్లలూ..పోస్ట్‌గ్రాడ్యుయేషన్***

విశాఖలో చదువయ్యాక మళ్ళీ మద్రాసు తిరిగొచ్చేసి డిగ్రీలో చేరాను. హిస్టరీ మెయిన్ సబ్జెక్టు. అదయ్యాక ఐ.ఎ.ఎస్ చదివి పబ్లిక్ సర్వీస్ వైపు వెళ్తానని నాన్నగారిని ఒప్పించాను. డిగ్రీ చదువుతున్నప్పుడే సినిమాటోగ్రఫీ కోర్సుకోసమని పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కి అప్లై చేశాను. ఐతే అర్హతలు సరిపోలేదని తిరస్కరించారు. చాలా బాధపడ్డాను. ఐనా సినిమాల మీదనున్న ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదు.

డిగ్రీ చివరి సంవత్సరంలో ఉండగానే ఇంట్లో నాకు పెళ్ళి సంబంధాలు చూడ్డం మొదలుపెట్టారు. సరిగ్గా డిగ్రీ ఐపోగానే పెళ్ళి చేశారు. నా సినిమా పేషన్‌కి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా బిజీ ఐపోయాను.

ఇద్దరు అమ్మాయిలనీ చూసుకుంటుండగా మావారు ఒక రోజు అన్నారు "నాకు తెలుసు..నువ్వు చాలా సాధించగలవు. నీకున్న తెలివితేటలు మరుగున పడిపోవడానికి వీల్లేదు..ఏదైన కోర్సులో చేరు .." అని. 1995 - 96 ప్రాంతాల్లో కంప్యూటర్ క్రేజ్ మొదలైంది. నన్ను కూడా ఏదైన కంప్యూటర్ ఇన్సిటిట్యూట్‌లో చేరి కోర్సులు చెయ్యమని మా వారు ప్రోత్సహించారు. ఎందుకోగానీ కంప్యూటర్స్ అంటే ముందునుంచీ నాకు ఎలర్జీ. ఇంక అందులో కోర్సు చెయ్యడమంటే అసంభవం..! అదే మాట మా వారికీ చెప్పాను. (ఇప్పటికీ జస్ట్ ఇ-మెయిల్ చూసుకోవడం తప్ప కంప్యూటర్‌లో ఇంకేమీ తెలీదు).

ఇంకా ఏమి చేద్దామా అని ఆలోచిస్తుండగా మా డిగ్రీ కాలేజీ లెక్చరర్ ఒకావిడ "నువ్వు డిగ్రీ చివరి సంవత్సరంలో ఉండగా ఫారిన్ కాలేజీల్లో ఫిల్మ్ కోర్సులకి అప్లై చేస్తుండే దానివి కదా.. మరైతే ఇప్పుడు మన కాలేజీలోనే మాస్ కమ్యునికేషన్ కోర్సు మొదలుపెడుతున్నాం. అందులో చేరితే బావుంటుంది.." అని చెప్పారు. ఆ సూచన నాకు బాగా నచ్చింది. ఎందుకంటే మీడియాకి దగ్గరగా ఉండే కోర్సు అది. విషయం చెప్పగానే మా వారు వెంటనే ఒప్పేసుకున్నారు. "కోర్సు అయ్యా క ఏం చేస్తావు ?" అని అడిగారు. టీచింగ్ లోకి వెళ్తానని చెప్పాను. మా ఇంట్లో టీచర్లంటే దేవుళ్ళతో సమానం. అమ్మా, నాన్నా కూడా ఒప్పుకున్నారు.



ఆ విధంగా విమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో మాస్ కమ్యునికేషన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి చేరాను. మొట్టమొదటి నుంచీ కూడా చదువులో నేను రాంక్ హోల్డర్‌ని. ఈ పి.జి. లోకూడా మంచి రాంకు తెచ్చుకున్నాను. చివరి సంవత్సరంలో ఉండగానే రెండు మూడు కాలేజీలనుంచీ టీచింగ్ పోస్టుకి ఆఫర్లు వచ్చాయి. చివరికి మద్రాసు యూనివర్సిటీలో ఫాకేల్టీగా చేరాను. అందులో భాగంగానే రెండు మూడు నెలలకోసరి పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో ఫిల్మ్ ఎప్రిసియేషన్ కోర్సులకి వెళుతుండేదాన్ని. అక్కడ రోజుకి నాలుగైదు అద్భుతమైన సినిమాలని(ప్రపంచభాషల్లనింటిలోకి అత్యుత్తమమైనవి) క్రిటికల్ ఎనాలసిస్‌తో చూశాక, నా సమయాన్ని, ఆసక్తిని కేవలం టీచింగ్‌కే వెచ్చించి నాకు నేను పరిమితులు విధించుకుంటున్నానేమో అనిపించింది.

***రేవతి గారితో పరిచయం.. సినీ రంగ ప్రవేశం..***

నాకు ఇష్టమైన సినిమా రంగంలోకి ప్రవేశించడానికి అది సరైన సమయం అనిపించింది. మా తమ్ముడికి ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ గారి బ్రదర్‌తో మంచి పరిచయం ఉంది. ఎడిటింగ్ శాఖతో మొదలుపెడితే దర్శకత్వానికి మంచి పునాది ఉంటుందని ఆ ప్రయత్నాల్లో ఉండగా నా ఫ్రెండ్ ఇంకొకరు "రేవతి గారు ఇంగ్లీషులో సంభాషణలు వ్రాసే వాళ్ళకోసం చూస్తున్నారు. ఏదో డాక్యుమెంటరీ తీస్తున్నారట" అని చెప్పారు. ఆ విషయం తెలిశాక సరాసరి వెళ్ళి రేవతి గారిని కలిశాను.

నా బ్యాక్ గ్రౌండ్, అన్నీ విని ఆమె బాగా ఇంప్రెస్ అయ్యారు. ఐతే "ప్రస్తుతానికి ప్రోజెక్టు ఏమీ లేదు. ఏదైనా మొదలు పెడితే తప్పక పిలుస్తాను.." అన్నారామె.

వెంటనే రెండురోజుల్లోనే రేవతి గారి దగ్గరనుంచీ పిలుపువచ్చింది. వాతావరణ కాలుష్యం మీద నిర్మించే డాక్యుమెంటరీకి సంభాషణలు వ్రాయాలి అని. ఆ ప్రోజెక్టు షూటింగ్ అంతా కలిపి నెలరోజుల్లో ఐపోయింది. రేవతి, సురేష్ మీనన్‌లు నాలోని ఆసక్తినీ, టాలెంట్‌ని బాగా మెచ్చుకుని, తమ తర్వాతి ప్రోజెక్టుకి కూడా తమతో కలిసి పనిచేయమని అడిగారు. ఐతే ఇంకోవైపు స్కూల్లో టీచింగ్

అవర్స్ కమిట్ మెంట్ ఉంది. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ దగ్గరకెళ్ళి విషయం చెప్పాను. ఆమె పరిస్థితి అర్థం చేసుకుని వారం రోజుల్లో నేను చెప్పే క్లాసులన్నింటినీ బుధవారానికి మార్చేసి, ఆ ఒక్క రోజు ఉదయం 10.00 నుంచీ సాయంకాలం 4.00 వరకూ వారానికి సరిపడా క్లాసులన్నీ పూర్తిచేసేలా ఏర్పాటు చేశారు. అదనంగా సెమినార్లు, పరీక్షా నిర్వహణ వగైరాలు ఉండనే ఉంటాయి. చాలా కష్టమైన సమయం. ఐనా అక్కడ రేవతి గారితో కలిసి పనిచేసే అవకాశం కాబట్టి ఎంత కష్టపడడానికైనా సిద్ధపడ్డాను.

ఇంటిదగ్గర ఇద్దరు చిన్నపిల్లలు, వాళ్ళని చూసుకోవాలి. రేవతి గారితో చెప్పాను

"ఇదీ నా పరిస్థితి..ఉదయం పిల్లలని స్కూల్లో దించి 7.00 తర్వాత వచ్చి మధ్యాహ్నం 3.00 వరకూ పనిచేస్తాను..తర్వాత అపార్థాలు రాకుండా ఉండాలని ఇప్పుడే చెబుతున్నాను.."అని.

"సుధా ..నీ వర్క్ క్వాలిటీ విషయం మాకు పూర్తిగా తెల్సింది. నువ్వు ఎంత సేపు పనిచేస్తావు అనే విషయం కంటే నువ్వు ఎంత పనిచేస్తావో అన్న సంగతే మాకు కావాలి.ఆ విషయంలో నీ మీద మాకుపూర్తి నమ్మకం కలిగింది.." అన్నారు.

ఆ విధంగా అటు మా కాలేజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, ఇటు రేవతిగారూ ఇద్దరూ నా ఇబ్బందులని అర్థం చేసుకుంటూనే, నాలోని ప్రతిభకి మార్గం చూపించారు.

రేవతి గారు మొదలుపెట్టిన 'మిత్ర్ మై ఫ్రెండ్' చిత్రానికి స్క్రీన్ ప్లే, సంభాషణలకి సహ రచయిత్రిగా పనిచేయడం మొదలుపెట్టాను. నాతో పాటు ప్రియ కూడా పనిచేసింది. తను తర్వాతి రోజుల్లో మణిరత్నంగారి వద్ద పనిచేసింది. 'మిత్ర్ మై ఫ్రెండ్'




షూటింగ్ అంతా కాలిఫోర్నియా లోని శాన్‌హోసెలో జరిగింది. ప్రియ కి అమెరికా వెళ్ళడానికి కుదరలేదు. రేవతి గారితో నేను అమెరికా వెళ్ళి షూటింగ్ జరిగిన రెండున్నర నెలలూ అక్కడే ఉన్నాను. రేవతి గారితో పనిచేయడం మరచిపోలేని అనుభవం. ఒక పూర్తిస్థాయి సినిమా నిర్మాణంలో పూర్తిగా ఇన్వాల్వ్ ఐ పనిచేయడం అదే మొదటిసారి. ఎన్నో విలువైన విషయలు నేర్చుకునే అవకాశం లభించింది. అక్కడ వున్నన్ని రోజులూ మా చిన్నపిల్లలిద్దరినీ మావారూ, అమ్మా, నాన్నా, చెల్లి కలిసి చూసుకున్నారు. ఈ విషయంలో అప్పటికీ, ఇప్పటికీ నా కుటుంబ సభ్యులు ఇచ్చిన, ఇస్తున్న సహాయ సహకారాలు వెలకట్టలేనివి.

### *మణి సర్ దగ్గర అసిస్టెంట్‌గా*

'మిత్ర్ మై ఫ్రెండ్' అయ్యాక కొంచెం బ్రేక్ తీసుకున్నాను. రేవతిగారు కూడా తర్వాత వెంటనే సినిమాలేమీ మొదలుపెట్టలేదు. ఆ సమయంలో వేరే ఎవరి వద్దనైనా అసిస్టెంట్‌గా చేరాలని అనుకున్నాను. ఒకప్పటి ప్రముఖ దర్శకుడు బాలాజీ గారి అబ్బాయి సురేష్ బాలాజీ నాకు మంచి మిత్రుడు. తనతో చెప్పినప్పుడు ప్రియదర్శన్ గారి వద్ద చేర్పించడానికి ప్రయత్నిస్తానని అన్నాడు. ప్రియదర్శన్‌గారిని అడిగితే, అప్పటికే తన వద్ద 8 మంది అసిస్టెంట్‌లు ఉన్నారని, క్రిందటి వారమే మరో అసిస్టెంట్‌ని తీసుకున్నాననీ చెప్పారట.

"వేరే ఎవరి వద్ద చేయాలనుకుంటున్నావు?" అని అడిగాడు సురేష్.

"అఫ్‌కోర్స్ మణి సర్.." అన్నాను చాలా కాజువల్‌గా.

"ఓకె..ట్రై చేస్తా.." నన్నాడు సురేష్.

కానీ నాకైతే అస్సలు నమ్మకం లేదు.

మణిరత్నంగారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం అంటే మాటలు కాదు. ఏదో అన్నాడు కానీ అవుతుందటలే అనుకున్నాను. తనకి మణిసర్ ని కలిసి విషయంచెప్పడానికి రెండు మూడు నెలలు పట్టింది. మణి సర్ నా బ్యాక్ గ్రౌండ్ గురించి అడిగారట. సురేష్ తనకి ఎక్కువతెలీదని, నాతోనే డైరెక్ట్ గ మాట్లాడమని చెప్పాడట.

మణిసర్ గారి నుంచి ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చింది. నన్ను నేను నమ్మ లేకపోయాను. ఆయన అంతకు ముందే 'మిత్ర్ మై ఫ్రెండ్' చూసి వున్నారు కాబట్టి నా గురించి పూర్తిగా కాకపోయినా కొంచెం తెలుసు. వెళ్ళాను. గంటన్నర సేపు రకరకాల ప్రశ్నలు వేశారు. అసిస్టెంట్‌గా చేరకుండా నిరుత్సాహ పరచాలని ఆయన ప్రయత్నం. ఆయన వద్ద పనిచేయడమే లక్ష్యమని కన్విన్స్ చెయ్యాలని నా తపన.

"ఇప్పటికే ఒక సినిమాకి అసిస్ట్ చేశావు. సినిమా నిర్మాణమంతా తెలుసు. ఇంకా నా వద్ద నేర్చుకునేదేముంది?"

"అలా కాదు సర్..నాకు ఇంకా కాన్ఫిడెన్స్ రాలేదు.."

"నావద్ద పని చేస్తే కాన్ఫిడెన్స్ వస్తుందనుకుంటున్నావా?"

"మీరు పనిచేసే శైలిని పరిశీలించడమే అరుదైన అనుభవం.. మీ వద్ద అసిస్టెంట్‌గా పనిచెయ్యడం నా జీవితకాలపు కోరిక.."

"నా వద్ద పనిచెయ్యడం చాలా కష్టమైన పని. నేను పర్‌ఫెక్షనిస్ట్‌ని. సెట్స్‌లో సీరియస్‌గా ఉంటాను. నెలల తరబడి ఔట్‌డోర్ షూటింగ్స్ ఉంటాయి. సినిమాకీ సినిమాకి మధ్యలో ఒకటి రెండు సంవత్సరాలు గ్యాప్ ఉంటుంది కూడా.."

వాదోపవాదాల అనంతరం నేనే గెలిచాను.

నా లైఫ్ టైమ్ యాంబిషన్ నెరవేరింది..! ఎవరి సినిమాలు చూసి సినిమా రంగంలో నా కెరీర్ చూసుకోవాలనుకున్నానో, ఆ మణిసర్ దగ్గర అసిస్టెంట్‌గా నా సినీ జీవితం మొదలైంది.

'కన్నత్తిల్ ముత్తమిట్టల్','యువ','గురు' సినిమాలకి మణి సర్ దగ్గర అసిస్టెంట్‌గా ఆరున్నర సంవత్సరాలు పనిచేశాను. అదొక జీవితకాలపు అనుభవం. అరుదైన అవకాశం వచ్చింది కాబట్టి నన్ను నేను నిరూపించుకోవాలనే తపనతో పనిచేసేదాన్ని. నేను మహిళనన్న వ్యత్యాసం రాకూడదని, ఎవరితోనూ విమర్శలు ఎదుర్కోకూడదనే పట్టుదలతోపనిచేశాను. ఉదయం అందరి కంటే ముందుగా నేనే ఆఫీసుకి వెళ్ళేదాన్ని. ఔట్ డోర్ షూటింగ్స్‌లో కూడా ఎప్పుడూ లీవ్ కావాలని అడగలేదు. మగ పిల్లల టైమ్ షెడ్యూల్స్‌కి ఏమాత్రం తీసిపోకుండా నేనూ కష్టపడేదాన్ని. నాలుగు నెలలు పైగా ఔట్ డోర్‌లో ఉండీ, కేవలం ఒకటి రెండు రోజులు మాత్రం శెలవు తీసుకుని ఇంటికొచ్చి పిల్లలని చూసి మళ్ళీ వెళ్ళిపోయేదాన్ని. అన్నేళ్ళూ మా వారూ, నా కుటుంబ సభ్యులే నాకు కొండంత అండగా నిలబడ్డారు. పిల్లలకి ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. 'గురు' చిత్రం తర్వాత సొంతంగా ప్రయత్నాలు చేద్దామని బయటికి వచ్చేప్పుడు మణి సర్ అన్న మాటలు నాకు పెద్ద కాంప్లిమెంట్. తర్వాత సినిమా తీసినా తియ్యకపోయినా ఆయన ప్రశంసలని మించిన సర్టిఫికెట్ లేదనిపించింది. నిజానికి మణిరత్నం గారి వద్ద పనిచేసేప్పుడే ఒక తెలుగు నిర్మాత సిద్దార్థ హీరోగా నాతో సినిమా చేస్తానని, కథ కావాలని అడిగారు. ఐతే అప్పటికింకా నేను రెడీగా లేనని చెప్పాను.



## 'ద్రోహి ' మొదలైందిలా..

2007లో మణి సర్ వద్ద నుంచి బ్రేక్ తీసుకున్నాక కొన్ని నెలలు కుటుంబసభ్యులతో హిమాలయాలకి వెళ్ళాను. అక్కడ మా వారు హైడ్రో పవర్ ప్రోజెక్టు నిర్మిస్తున్నారు. నాలుగు నెలలు ఆ ప్రశాంత వాతావరణంలో ఉండి వెనక్కి వచ్చాము. అప్పటికే నాకు నిర్మాతల వద్దనుంచీ ఆఫర్స్ రావడం మొదలయ్యాయి. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు కూడా చిత్రనిర్మాణంలోకి వచ్చాయి. ఒకటి రెండూ కార్పొరేట్‌ల నుంచీ, ఒక తెలుగు చిత్ర నిర్మాత నుంచీ ఆఫర్లు వచ్చాయి. అన్నీ బేరీజు వేసుకుంటుండగా నాకు ఫ్రెండూ, ఎల్వీ ప్రసాద్ గారి మనుమరాలు ఐన మనో అక్కినేని వద్ద నుంచీ వచ్చిన ఆఫర్‌ని తీసుకోవలనుకున్నాను. ఇద్దరం కథ గురించి చర్చించడం మొదలుపెట్టాము.

తనే ఒకటి రెండు రిఫరెన్సులు ఇచ్చింది కథకోసం.

ఐతే నేను చెప్పాను "నేను సొంతంగా ఒక కథ తయారు చేస్తాను. నీకు నచ్చకపోతే అప్పుడు నువ్వు చెప్పిన రిఫరెన్సులకి వెళ్దాం.." అని.

తను సరేనంది.

నాలుగైదు నెలలు ఒక కథ మీద కూర్చుని దానికో రూపం తెచ్చాను. (ఇది 'ద్రోహి' కథ కాదు, మరోటి).

ఒక రోజు మనో వద్దకెళ్ళి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ దాదాపు గంటన్నరపాటు కథ నెరేట్ చేశాను.

"బ్రిలియంట్..సుధా.. లెట్ అజ్ గో విత్ దిస్.." అంది మనో, మొదటి సిటింగ్ లోనే.

ముందుగా హిందీలో ఆ సినిమా తియ్యాలని మా ప్లాన్.

ఒక పెద్ద హిందీ హీరోతో అప్పాయింట్ మెంట్ తీసుకుని కథ చెప్పడానికి నేను, మనో కలిసి ముంబై వెళ్ళాము. ఆయన కథ అంతా విని, "కథ అద్భుతంగా ఉంది. ఐతే నేను చేస్తున్న స్టైల్ కి ఇది అంతగా సరిపోదు. షారుక్‌ఖాన్ లాంటి వాళ్ళకైతే ఈ కథ సరిగ్గా సరిపోతుంది.." అన్నారు.

ఇద్దరం మాట్లాడుకుంటూ కారు వద్దకి వెళూతుండగా "సుధా..నువ్వేం అనుకోనంటే ఒక మాట చెబుతాను. నీ కథ సుపర్బ్ గా ఉంది. కానీ దీన్ని మొదటి సినిమా గా తియ్యొద్దు. ఎక్కువ కమ్మర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న వేరే కథ ఏదైనా నీ మొదటి సినిమాగా ఎంచుకుంటే బావుంటుంది.." అన్నారాయన.

వెంటనే పది, పదిహేను వాక్యాల్లో 'ద్రోహి' కథ చెప్పాను.

"ఫెంటాస్టిక్.. మొదటి సినిమాగా చెయ్యడానికి ఇది బావుంటుంది,.." అన్నాడాయన.

చెన్నై తిరిగొచ్చాక నాలుగైదు రోజుల తర్వాత వెళ్ళి 'ద్రోహి' లో మొదటి ఏడెనిమిది సీన్లు మనోకి వివరంగా చెప్పాను. మనో పూర్తిగా కన్విన్స్ ఐంది. "వియ్ ఆర్ గోయింగ్ విత్ దిస్" అంది.

ముందునుంచీ హిందీ సినిమానే మా లక్ష్యం కాబట్టి కేస్టింగ్ ఎవరు సరిపోతారా అని వెదికాం. ఐతే కథ ప్రకారం 20 ఏళ్ళకి అటూ ఇటుగా ఉన్న వాళ్ళు కావాలి. హిందీలో అంత చిన్న యాక్టర్స్‌తో చేస్తే బిజినెస్ చెయ్యడం కష్టం. పెద్ద యాక్టర్స్ కథకి సరిపోరు. అప్పుడు మనో "తమిళం లో చేద్దాం. నీకు సౌకర్యంగా ఉంటుందా?" అని అడిగింది. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ అన్నీ కంఫర్టబుల్ జోన్సే కాబట్టి సరే అన్నాను. అలా మొదలైంది నా మొదటి సినిమా 'ద్రోహి'.

## 'ద్రోహి ' ప్రయాణం..

62 సంవత్సరాల క్రిందట 1948 లో మనో వాళ్ళ తాతగారు ఎల్వీ ప్రసాద్ గారు తీసిన మొదటి సినిమా 'ద్రోహి'. ఆ

సినిమా పేరే మా మొదటి సినిమాకి సరిపోవడం సెంటిమెంటల్‌గా కూడా మా ఇద్దరికీ చాలా ఆనందం కలిగించింది.

ఇంక లొకేషన్స్ చూడ్డం తరువాతి ఘట్టం. కథ పరంగా నార్త్ చెన్నైలో ఉన్న రాయపురంలో తియ్యాలని అనుకున్నప్పుడు అందరూ మమ్మల్ని నిరుత్సాహ పరిచారు. అది చాలా ప్రమాదకరమైన ప్రదేశం. కరుడు గట్టిన నేరస్తుల నివాసం.




న్యూయార్క్ బ్రాంక్స్ లాంటిది అందుకే ఎవ్వరూ అక్కడా ఇంతవరకూ ఏ షూటింగూ చెయ్యలేదని చెప్పారు. ఐనా నేను పట్టుదల వదల్లేదు. మట్టి రోడ్లు, మురికి, డార్క్, గ్రెయినీ.. ప్రాంతం అది. అక్కడికి వెళ్ళి స్థానికులతో మాట్లాడాక అక్కడ సురక్షితంగా షూటింగ్ చెయ్యగలనన్న నమ్మకం కలిగింది.

మనో తో.." కొంచెం ఖర్చు ఎక్కువ ఔతుంది. ఐతే కథకి సరిగ్గా సరిపోయే ప్రదేశం రాయపురమే " అని చెప్పాను. తనూ ఒప్పుకుంది.

మా డైరెక్టర్ ఆఫ్ ఫోటో గ్రఫీ ఆల్ఫాన్స్ రాయ్ గారు కూడా రాయపూర్ అనే సరికి చాలా ఉత్సాహ పడ్డారు. పైగా "అలాంటి ప్రదేశం కేవలం నేపథ్యమే కాక కథలో ఆ వూరు కూడా ఒక కేరక్టర్‌గా ఉంటుంది కాబట్టి ఖచ్చితంగా అక్కడే చేద్దాం" అని అన్నారు. అలా మా చిత్రీకరణకి రాయపురం వేదిక ఐంది. అక్కడ వాళ్ళతో మాట్లాడుతూ "ఇంత వెనకబడ్డ ప్రాంతంలో ఎందుకు ఉంటారు, మీకు అవకాశం వస్తే సౌత్ చెన్నైకో , సెంట్రల్ చెన్నై కో వెళతారా?" అని అడిగాను. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ నుంచి




కదలం మేము. ఈ సముద్రం మా జీవితాల్లో అవినాభావంగా అల్లుకుపోయింది. ఇదే మా వూపిరి, జీవితం..దీన్ని ఒదిలి ఎక్కడకీ వెళ్ళం.." అని చెప్పారు వాళ్ళు. వాళ్ళని అక్కడే కట్టి పడేసిన ఆ సముద్రాన్నే మా 'ద్రోహి' సినిమాలో ప్రతి ఐదారు సీన్లకి ఒకసారి వచ్చేలా షూటింగ్ చేశాము.

ఇంక 'ద్రోహి' చిత్రంలోని తారాగణం ఎంపిక విషయానికి వస్తే - రెండు ప్రధాన పాత్రలకి ఇద్దరు యువకులు కావాలి. కొత్తనటుడు విష్ణు స్టిల్స్ చూడగానే అతనైతే కథకి సరిగ్గా సరిపోతాడనిపించింది. నల్లగా, పల్లెటూరి కుర్రాడిలోని మొరటుతనం, కరకుతనం కావాలి. విష్ణుని ఆఫీసుకి పిలిపించినప్పుడు అతన్ని చూడగనే ఆశ్చర్యపోయాను. అతడికి 27-28 సంవత్సరాల వయసు ఉంటుంది. మనిషిలో కూడా పల్లెటూరి మొరటుతనం బదులు పట్నవాసపు సౌకుమార్యం కనిపించింది. ముందుగా ఆశ్చర్యపోయాను. కథలో పాత్రగురించి వివరించగానే 'షూటింగ్ సమయానికల్లా మీరు చెప్పినట్లు మార్చుకుంటాను మేడమ్ ' అని చెప్పిన విష్ణు మహాబలిపురం వెళ్ళి, టానింగ్ చేయించుకుని మొరటుతనం కొట్టొచ్చేలా మారాడు. అలానే తన సహనటుడు శ్రీకాంత్‌తో సరితూగడానికి గాను 9 కిలోలు బరువు తగ్గాడు. శ్రీకాంత్ 15 కిలోలు బరువు పెంచుకున్నాడు. ఆ విధంగా ఇద్దరూ తమ పర్సనాలిటీలని సమం చేసుకుని కథలోని పాత్రలకి నూటికి నూరు శాతం న్యాయం చేకూర్చారు. మా సినిమా కంటే ముందుగానే విడుదలైన 'వెన్నెల కబడ్డీ కులు' సినిమా విష్ణు మీద మాకున్న నమ్మకాన్ని రెట్టింపు చేసింది.

ఇంక స్త్రీ పాత్రల విషయానికి వస్తే మూడు ప్రధానమైన పాత్రలున్నాయి. ఒక పాత్రకి నా ఫ్రెండ్ పూజని ఎంపిక

చేసుకున్నాను. ఇంకో పాత్రకి మళయాళీ నటి పూర్ణ సరిపోతుందనిపించింది. తనకి తమిళం అంతగారాదు. తనని చెన్నైకి పిలిపించి లంగా,ఓణి డ్రెస్‌లో ఫోటోలు తీశాము. అలానే నేను కథ చెబుతూ తనకి తెలీకుండానే ఐ-ఫోన్ లోనూ, డిజిటల్ కెమేరాతోనూ షూట్ చేశాము. నేను సీన్లు వివరిస్తున్నప్పుడు తన ఎక్స్‌ప్రెషన్స్ అద్భుతంగా వచ్చాయి. ఆ పాత్రకి తను సరిగ్గా సరిపోతుందని పూర్తి నమ్మకం కలిగింది. ఇంక మిగిలిన మూడో పాత్రకి యేంజిలిక్ లుక్ ఉన్న అమ్మాయి కావాలి. పూనా అమ్మాయి పూనమ్ బజ్వా ఫోటోలు చూశాక తన నవ్వులో నేను వెదుకుతున్న యేంజిలిక్ లుక్ కనిపించింది. ఒక వైపు బ్రాహ్మణ యువతి గానూ, కొన్ని దృశ్యాల్లో వృద్ధ పాత్రలోనూ నటించాలి. రెండు పాత్రలనీ చేయడానికి పూనమ్ అంగీకరించింది. సామాన్యంగా కెరీర్ మొదట్లో ముసలి పాత్రలో కనిపించడానికి యంగ్ హీరోయిన్లు ఒప్పుకోరు. ఈ విషయంలో పునమ్ చాలా ప్రొఫెషనల్‌గా రెండు పాత్రలకీ అద్భుతంగా న్యాయం చేసింది. కేరక్టర్స్ అందరికీ సంభాషణలన్నీ ఆరునెలలు ముందుగానే ఇవ్వడం జరిగింది. సెట్స్‌కి రాగానే ఎవ్వరూ స్క్రిప్ట్ పాడ్ చూసే అవసరం రాలేదు. ఇందువల్ల కూడా నేననుకున్న ఎఫెక్ట్స్ రాబట్టుకోవడానికి అంత కష్టపడాల్సిన అవసరం రాలేదు.

ప్రొడ్యూసర్ మనోతో మాట్లాడినప్పుడు ముందుగా 70 రోజుల షూటింగ్ అనుకున్నాం. నేను 53 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశాను. ఏ పాత్రకీ అత్యవసరమైతే తప్ప రెండో టేక్‌కో మూడో టేక్‌కో వెళ్ళే వాళ్ళం. అంతకు మించి ఎప్పుడూ షూటింగ్ సమయాన్ని వెచ్చించలేదు. ముందు చేసుకున్న ఏర్పాట్లు అంత పకడ్బందీగా ఉన్నాయి. పైగా రెండో టేక్‌లో రాని ఎఫెక్టు 20వ టేక్‌లో వస్తుందని నేను నమ్మను.

మిగతా సాంకేతిక నిపుణులంతా తమ తమ రంగాల్లో బెస్ట్ అనిపించుకున్నారు. ఫలితం ఈ రోజు తమిళ ప్రేక్షకులు ‘ద్రోహి‘ కి చూపిస్తున్న ఆదరణ. రాయపురంలో తీయడం ప్రమాదకరమని అన్నవాళ్ళే కాక ఎవ్వరూకూడా మేము రాయపురాన్ని చూపించిన విధానాన్ని ఏమాత్రం తప్పుపట్టలేదు. ఇది కూడా నాకెంతో సంతోషం కలిగించే విషయం.!

అదండీ నా మొదటి సినిమా ‘ద్రోహి‘ వరకూ జరిగిన పదేళ్ళ ప్రయాణం..! ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా విజయానికి సహకరించిన కుటుంబసభ్యులకి, మిత్రులకి శ్రేయోభిలాషులకి ‘కౌముది‘ ముఖంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ‘కౌముది‘ పాఠకులకి హృదయపూర్వక అభివందనాలు.

(నవంబర్ 2010 సంచికలో ప్రచురితం)

# వంశీ పైడిపల్లి

**నాన్నగారి ఆశయం అతనో విద్యాధికుడు కావాలనేది.**మంచి స్కూళ్ళు మంచి చదువు.. డిగ్రీ.. అందరూ కోరుకునే సాఫ్ట్‌వేర్ జాబ్. అన్నింటినీ మించి సినిమాలంటే ఆకర్షణ. దర్శకుడిగా మొదటి అవకాశం మిస్ ఫైర్..! నిరాశా నిస్పృహ లోంచి పోటెత్తిన కెరటమైన సృజనాత్మకత...రెండో సినిమా సూపర్ డూపర్ హిట్! ***వంశీ పైడిపల్లి*** గా ఈ రోజు తెలుగు ప్రేక్షకులందరికీ చిరపరిచితమైన ***పైడిపల్లి వంశీధర రావు*** సినీ జీవన ప్రస్థానంలోని మొదటి మలుపులు ఇవన్నీ. ఇటీవలే జూనియర్ ఎన్టీఆర్‌తో నిజమైన కుటుంబగాథా చిత్రాన్ని అందించి తెలుగు ప్రేక్షకుహృదయాల్లో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న యువదర్శకుడు ***వంశీ పైడిపల్లి*** గారి మొదటి సినిమా జ్ఞాపకాలు... .




***సినిమా హాలు చుట్టూ తిరిగిన చిన్నతనం..***

నేను పుట్టింది హైదరాబాదులోనే ఐనా, ఐదేళ్ళు వచ్చేవరకూ పెరిగింది అదిలాబాద్ జిల్లా ఖానాపూర్ అనే వూళ్ళో. నాన్న గారి పేరు పైడిపల్లి రవీంద్రరావు (ప్రస్తుతం ఎ.పి.పి.ఎస్.సి మెంబర్ ), అమ్మగారి పేరు ఉమాదేవి. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు. చాలామంది నన్ను అడుగుతారు ‘మీకు సినిమాలంటే ఎప్పటి నుంచీ ఇంట్రెస్టు పెరిగింది?‘ అని. నిజంగా చెప్పాలంటే నేను పుట్టక ముందునుంచే సినిమాలకీ నాకూ అవినాభావ సంబంధం ఏర్పడిందేమో అనుకుంటాను. నేను పుట్టటానికి మూడూ నెలలు ముందరే నాన్న గారు ఖానాపూర్‌లో ఒక సినిమా థియేటర్ నిర్మించారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి తప్పటడుగులు, చిలిపి పనులు అన్నీ సినిమా థియేటర్ ఆవరణలోనే. ఇంట్లో కూడా సినిమాల గురించిన చర్చలూ, కలెక్షన్లూ, పంపిణీ విశేషాలు..ఇవన్నీ కామన్ గా ఉండేవి.

చిన్నప్పటి నుంచి నన్ను మంచి స్కూల్లో చేర్పించి, ఉన్నతమైన విలువలతో మంచి డిగ్రీ చదివించాలని నాన్నగారి మొదటి ఆశయం. అందుకు తగినట్లే నాకు ఐదేళ్ళ వయసు ఉన్నప్పుడే హైదరాబాదు పబ్లిక్ స్కూల్లో చేర్పించారు. ఒకటో తరగతి నుంచే అక్కడ హాస్టల్లో ఉంటూ చదువుకోవడం మొదలుపెట్టాను.

ఐతే సంవత్సరానికి మూడుసార్లు (దసరా,సంక్రాంతి, వేసవికాలం) శెలవులకి ఇంటికి పంపించే వాళ్ళు. ఆ రోజుల్లో కూడా ఎక్కువ సమయం థియేటర్‌లోనే గడిపేవాడిని. ఐదో తరగతి వచ్చేసరికే ప్రొజెక్టర్‌లో రీళ్ళు ఎక్కించడం, కార్బన్ రాడ్స్ సరిచెయ్యడం, రీళ్ళ మీద గీతలు పడితే కట్ చేసి మళ్ళీ నేర్పుగా అతికించడం ..అప్పుడప్పుడూ టికెట్ కౌంటర్‌లో కూర్చోవడం..అన్నీ అలవాటయ్యాయి.

***గోడ దూకించిన సినిమాలు - స్వస్తి పలికించిన హాస్టల్ జీవితం***

ఊళ్ళో ఉండగా రోజూ సినిమాలు చూసే అలవాటు స్కూలుకి వచ్చినా తొలుస్తూ ఉండేది. ముఖ్యంగా చిరంజీవిగారి సినిమాలంటే పడి చచ్చిపోయేవాళ్ళం. ఏడో తరగతిచదువుతున్నప్పుడు అనుకుంటా వేసవి శెలవుల్లో 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' సినిమా విడుదలైంది. కొత్త సినిమా మా వూళ్ళో చూసే అవకాశం లేదు. హైదరాబాదు హాస్టల్‌కి తిరిగి రాగానే ఎలాగైనా ఆ సినిమా చూడాలన్న ఆతృత నాతో హాస్టల్ గోడలు దూకించింది. నాన్నగారికి కంప్లెయింట్ వెళ్ళింది. చేసిన తప్పుకి శిక్ష అనుభవించక తప్పదుకదా.. గోడ దూకి సినిమాకి వెళ్ళినందుకు ప్రతిఫలం నాన్నగారి చేతిలో దెబ్బలు తినడం. అలాంటి అలవాట్లని మొగ్గలోనే తుంచాలనుకున్న నాన్నగారు ఫేమిలీ అంతటినీ హైదరాబాదుకి షిఫ్ట్ చేసి, నన్ను హాస్టల్ నుంచి మార్పించి, ఇంటి నుంచే స్కూలుకి వెళ్ళేలా చేశారు.

ఆ విధంగా ఎనిమిదో తరగతి నుంచి డే స్కాలర్‌గా స్టూడెంట్ లైఫ్‌లో రెండో దశ మొదలైంది. పదో తరగతి వరకూ పబ్లిక్ స్కూల్లోనే, ఇంటివద్దనుంచే వెళుతూ, చదువుకున్నాను.

***కాలేజీ రోజులు***

ఇంటర్మీడియట్‌కి లిటిల్ ఫ్లవర్ స్కూల్లో చేర్పించారు నాన్నగారు. లెక్కలు, సైన్సు అంటే పెద్దగా ఆసక్తిలేదు కాబట్టి సి.యి.సి గ్రూపు తీసుకున్నాను. కాలేజీకి వెళ్తున్నాను కానీ సినిమాలమీద క్రేజ్ ఐతే ఏ మాత్రం తగ్గలేదు. అప్పుడప్పుడూ క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకి వెళ్ళడం సాధారణమైపోయింది. డిగ్రీకి బద్రుకా కాలేజీలో బి.కామ్‌లో చేరాను. ఎప్పుడూ మంచి ఇన్‌స్టిట్యూట్స్ లోనే చదవాలని నాన్నగారు శ్రద్ధ తీసుకునే వారు. రికమండేషన్ చేసి మరీ మంచి కాలేజీలనే ఎంపిక చేసి పంపించే వారు. డిగ్రీ కూడా అలానే గడిచింది. డిగ్రీ ఐపోయాక నాన్న గారికి చెప్పాను 'సినిమాలంటే చాలా ఇంట్రెస్టుగా ఉంది.. ఆ వైపు వెళతాను..' అని.

నాన్నగారు నచ్చజెప్పారు 'ఆ ఫీల్డ్ మనకి చాలా కొత్త. అస్సలు స్థిరత్వం లేని ఫీల్డ్ అని రకరకాల కథలు వింటున్నాం. అలాంటి ఆలోచనలు మానుకుని శుభ్రంగా ఎమ్.సి.ఎ లో చేరు..' అన్నారు.

నాన్నగారి మాటకి ఎదురుచెప్పకుండా బద్రుకా కాలేజీలోనే ఎమ్.సి.ఎ. కోర్సులో చేరాను. కాలేజీకి రెగ్యులర్‌గా వెళుతూనే బయట ఎస్.క్యు.ఎల్.స్టార్ లో ఒరాకిల్, సన్ మైక్రో సిస్టమ్స్‌లో జావా లాంటి అడ్వాన్స్‌డ్ కోర్సులు కూడా చేశాను. కంప్యూటర్ క్రేజ్ విపరీతంగా ఉన్న రోజులవి... ఈ కోర్సులు ఇలా జరుగుతున్నా సినిమాల వైపు ఒక కన్నేసే ఉంచాను. అప్పటికి ఖానాపూర్ లోని మా వూళ్ళోని థియేటర్‌ని ఆధీనీకరించి దిల్ రాజు, శిరీష్, లక్ష్మణ్ గార్లకి లీజు ఇచ్చారు నాన్నగారు. ఆ విధంగా నాన్నగారికి దిల్ రాజు గారు క్లోజ్ అయ్యారు. ఆ రోజుల్లో హిట్ సినిమాలన్నీ 'ఖుషీ','నువ్వునాకు నచ్చావ్','మురారి' లాంటివి దిల్ రాజు గారు వాళ్ళు రిలీజ్ చేసినవే. కొత్త సినిమాకి మొదటి రోజు టిక్కెట్ల కోసం దిల్ రాజుగారి ఆఫీసుకి వెళ్తుండే వాడిని. విజిటర్స్ రూములో వెయిట్ చేస్తూ దిల్ రాజు గారు బయటికి వచ్చినపుడు టిక్కెట్ల గురించి అడిగేవాడిని. వెంటనే టిక్కెట్లు దొరికేవి. ఆ విధంగా మా ఫ్రెండ్స్ టీమ్‌లో నన్ను లీడర్‌గా చూసేవారు. కొత్త సినిమా అంటే అందరి టిక్కెట్లకీ నాకే పనిపడేది. దిల్ రాజుగారిని కలుస్తున్నప్పుడు 'అంకుల్ ' అని పిలుస్తుండే వాడిని. (పదేళ్ళ తర్వాత వాళ్ళు తీసే సినిమాకి నేను డైరెక్టర్‌ని అవుతానని నేను కలలో కూడా ఊహించలేదు, వాళ్ళూ అస్సలు అనుకుని ఉండరు..!)

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం!**

ఎమ్.సి.ఎ అయ్యాక అమెరికా వెళ్ళడానికి హెచ్1 కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. పేపర్లు సబ్మిట్ చెయ్యడం కూడా జరిగింది. ఐతే అంతలోనే 9 / 11 ఉపద్రవం జరగడం , సాఫ్ట్ వేర్ మార్కెట్‌లో ఒడుదుడుకులు.. నా అమెరికా ప్రయత్నాలు వెనక్కి వెళ్ళిపోయాయి. ఎస్.ఎ.పి కోర్సు చేసి హిమాయత్ నగర్‌లో సిలికాన్ వేలీ సిస్టమ్స్ అనే కంపెనీలో ఉద్యోగానికి చేరాను. ఆ విధంగా సినిమా డైరెక్షన్ అనుకున్న వాడిని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం మొదలు పెట్టాను.

నా భవిష్యత్తులో ఒక మంచి మలుపుకి కారణమైన ఒక పరిచయం గురించి ఇక్కడ చెప్పాలి. నేను ఎన్.ఐ.ఐ.టిలో కంప్యూటర్ కోర్సులు చేసేప్పుడు ఒక కామన్ మిత్రుడు ద్వారా మార్తాండ్ ఎన్.శంకర్ ('ఎవరైనా..ఎపుడైనా..' దర్శకుడు) పరిచయమయ్యాడు. తొందరలోనే ఇద్దరం మంచి స్నేహితులమయ్యాం. నాకు పరిచయమైన మరుసటి రోజే తను జయంత్ గారి వద్ద 'ప్రేమించుకుందాం..రా.. ' సినిమాకి అసిస్టెంట్ గా చేరబోతున్నాడు. మా పరిచయం బాగా పెరిగింది, తన ద్వారా మార్తాండ్ వెంకటేష్ గారు క్లోజ్ అయ్యారు. ఆ పరిచయం వల్ల 'తమ్ముడు ','బద్రి','ప్రేమంటే ఇదేరా' లాంటి చాలా సినిమాలని విడుదలకి ముందే 'ప్రివ్యూ' దశలోనే చూసే అవకాశం కలిగింది. సినిమాల పిచ్చి ఉన్న నాకు విడుదలకి ముందే సినిమా చూడడమనేది గొప్ప థ్రిల్లింగ్'గా ఉండేది. ఒక వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..ఇంకోవైపు శంకర్ ద్వారా సినిమా ఫీల్డ్‌విశేషాలు తెలుసుకుంటూ ఉండడం.. ఇలా రోజులు గడుస్తుండేవి.

2002 మార్చి చివరి వారంలో అనుకుంటాను.. 'ఆది' సినిమా విడుదలైంది. యథాప్రకారం మోర్నింగ్ షోకి వెళ్ళాం. సినిమా నాకు బాగా నచ్చేసింది. ముందు నుంచి కూడా మాస్ సినిమాలంటే ప్రత్యేకమైన అభిమానం ఉండేది. మాస్ సినిమాల్లో 'ఆది' న్యూ ట్రెండ్ అనిపించింది. సినిమా చూసి బయటికి వస్తుంటే పది, పదిహేను మంది కలిసి ఒక వ్యక్తిని చేతులమీద పైకి లేపి జయజయ ధ్వానాలు చేస్తున్నారు. నేనూ వాళ్ళతో బాటు పరుగెత్తాను. అతనే నేటి సూపర్ డూపర్ డైరెక్టర్ వి.వి.వినాయక్. ఆ దృశ్యం నా మీద విపరీతమైన ప్రభావం చూపించింది. సినిమాల్లో పేరు తెచ్చుకోవాలంటే ఒక్క హిట్ సినిమా తీసినా చాలు... కలలు నిజం చేసుకోవడం అసాధ్యం కాదు అనడానికి ఎన్టీఆర్, వినాయక్ గార్లు ప్రత్యక్ష నిదర్శనంగా కనిపించారు. ఇంక సినిమాల ఆకర్షణ నుంచి ఎ క్కువ రోజులు తప్పించుకోలేకపోయాను. ఆ సినిమా చూసిన నాలుగైదు రోజుల తర్వాత, ముందుగా అమ్మకి చెప్పాను " అమ్మా..నాకు సినిమలంటేనే



ఎక్కువ ఇంట్రెస్టు గా ఉంది. ఉద్యోగం చెయ్యలేను. సినిమాల్లోకి వెళ్తాను. నాన్నగారిని ఎలాగైనా నువ్వే ఇప్పించాలి.." అని.. నాన్నగారికి సూటిగా చెప్పే ధైర్యం లేదు. చిన్నప్పటినుంచి అమ్మ నాకు పెద్ద సపోర్టింగ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేసిపెట్టింది. ఒక్కడే కొడుకునవడం వల్లనేమో నేను ఎప్పుడు ఏది అడిగినా కాదనలేదు. అదే ధైర్యంతో తన వద్ద నా కోరిక చెప్పాను. అమ్మ నెమ్మదిగా నాన్న గారిని ఒప్పించింది. ఆ విధంగా సాఫ్ట్ వేర్ నుంచి సినిమా రంగానికి దూకడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. అప్పటికి నాకూ, చిత్రరంగానికి ఉన్న ఒకే ఒక్క వారధి మార్తాండ్ శంకర్.

**సినీరంగ ప్రవేశం**

శంకర్ అప్పుడే జయంత్ గారి వద్ద నుంచీ వేరే యూనిట్ కి షిఫ్ట్ అవుతూ నన్ను జయంత్ గారికి పరిచయంచేశాడు. అప్పటి నుంచీ తరచూ జయంత్ గారిని కలుస్తూ ఉండేవాడిని అవకాశం కోసం. దాదాపు మూడు,

నాలుగు నెలలు గడిచాయి. ఇంకా గుర్తుంది 2002 జూలై 21.. అప్పటికే చాలారోజులనుంచీ తిరుగుతున్నాను. ఇంక తీసుకోరేమో అనుకుంటున్న సమయంలో జయంత్ గారి ఆఫీసులో కూర్చుని ఉన్నాను. ఆయన లోపలికి వెళ్తూ నన్ను చూసి 'రేపటి నుంచి షూటింగ్‌కి రావోయ్ ' అని చెప్పారు. అది నాకు అత్యంత సంతోషకరమైన క్షణం.. నా చిరకాల వాంఛ నెరవేరబోతోంది. అలా ఆ మరునాడే జయంత్ గారి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ గా నా సినీ జీవితం మొదలైంది. ఆ సినిమా 'ఈశ్వర్'. ప్రభాస్ గారికి కూడా అదే మొదటి సినిమా. ఆ సినిమా షూటింగ్ నుంచే ప్రభాస్ గారికి నాకూ మంచి స్నేహం మొదలైంది. ఆ సినిమా 2002 నవంబర్ 11న అనుకుంటా విడుదలైంది. దాని తర్వాత జయంత్ గారికి 'లక్ష్మీ నరసింహా' సినిమా వచ్చింది. దానికి కూడా నేను అసిస్టెంట్‌గా చెయ్యాల్సి ఉంది కానీ కారణాంతరాల వల్ల ఆయన స్టాఫ్ అంతా ముందుగానే ఫిక్స్ ఐపోవడంతో నాకుస్థానం దొరకలేదు.

***మరిన్ని అవకాశాలతో ముందుకి.***




అలాంటి రోజుల్లోనే ఒకసారి ప్రభాస్ కనిపించినపుడు నేను ఖాళీగా ఉన్నానని తెలుసుకున్నారు. అప్పుడాయన 'వర్షం' సినిమా షూటింగ్‌లో ఉన్నారు. ' వంశీ.. నేను ఎమ్మెస్ రాజుగారికి చెబుతాను.. రేపు వచ్చి కలువు' అన్నారు. ఆ విధంగా ప్రభాస్ రికమండేషన్‌తో ఎమ్మెస్ రాజు గారిని కలుసుకోవడం, ఆయన నా అదృష్టం కొద్దీ 'వర్షం' సినిమాకి దర్శకుడు శోభన్ గారికి అసోసియేట్‌గా నియమించారు. అదీ నాకు అదృష్టమే. సాధారణంగా అసిస్టెంట్ నుంచీ అసోసియేట్ కావడానికి మూడు నాలుగు సినిమాల సమయం కావాల్సి ఉంటుంది. ఐతే నాకు రెండో సినిమాకే అసోసియేట్‌గా పనిచేసే సదవకాశం దొరికింది. 'వర్షం' సినిమా చివరలో మూడు పాటలకి లారెన్స్ మాస్టారు డాన్స్ డైరెక్షన్ చేశారు. ఆ సమయంలో నన్ను, నా వర్క్‌ని గమనించిన ఆయన తన సినిమా 'మాస్'కి అసోసియేట్‌గా రమ్మని ఆహ్వానించారు. ఆ విధంగా 'వర్షం' రిలీజ్ కాక ముందే, లారెన్స్ గారితో 'మాస్' సినిమాకి పనిచేశాను. ఇలా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో నా కెరీర్ సాగుతున్న సమయంలోనే దిల్ రాజు గారిని అప్పుడప్పుడూ కలుస్తూ ఉండేవాడిని. నేను మాస్‌కి పనిచేస్తున్నప్పుడు ఆయన 'ఆర్య' తీస్తున్నారు. 'వంశీ..మా బేనర్ లోకి వచ్చెయ్యరాదూ..?' అని పిలిచారు. అప్పటికే చాలా సంవత్సరాల నుంచీ పరిచయం వున్న టీమ్ అవడంతో ఆయన టీమ్ లోకి వెళ్ళడం నాకూ సంతోషంగా అనిపించింది. 'మాస్' పూర్తవగనే దిల్ రాజు గారి వద్దకి వెళ్ళాను, 2004 డిసెంబర్‌లో. అప్పటికే 'భద్ర' షూటింగ్ మొదలైంది. బోయపాటి శీను గారి వద్ద అసోసియేట్‌గా చేరాను. ఆ సినిమా సిట్టింగ్స్‌లో నేను పాల్గొనడం, నన్ను బాగా గమనించిన దిల్ రాజుగారు 'కథ రేడీ చేసుకో..నిన్ను డైరెక్టర్‌ని చేస్తాను..' అన్నారు. అదీ నా జీవితంలో ఒక పెద్ద మలుపు. సినీ జీవితంలోని మలుపు గురించి చెప్పేముందు 'భద్ర' షూటింగ్ లోనే జరిగిన నా వ్యక్తిగత జీవితంలో జరిగిన ఇంకో మలుపు గురించి చెప్పాలి..

***నిజ జీవితంలో ప్రేమకథ.***

'భద్ర' సినిమా షూటింగ్ కోసం బెంగుళూరు వెళ్ళాం. ఆ సినిమాకి డిజైనర్‌గా పనిచేస్తున్న శ్వేత నాకు మంచి ఫ్రెండ్ ఒకరోజు శ్వేత ని కలుసుకోడానికి ఆమె ఫ్రెండ్ మాలిని షూటింగ్ స్పాట్‌కి వచ్చింది. మాలినిని చూడగానే నాలో ఏదో తెలీని

స్పందన.. తొలిచూపులో ప్రేమ అని దాన్నే అంటారేమో అప్పట్లో అనుకోలేదు. మాలినిలో ఏదో ప్రత్యేకత కనిపించింది. ఆ రోజు తన బర్త్ డే కూడా. ఆ రోజు తర్వాత ఒక వారం షూటింగ్‌కి హోస్పేట వెళ్ళాం. అప్పుడు కూడా శ్వేతకి మాలిని ఫోన్ చేసినప్పుడు నేను తీసుకుని మాట్లాడేవాడిని. మాలినికి తెలీకుండానే, తన ఫేస్ కూడా సరిగా గుర్తులేని మొదటి వారంలోనే, నాకు తనమీద అభిమానం రోజురోజుకీ పెరిగిపోయింది. హోస్పేటలో ఉన్న ఒక్క వారం రోజుల్లోనే డిసైడై పోయాను, మాలినిని నా జీవిత భాగస్వామినిగా ఆహ్వానించాలని. ఆ విషయం మాలినికి చెప్పేకంటే ముందుగా దిల్ రాజు గారికి చెప్పాను, ఎందుకంటే నేను స్టూడెంట్ గా వున్నప్పుడు 'అంకుల్' అని పిలిపించుకున్న రాజు గారే నా కెరీర్ స్థిరపడడానికి, మలుపు తిరగడానికి కారణమౌతారని అంతరాంతరాల్లో ఎక్కడో సిక్స్ సెన్స్ అప్పుడే చెప్పిందేమో.

హోస్పేటలో షూటింగ్ ముగించుకుని బెంగుళూరు వెళ్ళినప్పుడు మాలినికి కబురు పెట్టి పిలిచాను. మొహమాటం లేకుండా మనసులోని మాట చెప్పాను. "నువ్వే నా లైఫ్ పార్ట్నర్ అనిపిస్తోంది. ప్రస్తుతం అసోసియేట్‌గా వున్నాను. ఒక్క సంవత్సరంన్నర గడువు ఇవ్వు. ఈ లోగా నన్ను నేను ప్రూవ్ చేసుకునే స్థాయికి చేరుకుంటాను. నిన్ను పెళ్ళి చేసుకుంటాను.." అని. చాలా మంది అమ్మాయిల్లాగే తను వెంటనే 'ఓ.కె' అని చెప్పలేదు. 'నాకు కాస్త టైమ్ కావాలి ' అని తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. కొన్ని నెలల తర్వాత మే 2005లో తను నా ప్రపోజల్‌కి ఓకె చెప్పింది. అక్కడ నుంచీ నాలో ఏదో తెలీని నూతనోత్సాహం, ఉత్తేజం.. మాలిని గురించిన ప్రతి ఆలోచనా నాకు అంతులేని మానసిక బలాన్నిచ్చేది. నా వ్యక్తిగత జీవితంలో ఒక నూతన అధ్యాయానికది నాంది.

***మిస్ ఫైర్ ఐన మొదటి సినిమా***

అప్పటికే దిల్ రాజుగారి నుంచి ఆఫర్ ఉండడంతో ఆయనకి కథ చెప్పాను. అదొక యూత్ సబ్జెక్టు. ఐతే రాజుగారు 'వంశీ నువ్వు యాక్షన్ సినిమాలు బాగా చెయ్యగలవు. ఆ లైన్ లో ఏదైనా స్టోరీ చెయ్యి' అని సలహా ఇచ్చారు. అలా వచ్చిందే 'మున్నా' సినిమా. 2005 ఆగస్టులో మున్నా కథ రాజుగారికి చెప్పడం. ఆయన ఓకె చెయ్యడం, ప్రభాస్‌కి కూడా నచ్చడం.. చక చకా జరిగిపోయాయి. 2006లో షూటింగ్ మొదలుపెట్టి 2007 మే 2న విడుదల చేశాము. కొన్ని ఏరియాల్లో కొద్ది పాటు లాభాలు వచ్చినా, మొత్తం మీద మేము అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాము. ఎక్కడో మా అంచనాలు తప్పాయి. కథలోనే మాకు మేమే పరిధులు విధించుకున్నామేమో అనిపించింది. దిల్ రాజు గారినీ, నన్నూ కూడా నిరాశ పరిచాయి 'మున్నా' ఫలితాలు.

***పరీక్షా సమయం***

'మున్నా' అయ్యాక సంవత్సరంన్నర పాటు నాకు అత్యంత క్లిష్టమైన సమయం. 'ఎందుకిలా జరిగింది? ఎక్కడ తప్పు జరిగింది? కెరీర్ ఏమౌతుంది? అసలు మళ్ళీ సినిమాలు చెయ్యగలనా? అవకాశాలు వస్తాయా..?' రకరకాల ఆలోచనలు, అనుమానాలు.. కొన్ని రోజులు డిప్రెషన్..అంతలోనే 'లే పదా.. బ్రదర్..' అని నన్ను నేను వెన్ను తట్టుకోవడం. సంవత్సరంన్నర పాటు అలా గడిచింది.

2007 జూలై 4 న మాలినితో నా వివాహం జరిగింది. ఎన్నో ఆశలతో తనని నా జీవితంలోకి ఆహ్వానించాను. మా జర్నీ మొదలయ్యే సరికి నేను ఫ్లాప్ డైరెక్టర్‌గా ప్రేక్షకుల ముందు నిలిచిన సమయం. కొత్తగా పెళ్ళైన అమ్మాయికి భర్తని అలా చూడడం అంటే ఎంత కష్టంగా ఉంటుందో ఊహించుకోగలను. ఐతే మాలిని ఇచ్చిన మానసిక స్థైర్యం అంతా ఇంతా కాదు. అది వెలకట్టలేనిది. తెలిసిన వాళ్ళు చాలా మంది అమ్మానాన్నలని 'ఏమిటీ మీ అబ్బాయి సినిమా ఫెయిల్ ఐందటగదా ..ఏం చేస్తున్నాడు మరి? మళ్ళీ ఉద్యోగంలోకి వెళ్ళిపోతాడా?' ఇలా రకరకాల వ్యాఖ్యానాలు. ఐనా అమ్మా, నాన్నా అవేమీ నావద్దకి రానివ్వలేదు. ఒక్కరోజు కూడా నాన్న గారు 'ఐందేదో ఐపోయింది. ఇంక సినిమాలు మానేసి ఉద్యోగమేమన్నా చూసుకో' అనలేదు.కుటుంబ సభ్యులెవరూ ఏ రోజూ నన్ను నిరాశపరచే మాటలు అనలేదు. అందరూ నన్ను ప్రోత్సాహ పరచి, నాకు పోజిటివ్ స్పిరిట్ ఇవ్వాలని ప్రయత్నించిన వాళ్ళే.

నాకు మరో మార్గం లేదు. నన్ను నేను మళ్ళీ నిరూపించుకోవడమొక్కటే ముందున్న దారి. ఎందుకంటే సినిమా కోసం అన్నీ వదులుకుని వచ్చాను. సినిమానే ప్రాణం..సినిమానే పాషన్ అనుకుంటున్న వాడిని. పోయిన చోటనే వెదుక్కోవాలి. ఓడిన రంగంలోనే విజయం కోసం పోరాడాలి.. అసలు ప్రేక్షకులకి ఏం కావాలి.. నేను ఎందుకు వాళ్ళని చేరలేక పోయాను.. మధనం..మధనం..అంతర్మధనం..




ఈ ఆలోచలనల లావా లోంచి పుట్టిందే 'బృందావనం' సినిమా కథ.

### పడిలేచిన కెరటం ..అదే 'బృందావనం'

2008 నవంబర్‌లో దిల్ రాజు గారికి 'బృందావనం' కథ చెప్పాను. ఆయనకి మొదటి సిటింగ్ లోనే నచ్చింది. ఎవరైనా పెద్ద హీరోతో చేస్తేనే ఆ కథకి న్యాయం చేసిన వాళ్ళమౌతామని ఆయనా నమ్మారు.. ఆయనే ఎన్టీఆర్ వద్దకి నన్ను పంపించారు. మరునాడే జూనియర్ ఎన్టీఆర్‌కి కథ చెప్పాను. ఆయనకీ వెంటనే నచ్చేసింది. అంతే.. 24 గంటల లోపే నా భవిష్యత్తుకి ఒక సువర్ణావకాశం లభించింది. ప్రి-ప్రొడక్షన్ పనులు జరుగుతున్న సమయంలోనే 'అదుర్స్' షూటింగ్ జరుగుతుండడం.. మధ్యలో ఎన్టీఆర్‌కి యాక్సిడెంట్ జరగడం..మూడు నాలుగు నెలలు ఆయన షూటింగ్‌లకి దూరంగా ఉండడం.. వీటన్నింటి వల్లా 'బృందావనం' షూటింగ్ 2009 డిసెంబర్ లో మొదలైంది. 'బృందావనం' నాకో బంగారు కల. ఆ కలని ప్రేక్షకులు వాస్తవం చేశారు. ఆ సినిమా విజయం గురించి నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు కదా! ఈ రోజు మనం ఇలా ఫోన్‌లో మాట్లాడుకోడానికి కారణం కూడా 'బృందావనం' సినిమానే!

తారక్ గారు 'బృందావనం' గురించి ప్రస్తావించినప్పుడల్లా 'వంశీ చాల ఎమోషనల్. సినిమాలంటే ప్రాణాలను మించిన అభిమానం. నేనెప్పుడూ అంటుండే వాడిని ఈ సినిమా రంగం అంతా తాత్కాలికమైంది. దీని మీద అంత అభిమానం పెంచుకోవద్దు.. అని. ఐనా వంశీకి మాత్రమే ఈ సినిమా శ్వాస..జీవం..ప్రాణం..' అని. నిజంగానే ఈ సినిమాకి అలానే పనిచేశాను. 'బృందావనం' మొదలైన కొద్ది రోజులకే 2009 డిసెంబర్ 31 న మాకు అమ్మాయి 'ఆద్య' పుట్టింది. తన తొలిరోజులు, ఎదుగుదలని కూడా నేను పూర్తిగా అస్వాదించలేకపోయాను. ఎందుకంటే నా కాన్సన్ ట్రేషన్ అంతా 'బృందావనం' మీదనే. అందరి నమ్మకాలనీ నిజం చేస్తూ ఈ రోజు ప్రేక్షకులు సినిమాకి బ్రహ్మ రథం పట్టారు. అందుకు నేను వారి కెప్పుడూ ఋణపడి ఉంటాను.

అలానే మొదటి సినిమా సరిగా ఆడకపోయినా రెండో అవకాశాన్నిచ్చిన దిల్ రాజుగారికి కూడా ఆజన్మాంతం కృతజ్ఞుడినై ఉంటాను. సహజంగానే ఫ్లాప్ డైరెక్టర్‌తో మళ్ళీ సినిమా, అందునా భారీ బడ్జెట్‌తో, అని ఎవరైనా కామెంట్ చెయ్యడం సహజం. ఐతే తారక్ గారు, దిల్ రాజు గారు ఇద్దరూ 'మున్నా సినిమాగా ఫెయిల్ అయింది కానీ వంశీ డైరెక్టర్‌గా ఫెయిల్ కాలేదు. ఒక హీరోని ఎలా ప్రెజెంట్ చెయ్యాలి, ఒక సీన్ ఎలా ఓపెన్ చెయ్యాలి, ఎక్కడ ఎలాంటి ఫైట్ ఉండాలి.. ఇలాంటి విషయాల్లో వంశీ చాలా గొప్ప పరిణితిని చూపించాడు..' అని అందరితో అనేవాళ్ళు. వాళ్ళకి నామీద ఉన్న నమ్మకమే నాకు మరింత ఆత్మవిశ్వాసాన్నిచ్చిందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

**నేర్చుకున్న పాఠాలు - వెన్నంటిన నేస్తాలు**



చిన్నప్పుడు నాన్నగారు నన్ను 'చదువు చదువు..' అని పోరుతుంటే 'ఎందుకిలా నా మీద ఇంత ఒత్తిడి పెడతారు..?' అనుకుంటూ ఉండే వాడిని. తర్వాత సినిమా ఫీల్డ్‌లో ఉన్నప్పుడు కూడా 'ఏం ఒరగబెట్టింది చదువు..' అనిపించేది. కానీ 'మున్నా' పరాజయంతర్వాత 'బృందావనం' వరకూ జరిగిన ప్రయాణంలో చదువు విలువ ఎంతో తెల్సింది. చదువు అంటే కేవలం పాఠాలు నేర్చుకోవడం మాత్రమే కాదు, మెదడుకి సంస్కారం నేర్పడం, ఆలోచనలకి పదును పెట్టే మనో స్థైర్యాన్ని పెంపొందించుకోవడం అని నమ్ముతాను నేను. డైరెక్టర్ అంటే పెట్టుబడి, శరీరంలోని ఒకే ఒక్క భాగం! అదే 'మెదడు'!! అలాంటి మెదడుని విద్యావంతం చేసి సంస్కార భరితం చేస్తేనే క్వాలిటీ ప్రోడక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది. నిజంగా చదువు నేర్పిన ధైర్యమే లేకపోతే నాకా డౌన్ పీరియడ్ లో అంత ఫైటింగ్ స్పిరిట్ వచ్చేది కాదేమో. అందుకే సినిమాల్లో పైకి రావాలంటే చదువు అవసరంలేదు అని ఎవరన్నా అంటే నేనొప్పుకోను. సినిమాలనే కాదు, జీవితంలో సరైన ముందడుగు పడాలంటే ఎడ్యుకేషన్ ఎంతైనా అవసరం... ఇది నేను నేర్చుకున్నదీ..నమ్మకం పెంచుకున్నదీ.

ఇంక మనమూ మన వాళ్ళు అనే విషయానికి వస్తే - మన కుటుంబ సభ్యులు ఎప్పుడూ మన క్షేమాన్ని కోరే మంచి స్నేహితులు అన్న విషయం మర్చిపోకూడదు. పిల్లలు పెద్దయ్యాక అమ్మా, నాన్నల నుంచీ విడిగా వెళ్ళిపోతారేమో కానీ అమ్మా, నాన్నలు మాత్రం ఎప్పుడూ పిల్లలతోనే ఉండాలనుకుంటారు. మనం అప్ అండ్ డౌన్స్‌లో ఉన్నప్పుడు మన వాళ్ళు అనుకున్న మన కుటుంబసభ్యులు ఇచ్చే సపోర్ట్‌ని దేనితోనూ వెలకట్టలేము. అమ్మా, నాన్నా, చెల్లెళ్ళూ, బావగార్లూ, మాలినీ..వీళ్ళందరి ప్రోత్సాహం, సపోర్ట్ సిస్టమ్ లేకపోతే ఈ రోజు నేనీ స్థాయిలో ఉండేవాడిని కాదని నమ్ముతాను. ఎనిమిదో తరగతి నుంచీ అమ్మా. నాన్నలతోనే కలిసి ఉంటున్నాను. పెళ్ళయ్యాక కూడా అమ్మా, నాన్నా అందరం కలిసే ఉంటున్నాం. నాకూ, మాలినికీ అమ్మా, నాన్నా కేవలం కుటుంబసభ్యులే కాదు..అంతకు మించి గొప్ప స్నేహితులు, మార్గదర్శకులు కూడా. !

(డిసెంబర్ 2010 సంచికలో ప్రచురితం)

# బోయిన సుబ్బారావు

**70 - 80 దశకాల్లో** మినిమమ్ గ్యారంటీ ఉన్న దర్శకుడుగా పేరుతెచ్చుకున్న బోయిన సుబ్బారావు గారు ఈ నెల, తన సినీజీవనంలోని జ్ఞాపకాలని 'కౌముది'తో పంచుకుంటున్నారు. ఆయన మొదటి సినిమా 'సావాసగాళ్ళు' సూపర్ డూపర్ హిట్ ఐతే - తర్వాత తీసిన పాతికపైగా తెలుగు సినిమాలు, పాతికపైగా కన్నడ సినిమాల్లో ఎనభై శాతం ఘన విజయం సాధించినవే. కుటుంబగాథా చిత్రాలు, యాక్షన్ సినిమాలు, పెద్ద పెద్ద తారలు, చిన్న తారలు, పెద్ద బడ్జెట్, చిన్న బడ్జెట్..ఏ కాంబినేషన్ ఐనా సరే, తనని తను నిరూపించుకుంటూ 'నిర్మాతల దర్శకుడు' అనిపించుకున్నారు శ్రీ బోయిన సుబ్బారావు గారు. రామానాయుడుగారి మొదటి సినిమాస్కోప్ చిత్రానికి, రామానాయుడుగారు నిర్మించిన మొదటి కన్నడ సినిమాకి, మోహన్‌బాబు సొంత నిర్మాణ సంస్థ లక్ష్మీ ప్రసన్న ఫిలిమ్స్ నిర్మించిన మొదటి సినిమాకీ బోయిన సుబ్బారావు గారే దర్శకులు. అందరితో 'మంచి మనిషి' అనిపించుకోవడం చాలా తక్కువమందికి సాధ్యమౌతుంది, అలాంటి కొద్ది మందిలో బోయిన సుబ్బారావుగారు ఒకరు. శతదినోత్సవాలు జరుపుకుని, అప్పటి గవర్నర్ రంగరాజన్, సమాచార శాఖా మంత్రిణి సుష్మా స్వరాజ్‌గారి లాంటి ప్రముఖుల ప్రశంసలనందుకుని, అనేక ఎవార్డులు పొందిన 'ప్రేమించు' సినిమాతో తన దర్శకత్వ ప్రొఫెషన్‌కి , పదేళ్ళ క్రిందట, చిన్న సెమికోలన్ పెట్టిన శ్రీ సుబ్బారావుగారు - మంచి కథ, మంచి బేనర్ లభిస్తే ఇప్పటికీ హిట్ చిత్రం రూపొందించడానికి తను రెడీ అంటున్నారు. ఆయన మాటల్లోనే వారి విశేషాలు తెలుసుకుందాం.!



## కారంచేడులో బాల్యపు పునాదులు - మంచిమనుషుల స్నేహాలు

**మా సొంతవూరు కారంచేడు.** మా నాన్నగారి పేరు బోయిన పోతురాజు, అమ్మగారి పేరు బోయిన బాపమ్మ. నేను పుట్టిన సంవత్సరం 1947. మేము మొత్తం ఐదుగురం సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. నేను ఐదో వాడ్ని, నా తర్వాత ఒక చెల్లెలు. నాన్న వ్యవసాయం చేస్తుండేవారు. మా తాతల కాలం నుంచీ కూడా బాగా ఆస్తిపరులమే. మా వూళ్ళో, మా కమ్యునిటీలో అందరికంటే మేమే ఉన్నవాళ్ళం. కారంచేడు అనగానే అందరికీ గుర్తొచ్చే మరో పేరు మూవీమొగల్ డా.డి.రామానాయుడుగారు. వాళ్ళ కుటుంబానికీ, మా కుటుంబానికీ మూడు తరాలుగా విడదీయరాని స్నేహం ఉంది. మా నాయనమ్మ, వాళ్ళ నాయనమ్మ మంచి స్నేహితులు. మాకు అవసరమైతే వాళ్ళ ఎద్దులు, బళ్ళూ రావడం, వాళ్ళ పనిమనుషులు మాకు సహాయం చేయడం జరుగుతుండేది. మావైపునుంచీ అలానే వెళ్ళి వాళ్ళకి సహాయం చేస్తుండేవాళ్ళం. ఎనభై సంవత్సారాల క్రిందటే మా తాత, ఆ వూళ్ళో పది గదులున్న పెద్ద మేడ కట్టాడు. దాదాపు 150 అడుగుల పొడవు వుండేది. అది నిర్మాణం జరిగినన్ని రోజులూ రామానాయుడు గారి కుటుంబం నుంచీ సహాయం అందుతూ ఉండేదట.

ఎలిమెంటరీ స్కూల్లో పెద్ద బ్రైట్ స్టూడెంట్‌ని కాదు కానీ స్కూలుకి మాత్రం క్రమం తప్పకుండా వెళుతుండేవాడిని. మా వూరి జమీందారు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారి మనుమరాలు, నేనూ ఒకే క్లాసులో ఉండేవాళ్ళం. చిన్నప్పుడు నాలుగైదేళ్ళు వాళ్ళింటికి వెళ్ళి చదువుకుంటుండేవాడిని. ఎదుగుతున్న వయసులోనే సంస్కారమున్న పెద్దల మధ్య పెరగడం వలన మాట మంచితనం, కట్టుబాటు, క్రమశిక్షణ, నిజాయితీ లాంటివి జీవనవిధానంలో విడదీయరాని భాగమయ్యాయి. (అప్పటి పునాది వల్లనే ఇప్పటికీ ఒక చెడ్డ అలవాటు కానీ, చెడ్డవాళ్ళతో స్నేహం కానీ లేదు. ఎప్పుడూ నా సర్కిల్ అంతా మంచి మనుషులే) స్కూలుకి శెలవులు వచ్చినప్పుడు, పనుల ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పొలాల్లోకి వెళ్ళి వ్యవసాయం పనులు చేస్తుండేవాడిని. ఇప్పట్లోలాగా ట్రాక్టర్ లాంటి యంత్రాలేమీ లేవు కాబట్టి నాగలితో పొలం దున్నడం లాంటి పనులన్నీ చేసేవాడిని.

బి.ఎస్సీ చదవడానికి నా మజిలీ చీరాలకి మారింది. అక్కడికి వెళ్ళాకే సినిమాలతో పరిచయం ఎక్కువైంది. ఇల్లు వొదిలి బయట ఉండటం, ఫ్రెండ్స్‌తో రూమ్ ఓ ఉంటుండడం వల్ల స్వేచ్ఛగా సినిమాలు చూసే అవకాశం దొరికింది. చూసిన ప్రతి సినిమానీ మిత్రులతో కలిసి చర్చించడం, విశ్లేషించడం కూడా మా దినచర్యలో ఒక భాగం ఐపోయింది. బి.ఎస్సీ అయ్యాక ఏ.ఎమ్.ఐ.ఇ చదవడానికి మద్రాసు ప్రయాణం కట్టాను. మా కుటుంబంలో అంత ఎక్కువ చదువుకున్న మొదటి వ్యక్తిని నేనే.

## మద్రాసు ప్రయాణం- అప్రయత్నంగా సినీరంగ ప్రవేశం

మద్రాసు ఐతే వెళ్ళాను కానీ, అక్కడ దిగగానే తెలిసిందేమిటంటే నేను చేరుదామనుకున్న కాలేజీలో జాయిన్ చేసుకోడానికి మరో ఆర్నెల్లు పడుతుందని. అప్పుడే చిత్తజల్లు భాస్కరరావు అనే చిన్ననటుడు పరిచయం అవడం, అతనితో కలిసి రూమ్‌లో ఉండడం జరిగింది. రామానాయుడుగారు అప్పటికే సినిమాలు తీస్తున్నారు కానీ ఎందుకో వెంటనే ఆయన వద్దకి వెళ్దామన్న ఆలోచన రాలేదు. కాలేజీకోసం వెయిట్ చేస్తున్నప్పుడు రోజూ బృందావన్ హోటల్‌కి వెళ్ళి భోజనం చేస్తుండేవాళ్ళం. తెలుగు వాళ్ళు చాలామంది అక్కడ కలిసే వాళ్ళు. అక్కడే 'భామావిజయం' అన్న సినిమా తీసిన శేఖర్ ఫిలిమ్స్‌లో మేనేజర్ ఒకాయన పరిచయమయ్యారు. ఆయనతో మాట్లాడ్డం మొదలుపెట్టాక అనిపించింది, 'ఎలాగూ ఖాళీగానే ఉన్నాను కదా, ఒకసారి రామానాయుడు గారిని కలిస్తే ఎలా ఉంటుందో'నని. సరే ఆయన్ని కలవడానికి సురేష్ ప్రొడక్షన్స్ ఆఫీసుకి వెళ్ళాను. రామానాయుడు గారు ఆ సమయంలో 'పాపకోసం' షూటింగ్ నిమిత్తం హైదరాబాదు వెళ్ళారని చెప్పారు. ఆయన సినిమాల్లో భాగస్వామిగా ఉండే గోరంట్ల రాజేంద్రప్రసాద్ అనే ఆయన నా గురించి విని 'సినిమాల్లో చేరాలనుకుంటున్నావు కదా..ముందు ఎడిటింగ్ నేర్చుకుంటే బావుంటుంది..' అని నన్ను ఎడిటర్ మార్తాండ్‌గారి వద్దకి తీసుకెళ్ళి పరిచయం చేశారు. ఆ రోజే నా సినిమా జీవితం సురేష్ కంపెనీలోనే మార్తాండ్‌గారి వద్ద అప్రెంటిస్‌గా మొదలైపోయింది. హైదరాబాదు నుంచీ తిరిగొచ్చిన రామానాయుడు గారు నన్ను తన ఆఫీసులో చూసి ఆశ్చర్యపోయారు. అంతా తెలుసుకున్నాక మార్తాండ్ గారికి 'మనవాడే.పని బాగా నేర్పండి' అని చెప్పారు. అలా ఆఫీషియల్‌గా రామానాయుడు గారితో అసోసియేషన్ మొదలైంది.

కొన్నేళ్ళ ఎడిటింగ్ అనుభవం తర్వాత 'బొమ్మలు చెప్పిన కథ'తో అసిస్టెంట్‌గా దర్శకత్వ శాఖలోకి మారాను.

చదువుకోడానికి వెళ్ళి రామానాయుడు గారి కంపెనీలో సినిమాల్లో చేరానని తెలిసినా ఇంట్లో ఏమీ ఎదురుచెప్పలేదు. ఎందుకంటే నేను పనిచేస్తోంది రామానాయుడుగారితో నని వాళ్ళకీ తెలుసు, నా ప్రవర్తన గురించి ఇంట్లో వాళ్ళకి భరోసా ఉంది. అందుకే సినీరంగ ప్రవేశానికి ఇంట్లోవాళ్ళ నుంచీ నాకేమీ అవరోధాలు రాలేదు.

మా వూరువాడినన్న అభిమానంతో రామానాయుడుగారు తన ఆఫీసులో రూమ్ ఇచ్చి, నాకు కావలసినవన్ని ఏర్పాటు చేసి ఎంతో అభిమానంతో చూసుకునే వారు. నాకు పెళ్ళయే వరకూ నా నివాసం రామానాయుడు గారి ఆఫీసులోనే. ప్రొడక్షన్‌లో అసిస్టెంట్‌గా పనిచేసిన(1968 - 1975) ఏడెనిమిది సంవత్సరాలు చిత్రసీమలో నాకింకో బేనర్ గురించి తెలీదు.

## అంచలంచెలుగా ఎదుగుదల - మొదటి సినిమాకి అవరోధాల వల

'బొమ్మలు చెప్పినకథ', 'సిపాయి చిన్నయ్య',' ద్రోహి','ప్రేమ్ నగర్','జీవన తరంగాలు','చక్రవాకం'.. ఇలా అనేకమంది అనుభవజ్ఞులైన దర్శకులవద్ద పనిచేయడం వల్ల, దర్శకత్వ రంగంలో వివిధ కోణాలని క్షుణ్ణంగా నేర్చుకునే సదవకాశం దొరికింది. 'చక్రవాకం' తర్వాత రామానాయుడుగారు నాతో సినిమా తీస్తానని మాట ఇచ్చారు. నాయుడు గారే 'ఎంగమ్మ శపథం' అనే తమిళ సినిమా రీమేక్‌ని సజెస్ట్ చేశారు. ఐతే మొట్టమొదటి సినిమానే రీమేక్ చెయ్యడం ఇష్టం లేకపోయింది. నాయుడు గారికి అదే విషయం చెప్పాను. కొన్ని నెలలకి 'సోగ్గాడు' ప్రారంభించడానికి ముందు, దానితో బాటు నా దర్శకత్వంలో సినిమా చేద్దామని, కొమ్మూరి సాంబశివరావుగారి 'ఒక చల్లని రాత్రి' అనే నవలని ఎన్నుకున్నాం. సినిమాకి తగినట్లుగా స్క్రిప్టు కూడా, ఆత్రేయగారితో కలిసి, రెడీ చేసుకున్నాను. ఐతే సరిగ్గా అది ఎమర్జన్సీ సమయం అవడం, సెన్సార్ నిబంధనలు కఠినంగా ఉండడం వల్ల 'ఒక చల్లని రాత్రి'కి ముందుముందు ఇబ్బందులు ఎదురౌతాయనే ఉద్దేశంతో ఆ ప్రయత్నాని విరమించుకోవడం జరిగింది. నేను ఖాళీగా ఉండకుండా 'సోగ్గాడు' చిత్రానికి బాపయ్యగారితో కలిసి పనిచేశాను. అదయ్యాకైనా నా సినిమా మొదలౌతుందనుకుంటే, దాని బదులు, రామానాయుడుగారు 'సెక్రటరీ' మొదలుపెట్టారు. ఇలా రెండుసార్లు నా సినిమా వాయిదా పడడంతో బాధపడి మద్రాసు వదిలేసి ఇంటికి వెళ్ళిపోయాను. ఆ సమయంలోనే మా అక్కయ్యగారి అమ్మాయితో నాకు వివాహం జరిగింది. మద్రాసునుంచీ నా సామాన్లు తీసుకొచ్చేద్దామని రామానాయుడుగారి ఆఫీసుకి వెళ్ళాను. 'చూడూ.. ఇదో నీకు మంచి అవకాశం వస్తోంది. బాలమురుగన్ కథ. చాలా బాగా వుంది. విను ఒకసారి. దీంతో నీ ఇన్నింగ్స్ మొదలుపెడితే బావుంటుంది' అని నచ్చజెప్పారాయన. ఆ విధంగా మళ్ళీ రామానాయుడుగారు చూపించిన అభిమానం వల్లనే సినిమా రంగంలో నిలదొక్కుకునే సదవకాశం లభించింది.




## మొదటి సినిమా సావాసగాళ్ళు - ప్రశంసల జల్లులు

'సావాస గాళ్ళు' నిర్మాణ సమయమంతా చాలా గొప్ప అనుభవం..

'సావాస గాళ్ళు' మొదటి షాట్‌ని వాహినీ స్టూడియోలోని ఐదో ఫ్లోర్‌లో ఏర్పాటు చేశాము. సాధారణంగా ముహూర్తం షాట్ అంటే ఏమాత్రం కాంప్లికేషన్ లేకుండా చిన్న షాట్ పెట్టుకుంటారు, సెంటిమెంటల్‌గా ఎక్కడా పొరబాటు జరగకూడదని. ఐతే నేను మాత్రం పెద్ద షాట్‌నే ముహూర్తం షాట్‌గా ఎన్నుకున్నాను. ఇందుకో కారణం ఉంది. నేను పర్సనాలిటీలో చిన్నవాడిని. అప్పటికే ఇండస్ట్రీలో ఉన్న దిగ్గజాల మధ్య పేరు తెచ్చుకోవాలంటే నాకంటూ గుర్తింపు తెచ్చే విభిన్నమైన పని ఏదైనా చెయ్యాలి. అందుకే ట్రాలీ వేసి కృష్ణ, జయచిత్ర గార్లు దేవుడి పటాలకి దణ్ణం పెట్టుకున్నాక నిడివి గల సంభాషణలు చెప్పే దృశ్యాన్ని మొదటి షాట్‌గా తీశాను.

అందరూ ఆశ్చర్యపోయారు 'అసలే కొత్త డైరెక్టర్..ఇంత కాంప్లికేటెడ్ షాట్ పెట్టాడేమిటీ..' అని. ఏమాత్రం తడబాటు లేకుండా అంత పెద్ద షాట్ కూడా మొదటి టేక్‌లోనే ఓకె ఐంది. అందరూ కొట్టిన కొబ్బరి కాయలు కూడా సరిగ్గా మధ్యకి పగలడంతో రామానాయుడు గారు 'ఇది మంచి సెంటిమెంట్ అయ్యా..తప్పని సరిగా ఈ సినిమా హిట్ ఐ తీరుతుంది..' అన్నారు.

'సావాసగాళ్ళు' సినిమాని 42 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశాను. పాటలు, ఫైట్లూ అన్నీ అనుకున్న సమయంలోనే పూర్తిచెయ్యగలిగాం. ఇందులోని హీరో శిల్పి. అతను పోటీలకి వెళ్ళినప్పుడు శిల్పం చెక్కే సంఘటన ఒకటి ఉంది. అది తియ్యడానికి కారణం ఒక విధంగా గుమ్మడిగారు అనిచెప్పుకోవచ్చు. ఆయన రష్యా వెళ్ళినప్పుడు విన్న ఒక సంఘటనని (రష్యా విప్లవం సమయంలో రాజకీయ ఖైదీగా వున్న ఒక తండ్రిని చూడ్డానికి వెళ్ళిన కూతురు, తండ్రి దాహం తీర్చడం కోసం తన స్తన్యాన్ని ఇవ్వడం..ఆ తర్వాత సైనికుల చేతిలో ఆమె హతమవ్వడం) మాటల రచయిత మోదుకూరి జాన్సన్‌గారికి చెప్పడం, అది విన్న నేను దాన్ని సినిమాలో ఆసక్తికరమైన సంఘటనగా మలచడం జరిగింది. దాన్ని ప్రేక్షకులు ఎంతగానో మెచ్చుకున్నారు. సినిమా శతదినోత్సవానికి కూడా అదే శిల్పం మోడల్‌ని బహుమతుల జ్ఞాపికగా ఇచ్చారు. 33 సంవత్సరాల తర్వాత కూడా ప్రేక్షకులు ఇంకా నన్ను 'సావాసగాళ్ళు' సుబ్బారావుగా గుర్తు పెట్టుకోవడం నా అదృష్టం అనుకుంటాను.

## *అధికశాతం విజయాలు - సినీజీవిత మజిలీలు*




తరువాత వరుసగా రెండు సినిమాలు కూడా రామానాయుడుగారికే చేశాను. రెండో సినిమాచిలిపి కృష్ణుడు 25 వారాలు ఆడింది. నా మూడో సినిమా 'ఎంకి-నాయుడు బావ' రామానాయుడుగారి బేనర్‌లో మొదటి సినిమా స్కోప్ సినిమా. అంది అనుకున్నంత సక్సెస్ కాలేదు. 10 వారాలు మాత్రమే ఆడింది.

నా కెరీర్ లో తీసిన సినిమాల్లో మరచిపోలేని విజయాలనిచ్చిన సినిమాలు చెప్పుకోదగినన్నే ఉన్నాయి. తారాబాలం కంటే కథా బలాన్నే ఎక్కువగా నమ్ముకుని సినిమాలకి దర్శకత్వం చేసేవాడిని. మొదటి సారిగా శ్రీదేవిని శోభన్‌గారి చెల్లెలుగా పెట్టి 'బంగారు చెల్లెలు' అనే సినిమా తీశాను. అది శతదినోత్సవం జరుపుకుంది. 'పుట్టింటి పట్టు చీర' లాంటి అతి చిన్న బడ్జెట్ సినిమా కూడా ఆ రోజుల్లో సంచలన విజయం సాధించింది. నైజామ్‌లో ఐతే ప్రముఖ హీరోల సినిమాలని మించి కలెక్షన్లు సాధించింది ఆ సినిమా. అలానే కన్నడంలో 'తాయ్యి మడిలెల్లు' అనే నా సినిమాలో అస్సలు పెద్ద తారలు లేరు. ఆరతి హీరోయిన్, కళ్యాణ్ కుమార్ అనే హీరో 12 సంవత్సరాల తర్వాత మేకప్ వేసుకున్న సినిమా అది. కుటుంబనియంత్రణ లాంటి డ్రై సబ్జెక్టు. అలాంటి కాంబినేషన్‌లో ఆ కన్నడ సినిమాని సూపర్ హిట్ చేయడం మరచిపోలేని అనుభవం. బెంగుళూరులో 120 రోజులు ఆడింది. కర్ణాటకలోని బిజాపూర్‌లో ఒకే థియేటర్‌లో ఆ సినిమా 60 వారాలు ఆడింది.

'పుట్టింటి పట్టుచీర' కన్నడ వెర్షన్ కూడా అనూహ్యమైన విజయాన్ని సాధించింది.

## *'లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్' కి మొదటి సినిమా*

మోహన్ బాబు హీరోగా చేసిన మొదటి సినిమా 'కేటుగాడు' అంతగా ఆడలేదు. దాని తర్వాత మోహన్‌బాబుగారికి దాదాపు ఆర్నెల్లు గ్యాప్ వచ్చింది. హీరో వేషాలతోనే ముందుకి వెళ్ళాలి, విలన్ వేషాలతో వెనక్కి వెళ్ళేది లేదని మోహన్ బాబుగారు దృఢనిర్ణయంతో ఉన్నారు. సీనియర్ నటుడు ప్రభాకరరెడ్డి గారిల్లు మోహన్ బాబుగారింటికి ఎదురుగా ఉండేది. ఆయనే మోహన్ బాబుగారికి 'నీకు

సక్సెస్ మూవీ కావాలంటే బోయిన సుబ్బారావుని దర్శకుడుగా పెట్టుకో నీ టెంపర్ మెంట్‌కి అతనే సరైన కాంబినేషన్‘ అని చెప్పారు. ఆ మాట మీద మోహన్ బాబుగారు నన్ను పిలిపించారు. ఐతే మోహన్ బాబుతో అంతకు ముందునుంచే నాకు పరిచయం ఉంది. తను కె.ఎస్.ఆర్.దాసు గారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. నేను రామానాయుడుగారి కంపెనీలో అసిస్టెంట్‌గా వున్నప్పుడు ఇద్దరం రచయిత ఆత్రేయ గారింటి వద్ద తరచూ కలుసుకుంటూ ఉండేవాళ్ళం. రాత్రిపూట ఆత్రేయ గారింటికి వెళ్ళి నిరీక్షిస్తే ఆయన తెల్లవారే సరికి ఏదైనా పాట రాసిస్తే దాన్ని తెచ్చుకునే వాళ్ళం. తర్వాత మోహన్ బాబు నటుడవ్వడం, నేను దర్శకుడవ్వడం జరిగింది.

మోహన్ బాబు గారితో చెప్పాను..''మోహన్ బాబు గారూ..హీరోగానే చెయ్యాలన్న మీ నిర్ణయం బాగానే ఉంది కానీ, ఇప్పటికే మీరు విలన్‌గా ప్రేక్షకుల హృదయాల్లో స్థిరపడిపోయారు. ఇప్పుడు కృష్ణ, శోభన్ బాబుగార్లలా ఉదాత్తమైన హీరో వేషం వేస్తే ఆడియెన్స్ రిసీవ్ చేసుకోలేరు. మీ పాత్ర మంచి పనులుచేస్తున్నా, ఎప్పుడు ఏ మోసం చేసి పారిపోతాడోనని ప్రేక్షకులు ఎదురు చూస్తుంటారు.. అందువల్ల మామూలు హీరో పాత్రలకి భిన్నంగా ఏదో హడావిడిగా ఉండే కేరక్టర్ ఉండాలి...''. ఆయన కూడా ఒప్పుకున్నారు. తనవద్ద ఉన్న ఒకటి రెండు కథలు చెప్పారు. అవేమీ నాకు నచ్చలేదు. ఆయనకి అప్పట్లో ఎం.డి. సుందర్ గారి కథలు వ్రాస్తుండేవారు. నా కన్నడ సినిమాలకి కూడా ఎం.డి.సుందర్ గారే కథలు వ్రాశారు. సుందర్ రెండు మూడు కథలు చెప్పినా నాకు నచ్చలేదు. ఐతే అప్పటికే కన్నడంలో వచ్చిన ఎం.డి.సుందర్ గారి కథ ఒకదాన్ని తీసుకుందామని చెప్పాను. ఆ సినిమా కన్నడంలో వారం రోజులు కూడా ఆడలేదు. సుందర్ గారు, మోహన్ బాబు గారు కూడా నా నిర్ణయానికి ఆశ్చర్యపోయారు. నేను దృఢంగా చెప్పాను..‘అందులో మెయిన్ ఎలిమెంట్ చాలా బావుంది. దాన్ని తీసుకుని మన నేటివిటీకి అనుగుణంగా మార్చుకుందాం..‘ అని.

కథ మీద వర్క్ చేయడం మొదలుపెట్టాం. కథా చర్చల్లో పాల్గొన్న కొంతమందికి నచ్చింది, మరి కొంతమంది పెదవి విరిచారు. ఐతే మోహన్ బాబుగారికి ధైర్యం చెప్పి నేనే ముందుకి తీసుకెళ్ళాను. మొత్తం నెలరోజులు షెడ్యూల్ వేసుకున్నాం. చివరి నిమిషంలో మేమనుకున్న ఒకరిద్దరు హీరోయిన్స్ డేట్స్ దొరకలేదు. అప్పటికే ప్రెసిడెంట్ పేరమ్మలాంటి సినిమాలతో పేరుతెచ్చుకున్న కవితని హీరోయిన్‌గా తీసుకున్నాం. తిరుపతి దగ్గర తొండవాడ అనే వూళ్ళో షూటింగ్ మొదలైంది. ఒకరోజు యధావిధిగానే అందరికంటే ముందుగా నేనూ, కెమేరామేన్ షూటింగ్‌స్పాట్‌కి వెళ్ళాం. తొండవాడలోని గుడి దగ్గర ఆ రోజు షాట్స్ తియ్యాలి. పొద్దున్నే మేము వెళ్ళే సరికి అక్కడికి ఒక నెమలి వచ్చి పురివిప్పి నాట్యం చెయ్యసాగింది. కెమేరామేన్‌తో చెప్పి ఆ షాట్‌ని కెమేరాలో బంధించాం. ఈరోజుకీ మీరు ‘లక్ష్మీ ప్రసన్నా పిక్చర్స్‘కి సింబల్‌గా కనిపించే నెమలి నృత్యం ఆ రోజు ‘ప్రతిజ్ఞ‘ సమయంలో మేము అనుకోకుండా చిత్రీకరించినదన్నమాట! ఇదొక మరచిపోలేని అనుభవం! మోహన్ బాబుగారి కెరీర్‌కి టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తూ ‘ప్రతిజ్ఞ‘ శతదినోత్సవ చిత్రంగా నిలించింది. అక్కినేనిగారి చిత్రం ‘గోపాలకృష్ణుడు‘ విడుదలైన రోజే ‘ప్రతిజ్ఞ‘ విడుదలై పోటీని తట్టుకుని నిలబడగలడం మా అందరికీ ఆనందాన్నిచ్చింది.



## *శోభన్‌బాబుగారితో అనుబంధం - జీవితకాల అనుభవం*

శోభన్ బాబుగారు వృత్తిపరంగా సినిమా రంగంలో ఉంటూనే వ్యక్తిగతంగా సినిమా రంగానికి చాలా దూరంగా ఉండేవారన్న విషయం అందరికీ తెలిసిన సత్యమే. తన కుటుంబసభ్యుల్ని కూడా సినిమా రంగానికి చాలా దూరంగా ఉంచేశారు. ఈ విషయంలో శోభన్ బాబుగారి ప్రభావం నా మీద చాలా ఉంది. డైరెక్టర్‌గా బిజీగా వున్న రోజుల్లో కూడా ఇంట్లో ఏ మాత్రం సినిమా వాతావరణం కనబడ నిచ్చేవాడిని కాదు. నన్ను కలవడానికి ఎవరన్నా రావాలన్నా అంతా ఆఫీసులోనే. మా కుటుంబసభ్యులు, బంధువులు కూడా ఎక్కువగా షూటింగ్ వచ్చేవాళ్ళు కాదు. శోభన్

బాబుగారితో అనుబంధం నేను అసిస్టెంట్‌గా వున్నప్పటినుంచీ. ఒకసారి 'జీవనతరంగాలు' షూటింగ్ సమయంలో శోభన్ బాబుగారి షూ లేస్ ఊడిపోయింది. అలాంటప్పుడు సాధారణంగా 'కాస్ట్యూమ్స్ ..ఎక్కడా..త్వరగా రండి..' అని పిలుస్తారు. నేను మాత్రం వెంటనే చేతిలో ఉన్న స్క్రిప్టు ఫైలుని పక్కన పెట్టి, శోభన్ బాబుగారి షూ లేస్ సరిచేశాను. ఆయన చాలా ఆశ్చర్యపోయారు. "సుబ్బారావ్..నీ సిన్సియారిటీ నీకు భవిష్యత్తులో చాలా ఉపయోగపడుతుంది. అదే నిన్ను పైకి తీసుకొస్తుంది..' అన్నారు. శోభన్‌బాబు గారింటికి వెళ్ళే చనువున్న అతికొద్ది మిత్రులలో నేనూ ఒకడిని. ఎప్పుడు కనిపించినా కేవలం 'బావున్నావా?' అని ఊరుకోకుండా 'పిల్లలు ఎలా వున్నారు? ఏం చేస్తున్నారు? ఏమైనా వెనకేసుకున్నావా? పొదుపు చేసుకుంటున్నావా?' అంటూ ఎంతో ఆత్మీయంగా క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఉంటారు. బయట బేనర్‌లో ఎక్కువగా నన్ను రికమండేషన్ చేసింది శోభన్ బాబుగారే! నేనంటే అంత ఆప్యాయంగా ఉండేవారు. అలాంటి మార్గదర్శిని ఎప్పుడూ మరిచిపోలేను.

నేను ఎంచుకున్న జీవన విధానం వల్లనేమో మా పిల్లలెవరికీ సినిమా వాతావరణం అస్సలు అలవాటు కాలేదు. మా పెద్దబ్బాయి కెమికల్ బిజినెస్ చేస్తున్నాడు. తనపేరు రామకృష్ణ, కోడలు నళిని. వాళ్ళకో అమ్మాయి.

మా అమ్మాయి భారతి. ఆగస్టు 14 న పుట్టింది. తను డిగ్రీ చేసింది. అల్లుడు సాంబయ్య ఎగ్రికల్చరల్ కాలేజీలో ప్రొఫెసర్ .వాళ్ళకీ ఓ పాప.

చిన్నబ్బాయి రాజేష్ ఎం.కామ్, ఎం.బి.ఎ చదివి కంపెనీ సెక్రటరీ పరీక్షలు వ్రాస్తున్నాడు.

చాలా సంవత్సరాల తర్వాత అంతర్జాతీయంగా వున్న తెలుగు సినిమా అభిమానులతో ఈ విధంగా నా జ్ఞాపకాలు పంచుకోవడం ఆనందంగా వుంది. 'కౌముది' కి అభినందనలు..

.

(జనవరి 2011 సంచికలో ప్రచురితం)

# సంపత్ నంది

**ఎక్కడో కరీమ్‌నగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామం..** తెలిసీ తెలియని వయసులో ఒకసారి, ఎదిగిన వయసులో మరోసారి 'వీడు కూడా  కథలు రాస్తాడంట్రా..సినిమాలు డైరెక్ట్ కూడా చేస్తాట్ట..' అంటూ మిత్రబృందం అవహేళనలు, నవ్విన వాళ్ళతోనే జైకొట్టించుకోవాలన్న కసి, మంచి రాంకుతో ఫార్మసీ డిగ్రీ పూర్తిచేసినా  ఏకాకిగా టాలీవుడ్ లో తొలిఅడుగు, సహాయ రచయిత, రచయితగా ఎదిగినా పరిశ్రమలో  సరైన గుర్తింపురాని వైనం, రెండేళ్ళపాటు కన్నడ చిత్రసీమలో అందీ అందని అవకాశాలు, భారీతారాగణంతో ఐదారు నెలల షూటింగ్ తర్వాత కూడా దాదాపు పూర్తికావొచ్చిన సినిమాకి చివర్లో అవరోధం... - చిత్రసీమ అనబడే  పరమపద సోపానపఠంలో **సంపత్ ని**  నిచ్చెనమెట్లూ ఊరించాయి, పాము బుసలూ భయపెట్టాయి. ఐనా -  పదునుతగ్గని పట్టుదల, మొక్కవోని ఆత్మవిశ్వాసం, నిరంతరం  స్వయంకృషి.. అన్నీ కలిసి మొదటి సినిమానే 32 కేంద్రాల్లో 50 రోజులు ప్రదర్శించబడిన విజయాన్ని అందించాయి. అదీ సులువుగా చేజిక్కలేదు. విడుదలవ్వగానే నెగిటివ్ టాక్.. వెబ్ సైట్లలో విమర్శల హోరు.. యువతరం వేటినీ లెక్కచెయ్యలేదు. 'ఇది మాకు నచ్చిన సినిమా' అని సంపత్‌ని వెన్నుతట్టి ప్రోత్సహించారు..అదే ***'ఏమైంది ఈ వేళ'!*** యువతరం చిత్రం..ఆఫ్ బీట్ మూవీ! ఆ చిత్రదర్శకుడు, యువకుడు సంపత్ నంది మొదటి సినిమా కబుర్లు ఈ నెల 'కౌముది'కి ప్రత్యేకం.

## *మారుమూల గ్రామం - అందమైన బాల్యం*



**మా స్వగ్రామం కరీమ్‌నగర్ జిల్లాలోని ఓదెల అనే వూరు.** అదే మండలం కూడ. నాన్నగారు కృష్ణయ్య, అమ్మగారు ప్రమీల. నలుగురు సంతానంలో నేను పెద్దవాడిని. నా తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. మాది, మావూళ్ళో, ఉన్న కుటుంబం క్రిందనే లెక్క. నాన్న వ్యవసాయం చేస్తుండేవారు. నా చదువు తొమ్మిదో తరగతి వరకూ మా వూళ్ళోనే సాగింది. చిన్నప్పటినుంచి చదువులో మొదటి వరుసలోనే ఉండేవాడిని. ఐతే ఫ్రెండ్స్ విషయంలోనే కొంచెం తేడాగా ఉండేవాడిని! మాది ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్న కుటుంబం, కావడం, తోటివారి కంటే ఎక్కువగా పోకెట్ మనీ ఉండడం..ఇందువల్లనో, మరెందుకో గానీ, వాళ్ళకంటే నేను భిన్నమైన వాడిని అనే ఒక భావం ఉండేది. అందుకనే ఫ్రెండ్స్ సర్కిల్ కూడా చాలా పరిమితంగా ఉండేది. అది నెగిటివ్ గుణం అని అంత చిన్నవయసులో తెలీదు. బయట ఫ్రెండ్స్

ఎక్కువలేకపోవడం వల్ల ఎక్కువగా ఇంట్లోనే గడపడం, ఇంట్లో ఏది కావాల్సిన సహాయం చెయ్యడంతో ఇంట్లో అందరికి తలలో నాలుకలా ఉండేవాడిని.

చిన్నప్పుడు నాకు ఐదారు నెలల వయసుండగా అమ్మ నా పక్కన రేడియో ఆన్ చేస్తే నేను ఏడుపు మానేసే వాడినట. అప్పుడు తనపని చేసుకునేదట. అందువల్లనేమో చిన్నప్పటినుంచే నాకు పాటలు అంటే విపరీతమైన ఆసక్తి ఉండేది. అలానే ఇంటికి దగ్గరలోనే ఉన్న గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం అలవాటైంది. హైస్కూలు రోజుల్లోనే బయట పుస్తకాలు బాగా చదివేవాడిని. కిరాణా కొట్టు దగ్గర సరుకులు పాక్ చెయ్యడానికి ఉపయోగించే పేపర్ ముక్కలని కూడా వదలకుండా చదివేవాడిని. అలాంటప్పుడే ఏవోవే రాసుకుంటూ ఉండేవాడిని. అవే కథలూ, పాటలూ అనుకుంటూ ఉండేవాడిని. ఏడో తరగతిలోనో, ఎనిమిదో తరగతిలోనో ఉండగా ఒకసారి ఫ్రెండ్స్ సర్కిల్‌లో సినిమా కథలు, పాటల గురించిన చర్చ వచ్చినపుడు 'ఆ మాత్రం కథలు నేనూ వ్రాయగలను..' అన్నాను. సహజంగానే హేళనగా నవ్వి ఎగతాళి చెయ్యడం మొదలుపెట్టారు. మగ ఫ్రెండ్స్ ఐతే అంతఫీలయ్యేవాడిని కాదేమో కానీ వాళ్ళలో రాధ అనే అమ్మాయి కూడా ఉంది. అమ్మాయి కూడా నా మాటలకి హేళనగా నవ్వడం.. నాకు చాలా అవమానకరంగా అనిపించింది. ఏదో ఒకటి వ్రాశాను కదా, ఆమాత్రం గుర్తించలేరా.. అన్న ఫీలింగ్ ఉండేది. అంత చిన్నవయసులోనే వాళ్ళ ముందు ఎగతాళి పాలవడం..ఎక్కడో అంతరాంతరాల్లో ఇదీ అని తెలీని ఒక విధమైన కసి పెంచింది. ఇంకా గుర్తున్న సంఘటన ఇది ఒకటి! (ఇలాంటి సంఘటన ముందు ముందు ఇంకోటి చెబుతాను)

## డాక్టర్ కాబోయి..

మావూరికి దగ్గరలో ఉన్న జమ్మికుంట వెళ్ళి పదో తరగతి చదువుకున్నాను. తర్వాత ఇంటర్మీడియట్‌కి హనుమకొండకి పంపించారు. అంతవరకూ నంబర్ 1 స్టూడెంట్‌నే కాబట్టి బై.పి.సి తీసుకున్నాను. నన్ను డాక్టర్‌గా చూడాలనేది ఇంట్లోవాళ్ళ కోరిక. ఐతే హనుమకొండ విద్యార్థి జీవితం, చదువుకంటే నన్ను సినిమాలవైపు ఎక్కువ నడిపించింది. కాలేజీ ఎగ్గొట్టి రోజుకి మూడు సినిమాలు చూడ్డం సర్వసాధారణమైపోయింది. అందులో నన్ను విపరీతంగా ప్రభావితం చేసిన సినిమా శంకర్ గారి 'జెంటిల్‌మేన్'. ఆ సినిమాలోని కొన్ని సీన్లు నన్ను నిద్రపోనివ్వలేదు. ఒకచోట అర్జున్ మొహమ్మీద ముసుగువేసి, లోపల ఎలుకని వదుల్తారు. ముసుగుతీసే సరికి ఎలుక అతడి నోట్లో ఉంటుంది. చివరలో ఛీఫ్ మినిస్టర్ కాన్వాయ్‌కి అడ్డంగా వెళ్ళిన కుర్రాడి గుండె వెళ్ళి కారు బోయ్‌నెట్ మీద పడికొట్టుకుంటుంది. ఈ రెండు సీన్ల కోసమే ఈ సినిమాని దాదాపు పాతికసార్లు పైగా చూశాను. ఒక షో కి వెళ్ళడం, అవగానే బయటికి వచ్చి టీ తాగి అటూ, ఇటూ తిరిగి మళ్ళీ నెక్స్ట్ షోకి హాల్లోకి వెళ్ళడం..ఇలా జరిగింది. 'శివ', 'రోజా' సినిమాలు చూసి ఎంతో మంది ఎలా స్ఫూర్తి పొందారో 'జెంటిల్ మేన్' సినిమా చూసి ఇంటర్మీడియట్ వయసులోనే నేనలా అయ్యాను. ఎప్పటికైనా సినిమాల్లోకి వెళ్ళాలి, శంకర్ గారిలా మాస్ ఓరియెంటెడ్ సందేశాత్మక సినిమాలు తియ్యాలి అని అప్పుడే నిర్ణయించుకున్నాను.

ఇంకోపక్క ఏవో కథలంటూ తెల్లకాగితాలని నలుపుచేయడం..జోరుగా సాగింది. మరి చదువెలా ఉంటుంది..!? సహజంగానే టెంత్ వరకూ ఫస్ట్ రాంక్‌లో ఉన్నవాడిని నెమ్మది నెమ్మదిగా కిందికి జారి తొమ్మిదో రాంకుకో పదో రాంకుకో వెళ్ళిపోయాను... ఎలాగైతే ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. సినిమాల మీద ఎట్రాక్షన్ ఏమాత్రం తగ్గలేదు. ఐతే ఇంట్లో వాళ్ళు, బంధువులూ అందరూ ..ఎం.బి.బి.ఎస్ లాంగ్ టెర్మ్ కోచింగ్ కి వెళ్ళమని బలవంతం చేశారు. నాకూ అనిపించింది 'సరే..వాళ్ళు చెప్పినట్లే చేద్దాం. సినిమాల్లోకి వెళ్ళడానికి చాలా టైముంది కదా, చదువయ్యాకైనా సినిమాల్లోకి వెళ్ళొచ్చు' అని సమాధాన పరచుకున్నాను.



నెల్లూరు రత్నం కోచింగ్ సెంటర్‌కి లాంగ్ టెర్మ్ కోచింగ్‌కి ప్రయాణం మొదలైంది. వెళ్ళే ముందు మనసులో నాకు నేనే ఒక శపథం చేసుకున్నాను 'ఈ కోచింగ్ అయ్యేవరకూ ఒక్క సినిమా చూడకూడదు, ఒక్క నవల చదవకూడదు.. నన్ను నేను చదువులో మళ్ళీ ప్రూవ్ చేసుకోవాలి..' అని. అనుకున్నట్లే అక్కడా వున్న ఏడెనిమిది నెలల్లోనూ ఒక్క సినిమా చూడలేదు. రోజుకి పదిహేను గంటలపాటు కష్టపడి ఎంట్రెన్స్‌కి ప్రిపేరయ్యాను. రేంక్ రావడం ఏ మాత్రం డౌట్ లేదనుకున్నాను. ఫలితాలు వచ్చాయి. నా అంచనాలు తారుమారయ్యాయి..5,420 రేంక్ వచ్చింది.! ఒక్కసారి వెనక్కి తిరిగి ఏం జరిగిందా అని ఆలోచించుకుంటే అర్థమయింది, చదవడానికి అన్ని గంటలు కష్టపడ్డాను కానీ, మనసులో ఎక్కడో సినిమాల మీద ఆలోచనలని మాత్రం కంట్రోల్ చేసుకోలేకపోయాను. నేను చూసే అవకాశం లేకుండా ఎన్ని సినిమాలు వెళ్ళిపోతున్నాయా అనే ఆలోచనలే అంతరాంతరాల్లో తిరుగుతుండేవని అప్పుటికి తెలిసింది.

## కొత్త ఊరు..కొత్త మిత్రులు..కొత్త జీవితం

ఐతే గుడ్డిలో మెల్ల అన్నట్లు కర్ణాటక కె.సెట్ లో మంచి రాంకే వచ్చింది. అక్కడ మెడిసిన్ ఐనా, డెంటల్ ఐనా సీటు వచ్చేది. ఐతే మావూళ్ళో జీపులో వచ్చి, అడక్కుండానే, డబ్బులు జేబులో వేసుకుంటున్న డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఒకసారి కళ్ళముందు కదిలాడు. డాక్టర్‌ని ఐ రకరకాల పేషెంట్లని డీల్ చేసే ఓపిక ఉండదనిపించింది. మావూళ్ళో చూసిన డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌లాగా ఐతే హాయిగా జీపులో తిరుగుతూ బాగా డబ్బులు సంపాదించుకోవచ్చుననే ఆలోచనతో, ఫార్మసీ కోర్సుకి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను.

రాయచూర్ లోని ఊటుకూరు లక్ష్మయ్య కాలేజీలో బి.ఫార్మ్‌లో చేరాను. అక్కడ ఫార్మసీ చదివిన వాళ్ళు చాల పెద్ద పొజిషన్‌కి, ఇతరదేశాలకి కూడా వెళ్ళి మంచిపేరు తెచ్చుకున్నారు. ఆ ఫార్మసీ కాలేజీ నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది. అంతవరకూ మా వూరు. ఆ ఏరియాల చుట్టూనే పెరిగిన నేను, ఒక్కసారిగా దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన స్టూడెంట్స్ మధ్యన చదవాల్సి రావడం ఛాలెంజ్ మాత్రమే కాక నన్ను నేను రిఫైన్ చేసుకోడానికి గొప్ప అవకాశాన్నిచ్చింది. చిన్నప్పటినుంచి తెలుగు మీడియాలోనే చదివిన వాడ్ని, నా తెలుగు యాసతో పట్టుమని పదినిమిషాలైనా కంటిన్యువస్‌గా ఎవరితోనూ మాట్లాడలేని వాడిని- రాయచూర్ లైఫ్ పూర్తిగా మార్చేసింది. ఆ మార్పు ఫ్రెషర్స్ డే నుంచే మొదలైంది. బెస్ట్ ఫ్రెషర్ అవార్డు ఉంటుందని కాలేజీలో చేరినప్పుడే తెల్సింది. ఎలాగైనా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అందరిలో గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచన, దాన్ని ఆచరణలో పెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టాను.

## మొదటి గుర్తింపు

రామ్‌గోపాల్ వర్మగారి సినిమాలో, కోట శ్రీనివాసరావుగారి ఒక ఎపిసోడ్ స్ఫూర్తితో 'తెలంగాణా రామాయణం' అనే చిన్న హాస్య గల్పిక వ్రాసుకుని మరికొంతమంది ఫ్రెషర్స్ తో కలిసి ప్రదర్శించాము. రచనా, దర్శకత్వం నాదే అందర్నీ బాగా ఆకట్టుకుంది. ఆ విధంగా టాప్ టాలెంట్ చూపించిన నలుగురిని ఎంపిక చేసి, ఫైనల్‌గా అందరిముందూ స్టేజి మీదికి పిలిచి, ఒక ప్రశ్నకి సమాధానం

చెప్పమన్నారు. బెస్ట్ ఫ్రెషర్‌ని సెలెక్ట్ చేసే చివరి అంకం అది. ప్రశ్న "ఐశ్వర్యారాయ్ ( ఆమె అప్పుడే మిస్ వరల్డ్ ఐంది) మీ వద్దకి వచ్చి ప్రపోజ్ చేస్తే మీరేమంటారు?" అని. నాకదే మొదటి పబ్లిక్ స్పీకింగ్. ముందుగానే చెప్పాను. 'నాకు ఇంగ్లీషు సరిగా రాదు. అందువల్ల తెలుగులోనే మాట్లాడుతాను..' అని. అదీ అప్పటి నాపరిస్థితి! 'ఐశ్వర్యారాయ్ నాకు ప్రపోజ్ చేస్తే నేను తిరస్కరిస్తాను. ఎందుకంటే నేను కావాలనుకునే అమ్మాయి 'సంపత్ భార్య' అనిపించుకోవాలనుకుంటాను కానీ 'సంపత్' ఫలనా ఆమె భర్త అనిపించుకోవడం నాకిష్టం లేదు. ఐశ్వర్యారాయ్ లాంటి వాళ్ళతో ఉంటే ఆమె టాగ్‌తోనే నన్నూ చూస్తారు, నా కంటూ ఒక గుర్తింపు ఉండదు. అందుకే ఆ ప్రపోజల్ నేను ఒప్పుకోను..' అని సమాధానం ఇచ్చాను. అందరూ క్లాప్ కొట్టడం, ఫస్ట్ ప్రైజ్ నాకే రావడం జీవితంలో నేను చవిచూసిన మొదటి విజయం! నేనూ పదిమందిని ఆకర్షించగలను, నాలోనూ సమ్ థింగ్ ఉంది అని ఋజువుచేసిన సంఘటన అది.

ఆ విధంగా మొదటి విజయంతో నా ఫార్మసీ కాలేజీ జీవితం మొదలైంది. నన్ను కల్చరల్ సెక్రెటరీని కూడా చేశారు. ఆ గుర్తింపుతో డ్రామాలు వ్రాయడం, ఇంటర్ కాలేజీ కాంపిటీషన్స్‌కి తీసుకెళ్ళి బహుమతులు గెలుచుకోవడం జరిగింది. నార్త్ ఇండియా నుంచి వచ్చిన వాళ్ళతో స్నేహం కలవడంతో ఇంగ్లీషు, హిందీ అలవాటై, క్రమేణా ఆ భాషలమీద పట్టుదొరికింది. అలానే మా వూరి స్లాంగ్‌ని పూర్తిగా మార్చేసుకుని నా సంభాషణా శైలిని రిఫైన్ చేసుకునేందుకు కూడా చక్కటి అవకాశం వచ్చింది. చదువులోనూ ముందు ఉంటున్నాను. మరో పక్క చిన్నచిన్న స్క్రిప్టు ల్లాంటివి తయారు చేసుకుంటున్నాను.

## రెండోసారి అవమానం - హైదరాబాదు ప్రయాణం

రెండో సంవత్సరంలో ఉండగా మరో సంఘటన జరిగింది. కొంతమంది మిత్రులం కలిసి పిక్నిక్ కి వెళ్ళాం. ఏవో సరదా ఆటల మధ్యలో 'భవిష్యత్‌లో నువ్వేం కావాలనుకుంటున్నావు?' అనే ప్రశ్న వచ్చింది నాకు. మనసులో ఉన్నదే చెప్పాను 'సినిమా రైటర్ లేదా డైరెక్టర్ అవుతాను' అని. అందరూ పగలబడి నవ్వారు. ఆరేడేళ్ళ క్రిందట హైస్కూల్లో జరిగిన సంఘటన గుర్తొచ్చింది. అప్పుడూ సరిగ్గా ఇలానే నవ్వారు. ఇప్పుడు నవ్విన వాళ్ళలో నాకు నచ్చిన ఒక అమ్మాయి కూడా ఉంది. అది మరింత బాధాకరం! అంటే ఏమిటీ..నేను సినిమాల్లోకి వెళ్ళలేనా, అనుకున్నది సాధించలేనా, అదేనా వీళ్ళ అవహేళన..రకరకాలుగా ఆలోచించాను.

'చదువు పూర్తయే లోగానే సినిమాల్లో రైటర్‌గా ఎంటరై నవ్విన వాళ్ళందరికీ నేనేమిటో చూపించాలి' అనుకుని సరిగ్గా ఆ తరువాతి వీకెండే హైదరాబాదు వెళ్ళాను. అప్పటికే 'అల్లుడా మజాకా' లాంటి హిట్ సినిమాకి మాటలు రాసి, తన మీద వచ్చిన విమర్శలని ఘాటుగా తిప్పికొట్టిన పోసాని కృష్ణమురళి గారి ఇంటర్వ్యూలు చదివి, ఆయన మీద అభిమానం పెంచుకున్నాను. ఎప్పటికైనా ఆయన వద్దనే అసిస్టెంట్‌గా చేరాలని ఎప్పటినుంచో మనసులో ఉంది. ఏదో ట్రేడ్ గైడ్‌లో ఆయన నంబరు పట్టుకుని సరాసరి ఆయన ఇంటికి వెళ్ళిపోయాను. ఆయనతో మాట్లాడే అవకాశం వచ్చింది. ఐతే రెండు, మూడు రోజుల్లోనే నేను ఫార్మసీ చదువుతున్నానన్న విషయం ఆయనకి తెలిసింది. 'తమ్ముడూ ముందు ఆ డిగ్రీ పూర్తిచేసుకుని రా. ఈ ఫీల్డ్ ఎప్పటికీ ఉంటుంది. నీ డిగ్రీ ప్రథానం' అని నాకు లెసన్ ఇచ్చి వెనక్కి పంపించేశారు. అప్పట్లో 'అరే ఏమిట్రా ఇలా పంపించేశారు..?' అనుకున్నాను కానీ ఆయన చెప్పిన సలహాలో ఎంత మంచి ఉందో తర్వాత కానీ తెలియలేదు. అప్పటికి ఆయన వద్ద త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆకుల శివ అసిస్టెంట్స్‌గా పని చేస్తున్నారు. ఆ విధంగా మొదటి ప్రయత్నం ఫలించీ, ఫలించకుండా ఆగిపోయింది. మళ్ళీ వెనక్కి వచ్చేసి డిగ్రీ కంటిన్యూ చేశాను.

## టాలీవుడ్‌లో తొలి అడుగులు

డిగ్రీ అయ్యే వరకూ పోసాని గారిని ప్రత్యక్షంగా కలవకపోయినా తరచూ ఫోన్ చేయడం, పండుగలకి, ఇతర అకేషన్స్‌కి గ్రీటింగ్స్ పంపించడం లాంటివి చేస్తూనే ఉన్నాను. సరిగ్గా డిగ్రీ పరీక్షలు పూర్తవడం, మరురోజే హైదరాబాదు వెళ్ళిపోవడం జరిగింది. సరాసరి పోసాని గారి దగ్గరకి వెళ్ళిపోయాను. విషయం విని, 'ప్రస్తుతానికి నా వద్ద ఖాళీ లేదు' అన్నారు. అన్ని సంవత్సరాలుగా పెంచుకున్న ఉత్సాహం ఒక్కసారి నీరుకారిపోయింది. ఏం చెయ్యాలో తెలీలేదు. మహానగరంలో ఇంకెవ్వరూ తెలీదు. అంతకు ముందు పరిచయం ఉన్న ఆకుల శివ, త్రివిక్రమ్ గార్లు ' నిరుత్సాహ పడవద్దు..ఎలాగైనా ఆయన్నే రిక్వెస్ట్ చెయ్యి. పోసాని గారి వద్ద రెండేళ్ళు పనిచేసినా చాలు, ఎడారి మధ్యలో విసిరేసినా బ్రతికెయ్యగలవు' అని సలహా ఇచ్చారు.

పట్టువదలని విక్రమార్కుడిలా మళ్ళీ, మళ్ళీ పోసానిగారి దగ్గరకి వెళ్ళాను. రెండు రోజుల తర్వాత 'మరీ అంతగా వెంటబడుతున్నావ్ కదా.. ఇదిగో ఒక సీన్ ఇస్తాను. ఎలా వ్రాస్తావో చూస్తాను..' అన్నారు. రవిరాజా పినిశెట్టి గారి సినిమా అనుకుంటాను, ప్రకాష్ రాజ్‌గారిని పోలీస్ స్టేషన్‌లో ఇంటరాగేషన్ చేసే సీన్. 'ఎప్పటికి తీసుకొస్తావ్?' అన్నారు. 'ఎప్పటికో ఏమిటిసార్..సాయంకాలానికే ఇచ్చేస్తాను' అని సాయంత్రానికల్లా సీన్ రాసి ఇచ్చేశాను. ఇచ్చి వచ్చాక రాత్రికి తెలిసింది, ఆయనకి బాగా నచ్చిందని, వెంటనే ఒప్పుకున్నారని. మర్నాడు ఆ సీన్ పిక్చరైజేషన్ కూడా జరిగింది. పోసానిగారి అసిస్టెంట్‌గా నా పొజిషన్ ఖరారు ఐంది.! అంటే ఫార్మసీ పరీక్షలు వ్రాసిన వారం తిరక్కుండానే నేను చిన్నప్పటినుంచి అనుకుంటున్న సినీ రచనా రంగంలో ప్రవేశించగలిగాను.

మా ఫ్రెండ్స్ అందరూ జి.ఆర్.యి, టోఫెల్ వ్రాసి విదేశాలకి వెళ్ళడానికి ప్రిపేరౌతున్నారు. ఫార్మసీలో నాకు డిస్టింక్షన్ కూడా వచ్చింది. నా డిస్టింక్షన్ రాంక్‌కి ఎమ్.ఫార్మసీకి ఎక్కడ అప్లై చేసినా వచ్చి ఉండేది. లేదా ఫ్రెండ్స్‌తో బాటు జి.ఆర్.యి కైనా వెళ్ళే అవకాశం ఉంది. చాలా సార్లు నాలో నేనే విశ్లేషించుకున్నాను..'ఏదో ..ఎప్పుడో ఫ్రెండ్స్ నన్ను చూసి నవ్వారని కసితో ఇలా చేస్తున్నానా? నా సహ విద్యార్థుల్లా పై చదువులకి వెళ్ళకుండా నా భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నానా? ' అని. ఐతే, మరో వైపు 'లేదు..చిన్నప్పటినుంచి నాలో పెరుగుతున్న ఈ సినిమా ఆకర్షణకి ఒక రూపం ఉంది.అందుకే నాకు పుస్తకాల మీద ఆసక్తి, కాలేజీలో డ్రామాలలో బహుమతులు వచ్చాయి..లేదు..తప్పకుండా ఇక్కడ సక్సెస్ ఔతాను..' అని నన్ను సమర్థించుకుని నా సినీ ప్రయాణాన్ని కొనసాగించాను.

## పోసానిగారి శిష్యరికంలో...

మూడు సంవత్సరాలు పోసానిగారి వద్ద అసిస్టెంటుగా చేశాను. మొదటి నెలలో రెండు వేల జీతం, రెండో నెలలో రెండున్నర వేలు, మూడో నెలలో మూడు వేలు..ఇలా మొదటి ఆరునెలల్లోనే నెల నెలకీ నాకు జీతం పెంచేశారు. పోలీస్ స్టేషన్ దృశ్యాలు, సామాజిక స్పృహ ఉన్న సన్నివేశాల్లోనూ నేను రాసే సంభాషణలు పోసానిగారిని బాగా ఆకట్టుకునేవి. అలాంటి అసైన్‌మెంట్స్ అన్నీ నాకే ఎక్కువగా ఇస్తుండేవారు. స్క్రిప్టు అసిస్టెంట్‌గా పనిచేయడం ఒక పార్శ్వం ఐతే, పోసానిగారు నన్ను ఆత్మీయంగా చూసుకున్న కోణం నేను జీవితాంతం మరచిపోలేను. ఆయన ఏక్లాసులో ప్రయాణిస్తే నన్నూ ఆదే క్లాసులో తీసుకెళ్ళేవారు. ఆయన ఏ హోదాలో ఎక్కడికి వెళ్ళినా నన్నూ సమాన హోదాలో అందరికీ పరిచయం చేసే వారు. ఒకసారి ఏదో సినిమా ఔట్‌డోర్ షూటింగ్‌కి తాపేశ్వరం వెళితే అక్కడాయన కాజాలు కొనుక్కుంటూ, నాకూ రెండూ కేజీలు కొని ఇంటికి తీసుకెళ్ళమని చెప్పారు. 'విజయరామరాజు', 'అయోధ్యరామయ్య' లాంటి సినిమాలకి పనిచేసినప్పుడు అదనపు పారితోషికం ఇచ్చేవారు. శ్రీమతి పోసానిగారు నన్ను సొంత తమ్ముడి కంటే ఎక్కువగా చూసుకునే వారు.. ఇలా చెప్పుకుంటూ వెళితే పోసాని గారి వద్ద గడిపిన మూడేళ్ళూ స్వర్ణయుగం నాకు. అందుకే జీవితాంతం పోసాని గారికి ఋణపడి ఉండడమే కాదు, నా చివరిశ్వాస వరకూ పోసాని కృష్ణమురళి గారు నా గురువు గారు అని చెప్పుకోడానికి గర్వపడతాను.

ఇన్ని రోజులూ ఇంట్లో వాళ్ళకి నేను హైదరాబాదులో ఏదో ఫార్మస్యూటికల్ లాబ్‌లో పనిచేస్తున్నానని చెప్పాను. అబద్ధం ఆడుతున్నానని తెలుసుకానీ, అనుకున్నది సాధించాలంటే అది తప్పనిసరి అనిపించింది. తర్వాత, తర్వాత నా పేరు తెరమీద కనిపించినప్పుడు కూడా ఉద్యోగం చేస్తూనే ఇలా సినిమాలకి పనిచేస్తున్నానని ఇంట్లో వాళ్ళని కన్విన్స్ చెయ్యగలిగాను. (అఫ్‌కోర్స్..మొన్న సినిమా హిట్ అయ్యాక అందరూ ఇంటికి వచ్చి అభినందిస్తుంటే అమ్మా, నాన్నా నా గురించి చాలా తృప్తిగా, గర్వంగా ఫీలయ్యారనుకోండి..!)

పోసాని గారి వద్ద మూడేళ్ళు గడిచాక నేను పరిశ్రమకి వచ్చిన లక్ష్యం పదే పదే గుర్తొచ్చింది. సొంతంగా రైటర్ నైనా కావాలి, డైరెక్టర్ నైనా కావాలి. బయటికి వచ్చేసి ప్రయత్నాలు చేద్దామని నిర్ణయించుకున్నాను. పోసాని గారితో ఇదే మాట చెబితే 'ఇంకొక్క రెండేళ్ళు చెయ్యి. నేనే అవకాశం ఇప్పిస్తాను' అన్నారు. కానీ ఉడుకు రక్తం కదా.. ఇంకా రెండేళ్ళే..!? ఎందుకూ.. ఈ లోగా ఏ రామ్ గోపాలవర్మనో, కృష్ణవంశీనో ఐపోవచ్చుకదా అనిపించి, గురువుగారితో చెప్పి బయటికి వచ్చాను.

## నీళ్ళలోనుంచి బయటపడిన చేపలా..!

సొంత కాళ్ళమీద నిలబడదామని ప్రయత్నాలు మొదలు పెట్టినపుడు తెల్సింది.. నేనేంటో! నన్ను అందరూ ఎలా రిసీవ్ చేసుకుంటారో..! ఎక్కడా అవకాశాలు లేవు.. అంతవరకూ సంపాదించుకున్న డబ్బులు ఖర్చయిపోతున్నాయే కానీ, ఎక్కే ఆఫీసూ, దిగే ఆఫీసూ.. ఎవ్వరూ నన్ను రైటర్‌గా రిసీవ్ చేసుకోడానికి సిద్ధంగా లేరు. ఇంట్లో అమ్మా, నాన్నలకి చెప్పకుండా పారిపోయి వచ్చి, సంతలో తప్పిపోయిన పిల్లాడిలా ఉంది నా పరిస్థితి. అంతవరకూ పోసానిగారి పొజిషన్ బట్టే నాకూ విలువ ఉండేది కానీ, ఎంత టాలెంట్ ఉన్నా, సొంతంగా ఈ చిత్రసాగరాన్ని ఈదడం అంత తేలికకాదని అర్థమైపోయింది. ఆయన వద్ద నుంచి బయటికి వచ్చేసి తొందరపడ్డానని చాలాసార్లు నాలో నేను మథనపడేవాడిని.

## రచయితగా ముందడుగు

అలా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటూ, తిరిగి పోసాని గారి వద్దకి వెళ్ళిపోదామనుకుంటున్న రోజుల్లోనే, పోసాని గారి వద్ద ఉండగా పరిచయమైన ఎన్.శంకర్ గారు 'ఆయుధం' అనే సినిమా తీస్తూ దానికి రచనా విభాగంలో పనిచెయ్యమని అవకాశం ఇచ్చారు. మరుదూరి రాజా గారు ప్రధాన మాటల రచయిత ఐతే 'రచనా సహకారం'గా తెరమీద నా పేరు పడింది. తర్వాత 'అంజలీ ..ఐ. లవ్ యు..'అనే చిన్న సినిమాకి పూర్తిస్థాయి సంభాషణల రచయితగా అవకాశం వచ్చింది. ఐతే ఆ సినిమా అట్టర్ ఫ్లాప్ ఐంది. కానీ 'ఆంధ్రభూమి' లాంటి పత్రికల్లో చాలా చోట్ల 'ఈ సినిమా చూస్తే సంపత్ రాసిన సంభాషణల కోసమే మళ్ళీ మళ్ళీ చూడాలి. 'చేతికి కట్టుకున్న కాశి దారం కేవలం దారం మాత్రమే కాదు, నమ్మకానికి అది ఆధారం' లాంటి సందర్భోచితమైన డైలాగ్స్ వ్రాసిన సంపత్‌కి మంచి భవిష్యత్తు ఉంది' అని వ్రాశారు.

'అయుధం' సినిమా సమయంలో నన్ను స్టోరీ సిటింగ్స్‌లో చూసిన ప్రియదర్శిని రామ్ గారు 'మనోడు' సినిమాకి రచయితగా అవకాశమిచ్చారు. ఆయన తీస్తున్న కొన్ని వాణిజ్య ప్రకటన చిత్రాలకి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లోనూ పనిచేశాను. తర్వాత ఆయన ద్వారానే 'టాస్' సినిమాకి పనిచేసే అవకాశమొచ్చింది. ఇన్ని సినిమాలు చేసినా ఏదో పెద్ద సక్సెస్ కాలేదు. నాకూ తగిన గుర్తింపు రాలేదు. ఐతే 'టాస్' సినిమా సమయంలో జరిగిన సంఘటన ఒక కొత్తమలుపుకి దారితీసింది.

ఆ సినిమాలో కన్నడ సెన్సేషన్ హీరో ఉపేంద్రకి ఒక డైలాగ్ వ్రాశాను. 'నాకు గన్ అంటే ఇష్టం ఉండదు, కానీ దాని సౌండ్ అంటే ఇష్టం. కత్తి అంటే ఇష్టం లేదు కానీ పొడవటమంటే ఇష్టం. నీకు సౌండ్ కావాలో, పోటు కావాలో నువ్వే డిసైడ్ చేసుకో..' ఇదీ ఉపేంద్ర ఇంట్రడక్షన్ డైలాగ్. దానికి బాగా ఇంప్రెస్ ఐన ఆయన 'ఎవరీ డైలాగ్ వ్రాసింది?' అని ప్రత్యేకంగా నన్ను పిలిచి మాట్లాడారు. మాటల మధ్యలో 'ఈ సినిమా మీద నీ అంచనాలేమిటి?' అని అడిగారు. 'సినిమా ఐతే యావరేజ్ ఔతుంది, కానీ హిట్ ఐతే కాదు..' అని చెప్పాను. కారణాలు కూడా వివరంగా చెప్పాను. ఆయనకీ అలాంటి అభిప్రాయమే ఉండడంతో నా విశ్లేషణనచ్చింది. 'నీలో చాలా టాలెంట్ ఉంది..నీ దగ్గర కొత్త కథ ఏమైనా ఉందా?' అన్నారు. 'ఉంది. ఐతే కేవలం రైటర్‌గా మీకు చెప్పను. నేను డైరెక్షన్ చెయ్యాలని ఉంది. ఆ కోణంలో ఐతేనే మీకా కథ చెబుతాను..'అన్నాను. మర్నాడు షూటింగ్ లేదనీ, హోటల్‌కి వచ్చి కథ చెప్పమనీ ఉపేంద్ర అన్నారు.

నేను ప్రత్యేకంగా వ్రాసుకున్న 'బ్లాక్' అనే యాక్షన్ ఓరియెంటెడ్ కథ చెప్పాను. కథ మొదలు పెట్టిన పదినిమిషాల్లో ఫోన్ కాల్స్‌తో డిస్టర్బ్ ఐన ఉపేంద్ర తర్వాత రెండు గంటల పాటు ఫోన్లు పక్కన పెట్టేసి కథ విన్నారు. అంతా అయ్యాక 'సంపత్ ఎక్కడైనా సరే వ్రాసి పెట్టుకో.. నేను మళ్ళీ తెలుగులో సినిమా అంటూ చేస్తే ఇదే కథతో, నీ డైరెక్షన్‌లోనే చేస్తాను..' అన్నారు. అంతకు ముందే ఒకటి రెండు ఇలాంటి సంఘటనలు జరగడంతో 'సరేలే అందరూ ఇలానే అంటార్లే' అనుకున్నాను నేను లోలోపల.

నేను రాసిన సినిమాలు ఫెయిల్ ఐనా కానీ నాకు రైటర్‌గా అవకాశాలకి మాత్రం కొదవలేదు. ఐతే నాకే అనిపించింది'ఇంక ఎంతకాలం ఇలా చిన్న సినిమాలకి వ్రాస్తాను.. సొంత డైరెక్షన్ కోసం ప్రయత్నించాలి. స్క్రిప్టు అంటూ వ్రాసుకుంటే నా సొంతసినిమాకే వ్రాసుకోవాలి..'అనుకుని ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

## కన్నడ రంగంలో కొన్నాళ్ళు..

సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత 2008లో ఉపేంద్ర గారి నుంచి ఫోన్ వచ్చింది. 'సంపత్ మనం సినిమా చేస్తున్నాం. వెంటనే బయలుదేరి బెంగుళూరు వచ్చెయ్' అన్నారాయన. 'అరే.. అదృష్టం ఇలా కూడా తలుపు తడుతుందా..!' అని ఆశ్చర్యపోతూ బెంగుళూరు వెళ్ళాను.

'మార్కెట్ సేఫ్ గా ఉండటానికి వేణు, నేను హీరోలుగా తెలుగు, కన్నడ ద్విభాషా చేద్దామంటున్నారు మన ప్రొడ్యూసర్. అందుకే నువ్వో కొత్త కథ తయారు చెయ్యాలి..' అన్నారు. మూడు, నాలుగు నెలలు కష్టపడి ఇద్దరు హీరోలకి సరిపోయేలా ఇంకో కథ వ్రాశాను. ఎవరి దురదృష్టమో కానీ ఆ సినిమా మొదలౌతుందనుకుంటున్న సమయంలోనే ఉపేంద్ర నటించిన 'బుద్ధిమంత' అనే సినిమా విడుదలై సూపర్ హిట్ ఐంది. 'సంపత్..ఈ సినిమా హిట్ ఐంది కదా.ఇప్పుడు ఇద్దరు హీరోల సినిమా అంటే నా ఫేన్స్ ఒప్పుకోరు. అందుకని సోలో హీరోగా కథ తయారు చెయ్యి' అన్నారు. ఇదో షాక్ నాకు.!

ముందు వ్రాసుకున్న 'బ్లాక్' వద్దన్నారు, ఇప్పుడు వ్రాసిన ఈ రెండోది వద్దంటున్నారు. టైమ్ అలా గడిచిపోతోంది. సరేలే ఏదైనా అవకాశం రావాలి కదా అనుకుని మళ్ళీ ఇంకోకథ వ్రాశాను. ఈ కథకి డైలాగ్స్ వ్రాసి, స్టోరీ బోర్డ్ చేసుకున్నాను. ఇంక షూటింగ్‌కి వెళ్దామనుకుంటున్న సమయంలో ఇంకో పెద్ద షాక్..! ఉపేంద్ర గారి భార్య ప్రియాంక గారు ఫీల్డ్‌కి దూరంగా ఉండి నాలుగు సంవత్సరాలైంది. ఫేన్స్ అందరూ అడుగుతున్నారు. తనకి సరిపోయే కథ ఒకటి ఉంది. దీన్ని డైరెక్ట్ చెయ్ అని 'ఐత్ రాజ్' అనే హిందీ సినిమా చూపించారు.

అప్పటికే హైదరాబాద్ వదిలేసి సంవత్సరం దాటింది. ఫ్రెండ్స్‌కి, ఐనవాళ్ళకి దూరంగా ఉన్నాను. సరే.. నాకు సహనం నశించింది. 'రీమేక్ సినిమాతో నా డైరెక్షన్ కెరీర్ మొదలుపెట్టే ప్రసక్తే లేదు..' అని చెప్పి వెంటనే బయలుదేరి హైదరాబాదు వచ్చేశాను.

ఐతే ఇక్కడో మలుపు ఏమిటంటే – ఆ సినిమా తీద్దామనుకున్న ప్రొడ్యూసర్లు నేను హైదరాబాదు వచ్చేసరికి నాకంటే ముందుగానే అక్కడికి చేరుకుని నాకోసం వెయిట్ చేస్తున్నారు. 'ఇప్పటికే ఉపేంద్ర గారికి , ఇంకాచాలా మందికి ఎడ్వాన్స్ ఇచ్చి ఉన్నాం. ఇప్పుడు మీరు చెయ్యనంటే ఉపేంద్ర చెయ్యనంటారు.. మాకు చాలా నష్టం వస్తుంది...'అని నన్ను కన్విన్స్ చేసి, ఉపేంద్ర నాకూ ఎలానో రాజీ చేశారు. నేను కూడా ఆలోచించాను.. 'సంవత్సరం పాటు సమయం వెచ్చించాను. ఇప్పుడూ ఆవేశానికి పోతే నా అవకాశమూ పోతుంది. నిర్మాతలకి నష్టం వస్తుంది. ఇద్దరికీ మంచిది కాదిది' అనుకుని మళ్ళీ బెంగుళూరు వెళ్ళాను.

సెలీనాజైట్లీ, , ప్రియాంకలు మెయిన్ కాస్టింగ్‌గా భారీ బడ్జెట్‌తో ఆ సినిమా నా దర్శకత్వంలో మొదలైంది. సినిమాపేరు 'శ్రీమతి'. హైదరాబాదులో రెండు షెడ్యూళ్ళు, బెంగుళూరులో మరో షెడ్యూల్, మాల్దీవుల్లో పాటలు చిత్రీకరించాం. మొత్తం ఐదుపాటలు పూర్తయ్యాయి. సరిగ్గా ఇంకొక్క సీన్ మిగిలిఉంది. అంటే రెండు గంటల షూటింగ్ సమయం.. అలాంటి ఫేజ్‌లో ఆ సినిమా ఆగిపోయింది. కారణాలు కొన్ని ఇక్కడ చెప్పలేను. మొత్తానికి ఫలితం ఏమిటంటే దాదాపు నా రెండు సంవత్సరాల కెరీర్ , ఏమీ ఫలితం కనిపించకుండా ఐపోయింది. ఈ సినిమా ఆగిపోయే సరికి ఉపేంద్రకి మిగతా బేనర్స్ ఉన్నాయి కాబట్టి తను వేరే ప్రోజెక్టుల్లో బిజీ ఐపోయారు. నేనే ఒంటరినై పోయాను.

## మళ్ళీ ఒంటరిపోరాటం..

హైదరాబాదు వచ్చేశాను. సినిమా డైరెక్టర్ అవ్వాలంటే ఎన్ని ఎదురు దెబ్బలు తినాలో, ఎన్ని నిరాశా నిస్పృహల్ని తట్టుకోవాలో ప్రాక్టికల్‌గా తెలిసొస్తోంది. అప్పుడెప్పుడో హైస్కూల్లో ఒకసారి, ఫార్మసీ కాలేజీల్లో ఇంకోసారి ఫ్రెండ్స్ అంతా నన్ను చూసి నవ్వింది ఇందుకేనా అని ఒకసారి ఫ్లాష్ బాక్ కళ్ళ ముందు కదిలింది. అది గుర్తుకు రాగానే మా క్లాస్ మేట్స్ అంతా గుర్తొచ్చారు. వాళ్ళలో చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారు. అందరూ ప్రొఫెషనల్‌గా ఎంతో ఎదిగి సొంత ఇళ్ళు, చక్కటి సంపాదనతో స్థిరపడ్డారు. నా పరిస్థితి చూసుకుంటే – వచ్చిన అవకాశాలు వచ్చినట్లే కనిపించి కళ్ళముందే కలలమేడలు కుప్పకూలిపోయాయి. ఇంట్లో వాళ్ళకీ నా గురించి ఆందోళనగా ఉంది. చక్కటి డిగ్రీ చేసి, సినిమాలంటూ బంగారంలాంటి భవిష్యత్తుని పాడుచేసుకుంటున్నాడని వాళ్ళ బాధ. వాళ్ళ వైపునుంచి చూస్తే అది సమంజసమే. ఒక్కోసారిఅనిపించేది..'బహుశా నేనేమైనా తప్పుచేస్తున్నానా? పొరబాటు పడుతున్నానా?' అని.



ఎలాగైనా సరే అనుకున్నది సాధించాలన్న పట్టుదలకి పునర్జీవాన్నిచ్చాను. అక్కడ కన్నడంలో ఉపేంద్ర తన తరువాతి సినిమా మొదలుపెట్టుకున్నారు. ఎలాగైనాసరే అక్కడ ఆయన సినిమా పూర్తయే లోగా నేను తెలుగు సినిమా చేసితీరాలి అన్న కసి లోంచి పుట్టిందే 'ఏమైంది ఈవేళ ' సినిమా కథ.

మూడు నెలలు పైగా ఆ కథమీద కూర్చుని స్టోరీ బోర్డ్‌తో సహా సిద్ధం చేసుకున్నాను. చాలా సంవత్సరాలుగా నన్ను సొంత తమ్ముడిలా చూసుకుంటూ నాకు ప్రోత్సాహాన్నిస్తున్న ప్రియదర్శిని రామ్ గారిని కలిశాను. కొత్త స్క్రిప్టు గురించి చెప్పి 'ఎప్పటినుంచో మీ అబ్బాయిని సినిమాల్లో పరిచయం చేద్దామనుకుంటున్నారు కదా..ఈ కథ వినండి..' అని చెప్పాను. ఆయన, మరో హిట్ సినిమా ప్రొడ్యూసర్‌ని పిలిపించారు. వాళ్ళిద్దరికీ కథ పూర్తిగా నెరేట్ చేశాను. కథ ఐతే నచ్చింది కానీ రెండో ప్రొడ్యూసర్ గారికి ముగింపు నచ్చలేదు. అది మారిస్తే ప్రాజెక్టు గురించి ఆలోచిస్తానన్నారు. ఆయన వద్ద ఏమీ అనలేక రామ్‌తో చెప్పాను.. 'ఇంతవరకూ చాలా కష్టాలు పడ్డాను. ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇంతదూరం వచ్చినవాణ్ణి ఇప్పుడు నాకథతో నేనే రాజీ పడలేను. ముగింపులో మదర్ సెంటిమెంట్‌తో ఆ సన్నివేశాలు లేకపోతే మొదటి హాఫ్‌లో కొంచెం మోతాదు మించి చూపించే యూత్ సీన్స్‌కి బాలెన్స్ ఉండదు. అందుచేత ఎండింగ్ మార్చడానికి ససేమిరా ఒప్పుకోను..' అని ఖచ్చితంగా చెప్పాను.

## ఇలా మొదలైన 'ఏమైంది ఈ వేళ'!

నన్ను అర్థం చేసుకున్న రామ్, అంతకుముంది 'టాస్' సినిమాతో పరిచయమున్న నిర్మాత రాధామోహన్‌గారికి కథ వినిపిద్దామని చెప్పారు. ఆయన కథ విన్నవెంటనే 'నేనీ ప్రాజెక్టు చేస్తాను. ముగింపు కూడా ఏమీ మార్చాల్సిన అవసరంలేదు. ' అన్నారు. ఐతే హీరోగా కొత్త కుర్రాడు అనగానే కొంచెం వెనకాడారు. వరుణ్ సందేష్ ఐతేనే సేఫ్ ప్రాజెక్టు ఔతుంది.. అని అన్నారు. రామ్‌గారికి ఈ విషయం చెప్పగానే 'మా అబ్బాయి ఇంట్రడక్షన్ కంటే నువ్వు డైరెక్టర్‌గా ఎస్టాబ్లిష్ అవడం ముఖ్యం. నువ్వు సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌వి ఐతే మా అబ్బాయిని ఇవ్వాళ కాకుంటే రేపైనా నువ్వే హీరోని చేస్తావు.. గో ఎహెడ్ విత్ యువర్ ప్లాన్స్' అన్నారు.




అప్పుడు మరో సమస్య 'వరుణ్ సందేశ్'ని సంప్రదించడం.. నాకు తెలిసిన ఒక ఫ్రెండ్ ద్వారా శ్రీకాంత్ అడ్డాలతో ఫోన్‌లో మాట్లాడి, అయన ద్వారా వరుణ్ సందేశ్‌ని కాంటాక్ట్ చేశాను. తను అప్పుడు హైదరాబాదులో లేడు. వాళ్ళ నాన్న గారికి కథ చెప్పమని అన్నాడు. ఇలా ప్రయత్నాలు మొదలుపెట్టిన 24 గంటల్లోనే వరుణ్ సందేశ్ వాళ్ళ నాన్నగారు విజయసారధి గారికి కథ వినిపించడానికి వెళ్ళను. పావుగంట సేపు వినగానే.'ఇది తప్పని సరిగా హిట్ ఔతుంది..' అన్నారు. రెండున్నర గంటలు కథ  వినగానే 'నువ్వు ఎంత త్వరగా కావాలంటే అంత త్వరగా మొదలుపెట్టుకో సందేశ్ డేట్స్ జూన్ నుంచి ఇస్తాను.. ' అన్నారు.

నా మిత్రులు సుధాకర్, రాణా, రామకృష్ణలు కూడ ప్రాజెక్టులో భాగస్వాములయ్యారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, స్టోరీ బోర్డ్ అన్నీ ముందే పక్కాగా రెడీ ఐ ఉండడం వల్ల షూటింగ్ అంతా అనుకున్నట్లే స్మూత్‌గా జరిగిపోయింది. సినిమా నిర్మాణంలో ఉండగా 'సంపత్ బాగా తీస్తున్నాడు..' అని ఇండస్ట్రీలో టాక్ వచ్చింది కానీ సినిమా ఎలా ఆడుతుందనే అంశం మీద మాత్రం ఎక్కువ అంచనాలులేవు ఎవ్వరికీ. నేనూ, హీరో వరుణ్ సందేశ్, కష్ట సుఖాల్లో నన్ను వెన్నంటి ఉండే ప్రాణమిత్రుడు సుధాకర్.. మేం ముగ్గురం మాత్రం సినిమామీద బాగా నమ్మకం పెంచుకున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ బాగా ఆడి తీరుతుందని ముందునుంచి మాకు విశ్వాసం ఉంది.

## అందిన మొదటి విజయం..



సినిమా విడుదల రోజు ఉదయం ఎనిమిదింటికే విజయసారథిగారు ఫోన్ చేసి 'సంపత్.. టాక్ ఎలా వున్నా సినిమా మాత్రం హిట్ ఐతీరుతుంది.' అన్నారు. కథ విన్నప్పటినుంచి విజయసారథిగారికి సినిమామీద, మాకున్నంత నమ్మకమూ ఉంది. సినిమా విడుదలైంది. కొన్ని వెబ్ సైట్లలో నెగిటివ్‌గా వ్రాశారు. అసభ్యత హద్దులు మీరిందన్నారు. శుక్రవారం, శనివారం కూడా నెగిటివ్ టాక్‌తో నడిచింది. ఆదివారం నుంచి యూత్ సినిమాని తమ భుజస్కంధాలమీద ఎత్తుకున్నారు. 50 రోజులు 32 కేంద్రాల్లో కేవలం మౌత్ టాక్‌తో ఈ నా మొదటి సినిమాని నడిపించిన ఘనత అంతా యూత్‌కే దక్కుతుంది. పరిశ్రమనుంచి కూడా ఎంతోమంది ఫోన్‌చేసి అభినందనలు తెలియచేశారు. అదే టాక్‌తో నిర్మాత దానయ్య గారు కూడా సినిమా చూసి రవితేజకి కూడా చూపించారు. ఆయనకీ నచ్చింది. నాతో సినిమా చెయ్యడానికి ఒప్పుకున్నారు. ఇన్నాళ్ళ నా నిరీక్షణకి మంచి ఫలితం దొరికింది. ఈ 2011 లోనే నా దర్శకత్వంలో రవితేజ గారితో సినిమా మొదలౌతుంది. మళ్ళీ మీ ఆశీర్వాదాలకోసం మీ ముందుకి వస్తాను..

అక్కడ కన్నడంలో ఉపేంద్రగారి సినిమా కూడ రిలీజై హిట్ ఐంది. 'ఏమైంది ఈ వేళ' సినిమా విజయం గురించి విన్న ఉపేంద్ర ఫోన్ చేసి నాతో మాట్లాడారు. 'నీకు ఎప్పుడు ఖాళీ ఉంటే అప్పుడు నీతో సినిమా చెయ్యడానికి రెడీ గాఉన్నాను..' అని. రవితేజ గారి ఆఫర్ గురించి చెప్పాను. ఈ విధంగా ఉపేంద్రగారి ఆఫర్ కూడా చేతిలో ఉంది.

## 'యువ' వెంట తెచ్చిన అదృష్టం

చాలామంది లాగానే నేను కూడా సొంతంగా డైరెక్టర్‌ని అయ్యాకే పెళ్ళి చేసుకోవాలకునున్నాను. అమ్మా, నాన్నా ఎన్ని సంబంధాలు తెచ్చినా నాకు నచ్చలేదు. నా చెల్లెలి క్లాస్‌మేట్ భవాని పరిచయమైన వద్దనుంచి తనంటే నాకు ఇష్టం పెరిగింది. బహుశా తను మనసులో ఉండటం వల్లనేమో వేరే ఎవర్ని చూసినా నాకు నచ్చలేదు. కన్నడ సినిమా 'శ్రీమతి' బెంగుళూరులో మొదటి షెడ్యూల్ పూర్తవగానే భవాని వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడి ఒప్పించాను. వాళ్ళది తిరుపతి దగ్గర. మాదేమో ఇటు తెలంగాణాలో మారుమూల ప్రాంతం. వాళ్ళ అలవాట్లు, ఆచారాలే కాదు కమ్యునిటీ కూడా వేరు. ఈ ఆటంకాలని అధిగమించడానికి బాగానే శ్రమించాల్సి వచ్చింది. మణికొండలోని దేవాలయంలో 2009 ఏప్రిల్‌లో భవాని అర్థాంగిగా నా జీవితంలోకి వచ్చింది. 'శ్రీమతి' సినిమా మరో రెండు షెడ్యూళ్ళు, మాల్దీవుల్లో పాటలు కూడా పూర్తయ్యాక ఆగిపోయింది అని ముందే చెప్పాను కదా. ఇదంతా నా పెళ్ళయ్యాక జరిగింది. అక్కడినుంచి, 'ఏమైంది ఈ వేళ' ఫైనలైజ్ అయ్యేవరకూ భవాని నాకెంతో ధైర్యాన్నిచ్చింది. మా బాబు 'యువ' 2010 ఫిబవరి 7 న పుట్టాడు. ఇంకో విశేషమేమిటంటే ఆ రోజు ఉదయం 10.30 కి బాబు పుట్టాడు, 11.30 కి రాధామోహన్‌గారు ఫోన్ చేసి 'ఏమైంది ఈ వేళ'

కన్ఫర్మేషన్ వార్త చెప్పారు. ఆ విధంగా ఈఅదృష్టమంతా మా అబ్బాయి 'యువ'దే అనుకుంటూ ఉంటాము. వాడంటే మా సినిమా యూనిట్లో అందరికీవిపరీతమైన అభిమానం.

*ఈ కబుర్లు ముగించబోయే ముందు..*

ఎవరి వద్దా అసిస్టెంటుగా పనిచెయ్యకుండా రచయిత నుంచి దర్శకుడిగా మారినప్పటికీ నేను తమిళ్ శంకర్‌కీ, తెలుగులో వి.వి.వినాయక్ గరికి ఏకలవ్య శిష్యుడి లాంటి వాడిని. వాళ్ళ ఫిల్మ్ మేకింగ్ స్టైల్ అంటే నాకు చాలా ఇష్టం. ఇతరభాషా చిత్రాల విషయానికొస్తే హిందీ చిత్రాలు ఎక్కువగా చూస్తాను. యాష్ చోప్రా, ఆదిత్య చోప్రా నుంచి కరణ్ జోహార్ వరకూ వాళ్ళ దర్శకత్వ శైలి నాకు బాగా నచ్చుతుంది. ఈ తరంలో అబ్బాస్ తహీర్ వాలా, జైదీప్ సహాని , ఇంతియాజ్ అలీ..వీళ్ళ స్క్రిప్ట్ రైటింగ్ అంటే నాకు మహా అభిమానం. ఎంత కాంప్లికేటెడ్ కథలైనా సింపుల్ స్కీన్ ప్లేతో మామూలు ప్రేక్షకుడి ని సైతం ఇట్టే ఆకర్షించగల వాళ్ళ టాలెంట్ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉందనిపిస్తుంది.

నా మొదటి సినిమా వరకూ జరిగిన నా ప్రయాణం నాకు నేర్పిన పాఠం - అనుకున్నది సాధించడంలో ఎన్నో నిరాశలు, అగ్నిపరీక్షలు ఎదురౌతాయి. విజయసాధనకి మూలసూత్రం పట్టుదల! లైటర్ వెయిన్‌లో చెప్పాలంటే - అవమానాలని ఎదుర్కోండి.. (వీలైతే అమ్మాయిలనుంచి..!) ఆ అనుభవాలు మిమ్మల్ని రాటుదేలుస్తాయి..మీలో కసిపెంచుతాయి..!

.

(ఫిబ్రవరి 2011 సంచికలో ప్రచురితం)

# రమణ సాళ్వ

**చిన్నప్పటినుంచీ** చదువుమీద పెద్దగా ఆసక్తిలేని యువకుడు..కొత్తదేదో తెలుసుకోవాలన్న తపన, ప్రతిరోజూ సృజనాత్మకత కనిపించే వృత్తిని ఎన్నుకునే క్రమంలో సుదీర్ఘ ప్రయాణం.. హైస్కూలు చదువులోనే ఢక్కామొక్కీలు తిన్న వైనం, మెకానికల్ వర్క్‌షాప్‌లో పనిచేయడం, ఫోటోగ్రఫీలో డిగ్రీ, కెమేరా అసిస్టెంటుగా సినీరంగప్రవేశం, ఛాయాగ్రహణ దర్శకుడిగా కొన్ని సినిమాలు... ఎన్నో మజిలీల అనంతరం 'కుదిరితే కప్పుకాఫీ' సినిమాతో దర్శకుడిగా తనని తాను నిరూపించుకుని తెలుగు ప్రేక్షకులకి చేరువైన **రమణ సాళ్వ** మొదటి సినిమా కబుర్లు ఈ నెల మీకోసం. గాఢత, స్పష్టత, ఆలోచన, హృదయాలను హత్తుకోవడమే కాక మనసుల్ని కదిలించే బలం వున్న కవితలు వ్రాసే వెంకటరమణ నిరంతరాన్వేషి..భావుకుడు!!

***చిన్నప్పటి జ్ఞాపకాలు - చదువుమీద శ్రద్ధ రాని రోజులు***



మా నాన్న గారి పేరు సాళ్వ కృష్ణంరాజు, అమ్మగారి పేరు సుగుణ. నలుగురు సంతానంలో నేను నాలుగవ వాడ్ని. నా పైన ఇద్దరు అన్నయ్యలు, ఒక అక్కయ్య. నేను పుట్టింది బందరులోనే కానీ నాన్నగారి ఉద్యోగ రీత్యా వూర్లు తిరగాల్సి వచ్చింది. మా చదువులకోసమని అమ్మనీ, పిల్లలనీ హైదరాబాదులో ఉంచేసి నాన్నగారే వివిధ ప్రదేశాలకి వెళుతుండేవారు. కో ఆపరేటివ్ సంస్థల డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండేవారు నాన్నగారు. నాకు ఊహ తెల్సి ఎలిమెంటరీ స్కూలుకి వెళ్ళింది ముందు విజయవాడలో, తర్వాత హైదరాబాదులో. సనత్ నగర్ లోని ఎస్.ఆర్.టి. క్వార్టర్స్‌లో ఉండేవాళ్ళం. ఎలిమెంటరీ దశలోనే రెండుమూడు స్కూళ్ళు మారాను. హైస్కూలు చదవుకీ అంతే. ఎందుకో చిన్నప్పటినుంచీ స్కూలు చదువులమీద అంత ఆసక్తి ఉండేది కాదు. స్కూలుకి వెళ్ళమని ఇంట్లోవాళ్ళు గుర్తుచేస్తుంటే నాకు నచ్చేది కాదు. ఎవరైనా బలవంతం చేస్తే అస్సలు ఆ పని చెయ్యబుద్ధి అయ్యేది కాదు. పొద్దున్నే స్కూలుకి వెళ్ళి సాయంకాలం వరకూ కూర్చోవడం పెద్ద శిక్షగా అనిపించేది.

ఆరో తరగతిలో ఉండగా అనుకుంటాను, నాన్నగారు కాళహస్తిలో ఉన్న అత్తయ్య గారింటికి తీసుకెళ్ళారు. అక్కడనుంచి మద్రాసు వెళ్ళాం. అదే మొదటిసారిగా సముద్రాన్ని చూడ్డం.. అదో అద్భుతంగా మనసులో ముద్రవేసుకుని పోయింది. ఇంటికి తిరిగొచ్చాక కూడా సముద్రమే మనసునిండా. సముద్రకెరటాల హోరే ఆలోచనల నిండా. పట్టుమని పదేళ్ళు కూడా లేవు.. మళ్ళీ సముద్రం చూడాలనిపించింది. సికింద్రాబాదు వెళ్ళి రైలెక్కితే మద్రాసు వెళ్ళవచ్చుననే విషయం మాత్రం గుర్తుంది. ఒక రోజు స్కూలు అవగానే ఇంట్లోకూడా చెప్పకుండా నడుచుకుంటూ సికింద్రాబాదు స్టేషన్‌కి వెళ్ళాను. ప్లాట్‌ఫార్మ్ మీదకెళ్ళి ట్రైను కోసం ఎదురు చూస్తుండగా

నిద్రపట్టేసింది. చాలా సేపటికి ఎవరో లేపితే మెలకువ వచ్చింది. రైల్వే కూలీ 'ఏమిటీ పనేమైనా చేస్తావా?' అని అడిగాడు. నాకేం అర్థం కాలేదు..'నేను మద్రాసు వెళ్ళాలి' అని సమాధానమిచ్చాను. కాస్సేపటి తర్వాత మళ్ళీ వచ్చిన కూలీకి, స్కూలు డ్రెస్సులో అంతసేపు ఒంటరిగా వున్న నన్ను చూడగానే విషయం అర్థమైనట్లుంది. మొత్తానికి నానుంచి అసలు నిజం రాబట్టాడు. బయటికి తీసుకొచ్చి సనత్ నగర్ వెళ్ళే బస్సులో కూర్చోబెట్టి కండక్టర్‌కి విషయం చెప్పాడు. రాత్రి 11.30 సమయం అది. కండక్టర్ నన్ను జాగ్రత్తగా మా బస్టాపులో దించాడు. 'మళ్ళీ ఇలాంటి సాహసాలు చెయ్యొద్ద'ని వార్నింగ్ కూడా ఇచ్చాడు. ఇంటికి వెళ్ళే సరికి అందరూ నాకోసం వెదికి వెదికి అలిసిపోయి ఎదురుచూస్తున్నారు. వాళ్ళని చూడగానే నా పసిమనసుకి అర్థమైంది, కుటుంబ సంబంధాలెంత బలీయమైనవో..

స్కూలు చదువుపట్ల మాత్రం ఏదో అసంతృప్తి. ఎంత ప్రయత్నించినా అదంతా యాంత్రికమనిపించేది. ఫలితం ఏడో తరగతి రెండు సార్లు ఫెయిలయ్యాను. ప్రైవేటు స్కూలు నుంచి బయటికి తీసుకొచ్చి కనీసం గవర్నమెంటు బళ్ళోనైనా చేరుద్దామని ప్రయత్నించారు, అదీ కుదరలేదు. నాన్నగారు 'వీడిని నాతో తీసుకెళ్తాను' అన్ని అమ్మతో చెప్పి, తనతో బాటు నన్ను, తను పనిచేసే గూడూరుకి తీసుకెళ్ళారు. ఇక్కడ మా నాన్నగారి గురించి కొంతచెప్పాలి. ఆయనకి కళారంగం పట్ల ఆసక్తిమాత్రమే కాక ప్రవేశం కూడ ఉంది. నాటకాలు వేసేవారు, బొమ్మలు వేసేవారు, ఫోటోగ్రఫీలో ప్రవేశం ఉంది. నాకు తెలుగులోనూ,ఇంగ్లీషులోనూ చక్కటి కథలు, సంఘటనలూ చెప్పేవారు. దాని ఫలితమేమో మిగతా సబ్జెక్టుల్లో తప్పుతున్నా ఇంగ్లీషు, తెలుగులో మాత్రం మంచి మార్కులు వస్తుండేవి. అలానే నాన్నగారు వెంటబెట్టి తీసుకెళ్ళి మంచి మంచి ఇంగ్లీషు సినిమాలు చూపిస్తుండేవారు. నాన్నగారి సాహచర్యం వల్లనేమో నాకూ ఫైన్ ఆర్ట్స్ అంటే ఇంట్రెస్టు పెరగసాగింది, నాకు తెలీకుండానే. నాన్నగారి కళాదృష్టికి ఒక చిన్న ఉదాహరణ చిన్నన్నయ్య పేరు 'రాధామానస' !!

నాన్నగారితో నా గూడూరు జీవితం మొదలైంది. అప్పటికి నావయసు 13-14 సంవత్సరాలుంటుంది.

## గూడూరు జీవితం - దేనికోసమో అన్వేషణ

నాన్నగారు అక్కడ డిప్యూటీ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఒక డివిజన్‌కి హెడ్ అయన వద్దకి వెళ్ళాక కూడా స్కూలుకి వెళ్ళేవాడిని కాదు. నాన్నగారు అస్సలు ఒత్తిడి పెట్టలేదు. నీకు ఇష్టం వచ్చినప్పుడే చదువుదువు గానిలే అనేవారు. అక్కడ ఉన్నప్పుడే గ్రంధాలయానికి వెళ్ళి పుస్తకాలు చదవడం బాగా అలవాటు చేసుకున్నాను. వివేకానందుడు, శరత్‌చంద్ర, రవీంద్రనాథ్ టాగోర్, బంకించంద్ర.. ఇలా అందరి పుస్తకాలూ విపరీతంగా చదివేవాడిని. కొన్నిసార్లు నాన్నగారితో పాటు ఆఫీసుకి వెళ్ళి అక్కడ కూర్చుండేవాడిని. ఒక్కోసారి నాన్నగారి కొలీగ్స్, వాళ్ళ పిల్లలు ఫస్ట్‌క్లాసులో పాసయ్యారని స్వీట్స్ తెచ్చే వాళ్ళు. నన్ను చూసి 'ఏం చదువుతున్నావని?' అడిగేవాళ్ళు. నాన్నగారు నవ్వేసి 'ఇంకా చదువుమీద శ్రద్ధ రాలేదు. తొందరలోనే వస్తుందనుకుంటున్నాను..ఐనా మావాడు బాగా తెలిగలవాడు..' అనే వారే తప్ప నన్నెప్పుడూ న్యూనతా భావానికి లోనుచెయ్యలేదు. ఇలాంటి సంఘటనలన్నీ నా వ్యక్తిత్వానికి ఒక రూపాన్నివ్వడం అప్పట్నుంచే మొదలైంది.

అలా రెండేళ్ళు గడిచాయి. అప్పుడు అనిపించింది, ఎలాగైనా పదో తరగతి పాసవ్వాలని. నాన్నగారితో చెబితే ప్రైవేటుగా కట్టమన్నారు. చాలా రోజులతర్వాత పుస్తకాలు ముందేసుకున్నాను. ఐతే బట్టీ పట్టడం కంటే పాఠాల సారాంశాన్ని అర్థం చేసుకుని అన్వయించుకోవడం అలవాటు చేసుకున్నాను. నాకు తెలీకుండానే ఒక విధానం అనేది అలవాటైపోయింది. పెద్ద కష్టపడకుండానే టెంత్ పాసయ్యాను. ఐతే సైన్సు, మాథ్స్ బాగా వచ్చేశాయని చెప్పలేను. అప్పటికీ వాటిల్లో పూర్ స్టూడెంట్‌నే.

టెంత్ అయ్యాక అక్కడే ఇంటర్మీడియట్ వొకేషన్ కోర్సులో చేరాను. థీరీ టెక్స్ట్ పుస్తకాలకంటె ప్రాక్టికల్‌గా చదువుకోవడం నాకు నచ్చింది. అక్కడే మెషీన్ టూలింగ్, డ్రిల్లింగ్, లేత్ మెషీన్ మీద పనిచేయడం..అన్నీ నేర్చుకున్నాను. మెకానికల్, ఎలెక్ట్రికల్..అన్ని విషయాలు ఎక్స్‌ప్లోర్ చెయ్యడానికి వచ్చిన అవకాశం చాలా ఎక్సైటింగ్ ఉండేది. పూర్తిగా ఇన్వాల్వ్ ఐపోయాను. వొకేషనల్ కోర్సు చదివేప్పుడే ఎన్.సి.సి లో కూడా చేరాను. దాన్లో బాగా పెర్ఫార్మ్ చేస్తే మిలటరీలోకి వెళ్ళడానికి అవకాశం ఉంటుందనే ఆలోచనవచ్చింది. అందులో ట్రైనింగ్ బాగా శారీరక శ్రమతో కూడి ఉండేది. ఐనా క్రమం తప్పకుండా వెళ్ళేవాడిని.




ఒకరోజు మధ్యాహ్నం మండుటెండలో షూటింగ్ నేర్పిస్తున్నారు. బాగా ఆకలిగా ఉంది. నీరసం వచ్చేస్తోంది. చెమటలు పడుతున్నాయి. ఐనాసరే డిసిప్లిన్ ముఖ్యం కాబట్టి అందరం ఒకరి తర్వాత ఒకరం టార్గెట్‌ని గురిచూసి కొట్టడానికి ప్రయత్నిస్తున్నాం. ఎందుకో అది నచ్చలేదు. మానసికంగా సరిగా లేనప్పుడు ఇలా చేయించడం వల్ల ఉపయోగం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుంది కదా అని అనిపించింది. అదే మాట మా కమాండర్‌గారిని అడిగాను.. దానికాయన చెప్పిన సమాధానం 'షూటింగ్‌లో ఉన్నప్పుడు కసితో, ఆవేశంతో ఉండాలి కానీ ఆలోచించి, వాతావరణం అంతా కంఫర్ట్‌బుల్‌గా ఉన్నపుడే షూట్ చేస్తాను అనుకునే మనస్తత్వం సరికాదు. శత్రువులుని వేటాడేప్పుడు ఆలోచనకంటే ఆవేశమే ముఖ్యం..' అని. ఎందుకో ఆ వివరణ నాకు నచ్చలేదు. నా మనసు అంగీకరించలేకపోయింది. దాంతో ఎన్.సి.సి.లో కూడా కొనసాగలేదు.

## హైదరాబాదు వర్క్‌షాప్‌లో కొంత కాలం..

మొత్తానికి రెండేళ్ళు గడిచాయి.. పరీక్షల్లో మిగతా సబ్జెక్టులన్నీ మంచి మార్కులొచ్చినా లెక్కల్లో మాత్రం తప్పాను. ఎందుకంటే దాంట్లో పునాది సరిగా లేదు. ఇంతలో నాన్నగారికి అక్కడ సర్వీస్ ఐపోయింది. ఇంటర్మీడియట్ పూర్తిచెయ్యకుండానే నేనూ హైదరాబాదు వచ్చేశాను. హైదరాబాదులో ఎస్.ఎస్.ఐ. అనే ప్రభుత్వ సంస్థ చిన్నపరిశ్రమలకి కన్సల్టింగ్ చేస్తూ ఉండేది. దాన్లో చేరాను. ప్రాక్టికల్‌గా అన్నింట్లోనూ అప్‌టుడేట్‌గా ఉన్నాను కాబట్టి అక్కడ పనిచేయడం చాలా సులువుగానూ, ఎంజాయ్‌బుల్ గానూ అనిపించింది.. డ్రిల్లింగ్, టర్నింగ్, మిల్లింగ్, లేత్ వర్క్, వెల్డింగ్..అన్నింట్లోనూ అనుభవం మరింత పెరిగింది. ఆ సంస్థ, బయట కస్టమర్స్ నుంచి మెకానికల్ వర్క్స్ తీసుకుని మాతో ఆ పనులు పూర్తిచేయించేవారు. మాకూ ట్రైనింగ్ ఇచ్చినట్లుండేది. బయటి వాళ్ళకి తక్కువ రేటులో పనిపూర్తయ్యేది..

ఒకరోజు జరిగిన సంఘటన నా ఆలోచనలని ఇంకోమలుపు తిప్పింది. మా ఆపరేటర్ ఒక డ్రిల్లింగ్ పని అప్ప చెప్పి బయటికి వెళ్ళాడు. డిజైన్ పేపర్ చూశాను. అందులో పొరబాటు ఉంది. అతను చెప్పినట్లు చేస్తే తర్వాత జరిగే పనిలో మొత్తం మెటీరియల్ వేస్ట్ ఔతుంది. అందుకని ఆ పనిపూర్తిచెయ్యలేదు. సాయంకాలం కస్టమర్ వచ్చాడు, నా సూపర్ వైజర్ వచ్చాడు. పనిపూర్తిచెయ్యలేదని నా మీద మండి పడ్డాడు. ఐతే నా వివరణ విని కస్టమర్ ఇంప్రెస్ అయ్యాడు. తర్వాత వేస్ట్ అవబోయే విషయాన్ని ముందే ఊహించానని నన్ను మెచ్చుకున్నాడు. ఆ కస్టమరే అడిగాడు 'రమణా..నీలోని స్మార్ట్‌నెస్ నచ్చింది. నాదగ్గర పనిచెయ్యడానికి వస్తావా? దుబాయ్‌లో మాకో వర్క్‌షాప్ ఉంది. అక్కడ పనిచేద్దువుగాని..' అని. మా ఇంట్లో ఈ విషయం తెలిసి చాలా ఆనందించారు. ఆరోజుల్లో దుబాయ్ వెళ్ళడం అంటే చాలా గొప్ప క్వాలిఫికేషన్ అన్నట్లుండేది. నాకూ ఒక గుర్తింపు వస్తోందని, కనీసం ఈపనిలోనైనా కుదురుగా ఉన్నానని, ఎలాగైనా

ఇంటర్మీడియట్ పూర్తిచేయించి పాలిటెక్నిక్ చేయిద్దామని..ఇలా ఎన్నో ఊహించుకున్నారు మావాళ్ళు. కానీ నా మనసు అక్కడ లేదు. 'దుబాయ్ వెళితే ఏమౌతుంది? డబ్బులు సంపాదిస్తాను. మళ్ళీ ఆ కస్టమర్ లాగానే వర్క్‌షాప్ పెట్టుకుంటాను. ఇలానే వేరే వాళ్ళతో పనిచేస్తాను..సో..ఇందులో థ్రిల్ ఏముంటుంది..? ఇది కాదు నాక్కావల్సింది ప్రతిరోజూ నన్ను ఉత్తేజితం చేసే పని ఐఉండాలి.. అది ఇది కాదు..' నాకా పని మీద ఇష్టం లేదని ఆ కస్టమర్‌కి చెప్పి పంపించేశాను.

## జె.ఎన్.టి.యు.లో డిగ్రీ

ఆరోజుల్లో, మా పెద్దన్నయ్య గంగాధర రాజు ఉషాకిరణ్ మూవీస్‌లో స్టిల్ ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఆయన వద్దకెళ్ళి, ఫోటోగ్రఫీ నేర్చుకుంటానని చెప్పాను. ఆయన నన్ను ఎంకరేజ్ చెయ్యలేదు. 'ఈ ఫీల్డ్ నువ్వనుకున్నంత ఎట్రాక్టివ్‌గా ఉండదు.. దీనిలోనూ చాలా ఇబ్బందులుంటాయి..' అన్నారు. ఐనా పట్టువదలకుండా అడిగే సరికి 'ఐతే ఒక షరతు పెడతాను.. జె.ఎన్.టి.యు.లో ఫోటోగ్రఫీలో డిగ్రీ ఉంది. అది పూర్తిచెయ్యి ముందు. తర్వాత ఆలోచిద్దాం ' అన్నారు. అక్కడ డిగ్రీ చెయ్యాలంటే ముందుగా



ఇంటర్మీడియట్‌లో మిగిలిపోయిన సబ్జెక్టులు పూర్తి చెయ్యాలి. సరే అని గూడూరు వెళ్ళి, ట్యూషన్ మాస్టారిని బతిమాలి పాస్ మార్కులకి సరిపడా లెక్కలు చెప్పించుకుని ఆ పరీక్షలు వ్రాసి వచ్చాను. ఇక్కడ జె.ఎన్.టి.యు.లో ఎడ్మిషన్ టెస్ట్ వ్రాశాను. రెండింటి ఫలితాలు తెలియడానికి ఇంకా కొన్ని నెలలు టైముంది.

అన్నయ్య నాలోని పట్టుదల గమనించి, నన్ను ఆ ఖాళీ సమయంలో ప్రముఖ స్టిల్ ఫోటోగ్రాఫర్ జి.ఎన్.భూషణ్ గారి వద్ద అసిస్టెంటుగా జాయిన్ చేసారు. ఆయనతో బాటుగా నేను షూటింగ్‌కి వెళ్ళిన మొదటి సినిమా 'శ్రీనాథ కవిసార్వభౌముడు..'. భూషణ్ గారితో బాటుగా ఉంటూ, అయన కెమేరా బేగ్‌లు మోయడం, ఐపోయిన కెమేరా రీళ్ళు దాచిపెట్టడం.. ఇదీ నాపని. అక్కడ మొదటి సారి సినిమా షూటింగ్ చూస్తున్నానని కానీ, ప్రముఖ నటుడు ఎన్టీఆర్‌కి , బాపుగారికి దగ్గరగా ఉన్నానని కానీ.. ఆ థ్రిల్ కంటే పని నేర్చుకోవాలన్న తపనే ఎక్కువగా ఉండేది. భూషణ్ గారి వద్ద కెమేరా గురించి, ఫొటోగ్రఫీలోని ట్రిక్స్ గురించి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఐదు నెలలపాటు ఆయన వద్ద పనిచేశాను. ఈ లోగా ఇంటర్మీడియట్ ఫలితాలు, జె.ఎన్.టి.యు ఎడ్మిషన్ ఫలితాలు వచ్చాయి. రెంటిలోనూ పాసయ్యాను.

## సినీరంగ ప్రవేశం

ఆ విధంగా జె.ఎన్.టి.యులో ఫోటోగ్రఫీ మెయిన్‌గా ఫైన్ ఆర్ట్స్ డిగ్రీలో చేశాను. ముందుగానే కెమేరా గురించి థీరీ, ప్రాక్టికల్స్ రెండూ కూలంకషంగా తెలిసి ఉండడం వల్ల యూనివర్సిటీ క్లాసులు తేలికగా అనిపించాయి. ఆరోజుల్లో అన్నయ్య యి.టి.వి లో కెమేరా అసిస్టెంట్‌గా పనిచేస్తుండేవారు. కాలేజ్‌లో చదువుతూనే అనుభవం కోసం నేను అన్నయ్యతో పార్ట్ టైం టి.వి.సీరియల్స్ షూటింగ్‌కి వెళ్ళేవాడిని. ఆ సీరియల్స్‌కి మహీధర్‌గారు కెమేరామాన్. తరచు కలవడంతో మహీధర్ గారితో పరిచయం పెరిగింది.

కాలేజ్ అయిపోయాక డిస్కవరీ లాంటి ఛానల్స్‌లో కెమెరామాన్‌గా చేరాలని అనుకుంటూ ఉండేవాడిని. అలా వెళ్ళాలంటే ఒంటరితనాన్ని వదిలించుకుని సమాజంలో కలవటం అలవాటు చేసుకోవాలి, ఒత్తిడిని తట్టుకోవటం నేర్చుకోవాలి. కేవలం ఈ రెండు బలహీనతలు పోగొట్టుకోవటం కోసం మాత్రమే రెండు సంవత్సరాలు సినిమాల్లో పనిచేద్దామనుకున్నాను.

అదే ఉద్దేశంతో మహీధర్‌గారిని కలుసుకుని అసిస్టెంటుగా చేరతానని అడిగాను. ఆయన ఒప్పుకున్నారు. అలా మహీధర్‌గారి వద్ద కెమేరా అసిస్టెంట్‌గా పనిచేసిన మొదటి సినిమా కృష్ణ, విజయనిర్మలగార్ల 'రెండు కుటుంబాల కథ', మహీధర్‌గారు చాలా బిజీగా ఉండేవారు. మోస్ట్ వాంటెడ్ డి.ఒ.పి అనడానికి ఒక ఉదాహరణ ఏమిటంటే ఆయనతో ఉన్న రెండేళ్ళలో పదకొండు సినిమాలకి పనిచేసే అవకాశం వచ్చింది. మహీధర్‌గారి వద్ద పనిచేసేప్పుడు సినిమా నిర్మాణంలోని అన్ని విభాగాల గురించి లోతుగా తెలుసుకునే అవకాశం లభించింది. కేవలం అసిస్టెంటుగానే కాక క్యూరియస్ ఎక్స్‌ప్లోరర్‌గా ఉండేవాడిని. మహీధర్ గారు కూడ బాగ ఎంకరేజ్ చేసేవారు.

మహీధర్‌గారి వద్దపనిచేయడం నేనో కొత్తలోకంలోకి ప్రవేశించిన అనుభూతిని కలిగించింది. ఎందుకంటే, గూడూరులో ఉన్నప్పుడు, తర్వాత జె.ఎన్.టి.యు. లో కూడా ఎక్కువమంది మిత్రులు లేరు. నా లోకమేదో నేనేదో అన్నట్లుండేవాడిని. ఒక్కసారి ఇలా వందలాదిమందితో కలిసిపనిచేయడం నా సోషల్ లైఫ్‌కి కొత్త ద్వారాలు తెరిచింది. ఒత్తిడిలో పనిచేయడం ఎంత ఛాలెంజింగ్‌గా వుంటుందో అర్థమైంది. ఆ పని ఒత్తిడిని పూర్తిగా ఎంజాయ్ చేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఎన్నో పరిచయాలు సంపాదించుకున్నాను.

భీమినేని శ్రీనివాసరావుగారి సినిమాలకి మహీధర్‌గారు పర్మినెంట్ కెమేరా మేన్. అందువల్ల సుస్వాగతం, శుభాకాంక్షలు, సూర్యవంశం..ఇలా భీమినేనిగారి సినిమాలన్నింటికీ పనిచేశాను. మహీధర్‌గారితో పనిచేసిన చివరి సినిమా పవన్ కళ్యాణ్‌గారి 'తొలిప్రేమ'. ఆ సినిమాకి పనిచేయడం మరపురాని అనుభవం. ఒక సీను పండించడంలో ప్రతి విభాగం ఎలా కాంట్రిబ్యూట్ చెయ్యొచ్చో 'తొలిప్రేమ' సినిమా చెప్పింది. కొలాబరేషన్ అన్న పదానికి అసలైన నిర్వచనంలా ఆ సినిమా ప్రొడక్షన్ విభాగాలన్నీ పనిచేసేవి. ఆ సినిమా చివరలో ఉండగా మహీధర్‌గారు దివంగతులయ్యారు.

అలా 12 సినిమాలకి కెమేరా డిపార్ట్‌మెంట్లో పనిచేశాక, ఎప్పుడో నిర్ణయించుకున్నట్లుగా లైన్ మారదామనిపించింది. ఐతే అదే సమయంలో రామానాయుడు స్టూడియో వద్ద జరిగిన బాంబు యాక్సిడెంట్‌లో అన్నయ్య చనిపోయారు. అది మా ఫేమిలీకి పెద్ద దెబ్బ. మేమంతా ఆ షాక్‌లో ఉండగా ఒక కొత్త ఆఫర్ వచ్చింది. 'తొలిప్రేమ' సినిమాకి ఆపరేటివ్‌గా పనిచేసిన ప్రకాష్ అనే మిత్రుడు ప్రసాద్ లేబ్‌లో జాయిన్ అయ్యారు. 'తొలిప్రేమ' సమయంలో నా పనితనం గమనించిన ప్రకాశ్ ఒక కొత్త సినిమాకి నన్ను కెమేరామేన్‌గా పనిచెయ్యమని అడిగారు. నాకున్న అనుభవంతో పూర్తిస్థాయి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచేసే అవకాశం చెప్పుకోదగ్గవిషయమే. ఐతే సినిమారంగం నుంచి బయటికి వెళ్ళి, లైన్ మారుదామనుకున్న నాకు అదంత ఎక్సైటింగ్‌గా అనిపించలేదు. ఐతే మరో వైపు అన్నయ్య మరణంతో షాక్‌లో ఉన్న మాకు ఈ అవకాశం పోజిటివ్ టానిక్‌గా పనిచేస్తుందనిపించింది. ఒక నెగిటివ్ ఫేజ్‌లో ఉండగా ఇలాంటి అవకాశం మానసికంగా స్థైర్యాన్ని ఇస్తుందనే భావంతో ఆ అవకాశానికి ఓకె చెప్పాను.

## డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా..

ఆ విధంగా నేను సొంతంగా డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచేసిన మొదటి సినిమా పేరు 'యూత్'. విక్రమ్ అందులో హీరో. చాలా తక్కువ బడ్జెట్ మూవీ. ఎన్నో లిమిటేషన్స్ ఉండేవి. ఐనా మంచి రిజల్ట్స్ కోసం శాయశక్తులా ప్రయత్నించాను. ఫైనాన్స్ సమస్యల వల్ల 1999లో మొదలైన ఆసినిమా పూర్తవడానికి దాదాపు నాలుగేళ్ళు పట్టింది. ఈ సినిమా నిర్మాణం మధ్యలో ఉండగానే అంతకు

ముందు పరిచయం ఉన్న భీమినేని శ్రీనివాసరావు గారు స్టోరీ డిస్కషన్స్ కోసం పిలిచారు. ఆయన సినిమాలకి పనిచేసేప్పుడు కొన్ని కొన్ని దృశ్యాల చిత్రీకరణ సమయంలో నేనిచ్చిన సలహాలు ఆయనకి బాగా నచ్చి నేను కథా చర్చల్లో బాగా కాంట్రిబ్యూట్ చెయ్యగలనని ఆయన నమ్మకం. ముందు అంతగా ఇష్టపడలేదుకానీ సరే ఇదీ చూద్దాంలే అనుకుని ఒప్పుకున్నాను. అది పవన్ కళ్యాణ్ గారి ప్రోజెక్టు. 'బద్రి' తర్వాత ఎలాంటి కథ ఐతే పవన్ కళ్యాణ్ గారికి బావుటుందో చర్చించుకుని ఓ కథమీద పనిచేయడం మొదలుపెట్టాము. ప్రాక్టికల్‌గా సినిమా నిర్మాణం గురించి విషయాలన్నీ తెల్సినా థీరీ కూడా తెలుసుకోవాలనిపించి స్క్రీన్ ప్లే, స్టోరీ రైటింగ్ గురించి రకరకాల పుస్తకాలు చదివాను. అలా సంవత్సరంన్నర పాటు దాని మీద పనిచేశాం, కానీ ఆ ప్రోజెక్టు ఫైనలైజ్ కాలేదు. అప్పుడే భీమినేనిగారు సొంతంగా నిర్మాణ సంస్థ మొదలుపెట్టి 'నీతోడు కావాలి' అనే సినిమాకి దర్శకత్వం మొదలుపెట్టారు. దానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచెయ్యమని అడిగారు. అది నేను సొంతంగా కెమేరామేన్‌గా పనిచేసిన రెండో సినిమా.

అప్పటికింకా 'యూత్' సినిమా పూర్తికాలేదు. 'నీతోడు కావాలి' తర్వాత మరో మూడు సినిమాలకి ఛాయాగ్రహణం నిర్వహించే అవకాశం వచ్చింది. అవన్నీ చిన్న సినిమాలే అవడం ఒక విశేషం. లో-బడ్జెట్ మూవీస్ అవడం వల్ల ప్రతిరోజూ క్రైసిస్ మేనేజ్మెంట్‌గానే ఉండేది. సమస్యలతో టెన్షన్, అవి ఐపోగానే మళ్ళీ సంతోషం.. దగ్గరగా చూస్తే అన్నీ సమస్యలే..దూరాన్నుంచి గమనిస్తే మామూలుగా అనిపించేవి. ప్రతిరోజూ కొత్త అనుభవమే. 'పత్తా' అనే చిన్న సినిమా అవగానే 'కార్తీక్' అనే సినిమాకి పనిచేశాను. ఈ సినిమాని రామ్ గోపాల్ వర్మగారి మావయ్య మురళిరాజుగారు తీశారు. ఆయనతో కలిసి పనిచేయడం చాలా విలువైన అనుభవం. ఆయన ప్రపంచ సినిమాలన్నింటికీ ఎన్ సైక్లోపీడియా లాంటి వారు. అలాంటి అనుభవజ్ఞులతో పనిచేయడం వల్ల చాలా నేర్చుకున్నాను. నా ప్రయాణంలో ఇలాంటి మంచి మనుషుల పరిచయాలన్నీ నన్ను ఎంతో ఇన్ స్పైర్ చేశాయి.



తర్వాత 'రెండేళ్ళ తర్వాత..' అనే సినిమాకి పనిచేశాను. దీని దర్శకుడు ఆర్.నారాయణ మూర్తిగారి వద్ద పనిచేసిన కె.బి.ఆనంద్ గారు. నిర్మాత కాకినాడకు చెందిన బాబ్జీ అనబడే బి.వి.ఎస్.చౌదరిగారు. సినిమా షూటింగ్ సమయంలోనే బాబ్జీ గారు ' ఈ సినిమా అయ్యాక నీ డైరెక్షన్ లో తప్పని సరిగా ఒక సినిమా నిర్మిస్తాను..' అన్నారు. ఆయన అన్నట్లు గానే ఆ సినిమా అయ్యాక 'ఆకాశం' అనే స్క్రిప్టు సిద్ధం చేసుకున్నాను. ఆకాశం అనేది విశాలమైంది, సుదూరమైంది, ఒక్కొక్కరికి ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క విధంగా కనిపిస్తుంది, ప్రేమ కూడా ఇలాంటిదే. అన్న కాన్సెప్టులో ఆ కథ తయారు చేసుకున్నాను. సంగీతం కోసమని ఎల్.ఎస్.వైద్యనాథన్ గారిని సంప్రదించాము. కథ వినగానే ఆయన ఎంతో ఇన్స్పైర్ అయ్యారు. ఆయన చూపించిన ఉత్సాహం నాలో రిఫ్లెక్ట్ఐ నన్ను మరింత ఛార్జ్ చేసింది. పాటలు ట్యూన్ అయ్యాయి. కొత్త హీరోయిన్‌ని కూడా సెలెక్టు చేశాం.. చాలా కొత్త సినిమాల్లానే వివిధ కారణాల వల్ల అది టేకాఫ్ కాలేదు.

ఏదైనా పని మధ్యలో వదిలేస్తే నాకు తృప్తిగా ఉండదు. ముందులో నాకు అంతగా ఆసక్తిలేకపోయినా ఎలానో దర్శకత్వం వైపుకి దృష్టిమళ్ళింది. దాన్ని పూర్తిచేస్తే కానీ సాధించామన్న తృప్తి ఉండదు. అందుకని రకరకాల స్క్రిప్టులు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను. 'సంధ్య'అనే థ్రిల్లర్, డ్రామా కథ తయారు చేసుకుని భూమికని కలిశాను. కథ చాలా నచ్చింది కానీ మరో రెండేళ్ళవరకూ చెయ్యలేనని చెప్పారు. మంజుల గారిని కలిశాను. ఆవిడకీ స్క్రిప్టు బాగా నచ్చింది కానీ అప్పుడే 'కావ్యాస్ డైరీ' చేస్తున్నాను కాబట్టి ఇంకొంచెం సమయం కావాలన్నారు.

## 'కుదిరితే కప్పు కాఫీ ' దాకా...

కేవలం రెండేళ్ళు మాత్రమే ఈ సినిమా రంగంలో పనిచేసి బయటికి వెళ్ళిపోదామనుకున్న వాడిని, నా ప్రమేయం లేకుండానే, అయిష్టంగానే ఇన్నేళ్ళు పనిచేసాను మధ్య మధ్యలో సంతృప్తి కోసం షార్ట్ ఫిలిమ్స్ డాక్యుమెంటరీలు చేసేవాడిని. అందుకే సినిమాకి సినిమాకి మధ్య చాలా గాప్ ఉండేది.

మూడు సంవత్సరాల క్రితం మాత్రమే నిర్ణయించుకున్నాను నాకు ఆసక్తి వున్న సైన్స్, ఆర్ట్స్, టెక్నాలజీ అన్నీ ఈ రంగంలో వుండగా వేరొక దాని గురించి ఆలోచన అవసరం లేదని. అప్పటినుంచి వీలైనన్ని శాఖల్లో మెళకువలు నేర్చుకుంటూ, నన్ను నేను మర్చిపోతూ, నన్ను నేను వెతుక్కుంటూ, నా భావాలని ఎక్కువమంది తెలియచేయగల ఈ మాధ్యమంలో నిలదొక్కుకోటానికి ప్రయత్నాలని దీక్షగా విస్తృతం చేశాను.




ఇక్కడ మిత్రుడు నరసింహారావు గురించి చెప్పాలి. 'సుస్వాగతం' సినిమాకి నేను అసిస్టెంట్ కెమేరామేన్‌గా పనిచేసే రోజుల్లో తను అసిస్టెంట్ డైరెక్టర్ గా ఉండేవాడు. నేను సినీరంగం నుంచి మధ్యమధ్యలో బయటికి వచ్చేద్దామనుకున్నప్పుడల్లా మళ్ళీ నన్ను మోటివేట్ చేసి మళ్ళీ చిత్రరంగం వైపు ప్రోత్సహించిన ఆత్మీయ మిత్రుడు తను. దర్శకుడిగా ప్రయత్నిస్తున్న సమయంలో తనే మద్రాసు తీసుకెళ్ళి కొంతమంది నిర్మాతలకి పరిచయం చేశాడు. తన ప్రోత్సాహమే ఎప్పుడూ నాకు టానిక్‌లా పనిచేసేది, చేస్తోంది..

ఈ జర్నీలో ఇంకో మలుపు శాయికిరణ్ అడివిగారి ప్రోజెక్టుల్లో పాల్గొనే అవకాశం రావడం. శాయికిరణ్ నాకు 'ఆనంద్' రోజుల్నుంచే పరిచయం. తన మొదటి దర్శకత్వం 'వినాయకుడు'కి కెమేరామేన్‌గా పనిచేయ్యాల్సింది, కానీ అదే సమయంలో 'ఆకాశం' ప్రయత్నాల్లో ఉండడంతో కుదరలేదు. 'వినాయకుడు' స్క్రిప్టులో మాత్రం సహాయం చేశాను. అయినా, మహి కలిసి తీసిన 'విలేజ్‌లో వినాయకుడు' సినిమాకి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచేశాను. ఆ సమయంలోనే మహి నాతో సినిమా తియ్యడానికి ముందుకొచ్చారు. అంతవరకూ నావద్ద ఉన్న కథలు అన్నీ చూశారు. వాటికంటే, నేను క్లుప్తంగా చెప్పిన ఒక లైన్ నచ్చి దాన్ని డెవలప్ చెయ్యమన్నారు. అదే, దర్శకుడిగా విడుదలైన నా మొదటి సినిమా **'కుదిరితే కప్పు కాఫీ '.** మహికి, ఎన్నారై శివ కూడా కలిశారు. సినిమా పేరు కూడా మహినే పెట్టారు. క్రిందటేడాది సుమారుగా ఇదే రోజుల్లో బీజం వేసుకున్న సినిమా క్రిందటేడాది చివర్లో షూటింగ్ పూర్తిచేసుకుని ఇదో క్రిందటి వారమే మీ ముందుకొచ్చింది.

చూసేవారి కళ్ళలోనే అందం వుంటుందని తెలుసు
సామాజిక పరిణామక్రమంలో
అన్నింటినీ అందంగా చూడగలిగే కళ్ళు ఆవిర్భవిస్తాయని
కలలు కంటున్నాను..!!

రమణ

ఈ సినిమాకి పాటలు వ్రాసిన సిరివెన్నెలగారితో సాన్నిహిత్యం నా జీవితంలో మరో మలుపు. వాళ్ళ అబ్బాయే ఈ సినిమాకి సంగీత దర్శకుడవడం ఒక విశేషమైతే, ఆయనతో పాటలు వ్రాయించుకోడానికి వెళ్ళినప్పుడు గంటల తరబడి ఆయనతో సాగిన సాహితీ చర్చలు మరొక ఎత్తు. నేనప్పుడప్పుడూ వ్రాసుకున్న వాక్యాలని చూపించి 'దీన్ని కవిత్వం అంటారో కాదో కూడా నాకు తెలీదు' అన్నప్పుడు 'దీన్ని కవిత్వం కాదని నిరూపించు..చూద్దాం' అని ప్రోత్సహించారాయన.

ఎన్ని కృతజ్ఞతలు చెప్పుకున్నా ఋణం తీర్చుకోలేని వ్యక్తులు మా కుటుంబసభ్యులు. చిన్నప్పటి నుంచి, ఇప్పటి వరకూ నన్ను చిన్నపిల్లవాడిలానే చూస్తూ, నా బాగోగులకోసం ప్రతిక్షణం తపించే మా వాళ్ళ ఆప్యాయత, అనురాగం అది నాకు ప్రతిక్షణం కొండంత బలం. ఇప్పటికీ చిన్నన్నయ్య కానీ, నాన్నగారు కానీ నేను బయటికి వస్తున్నప్పుడల్లా 'జేబులో పర్సుపెట్టుకున్నావా? ఇంకా ఏమైనా ఛేంజ్ కావాలా?' అంటు నా ప్రతి చిన్న అవసరాన్నీ గమనిస్తూ ఉంటారు.

ఇదండీ నా మొదటి సినిమా వరకూ ఇంతవరకూ జరిగిన ప్రస్థానం. 'కుదిరితే కప్పు కాఫీ'ని అభిమానించి విజయవంతం చేసిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ఇంతవరకూ నా జీవిత పయనం అంతా ఆత్మశోధన, అన్వేషణ లాసాగింది. ప్రతి మజిలీలోనూ ఏదో కొత్త మలుపు.. మళ్ళీ మలుపుకోసం అన్వేషణ.. ఎన్నో పరిచయాలు.. ప్రభావితం చేసిన వ్యక్తులెందరో.. ఎప్పుడూ బిజీగా ఉండడం, పదిమందితో కలిసిపనిచేసే లైఫ్ స్టైల్ నాకు బాగా నచ్చడమే కాక నన్ను నన్నుగా నిలబెడుతోంది. నేను ఏమైనా విజయాలు సాధించాననుకుంటే అందుక్కారణం నన్ను ప్రభావితం చేసిన మిత్రులు, శ్రేయోభిలాషులే!!

మళ్ళీ త్వరలోనే మరో మంచి సినిమాతో మీ ముందుకి వస్తాను..!

***రమణగారి బ్లాగు:*** **http://swagataalu.wordpress.com/**

.

(మార్చి 2011 సంచికలో ప్రచురితం)

# పి.లక్ష్మీనారాయణ(దీప్తి)

హాస్యనటుడు సునీల్‌ని హీరో చేసి, నిలబెట్టిన మొదటి సినిమా 'అందాల రాముడు' అందరికీ గుర్తుండే ఉంటుంది. దాని దర్శకుడు పి.లక్ష్మీనారాయణ(దీప్తి)గారి మొదటి సినిమా కబుర్లు ఈ నెల మీకోసం ప్రత్యేకం. ప్రతి విజయం వెనుకా ఎంతో కృషి, పట్టుదలా, ఉంటాయనడానికి లక్ష్మీనారాయణ గారి సినీ ప్రస్థానం మరొక ఉదాహరణ.. ఈ నెలలోనే 'మంచివాడు' ఆయన రెండో చిత్రంగా మన ముందుకి రాబోతోంది. 'అందాల రాముడు' లాగానే ఇది కూడా మంచి విజయాన్ని సాధించాలని లక్ష్మీనారాయణ గారికి కౌముది శుభాకాంక్షలు తెలియచేస్తోంది.

### చిన్నప్పుడే నాటకాల పరిచయం



నేను పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా, పెదకాకాని గ్రామం. నాన్నగారు పెండం కోటేశ్వరరావు నాయుడు, అమ్మ రాజ్యలక్ష్మి. మా నాయనమ్మకి నాన్నగారు ఒక్కడే సంతానం. అందువల్ల చిన్నప్పటినుంచి చాలా గారాబంగా పెరిగారట. అయనకి చిన్నప్పటినుంచే నాటకాలంటే ఆసక్తి ఉండేదట. నాకు ఊహ తెలిసేటప్పటికే ఆయనకి రంగస్థల నటులుగా పెద్దపేరు ఉండేది. బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీర్ పాత్ర ఆయనకి ఫేవరేట్ కేరక్టర్. ఎన్నో పరిషత్తుల్లో బహుమతులు కూడా గెలుచుకున్నారు. ఒకసారి నాన్న మాయలఫకీర్ వేషంలో డైలాగ్స్ చెబుతుంటే ఆ గాంభీర్యానికి, వికటాట్టహాసానికి భయపడిన ప్రేక్షకుల్లోని ఒక గర్భవతి అక్కడే ప్రసవించిందట..! చుట్టుపక్కల గ్రామాల్లో నాన్నగారి నటన గురించి మాట్లాడుతూ ఈ సంఘటనని పదే పదే ఉదహరిస్తూ ఉండేవారు.



### కాలేజీ చదువు - మద్రాసు ప్రయాణం

నాన్నగారి వారసత్వమేనేమో, నాకూ చిన్నప్పటినుంచే నాటకాలంటే విపరీతమైన ఇంట్రెస్టు మొదలైంది. నాన్నకేమో నన్ను ఇంజినీరునో డాక్టర్నో చెయ్యాలని ఉండేది. గుంటూరు హిందూ కాలేజీలో చదువుకి వెళ్ళగానే నాటకాల వ్యాపకానికి హద్దులు లేకుండా పోయింది. నాటకాలు వ్రాయడం, వేయడం, డైరెక్షన్ చేయడం.. అన్నీ విజృంభించాయి. నాటకాల్లో మునిగితేలుతూ బి.కామ్ డిగ్రీ పూర్తిచేశాను. చదువు అవగానే పీర్‌లెస్ ఇన్సూరెన్స్‌లో ఏజంట్ నుంచి ఫీల్డ్ ఆఫీసర్‌గా ప్రమోట్ అయ్యాను. ఏం చేస్తున్నా నాటకాలమీద మక్కువ మాత్రం ఏమీ తగ్గలేదు. అప్పటికి తెలుగు సినిమాల్లో దాసరి నారాయణ రావుగారి శకం కొనసాగుతోంది. సినిమాల్లోకి వెళ్ళాలనుకునే వాళ్ళందరికీ ఆయన గొప్ప ఆదర్శంగా తోచేవారు. సినిమారంగంలోకి వెళ్ళాలని, ఎలాగైనా దాసరి గారి వద్ద అసిస్టెంట్‌గా చేరాలని ఆలోచన రోజురోజుకీ బలపడసాగింది. దానికి తోడు నా మిత్రుడు వెంకటేశ్వరరెడ్డి కూడా 'నీకేం తక్కువ!? నాటకాల్లో ఎంతో అనుభవం ఉంది. సినిమా రంగమే నీకు తగిన రంగం. మద్రాసు వెళ్ళిపో..' అని నన్ను ప్రోత్సహించాడు. ప్రోత్సహించడమే కాదు మద్రాసులో ఉంటున్న వాళ్ళ అక్కయ్యగారి వివరాలు కూడా ఇచ్చి అక్కడికి వెళ్ళమని చెప్పాడు. జేబులో బాగానే డబ్బులు ఉంటున్నాయి కాబట్టి మద్రాసు వెళ్ళొచ్చు కానీ ఇంట్లో ఏమని చెప్పాలి? సినిమాల్లోకి అంటే ఖచ్చితంగా ఒప్పుకోరు..ఏం చెయ్యాలా అని ఆలోచించి, చివరికి ఇంట్లో చెప్పకుండానే మద్రాసు వెళ్ళడానికి నిర్ణయించుకుని అదే ప్రణాళిక అమలుచేశాను.

### సినిమాల్లో తొలి అడుగులు

వెంకటేశ్వరరెడ్డి బావగారు మద్రాసులో మెటడోర్ వేన్ మెయిన్‌టెయిన్ చేసేవారు. దాన్ని సినిమా షూటింగులకి అద్దెకి ఇస్తుండేవారు. మద్రాసు వెళ్ళగానే వాళ్ళింట్లోనే దిగాను. చక్కగా ఆదరించారు. తర్వాత రూమ్ అద్దెకి తీసుకున్నాను. వాళ్ళకి తెల్సిన కెమేరామేన్ సి.గోపాల్‌గారికి పరిచయం చేశారు. ఆయనద్వారా సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. దాసరిగారి వద్ద ఛాన్స్ కోసం ఆయనా తన శక్తివంచనలేకుండా ప్రయత్నించారు కానీ వీలుకాలేదు. గోపాల్‌గారి ద్వారానే వాకాడ అప్పారావుగారు పరిచయమయ్యారు. ఆయన పరిచయం నా భవిష్యత్తుని పూర్తిగా ప్రభావితం చేస్తుందని అప్పుడు నాకూ తెలీలేదు.

నాకు పరిచయమయ్యేటప్పటికే అప్పారావుగారు, లలితకళాంజలి బేనర్ మీద కోడి రామకృష్ణ గారితో సినిమాలు తీస్తున్నారు. నాలోని ఉత్సాహం, పట్టుదల గమనించి నన్ను తన కంపెనీ తరుఫున కోడి రామకృష్ణగారి వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అప్రెంటిస్‌గా జాయిన్ చేశారు. అలా నేను సినిమా రంగంలో కాలుపెట్టిన మొదటి సినిమా 'మూడిళ్ళముచ్చట'. ఎప్పటినుంచో దాసరి నారాయణ రావుగారి వద్ద చేరాలని ఉవ్విళ్ళూరిన నాకు, ఆయన శిష్యుడు కోడి రామకృష్ణగారి వద్ద పనిచేసే అవకాశం రావడం చాలా అదృష్టంగా భావించాను. నా వర్క్‌లోని చురుకుదనం, సిన్సియారిటీ, కోడి రామకృష్ణగారికి బాగా నచ్చింది. 'ఇంటి దొంగ', 'అత్త మెచ్చిన అల్లుడు' ...వగైరా సినిమాలకి 1989 వరకూ కోడి రామకృష్ణగారి వద్ద అప్రెంటిస్‌గా మొదలుపెట్టి అసోసియేట్ దాకా ఎదిగాను.

## దాసరి గారి వద్ద సువర్ణావకాశం

ఆరోజుల్లోనే దాసరిగారి వద్ద అసోసియేట్‌గా పనిచేసే ప్రసాద్ గారు పరిచయమయ్యారు. నా మనసులోని కోరికని ఆయనకి చెప్పాను. ఆయన దాసరి గారి వద్దనే పనిచేసే కో-డైరెక్టర్ ఉప్పలపాటి సత్యనారాయణ గారికి పరిచయం చేశారు. అవకాశం చూసుకుని దాసరి గారికి పరిచయం చేస్తానని ఆయన ప్రోమిస్ చేశారు. అన్నట్లుగానే కొద్ది రోజులకే పిలిచి దాసరిగారి వద్దకి తీసుకెళ్ళారు. దాసరిగారప్పుడు పామ్‌గ్రోవ్ హోటల్లో వేరే సినిమా సిటింగ్‌లో ఉన్నారు. నేను చాలా నీట్‌గా డ్రెస్ చేసుకునేవాడిని.. ఒక్కసారి పై నుంచి కిందవరకూ చూసి 'వర్క్ సిన్సియర్‌గా చేస్తావా?' అని అడిగారు. సత్యనారాయణ నా గురించి చెప్పడంతో తన వద్ద చేర్చుకోడానికి అంగీకరించారు. అలా నేను ఎప్పటినుంచో నేను కన్న కలలు నిజమయ్యాయి. దాసరి నారాయణ రావుగారి వద్ద 'అమ్మ రాజీనామా' నుంచీ 'రాయుడు గారు - నాయుడు గారు' వరకూ పనిచేశాను. ఆ రోజుల్లో దాసరిగారి స్పీడ్ అమోఘంగా ఉండేది. ఒకేసారి రెండు మూడు సినిమాలు సెట్స్ మీద ఉండేవి. అలా దాదాపు ఆరేళ్ళలో డజన్ పైగా సినిమాలకి దాసరి గారి వద్ద పనిచేసే అదృష్టం దక్కింది. వర్క్‌లో నా పర్ఫెక్షన్‌ని దాసరి గారు చాలా మెచ్చుకునే వారు. సినిమా దర్శకత్వంలో చాలా విలువైన మెళకువలు అక్కడే నేర్చుకున్నాను. ఆరేళ్ళ తర్వాత 1995 ప్రాంతాల్లో భీమినేని శ్రీనివాసరావు గారి వద్ద 'శుభాకాంక్షలు' చిత్రానికి కో-డైరెక్టర్ గా చేరాను.



ఈ రోజుల్లోనే మిత్రులు కొంతమంది సలహా ఇచ్చారు 'పేరు మార్చుకుంటే అదృష్టం కలిసివస్తుంద'ని. అందుకని 'దిలీప్' అని పేరు మార్చుకున్నాను.. రకరకాల యాక్సెంటుల్లో అది కాస్తా 'దీపక్' ఐంది.. కొన్ని రోజులకి 'దీపు' ఐంది. చివరికి దీప్తి దగ్గర సెటిలైంది. ఐతే అమ్మానాన్న పెట్టిన పేరు లక్ష్మీనారాయణ వదులుకోవడం ఇష్టం లేదుకాబట్టి అందరికీ తెల్సిన 'దీప్తి' అన్నపేరుని బ్రాకెట్లో వ్రాసుకుంటాను.

## సూపర్‌గుడ్ సంస్థలో ప్రవేశం

నేను ఎప్పుడు ఎవరి వద్ద పనిచేస్తున్నా వాకాడ అప్పారావు గారితో సన్నిహితత్వం కొనసాగుతూనే ఉంది. వాళ్ళింట్లో ఒక కుటుంబసభ్యుడిలా కలిసిపోయాను. అప్పటికి ఇంకా నేను మద్రాసులోనే ఉన్నాను. అప్పారావుగారు మిగతా ఇండస్ట్రీ పెద్దలతో బాటుగా హైదరాబాదుకి వెళ్ళిపోయారు. 'సూపర్ గుడ్ సంస్థ పేరుతో ఆర్.బి.చౌదరిగారు సినిమాలు మొదలుపెడుతున్నారు. హైదరాబాదు వచ్చెయ్యి' అని నన్ను పిలిచారు. అప్పుడు హైదరాబాదుకి మకాం మార్చాను. అలా మళ్ళీ భీమినేని శ్రీనివాసరావుగారి తోనే కలిసి సూపర్‌గుడ్ వారి 'సూర్యవంశం' చిత్రానికి పనిచేశాను. ఆ సినిమాలకి వాకాడ అప్పారావుగారు ఎక్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. అలా సూపర్ గుడ్ సంస్థలో నా ప్రవేశం జరిగింది. అదే సంస్థలో దాదాపు ఏడేళ్ళ పాటు పనిచేశాను. ఒకటో రెండో తప్ప వాళ్ళు తీసిన సినిమాలన్నింటికీ దర్శకత్వ శాఖలో పనిచేశాను. చౌదరి గారు మహానుభావుడు. ఆయన వర్కింగ్ స్టైల్, స్క్రిప్టుని అంచనా వేసే విధానం..ఎంతో ఆసక్తికరంగా ఉండేవి. నా పనితనం, చిన్నా, పెద్దా ఆర్టిస్టులెవర్నైనా నేను హేండిల్ చేసే విధానం ఆయనకి బాగా నచ్చింది. 'దీప్తీ ..నీతో సినిమా తప్పక చేస్తాను..'అంటుండే వారు. అప్పటికే చాలామంది కొత్త దర్శకులకి అవకాశాలిచ్చారాయన.



## 'అందాలరాముడు 'కి పునాది

'సంక్రాంతి' సినిమా అయ్యాక ఎలాగైనా సొంతంగా దర్శకత్వం చెయ్యాలని ప్రయత్నాలు ప్రారంభించాను. అప్పటికే పరిశ్రమకి వచ్చి 20 ఏళ్ళు ఔతోంది. ..శ్రేయోభిలాషి వాకాడ అప్పారావుగారు కూడా నాతో సినిమా చేయించాలని పట్టుదలగా ఉన్నారు. సూపర్ గుడ్ సంస్థలోనే చాలా రోజులుగా ఒక స్క్రిప్టు పడి ఉంది. 'సుందరపురుషన్' అనే తమిళ సినిమా మాతృకగా వ్రాసిన స్క్రిప్టు అది. అప్పటికే ఐదుగురు డైరెక్టర్లు దాని మీద పనిచేసి రకరకాల కారణాల వల్ల వదిలేశారు. నాకైతే దాని మీద చాలానమ్మకం ఉంది అదేమాట అప్పారావు గారితో చెప్పాను. ఆయన కూడా దానిమీద అంత ఇంట్రెస్టు చూపించలేదు. నాకైతే దాన్ని వదలాలనిపించలేదు. ఒకరోజు ఏదో పనిమీద రామానాయుడు స్టూడియోకి వెళ్ళినప్పుడు అప్పటికే బాగా పరిచయమున్న సునీల్ ఎదురయ్యాడు. అక్కడేదో సినిమాకి డబ్బింగ్ చెబుతున్నాడు తను. తనని చూడగనే 'సుందరపురుషన్' తెలుగు వెర్షన్‌ని సునీల్ తో చేస్తే క్రేజీ ప్రోజెక్టు ఔతుందన్న ఆలోచన వచ్చింది. సునీల్ కి ఇదే విషయం చెప్పాను. తనే హీరో అనే సరికి సునీల్‌కి అంతగా నమ్మకం కలగలేదు. 'సునీల్ నేను సినిమా అంటూ చేస్తే నీతోనే చేస్తాను..' అని చెప్పాను. నా పట్టుదల చూసి 'సరే..దీప్తి.. ఈ ప్రోజెక్టు మనం చేస్తున్నాం'అని సునీల్ ఒప్పుకోగానే అక్కడనుంచే అప్పారావు గారికి ఫోన్ చేశాను. సునీల్ తో మాట్లాడించాను.

ఈ స్క్రిప్టుని మరింత ఎట్రాక్టివ్‌గా ప్రెజెంట్ చెయ్యాలన్న ఉద్దేశంతో ముందు దాని టైటిల్ వ్రాసుకున్నాను.. ***'అందాలరాముడు'***, టాగ్ లైన్ ***'అని వీడి ఫీలింగ్'*** అని! సునీల్ హీరో 'అందాలరాముడు' టైటిల్..అంటే ప్రేక్షకుల్లో కొత్త రకమైన ఆసక్తి ఉంటుందని మిత్రులూ కొంతమంది చెప్పారు. ఐతేకొన్ని డిజైన్స్ కూడా చేస్తే అప్పారావు గారికీ, చౌదరిగారికీ ఒక ఐడియా వస్తుందని ఆ దిశగా ప్రయత్నాలు మొదలెట్టాను. అప్పటికి 'గంగోత్రి' సినిమాలో సునీల్ రకరకాల డ్రెస్సులతో ఒక పాట చేశాడు. అతి కష్టం మీద ఆ స్టిల్స్ సంపాదించాను. సునీల్ పక్కన ఎవరు ఉంటే మరింత క్రేజ్ వస్తుందని ఆలోచించాను. అప్పటికి మంచి పొజిషన్‌లో ఉన్న ఆర్తి అగర్వాల్ అయితే బావుంటుందని అనుకున్నాను. ఆ అమ్మాయి చేసిన సినిమాల్లోని కొన్ని స్టిల్స్ సంపాదించాను. మిత్రుడు గ్రాఫిక్ డిజైనర్ రమేష్ వర్మ వద్దకి వెళ్ళి, కథాంశం చెప్పి సునీల్, ఆర్తిల ఫోటోలు ఇచ్చి కొన్ని డిజైన్లు చెయ్యమని అడిగాను. మాకున్న మిత్రత్వం వల్ల రమేష్ వర్మ వాళ్ళిద్దరి ఫోటోలతో రకరకాల బ్యాక్ గ్రౌండ్లతో అరడజను పైగా పోస్టర్ డిజైన్లు చేసి పెట్టాడు. అవి తీసుకుని ముందుగా అప్పారావు గారికి చూపించాను. ఆయనకి తక్షణమే నచ్చేశాయి. సినిమా మీద ఒక ఐడియా వచ్చేసింది. మరో రెండు రోజుల్లో చౌదరిగారికి, పారస్ జైన్‌గారికీ, ప్రసాద్‌గారికీ అప్పారావు గారే చూపించారు. అవి చూడగానే చౌదరిగారు చాలా ఇంప్రెస్ అయ్యారు. వెంటనే 'మంచి ప్రోజెక్టు ఔతుంది..గో ఎహెడ్.' అన్నారు.

### షూటింగ్‌లో ఎదురీతలు

అలా నా మొదటి సినిమా 'అందాలరాముడు'కి పునాది పడింది. ఇంక స్క్రిప్టు ఫైనలైజేషన్, కేస్టింగ్.. మిగతా పనులన్నీ మొదలయ్యాయి. ప్రారంభ విఘ్నాలు బాగానే ఎదురయ్యాయి. అన్నింటినీ పరిష్కరించుకుంటూ ముందుకి సాగాను. ఆర్తి అగర్వాల్‌ని ఒప్పించడం కాస్త శ్రమే ఐంది. కానీ 'సంక్రాంతి' షూటింగ్ సమయంలో నాకిచ్చిన మాట నిలబెట్టుకుని 'అందాలరాముడు'కి డేట్స్ ఇచ్చింది. 2005 నవంబర్ 17న రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి పరిశ్రమలోని పెద్దలందరూ వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. మెగా సూపర్ గుడ్ బేనర్‌లో ఇదే మొదటి సినిమా. అదే నాకూ మొదటి సినిమా కావడం నాకు దక్కిన అదృష్టం. షూటింగ్ మొదలై చాలా వరకూ స్మూత్‌గా సాగిపోయింది. ఇంకా క్లైమాక్స్, పాటలు మిగిలి వున్నాయి. మధ్యలో షెడ్యూల్‌కి గ్యాప్ వచ్చింది.



ఓరోజు ఎడిటింగ్ రూమ్‌లో మార్కింగ్ చేసుకుంటూ ఉండగా పిడుగులాంటి వార్త అందింది. ఆర్తి అగర్వాల్‌కి ఇంట్లోనే మెట్లమీదనుంచి జారిపడడం వల్ల తీవ్రగాయాలయ్యాయని హాస్పిటల్లో చేర్చారని ఎవరో చెప్పారు. వెంటనే హాస్పిటల్ కి వెళ్ళాను. అప్పటికే మీడియా అంతా అక్కడికి చేరుకున్నారు. అంతా గందరగోళంగా ఉంది. రెండురోజుల తర్వాత అక్కడ తెలిసిన డాక్టర్ ఒకాయన్ని కనుక్కుంటే ఆర్తి తలకి, కాళ్ళకి, చేతులకూవాలా తీవ్రమైన గాయాలయ్యాయని, కోలుకోడానికి చాలా రోజులు పడుతుందని చెప్పారు.

ఇంక నా డిప్రెషన్ చెప్పనలవి కాదు. సినిమారంగంలో ఇరవయ్యేళ్ళ తర్వాత సొంతంగా దర్శకత్వం చేస్తున్న మొదటి సినిమా.!! అప్పటికే సునీల్, ఆర్తి కాంబినేషన్ అనేసరికి మార్కెట్లో విపరీతమైన క్రేజ్ వచ్చింది. అంతలో ఇంత పెద్ద అవరోధం.. మళ్ళీ ఎప్పుడు మొదలౌతుందో కూడ తెలీని అసందిగ్ధత.. ఐతే విచిత్రంగా, వారం పదిరోజులకే డాక్టర్లని సైతం ఆశ్చర్యం కలిగిస్తూ ఆర్తి ఆరోగ్యం రోజురోజుకీ మెరుగు పడసాగింది. కాస్త కోలుకోగానే అమెరికాకి వెళ్ళిపోయింది. 'అందాలరాముడు' భవిష్యత్తు అయోమయంలో పడిపోయింది. రెండు నెలల తర్వాత ఆర్తి, తనే అమెరికా నుంచి ఫోన్ చేసి మాట్లాడింది. జరిగిన ఆలశ్యానికి క్షమాపణ చెబుతూ షూటింగ్‌కి రెడీగా ఉన్నానని, మొదలుపెట్టుకోమనీ చెప్పింది. మళ్ళీ యూనిట్లో ఉత్సాహం మొదలైంది.

క్లైమాక్స్ ఎక్కడైనా వాటర్ ఫాల్స్ దగ్గర తియ్యాలి. అలానే పాటలు కూడా కేరళలో తీస్తేనే సినిమాకి పరిపూర్ణత వస్తుందని ముందు నుంచి అనుకుంటున్నాం. అది 2006 మే చివరిరోజులు. కేరళలో బాగా వర్షాలు పడుతున్నాయని తెలిసింది. ఐనా అక్కడే షూటింగ్ చెయ్యాలన్న ఉద్దేశంతో లోకేషన్స్ స్కౌటింగ్ కోసం కేరళ వెళ్ళాను. పొలాచి, మోనార్, శాలిగుడి అన్నీ తిరిగాను. ఎక్కడా వర్షం వెలిసే సూచనలు లేవు. అన్నీ అడ్డంకులే అన్నట్లుంది నాపని. క్వాలిస్ వేన్‌లో ఎక్కడా ఆగకుండా తిరుగుతున్నాం. వాగ్మెన్ వెళ్ళే త్రోవలో అర్థరాత్రి అడవిలోంచి వెళ్ళాల్సివచ్చింది. జోరున వర్షం పడుతోంది. కన్నుపొడుచుకున్నా కానరాని చీకటి. మా వేన్ హెడ్ లైట్స్ తప్ప వెలుతురు అన్నమాటే లేదు. డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఉలిక్కి పడి చూసే సరికి ఎదురుగా మూడు ఏనుగులు!! వర్షం..అడవి..పక్కనే కొండరాళ్ళు విరిగి పడుతున్న శబ్దాలు..ఎదురుగా ఏనుగులు..! అన్ని అగ్ని పరీక్షలే. ఏం చెయ్యలేని పరిస్థితి.. అలానే ఆగిపోయాం. గంటన్నర తర్వాత, ఏనుగులు, ఎవరో చెప్పినట్లుగా వాటంతటవే అడవిలోకి వెళ్ళిపోయాయి. బ్రతుకు జీవుడా అనుకుని

ముందుకి సాగాం. వెదర్ ఫోర్‌కాస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళని కలుసుకుంటే మరునాటికి వర్షాలు తగ్గిపోతాయని చెప్పారు. వెంటనే హైదరాబాదులో ఉన్న అప్పారావుగారికి ఫోన్ చేసి వెంటనే డాన్సర్స్‌తో సహా యూనిట్‌ని పంపించమని చెప్పాను. అందరూ వచ్చేసి 'రేపు షూటింగ్' అనగానే ఆరోజు రాత్రి మళ్ళీ భారీ వర్షం..! పగలు ఎప్పుడు కాస్త తెరిపి దొరికితే అప్పుడు షాట్స్ తీస్తూ మొత్తానికి పాటలూ, క్లైమాక్స్ పూర్తిచేశాం..

### కృషికి తగ్గ ఫలితం




అలా అడుగడుగుక్కీ విచిత్రమైన సమస్యలు ఎదుర్కొంటూ పూర్తైన నా మొదటి సినిమా 'అందాలరాముడు' మా నమ్మకాలని ఏమాత్రం వమ్ముచెయ్యలేదు. 2006 అగస్టు 18న విడుదలైంది 'అందాల రాముడు'. విడుదలైన మొదటి షో నుంచే హిట్ టాక్ తెచ్చుకుంది. రెండు దశాబ్దాల నా నిరీక్షణకి ఒక అర్థం కలిపించింది.! సహజంగానే సినిమా విజయం సాధించగానే ఆఫర్లు ఒకదానిమీద ఒకటి వచ్చాయి. అన్నింటినీ జాగ్రత్తగా బేరీజు వేసుకుంటూ మళ్ళీ రెండో సినిమా కూడా సూపర్ గుడ్ ఫిలిమ్స్‌కే చేస్తున్నాను.

'మంచివాడు' మీ యువహీరో తనీష్‌తో ఈ ఏప్రిల్ నెలలోనే మీ ముందుకి తీసుకొస్తున్నాం. పాటలు ఇప్పటికే మా బేనర్ పేరుని నిలబెడుతూ సూపర్ హిట్ అయ్యాయి. విదేశాలనుంచి కూడా ఫోన్లు చేసి మా పాటలని మెచ్చుకుంటుంటే సినిమా విజయం మీద ఏమాత్రం సందేహం కలగడం లేదు. ఈ సినిమా తప్పక ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకంతో ఉన్నాం. మీరు కూడా ఆదరించి అభిమానించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రేక్షకుల ఆశీర్వాదాలే మాకు ఎప్పటికీ శ్రీరామరక్ష..!

### వ్యక్తిగతం

అన్నింటికీ మించి ఈ జీవితంలో భగవంతుడు నాకు ప్రసాదించిన వరాలు రెండే రెండు. ఒకటి - నన్నర్థం చేసుకుని, నన్ను నన్నుగా ప్రేమించే గొప్ప మనసున్న వ్యక్తి నా భార్య జయలక్ష్మి. రెండు - నాన్నే దైవం అనుకునే నా బిడ్డలిద్దరు అరవింద్, భార్గవి. ఇది చాలు నాకీ జన్మకి అనుకుంటుంటాను ఎప్పుడూ.!

నాకు ఈ ఫీల్డ్‌లో జీవితాన్నిచ్చిన ఇద్దరిని మరోసారి గుర్తు చేసుకోకుండా ఈ ఇంటర్వ్యూని ముగించలేను.

నాకు గాడ్ ఐనా గాడ్ ఫాదర్ ఐనా ఆర్.బి.చౌదరి గారే. ఇంక వాకాడ అప్పారావు గారి గురించి చెప్పాలంటే - మనిషి బ్రతకడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో అలాంటి ఆక్సిజనే నా పట్ల వాకాడ అప్పారావు గారు. - ఆయన లేకపోతే నేను లేను. !

(ఏప్రిల్ 2011 సంచికలో ప్రచురితం)

# కె.బాపయ్య

***సీనియర్ మోస్ట్ డైరెక్టర్*** శ్రీ కె.బాపయ్యగారు, పరిచయం అవసరం లేని లబ్ధప్రతిష్టులైన దర్శకులు. మొదటి సినిమా 'ద్రోహి' అంతగా విజయవంతం కాకపోయినా తరువాతి రోజుల్లో చరిత్ర సృష్టించిన సినిమాలకి దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ కి, కుర్రకారులో 'ఎదురులేని మనిషి'తో పునర్వైభవాన్ని కలిగించింది బాపయ్యగారే. 'సోగ్గాడు' అన్న తెలుగుపదానికి 'శోభన్‌బాబు' పర్యాయపదం అన్నంతగా ఆ సినిమాని రూపొందించిందీ బాపయ్యగారే. 1980 దశకంలో భారతదేశం మొత్తమ్మీదనే అత్యధిక పారితోషికం అందుకున్న దర్శకులు బాపయ్యగారు. మల్టీ స్టారర్ సినిమాల్లో అత్యధిక శాతం హిట్ చేసిన ఖ్యాతి కూడా బాపయ్య గారిదే కేవలం మనదేశం లోనే కాక మిడిల్ ఈస్ట్ దేశాల్లో కూడా బాపయ్య గారి పేరు సుపరిచితం. ఆకాలపు ప్రముఖ పాకిస్తానీ నటి బాబ్రా షరీఫ్, బాపయ్య గారి సినిమా రిలీజ్ ఐందంటే చాలు, ఎలానో కేసెట్ సంపాదించి చూడగానే ఫోన్ చేసి బాపయ్యగారిని అభినందించేవారు. ప్రముఖ హీరోయిన్ శ్రీదేవికి ఎంత డిమాండ్ ఉండేదో దర్శకుడిగా బాపయ్యగారికి అంత డిమాండ్ ఉండేది!! ఎన్టీ రామారావు గారు ముఖ్యమంత్రి కావడానికి ముందు చేసిన సినిమా 'నాదేశం'ని కేవలం 21 రోజుల్లో నిర్మించింది కూడా బాపయ్యగారే. ఇటు దక్షిణాదినా అటు ఉత్తరాదినా రికార్డులమీద రికార్డులు సృష్టించిన శ్రీ బాపయ్య గారు 15 సంవత్సరాల క్రిందటే స్వచ్ఛందంగా చిత్రరంగం నుంచి విరమించుకుని విశ్రాంతి జీవితం గడుపుతున్నారు. ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలివీ..



### మజిలీల బాల్యం

మా నాన్నగారి పేరు కోవెలమూడి సత్యనారాయణ. అమ్మగారి పేరు సుమతి. నాన్నగారు ఆంధ్రప్రదేశ్‌లో చాలా చోట్ల సివిల్ కాంట్రాక్టులు చేస్తుండేవారు. అమ్మా నాన్నలకి మేము ముగ్గురం సంతానం. ఒక అక్క, ఒక చెల్లి మధ్యలో నేను. నేను పుట్టింది 1938 ఏప్రిల్ 24న. నాకు మూడునాలుగేళ్ళ వయసులోనే అమ్మ చనిపోయింది. తన రూపురేఖలు కూడా నాకు సరిగా గుర్తులేవు. అమ్మపోయాక నన్ను అమ్మమ్మవాళ్ళు తీసుకెళ్ళి పెంచారు. ఆ విధంగా నా బాల్యమంతా విజయవాడ దగ్గరలోని గుంటుపల్లిలో గడిచింది. అక్కడే ప్రాధమిక విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాను. తర్వాత విజయవాడలో పెదనాన్న గారు

వెంకట్రామయ్యగారు హైస్కూలు చదువుకోసం నన్ను తమ వద్దకి తీసుకెళ్ళారు. ఆప్పట్లో ఆయన కృష్ణాజిల్లా రెవెన్యూ బోర్డు అధికారిగా పనిచేస్తుండేవారు. అక్కడె ఎస్సెసెల్సీ వరకూ చదువుకున్నాను. నాన్నగారు నాకు 12 సంవత్సరాల వయసున్నప్పుడు చనిపోయారు.

విజయవాడలో ఎస్సెసెల్సీ అయ్యాక మా బాబాయిగారు కె.ఎస్.ప్రకాశరావుగారు పై చదువులకోసమని నన్ను మద్రాసు పిలిపించుకున్నారు. అప్పటికే ఆయన తెలుగు చిత్రరంగంలో నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా, స్టూడియో అధిపతిగా పెద్ద స్థాయిలో ఉన్నారు. ఆయన వద్దకెళ్ళి ఇంటర్మీడియెట్ పూర్తిచేశాను. డిగ్రీలో చేరడానికి మధ్యలో వచ్చిన వేసవి శెలవల్లో నన్ను ఖాళీగా ఉంచడం ఇష్టంలేక, నాన్నగారి (బాబాయి ప్రకాశరావు గారినే నేను నాన్నగారు అని పిలవడం అలవాటు చేసుకున్నాను) మిత్రుడు కె.బి.తిలక్ వద్ద నన్ను అసిస్టెంటుగా చేర్పించారు. తన వద్ద కంటే బయటి వారి వద్ద ఐతే పని నేర్చుకోడానికి అవకాశం బావుంటుందన్న ఉద్దేశంతో నన్ను తిలక్ గారి వద్దకి పంపించారు.

## సినీరంగంలోకి.

అప్పట్లో తిలక్‌గారు ఎడిటర్‌గా పనిచేసే వారు. ఆయన వద్ద ఫిల్మ్ ఎడిటింగ్‌లో మెళకువలు నేర్చుకోవడం మొదలుపెట్టాను. ఐతే ఇదంతా కేవలం వేసవి శెలవులు అయ్యే వరకేనని నాన్నగారు (ప్రకాశరావుగారు) గుర్తు చేస్తుండేవారు. ఎడిటర్‌గా వున్న తిలక్‌గారు అనుకోకుండా మిత్రులతో కలిసి అనుపమ నిర్మాణ సంస్థని స్థాపించి దర్శకుడయ్యారు. 'ముద్దుబిడ్డ' ఆ బేనర్‌లో మొదటి సినిమా. తిలక్‌గారే 'బాపయ్యా నువ్వు ఇంటర్మీడియట్ చదివావు కదా.. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ లోకి రాకూడదూ..?' అని నన్ను ప్రోత్సహించి తన వద్ద అప్రెంటిస్‌గా చేర్చుకున్నారు. వేసవి శెలవులు ఐపోవస్తున్నాయి. ఇంకా కాలేజీలకి దరఖాస్తు చెయ్యలేదు. ఒక రోజు నాన్నగారు పిలిచి అడిగారు. ఆయన మాట కాదనలేక కొన్ని కాలేజీలకి అప్లై చేశాను కానీ మనసంతా సినిమా ఫీల్డ్ మీదనే ఉంది. ఒక రోజు కాస్త ధైర్యం తెచ్చుకుని నాన్నగారితో చెప్పాను, నాకు చదువుమీద కంటే సినిమాలమీదనే ఆసక్తి ఎక్కువగా ఉందని. ఆయన కాస్సేపు ఆలోచించి 'సరే..అలానే కానియ్' అన్నారు.

ఆ విధంగా నాన్నగారి ఆశీస్సులతో తిలక్‌గారి వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కొనసాగాను. తిలక్‌గారి మొదటి సినిమా 'ముద్దుబిడ్డ' హిట్ కావడంతో రెండో సినిమా 'ఎమ్.ఎల్.ఎ' తీశారు. ఈ రెండు సినిమాలకీ డైరెక్షన్‌లోనూ, ఎడిటింగ్‌లోనూ కూడా అప్రెంటిస్‌గా చేశాను. అంటే జీతమేమీ ఉండేది కాదు. కేవలం పని నేర్చుకోడానికి అవకాశం వచ్చిందంతే. తిలక్ గారిదే మూడో సినిమా 'అత్తా ఒకింటి కోడలే'కి పెయిడ్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. దాని తర్వాత నాన్నగారే (కె.ఎస్.ప్రకాశరావు గారు) సొంతంగా తీసిన 'రేణుకాదేవి మహాత్మ్యం'కి నాన్నగారి వద్దనే అసోసియేట్‌గా పనిచేశాను. నాన్నగారి కజిన్ భాస్కరరావుగారు ('బ్రతుకు తెరువు','రేపునీదే' లాంటి సినిమాలు తీసిఉన్నారు అప్పటికే) తీసిన 'మోహినీ రుక్మాంగద' చిత్రానికి కూడా నాన్నగారి వద్దనే పనిచేశాను. అంతలో నాన్నగారికి స్టూడియో వ్యవహారాల్లో కాస్త ఒడిదుడుకులు రావడంతో నన్ను తాపీచాణక్య గారి వద్దకి పంపించారు.



చాణక్యగారి వద్ద నా మొదటి సినిమా 'రాముడు-భీముడు'. సురేష్ ప్రొడక్షన్స్ రామానాయుడు గారికి కూడ అదే మొదటి సినిమా. అక్కడ మొదలై తాపీ చాణక్యగారి వద్ద మరికొన్ని సినిమాలకి అసోసియేట్‌గా పానిచేశాను. సురేష్ సంస్థలో 'శ్రీకృష్ణ తులాభారం', నాన్న గారు దర్శకత్వం వహించిన 'స్త్రీ జన్మ' చిత్రాలకీ పనిచేశాను.

## మొదటిసినిమా పరాజయం

ఆ సుదీర్ఘ ప్రయాణం తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ రామానాయుడుగారే నాకు తొలి

దర్శకత్వం అవకాశం ఇచ్చారు. అదే 'ద్రోహి'. జగ్గయ్య, దేవిక ప్రధాన పాత్రధారులు డిసెంబర్ 31, 1970 న విడుదలైంది. సూపర్ ఫ్లాప్‌గా పేరు తెచ్చుకుంది. కథ, కథనం, మేకింగ్ అంతా బావున్నా ప్రేక్షకుల్ని చేరలేకపోయింది. నిర్మాతగా రామానాయుడు గారికి, దర్శకుడిగా నాకూ నిరాశనే మిగిల్చింది నా మొదటి సినిమా. మిస్ కాస్టింగ్ అని తర్వాత కొంతమంది చెప్పారు. ఎస్వీ. రంగారావుగారు లేదా ఎన్టీ. రామారావు గారిలాంటి కేస్టింగ్ ఐతే చిత్రానికి బలం వచ్చేదని చాలా మంది అన్నారు. కానీ జరిగిపోయిన దాన్ని మార్చలేం కదా..! అదీ నా తొలి సినిమా అనుభవం..!!

'ద్రోహి' పరాజయం తర్వాత మళ్ళీ నాన్నగారి వద్దనే 'ప్రేమ్ నగర్'కి అసోసియేట్‌గా పనిచేశాను. ఒకసారి డైరెక్టర్ అయ్యాక మళ్ళీ అసోసియేట్ అంటే కొంచెం కష్టమే. అదే వేరేవాళ్ళ దగ్గరైతే చేసేవాడిని కాదేమో కానీ నాన్నగారే కాబట్టి అసోసియేట్‌గా చెయ్యడానికి సందేహించలేదు. 'ప్రేమ్ నగర్' ఘన విజయం గురించి మళ్ళీ చెప్పనవసరం లేదు కదా.

దాని తర్వాత నటి వాసంతి నిర్మాతగా మారి తీసిన 'మేమూ మనుషులమే' చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. అది రెండో సినిమా. ఈ సినిమా బాగానే ఆడింది. ఆ సినిమా చూశాక నిర్మాత క్రాంతి కుమార్‌గారు 'ఊర్వశి' చిత్రానికి దర్శకత్వం చెయ్యమని అడిగారు. ఆ చిత్రకథ కూడా తనకి బాగా తెల్సిన కుటుంబాల్లో జరిగిన రియల్ స్టోరీ అని చెప్పారు. ట్రీట్‌మెంట్ అంతా అయ్యాక చెప్పాను 'క్రాంతి కుమార్‌గారూ.. ఈ సినిమా కమ్మర్షియల్‌గా సక్సెస్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయనిపిస్తోంది' అని. 'ఏమైనా కానీండి బాపయ్యగారూ.. ఇది మంచి సినిమా ఔతుందన్న నమ్మకం ఉంది. విజయవంతమైతే మంచిది, లేదంటే ఒక ఉత్తమాభిరుచి గల చిత్రాన్ని తీశానన్న తృప్తి మిగులుతుంది ' అన్నారు. మా ప్రయత్నలోపం లేకుండా శాయశక్తులా 'ఊర్వశి'ని మంచి సినిమాగా తీర్చిదిద్దాం. ఫలితం మీకు తెలిసిందే ఆ సినిమా నిర్మాణ సమయంలో పరిచయమైన శారద గారి ద్వారా రామకృష్ణారెడ్డి అనే నిర్మాత తన మొదటి సినిమాకి దర్శకత్వం చేయమని నా వద్దకి వచ్చారు. రంగనాథ్, శారద హీరో, హీరోయిన్లుగా నటించిన 'వైకుంఠపాళి' చిత్రమది. అది నా నాలుగో సినిమా. ఆ చిత్ర ఘనవిజయంతో చిత్రపరిశ్రమలో నాకంటూ ఒక స్థానం దొరికింది.

## ఎదురులేనిమనిషి సోగ్గాడు




ఈ రెండు సినిమాలూ ఒకేసారి షూటింగ్ చేయడం నాకో మరపురాని అనుభవం. 'ఎదురులేని మనిషి' ప్రారంభానికి ముందు ఎన్టీఆర్ గారు వయసుమళ్ళిన పాత్రలు ధరించడం మొదలుపెట్టారు. మిగతా యువ హీరోల్లా డాన్సులు చేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకోరేమోననో, ఏమో కానీ 'తాతమ్మ కల', 'బడిపంతులు' లాంటి సినిమాల్లో వయసుమళ్ళిన హుందా పాత్రలు పోషించారు. ఐతే 'దసరాబుల్లోడు' లాంటి సినిమాలతో ఎ.ఎన్నార్ ఎవర్‌గ్రీన్ హీరోలా వెలుగొందుతున్నారు. ఆయన్ని ప్రేక్షకులు ఆమోదిస్తున్నప్పుడు ఎన్టీఆర్ ని ఎందుకు చూడరు అని నా ఆలోచన. అశ్వనీదత్ మొదటి సారి సినిమా తీద్దామని నావద్దకి వచ్చినపుడు ఇదే మాట చెప్పి ఎన్టీఆర్‌తో యువ హీరోలా డాన్సులు చేసే స్కోప్ ఉన్న కథ తయారు చేసుకున్నాను. ఎక్కడో చదివిన ఒక నిజ సంఘటన ఆధారంగా నేనే కథ వ్రాసుకున్నాను. సినిమా షూటింగ్ మొదలైంది.

మొదటి రోజు మొదటి పాట.. సన్నివేశం ఏమిటంటే - గుడిసెలని కబ్జా చేద్దామని వచ్చిన రౌడీలని రామారావు గారు తరిమేస్తే, దానికి ఆనందపడిన ఆ గుడిసె వాసులు రామారావు గారిని పైకెత్తేసి తమ అభిమానాన్ని చాటుకుంటారు. అక్కడ పాట వస్తుంది. వాణిశ్రీ తో పాటుగా రామారావు గారు కూడా స్టెప్పులు వేస్తూ డాన్సుచెయ్యాలి. 'ఏం బ్రదర్...నేను స్టెప్స్ వెయ్యడమేమిటి? నేను జనాల్లో కూర్చుని చూస్తుంటే వాణిశ్రీ బృందం డాన్సు

చేస్తున్నట్లు తియ్యొచ్చు కదా..' అన్నారు రామారావుగారు. 'ఈ సినిమాతో మీరు ప్రేక్షకులు ఊహించని యాక్షన్ చూపించి మీలో కొత్త ఎన్టీఆర్‌ని వాళ్ళు చూసుకునేలా చెయ్యాలనేది నా ప్రయత్నం. వాణిశ్రీ డాన్సు చెయ్యడం ఆడియన్స్‌కి కొత్తగా ఏమీ ఉండదండి. వాళ్ళకది అలవాటే. ఐతే వాళ్ళు ఊహించని విధంగా మీరూ కూడా డాన్స్ చేస్తేనే థ్రిల్ ఉంటుంది..' అని వివరించాను. ఒక్క సెకను ఆలోచించి 'సరే బ్రదర్..ఐ యాం రెడీ..' అని సెట్లోకి వెళ్ళారు. అలా మొదలైంది 'ఎదురులేని మనిషి ' పాటల చిత్రీకరణ. ఆ పాట వరకూ ఐన ఫిల్మ్‌ని లాబ్ కి పంపించి ప్రోసెస్ చేయించి రామారావు గారికి చూపించాము. అప్పుడాయన తన సొంత సినిమా వేములవాడ భీమకవి షూటింగ్‌లో ఉన్నారు. తన డాన్సుని చూసుకున్నాక ఆయనే థ్రిల్ ఫీలయ్యారు.

మిగతా పాటల్లో కూడా కొత్త రకం డ్రెస్సులు, బెల్ బాటమ్ ఫాంట్లు.. రామారావు గారు సరికొత్త గెటప్‌తో హుషారుగాచేశారు. ఐతే సినిమా నిర్మాణం జరుగుతున్నంతసేపూ మద్రాసు ఇండస్ట్రీలో విపరీతమైన నెగిటివ్ టాక్ మొదలైంది. 'బాపయ్య రామారావు గారితో స్టెప్పులు వేయిస్తున్నాడట.. సినిమా ఖచ్చితంగా సూపర్ ఫ్లాప్ ఔతుంది..' అని. తర్వాత తెల్సింది - యూనిట్లో వాళ్ళు కూడా నేను రామారావు గారిని నటింప చేస్తున్న విధానం చూసి చాటున నవ్వుకునే వాళ్ళట. చాలా రోజులతర్వాత రామారావు గారే ఒకసారి చెప్పారు, రోజూ ఈ కొత్త కొత్త డ్రెస్సులతో షూటింగ్ ముగిసాక ఇంటికి వెళుతుంటే ఇంట్లో వాళ్ళు కూడా 'ఈ వయసులో మీకిలాంటి వేషాలు అవసరమా?' అంటున్నారని. నాకూ, నిర్మాత అశ్వనీదత్ కి మాత్రం 'ఎదురులేని మనిషి' విజయం మీద సంపూర్ణ విశ్వాసం వుంది.

సినిమా పూర్తయ్యాక నాన్నగారికి చూపించాను. 'సినిమా బాగానే తీశావు కానీ ప్రి వ్యూలు ఎక్కువగా వెయ్యొద్దు. నెగిటివ్ టాక్ ఇంకా ఎక్కువౌతుంది' అని సలహా ఇచ్చారు. అటువైపు 'సోగ్గాడు' సినిమా కూడా జోరుగా నిర్మాణం జరుగుతోంది. దాని నిర్మాత రామానాయుడు గారు. విజయా నాగిరెడ్డి గారికి 'ఎదురులేని మనిషి' షో వేస్తున్నప్పుడు రామానాయుడు గారు కూడా చూశారట. నేను'సోగ్గాడు' ఫైనల్ ఆడియో మిక్సింగ్ లో ఉన్నప్పుడు ఎవరో వచ్చి చెప్పారా విషయం. ఖచ్చితంగా ఈ సినిమా వారం కంటే ఎక్కువ ఆడదు అనే నిర్ణయానికి వచ్చి 'సోగ్గాడు' సినిమాని 'ఎదురులేని మనిషి' విడుదలకి ఖచ్చితంగా వారం తర్వాత ఫిక్స్ చేశారు. డిసెంబర్ 5 , 1975 'ఎదురులేని మనిషి' ఐతే డిసెంబర్ 12, 1975 న 'సోగ్గాడు' రిలీజ్ కి సిద్ధమైంది. ఒకటి లక్ష్మి ఫిలిమ్స్‌ది మరోటి నవయుగ వాళ్ళది. 'సోగ్గాడు' రిలీజ్ ని వాయిదా వేయించడానికి ప్రయత్నాలు జరిగాయి కానీ అప్పటికే థియేటర్లన్నీ బుక్ ఐ పోయి ఉండడంతో వీలుకాలేదు.

'ఎదురులేని మనిషి' విడుదల సమయం దగ్గరకొచ్చింది. సాధారణంగా నా సినిమాలేవీ రిలీజ్ రోజు నేను చూడను. నేనూ. అశ్వనీదత్ మద్రాసులోనే ఉన్నాం. మా అసిస్టెంట్‌లు అందరూ ముందురోజు రాత్రే కారులో బయలుదేరి నెల్లూరు వెళ్ళారు. ఉదయం 9.30 ఆటకోసమని వెళ్ళారు. ఐతే 9.30కంటే ముందుగానే ఉదయం 7.00కే ఒక ఆట వేసేశారు. మా వాళ్ళు వెళ్ళేసరికి జనాలంతా థియేటర్ లోంచి ఈలలు వేసుకుంటూ బయటికి వచ్చి మళ్ళీ 9.30 షోకి క్యూలో నిలుచుంటున్నారట!! మొత్తం ఆంధ్రప్రదేశ్ అంతటిలో నూ అదే ట్రెండ్! అలా మొదటి ఆటతోనే మొదలైన 'ఎదురులేని మనిషి' ప్రభంజనం సిల్వర్ జూబిలీ దాకా సాగింది.!

తర్వాత వారం విడుదలైన 'సోగ్గాడు' కూడా ఓపెనింగ్స్ నెమ్మదిగా ఉన్నా స్లోగా పికప్‌ఐ శతదినోత్సవ చిత్రంగా, శోభన్ బాబు గారి నటజీవితంలో ఒక మరపురాని చిత్రంగా ఘనవిజయం సాధించింది. 'ఎదురులేని మనిషి' శతదినోత్సవసభలో మాట్లాడుతూ ఎన్టీ రామారావు గారు ' ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నంత సేపూ నాకూ అనిపిస్తూ ఉండేది.. ఈ డ్రెస్సులూ, ఈ స్టెప్పులూ.. వేస్తూ శోభన్ బాబు, కృష్ణ లాంటి యువహీరోలతో పోటీ పడగలనా అనిపించేది. ఐతే యూనిట్ అంతా యువకులే. దర్శకుడు మరీ యంగ్. సరే వాళ్ళ ఉత్సాహాన్ని కాదనడం ఎందుకులే అని వాళ్ళని ప్రోత్సహిస్తూ నా శాయశక్తులా కొత్తదనాన్ని చూపించాను. ఈ సినిమా హిట్ ఐతే 60 ఏళ్ళు వరకూ ఇంక వృద్ధపాత్రలు వెయ్యకూడదని అనుకున్నాను. అదిప్పుడు కన్‌ఫర్మ్ ఐంది' అని చెప్పారు. ఈ జంట సినిమాల విజయం తర్వాత నాకూ, రామారావు గారికీ, శోభన్ బాబు గారికి చాలా సంవత్సరాలు ఎదురు లేదు!!

## హిందీ చిత్రరంగ ప్రవేశం.




రామానాయుడుగారు 'సోగ్గాడు'ని హిందీలో 'దిల్‌దార్'గా నిర్మిస్తూ నన్ను దర్శకుడిగా పెట్టుకున్నారు. అంతకముందు నేను 'మేమూ మనుష్యులమే' చేసేప్పుడు నాన్నగారి దర్శకత్వంలో హిందీ 'ప్రేమ్ నగర్' జరిగేప్పుడు దానికి నేనూ దాదాపు కో-డైరెక్టర్‌గా చేశాను. అందువల్ల 'దిల్ దార్' కంటే ముందే హిందీ చిత్రరంగంతో పరిచయం ఉంది. 'దిల్ దార్' విజయం తర్వాత ఆయనకే 'దిల్ ఔర్ దీవార్' తీశాను. పద్మాలయా ప్రొడక్షన్స్‌కి 'దేవుడూ చేసిన మనుషులు' హిందీ వెర్షన్ 'టక్కర్' తీశాను. ఇది వాళ్ళకి మొదటి హిందీ సినిమా. అంతా భారీతారాగణం తో తీసిన ఈ సినిమా సూపర్ హిట్ ఐంది. మళ్ళీ రామానాయుడూ గారికి 'బందిష్' చేశాను. ఇలా వరుస హిట్స్ రావడంతో హిందీలో అవకాశాలు వెల్లువగా వచ్చాయి. దాదాపు నలభై వరకూ హిందీ చిత్రాలకి దర్శకత్వం చేశాను.

కొన్నేళ్ళు హిందీ, తెలుగు రెండు భాషల్లోనూ సమాంతరంగా చాలా సినిమాలు చేశాను. వాటిల్లో అధికశాతం రెండు చోట్లా ఘనవిజయాలు సాధించాయి. తెలుగులో నా చివరి సినిమా 1987లో విడుదలైన 'మావూరి మగాడు'. హిందీలో అవకాశాలు ఎక్కువవడవంతో రెండు పడవలమీద ప్రయాణం కష్టం అనిపించి ఆ తర్వాత కేవలం హిందీ మీదే కేంద్రీకరించాను.



## సినీరంగవిరమణ

హిందీలో చివరి సినిమా 1995 లో వచ్చిన 'దియా ఔర్ తూఫాన్'. అప్పటికి తరాలు మారాయి..కొత్త ట్రెండ్ మొదలైంది. ధర్మేంద్ర, జితేంద్ర లాంటి వాళ్ళ తరంలో నటులందరూ ఎంతో కష్టపడి పైకొచ్చారు. వాళ్ళకుండే విలువలు, మనుషులంటే గౌరవం అంతా ఒక బంగారు శకం. గోవింద, మిథున్ చక్రవర్తి లాంటి వాళ్ళు కూడా మొదటిరోజు డైరెక్టర్ కాళ్ళకి దణ్ణం పెట్టికానీ సెట్ లోకి వెళ్ళేవాళ్ళు కాదు. అదే తరువాతి తరం వచ్చేసరికి, వాళ్ళంతా గోల్డెన్ స్పూన్‌తో వచ్చిన వాళ్ళు. వాళ్ళు, వాళ్ళ వయసువాళ్ళే కావాలని అనుకుంటున్నారు. ఈ మారిన పరిస్థితుల్లో నాకే హుందాగా రిటైర్ అవుదామనిపించి 1995 తర్వాత దర్శకత్వానికి దూరంగా ఉన్నాను.

మళ్ళీ ఒకసారి పాతరోజులు నెమరేసుకునే అవకాశం కల్పించిన 'కౌముది' కి కృతజ్ఞతలు. పాతికేళ్ళపాటు నన్ను దర్శకుడిగా అభిమానించిన ప్రేక్షకులకి ధన్యవాదాలు.

.

(మే 2011 సంచికలో ప్రచురితం)

# విజయనిర్మల

*విజయనిర్మల 44 సినిమాలకు దర్శకత్వం వహించారు. అందులో ఒకటి మలయాళం, ఒకటి తమిళం, నలభై రెండు తెలుగు చిత్రాలున్నాయి. వాటిలో ఇరవై సొంత బ్యానర్ విజయ కృష్ణా మూవీస్ మీద చేసిన చిత్రాలు. ఇరవై ఐదు ఇతరులకు చేసినవి. అత్యధిక సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకురాలిగా 2002లో ఆమెకు గిన్నీస్ బుక్‌లో స్థానం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. సినీ పరిశ్రమలోని అందరు పెద్ద హీరోలు, హీరోయిన్లు - అక్కినేని, శివాజీ, రజనీకాంత్, శ్రీదేవి, జయప్రద, జయసుధ, శ్రీదేవి అందరూ ఆమె చిత్రాలలో నటించారు. ఒక్క ఎన్టీ రామారావుగారితో చిత్రం చెయ్యని కొరత ఆమె మనస్సులో నిలిచిపోయింది. అయితే ఆయన చేస్తానన్నారు. కానీ ఆయన రాజకీయ ప్రవేశంతో ఆ అవకాశం రాలేదు. నూరు చిత్రాలకు దర్శకత్వం వహించాలన్నది ఆమె కోరిక. ఇప్పుడిప్పుడు ఆరోగ్యం సహకరిస్తే కనీసం ఏభై అయినా పూర్తిచేయాలని, చేస్తానని విశ్వాసం.*

(సురభి పత్రిక కోసం గొల్లపూడి మారుతి రావుగారు శ్రీమతి విజయనిర్మలతో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ)

**మా నాన్నగారు రామమోహనరావు గారు వాహినిలో సౌండ్ ఇంజనీర్ గా ఉండేవారు.** ప్రముఖ గాయని రావు బాలసరస్వతి మా మేనత్త కూతురు. ఓ సినిమాలో చిన్న వేషం కావాలంటే నిద్రపోతున్న నన్ను ఎత్తుకుని తీసుకెళ్ళారావిడ. నాకప్పుడు ఏడేళ్ళు. ఉదయం లేచి చూస్తే మా ఆంటీ వాళ్ళింట్లో ఉన్నాను. బిక్క మొహం వేస్తే "సినిమాల్లో వేస్తావా?" అనడిగారు మా ఆంటీ. అంతే ఏడుపు మానేశాను. టి.ఆర్. మహాలింగం వారి ఆఫీసుకు తీసుకెళ్ళారు. తీసే సినిమా పేరు 'మత్స్యరేఖ'. హీరో టి.ఆర్. మహాలింగం. శాంతకుమారి, ఎస్. వరలక్ష్మి. నటవర్గం. పి.పుల్లయ్యగారు దర్శకులు. ఆయన బూతులు జగమెరిగిన సత్యం. నన్ను చూసి "ఏమిటీ ము-డ! బాగుందే"అన్నారు.



శాంతమ్మగారయితే నన్నెత్తుకుని తిప్పేశారు. నేను హీరో చిన్ననాటి వేషం వేయాలి. నాకు మేకప్ వేసింది ఆనాటి హీరో హీరోయిన్లు క్యూలో నిలబడే హరిబాబు గారు. అందరికీ మేకప్ చేశాక, సోఫాలో పడుకున్న నన్ను నిద్రలేపి మేకప్ చేసేవారు. పెద్దా చిన్నా అనే భయం లేదు. సీన్‌లో ఏడవమంటే ఏడుపు రాదు. నవ్వమంటే నవ్వు రాదు. పుల్లయ్యగారు బూతులు లంకించుకునేవారు. శాంతమ్మగారు బుజ్జగించి ఏం కావాలనేవారు. సమాధానం సిద్ధంగా ఉండేది.. పూరీ పొటాటో. అంతే. అది తినగానే సీన్‌లో చెప్పినట్టు చేసేదాన్ని. ఆ విధంగా మొదటి సినిమాలో నటించాను. ఆ సినిమాలో నా తండ్రి పాత్ర ప్రముఖ కేరక్టర్ నటులు బి.ఆర్. పంతులు చేశారు.

పార్థసారథి గుడి దగ్గర మా అత్తయ్య ఉండేది. బడిలో హెడ్ మిస్ట్రెస్. గుడిలో రథోత్సవాలంటే ఇష్టం. కారణం, రుచికరమైన పొంగలి పెట్టేవారు.

ఆ ఉత్సవాల్లో శ్రీనివాసన్ అనే డైరెక్టర్ నన్ను చూశాడు. "సినిమాలో యాక్ట్ చేస్తావా పాపా?" అనడిగారు.

"మా నాన్నను అడగండి" అన్నాను పొంగలి తింటూ.

సినీనటి పద్మిని చిన్నప్పటి పాత్ర. సినిమా పేరు 'సింగారి'. తమిళ చిత్రం. వెంటనే సావిత్రీ, జెమిని గణేశన్ నటించిన 'మనం పోల మాంగల్యం' చేశాను. సావిత్రి గారిని చూడటం నాకు అదే మొదటిసారి. నన్ను పక్కన కూర్చోబెట్టుకుని పొట్టగిల్లేసేవారు. ఆ రోజుల్లోనే 'గుణ సుందరి కథ'లో శ్రీరంజని చిన్నటి పాత్ర కూడా చేశాను.

బాగా గుర్తున్న ముఖ్యమైన వేషం ఎన్టీ రామారావుగారు తీసిన 'పాండురంగ మహత్యం'లో శ్రీకృష్ణుని పాత్ర. ఎక్కువగా తమిళ చిత్రాలు చేయడం వల్ల తెలుగు సరిగ్గా వచ్చేది కాదు. 'భక్త' అనమంటే 'భకత' అనేదాన్ని. రామారావుగారు ఓర్పుగా 'భకత కాదమ్మా" అని సవరించేవారు. వేషమంతా మేకప్ అయ్యాక ఆయనే స్వయంగా ముఖం మీద శంఖచక్రాలు తీర్చిదిద్దేవారు. ఆయన క్రమశిక్షణ, చేసే పనిమీద ఆరాధనా భావం అమోఘం. మేకప్ అయ్యాక పూరీ పొటాటో తిన్నాక గట్టిగా బెల్ట్ బిగించేవారు. ఓసారి 'నాసాగ్రే నవ మౌక్తికం' అనే చరణానికి నాకాలి దగ్గర పువ్వులు ఆయన సర్దుతున్నారు. ఉన్నట్టుండి వాంతి అయ్యింది. వెంటనే స్పృహ తప్పింది. ఆయన అర్థం చేసుకుని 'దిష్టి తగిలింది' అంటూ స్వయంగా దిష్టి తీసి ఇంటికి పంపేశారు. అప్పుడు నాకు పన్నెండు సంవత్సరాలు. ఆ తర్వాత నేను కృష్ణుడిగా ఉన్నంత సేపూ ఎవరినీ షూటింగ్‌కి రానిచ్చేవారు కాదు.

మరో సన్నివేశంలో పుండరీకుడి ముందు శ్రీకృష్ణుడు ప్రత్యక్షమవుతాడు. రాయి మీద కాలు పెడితే దేవేంద్రుడికి శాపవిమోచనమవుతుంది. స్టాప్ బ్లాక్ షాట్. దేవేంద్రుడి వేషం వేసే నటుడు "ఇంత చిన్న పిల్ల నా మీద కాలు పెట్టడమేమిటి?" అన్నాడు. అంతే. రామారావుగారు ఆ నటుణ్ణి వెంటనే పంపించేసి వేరొక నటుణ్ణి పిలిపించారు.

పుండరీకుడు శ్రీకృష్ణునిలో ఐక్యమయ్యే సీన్‌లో రామారావుగారు నా కాళ్ళు పట్టుకుని పాట పాడుతున్నప్పుడు నాకు వణుకు వచ్చేది.

తిరువేంగడం మొదలియార్‌గారు నాకు నాట్యం నేర్పారు. నా పదహారో ఏట వాణీ మహల్లో అరంగ్రేటం జరిగింది. ముఖ్య అతిధి ఎన్టీ రామారావుగారు. "రారా వేణుగోపాలా" జావళి చేసినట్టు గుర్తు. నాకు ఆయన ఒక స్టీలు గిన్నెను బహుకరించారు. అప్పుడే స్టీలు గిన్నెలు ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. అప్పటికది అరుదయిన బహుమతి. మా నాన్నగారూ, ప్రముఖ కెమెరామెన్ విన్సెంట్ గారు మంచి

స్నేహితులు. ఆయన ప్రోద్భలంతో నా పద్దెనిమిదవ ఏట మలయాళ హీరో ప్రేమ్ నజీర్ సరసన హీరోయిన్‌గా చేశాను. మొదటి రోజు మేకప్ రూంలో కూర్చున్నాను. ఎవరో వచ్చారు. "ఊణు కళుచ్చో నీ" అనడిగారు. మళయాళంలో. అన్నం తిన్నావా అని దానర్థం. నేను తలూపాను. నాకప్పటికి మలయాళం అస్సలు రాదు. నేను తినేసాననుకుని నాకు భోజనం పంపలేదు. మధ్యాహ్నం ప్రేమ్ నజీర్ అడిగారు. "ఏం డల్‌గా ఉన్నారూ?" అని. భోజనం చేయలేదన్నాను. వెంటనే బోయ్‌ని పిలిచి భోజనం పెట్టించారు. సినిమా పేరు 'భార్గవీ నిలయం'. నా పేరు భార్గవీ కుట్టి. సినిమా మొదటి భాగంలో ఆ పాత్ర చచ్చిపోయి దయ్యమై పోతుంది. రెండో భాగంలో కేవలం నా కళ్ళకోసం నన్ను తీసుకున్నారు. నటుడు మధుకు ఆ సినిమాయే మొదటి సినిమా. ఆ వరసలో పదిహేను మలయాళం సినిమాలు ప్రేమ్ నజీర్, తిక్కురిసి (ఆయనకప్పుడు 60ఏళ్ళు), ఉమ్మర్‌లతో చేశాను.

తెలుగు సినిమా రంగ ప్రవేశం వింతగా జరిగింది. వాహినిలో బి.ఎన్.రెడ్డిగారు ఏదో మలయాళ చిత్రం రషెస్ చూసి నన్ను పిలిపించారు. "తెలుగు సినిమాలో చేస్తావా?" అని ఇంగ్లీషులో అడిగారు. "నేను తెలుగమ్మాయిని సార్" అన్నాను. రంగుల రాట్నంలో చంద్రమోహన్ పక్కన హీరోయిన్ పాత్ర అది. నా పాత్ర పేరు నీరజ. సినిమాలో వీణపాట ఉంది. కెమెరా ముందు కూర్చుని తెలిసీ తెలియక వీణ మీద వ్రేళ్ళు కదపడం ఆయనకి నచ్చలేదు. ఒక మాస్టార్ని పెట్టి పదిహేను రోజులపాటు వీణ ప్రాథమిక సూత్రాలు మాత్రమే నేర్పించారు.

మొదటి రోజు మేకప్. మాధవరావు వాణిశ్రీకి మేకప్ వేస్తున్నాడు. మాధవరావు గురువు కుమార్ నాకు మేకప్ చేస్తూ కంట్లో పొడిచేశాడు. కన్ను ఎర్రగా అయిపోయింది. బి.ఎన్. నావంక చూసి ఆ మేకప్ మెన్‌ని (మాధవరావు) వెయ్యమనండి అన్నారు. మాధవరావు అప్పటినుండి ఇప్పటిదాకా కృష్ణగారికి పర్సనల్ మేకప్ మ్యాన్. ఆ సినిమా బాగా ఆడింది. అవార్డులు వచ్చాయి.

విజయా ప్రొడక్షన్స్ నాగిరెడ్డిగారు నన్ను పిలిపించారు. "షావుకారు తమిళంలో తీస్తున్నాం. మీరు ప్రధాన పాత్ర వెయ్యాలి" అన్నారు. ఎమ్. ఆర్ రాధా మేనమామ వేషం. గోవిందరాజుల సుబ్బారావుగారి వేషం ఎస్వీ.రంగారావు చేస్తున్నారు. నాకు ట్యూటర్‌ని పెట్టి నెలరోజులపాటు తమిళం నేర్పించారు. మేకప్ వేసుకుని సెట్‌లోకి వస్తే ఎస్వీ రంగారావుగారు నన్ను చూసి "ఏమిటీ పిల్ల! ఎలకలా ఉంది. నా పక్కన చెయ్యగలదా?" అన్నారు నాగిరెడ్డి చక్రపాణిగార్లతో. ఆ రోజు షూటింగ్ లేదని చెప్పి నన్ను ఇంటికి పంపించేశారు. మూడురోజుల తర్వాత షూటింగ్‌కి రమ్మని కబురొచ్చింది. తీరా చూస్తే ఆ వేషానికి ఎస్వీ రంగారావుగారిని తీసేసి ఎస్. వి. సుబ్బయ్యగారిని పెట్టారు. ఆ రోజుల్లో నిర్మాతల పెద్దరికం అంతలా సాగేది. ఆ సినిమాకి ఏ.వి.యం. రాజన్ హీరో. అప్పుడే నా పేరు మారిపోయింది. నా పేరు నిర్మల. నాన్నగారు 'నిమ్మీ' అని పిలిచేవారు. విజయా ప్రొడక్షన్స్‌లో చేస్తున్నాను కనక నా పేరు 'విజయనిర్మల' అయిపోయింది. సినిమా రంగంలో ఆ పేరు స్థిరపడిపోయింది. తెలుగులో నా మూడో సినిమా బాపుగారి 'సాక్షి'. మొదటి సారిగా కృష్ణగారి పక్కన హీరోయిన్. వారిని కలుసుకోవడం కూడా అదే మొదటిసారి. నెలరోజులపాటు పులిదిండిలో మకాం. షూటింగు. అమ్మానాన్నలు వచ్చారు.

ప్రతిరోజూ షూటింగ్ అయ్యాక బాపుగారు మరునాడు జరగబోయే సీన్‌ల స్కెచ్‌లు వేసేవారు. ఆయన పక్కన కూర్చునేదానిని. "ఇదేంటండీ" అనడిగితే "ఇది ప్రొఫైల్, ఇది లాంగ్ షాట్, ఇది మిడ్ షాట్" అంటూ వివరించేవారు. నాకు దర్శకత్వం మీద ఆసక్తి పెరగడానికి అది ప్రారంభం. ఆ నెలరోజులూ ఆయన పక్కన కూర్చుని ఆయన పనిని గమనించడం నాకు పాఠం. "అమ్మకడుపు చల్లగా" పాటలో కృష్ణగారు నాకు తాళి కడతారు. చూస్తున్న రాజబాబు "అంతే.. మీరిద్దరూ భార్యా భర్తలైపోయారు" అని చప్పట్లు కొట్టాడు. ఏ లోకంలో ఉన్నాడో కానీ ఆయన మాట నిజమైంది. అప్పటి నుంచి మేమిద్దరం పన్నెండు సినిమాలలో వరసగా కలిసి నటించాం. అప్పుడు కృష్ణగారు పెళ్ళిమాట ఎత్తారు. తిరుపతిలో మా పెళ్ళి జరిగింది. రాఘవ, కాగడా శర్మ, రమాప్రభ ఇతర మిత్రులు పెళ్ళికి వచ్చారు. అప్పుడు ఎస్.భావనారాయణగారు 'మా నాన్న నిర్దోషి' తీస్తున్నారు.

అప్పటికే దర్శకత్వం మీద మోజు పెరుగుతూ వచ్చింది. "మామకు తగ్గ కోడలు" సినిమాలో రంగారావుగారు నాకు మామగా నటించారు. ఆయన్ని ఆటపట్టించడం కథ. సి.ఎస్.రావుగారు దర్శకులు. ఏ సినిమా చేసినా ఆ దర్శకుని 'బిగువు' ఏమిటి అని ఆకళించుకునేదాన్ని.

ఆ దశలోనే కృష్ణగారితో అన్నాను "దర్శకత్వం చెయ్యాలని ఉంద"ని.

"కొన్ని రోజులు ఆగు" అన్నారు.




ఒక సంవత్సరం ఆగాక అతి తక్కువ ఖర్చుతో మలయాళం సినిమా దర్శకత్వానికి ఒప్పుకున్నాను. ఆ సినిమా పేరు 'కవిత'. తిక్కురిసి తండ్రి, కలియూర్ పొన్నమ్మ తల్లి. ఇప్పటి ప్రముఖ దర్శకుడు ఐ.వి.శశి నాకు అసిస్టెంటు.

మొదటి నుంచి స్క్రిప్టంతా చేతిలో ఉండాలన్నది నా ధోరణి, ఒకటిన్నర నెలలు చర్చలు జరిపాం. క్యారమ్ బోర్డు మీద సెట్‌ని నిలబెట్టి, కొండపల్లి బొమ్మల్ని నిలబెట్టి "ఇక్కడ హీరో, ఇక్కడ లాంగ్ షాట్" అంటూ ప్రతి సీన్ రాసి పెట్టుకున్నాను. అన్నీ నా మనస్సులో ఉన్నాయి, పేపరు మీదా ఉన్నాయి కనుక. ఒక లాంగ్ షాట్ పెడితే ఆ కోణంలో వచ్చే అన్ని షాట్లూ ఒకేసారి తీసేదానిని. ఆ సినిమాకి ఉమర్ హీరో. కొత్తగా సినిమా తీస్తున్నాను. ఎంతో అనుభవమున్నట్టు తీస్తున్నాను అనేవారే కానీ నా మీద అనుమానమే. ఏమయినా సినిమా రిలీజుకి అలెప్పీ, త్రివేండ్రం అన్నీ తిరిగాను. ఆ చిత్రం విజయవంతం అయ్యింది. వందరోజులు ఆడింది.

అప్పుడిక ధైర్యం వచ్చింది. తెలుగులో చేస్తానని పట్టుబట్టాను. యద్దనపూడి సులోచనారాణి నవల "మీనా" సినిమా హక్కులు నాకిమ్మన్నాను.

"ఎవరు హీరో" అనడిగారు.

"కృష్ణగారు" అన్నాను.

"ఆయనకు పంచెకట్టించి పల్లెటూరి వేషం వేయిస్తావా? ఎంత ధైర్యం" అన్నారు. మొత్తం మీద ఆయనను ఒప్పించి హక్కులు తీసుకున్నాను.

కృష్ణ, ఎస్.వరలక్ష్మి, సూర్యకాంతం, చంద్రకళ, జగ్గయ్య, గుమ్మడి, నేను నటీనటులం. మొదటి రోజు వీళ్ళందరితో నటించడమే కాదు, నటింపజెయ్యాలి. స్టార్ట్ కట్ చెప్పాలి.

సూర్యకాంతం 'ఆ.. చేశానులే" అన్నట్టుండేది. అందరికీ నేను కాస్త లోకువే. మొదటి ప్రయత్నం కదా! నా సవాలు వీళ్ళందరి మీదా 'పెత్తనం' చేసే ఒక పట్టును తెచ్చుకోవాలని. మొదటి రోజు ఏడు సీన్లు చేశాను. అందరూ ఆశ్చర్యపోయారు.

మొదటి రోజు ఎస్. వరలక్ష్మి గారు మేకప్ వేసుకుని వచ్చారు. ఆమెది తల్లి పాత్ర. కంటికి ఐలాష్ లు పెట్టుకొచ్చారు.

"తీసేస్తే బాగుంటుంది. తల్లి పాత్రకదా" అన్నాను. "నీకేం తెలుసు? నాకు బాగుంది" అన్నారావిడ.

మొదటి టేక్ అయింది. నాకు ఓకే అన్నాను.

"నాకు మరో టేక్ కావాలి" అన్నారు ఆవిడ.

రామలింగయ్య "ఏమిటమ్మా ఈ డైలాగూ" అని సాగదీశారు.

నేను చెప్పాను "ఈ నవలను నేను వందసార్లు చదివాను.

మీరు చదివారో లేదో నాకు తెలియదు. కానీ ఈ డైలాగ్ ఇలాగే కావాలి" అని.

గుమ్మడిగారయితే విగ్గు తీసేశారు. "పిచ్చి పిచ్చిగా తీసేస్తున్నావు. ఇలాగయితే నేను చెయ్యలేను" అన్నారు.

ఆయనతో చెప్పాను. "మీరు మధ్యాహ్నం షూటింగ్‌కి రావద్దు. నేను రష్ ప్రింట్ చేసి, ఎడిట్ చేసి మీరు రేపు మేకప్‌కి వచ్చేసరికి చూపిస్తాను. మీకు నచ్చితే అప్పుడు చెయ్యండి" అన్నాను.

ఆ రాత్రంతా పని చేశాం. ఉదయం రష్ చూశారు.. ఏం మాట్లాడలేదు. విగ్గు పెట్టుకుని సెట్ మీదికి వచ్చారు. "పని రాక్షసి" అంటూ. 'మీనా' రచయిత అప్పలాచారి. సంగీతం రమేష్ నాయుడు. పుష్పాల గోపాలకృష్ణ కెమెరామెన్. సినిమా వందరోజులు ఆడింది. దర్శకత్వంలో నాదో విలక్షణమయిన ధోరణి. సీను వరసలో కాక షాట్ల ఆవేశమో, అనుభూతో పట్టుకోవాలి. దర్శకునికి పూర్తి అవగాహన, తెరమీద రూపు దిద్దుకునే సీను పట్ల పూర్తి 'ఒడుపు' అవసరం. 'హేమా హేమీలు' చిత్రంలో అక్కినేని నటించారు. కృష్ణ మరొక హీరో. హీరో నడుస్తూ, సైకిలు మీద వెళుతూ, కారులో వెళుతూ మూడు డ్రెస్‌లు మార్చి షాట్స్ తీశాను. అక్కినేనిగారు మధ్యాహ్నం బ్రేక్‌లో అడిగారు. "కెమెరాలో ఫిలిం ఉందా?" అని

"అదేమిటండీ?" అన్నాను.

"ఊరికే డ్రస్సులు మార్చమంటున్నావు? దర్శకుడు తండ్రిలాంటివాడు. నువ్వు చెప్పింది చెయ్యాలి. కానీ తెలిసే చెపుతున్నావా" అని ఆశ్చర్యపోయారు.

'బెజవాడ బెబ్బులి'కి శివాజీ గణేశన్ గారి దగ్గర 40 రోజుల కాల్ షీట్లు తీసుకున్నాను. కానీ 20 రోజులకే ఆయన సీన్లు అయిపోయాయి. "ఏంటి నువ్వు.. 20 రోజుల్లో సినిమా అయిపోతే మిగతా 20 రోజులూ ఏం చెయ్యనూ? మరో సినిమా తియ్యి" అన్నారు.

అనుమానం, వెక్కిరింత, ప్రశంస, ఆశ్చర్యం అన్నిటినీ దాటుకుంటూ నా ప్రేక్షకుల ఆదరణతో నా దర్శకత్వ జీవితం ముందుకు సాగింది.

(జూలై 2011 సంచికలో ప్రచురితం)

# దాసరి నారాయణ రావు

దర్శకుడిగా, రచయితగా, నటుడిగా, నిర్మాతగా దాసరి నారాయణరావు జైత్రయాత్ర ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. తెలుగు చిత్రరంగంలో దాదాపు అందరు నటీనటులతో, హిందీలో ఎందరో నటీనటులతో చిత్రాలకు దర్శకత్వం వహించారు. కొన్ని సంవత్సరాల పాటు అవిశ్రాంతంగా రోజుకి 20 గంటలు పనిచేశారు. ఉత్తమ దర్శకత్వానికీ, నిర్మాణానికీ, రచనకీ, సంభాషణలకీ 8 సార్లు నంది అవార్డులు తీసుకున్నారు. 'మేఘసందేశం', 'కంటే కూతురిని కను' వంటి చిత్రాలకు జాతీయ బహుమతులందుకున్నారు. ప్రపంచంలో ఎక్కువ సినిమాలకు దర్శకత్వం వహించిన వ్యక్తిగా ప్రపంచ రికార్డులకెక్కారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో అత్యంత విశిష్టమైన రఘుపతి వెంకయ్యనాయుడు అవార్డుతో సత్కరించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు 'కళాప్రపూర్ణ'ని చేసింది. ఫిలింఫేర్ జీవిత సాఫల్య పురస్కారాన్నిచ్చింది. గొప్ప వక్త. అట్టడుగు వర్గాల పట్ల నిలిచే యోధుడు. కేంద్ర మంత్రి అయారు. అంతేకాదు. తన సంప్రదాయాన్ని కొనసాగించగల తర్వాతితరం సహ దర్శకులెందరినో తయారు చేశారు. కోడి రామకృష్ణ, ఆర్. నారాయణమూర్తి, రేలంగి నరసింహారావు, పినిశెట్టి రవిరాజా, సురేష్ కృష్ణ - ఈ జాబితా పెద్దది.

(సురభి పత్రిక కోసం గొల్లపూడి మారుతి రావుగారు, దాసరి నారాయణ రావుగారితో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ)



**రచనా వ్యాసంగం నా చిన్నతనం నుంచే ప్రారంభమయింది.** స్కూల్లో చదువుకునే రోజుల్లో - నా తొమ్మిదో ఏట - 'నేనూ - నా స్కూలు' అనే వ్యాసం రాశాను. అలాగే నాటకం కూడా నా చిన్ననాటినుంచే నా నేస్తం. 'ఒప్పుకున్న తప్పు' అనే పదినిముషాల నాటిక వేశాను. నా పన్నెండో ఏట జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికల మీద 'ప్రజా ప్రణాళిక' అనే నాటిక రాసి మా సహ విద్యార్థులతో ప్రదర్శించాను. దానికి మాకు ఉత్తమప్రదర్శన, నాకు ఉత్తమ నటుడి బహుమతి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యగారు భుజం తట్టి ప్రశంసించారు. అప్పటికది స్ఫూర్తి.

మా నాన్న ఆరో క్లాసుతో నా చదువు ఆపేస్తానన్నాడు. పెద్ద సంసారం. బొటాబొటీ ఆదాయం. తీసుకెళ్ళి కొట్లో పనికి పెడతానన్నాడు. అప్పటి మా స్కూలు టీచర్ ఎమ్.వి.యస్. సుబ్రహ్మణ్యం గారు మా నాన్నని కలిసి, బాగా చదువుకునే కుర్రాడి చదువు మానిపించవద్దని నచ్చజెప్పి, స్కూలులో చందాలు పోగుజేసి నన్ను స్కూలులో చేర్చారు. అలా కొనసాగకపోతే నా వ్యాసంగం కుంటుపడేదేమో. అది ఆనాటి గురువులు పెట్టిన భిక్ష. అప్పటికే పాలకొల్లులో క్షీరారామ థియేటర్స్ పేర ఓ నాటక సమాజాన్ని ప్రారంభించి తోటి విద్యార్థులతో నాటకాలు వేసేవాడిని. 'సాలెగూడు', దాసం గోపాలకృష్ణ 'చిల్లర కొట్టు చెట్టెమ్మ', పినిశెట్టి 'ఆడది', గొల్లపూడి మారుతీరావు 'అనంతం' - విరివిగా వేసిన కొన్నినాటకాలు. అన్నిటిలోనూ ఉత్తమ నటుడి బహుమతులు పుచ్చుకున్నాను.



మరొక పక్క చదువు సాగడానికి కటకట. అరిటిపళ్ళు అమ్మడం, థియేటర్లో టిక్కెట్లు అమ్మే పని - ఇలాంటివి చేసిన సందర్భాలూ ఉన్నాయి. అప్పటి కాలేజీ చదువునాటికి నేను స్కూలు పీపుల్ లీడర్ని. అలా చదువూ, నటన, రచనా వ్యాసంగం కొనసాగిస్తూ ఎర్రమిల్లి నారాయణ స్వామి కాలేజీ (నరసాపూర్)లో బీకామ్ పూర్తి చేశాను.

ఇక ఉద్యోగ పర్వం.. మొదటి నౌఖరీ హైదరాబాదులో శ్రీపాద నరసింహం బ్రదర్స్ సిగరెట్ల కంపెనీలో అకౌంటెంట్‌గా చేరాను. మళ్ళీ హైదరాబాదు రవీంద్రభారతిలో, గాంధీభవన్‌లో - విరివిగా నాటకాలు. నాటకాలు రాయడం, వేయడం, వేయించడం - ఇదంతా ఓ ఉద్యమం. దాదాపు ప్రతీనాటకంలో ముఖ్యపాత్ర, మొదటి బహుమతి ఒక వ్యసనమయిపోయింది. వ్యాసంగం మరికాస్త ముదిరింది.

1966 గుర్తుండిపోయే సంవత్సరం. రవీంద్రభారతిలో నా రచన 'పద్మశ్రీ' నాటకాన్ని ప్రదర్శిస్తున్నాం. ప్రేక్షకుల్లో సూళ్ళూరుపేట వాసి వై.వి.కృష్ణయ్య అనే సినీ నిర్మాత ఉన్నాడు. నాటకం అయాక ఆవేశంగా గ్రీన్ రూంలోకి వచ్చి 'హీరో పాత్ర ఇస్తాను. సినిమాల్లో వేస్తావా?' అన్నారు. అప్పటికి నాకు పెళ్ళయింది. ఇక్కడ సంసారం, ఉద్యోగం, నాటక వ్యాసంగం. వీటన్నిటినీ వదిలి మద్రాసులో సినిమా ఛాన్స్. ఒప్పుకోలేదు. కాని మా సహనటులు వదిలిపెట్టలేదు. 'ఇంత మంచి అవకాశం వస్తూంటే వదులుకుంటావా? నువ్వు వెళ్ళాల్సిందే' అని పట్టుబట్టారు. నన్ను ఒప్పించారు. బ్రహ్మరథం పట్టి, స్టేషన్‌కి వచ్చి నాకు ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. అలా మద్రాసు సినీరంగం వేపు ప్రయాణం ప్రారంభించాను - ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో, నిర్మాతతో.

నా మకాం ప్రొడక్షన్ ఆఫీసులోనే. మొదటిరోజు అనుభవం మరిచిపోలేను. అప్పటి హాస్యనటుడు పర్సనల్ మేకప్‌మాన్ కృష్ణ నాకు మేకప్ మొదలుపెట్టాడు - దీవనలతో. ఈసడింపుగా నా మొహం మీద రంగు పులుముతూ 'అడ్డమయినవాళ్ళూ సినిమాలకి దిగిపోవడమే' అంటూ. అసలే కొత్తవాతావరణం, కొత్త పని. ఈ సాధింపు. గుండె జారిపోయింది. తీరా నాకిచ్చిన వేషం చిన్నది, ఇదేమిటి? హీరో వేషమిస్తానని నిర్మాత చెప్పారు? అడుగుదామంటే ఆయన జాడలేదు. నిస్సహాయంగా సెట్ మీదకొచ్చాను. సినిమా పేరు 'అందంకోసం పందెం'. నిర్మాణ సంస్థ హృషీకేష్ పిక్చర్స్. దర్శకుడు అమంచర్ల శేషగిరిరావు. నేను అప్పటి హాస్యనటుడు బాలకృష్ణకి అనుచరుడిని. సినిమా హీరో కాంతారావు.

ఓ సీను బాగా గుర్తుండిపోయింది ఇప్పటికీ. నేను బాలకృష్ణ వెనక నిలబడి ఉంటాను. తమ యజమానిని చూడవచ్చిన ఒక కవిని నిలదీస్తాడు. అతనికి ఓ డైలాగ్ ఇచ్చారు. కాస్త దిట్టమైన డైలాగ్. ఎంత ప్రయత్నించినా బాలకృష్ణకి లొంగడం లేదు. దూడలు వేస్తున్నాడు. నాకేమో ఆయన చెపుతూంటేనే వచ్చేసింది. వెనకనుంచి చెపుతున్నాను. ఇది డైరెక్టర్ శేషగిరిరావు గమనించారు.

'ఏమిటి సణుగుతున్నావ్? నువ్వు చెపుతావా?' అన్నారు. చెపుతానన్నాను.

చెప్పమన్నారు. గడగడా చెప్పేశాను. సినిమాలో నా మొదటి పెద్ద డైలాగ్ - 44 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ గుర్తుంది.

'దిగ్దంతులైన కవిపండిత ప్రకాండులకే ప్రవేశము దొరకని కవి సమ్మేళనమునకు రాదలచితివా? కవి బ్రహ్మయని ఖ్యాతిగాంచిన మా కిలకిల శ్రీవారు నీలాంటి అర్భకులతో ప్రసంగించరు పొమ్ము'

శేషగిరిరావుగారు హాయిగా ఊపిరి పీల్చారు. 'నువ్వే చెప్పెయ్' అన్నారు. బాలకృష్ణ అయితే 'మా' కిలకిల శ్రీవారు అనాలి. నేను చెప్పాను కనుక 'ఈ' కిలకిల శ్రీవారు అయింది. మొదటి టేక్ ఓకే అయింది. ఇక బాలకృష్ణకి కడుపు మండి పోయింది. అప్పటినుంచి సినిమా అయేవరకూ నన్ను నానాయాతనా పెట్టేశాడు.

ఈ అనుభవంతో నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. వెనక్కి పోదామనే నిర్ణయానికి వచ్చాను. తీరా నన్ను బ్రహ్మాండంగా ఆకాశానికెత్తేసి పంపిన మా మిత్రులకి నా మొహం ఎలా చూపించను? ఇక్కడే తాడో పేడో తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చాను.

అదిగో. అప్పుడు నాకు మొదటి నుంచీ కలిసొచ్చిన మరొక వ్యాసంగం తోడు నిలిచింది. రచన. సరాసరి ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజుగారి దగ్గరికి వెళ్ళాను. వారు నన్ను అసిస్టెంటుగా తీసుకున్నారు. వారితో 'రంగులరాట్నం', 'బంగారు పంజరం' (బి.ఎన్.రెడ్డి) వంటి చిత్రాలు చేశాను. ఆయన నన్ను గౌరీ ప్రొడక్షన్స్ నిర్మాత ఎస్.భావనారాయణగారికి పరిచయం చేశారు. ఆయన మొట్టమొదట ఓ కన్నడ చిత్రానికి తెలుగు డబ్బింగ్‌కి నా చేత మాటలు రాయించారు. ఆయనే నా మొదటి పారితోషికం 300 రూపాయలు ఇచ్చి బ్యాంక్ అకౌంట్ తెరిపించారు. మొదటి ఆదాయం 200తో వేంకటేశ్వర స్వామి ఉంగరాన్ని కొనుక్కున్నాను. 45 సంవత్సరాల తర్వాత అది ఇప్పటికీ నా చేతికి ఉంది.

అసిస్టెంటు డైరెక్టరుగా పని చేస్తూనే సినిమా రచన చేసేవాడిని. దాదాపు 40 సినిమాలు రాశాను. ఆ రోజుల్లోనే ప్రొడక్షన్ మేనేజరుగా ఉన్న కె.రాఘవగారు, నిర్మాత ఏ కామేశ్వరరావు కలిసి ఫల్గుణ పిక్చర్స్ పేరిట సినిమాలు తీశారు. వారు తీసిన మూడు విజయవంతమైన చిత్రాలు - జగత్ కిలాడీలు, జగజ్జెట్టీలు, జగజ్జంత్రీలుకి నేనే రచయితని. ఆ సినిమాలకు అసిస్టెంటు డైరెక్టరుగా కూడా పనిచేశాను. అప్పుడే రాఘవగారు నాకు డైరెక్షన్ అవకాశం ఇస్తామన్నారు.

ఈలోగా అట్లూరి పుండరీ కాక్షయ్యగారు 'మహమ్మద్ బిన్ తుగ్లక్' అనే సినిమా తీశారు. అందులో నాగభూషణం గారిది ముఖ్యపాత్ర. నా రచనకి చాలా పొంగిపోయారు నాగభూషణం. తాము తీస్తున్న 'ఒకే కుటుంబం' సినిమాకి డైరెక్టరుగా ఉన్న భీంసింగ్ గారికి నన్ను అసిస్టెంటుగా తీసుకున్నారు. ఆ సినిమా హీరో ఎన్టీ రామారావుగారు. ఓసారి భీం సింగ్ గారు హిందీ సినిమా పనిమీద బొంబాయి వెళ్ళవలసి వస్తే ఒక షెడ్యూలంతా నేను డైరెక్ట్ చేయవలసి వచ్చింది. రామారావుగారు చాలా ఇంప్రెస్ అయారు. అప్పుడే నాగభూషణంగారు నాకు దర్శకుడిగా అవకాశం ఇస్తానన్నారు. కానీ తీరా ఆయన సినిమా తీసేనాటికి మాట తప్పారు.

ఎన్టీ రామారావుగారు మాత్రం నాచేత నిర్మాత కుదరవల్లి లక్ష్మీనారాయణగారికి కథ చెప్పించారు. అయితే ఆయన సినిమా తీయడం పడలేదు. కథ ఎన్టీ రామారావుగారికి బాగా నచ్చింది. తామే ఆ కథని తీసుకుని నాకు వెయ్యినూట పదహార్లు చెక్కు ఇచ్చారు. తర్వాత ఆయనకూడా ఆ కథని తీయలేదు. అది నాకు బాగా గుర్తున్న సందర్భం. మనస్సులో ఎన్టీ రామారావుగారితో పరస్పరం సన్నిహితం చేసిన సందర్భం కూడా. రాఘవగారు పట్టుదల మనిషి. మొండి. తనకి నచ్చేదాకా ఏ పనీ చెయ్యరు. చెయ్యాలని పూనుకుంటే ఎవరు ఎదురొచ్చినా ఆగరు. ఆయన నాకు దర్శకత్వం ఛాన్స్ ఇస్తానన్నాక కథలు చెప్పడం ప్రారంభించాను. రోజుకో కథ. ఆ కథ నచ్చకపోతే మరునాడు మరో కొత్త కథతో వెళ్ళేవాడిని. అలా దాదాపు ఏభై అరవై కథలు చెప్పివుంటాను. వినడానికి ఆయన అలసిపోలేదు. చెప్పడానికి నేను విగిపోలేదు. ఆఖరికి 'తాత మనవడు' కీలక ఇతివృత్తం ఆయనకి నచ్చింది. అంతే. శ్రద్ధగా కూర్చుని స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాసుకున్నాను. ఆయన పంపిణీదారులు లక్ష్మీ ఫిలింస్. ఆ రోజుల్లో పంపిణీదారులూ నిర్మాతతో పెట్టుబడి పెడతారు కనుక, కథ సాధారణంగా వారికీ చెప్పి ఒప్పించడం ఒక ఆనవాయితీ. రాఘవగారు నన్ను విజవాడ తీసుకొచ్చారు. లక్ష్మీ ఫిలిమ్స్ అధినేత శివరామకృష్ణయ్యగారికి కథ చెప్పడం ప్రారంభించాను. ఆయన కసలు నా మీద, నేను చెప్పే కథలు మీద బొత్తిగా ధ్యాస లేదు. మధ్య మధ్య ఫోన్లు చేసుకుంటూ, టేబుల్ మీద పనులు చూసుకుంటూ ముక్కుబడిగా విన్నారు - తప్పక వింటున్న విసుగుని ఏ మాత్రం దాచుకోలేదు. అంతా విన్నాక - "కథ బాగానే ఉంది. కాని దర్శకుడిగా ఈయనెందుకు? కె.ఎస్.ప్రకాశరావుగారిని పెట్టుకోండి" అన్నారు నా మొహం మీదే. అప్పటికి రాఘవగారు తీసిన రెండు విజయవంతమైన సినిమాలను వారు పంపిణీ చేస్తున్నారు. అయినా రాఘవగారు జంకలేదు. 'నేను ఇతనికి దర్శకత్వం ఛాన్స్ ఇస్తానని మాటిచ్చాను. ఇతనితో తీస్తాను. దర్శకుడిని మార్చను. అవసరమయితే

పంపిణీదారులని మార్చుకుంటాను" అని లేచిపోయారు. అలా నిర్మాత మొదటిసారి దర్శకత్వం వహిస్తున్న వ్యక్తి తరపున నిలబడడం - నా జీవితంలో పెద్దమలుపు.

సరే. కథకి అనుగుణంగా నటీనటుల ఎంపికని ప్రారంభించాం. తాత పాత్ర విషయంలో మరో ఆలోచనే లేదు. ఎస్.వి.రంగారావుని అనుకున్నాం. మనుమడి పాత్రకి మొదట శోభన్‌బాబుని అనుకున్నాం. అయితే అతను హీరోగా కనిపిస్తాడేమోగాని, మనుమడు అనిపించడేమోనన్న సందేహం కలిగింది. అప్పట్లో రాజబాబు మంచి కమేడియన్. అతన్ని తీసుకుంటే? చాలా గంభీరమైన నీతిని చెప్పే పాత్రకి హాస్యనటుడినా? రాఘవగారిలాగే నాలోనూ కొన్ని విశ్వాసాలూ, పట్టుదలలూ ఉన్నాయి. రాజబాబుకి నటుడిగా ఫోకస్ ఉంది. హీరోగా స్టేటస్ లేదు. అతని ఆ బలాన్ని ఇవ్వాలంటే? ఆయన పక్కన విజయనిర్మలని తీసుకున్నాం. నిజానికి అలాంటి పాత్రకి రాజబాబు కొత్త. అది అతని కెరీర్‌లో పెద్ద మలుపు. తర్వాత 'మనిషి రోడ్డున పడ్డాడు'లోలాంటి ఎన్నో సీరియస్ పాత్రలను చేశాడు.

ఇక దర్శకత్వ అనుభవం నాకు కొత్తకాదు. రచన కొత్తకాదు. అది 1972. నల్లేరు మీద బండిలాగ షూటింగ్ నడిచింది. ఎటువంటి ఒడిదుడుకులు లేవు. మనస్సులో ఎటువంటి సందేహాలూ లేవు. సినిమా దర్శకత్వం ఆచితూచి పట్టాల మీద సాగింది.




'తాతా మనవడు' రాఘవగారు స్థాపించిన ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ మొదటి చిత్రం. తారక రామా ఫిలిమ్స్ పంపిణీ చేశారు. పెద్ద హిట్. 25 వారాలు నడిచి రజతోత్సవం చేసుకుంది. ఆ చిత్రానికి ఉత్తమ చిత్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డ్ లభించింది.

తర్వాత జీవితంలో రెండు పనులు ససేమిరా చెయ్యలేదు. లక్ష్మీ ఫిలిమ్స్ సంస్థకి ఒక్క చిత్రం కూడా దర్శకత్వం వహించలేదు. నా చిత్రాలలో ఒక్కటి - ఒక్క చిత్రంలో కూడా నాగభూషణానికి నటించే అవకాశం ఇవ్వలేదు.

మరొక్క సంఘటన చెపితేకానీ ఈ వ్యాసానికి సమగ్రత రాదు. నా రెండో చిత్రం అదే సంస్థకి 'సంసారం సాగరం'. అదే నటులు ఎస్.వి.రంగారావుగారిది ఓ ముఖ్యభూమిక. మార్వాడీ వేషం. ఒక సీన్‌లో మా ఇద్దరికీ అభిప్రాయ బేధం వచ్చింది. ఒక పెద్ద డైలాగ్ మార్చమన్నారు. నేను మార్చనన్నాను. ఒకవేళ మీరు చెప్పకపోయినా ఈ డైలాగ్‌ని మీ ముఖం మీద వేయాల్సి ఉంటుందన్నాను. అయినా ఆయన ఒప్పుకోలేదు. చెప్పనన్నారు. దర్శకుడికీ, ఓ పెద్ద నటుడికీ లంకె. నిర్మాత ఏమీ మాట్లాడలేకపోయారు. వేషం చెయ్యనని టోపీ తీసేసి రంగరావుగారు కారెక్కివెళ్ళిపోయారు. అందరూ నిర్విణ్ణులయిపోయారు. రాఘవ ఆయన కారు వెనుక పరిగెత్తారు. గొప్పతనం ఏమిటంటే నన్ను నిలదీయలేదు. అప్పటికే రంగారావుగారు కోడంబాక్కం వంతెన దగ్గరికి వచ్చేశారు. అప్పటికి ఆయనలోనూ మధన ప్రారంభమయింది. కారుని వెనక్కి తిప్పమన్నారు. 'సరే. నీక్కావలసిందేదో చేసుకో' అని షూటింగ్‌కి సిద్ధమయారు. అదీ. క్రమశిక్షణ గలిగిన నటుడి ధర్మ రక్షణ. తర్వాత ఎక్కడో చెప్పారట. 'దర్శకుడిలో అంత ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి ఉండాల'ని.

ఇవన్నీ దర్శకుడిగా నాకు సోపానాలు. ఓ ఉపాధ్యాయుడు, ఓ నిర్మాత, ఓ నటుడు - ఎందరో హితులూ, సన్నిహితులూ కలిసి తీర్చిన ఓ జీవితానికి అందమైన సైన్ పోస్టులు.

(ఆగస్టు 2011 సంచికలో ప్రచురితం)

# కె. రాఘవేంద్రరావు

*కె. రాఘవేంద్రరావు ఎన్టీ రామారావు హీరోగా దర్శకత్వం వహించిన 'అడవిరాముడు' తెలుగు సినిమా రంగంలో చరిత్రని సృష్టించింది. అంతేకాదు. ఎన్టీరామారావుతో ఆయన నిర్మించిన చిత్రాలన్నీ - జస్టిస్ చౌదరి, కొండవీటి సింహం, డ్రైవర్ రాముడు, వేటగాడు, మేజర్ చంద్రకాంత్ - అన్నీ ఆయన కెరీర్ లోనే కాదు - తెలుగు చలనచిత్ర చరిత్రలోనే మైలురాళ్ళు. ఇక 'జగదేకవీరుడు - అతిలోక సుందరి' 365 రోజులు నడిచింది. అన్నమయ్య, రామదాసు చిత్రాలు తెలుగు ప్రేక్షకుల్లో పౌరాణిక విప్లవాన్ని సాధించాయి. సీతారాముల కళ్యాణానికి భద్రాచలంలో సాధారణంగా 20 వేల మంది భక్తులు హాజరయేవారు. రామదాసు రిలీజయిన రోజుల్లో ఆ సంఖ్య 3 లక్షలకి పెరిగింది. 3 తరాల దర్శకుల కుటుంబం రాఘవేంద్రరావుగారిది. 3 తరాల నటులతో (ఎన్టీ రామారావు, అక్కినేని) చిత్రాలు నిర్మించి మెప్పించిన ఘనత - ఒక్కసారికాదు - రెండుసార్లు దక్కించుకున్నారు. హిమ్మత్ వాలా, జస్టిస్ చౌదరి, తోఫా వంటి హిందీ చిత్రాలను నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు సలహాదారుగా ఆయన్ని నియమించింది. ఆయన తీసిన చిత్రాలలో 4 స్వర్ణోత్సవాలను, పది రజితోత్సవాలను చేసుకున్నాయి. 6 చిత్రాలు సంవత్సరం పాటు నడిచాయి. 58 చిత్రాలు శతదినోత్సవాలు చేసుకున్నాయి. 2003 ఫిలిం ఫేర్ రాఘవేంద్రరావుకి జీవిత సాఫల్య పురస్కారాన్నిచ్చి సత్కరించింది.*

(సురభి పత్రిక కోసం గొల్లపూడి మారుతి రావుగారు, కె.రాఘవేంద్రరావుగారితో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ)

**నేను సినిమా రంగంలోకి రావాలని** అనుకోలేదు. అయితే చదువుకునే రోజుల్నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. మద్రాసులో స్నేహితులతో కలిసి మౌంట్ రోడ్ వరకు నడిచి వెళ్ళి సినిమాలు చూసేవాడిని. శివాజీ గణేశన్ చిత్రాలు, దర్శకులు శ్రీధర్, గోపాలకృష్ణన్, ఏ.సి.త్రిలోక చందర్, భీమ్‌సింగ్‌గార్ల చిత్రాలు చూస్తున్నప్పుడు మనం కూడా చిత్రాలు తీస్తే బాగుండుననిపించేది - అప్పుడప్పుడు.

నాన్నగారు ప్రకాష్ ప్రొడక్షన్స్ పేరిట సినిమాలు నిర్మించేవారు. 'దీక్ష', 'కన్నతల్లి' మంచి పేరు, వసూళ్ళు ఇచ్చాయి. అప్పుడే ప్రకాష్ స్టూడియో కొన్నారు. ఆ తర్వాత సినిమాలు కాస్త కుంటుబడ్డాయి. పరిస్థితులూ దెబ్బతీశాయి. ప్రకాష్ ప్రొడక్షన్స్ సింబల్ లైట్ హౌస్. ఆ రోజుల్లో అనుకునేవాడిని - లైట్ హౌస్‌లో బల్బు మాడిపోయిందని. ఎలాగయినా నేను సినిమాల్లోకి వెళ్ళి ఆ బల్బుని మళ్ళీ వెలిగించాలన్న కోరిక క్రమంగా బలపడడం ప్రారంభించింది.

నాన్నగారు ఒక రోజు నన్నూ, మా అన్నయ్య, కృష్ణమోహన్‌నీ పిలిచారు. కృష్ణమోహన్ ఒక సంవత్సరం పరీక్ష తప్పడం వల్ల అప్పుడు మేమిద్దరం పియూసి చదువుతున్నాం. ఆయన అడిగిన మొదటి ప్రశ్న: "ఇంకా చదవాలనుకుంటున్నారా? వేరే ఏదయినా పని

చేయాలనుకుంటున్నారా?" అని. మా నాన్నగారు మా గురించీ, మా కెరీర్‌ల గురించీ ఆలోచిస్తున్నారని అప్పుడనుకున్నాం. ఎందుకంటే అంత బిజీగా ఉండేవారు కనుక.

నేను సినీమాల్లోకి వస్తానన్నాను. కృష్ణమోహన్ చదువుకుంటానన్నాడు. అయితే నేను డిగ్రీ పూర్తి చేశాక వస్తానన్నాను. మా నాన్నగారు నవ్వి 'సినిమాల్లోకి రావడానికి ఇప్పుడున్న చదువు చాలు. రావాలనుకుంటే రెండేళ్ళు వృథా చెయ్యడమెందుకు?" అన్నారు.

మా నాన్నగారు ఎస్సెల్సీయే చదివారు. ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కొన్నాళ్ళు పనిచేశారు. గూడవల్లి రామబ్రహ్మగారు ఆయన్ని చూసి బండెక్కమంటే మద్రాసు వచ్చారు. 'అపవాదు', 'పత్ని' వంటి చిత్రాల్లో నటించారు.



సరే. నాన్నగారు ఆ మాటన్న తరువాత ఒకరోజంతా ఆలోచించాను. సినిమా అన్నది 'జూదం'లాంటిదని నాన్నగారి విషయంలోనే తెలిపోయిందికదా? ఒక్క విజయం, ఒక్క అపజయం చాలు 'బల్బు' వెలగడానికీ, ఆరిపోవడానికీ. సినిమాలో దెబ్బతింటే ఉద్యోగం చేసుకోడానికయినా డిగ్రీ ఉండాలి కదా? అందుకని లయోలా కాలేజీలో చేరాను. డిగ్రీ అయాక సినిమా రంగానికి వస్తానన్నాను.

లయోలాలో నా స్నేహితులంతా కోటీశ్వరుల పిల్లలు. ఒకాయన సీజర్. విజయకృష్ణ నరసాపూర్ జమిందారుగారబ్బాయి - ఇలాగ. ఆ రోజుల్లో మద్రాసులో తెలుగు సినిమా ప్రీవ్యూ వేస్తే మా కాలేజీ గ్యాంగునంతా తీసుకువచ్చేవాడిని. అందువల్ల కాలేజీలో నేనొక 'స్టార్'ని. రాఘవ సినిమాలు చూపిస్తాడు. స్టూడియోలు చూపిస్తాడు, నటుల్ని చూపిస్తాడు - అని చెప్పుకునేవారు. వాళ్ళతోనే తిరుగుళ్ళు, మెస్సుల్లోనే భోజనాలు సాగేవి. ఇంట్లో పుస్తకాలకిచ్చిన డబ్బులు సినిమాలు చూడడానికి ఖర్చుపెట్టేసి స్నేహితుల పుస్తకాలతో చదువుకునేవాడిని. వాళ్ళంతా నాలుగయిదు సార్లు పరీక్షల్లో తప్పారు. నేను మొదటిసారే పాసయిపోయాను.

చదువు సగంలోనే సినిమాలో చేరాలని నిశ్చయించుకున్నాను. నాన్నగారి దగ్గర పనిచేసిన ఆదుర్తిగారి దగ్గర నన్ను ఉంచాలని నాన్నగారి ఉద్దేశం. కానీ మొదట సంజీవిగారి దగ్గర ఎడిటింగు డిపార్టుమెంటులో చేర్చారు. ఆరునెలల్లో విషయమంతా గ్రహించాలని ప్లాను. కాని రెండు నెలలు తిరగకుండా మా కాలేజీ ఫ్రెండ్స్ "నువ్వు లేకపోతే కాలేజీ బోరుకొడుతోంది"ని తీసుకుపోయారు. కాలేజీ ప్రిన్సిపాలుకి నేనంటే అభిమానమే. ఈ రెండు నెలలూ 'శలవు'గా భావించి మళ్ళీ చేర్చుకున్నారు. ఆ విధంగా బియ్యే పూర్తిచేశాను.

చదువయాక మా నాన్నగారి శిష్యుడూ, మా దగ్గరి బంధువూ, నిర్మాత ఏఎస్ ఆర్ ఆంజనేయులుగారి కంపెనీలో కమలాకర కామేశ్వరరావుగారి దగ్గర అసిస్టెంటుగా చేరాను. ఎన్టీ రామారావు నటించిన 'పాండవ వనవాసం' నా మొదటి చిత్రం. నాకు మొదట్నుంచీ పౌరాణికాలంటే చాలా ఇష్టం. ఆ సినిమా సీనియర్ అసిస్టెంటు డైరెక్టరు గాదిరాజు కేశవరావుగారు. ఆ సినిమా తర్వాత వి.మధుసూధన రావుగారి దగ్గర 'మనుషులు మారాలి' చిత్రానికి పనిచేశాను. అటు తర్వాత 8 సంవత్సరాలు నాన్నగారి దగ్గర 'తాసిల్దారుగారమ్మాయి', 'సత్యానికి సంకెళ్ళు', 'స్త్రీ జన్మ' చిత్రాలకు పనిచేశాను.



ఆ రోజుల్లోనే మా కాలేజీ మిత్రులు - పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తల కొడుకులు - సరదాగా ఒక సినిమా తీద్దాం అన్నారు. నా లక్ష్యం ఎప్పుడూ - ఏం చేసినా ఒక సెన్సేషన్‌గా చెయ్యాలని. మొదటిసారి అందరూ కొత్తవాళ్ళతో - కేవలం లక్షరూపాయల పెట్టుబడితో (1970ల నాటి మాట) ఒక సినిమా తీయాలని. కానీ మా స్నేహితులు ఒప్పుకోలేదు. మొదటి సినిమాయే రామానాయుడు, జగపతి లెవెల్‌లో చేసి తీరాలన్నారు.

వాహినీ స్టూడియో 8 వ ఫ్లోర్ - ఆసియాలో కల్లా పెద్దది. ఆ ఫ్లోర్ పగుల గొట్టి - బయటికి వచ్చేటట్టు - పోర్టికోతో సహా పెద్ద సెట్టు వేసి, సెట్టుకి తగినట్టు కథని ఆలోచించాలని అప్పటి ఆలోచన. నాన్నగారు ప్రముఖ రచయిత హెచ్.జి.వెల్స్ రచన ఆధారంగా ఒక కథని తయారు చేశారు. అనుకున్నట్టుగానే ఫ్లోర్ పగులగొట్టి పెద్ద సెట్టు వేయించాం. ఆ సినిమా పేరు 'బాబు' - ఆత్రేయ మాటలు, పాటలు రాశారు. సంగీత దర్శకత్వానికి చక్రవర్తిని నిర్ణయించాం. చక్రవర్తికి అప్పటికి అదే పెద్ద సినిమా.

ముహూర్తం - జెమినీ స్టూడియోలో పెద్ద రికార్డింగ్ థియేటర్‌లో. వందమంది ఆర్కెస్ట్రాతో పాట రికార్డింగ్. అంతవరకూ ఎవరూ అంతమంది ఆర్కెస్ట్రాని వాడలేదు. ఆత్రేయ 'ఒక జంట కలిసిన తరుణాన'ని రామకృష్ణ, సుశీల బాలసుబ్రహ్మణ్యం పాడారు. సీనియర్ రికార్డిస్టు కోటేశ్వరరావుగారు 'డెక్' ముందున్నారు. గుడిలో శ్లోకాలు, చర్చిలో, మసీదులో ప్రార్ధనలు జరుగుతూండగా పాట. పెద్ద హడావుడి. ఆయనే విసిగిపోయారు ఈ ముమ్మరానికి.

నేను 'పాండవ వనవాసం' చేస్తున్నప్పుడు అందులో దుర్యోధనుడి పాత్రని ఎస్.వి.రంగారావు వేశారు. నేనెప్పుడు మొదటి చిత్రం తీసినా తను వేషం వేస్తానని నాకు మాటిచ్చారు. 'ఇంపాజిబుల్ ఇయర్స్' సినిమా ఆధారంగా - పిల్లలు జాగ్రత్తగా పెరగాలి - అనే సందేశంతో రంగారావు తండ్రిగా సినిమా తీయాలని ఓ కథని సిద్ధం చేసుకున్నాను.

ఇప్పుడు ఈ సినిమాకి ఒక ముఖ్యమయిన పాత్రకి ఆయన్ని అడిగాను. మొదటి రోజే రంగారావుతో షూటింగ్. తర్వాత ఒకటి రెండు రోజులే పనిచేసిన గుర్తు. కన్నుమూశారు. ఒక మంచి పాత్ర దెబ్బతింది. అప్పుడు ఆ పాత్రని చెయ్యమని గుమ్మడిగారిని అడిగాను. ఆయన చిరునవ్వు నవ్వుతూ "ఏం, రంగారావుగారు బతికున్నప్పుడు నేను గుర్తురాలేదా?" అంటూనే ఎంతో సహృదయంతో పాత్రని చెయ్యడానికి ఒప్పుకున్నారు.

ఆ రోజుల్లో ఖరీదయిన కంపెనీలన్నీ అవుట్ డోర్ షూటింగ్‌లకి కాశ్మీర్ వెళ్ళడం రివాజు. మేం కాశ్మీర్ వెళ్ళడం ఎందుకని కులూమనాలీకి వెళ్ళాం. తెలుగులో అంతవరకూ ఎవరూ కులూ మనాలీకి వెళ్ళలేదు.

చాలా ఆత్మవిశ్వాసంతో పనిచేశాను. అరుణా ఇరానీ, వాణిశ్రీ శోభన్ బాబుతో చండీఘడ్‌లో ఒక పాట, లక్ష్మీ, శోభన్ బాబుతో కులూమనాలీలో ఒక పాట చేశాం. అప్పుడు మా నాన్నగారు రంజిత్, సూర్యనారాయణగారు కలిసి నిర్మిస్తున్న 'చీకటి వెలుగులు' సినిమా

చేస్తున్నారు. రెండు సినిమాలకి లక్ష్మీ ఫిలింస్ పంపిణీదారులు. "కంపెనీకి తండ్రీ కొడుకులిద్దరూ పెద్ద సినిమాలు తీస్తున్నారు. ఈ దెబ్బతో కంపెనీ మునిగిపోయినట్టే" అంటూండేవారు.

నాన్నగారు తను తీసే పద్ధతినంతా కాగితం మీద రాసుకునేవారు - స్క్రీన్ ప్లేగా. కానీ నా పథకం ఎప్పుడూ నా మనస్సులోనే ఉంటుంది. నాలుగు నెలల్లో సినిమా పూర్తయింది. ఫస్టు కాపీని నాన్నగారు, మిగతా పెద్దలూ చూశారు. అందరూ తృప్తిపడ్డారు. 1974లో "రంగుల హరివిల్లు - బాబు" అని పబ్లిసిటీ చేశారు. శోభన్ బాబు కెరీర్‌లో అప్పటికి అది పెద్ద బడ్జెట్ సినిమా.

'బాబు' రిలీజయింది. పెద్ద సినిమాలకి మొదట్లో 'ఓహో' అన్న ప్రశంస రాదు. అడవిరాముడు, కొండవీటి దొంగ సినిమాల విషయంలోనూ అంతే. అభిప్రాయాలు అటూ ఇటూగా ఉంటాయి. కానీ సినిమా వసూళ్ళు చాలా ముమ్మరంగా ఉన్నాయి.

రెండోవారానికి కె.విశ్వనాథ్ 'జీవన జ్యోతి' (శోభన్ బాబు చిత్రమే) రిలీజయింది. దీనికి వసూళ్ళు తగ్గడం మొదలెట్టాయి. ఎందుకు వెళుతున్నారో తెలుసుకోడానికి ఆ సినిమాకి వెళ్ళాను. అందులో "జు జు జుజూ" అనే పాట అందరికీ నచ్చింది. ఇది ఒక్కటి చాలు.

మొదటి సినిమాతో నేను నేర్చుకున్న నిజం ఒకటుంది. మన సినిమా రిలీజయినప్పుడు మన సినిమా ఎంత బాగున్నా - మన సినిమా కన్న బాగున్న సినిమా వస్తే తగ్గిపోతుంది. మన సినిమా కన్నా చచ్చు సినిమా వస్తే కలెక్షన్లు పెరుగుతాయి. కనుక మనమే పెద్దవాళ్ళమని ఎప్పుడూ అనుకోకూడదు. ఇంత పెద్ద సినిమా తీస్తే - పెద్ద సినిమా తీశామన్న పేరు వచ్చిందే కానీ - దర్శకుడిగా మంచి పేరు రాలేదు.

కావాలనే రెండో సినిమా - క్రాంతికుమార్ నిర్మాణంలో - కేవలం - 28 రోజుల్లో మురళీమోహన్ హీరోగా 'జ్యోతి' తీశాను. మొదటిసారిగా విన్సెంట్ కెమెరామన్. సౌండ్‌కి టేప్ రికార్డర్‌నే వాడాం - ఆదా చేస్తూ.

సినిమా పూర్తవయేవరకూ గెడ్డం తీయకూడదనుకున్నాను. సినిమా పూర్తి చేసి తిరుపతి వెళ్ళి గెడ్డం, తలనీలాలు ఇచ్చాను.

జ్యోతి పెద్ద హిట్. పేరొచ్చింది. అవార్డులొచ్చాయి. డబ్బొచ్చింది. 'చలనచిత్ర ఆకాశంలో వెలిగిన జ్యోతి' అన్నారు.

ఈ అనుభవం వల్ల నా జీవితంలో ఏం మిగిలింది? గెడ్డం మిగిలింది. ఇప్పటికీ సినిమా అవగానే తిరుపతి వెళ్ళి గెడ్డం, తలనీలాలు ఇవ్వడం సెంటిమెంట్.

(సెప్టెంబర్ 2011 సంచికలో ప్రచురితం)

# కె.బాలచందర్

*కె.బాలచందర్ తమిళనాడు దర్శకులలోనే కాదు భారతదేశ దర్శకులలోనే మకుటంగా నిలిచారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో ఎన్నో గొప్ప చిత్రాలకు దర్శకత్వం వహించారు. భారత ప్రభుత్వం వారిని 'పద్మశ్రీ' బిరుదంతో సత్కరించింది. వారి చిరస్మరణీయమైన తెలుగు చిత్రాలు – అంతులేని కథ, మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, ఇది కథకాదు, రుద్రవీణ, అందమైన అనుబవం, కోకిలమ్మ, ఆడవాళ్ళూ మీకు జోహార్లు, తొలికూడి కూసింది. వారి టెలివిజన్ నాటకాలు తమిళ, తెలుగు భాషల్లో సుప్రసిద్ధాలు. బాలచందర్ ప్రస్తుతం తన 81 ఏట అలుపెరగని యోధుడు. మళ్ళీ రంగస్థల ప్రవేశం చేసి 'ఒరు కూడై పాశం' (ఒక బుట్టెడు మమత) నాటకాన్ని తయారు చేసి మళ్ళీ సామాజికుల్ని అలరిస్తున్నారు. తన ప్రస్తానాన్ని అవిచ్ఛిన్నంగా సాగిస్తూనే ఉన్నారు.*

(సురభి పత్రిక కోసం గొల్లపూడి మారుతి రావుగారు, కె. బాలచందర్‌గారితో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ)



**నేను రచన చేసి, నటిస్తూ మిగతావారిచేత నటింపజేయాలనే సరదా నా జీవితంలో** 70 సంవత్సరాల పాతది. తిరువారూర్ నన్నీలం ప్రాంతంలో నల్లమాంగుడి అనే ప్రాంతంలో ఈ సరదా ప్రారంభమయింది. నల్లమాంగుడి ఇప్పుడు తంజావూరు జిల్లాలో ఉంది. ఇంటి అరుగు అప్పటి మా రంగస్థలం. ఆ రోజుల్లో విద్యుచ్ఛక్తి లేదు. కిరసనాయిలు కోసం ప్రతీ ఇంటికీ వెళ్ళేవాళ్ళం. అందరూ లేదనకుండా ఇచ్చేవాళ్ళు. రెండణాల అద్దెకి పెట్రోమాక్స్ దీపాన్ని తెచ్చి కిరసనాయిలు నింపేవాళ్ళం. శివరాత్రినాడు అందరూ జాగరణ ఉండే రాత్రి మా ప్రదర్శన. హాస్యంగానూ, చిలిపిగానూ ఉండే ఏదో కథ ఇతివృత్తం. అందరూ మెచ్చుకునేవారు. రెండు నెలలు రిహార్సల్స్. అప్పట్లో ప్రసిద్ధులయిన టి.కె.షణ్ముగం వంటి స్టేజి నటులు, ఎంతో ప్రాచుర్యంలో ఉన్న ఎమ్.ఆర్.రాధా వంటి సినీనటులు మాకు ఆదర్శాలు.

నా స్కూలు చదువు రోజుల్లో కూడా ఈ వ్యాసంగం సాగింది. స్కూలులో నాటకం వేయడానికి ఎలాంటి అవకాశం వచ్చినా నేను వదిలిపెట్టేవాడిని కాను. మా నాన్న గ్రామ మునసబు.

ఈ నాటకాలు ఆయనకి నచ్చేవి కావు. నాటకాలు కూడు పెడతాయా అని నిలదీసేవారు. ఆయనంటే నాకు హడల్. చదవమని నిలదీసేవారు. ఆ రోజుల్లో నేను వేసిన చార్లెస్ డికెన్స్ పాత్ర - నోటర్ డామ్‌లో గూనివాడి పాత్రకి నాకు మొదటి బహుమతి వచ్చింది. ఇప్పటికీ ఆ జ్ఞాపకం, ఆనాటి ఫోటో నా దగ్గర ఉంది. ఆనాటి మా అనుభవాల గురించి 30 రోజులు విడవకుండా మాట్లాడమన్నా నేను రెడీ.

ఆ రోజు నేను నాటకం వేసున్నానని మా నాన్నకి ఎవరో చెప్పారు. నాటకం మధ్యలో నాన్న సరాసరి స్టేజి మీదకి వచ్చి నా చెవి పట్టుకుని తిట్ల వర్షం కురిపిస్తూ ఇంటికి లాక్కుపోయారు. ఇంటికి పోయాక బడితపూజ చేశారు.

కాలేజీ చదువుకి నన్ను చిదంబరం పంపారు. కాలేజీలో ఏటేటా ఏవేం ఉత్సవాలు జరుగుతాయో ముందు వాకబు చేశాను హాస్టల్ దినం, కాలేజీ స్థాపించిన దినం, చివరలో స్నాతకోత్సవం. బి ఎస్సీలో నాది బాటనీ, జువాలజీ గ్రూపు. చదువులో ముందుండేవాడిని. చదువుతో పాటు నాటక వ్యాసంగమూ సాగేది. నాటక రచన క్రమంగా పాకాన పడింది. ఆ రోజుల్లో ప్రముఖ వారపత్రిక 'ఆనందవికటన్' ఎస్.ఎస్.వాసన్ గారి సంపాదకత్వంలో వచ్చేది. అందులో హాస్యకథలు నా రచనలకు స్ఫూర్తి. మా అగ్రహారానికి ఒకే ఒక పత్రిక వచ్చేది. నా దాకా ఆ పత్రిక రావడానికి ఎదురుచూసేవాడిని.

డిగ్రీ చేతికొచ్చాక, నాటకానుభవం ముదిరాక - ఉద్యోగం కోసం వెదుకులాట ప్రారంభించాను. ఆ రోజుల్లో శిక్షణ పొందిన టీచర్లకు కొరత ఉండేది. శిక్షణ లేని టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. నాకప్పుడు 19 ఏళ్ళు. సన్నగా పీలగా ఉండేవాడిని. గ్రామంలో 23, 24 ఏళ్ళ కుర్రాళ్ళు - నా కంటే ఎత్తరిగా ఉన్నవాళ్ళెందరో క్లాసులో ఉండేవారు. వాళ్ళకి నేనెలా చదువుచెపుతానా అని మా హెడ్మాస్టర్ సందేహం. నేను పాఠం చెపుతూంటే వరండాలో నిలబడి తొంగి చూసేవాడు.

కాలేజీలో 'నమూనా పార్లమెంటు' కార్యక్రమాలు జరిగేవి. నేను విడిచిపెట్టేవాడిని కాదు. మా సీనియర్లు ముఖ్యమంత్రి, ఇతర నాయకుల పాత్రల్లో ఇంగ్లీషులో ఉపన్యాసాలు దంచుతూంటే - నేను క్లాసులో కుర్రాళ్ళచేత అవన్నీ చేయించేవాడిని. మా హెడ్మాష్టర్ గారు ఆశ్చర్యపడినా తర్వాత నన్ను మెచ్చుకున్నారు. నన్ను ప్రోత్సహించేవారు తరువాత జరిగిన సంఘటన నా జీవితాన్నే పూర్తిగా మార్చివేసింది. మద్రాసు అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తా ఉద్యోగం వచ్చింది. ఆ విధంగా నాటకానికి మూలస్థానమైన మద్రాసుకి చేరాను.

ఆరోజుల్లో ట్రిప్లికేన్ ఫైన్ ఆర్ట్స్, అమెచ్యూర్ ఏక్టర్స్ గ్రూప్ వంటి సమాజాలు విరివిగా నాటకాలు వేసేవారు. కానీ ఆనాటి మద్రాసు సంయుక్త రాష్ట్రంలో ఉద్యోగ రీత్యా అటు శ్రీకాకుళం నుంచి నెల్లూరుదాకా ఉద్యోగం పనిమీద తిరగడం తప్పనిసరి కావడం వల్ల రెండు సంవత్సరాలు నాటక వ్యాసంగం వెనకపడింది. అప్పుడు పాత అకౌంటెంట్ జనరల్ బదిలీ అయివెళ్ళే వీడ్కోలు సభ, కొత్త అకౌంటెంట్ జనరల్ స్వాగత సభ కలిపి ఏర్పాటు చేశారు. నేను వెంటనే రెడీ. అన్నామలై మందిరంలో సభ. నాకు వచ్చిన గిమ్మిక్కులన్నీ కలిపి 'సినిమా పిచ్చోడు' అనే ఓ లకోటా ప్రదర్శన ఇచ్చాను. ముందు జీవితానికి ఇది ప్రారంభమా? కాదు. అప్పుడే కాదు. కొత్త ఏజీగారు నా నటన చూసి ముగ్ధులయారు. నాకు ఓ షీల్డ్ ఇచ్చారు.

అప్పటికి ఏజి ఆఫీసు తరపున నా సొంత నాటక సమాజాన్ని ఏర్పరుచుకున్నాను. నా నాటకాల ప్రదర్శనకు అది ప్రారంభం. నా మొట్టమొదటి నాటకం - మేజర్ చంద్రకాంత్. తరువాతి కాలంలో సినిమా ప్రపంచంలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. అది గంట నాటిక. అప్పుడు మళ్ళీ కొత్తగా వచ్చిన అకౌంటెంట్ జనరల్ స్వాగత సభలో ప్రదర్శించాం. ఆయన ఉత్తర దేశం వాడు. ఆ నాటికని ఇంగ్లీషులో రాశాను. నేనే మేజర్ పాత్ర వేశాను. అది 1964.

దరిమిలాను మేజర్ చంద్రకాంత్‌ని సుదీర్ఘమైన తమిళ నాటకాన్ని చేసి సామాజికుల ముందు ప్రదర్శించాం. ఎక్కడాలేని ప్రచారం మా నాటక సమాజానికీ, నాటకానికీ దగ్గింది. సుందర రాజన్ మేజర్ పాత్రని వేశారు. తదాది తన నాటక, సినీ రంగ చరిత్రలో సుందరరాజన్ మేజర్ సుందర రాజన్ గానే చలామణీ అయాడు. ఈ నాటకం చూసి - నాగేష్ అనే ఓ నటుడు మా సమాజంలో వేషంకోసం నా దగ్గరకి వచ్చాడు. ఎంత చిన్న వేషమయినా - ఇళ్ళల్లోకి పేపర్లు గిరాటేసే పేపర్ బోయ్ వేషమయినా వేస్తానన్నాడు. కానీ నేను అతన్ని ప్రధాన పాత్రధారిగా నాటకాల్ని తయారు చేశాను. అద్భుతంగా నటించేవాడు. మా ఇద్దరి జీవితం అలా ప్రారంభమయి - నాగేష్ ప్రధాన పాత్రధారిగా సర్వర్ సుందరం, నీర్ కుమిళి (నీటి బుడగ) మొదలైన నాటకాలతో చరిత్రను సృష్టించేదాకా సాగింది. నాగేష్ తన జీవితంలోనే ఒక చరిత్రగా మిగిలిపోయాడు.



ఆ తర్వాత మా సమాజం మెళుగు వత్తి (కొవ్వొత్తి), ఎదిరినీచ్చల్, నానల్, నవగ్రహం మొదలైన నాటకాలను ప్రదర్శించింది. అన్నీ పెద్ద హిట్స్.

నాకు సినీమాలంటే ఎక్కడలేని పిచ్చి. శివాజీగనేశన్, ఎం.జి.ఆర్ సినీమాలు, భీమ్ సింగ్, కృష్ణన్ పంజు దర్శకత్వం వహించిన సినిమాలు చూసేవాడిని. రాజ్‌కపూర్, శాంతారాం హిందీ చిత్రాలంటే ప్రానం. హిందీ సినిమా సంగీతం అంటే చెవికోసుకునేవాడిని.

ఆ రోజుల్లో పెద్ద పేరులేని ఎ.కె.వేలన్ అనే దర్శకుడు, ఓ తమిళ విద్వాంసుడు ఓ సినీమా తీశాడు. 'థాయ్ పిరందాళ్ వళి పిరక్కుం' (ఆషాఢమాసం వస్తే దారి అదే దొరుకుతుంది) సినిమా పేరు. అది పెద్ద హిట్ అయి అన్ని రికార్డులనీ బద్దలుకొట్టింది. ఆయన కొచ్చిపడిన డబ్బుతో అరుణాచల స్టూడియోస్ నిర్మించాడు. నిర్దుష్టమయిన నిర్ణయాలు తీసుకోగల వ్యక్తి. నా 'నీర్ కుమిళి' నాటకాన్ని చూశాడు. చాలా నచ్చింది. వెంటనే నన్ను పిలిచి ఆ నాటకం ఆధారంగా సినిమా తీయడానికి సిద్ధమయాడు. అంతేకాదు. దానికి నన్నే దర్శకత్వం చేయమన్నాడు. నా మీద పిడుగుపడ్డట్టయింది. అంతకుముందు ఎం.జి.ఆర్. నటించిన 'దైవథాయ్' (మాతృదేవత) అనే సినిమాకి మాటలు రాశాను. పేరున్న నటుడి సినిమాకి మాటలు రాయడం చాలా ఇబ్బంది అని తెలిసివచ్చింది. కనుక - నాకు దర్శకత్వం వహించే మనస్సులేదు. ఆ మాటే చెప్పి వచ్చేశాను. ఇది విని మా సమాజం నటులంతా బంగారంలాంటి అవకాశం వదులుకున్నందుకు చెడామడా తిట్టారు. అయినా సినిమాల్లోకి వెళ్ళడానికి నాకు మనస్సు రాలేదు. కానీ సహనటుల బలవంతం వల్ల సరేననకి తప్పలేదు. ఆవిధంగా బలవంతంగా నేను డైరెక్టరుగా సినిమాల్లోకి అడుగుపెట్టాను.

పెట్టానేగానీ ఒక పక్క ఏజీ ఆఫీసులో నౌఖరీ. మరోపక్క డైరెక్టర్ పని - నాకు ఇరకాటంగానే ఉంది. మా మామగారు ఆ రోజుల్లో నాతోనే ఉండేవారు. ఆయనకి ఈ కొత్తపని సుతారమూ నచ్చేది కాదు. తన కూతురుని - అంటే నా భార్యని - నాకు నచ్చచెప్పమనేవారు. అప్పటికే మా నాన్న కన్నుమూశారు. మా అమ్మకి ఇవేవీ తెలియవు. నీ మనస్సుకి ఏది మంచిదని తోస్తే అది చెయ్యి అనేది.

షావుకారు జానకితో ఓ ఆసక్తికరమైన సంఘటన జరిగింది. నా నాటకాల రోజుల్లోనే ఆమె సినిమాల్లో పెద్ద స్టార్. 'మెళుగు వత్తి' నాటకంలో ఒక పాపులర్ స్టార్ వెయ్యాల్సిన వేషం ఉంది. జానకి చేత ఆ వేషం వేయించే స్తోమతు మా సమాజానికి లేదు. అడిగే ధైర్యమూ లేదు. అంతవరకూ ఏ నాటకాల్లోనూ ఆమె నటించలేదు. అయితే సుందరరాజన్ ధైర్యం చేసి ఆమెని కలిసి కథ చెప్పాడు. మేమంతా ఆశ్చర్యపోయేలాగా ఆమె వేషం వెయ్యడానికి అంగీకరించింది. అంతేకాదు. ఒక్కపైసా తీసుకోడానికి ఇష్టపడలేదు. ఆమె నటన ఆ నాటకంలో అద్భుతం. తరువాత 'నా 'ఎదిరినీచ్చల్' సినిమాలో 'పట్టుమామి' వేషంతో ఆమె తమిళ ప్రేక్షకులకు ఆరాధ్యదైవమయిపోయింది.

అరుణాచల స్టూడియోస్‌లో షూటింగ్ ప్రారంభమయింది. మొదటిరోజు అనుభవాన్ని నేనెన్నటికీ మరిచిపోను. నాగేష్ నేనూ అప్పటికి 'ఒరేయ్!' అని పిలుచుకునేవాళ్ళం. కానీ సెట్ మీద ఎప్పుడూ 'సార్!' అనేవాడు.

మొదటి చిత్రం పూర్తికాగానే - అందరి దర్శకులలాగే నా మనస్సులోనూ ఈ సినిమా ఏమవుతుందో రైళ్ళు పరిగెత్తాయి. తిరుపతికి పారిపోయి తిరుమలలో కూర్చున్నాను. 1964లో సెల్ ఫోన్లు లేవు. సినిమా ఎలావుందో తెలుసుకోడానికి మద్రాసుకి కాల్స్ చేస్తున్నాను. సినిమా బాగుందనీ, ఆడియన్స్ మెచ్చుకుంటున్నారని కబురు తెలిసింది. గుండెదిటవు పడి తిరిగి వచ్చాను. సినిమా 80 రోజులు ఆడింది. మంచి సమీక్షలు వచ్చాయి.

ఒక్క ప్రశంసని మాత్రం మరిచిపోలేను. ఏవియం చెట్టియార్ తన స్టూడియోలో సినిమా చూసి నాకో ఉత్తరాన్ని పంపారు. 'నువ్వు తమిళనాడు ఉత్తమ దర్శకులలో ఒకడివయావు' అంటూ. నా సినీ జీవితంలో నాకు దక్కిన మొదటి కితాబు అది. ఆ ఉత్తరం ఇప్పటికీ నా దగ్గర ఉంది.




(అక్టోబర్ 2011 సంచికలో ప్రచురితం)

# కె.వి.రెడ్డి

*ముప్ఫై ఏళ్ళ (1942-1971) సినీ దర్శకత్వ జీవితంలో ఆయన రూపొందించిన చిత్రాల సంఖ్య 15 మించలేదు. దర్శకత్వం వహించిన అతి తక్కువ సినిమాల్లోనే చారిత్రాత్మక, జానపద, పౌరాణిక, సాంఘిక -- - ఇలా అన్ని రకాల కథలనీ అజరామరంగా నిలిచిపోయే చిత్రాలుగా తీర్చిదిద్దిన ఘనత కె.వి.రెడ్డిగారిది. నిజానికి ఇప్పుడు నడుస్తున్నది కె.వి.రెడ్డిగారి శతజయంతి సంవత్సరం, కానీ ఎందుకో తెలుగు చిత్రపరిశ్రమ ఈ విషయాన్ని గుర్తించినట్లు ఎక్కడా వార్తలు రాలేదు. భక్తపోతన, పాతాళ భైరవి, దొంగరాముడు, మాయాబజార్, జగదేక వీరుని కథ.. ఒక్కొక్కటీ ఒక్కో ప్రామాణిక దృశ్యకావ్యం! దర్శకులకే మార్గదర్శకుడిగా అరుదైన గౌరవం పొందిన కదిరి వెంకట రెడ్డిగారి మొదటి సినిమా భక్తపోతన  వరకూ జరిగిన ఆయన జీవన ప్రస్థానం (వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాల ఆధారంగా) ఈ నెల కౌముది పాఠకులకి ప్రత్యేకం.*



**కె.వి.రెడ్డిగారి స్వగ్రామం రాయలసీమలోని తాడిపత్రి.** తండ్రిగారు కదిరి కొండారెడ్డి. కె.వి.రెడ్డి గారు పుట్టిన తేదీ 1912, జూలై 1. దురదృష్టవశాత్తూ తన రెండో సంవత్సరంలోనే తండ్రిని కోల్పోయారు కె.వి.రెడ్డి. ఆయన తల్లి రెండేళ్ళ పిల్లాడిని తీసుకుని సోదరుడి ఇంటికి చేరారు. ఆ విధంగా చిన్నతనం అంతా మేనమామగారి ఇంట్లోనే గడిచింది. హైస్కూలు వరకూ ఆయన చదువంతా తాడిపత్రిలోనే సాగింది. కె.వి.రెడ్డిగారికి చిన్నప్పటి నుంచి క్లాసుమేట్, బెంచ్‌మేట్..ప్రాణ మిత్రుడు మూలా నారాయణ స్వామి.  ఇంకా టాకీ సినిమాలు, సినిమా థియేటర్లూ  కూడా లేని ఆ రోజుల్లో బయస్కోప్ అనే పెట్టెలని ఊరూరా తిప్పుతూ అందులో కదిలే బొమ్మలని చూపిస్తుండేవారు. చిన్నతనంలో వీటిని చూసిన కె.వి.రెడ్డి, నారాయణ స్వామి, తాము కూడా పెద్దయ్యాక అలాంటి సినిమాలు తియ్యాలని కలలు కంటుండేవారు. కొన్ని దశాబ్దాల తర్వాత తమ కలలు నిజమౌతాయని, అందులోనూ కె.వి.రెడ్డి తెలుగు చలన చిత్రచరిత్రలోనే ఒక చరిత్ర నెలకొల్పుతారనీ ఆ పసివయసులో వారెప్పుడూ ఊహించి ఉండరు.

హైస్కూలు చదువయ్యాక కె.వి.రెడ్డి పై చదువులకోసం మద్రాసు వెళితే నారాయణ స్వామి మాత్రం ఉన్న ఊళ్ళోనే వ్యాపారం వైపు మళ్ళారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్సీ చదువుతూ హాస్టల్‌లో ఉండేవారు కె.వి. రెడ్డి. ఒకవైపు చదువు సాగుతున్నా రెడ్డిగారి ఆసక్తి మాత్రం సినిమాల మీదనే ఎక్కువగా ఉండేది. మూకీ సినిమాలు టాకీ సినిమాలుగా మారుతున్న రోజులవి. మద్రాసులో విడుదలైన సినిమాలన్నీ వదిలిపెట్టకుండా చూడ్డమే కాకుండా అందులోని ప్రతి అంశాన్నీ సూక్ష్మంగా పరిశీలిస్తూ ఉండేవారు కె.వి.రెడ్డి. కాలేజీలో ఆయనకి సీనియర్ ఐన పి.పుల్లయ్య తెలుగులో మొట్టమొదటి టాకీ భక్తప్రహ్లాదకి దర్శకత్వ శాఖలో పనిచేశారు. రెడ్డి గారికి పుల్లయ్యగారికి కాలేజీ రోజుల్లోనే మంచి స్నేహం కుదిరింది. తన సినిమా అనుభవాలని కె.వి.తో పంచుకుంటూ ఉండేవారు పుల్లయ్య. వాళ్ళిద్దరూ కలిసి ఎలాంటి కథలు సినిమాలుగా తీస్తే బావుంటుందీ అని కూడా చర్చించుకుంటూ ఉండేవారు.

బి.ఎస్సీ ఆనర్స్ అయ్యాక ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టారు కె.వి. పంచాయితీ ఆఫీసర్‌గా ప్రయత్నించారు. కుదరలేదు. కనీసం టీచర్ జాబ్ ఐనా దొరుకుంతుందేమోనని చూశారు. అదీ కాలేదు. అప్పుడు తన సహాధ్యాయి కృష్ణారావు అనే అయనతో కలిసి చిన్న బిజినెస్ మొదలుపెట్టారు. దాని పేరు 'స్టాండర్డ్ సైంటిఫిక్ ఇన్స్ట్రుమెంట్స్'. హైస్కూలు విద్యార్థులకి అవసరమైన లాబొరేటరీ కిట్స్ తయారు చేసి అమ్మే వ్యాపారం అది. మొదలుపెట్టిన వేళా విశేషం ఏమో కానీ బిజినెస్ బాగానే పుంజుకుంది.

ఇదిలా ఉండగా ఆయన చిన్ననాటి మిత్రుడూ మూలా నారాయణ స్వామిగారి లైన్ ఇంకో విధంగాముందుకి సాగింది.

తెలుగులో మొట్టమొదటి టాకీ చిత్రాన్ని నిర్మించిన హెచ్.ఎమ్.రెడ్డిగారు మొదలుపెట్టిన రోహిణీ పిక్చర్స్ సినీ నిర్మాణ సంస్థలో మూలా నారాయణ స్వామి భాగస్వామిగా చేరారు. వారిద్దరితో పాటు మరో భాగస్వామి బి.ఎన్.రెడ్డి (తర్వాతి రోజుల్లో వాహినీ పతాకం కింద మల్లీశ్వరి లాంటి కళాఖండాలు తీసిన ప్రముఖ దర్శకులు) ఆ సినిమా పేరు 'గృహలక్ష్మి'. చిత్తూరు నాగయ్యగారికి మొదటి సినిమా కూడా అదే. తను రోహిణీ లో భాగస్వామిగా చేరగానే నారాయణ స్వామిగారికి చిన్ననాటి మిత్రుడు కె.వి.రెడ్డి గుర్తుకు వచ్చారు. చిన్నప్పుడు ఇద్దరూ కలిసి మంచి సినిమాలు తీద్దామనుకున్న చిన్ననాటి కబుర్లు కూడా ఆయనకి గుర్తున్నాయి.

'రోహిణీ సంస్థలో ఏదైనా పనిచేయడానికి రమ్మ'ని కె.వి.కి కబురుపంపారు.

ఐతే అప్పటికే మిత్రుడితో కలిసి ఏదో చిన్న వ్యాపారం చేస్తున్న కె.వి.రెడ్డి వెళ్ళాలా లేదా అని సందేహించారు.

వ్యాపారభాగస్వామి ఐన కృష్ణారావు 'చిన్ననాటి మిత్రుడు అంటున్నావు కదా. ఒకసారి వెళ్ళి చూడు. ఆర్నెల్లు పనిచేయి. ఇష్టం లేకపోతే మళ్ళీ వచ్చెయ్యి' అని సలహాఇచ్చారు.

ఆ ధైర్యంతో కె.వి. రోహిణీ సంస్థలో పనిచేయడానికి చేరారు. ఆయనది బి.ఎస్సీ నేపథ్యం కాబట్టి సౌండ్ విభాగంలో చేరితే బావుంటుందని అనుకున్నారు. ఐతే డబ్బు వ్యవహారాలు చూడడానికి నమ్మకమైన మనిషి ఉంటే బావుంటుందనీ, అందునా కె.వి.రెడ్డి మూలా నారాయణ స్వామి గారి బాల్యమిత్రుడు కాబట్టి ఆయన్ని కేషియర్ స్థానంలో కూర్చోబెట్టారు. చేసే పని డబ్బులు లెక్కల చూడ్డమే ఐనా తనకున్న సహజసిద్ధమైన ఆసక్తితో కె.వి.రెడ్డి 'గృహలక్ష్మి' చిత్ర నిర్మాణ సమయంలో అన్ని విభాగాలని వీలైనంత క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టారు. 1938లో 'గృహలక్ష్మి' విడుదలై విజయవంతమైంది.

సినిమా ఐతే విజయవంతమైంది కానీ భాగస్వాములు మాత్రం కొనసాగలేకపోయారు. బి.ఎన్.రెడ్డిగారి వ్యవహార శైలీ, హెచ్.ఎమ్.రెడ్డిగారి వ్యవహార శైలి కలవలేదు. అందుకనే 'గృహలక్ష్మి' తర్వాత మూలా నారాయణ స్వామి, బి.ఎన్.రెడ్డి రోహిణీ సంస్థ నుంచి బయటికి వచ్చేసి సొంతంగా వాహినీ పిక్చర్స్ అనే సినీ నిర్మాణ సంస్థని 1938లో ప్రారంభించారు. వీరిద్దరితో బాటు బ్రిజ్ మోహన్ దాస్ అనే మరో భాగస్వామి కూడా వాహినీ పిక్చర్స్‌లో చేరారు.

సహజంగానే కె.వి. మూలా నారాయణ స్వామి మిత్రులు కాబట్టి కె.వి.రెడ్డి కూడా వాహినీ పిక్చర్స్‌లో కొనసాగారు. వాహినీ పతాకం కింద బి.ఎన్.రెడ్డిగారి దర్శకత్వంలో 'వందేమాతరం(1939)', 'సుమంగళి(1940)',' దేవత(1941)' సినిమాలు రూపొందించారు. వీటన్నింటికీ కె.వి.రెడ్డిగారు ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశారు. అప్పటినుంచే ఆయన సమయపాలన ఎలా ఉండేదంటే

ఆర్టిస్టులందరికీ మధ్యాహ్నం ఒంటిగంటకి లంచ్ బ్రేక్ ఐతే, డ్రైవర్లందరికీ ముందు గానే భోజనాలు పెట్టించి ఒంటిగంటకల్లా వాళ్ళని ఆర్టిస్టులకి అందుబాటులో ఉంచేవారు. ఈ సినిమాలకి కమలాకర కామేశ్వరరావు గారు సహాయ దర్శకులు. కె.వి. రెడ్డిగారికి, కామేశ్వరరావుగారికీ ఈ చిత్రాల నిర్మాణ సమయంలో మంచి స్నేహం కుదిరింది. భవిష్యత్తులో ముందుగా ఎవరు దర్శకులైనా రెండో వారు అక్కడా అసిస్టెంటుగా చేద్దామని అనుకునేవాళ్ళు. ఈ మూడు సినిమాలు మంచి సినిమాలు అని పేరు తెచ్చుకున్నప్పటికీ ఆర్థికంగా అంతగా విజయం సాధించలేదు. అప్పుడు నాలుగో సినిమాగా ‘భక్తపోతన‘ తీద్దామని కంపెనీ భాగస్వాములు నిర్ణయించారు. దర్శకుడిగా కె.వి.రెడ్డిగారిని తీసుకోవాలని కూడా తీర్మానించారు. కె.వి.రెడ్డిగారికి తనకి దర్శకత్వం అవకాశం వస్తే ముందుగా ఏదైనా చక్కటి ప్రేమ కథ తియ్యాలని ఉండేది. ఐతే కంపెనీనిర్ణయం కాబట్టి భక్తి ప్రధానమైనా ‘భక్తపోతన‘కి దర్శకత్వం చేయడానికి ఆయన సరేనన్నారు.

సినిమా మొదలుపెట్టడానికి ముందే కె.వి.రెడ్డిగారికి కాస్త అసౌకర్యం కలిగే సందర్భాలు ఎదురయ్యాయి. ఆయన చదివింది బి.ఎస్సీ. అంతవరకూ ప్రొడక్షన్ వ్యవహారాలు చూశారే తప్ప దర్శకత్వ శాఖలో పనిచేయలేదు. ఆర్థికంగా తప్పని సరిగా విజయం సాధించే చిత్రాన్ని తీయాలి అని పట్టుదలతో ఉన్నప్పుడు ఇలాంటి అనుభవం లేని కుర్రాడితో ప్రయోగం చేయడం మంచిదేనా అనికొంతమంది సందేహం వ్యక్తపరిచారు. ముఖ్యంగా కె.వి., బి.ఎన్.రెడ్డిగారి ఇంటికి వెళ్ళినప్పుడు వారి కుటుంబసభ్యుల ప్రవర్తన గమనించి తన మీద వాళ్ళకి అంతగా నమ్మకం లేదన్న విషయాన్ని గ్రహించారు. వాళ్ళకి అంతగా నమ్మకం లేనప్పుడు, ఒక వేళ తన మొదటి సినిమా ఫెయిలయితే కంపెనీ మూసివేతకి తను కారణమౌతానన్న భయంతో, మిత్రుడు మూలా నారాయణ స్వామికి విషయం చెప్పారు. ఆయన కె.వి. సందేహాలన్నింటినీ తోసిపుచ్చి ‘నువ్వే ఈ సినిమా చేస్తున్నావు‘ అని బోర్డు మీటింగు పెట్టి, ‘భక్త పోతన కి కె.వి.నే దర్శకుడు. ఈ సినిమాలో ఏ మాత్రం నష్టం వచ్చినా అదంతా నేనే భరిస్తాను‘ అని తెగేసి చెప్పారు.

మొత్తానికి కె.వి.రెడ్డిగారి మొదటి సినిమా ‘భక్తపోతన‘ మొదలైంది. అందరి సహకారం ఉండీ, అందరూ మిత్రులే ఐనప్పటికీ ‘పీత కష్టాలు పీతవి‘ అన్నట్లు ‘భక్తపోతన‘ నిర్మాణానికి కూడా ఇబ్బందులు తప్పలేదు.



కె.వి.రెడ్డి అంతకు ముందు దర్శకత్వశాఖలో పనిచేయనప్పటికీ, ‘దేవత‘ నిర్మాణ సమయంలోనే ‘భక్తపోతన‘ స్క్రిప్టు గురించి సీనియర్ సముద్రాలగారితో చర్చిస్తూ ఉండేవారు. సముద్రాల, కమలాకర కామేశ్వరరావు గార్ల సమిష్టి కృషితో స్క్రిప్టు తుదిరూపం దిద్దుకుంది. బి.ఎన్.రెడ్డిగారి మొదటి సినిమా ‘వందేమాతరం‘కి కెమేరాతో బాటు స్క్రీన్ప్లేని కూడా సమకూర్చిన రామ్‌నాథ్‌గారే కె.వి.గారి మొదటి సినిమా ‘భక్తపోతన‘కి ఆ రెండు విభాగాలనీ నిర్వహించారు. తరువాతి రోజుల్లో కె.వి.రెడ్డిగారు దర్శకత్వం వహించిన సినిమాల స్క్రీన్ ప్లేలన్నీ ఒక ప్రమాణంగా అందరూ భావిస్తే , అయనకి స్క్రీన్ ప్లేలో మొదటి పాఠాలు నేర్పింది రామ్‌నాథ్ అని చెబుతుంటారు అప్పటి సమకాలీనులు.

పోతన పాత్రకి అప్పటికి వాహినీ సినిమాలన్నింటిలోనూ నటించిన నాగయ్యగారే ఎంపిక అయ్యారు. శ్రీనాథుడి పాత్రకి మాత్రం విజయవాడకు చెందిన జంధ్యాల గౌరీనాథ శాస్త్రిని తీసుకున్నారు. కమలాకర కామేశ్వరరావుగారి రికమండేషన్ అది. శ్రీనాథుడి కుమార్తెగా నటించిన మాలతి తర్వాతి రోజుల్లో ‘పాతాళభైరవి‘లో హీరోయిన్ గా నటించారు. టంగుటూరి సూర్యకుమారి గారు కూడా ఒక అతిథి పాత్రలో నటించారీ చిత్రంలో.

నిర్మాణం మధ్యలో ఉండగానే రెండో ప్రపంచయుద్ధం వచ్చింది. దాని ప్రభావంతో అప్పటికే మూడొంతుల సినిమా పూర్తైన 'భక్తపోతన' నిర్మాణానికి బ్రేక్ పడింది. అందరూ మూటా ముల్లె సర్దుకుని తాడిపత్రికి వెళ్ళిపోయారు. సహజంగానే కె.వి.రెడ్డి గారు తన మొదటి సినిమానే ఇలా ఐనందుకు తీవ్రమైన నిరాశాకి లోనయ్యారు. మళ్ళీ సినిమా మొదలౌతుందన్న ఆశకూడా ఎవరికీ లేకుండింది. అదృష్టవశాత్తూ యుద్ధ వాతావరణం, కొన్ని నెలల్లోనే సమసిపోవడం, మళ్ళీ అందరూ మద్రాసు వచ్చి 'భక్తపోతన' నిర్మాణం కొనసాగించడం జరిగింది. ఐతే అక్కడో చిక్కు వచ్చింది. కె.వి.రెడ్డిగారికి వెన్నుదన్నుగా ఉన్న రామ్‌నాథ్ అప్పటికి జెమినీ స్టూడియోలో చేరిపోయారు. 'భక్తపోతన' చిత్రంలో ఆయన తియ్యాల్సిన కీలకమైన సన్నివేశాలు, కొన్ని ట్రిక్ షాట్స్ మిగిలిపోయాయి. కె.వి వెళ్ళి ఆయన్ని రమ్మని అడిగితే ఆయన తన అశక్తతని తెలియచేయడమే కాకుండా 'ప్రతి దానికీ నేనే కావాలా..ఆ మాత్రం మేనేజ్ చెయ్యలేకపోతే నువ్వేం దర్శకుడి వౌతావ్' అన్నారు. దాంతో పౌరుషం వచ్చిన కె.వి. తనే సొంతంగా మిగిలిన ట్రిక్ షాట్స్‌ని కూడా తీసేసి విజయవంతంగా 'భక్తపోతన' నిర్మాణాన్ని పూర్తిచేశారు.

ఆ తర్వాత భక్తపోతన సృష్టించిన రికార్డుల గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు.

సినిమా షూటింగ్ మొదలుపెట్టడానికి ముందే మూలా నారాయణస్వామి అడిగారట 'నీకు రెమ్యునరేషన్ వెయ్యిరూపాయలు ఇద్దామనుకుంటున్నాం. లేదంటే లాభాల్లో పదో వంతు వాటా ఇస్తాం' అని. కె.వి.రెడ్డి గారు లాభాల్లో వాటానే ఎంచుకున్నారు. ఫలితంగా ఆయనకి దక్కిన పారితోషికం పదివేలు..!!

తెలుగు సినిమా కాలం ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలను రూపొందించిన కె.వి.రెడ్డిగారి మొదటి సినిమా అనుభవాలు అవీ.

(నవంబర్ 2011 సంచికలో ప్రచురితం)

# కమలాకర కామేశ్వరరావు

*సినీ విమర్శకుడు సినీదర్శకుడవడం ఈ రోజుల్లో సాధ్యమేనేమో కానీ 70 సంవత్సరాల క్రిందట అదొక విచిత్రమే! అలా తెలుగుచిత్రసీమలో ప్రవేశించి ఉద్దండులైన దర్శకులతో పనిచేసి, తెలుగు చలనచిత్ర చరిత్రలో 'పౌరాణిక చిత్రబ్రహ్మ'గా పేరు తెచ్చుకున్న స్వర్గీయ కమలాకర కామేశ్వరరావుగారి మొదటి సినిమా ప్రయాణం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 'పాండురంగ మహాత్యం', 'నర్తనశాల', 'శ్రీకృష్ణ తులాభారం', 'శ్రీకృష్ణావతారం'..ఏ ఒక్క సినిమా ఐనా చాలు కామేశ్వరరావుగారి పేరుని చిరస్థాయిగా నిలబెట్టడానికి. నిజానికి క్రిందటేడాది ఆయన శతజయంతి సంవత్సరం. ఐనా తెలుగు చిత్రపరిశ్రమ ఆయన్ని గుర్తుచేసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వివిధ పత్రికల్లో వచ్చిన సమాచారం ఆధారంగా కమలాకర కామేశ్వరరావుగారి మొదటి సినిమా విశేషాలు 'కౌముది' పాఠకుల కోసం..*



**60-70 దశకాల తర్వాత పాలకొల్లు నుంచి ఎలాగైతే ఎక్కువమంది సినీరంగ ప్రవేశం తెచ్చి పేరు తెచ్చుకున్నారో,** 1930-40 దశకాల్లో బందరు పట్టణం నుంచీ అలానే ఎక్కువమంది చిత్రరంగ ప్రవేశం చేసి మంచిపేరు తెచ్చుకున్నారు. మల్లాది రామకృష్ణశాస్త్రి గారు, ద్రైతా గోపాలం గారు, పింగళి నాగేంద్రరావు గారు..వీరందరిదీ బందరే. ప్రముఖ నటులు ఎస్వీ రంగారావుగారు కూడా కొన్నాళ్ళు బందరులో ఉద్యోగం చేశారు. తెలుగుచలన చిత్ర రంగంలో నృత్యదర్శకత్వానికి నాంది పలికిన వారందరూ బందరుకి దగ్గరలోని కూచిపూడి నుంచి వచ్చిన వారే. ఈ విధంగా తెలుగు చిత్రపరిశ్రమకి బందరు పట్టణం మరపురాని మాణిక్యాలని అందించిందని చెప్పుకోవచ్చు. వారిలో ఒకరే కమలాకర కామేశ్వరరావు గారు.

కామేశ్వరరావు గారు 1911 సంవత్సరం అక్టోబర్ 4వ తేదీన జన్మించారు. బందరు గాలి ప్రభావమేమో, చిన్నప్పటి నుంచే ఆయనకి లలితకళలంటే విపరీతమైన మక్కువ ఏర్పడింది. ముఖ్యంగా సినిమాలంటే ప్రాణం. తెలుగు టాకీలు వచ్చిన కొత్తరోజులవి. కేవలం తెలుగు సినిమాలేకాక ఇంగ్లీషు సినిమాలంటే కూడా చాలా ఇష్టం ఏర్పడింది కామేశ్వరరావుగారికి. చదువైతే బి.ఎ వరకూ

చదువుకున్నారు కానీ ధ్యాస అంతా సినిమాల మీదే బందరులో అప్పట్లో ఎక్కువ థియేటర్లు ఉండేవి కాదు. సినిమాలు చూడ్డానికి బెజవాడ కూడా వెళ్తుండేవారాయన. కేవలం చూడ్డమే కాకుండా సినిమాలోని ప్రతి అంశం గురించి, ప్రతి విభాగం గురించి నిశితంగా గమనించి విశ్లేషించుకుంటూ ఉండేవారు.

బందరు అంటే వెంటనే గుర్తొచ్చే మరోపేరు 'కృష్ణాపత్రిక'. ముట్నూరి కృష్ణారావు గారు ప్రారంభించిన ఆ పత్రిక తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన పత్రిక ఆరోజుల్లో. అప్పుడప్పుడే తెలుగు టాకీలు పుంజుకుంటున్నాయి. ప్రేక్షకులకి సినిమా సమాచారం చేరాలంటే ఒకటే మార్గం పత్రికలు. అత్యంత ప్రజాదరణ పొందిన 'కృష్ణాపత్రిక'లో సినిమా సమీక్షలు వ్రాసే అవకాశం కమలాకర కామేశ్వరరావు గారికి వచ్చింది. అప్పటికే సినిమా పరిజ్ఞానాన్ని నరనరాన ఎక్కించుకున్న కామేశ్వరరావు గారు, ఆనందంగా ఆ పనికి ఒప్పుకున్నారు. ఐతే సాదాసీదా సమీక్షలు కాకుండా, వాటిల్లో కూడా వినూత్నత ఉండాలనే ఉద్దేశంతో హాలీవుడ్ సినిమా పత్రికలని సంపాదించి వాటిలో ఉండే సమీక్షలని ఆదర్శంగా తీసుకుని ఆయన తెలుగు సినిమా రివ్యూలు వ్రాయడం మొదలు పెట్టారు.

ఆయన కలంపేరు 'సినీ ఫాన్' ! 1934- 37 సంవత్సరాల్లో 'సినీ ఫాన్' వ్రాసిన సమీక్షలంటే సినిమా రంగంలో అందరూ చాలా విలువైన సలహాలుగా అనుకుంటే ఉండేవారు. 'కృష్ణాపత్రిక' సంపాదకులు ముట్నూరి కృష్ణారావుగారు కూడా కామేశ్వరరావు గారిని సగర్వంగా మా పత్రికలో సమీక్షలు వ్రాసే 'సినీ ఫాన్' ఈయనే అని పరిచయం చేస్తూ ఉండేవారు. తెలుగు సినిమాలే కాకుండా ఇంగ్లీషు సినిమా రివ్యూలు కూడా అయన వ్రాస్తుండేవారు. 'గుడ్ ఎర్త్' అనే సినిమా రివ్యూని నాలుగు వారాల పాటు వ్రాశారు. ఆయన వ్యాసాలనీ ఆలోచనాత్మకంగా , విషయ ప్రధానంగా వుండేవి.

డిగ్రీ పూర్తిచేశాక మూడు నాలుగు సంవత్సరాలు ఖాళీగానే ఉన్నారు. ఎందుచేతనో ఇంట్లో కూడా ఒత్తిడి లేకపోవడంతో ఎక్కడా ఉద్యోగం కూడా చెయ్యలేదు. సమయాన్నంతా లైబ్రరీలో పుస్తకాలు చదువడానికీ, సినిమాలు చూసి రివ్యూలు వ్రాయడానికీ వెచ్చించేవారు కామేశ్వరరావు గారు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమా క్వాలిటీనే సమీక్షించేవారాయన. అలాంటి రోజుల్లోనే 1936లో ఒకే కథాంశంతో రెండు సినిమాలు విడుదలయ్యాయి. తొలి తెలుగు టాకీ దర్శకులు హెచ్.ఎమ్. రెడ్డి గారి పర్యవేక్షణలో, ఆయన బావమరిది హెచ్.వి.బాబు దర్శకత్వంలో రూపొందిన 'ద్రౌపదీ వస్త్రాపహరణం', జగన్నాథ్ గారి దర్శకత్వంలో బళ్ళారి రాఘవగారు నటించిన 'ద్రౌపదీ మాన సంరక్షణం'. వీటిల్లో మొదటిది హిట్ ఐంది. రెండోది ఫెయిలయింది. ఐతే 'సినీ ఫాన్' కమలాకర కామేశ్వరరావు గారి విశ్లేషణ మాత్రం ఫెయిలైన 'మానసంరక్షణ' వైపే మొగ్గింది. నాలుగు వారాల పాటు 'కృష్ణాపత్రిక'లో ఈ రెండు సినిమాలని పోల్చి చూపిస్తూ అతి సూక్ష్మమైన అంశాలని సైతం సవివరంగా విశ్లేషిస్తూ కామేశ్వరరావుగారు వ్యాసాలు వ్రాశారు. ఆయన లెక్కప్రకారం విజయవంతమైన ' వస్త్రాపహరణం' కంటే అపజయం పాలైన 'మానసంరక్షణ' సినిమాలోనే కళాత్మక విలువలున్నాయి. ఈ విషయాన్ని సోదాహరణంగా వ్రాశారాయన. నటీనటుల సామర్థ్యంలో కూడా ఫెయిలైన సినిమాదే పై చేయి అని కామేశ్వరరావు గారు వ్రాసిన సమీక్షలు ఆ రోజుల్లో సినిమా రంగంలో పెద్ద సంచలనం సృష్టించాయి.

టాకీ పులి హెచ్.ఎమ్ రెడ్డి గారు కూడా ఆ సినిమా సమీక్షలు చదివి ఆశ్చర్యపోయారు. విజయవంతమైన తన సినిమాలో కూడా ఎన్నో లోపాలని ఎత్తి చూపించిన ఆ విమర్శకుడెవరో తెలుసుకోవాలనే కుతూహలం కలిగిందాయనకి. ఆ విధంగా కమలాకర కామేశ్వరరావు గారికి హెచ్.ఎమ్. రెడ్డిగారిని కలుసుకునే అవకాశంకలిగింది. ఆసమయంలో రెడ్డిగారు 'కనకతార' సినిమా తీస్తున్నారు. మొదటి పరిచయంలోనే కామేశ్వరరావుగారి లోని చురుకుదనం రెడ్డిగారిని ఆకట్టుకుంది. తన తరువాతి సినిమా 'గృహలక్ష్మి'కి కమలాకర కామేశ్వరరావు గారిని దర్శకత్వశాఖలో సహాయకుడిగా తీసుకున్నారు హెచ్.ఎమ్.రెడ్డిగారు. ఆయన బేనర్ రోహిణీ పిక్చర్స్. అక్కడే కామేశ్వరరావు గారికి కె.వి.రెడ్డి గారితో పరిచయం ఏర్పడింది. ఆ సినిమాకి కె.వి.రెడ్డి గారు కేషియర్‌గా పనిచేసేవారు. రామ్‌నాథ్ శేఖర్, బి.ఎన్.రెడ్డి, సముద్రాల వంటి హేమాహేమీలతో పనిచేసే అవకాశం కామేశ్వరరావుగారికి తొలిరోజుల్లోనే

లభించింది. కె.వి.రెడ్డి గారు, కామేశ్వరరావు గారు రూమ్మేట్స్ కూడా. కె.వి.రెడ్డి కేషియర్ ఐనా ఆయనకి సినిమా నిర్మాణం మీద ఆసక్తి ఉండేది కాబట్టి ఇద్దరూ కలిసి సినిమా నిర్మాణంలోని అన్ని శాఖలగురించి మాట్లాడుకుంటూ ఉండేవారు. సాయంకాలం కాగానే ఇద్దరూ కలిసి సినిమాలకి వెళ్ళి, తిరిగొచ్చాక ఆ సినిమాలోని బాగోగుల గురించి గంటలతరబడి చర్చించుకుంటూ ఉండేవారు. ఎప్పటికైనా సినీ దర్శకులు కావడమే ఇద్దరి లక్ష్యం. ఎవరు ముందు దర్శకుడైనా, రెండో వారు సహ దర్శకులుగా పనిచేయాలని కె.వి.గారు, కామేశ్వరరావు గారు అనుకున్నారు.

'గృహలక్ష్మి' తర్వాత హెచ్.ఎమ్ గారికీ, బి.ఎన్ గారికీ వచ్చిన విభేదాల వల్ల వాహినీ సంస్థ మొదలైంది. మొదటి చిత్రం 'వందే మాతరం'. ఈ సినిమా నుంచే కె.వి.రెడ్డి గారు దర్శకత్వ శాఖలోకి మారారు. అంటే కె.వి.రెడ్డి గారు, కమలాకర కామేశ్వరరావుగారు సహాధ్యాయులుగా ఒకే విభాగంలో పనిచేయడం మొదలుపెట్టారు. వాహినీ వారి 'దేవత' సినిమా నుంచి కామేశ్వరరావు గారికి అసోసియేట్ స్థాయి వచ్చింది.

వీళ్ళిద్దరిలో ముందుగా కె.వి.రెడ్డి గారికే 'భక్తపోతన' చిత్రదర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. ఇద్దరూ ఎప్పటినుంచో అనుకుంటున్న విషయమే కాబట్టి కమలాకర కామేశ్వరరావుగారు, కె.వి.రెడ్డిగారి వద్ద అసోసియేట్‌గా పనిచేయడం మొదలుపెట్టారు. కె.వి.గారికి కామేశ్వరరావు గారంటే ఎంత అభిమానమంటే – సినిమా ప్రకటనల్లో తన పేరు పక్కనే అసోసియేట్ కమలాకర కామేశ్వరరావు అని వేయించేవారు. వాహినీ సంస్థ ఒక కుటుంబంలా ఉండేది. కామేశ్వరరావు గారు కూడా ఆ కుంటుంబంలో విడదీయరాని సభ్యుడిగా కలిసిపోయారు. 1943 లో వాహినీ స్టూడియో నిర్మాణం మొదలుపెట్టినప్పుడు శంఖుస్థాపనలో కామేశ్వరరావు గారు కూడా పాల్గొన్నారు.

కె.వి.రెడ్డి గారు విజయా బేనర్‌లో తీసిన 'గుణ సుందరి కథ',' పాతాళ భైరవి' సినిమాలకి కూడా కామేశ్వరరావు గారే అసోసియేట్‌గా పనిచేశారు. దాదాపు 16 సంవత్సరాలు ఆ విధంగా ఎంతోమంది మహామహులతో కలిసి పనిచేసిన అనుభవం వచ్చాక 1954లో విజయావారే కామేశ్వరరావుగారికి మొదటి సారి సొంతంగా దర్శకత్వం చేసే అవకాశం ఇచ్చారు. అదే 'చంద్రహారం'.

అప్పటివరకూ ఎదురులేని విజయాలతో సాగిపోతున్న విజయాసంస్థ 'చంద్రహారం' సినిమాకి భారీ ఎత్తున పబ్లిసిటీ ఇచ్చింది. ఆ రోజుల్లోనే సినీ వర్గమంతా ఆశ్చర్యపోయేలా భారీ బడ్జెట్‌తో 'చంద్రహారం' సినిమాని రూపొందించారు. అప్పటి వరకూ తమ విజయవంతమైన చిత్రాల వెనుక కామేశ్వరరావుగారి కృషి ఎంత వుందో వారికి తెలుసు. అందుకే ఆయన మీద నమ్మకంతో భారీ చిత్రంగా 'చంద్రహారం' నిర్మించారు. ఐతే మొదటి సారిగా విజయాసంస్థ అంచనాలు తల్లకిందులైనాయి. 'చంద్రహారం' పరాజయం పాలైంది. దర్శకుడిగా, టెక్నిక్ పరంగా కామేశ్వరరావుగారికి మంచిపేరే వచ్చింది. ఆ తర్వాత విశ్లేషణ చేసుకుంటూ కామేశ్వరరావుగారే అన్నారట – హీరోయిన్‌గా , ప్రతిభ వున్న నటిగా మంచిపేరు తెచ్చుకుంటున్న సావిత్రిగారిని దుష్టనాయిక పాత్రలో చూపించడం కూడా ప్రేక్షకులకి నచ్చలేదని. ఐతే 'చంద్రహారం' సినిమాలోని కొన్ని సీనులు విదేశీ టెలివిజన్స్‌లో కూడా ప్రసారమయ్యాయట.

తొలిచిత్ర పరాజయం కామేశ్వరరావు గారిని మరో రెండు సినిమాల వరకూ వెంటాడింది. అయన తమిళంలో దర్శకత్వం వహించిన 'గుణసుందరి కథ', విజయావారికి కాకుండా వేరే బేనర్‌లో తీసిన 'పెంకి పెళ్ళాం' కూడా ఘోరపరాజయం పాలయ్యాయి. ఐతే ఎన్టీఆర్‌గారికి మాత్రం కామేశ్వరరావుగారి ప్రతిభమీద అచంచల విశ్వాసముండేది. ఆ నమ్మకమే ఎన్టీఆర్ సొంత సినిమా 'పాండురంగ మహత్యం'కి దర్శకుడిగా కామేశ్వరరావుగారికి అవకాశం వచ్చేలా చేసింది. ఆ సినిమా ఘన విజయం తర్వాత కొన్ని దశాబ్దాలపాటు కమలాకర కామేశ్వరరావు గారు వెనక్కి తిరిగిచూసుకోవాల్సిన అవసరం రాలేదు. !

గత ఐదు సంవత్సరాలుగా నిరాటంకంగా (మధ్యలో ఒక్క నెలతప్ప) సాగిన ఈ శీర్షిక ఈ నెలతో ఆగిపోతోంది. ఈ 60 నెలల సుదీర్ఘ ప్రయాణంలో ఎంతో మందిని ఇంటర్వ్యూ చేయడం, ఎన్నో జీవితాల్లోకి తొంగి చూడడం, ఎన్నో పరిచయాలు, ఎన్నో స్నేహాలు, ఎంతో మంది ఆత్మీయులు..అందరికీ 'కౌముది' హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటోంది. 'కౌముది' మొదలుపెడదామనుకున్నప్పుడు ఈ శీర్షిక ప్రారంభించమని సూచించిన మిత్రుడు శ్రీ ఆట్లూరి. అప్పటికి మోహన్ గాంధీగారు, సిరివెన్నెలగారు తప్ప ఎక్కువ సినీరంగ పరిచయాలు లేవు. ఎన్ని నెలలు కొనసాగించగలమా అని సందేహంగా ఉండేది. మోహన్ గాంధీగారు, సిరివెన్నెలగారు, గొల్లపూడి మారుతి రావుగారు, సీనియర్ దర్శకుడు సాగర్‌గారు, మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు, బలభద్రపాత్రుని రమణి గారు, జీడిగుంట విజయసారధిగారు, పబ్లిసిటీ ఆర్టిస్ట్ ఈశ్వర్‌గారు, మాటల రచయిత నివాస్‌గారు, సత్తిబాబుగారు.. ఇంకా ఎందరెందరో ఈ శీర్షిక ఇంతకాలం విజవంతంగా కొనసాగడానికి సహాయం చేశారు. మరోసారి వీరందరికీ, ఇంకా పేరు పేరునా పేర్కొనలేక పోయిన 'కౌముది' ఆత్మీయులందరికీ గుండె నిండుగా అభివందనాలు అందిస్తున్నాం.

(డిసెంబర్ 2011 సంచికలో ప్రచురితం)